# రాజనీతి శాస్త్రం : సిద్ధాంతాలు భావనలు

**బి.ఏ., రాజనీతి శాస్త్రం, మొదటి సంవత్సరం, పేపరు 1**

**బి.ఏ. ప్రభుత్వ పాలనా శాస్త్రం, మూడవ సంవత్సరం, పేపరు- IV Opt. (A)**


**రచయితలు :**

**కె.యస్. లక్ష్మణరావు** ఎం.ఏ.,
ఉపన్యాసకులు, రాజనీతి శాస్త్ర శాఖ
హిందూ కళాశాల, గుంటూరు

**వి. దామోదరనాయుడు,**
ఉపన్యాసకులు, రాజనీతి శాస్త్ర శాఖ
జె.కె.సి. కళాశాల, గుంటూరు

**డా॥ కె.యస్. కొండలరావు,** ఎం.ఏ.,
ఉపన్యాసకులు, రాజనీతి శాస్త్ర విభాగం
ఎస్.ఆర్.ఆర్., సి.వి.ఆర్. కళాశాల,
విజయవాడ

**సి. విజయ రాఘవాచారి,** ఎం.ఏ.,
ఎం.ఏ., (ప్రభుత్వపాలనా శాస్త్రం) డి.వి.యస్.బి.ఇ.డి.
ఉపన్యాసకులు, రాజనీతి శాస్త్ర విభాగం
ఏ.పి. రెసిడెన్షియల్ కళాశాల, విజయవాడ

*సంపాదకులు*
**ఆచార్య ఎమ్.వి.ఎస్. కోటేశ్వరరావు**
రాజనీతి మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

*సమన్వయకర్త :*
**డా॥ యం. రవిశేఖర్,** ఎం.ఏ., పిహెచ్.డి.
రాజనీతి మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

*డైరెక్టర్*
డా॥ నాగరాజు బట్టు
MBA, MHRM, LLM, M.Sc. (Psy), M.A.(Soc), M.Ed., M.Phil, Ph.D.
Head, Department of HRM



## దూరవిద్యా కేంద్రం

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం**

**నాగార్జున నగర్ - 522 510**

Ph : 0863 - 2293299, 2293356 (08645) 211023, 211024 (Study Material)
Cell : 98482 85518
e-mail : info@anucde.ac.in
Website : www.anucde.ac.in (or) www.anucde.info

**B.A. Political Science, Paper-1, Paper -IVA**

| | | |
|---|---|---|
| First Edition | : | 2003 |
| Second Edition | : | 2005 |
| Third Edition | : | 2006 |
| Fourth Edition | : | 2006 |
| Fifth Edition | : | 2007 |
| Sixth Edition | : | 2014 |
| Seventh Edition | : | 2021 |
| No. of Copies | : | 3933 |

(C) **Acharya Nagarjuna University**

This book is exclusively prepared for the use of students for B.A. Centre for Distance Education, Acharya Nagarjuna University and this book is meant for limited circulation only.

Published by :
**Dr. Naga Raju Battu**
Director
Centre For Distance Education
Acharya Nagarjuna University

*Printed at :*
**Don Bosco Technical School Press**
Ring Road, Guntur-7, Ph : 2350832

# ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ 2016 నాటికి NAAC చే A గ్రేడును సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయటానికి సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, ప్రకాశం జిల్లాలోని 447 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిగ్రీ, పి.జి. స్థాయి విద్యాబోధనను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అందిస్తోంది.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉన్నత విద్యను అందరికి అందించాలన్న లక్ష్యంతో 2003-04లో దూర విద్యా కేంద్రాన్ని స్థాపించింది. పూర్తి స్థాయిలో కళాశాలకు వెళ్ళి విద్యనభ్యసించలేనివారికి, వ్యయ భరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరికవున్న గృహిణులకు ఈ దూర కేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటికే డిగ్రీ స్థాయిలో బి.ఏ., బి.కాం., బి.ఎస్.సి., పి.జి. స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్.సి., ఎం.బి.ఏ., ఎల్.ఎల్.యమ్ కోర్సులను ప్రారంభించిన విశ్వవిద్యాలయం ఈ సంవత్సరం కొత్తగా 'జీవన నైపుణ్యాలు' అనే సర్టిఫికేట్ కోర్సును కూడా ప్రారంభించింది.

ఈ దూర విద్యా విధానం ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు, సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసుకొనేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి రచనా వ్యాసంగంలో అనుభవంగల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించడం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో, నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలను గ్రహించి మున్ముందు మరింత నిర్దిష్టంగా, అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, సంశయాల నివృత్తి కోసం వారాంతపు తరగతులు, కాంటాక్టు క్లాసులు ఏర్పాటు చేయటం జరిగింది.

దూర విద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేస్తున్న విద్యార్థులు, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమేగాక, చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని, తద్వారా దేశ పురోగతికి దోహదపడాలని కోరుకుంటున్నాను. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దిన దినాభివృద్ధి చెంది ప్రజలందరికి అందుబాటులో ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ ఆశయసాధనకు సహకరిస్తున్న, సహకరించిన దూర విద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు, ఎకడమిక్ కోఆర్డినేటర్లకు, ఎకడమిక్ కౌన్సిలర్లకు మరియు అధ్యాపకేతర సిబ్బందికి నా అభినందనలు.

ప్రొఫెసర్ పి. రాజశేఖర్, *M.A., M.Phil., Ph.D.*
కులపతి (FAC)
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

# B.A. Political Science, 3rd Year

# PAPER - IV (A) CONCEPTS : THEORIES AND INSTITUTIONS

## Syllabus

1. Introduction, definition, scope and importance of Political Science
2. Different approaches to the study of Political Science - Traditional and Modern.
3. Relation with other Social Sciences : History, Economics, Public Administration, Sociology and Ethics
4. Society, State and Nation
5. The theories of origin of the State : Divine Right, Social contract and evolutionary (Historical)
   (a) Theories of the functions of the State.
6. Sovereignty : Monism and Pluralism.
7. Law, Liberty and Equality
   a) Law, Sources of Law - Concept of Rule of Law
   b) Liberty and Equality - Their relationship
   c) Theories of Rights
   d) Kinds of Rights
   e) Concept of Freedom : Individualic, Authoritarian and Socialist views.
8. Classification of Government
   Traditional (Aristotlen)
   Modern : a) Democracy : Direct and Indirect, Direct Democratic devices.
   b) Unitary and Federal
   c) Parliamentary and Presidential
9. The Theory of separation of Power
10. Organs of Government :
    A) Legislature : a) Types - Unicameral, Bicameral
    b) Committee System
    c) Functions of Legislature
    d) Decline of legislature
    e) Role of Opposition
    B) Executive : a) Types - Parliamentary and Presidential
    b) Rise of executive in modern times.
    C) Judiciary : a) Functions
    b) Independence of Judiciary
    c) Judicial Review
11) Electorate : Methods of Representation, voting behaviours
12) Political Parties - a) Functions - Types of Party System b) Role
13) Popular control - Methods of control - public opinion - Role of Mass media.

14) Forms of Government Monarchial, Aristocratic and Democratic
15) The Concept of Justice - Legal, Political, Economics and Social Justice.
16) Constitution - Types, Amending procedures.

**Books Recommended :**

| | | | |
|---|---|---|---|
| 1. | Introduction to political science | : | Garmer, J.M. |
| 2. | A grammar of politics | : | Laski, H.J. |
| 3. | The Modern State | : | Mac Iver, R.M. |
| 4. | Political Theory | : | Aseervadam, E. |
| 5. | Substance of Politics | : | Appa Dorai |
| 6. | Political Theory | : | Anual Roy, Mohit & Bhattachari |
| 7 | Rajniti Sastram | : | Acharya K.R. |
| 8. | Modern government | : | Sharma, Sitaram |
| 9. | Select Constitutions | : | Mahajan V.D. |
| 10. | Foreign Governments | : | Ogg & Zink |
| | The Government of Wiss Republic | : | Ghosh, R.C. |

గమనిక : బి.ఏ. రాజనీతి శాస్త్ర మొదటి సంవత్సరపు విద్యార్థులు 1 నుండి 25 పాఠములు అభ్యసించవలెను.
బి.ఏ. రాజనీతి శాస్త్రం మూడవ సంవత్సరపు విద్యార్థులు 1 నుండి 25 పాఠములు మరియు పుస్తకము చివరన పార్టు 2 ప్రచురించిన 5ఎ, 7సి, 10 ఎఇ, 12బి, 16 పాఠములు కూడా అభ్యసించవలెను.

## B.A. Degree Examination, Political Science

## Paper - IV (A) CONCEPTS : THEORIES AND INSTITUTIONS

Time : Three hours | Maximum : 100 marks

### SECTION - A (2 x 15 = 30 marks)

**Answer any TWO of the following.**

1. Discuss Rousseau's General Will theory.
   రూసో జనేచ్ఛ సిద్ధాంతాన్ని గూర్చి చర్చింపుము.
2. Explain the relations between Political Science and Economics.
   రాజనీతి శాస్త్రానికి, ఆర్థిక శాస్త్రానికి గల సంబంధాన్ని వివరించుము.
3. Examine the nature and scope of Political Science.
   రాజనీతి శాస్త్ర స్వభావము మరియు పరిధిని పరిశీలింపుము.
4. Discuss the merits and demerits of multi party system.
   బహుపార్టీ విధానంలోని లాభనష్టాలను చర్చింపుము.
5. Explain the relations between liberty and equality.
   స్వేచ్ఛ సమానత్వాల మధ్యగల సంబంధాన్ని వివరించుము.

### SECTION B - (3 x 10 = 30 marks)

Answer any THREE of the following.

6. Bring out the Austin theory of sovereignty.
   ఆస్టిన్ సార్వభౌమాధికార సిద్ధాంతాన్ని గూర్చి పేర్కొనుము.
7. Discuss the relations between the legislature and the executive.
   శాసన సభ కార్యనిర్వాహక శాఖల సంబంధాన్ని చర్చింపుము.
8. Explain the concept of Divine theory.
   దైవదత్తాధికార సిద్ధాంతాన్ని గూర్చి వివరింపుము.
9. Examine the characteristics of modern state.
   ఆధునిక రాజ్య లక్షణాలను గూర్చి పరిశీలింపుము.
10. Describe the functions of political parties.
    రాజకీయ పక్షాల విధులను వర్ణింపుము.
11. Bring out the main features of parliamentary form of government.
    పార్లమెంటరీ విధాన ప్రభుత్వ ప్రధాన లక్షణాలను పేర్కొనుము.
12. Discuss the role of mass media.
    ప్రసార సాధనాల పాత్రను చర్చింపుము.

### SECTION - C (3 x 5 = 15 marks)

Answer any THREE of the following.

13. (a) Presidential form of government
    అధ్యక్ష తరహా ప్రభుత్వము

    (b) Decline of legislature
    శాసనసభ క్షీణత

(c) The theory of separation of power.
అధికార విభజన సిద్ధాంతం

(e) Individualism.
వ్యక్తి శ్రేయోవాదం.

(d) Direct democracy
ప్రత్యక్ష ప్రజాస్వామ్యం

(f) Secular state.
లౌకిక రాజ్యము.

(g) Law and Morality
చట్టము మరియు నీతి.

## SECTION - D (25 marks)

14. (a) Answer the following in 1 or 2 sentences :

(i) Public Opinion
ప్రజాభిప్రాయం

(ii) Adult franchise
వయోజన ఓటు హక్కు

(iii) Unicameralism
ఏకసభా విధానము

(iv) Recall.
పునరాయనం

(v) Natural rights.
సహజ హక్కులు

(vi) Nationality
జాతీయత

(vii) Monarchy
రాజరికం.

(viii) State-Government.
రాజ్యము - ప్రభుత్వం.

(ix) Rights
హక్కులు.

(x) Rigid constitution
దృఢ రాజ్యాంగం.

(b) Answer the following in a word or two:

(i) Who is the father of political science?
రాజనీతి శాస్త్ర విశారదుడెవరు?

(ii) Who founded the concept of will of all?
సర్వజనాభీష్టమనే భావనను ఎవరు కనుగొన్నారు?

(iii) Who is the author of the book leviathan?
లెవియథాన్ అనే గ్రంథాన్ని ఎవరు రచించారు?

(iv) In which country multi party system is in operation?
బహుపార్టీ పద్ధతి ఏ దేశంలో అమలులో ఉంది?

(v) Who is the author of the book "The Spirit of Laws"?
"ద స్పిరిట్ ఆఫ్ లాస్" రచయిత ఎవరు?

(DAPUB 32)

**B.A. DEGREE EXAMINATION, MAY 2011.**

**(Examination at the end of Final Year)**

**Part II — Public Administration**

**Paper IV — POLITICAL SCIENCE : CONCEPTS, THEORIES AND INSTITUTIONS**

**Time : Three hours** **Maximum : 100 marks**

**SECTION A — (2 × 15 = 30 marks)**

**Answer any TWO of the following.**

1. **Examine the Traditional approach to the study of political science.**

   రాజనీతి శాస్త్ర అధ్యయమునకు సాంప్రదాయ విధానమును పరిశీలింపుము.

2. **Discuss Hobbes views on secularism.**

   లౌకిక వాదముపై హాబ్స్ భావములను చర్చింపుము.

3. **Examine the relationship between politics and Public Administration.**

   రాజనీతి శాస్త్రమునకు, ప్రజా పరిపాలనకు మధ్యగల సంబంధమును పరిశీలింపుము.

4. **Explain Rule of Law.**

   రూల్ ఆఫ్ లాని వివరింపుము.

5. **Write about the theories of the origin of state.**

   రాజ్యావతరణ సిద్ధాంతములను గురించి వ్రాయుము.

**SECTION B — (3 × 10 = 30 marks)**

**Answer any THREE of the following.**

6. **What are the rights of the individual?**

   వ్యక్తి యొక్క హక్కులు ఏమి?

7. **Examine the concept of justice.**

   న్యాయ భావనను గురించి వ్రాయుము.

8. **Define political parties. Examine their role.**

   రాజకీయ పార్టీని నిర్వచింపుము. వాటి పాత్రను పరిశీలింపుము.

9. **Write about the presidential form of government.**

   అధ్యక్షతరహా ప్రభుత్వ విధానము గురించి వ్రాయుము.

10. **Examine the amending procedure of the Indian constitution.**

    భారత రాజ్యాంగ సవరణ విధానమును పరిశీలింపుము.

11. Explain the relationship between Liberty commodity.

స్వేచ్ఛా, సమానత్వముల మధ్యగల సంబంధమును వివరింపుము.

12. Discuss the role of opposition party.

ప్రతిపక్ష పార్టీ పాత్రను చర్చింపుము.

SECTION C — (3 × 5 = 15 marks)

Answer any THREE of the following.

13. (a) Sources of Law.

చట్టము ఆధారములు.

(b) Pluralism.

ప్లూరలిజమ్. (బహుళతావాదము).

(c) Social Justice.

సామాజిక న్యాయం.

(d) Public opinion.

ప్రజాభిప్రాయం.

(e) Federal form of government.

ఫెడరల్ ప్రభుత్వం.

(f) Representation.

ప్రాతినిధ్యం.

(g) Human nature.

మానవ స్వభావం.

SECTION D — (25 marks)

14. (a) Answer the following in 1 or 2 sentences. (10 × 2 = 20)

(i) Plebicite.

ప్లెబిసైట్.

(ii) One party rule.

ఏక పార్టీ పాలన.

(iii) Preamble.

పీఠిక.

(iv) Gandhian principles.

గాంధీ సూత్రములు.

(v) Liberty.

స్వేచ్ఛ.

(vi) Parliament.

పార్లమెంటు.

(vii) Slavery.

బానిసత్వం.

(viii) Committee system.

కమిటీ సిస్టమ్.

(ix) Utilitarianism.

ఉపయోగితావాదం.

(x) Judicial revision.

న్యాయ సమీక్ష.

(5 × 1 = 5)

(b) Answer the following in 1 or 2 words :

(i) Unwritten constitution.

అలిఖిత రాజ్యాంగము.

(ii) Governor.

గవర్నర్.

(iii) Anarchy.

అనార్కీ.

(iv) The prince.

ది ప్రిన్స్.

(v) Montesque.

మాంటెస్క్యూ.

**(DPOL 1)**

B.A. DEGREE EXAMINATION, MAY 2011.

(Examination at the end of First Year)

Part II — Political Science

Paper I — CONCEPTS, THEORIES AND INSTITUTIONS

Time : Three hours

Maximum : 100 marks

SECTION A — (2 × 15 = 30 marks)

Answer any TWO of the following.

1. Define 'Political Science' and discuss the importance of its study.

   'రాజనీతి శాస్త్రాన్ని నిర్వచించి దాని అధ్యయన ప్రాముఖ్యతను చర్చింపుము.

2. Define 'Sovereignty' and critically examine Austin's theory of Sovereignty.

   'సార్వభౌమాధికారాన్ని నిర్వచించి, ఆస్టిన్ సార్వభౌమత్వ సిద్ధాంతాన్ని విమర్శనాత్మకంగా పరిశీలింపుము.

3. Explain the features, merits and demerits of parliamentary type of Government.

   పార్లమెంటరీ ప్రభుత్వ విధాన లక్షణాలు మరియు గుణదోషాలను వివరింపుము.

4. Explain the factors responsible for the growing importance of Executive in Modern State.

   ఆధునిక రాజ్యంలో కార్య నిర్వాహక వర్గం యొక్క ప్రాముఖ్యత పెరుగుటకు దోహదపడిన కారకాలను వివరింపుము.

5. Explain the concept of liberty. What are the methods for safeguarding individual liberty?

   'స్వేచ్ఛ' భావనను వివరింపుము. వ్యక్తి స్వేచ్ఛను కాపాడే వివిధ పద్ధతులను తెలుపుము.

SECTION B — (3 × 10 = 30 marks)

Answer any THREE of the following.

6. Explain the relationship of political science with Ethics.

   నీతి శాస్త్రంతో రాజనీతి శాస్త్రానికి గల సంబంధాన్ని తెల్పుము.

7. Explain the sources of law.

   శాసన మూలాధారాలను వివరింపుము.

8. Explain the features of Federal State.

   సమాఖ్య రాజ్యం లక్షణాలను తెల్పుము.

9. What are the merits and demerits of Bicameralism?

ద్విశాసన సభా విధానంలోని గుణ దోషాలు తెల్పుము.

10. Discuss the functions of political parties.

రాజకీయ పార్టీల విధులను చర్చింపుము.

11. Explain Hobbe's Social contract theory.

హాబ్స్ సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని వివరిపుము.

12. Examine the meaning and importance of judicial Review in a Modern State.

ఆధునిక రాజ్యంలో న్యాయ సమీక్ష యొక్క అర్థాన్ని మరియు ప్రాధాన్యతను పరిశీలింపుము.

SECTION C — (3 × 5 = 15 marks)

Answer any THREE of the following.

13. (a) Pluralism.

బహుళతావాదము.

(b) Rule of Law.

సమన్యాయపాలన.

(c) Modern approach.

ఆధునిక దృక్పధము.

(d) Montesquieu.

మాంటెస్క్యూ.

(e) Evolutionary theory of the origin of state.

పరిణామాత్మక రాజ్యావతరణ సిద్ధాంతము.

(f) Direct Democracy.

ప్రత్యక్ష ప్రజాస్వామ్యము

(g) Independent Judiciary.

స్వతంత్ర న్యాయశాఖ.

SECTION D — (25 marks)

14. (a) Answer the following in 1 or 2 Sentence. (10 × 2 = 20)

(i) Nation – Nationality

జాతి - జాతీయత

(ii) Political sovereignty

రాజకీయ సార్వభౌమాధికారము

(iii) Unitary State

ఏకకేంద్ర రాజ్యము

(iv) Legal Rights

చట్టబద్ధమైన హక్కులు

(v) Oligarchy

అల్పజన పాలన

(vi) Universal Suffrage

సార్వజనీన ఓటు హక్కు

(vii) National liberty

జాతీయ స్వేచ్ఛ

(viii) Initiative

అభిప్రాయ నివేదన

(ix) Mandamus writ

మాండమస్ రిట్

(x) Pressure groups

ప్రభావ వర్గాలు

(b) Answer the following in 1 or 2 words. (5 × 1 = 5)

(i) According to whom liberty is the product of Rights?

'హక్కుల ఉత్పత్తియే స్వేచ్ఛ' అని ఎవరు భావించారు.

(ii) Which country is called as the mother of all parliamentary Governments?

ఏ దేశమును 'పార్లమెంటరీ ప్రభుత్వానికి మాతృక' అని పిలుస్తారు?

(iii) Thomas Hobbes supported which type of government.

ఏటువంటి ప్రభుత్వాన్ని థామస్ హాబ్స్ సమర్ధించారు.

(iv) Which is the most important characteristic of state?

రాజమునకు అతి ముఖ్యమైన లక్షణము ఏది?

(v) Which theory is accepted as a correct theory of the origin of state?

ఏ సిద్ధాంతమును రాజ్యావతరణకు సరైన సిద్ధాంతంగా అంగీకరించబడినది.

**(DAPUB 32)**

B.A. DEGREE EXAMINATION, DECEMBER 2011.

(Examination at the end of Final Year)

Part II — Public Administration

Paper IV — POLITICAL SCIENCE: CONCEPTS, THEORIES AND INSTITUTIONS

Time : Three hours

Maximum : 100 marks

SECTION A — (2 × 15 = 30 marks)

Answer any TWO of the following.

1. Discuss the relationship between political science and history.
రాజనీతి శాస్త్రమునకు మరియు చరిత్రకు గల సంబంధమును చర్చింపుము.

2. Examine the political philosophy of Hobbes.
హాబ్స్ యొక్క రాజనీతి తత్వమును పరిశీలింపుము.

3. Explain the modern approaches to the study of political science.
రాజనీతి శాస్త్ర అధ్యయనమునకు ఆధునిక పద్ధతులను వివరింపుము.

4. Discuss the functions of Modern state.
ఆధునిక రాజ్య విధులను చర్చింపుము.

5. Examine the merits and demerits of democracy.
ప్రజాస్వామ్యపు మంచి, చెడులను పరిశీలింపుము.

SECTION B — (3 × 10 = 30 marks)

Answer any THREE of the following.

6. Explain the types of constitution.
రాజ్యాంగము యొక్క రకములు వివరింపుము.

7. What are the functions of Judiciary?
న్యాయ వ్యవస్థ యొక్క విధులు ఏమి?

8. Examine the theory of separation of powers.
అధికారముల వేర్పాటు సిద్ధాంతమును పరిశీలింపుము.

9. Write about the importance of regional parties.
ప్రాంతీయ పార్టీల ప్రాముఖ్యతను గూర్చి వ్రాయుము.

10. Explain the concept of liberty.
స్వేచ్ఛా భావమును వివరింపుము.

11. What is economic justice?
ఆర్థిక న్యాయమనగానేమి?

SECTION C — (3 × 5 = 15 marks)

Answer any THREE of the following.

12. (a) Unitary government.

సమాఖ్య ప్రభుత్వం.

(b) Fundamental duties

ప్రాథమిక విధులు.

(c) Secular state.

లౌకిక రాజ్యం.

(d) Devine Right.

దైవిక హక్కు.

(e) State and Nation.

రాజ్యము - జాతి.

(f) No confidence Motion

అవిశ్వాస తీర్మానము.

(g) Constituent Assembly.

రాజ్యాంగ సభ.

SECTION D — (25 marks)

13. (a) Answer the following in 1 or 2 sentences. (10 × 2 = 20)

(i) Individual Freedom.

వ్యక్తి స్వేచ్ఛ.

(ii) Negative vote

వ్యతిరేక ఓటు.

(iii) Right to property.

ఆస్థి హక్కు.

(iv) Freedom of speech.

వాక్ స్వాతంత్ర్యము.

(v) Right of Education

విద్యా హక్కు.

(vi) Indirect Democracy.

పరోక్ష ప్రజాస్వామ్యం.

(vii) Parliament.

పార్లమెంటు.

SECTION D — (25 marks)

14. (a) Answer the following in 1 or 2 sentences : (10 × 2 = 20)

(i) Aristocracy.

శిష్టపాలన.

(ii) Statesman.

స్టేట్స్‌మాన్.

(iii) Republic.

రిపబ్లిక్.

(iv) Deductive method.

నిగమ పద్ధతి.

(v) Sovereignty.

సార్వభౌమత్వం.

(vi) Financial Emergency.

ఆర్థిక అత్యవసర పరిస్థితి.

(vii) Rajya Sabha.

రాజ్యసభ.

(viii) Double Citizenship.

ద్వంద పౌరసత్వం.

(ix) Father of the constitution.

రాజ్యాంగ పిత.

(x) Sushmaswaraj.

సుష్మస్వరాజ్.

(b) Answer the following in 1 or 2 words : (5 × 1 = 5)

(i) Rajadharma

రాజధర్మం.

(ii) How many parts are there in Levicthan?

లివియథాన్‌లో ఎన్ని భాగములున్నవి?

(iii) Common Wealth.

కామన్ వెల్త్.

(iv) Name of Rousseau's father.

రూసో తండ్రి పేరు.

(v) The communist manifesto.

ది కమ్యూనిస్టు మానిఫెస్టో.

---

B.A. DEGREE EXAMINATION, DECEMBER 2004.

(Examination at the end of First Year)

**Part II - Political Science**

**Paper I - CONCEPTS, THEORIES AND INSTITUTIONS**

Time : Three hours | Maximum : 100 marks

**SECTION** A - (2 x 15 = 30 marks)

Answer any Two of the following.

1. Examine the nature and scope of Political Science.
   రాజనీతిశాస్త్రం యొక్క స్వభావాన్ని పరిధిని పరిశీలింపుము.
2. Explain the relations between Political Science and History.
   రాజనీతిశాస్త్రం, చరిత్రకి గల సంబంధాలను వివరింపుము.
3. Write an essay on the theory of separation of powers.
   అధికార వృద్ధికరణ సిద్ధాంతంపై ఒక వ్యాసము వ్రాయుము.
4. Discuss the theories of the origin of the State.
   రాజ్యం ఆవిర్భావం గురించిన సిద్ధాంతాలను చర్చింపుము.
5. Explain the concept of Rule of Law.
   సమన్యాయపాలనా భావాన్ని వివరింపుము.

**SECTION** B - (3 x 10 = 30 marks)

Answer any THREE of the following.

6. Bring out the main features of Presidential form of Government.
   అధ్యక్షత తరహా ప్రభుత్వ విధాన ప్రధాన లక్షణాలను పేర్కొనుము.
7. Discuss the relations between Legislature and Executive.
   శాసన సభ, కార్యనిర్వహక శాఖ సంబంధాలను చర్చింపుము.
8. Write the salient features of unitary form of Government.
   ఏకకేంద్ర ప్రభుత్వ విధాన ప్రధాన లక్షణాలను వ్రాయుము.
9. Describe the functions of Political Parties.
   రాజకీయ పక్షాల విధులను వర్ణింపుము.
10. Discuss the merits and demerits of multi party system.
    బహుళ పక్ష పార్టీ పద్ధతి లాభనష్టాలను చర్చింపుము.
11. What are the functions of judiciary in modern State?
    ఆధునిక రాజ్యంలో న్యాయ వ్యవస్థ పాత్ర ఏమిటి?
12. Discuss the role of mass-media.
    ప్రసార సాధనాల పాత్రను చర్చింపుము.

## SECTION C - (3 x 5 = 15 marks)

Answer any THREE of the following.

13. (a) Committee System.

కమిటీ పద్ధతి.

(b) Presidential form of Government.

అధ్యక్షత తరహా ప్రభుత్వం.

(c) Rise of Executive.

కార్యనిర్వాహక శాఖ పెరుగుదల.

(e) Decline of Legislature.

శాసన సభ క్షీణత.

(d) Individualism.

వ్యక్తి ప్రయోగవాదం.

(f) Kinds of Rights.

హక్కుల రకాలు.

(g) Independence of judiciary.

స్వేచ్ఛాయుత న్యాయ వ్యవస్థ.

## SECTION D -(25 marks)

14. (a) Answer the following in 1 or 2 sentences :

(i) Direct Democracy.

ప్రత్యక్ష ప్రజాస్వామ్యం.

(ii) Sovereignty.

సార్వభౌమాధికారం.

(iii) Monarchy.

నిరంకుశపాలన.

(iv) Society and individual.

సమాజం-వ్యక్తి.

(v) Referendum.

రిఫరెండమ్.

(vi) Secular State.

లౌకిక రాజ్యం

(vii) Multiparty System.

బహుళపక్ష పార్టీ విధానం.

(viii) Parliamentary Government.

పార్లమెంటరీ ప్రభుత్వం.

(ix) Public Opinion.

ప్రజాభిప్రాయం.

(x) Delegated Legislation.

డెలిగేటెడ్ లెజిస్లేషన్.

(b) Answer the following in a word or two:

(i) Who is the author of the book Leviathan?

లివియథాన్ అనే గ్రంథాన్ని ఎవరు రచించారు?

(ii) Who founded the theory of separation of powers?

అధికార వృద్ధికరణ సిద్ధాంతాన్ని ఎవరు కనుగొన్నారు?

(iii) In which country single party system is in operation?

ఏకపక్ష పార్టీ పద్ధతి ఏ దేశంలో అమలులో ఉన్నది?

(iv) In which country political parties started first?

రాజకీయ పార్టీలు ఏ దేశంలో మొట్టమొదట ప్రారంభించబడినవి?

(v) Which year Thomas Hobbes was born?

థామస్ హాబ్స్ ఏ సంవత్సరంలో జన్మించెను?

---

B.A. Degree Examination, July - 2005

(Examination at the end of First Year)

**Part - II : Political Science**

## Paper - I : CONCEPTS, THEORIES AND INSTITUTIONS

Time : Three hours

Maximum : 100 marks

**SECTION - A** (2 x 15 = 30 marks)

**Answer any TWO of the following.**

1. Discuss Rousseau's General Will theory.

   రూసో జనేచ్ఛ సిద్ధాంతాన్ని గూర్చి చర్చింపుము.

2. Explain the relations between Political Science and Economics.

   రాజనీతి శాస్త్రానికి, ఆర్థిక శాస్త్రానికి గల సంబంధాన్ని వివరించుము.

3. Examine the nature and scope of Political Science.

   రాజనీతి శాస్త్ర స్వభావము మరియు పరిధిని పరిశీలింపుము.

4. Discuss the merits and demerits of multi party system.

   బహుపార్టీ విధానంలోని లాభనష్టాలను చర్చింపుము.

5. Explain the relations between liberty and equality.

   స్వేచ్ఛ సమానత్వాల మధ్యగల సంబంధాన్ని వివరించుము.

## SECTION B - (3 x 10 = 30 marks)

Answer any THREE of the following.

6. Bring out the Austin theory of sovereignty.

   ఆస్టిన్ సార్వభౌమాధికార సిద్ధాంతాన్ని గూర్చి పేర్కొనుము.

7. Discuss the relations between the legislature and the executive.

   శాసన సభ కార్యనిర్వాహక శాఖల సంబంధాన్ని చర్చింపుము.

8. Explain the concept of Divine theory.

   దైవదత్తాధికార సిద్ధాంతాన్ని గూర్చి వివరింపుము.

9. Examine the characteristics of modern state.

   ఆధునిక రాజ్య లక్షణాలను గూర్చి పరిశీలింపుము.

10. Describe the functions of political parties.

    రాజకీయ పక్షాల విధులను వర్ణింపుము.

11. Bring out the main features of parliamentary form of government.

    పార్లమెంటరీ విధాన ప్రభుత్వ ప్రధాన లక్షణాలను పేర్కొనుము.

12. Discuss the role of mass media.

    ప్రసార సాధనాల పాత్రను చర్చింపుము.

## SECTION - C (3 x 5 = 15 marks)

***Answer any THREE of the following.***

13. (a) Presidential form of government

    అధ్యక్ష తరహా ప్రభుత్వము

    (b) Decline of legislature

    శాసనసభ క్షీణత

    (c) The theory of separation of power.

    అధికార విభజన సిద్ధాంతం

    (e) Individualism.

    వ్యక్తి శ్రేయోవాదం.

    (d) Direct democracy

    ప్రత్యక్ష ప్రజాస్వామ్యం

    (f) Secular state.

    లౌకిక రాజ్యము.

    (g) Law and Morality

    చట్టము మరియు నీతి.

SECTION - D (25 marks)

14. (a) Answer the following in 1 or 2 sentences :

(i) Public Opinion

ప్రజాభిప్రాయం

(ii) Adult franchise

వయోజన ఓటు హక్కు

(iii) Unicameralism

ఏకసభా విధానము

(iv) Recall.

పునరాయనం

(v) Natural rights.

సహజ హక్కులు

(vi) Nationality

జాతీయత

(vii) Monarchy

రాజరికం.

(viii) State-Government.

రాజ్యము - ప్రభుత్వం.

(ix) Rights

హక్కులు.

(x) Rigid constitution

దృఢ రాజ్యాంగం.

(b) Answer the following in a word or two:

(i) Who is the father of political science?

రాజనీతి శాస్త్ర విశారదుడెవరు?

(ii) Who founded the concept of will of all?

సర్వజనాభీష్టమనే భావనను ఎవరు కనుగొన్నారు?

(iii) Who is the author of the book leviathan?

లెవియథాన్ అనే గ్రంథాన్ని ఎవరు రచించారు?

(iv) In which country multi party system is in operation?

బహుపార్టీ పద్ధతి ఏ దేశంలో అమలులో ఉంది?

(v) Who is the author of the book "The Spirit of Laws"?

"ద స్పిరిట్ ఆఫ్ లాస్" రచయిత ఎవరు?

B.A. Degree Examination, December - 2005

(Examination at the end of First Year)

## Part - II : Political Science

## Paper - I : CONCEPTS, THEORIES AND INSTITUTIONS

Time : Three hours | Maximum : 100 marks

**SECTION - A (2 x 15 = 30 marks)**

**Answer any TWO of the following.**

1. Explain the relations between Liberty and Equality.
   స్వేచ్ఛ, సమానత్వాల మధ్యగల సంబంధాన్ని వివరించుము.
2. Bring out the Austin theory of Sovereignty.
   ఆస్టిన్ సార్వభౌమాధికార సిద్ధాంతాన్ని గూర్చి పేర్కొనుము.
3. Examine the nature and scope of Political Science.
   రాజనీతి శాస్త్రం యొక్క స్వభావాన్ని, పరిధిని పరిశీలింపుము.
4. Discuss the Social Contract Theory.
   సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని గూర్చి చర్చింపుము.
5. Describe the different approaches to the study of political Sceince.
   రాజనీతి శాస్త్ర అధ్యయన పద్ధతులను గూర్చి వర్ణింపుము.

**SECTION** B - (3 x 10 = 30 marks)

Answer any THREE of the following.

6. Identify the merits and demerits of multiparty system.
   బహు పార్టీ విధానంలోని లాభ నష్టాలను గుర్తించుము.
7. Explain the concept of evolutionary theory.
   పరిణామ సిద్ధాంతాన్ని గూర్చి వివరింపుము.
8. Describe the characteristics of modern state.
   ఆధునిక రాజ్య లక్షణాలను వర్ణింపుము.
9. Define Democracy and examine the devices of direct democracy.
   ప్రజాస్వామ్యమును నిర్వచించి, ప్రత్యక్ష ప్రజాస్వామ్య పద్ధతులను పరిశీలింపుము.
10. Bring out the main features of parliamentary form of government.
    పార్లమెంటరీ విధాన ప్రభుత్వ ప్రధాన లక్షణాలను పేర్కొనుము.
11. Define law and explain its sources.
    శాసనమును నిర్వచించి, దాని మూలాధారములను వివరింపుము.
12. Analyse the role of Judiciary in modern state.
    ఆధునిక రాజ్యంలో న్యాయశాఖ పాత్రను విశ్లేషించుము.

## SECTION - C (3 x 5 = 15 marks)

Answer any THREE of the following.

13. (a) Judician Review

న్యాయ సమీక్ష

(b) Pluralism

బహుళత్వవాదం.

(c) General Will.

జనేచ్ఛ.

(d) Presidential form Government.

అధ్యక్ష తరహా ప్రభుత్వము.

(e) Functions of executive.

కార్యనిర్వాహక శాఖ విధులు.

(f) Decline of legislature.

శాసన సభ క్షీణత.

(g) The theory of separation of powers.

అధికార విభజన సిద్ధాంతం.

## SECTION - D (25 marks)

14. (a) Answer the following in 1 or 2 sentences :

(i) Will of all

సర్వజనాభీష్టము

(ii) State of nature

ప్రాకృతిక వ్యవస్థ.

(iii) Sovereignty

సార్వభౌమాధికారం

(iv) Adult franchise

వయోజన ఓటు హక్కు

(v) Secular state

లౌకిక రాజ్యము

(vi) Mass - media

ప్రసార సాధనాలు

(vii) Written constitution

లిఖిత రాజ్యాంగము

(viii) Recall

పునరాయనం

(ix) Bi-Cameralism
ద్వి సభా విధానం

(x) Public opinion
ప్రజాభిప్రాయము.

**(b)** ***Answer the following in a word or two:***

(i) In which country Bi-party system is in operation? (5 x 1 = 5)
ద్విపార్టీ పద్ధతి ఏ దేశంలో అమలులో ఉంది?

(ii) Who is the author of the Book Two treatises on Civil Government?
Two treatises on Civil Government అనే గ్రంథాన్ని ఎవరు రచించారు?

(iii) Who founded the theory of Separation of Powers?
అధికార విభజన సిద్ధాంతాన్ని ఎవరు కనుగొన్నారు?

(iv) Who is the father of Political Science?
రాజనీతి శాస్త్ర విశారదుడెవరు?

(v) Who defended "Popular Sovereignty"?
ప్రజా సార్వభౌమత్వాన్ని సమర్థించినది ఎవరు?

## B.A. Degree Examination, May 2006

(Examination at the end of First Year)

## Part - II : Political Science

## Paper - I : CONCEPTS, THEORIES AND INSTITUTIONS

Time : Three hours | Maximum : 100 marks

**SECTION - A** (2 x 15 = 30 marks)

**Answer any TWO of the following.**

1. Explain the concept of Evolutionary theory.
   పరిణామ సిద్ధాంతాన్ని గూర్చి వివరింపుము.
2. Describe the different approaches to the study of Political Science.
   రాజనీతి శాస్త్ర అధ్యయన పద్ధతులను గూర్చి వర్ణింపుము.
3. Define democracy and explain the devices of direct democracy.
   ప్రజాస్వామ్యమును నిర్వచించి, ప్రత్యక్ష ప్రజాస్వామ్య పద్ధతులను వివరింపుము.
4. Describe the characteristics of modern state.
   ఆధునిక రాజ్య లక్షణాలను వర్ణింపుము.
5. Define law and explain its sources.
   శాసనమును నిర్వచించి, దాని మూలాధారాలను వివరింపుము.

**SECTION** B - (3 x 10 = 30 marks)

Answer any THREE of the following.

6. Examine the relation between Political Science and Economics.
   రాజనీతి, అర్థశాస్త్రముల మధ్యగల సంబంధాన్ని పరిశీలింపుము.
7. Examine the role of mass-media in democracy.
   ప్రజాస్వామ్యంలో ప్రసార సాధనాల పరిశీలింపుము.
8. Discuss the advantages of Bicameralism.
   ద్వంద శాసన సభా విధానంలోని ప్రయోజనాలను చర్చించుము.
9. What are the differences between unitary and federal system?
   ఏకకేంద్ర, సమాఖ్య విధానంలోని వ్యత్యాసాలేవి?
10. Bring out the main features of Presidential form of government.
    అధ్యక్ష తరహా ప్రభుత్వ ప్రధాన లక్షణాలను పేర్కొనుము.
11. Examine the theory of 'separation of powers'.
    అధికార పృథఃకరణ సిద్ధాంతాన్ని పరిశీలింపుము.
12. Discuss the concept of Hobbes 'Social Contract Theory'.
    హాబ్స్ సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని చర్చించుము.

## SECTION - C (3 x 5 = 15 marks)

Answer any THREE of the following.

13. (a) Natural rights.

సహజ హక్కులు.

(b) Proportional representation.

నైష్పత్తిక ప్రాతినిధ్యం.

(c) Divine theory.

దైవదత్తాధికార సిద్ధాంతం.

(d) Pluralism.

బహుత్వవాదం.

(e) State and society.

రాజ్యము మరియు సంఘము.

(f) General will.

జనేచ్ఛ.

(g) Unicameralism.

ఏక సభా విధానము.

## SECTION - D (25 marks)

14. (a) Answer the following in 1 or 2 sentences :

(i) Adult franchise.

వయోజన ఓటింగ్

(ii) Public opinion.

ప్రజాభిప్రాయం.

(iii) Telugu Desam Party.

తెలుగుదేశం పార్టీ

(iv) Nationality

జాతీయత.

(v) Sovereignty.

సార్వభౌమాధికారం.

(vi) Rigid Constitution.

దృఢ రాజ్యాంగము.

(vii) Aristocracy.

కులీన పాలన.

(viii) Vajpai.

వాజ్‌పాయ్

(ix) Austin.

ఆస్టిన్.

(x) Legal rights.

చట్టబద్ధమైన హక్కులు.

(b) Answer the following in a word or two:

(i) Who introduced the concept of 'limited government'. (5 x 1 = 5)

పరిమిత ప్రభుత్వమనే భావనను ఎవరు ప్రవేశపెట్టారు?

(ii) Who is the author of the book 'Leviathan'?

'Leviathan' అనే గ్రంథాన్ని ఎవరు రచించారు?

(iii) Who is the father of Political Science?

రాజనీతి శాస్త్ర పితామహుడెవరు?

(iv) Who propounded rule of law?

సమన్యాయపాలనను ప్రతిపాదించిన దెవరు?

(v) Who is the author of the book 'Social Contract'?

'Social Contract' అనే గ్రంథాన్ని రచించినదెవరు?

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | రాజనీతి శాస్త్రం - పరిచయం, నిర్వచనం, పరిధి | 1.1 - 1.5 |
| 2. | రాజనీతి శాస్త్రం : పరిణామం, స్వభావం, ప్రాధాన్యత | 2.1 - 2.5 |
| 3. | రాజనీతి శాస్త్ర అధ్యయన పద్ధతులు : సాంప్రదాయ ఆధునిక వైఖరులు | 3.1 - 3.6 |
| 4. | రాజనీతి శాస్త్రం - ఇతర సాంఘిక శాస్త్రాలు | 4.1 - 4.6 |
| 5. | సమాజం - రాజ్యం - జాతి | 5.1 - 5.14 |
| 6. | సార్వభౌమాధికారం - బహుతావాదం | 6.1 - 6.9 |
| 7. | రాజ్యావతరణ సిద్ధాంతాలు - 1 | 7.1 - 7.5 |
| 8. | రాజ్యావతరణ సిద్ధాంతాలు - 2 | 8.1 - 8.10 |
| 9. | చట్టము | 9.1 - 9.4 |
| 10. | స్వేచ్ఛ - సమానత్వం | 10.1 - 10.12 |
| 11. | స్వేచ్ఛాభావన - వ్యక్తి స్వేచ్ఛావాద, అధికారవాద - సామ్యవాదుల అభిప్రాయాలు | 11.1 - 11.4 |
| 12. | వ్యక్తి హక్కుల సిద్ధాంతాలు - హక్కుల రకములు లక్ష్యం | 12.1 - 12.10 |
| 13. | న్యాయభావన - చట్టబద్ధ, రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయం | 13.1 - 13.3 |
| 14. | ప్రభుత్వ రకాలు - రాజరిక, కులీన, ప్రజాస్వామ్య ప్రభుత్వాలు | 14.1 - 14.6 |
| 15. | ప్రజాస్వామ్యము - ప్రత్యక్ష, పరోక్ష ప్రజాస్వామ్యాలు | 15.1 - 15.9 |
| 16. | సమాఖ్య, ఏక కేంద్ర ప్రభుత్వాలు | 16.1 - 16.7 |
| 17. | పార్లమెంటరీ, అధ్యక్ష తరహా ప్రభుత్వాలు | 17.1- 17.4 |
| 18. | అధికార పృథఃక్కరణ సిద్ధాంతము | 18.1 - 18.5 |
| 19. | శాసన శాఖ | 19.1 - 19.6 |
| 20. | శాసన శాఖ, దాని పాత్ర, కమిటీ విధానము, ప్రతిపక్షం పాత్ర | 20.1 - 20.6 |
| 21. | కార్య నిర్వాహక శాఖ - విధులు | 21.1 - 21.7 |
| 22. | న్యాయ శాఖ - దాని పాత్ర - విధులు | 22.1 - 22.5 |
| 23. | ఎన్నిక గణము - ప్రాతినిధ్య పద్ధతులు | 23.1 - 23.6 |
| 24. | రాజకీయ పక్షాలు | 24.1 - 24.8 |
| 25. | ప్రజానియంత్రణ - నియంత్రణ పద్ధతులు, ప్రజాభిప్రాయం-ప్రచార సాధనాల పాత్ర | 25.1 - 25.6 |

పాఠం - 1

# రాజనీతిశాస్త్రం - పరిచయం, నిర్వచనం, పరిధి

## 1.0 లక్ష్యం

రాజనీతి శాస్త్రం ఎడల అవగాహన ఏర్పరచటం, రాజనీతి శాస్త్రాన్ని పరిచయం చేయటం, సాంప్రదాయక , ఆధునిక నిర్వచనాలను చర్చించు సంఘ జీవనము, రాజకీయ జీవనాల ఆవశ్యకతలపై చర్చ, రాజనీతి శాస్త్ర పరిధి, విషయ వివరాల విపులీకరణ ఈ పాఠం ప్రధాన లక్ష్యాలు.

**1.1. విషయ క్రమం:**

- 1.2. పరిచయము
- 1.3. వికాసము
- 1.4. నిర్వచనము
- 1.4. 1. సాంప్రదాయక నిర్వచనాలు
- 1.4. 2. ఆధునిక నిర్వచనాలు
- 1.5. విషయ పరిధి
- 1.5.1. మానవాధ్యయనము
- 1.5. 2. రాజ్యాధ్యయనము
- 1.5. 3. రాజకీయ సంస్థలు
- 1.5. 4. రాజనీతి సిద్ధాంతాలు
- 1.5. 5. రాజనీతి భావాలు
- 1.5. 6. శక్తి-అధికారం
- 1.5. 7. రాజకీయ ప్రవర్తన-విధాన ప్రక్రియ
- 1.5. 8. స్థానిక, జాతీయ, అంతర్జాతీయ సమస్యలు
- 1.5. 9. అంతర్జాతీయ సంబంధాలు, సంస్థలు, అంతర్జాతీయ న్యాయము
- 1.6. సారాంశము

## 1.2 పరిచయం

"మానవుడు సంఘజీవి" (అరిస్టాటిల్). ఎల్లకాలం ఒంటరిగా జీవించుట అతనికి అసాధ్యము. సంఘములో సభ్యునిగా మాత్రమే సంపూర్ణమైన జీవితాన్ని సాధించగలడు. ప్రతి మానవునికి ఇతరులతో సహజీవనము అత్యంత ఆవశ్యకము. ఒక నిశ్చిత భూభాగంలో నివశించే ప్రజలందరూ ఒక నిర్దిష్టమైన సమాజముగా రూపొందుతారు. వ్యక్తులమధ్య పరస్పర సంబంధమేర్పడుతుంది. ఉమ్మడి ప్రయోజనాలు చేకూరుతాయి.

దీనితో పాటు ప్రతివ్యక్తి తన వ్యక్తిత్వాన్ని, ప్రత్యేకతను నిలుపుకొనుటకు కూడా ప్రయత్నిస్తాడు. సంఘ జీవనము కొరకు ప్రయత్నము ఒకవైపు, వ్యక్తిగత జీవనమునకు ప్రయత్నం మరియొకవైపు ఉండుట వలన సమూహ జీవితంలో ఈ రెంటికి సమన్వయం కుదరదు. ఫలితంగా విభిన్న వ్యక్తుల ప్రత్యేక ప్రయోజనాలు, ప్రయత్నాలు ఘర్షణకు దారి తీస్తాయి. అందువలన వ్యక్తులమధ్య పరస్పర సహకారాన్ని ప్రోత్సహించి, సంఘర్షణలను పరిమితం చేయటానికి కొన్ని స్థిరమైన నియము నిబంధనలను ఏర్పరచవలసి ఉంటుంది. దానికొరకు ఒక

ప్రత్యేక వ్యవస్థ అవసరమౌతుంది. నియమ నిబంధనలు రూపొందించుట, వాటిని ఆచరింపజేయుట, వాటి ఎడల అవిధేయులైన అపరాధులను శిక్షించుట, అంతిమంగా తన కార్యకలాపాల ద్వారా మానవాభ్యుదయాన్ని సాధించుట ఈ సంస్థ ప్రధాన కర్తవ్యము. ఇటువంటి వ్యవస్థ ఆవిర్భావము వలన మానవ సమాజము ఒక వ్యవస్థీకృతమైన రాజకీయ సమాజంగా మారుతుంది. దానిపేరే రాజ్యము.

మానవ ప్రవర్తనను క్రమబద్ధంచేసే నియమనిబంధనలే శాసనాలు లేక చట్టాలు. వాటిని రూపొందించి అమలు పరిచి, అవసరమైనపుడు శిక్షించగల అధికారము గల వ్యక్తిని లేక వ్యక్తుల సముదాయాన్ని ప్రభుత్వము (Government) అనవచ్చు. ఒక నిర్ణీత ప్రదేశంలో నివసించే వ్యక్తులు వారు ఏర్పరుచుకున్న ప్రభుత్వాన్ని శాసించగల సార్వభౌమాధికారము (Sovereignity) కల వ్యవస్థను రాజ్యము (State) అంటారు. ఇటువంటి "రాజ్యము" "ప్రభుత్వము" లను గురించి అధ్యయనం చేస్తుంది రాజనీతి శాస్త్రము. ఈ శాస్త్ర అధ్యయనము సహాయంతో వ్యక్తి తనను తాను పరిపాలించుకునే విధానాన్ని నిత్యం అన్వేషణ చేస్తాడు.

## 1.3. రాజనీతి శాస్త్రము - వికాసము

క్రీస్తు పూర్వము నాలుగవ శతాబ్దమునకు పూర్వమే రాజనీతి శాస్త్ర వికాసము ప్రారంభమైనదని చెప్పవచ్చు. ప్రాచీన గ్రీకు తత్వజ్ఞులు రాజనీతిని తత్వశాస్త్రమునుండి వేరుచేసి ఒక ప్రత్యేక విషయంగాఅధ్యయనం చేశారు. క్రమముగా తరువాతి కాలంలో ఇది ఒక స్వతంత్ర శాస్త్రముగా అభివృద్ధిని పొందినది. రాజనీతి తత్వజ్ఞులలో ప్రథముడు ప్లేటో. రాజనీతి అధ్యయనానికి శాస్త్రీయతను ఆపాదించిన ఘనత అరిస్టాటిల్ కు చెందుతుంది

గ్రీకు భాషలో "పొలిస్" (Polis) అను పదమునుండి Politics అనే ఆంగ్ల పదము ఆవిర్భవించింది. "పొలిస్" అనగా నగర రాజ్యము (City-State). ప్రాచీన గ్రీసులో ప్రతి నగర రాజ్యము స్వయంపోషకముగా, సర్వ స్వతంత్రమైన రాజ్యాంగ విధానమును అనుసరించింది. ఈ కారణంగా, రాజనీతి అధ్యయనంలో నగర రాజ్యాలు ప్రత్యేక స్థానాన్ని పొందాయి. వ్యక్తికి అన్ని రంగాలలో ఉత్తమోత్తమ జీవితాన్ని అందించటానికి, మానవ సమాజంలో విభిన్న వర్గాలమధ్య పరస్పర సద్భావ సంబంధాలను నెలకొల్పటానికి, నైతిక మార్గదర్శిగాను, పాలక వర్గానికి అన్నిరంగాలలో ముఖ్యసాధనంగాను రాజనీతిశాస్త్రము తోడ్పడింది.

నగర రాజ్యాల కార్యకలాపాలను నిశితంగా పరిశీలించి అధ్యయనము చేయటమే రాజనీతి అని గ్రీకు శాస్త్రవేత్త ప్లేటో, అరిస్టాటిల్ భావించారు. ఈ విధంగా ప్రాచీన గ్రీకు రాజనీతి శాస్త్రంలో సాంఘిక, రాజకీయ వ్యవస్థలు, నగరపాలన మొదలైనవి చేరినవి. కాలగమనంలో నగరరాజ్యాలు అంతరించినవి. మధ్య యుగములోను, ఆధునిక యుగములోను, అనేక రాజకీయ పరిణామాలు ఏర్పడినవి. నగర రాజ్యపతనానంతరం రోమన్ రాజ్యస్థాపన, రాజనీతికి - మతానికి మధ్య సంఘర్షణ, భూస్వామ్య వ్యవస్థ, తరువాత కాలంలో ఆవిర్భవించిన జాతీయ రాజ్యాలు, సమాఖ్యరాజ్యాలు, అంతర్జాతీయతావాదము మొదలైనవి రాజనీతి శాస్త్ర వికాసానికి తోడ్పడినవి.

## 1.4. రాజనీతి శాస్త్రము - నిర్వచనము

రాజనీతిశాస్త్ర నిర్వచనాలు రెండు రకాలు. 1) సాంప్రదాయక నిర్వచనాలు 2) ఆధునిక నిర్వచనాలు

**1.4.1.** సాంప్రదాయక నిర్వచనాలు: ఆధునిక రాజ్యంలో స్వపరిపాలనా విధానాన్ని గురించి అధ్యయనం చేసేదే రాజనీతిశాస్త్రమని సాంప్రదాయిక నిర్వచనాలు భావిస్తాయి. రాజనీతి శాస్త్రము రాజకీయ సమాజాన్ని గురించి అధ్యయనం చేస్తుంది. అటువంటి సమాజంలో మానవుడు ఒక భాగము. "రాజ్యము" "ప్రభుత్వము" లను అధ్యయనం చేయటం రాజనీతి లక్ష్యము.

అప్పాదొరై - "రాజనీతి శాస్త్రము ఒక నిర్దిష్ట ప్రదేశంలో శాసనబద్ధులుగా జీవించుటకు సంఘటితమైన జన సమూహము. రాజ్యము లేదా రాజకీయ సమాజమును గురించి వివరిస్తుంది" ("Politics deals with the State or Political Society.")

గార్నర్- "రాజనీతి శాస్త్రానికి ఆద్యంతాలు రెండు రాజ్యమే" ("Political Science begins and ends with the State")

గిల్ - "గతకాల రాజ్యాల చారిత్రక వివరణ, నేటి రాజ్యాల స్థితియొక్క , విశ్లేషణ రాబోవు కాలములో రాజ్యాలెటులుండ వలెనో

తెలిపే రాజకీయ, నైతిక చింతన - వీటి సమగ్ర రూపమే రాజనీతి శాస్త్రము."

("It (Political Science) is a historical investigation of what the State has been, an analytical study of what State is, and a politico-ethical discussion of what the State should be").

బ్లంట్ ష్లి : "రాజ్యము యొక్క మౌలిక స్వభావం, దాని వివిధ రూపాలు, అభివృద్ధి, అవగాహన వంటివాటిని అధ్యయనం చేసే శాస్త్రమే రాజనీతి శాస్త్రము."

("Political Science is a Science which is concerned with the State, endeavours to understand and comprehend the State in its essential nature, various forms, manifestations and developments.")

పాల్ జానెట్ - "రాజ్యమూలాధారాలను, ప్రభుత్వ సూత్రాలను తెలియజేసే శాస్త్రభాగమే రాజనీతి శాస్త్రము".

(Political Science is that part of Social Science which treats the foundations of the State and principles of Government")

గిల్ క్రిస్ట్ - "రాజ్యము, ప్రభుత్వాలను గురించి అధ్యయనము చేయునది రాజనీతి శాస్త్రము".

(Political Science deals with State and government)

## 1.4.2. ఆధునిక నిర్వచనాలు:

కర్టిస్, రిప్సన్, కాట్లిన్ మొదలైన ఆధునిక రచయితలు రాజనీతి శాస్త్రమును విశాల దృక్పథముతో పరిశీలించాలని భావించారు. కేవలము, రాజ్యము, ప్రభుత్వములను అధ్యయనం చేసే రాజనీతి శాస్త్రములో మానవ జీవిత విలువల, లక్ష్యాల ప్రాధాన్యత గుర్తింపబడదు. వ్యవస్థల అధ్యయనంగా మాత్రమే మిగిలిపోతుంది. రెండవ ప్రపంచ యుద్ధానంతరం ఏర్పడిన విప్లవాత్మక మార్పుల ఫలితంగా నూతన దృక్పధంతో రాజనీతి శాస్త్రమును పరిశీలించే ప్రయత్నాలు ప్రారంభమైనవి. వాస్తవికకత, ప్రాధాన్యత పెరిగింది.

లాస్వెల్, కప్లాన్ - "అధికార రూపకల్పన, భాగధేయతలను అనుభవ పూర్వకముగా విషయపరంగా పరిశీలించేది రాజనీతి శాస్త్రము". "Political Science as an empirical enquiry in the study of shaping and sharing of power".

డేవిడ్ ఈస్టన్ - "సమాజానికై నిర్దేశించిన అధికార విధానాన్ని ప్రముఖంగా ప్రభావితం చేసే వివిధ కార్యకలాపాలతోనూ, అధికారయుతంగా నిర్దేశించిన సామాజిక విలువలతోను, రాజనీతి శాస్త్రానికి సంబంధమున్నది".

మాక్స్ వెబర్ - "అధికారంలో ఉండడానికి కాని లేక అధికారంలో ఉన్నవారిని ప్రభావితం చేయటానికి కాని జరిగే సంఘర్షణ రాజనీతి శాస్త్రము".

"శక్తి" "ప్రభావము" "అధికారము" "నియంత్రణ" లను అధ్యయనం చేసే శాస్త్రముగా రాజనీతిశాస్త్రాన్ని పై నిర్వచనాలు వివరిస్తాయి. అధికార సిద్ధాంతముతోపాటు రాజకీయ సంస్థల స్వరూప, స్వభావాలను తెలియజేసే శాస్త్రంగా ఇది నేటికి గుర్తించబడుచున్నది.

## 1.5. విషయపరిధి :

రాజనీతి శాస్త్రము ప్రాచీన గ్రీకు నగర అధ్యయనానికి సంబంధించిన ఒక పరిమిత శాస్త్రంగా జన్మించింది. పరిమిత స్వభావాన్ని కలిగి ఉన్నప్పటికి, ఆనాడే అరిస్టాటిల్ రాజనీతి శాస్త్రంలో ఇమిడి ఉన్న అనేక భావనలను, సూత్రాలను విశదీకరించి, దానిని ఒక అత్యున్నత శాస్త్రంగా వర్ణించాడు.

తమను తాము పాలించుకొనుటకు చేసిన మానవ ప్రయత్నాలన్నీ, రాజనీతి శాస్త్ర పరిధిలో చేరుటవలన ఈ విషయ పరిధి చాలా విస్తృతమైంది. గతకాలంలో రాజ్యం ఏ విధంగా ఉన్నది అన్న చారిత్రక పరిశోధన, వర్తమాన కాలంలో రాజ్యం ఎలా ఉన్నదనే తులనాత్మక పరిశీలన, భవిష్యత్తులో రాజ్యము ఎలా ఉండవలెననే రాజకీయనైతిక చింతన భావనలు పరిశీలించవలసి ఉంటుంది. రాజనీతి శాస్త్రము విషయ పరిధిని ఈ క్రింది విధముగా వివరించవచ్చును.

**1.5. 1. మానవాధ్యయనము** : రాజనీతి శాస్త్రం ఒక సాంఘిక శాస్త్రం. మానవుని స్వభావంలో దీని మూలాధారాలు గోచరిస్తాయి. సమాజం, శాసనాలు, శాసన నిర్మాణ వ్యవస్థ, ప్రభుత్వ వ్యవస్థ, రాజ్యవ్యవస్థలలో మానవ ప్రయత్నాలు, విలువలు గోచరిస్తాయి. మానవుల ప్రవర్తనను ఆధారం చేసుకొని రాజకీయ, ఆర్థిక, సామాజిక, సమకాలిన అధ్యయనం చేయాలన్న "ప్రవర్తనావాదం" (Behaviorism) అనే నూతన దృక్పథం రాజనీతి విషయ పరిధిలో చేరింది.

**1.5. 2. రాజ్యాధ్యయనము** : నైతికాభ్యుదయము, సాంఘిక లక్ష్యాలను సాధించాలనే మానవ సహజవాంఛ ద్వారా రాజ్య నిర్మాణము జరిగింది. "మానవ జీవనము కొరకు రాజ్యము అవతరించి ఉత్తమ జీవనము అందించటానికి అది కొనసాగుతున్నది" (అరిస్టాటిల్) కుటుంబము, జాతులు, తెగలు, పల్లెలు, నగరాలు, ప్రాచ్య సామ్రాజ్యాలు, నగర రాజ్యాలు, రోమను సామ్రాజ్యము, భూస్వామ్య వ్యవస్థ, జాతీయ రాజ్యాలు వంటి అనేక రాజ్య పరిణామ దశల పరిశీలన ఈ అధ్యయనంలో చోటుచేసుకొన్నది.

**1.5. 3. రాజకీయ సంస్థలు:** రాజ్యానికి అత్యంత ప్రాధాన్యమైన అధికారయుత యంత్రాంగమే ప్రభుత్వము. దాని కార్యకలాపాలపై ప్రత్యక్షంగా ప్రభావం గల రాజకీయ పక్షాలు, ప్రభావ వర్గాలను అధ్యయనం చేయటంలో రాజనీతి శాస్త్ర పరిధి విస్తరించింది.

**1.5. 4. రాజనీతి సిద్ధాంతాలు:** అభిప్రాయాలు విలువలు, నమ్మకాలు సూత్రీకరింపబడినపుడు సిద్ధాంత రూపాన్ని పొందుతాయి. భూత, వర్తమాన కాలాలలో వెలువడిన సిద్ధాంతాలు, వివరణచర్చ రాజనీతి శాస్త్రములో ప్రధాన భాగమైంది.

**1.5. 5. రాజనీతి భావాలు:** ప్లేటో, అరిస్టాటిల్, లాస్కీ, జె.ఎస్.మిల్ వంటి ప్రముఖుల రచనల ద్వారా రాజనీతి భావాలు ప్రచారము పొందినవి. ప్రజాస్వామ్యము, స్వేచ్ఛ, సమానత్వం, సార్వభౌమత్వం మొదలైన రాజనీతి భావాల అధ్యయనం రాజనీతి శాస్త్రం పరిధిలో ఒక ప్రధాన భాగం.

**1.5. 6. శక్తి, అధికారం** : శక్తి, దాని ప్రభావానికి ఆధునిక రాజనీతి శాస్త్రజ్ఞులు ప్రాధాన్యతనిచ్చారు. ఇతరులను ప్రభావితం చేసేది శక్తి. ఇతరులను ఆజ్ఞాపించేది అధికారం. అధికారం లేని శక్తి చట్ట సమ్మతం కాదు. మానవసమాజాన్ని ప్రభావితం చేసే శక్తి, అధికారముల స్వభావము, ఆధారాలు, విధానాల పరిధి, పరిమాణాల గురించి రాజనీతి శాస్త్ర ప్రాథమికంగా అధ్యయనం చేస్తుంది.

**1.5. 7. రాజకీయ ప్రవర్తన, విధాన ప్రక్రియ :** ఒకవైపు వ్యక్తిగత జీవితాదర్శాల కొరకు, రెండవ వైపు సంఘ జీవనం కొరకు మానవుడు నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటాడు. ఈ రెండు ప్రయత్నాలు పరస్పర విరుద్ధమైనవి. ఈ రెంటినీ సమన్వయ పరచటం రాజ్యవ్యవస్థ బాధ్యత. అందువలన మానవ నైజము, ప్రవర్తనలపై రాజ్య స్వరూప, స్వభావాలు ఆధార పడతాయి. విధాన ప్రక్రియ లేర్పడతాయి. రాజ్య వ్యవస్థపైనా, రాజకీయ సంస్థలపైనా మానవ స్వభావము, నైజము, ప్రవర్తన, ఆశయాలు మొదలగు వాటి ప్రభావము అధ్యయనం చేయటం ఆవశ్యకము.

**1.5. 8. స్థానిక, జాతీయ, అంతర్జాతీయ సమస్యల అధ్యయనము** : స్థానిక సమస్యల పరిష్కారానికై స్థానిక స్వపరిపాలనా సంస్థలు ప్రజాస్వామ్య విధానంలో అవసరమే కాకుండా, ప్రజల భాగస్వామ్యానికి ఇవి ఆవశ్యకము. జాతీయ సమైక్యత, కులమత విభేదాలు, ప్రాంతీయ తత్వము, భాషాతత్వము, జాతి వివక్షణ మొదలైనవి జాతీయ ప్రభుత్వాలు ఎదుర్కొంటున్న ప్రస్తుత సమస్యలు. ఉగ్రవాదము, ప్రచ్ఛన్నయుద్ధము, జాతుల సమస్య, నిరాయుధీకరణ ప్రపంచ శాంతి - సహకారాలు, నూతన వలసవాదము మొదలైనవి అంతర్జాతీయ సమస్యలు. పై మూడు స్థాయిలలోని సమస్యల పరిశీలన, పరిష్కార మార్గాల అన్వేషణ కూడా రాజనీతి శాస్త్ర పరిధిగా చెప్పవచ్చును.

**1.5. 9. అంతర్జాతీయ సంబంధాలు, సంస్థలు, అంతర్జాతీయ న్యాయము :** మానవ సంబంధాలు ఎంత స్వాభావికమో రాజ్యాల మధ్య సంబంధాలు అంతే స్వాభావికము. అంతర్జాతీయ సంస్థలు నిర్మించబడినవి. కామెన్ వెల్త్ ఆఫ్ నేషన్స్, ఐక్యరాజ్యసమితి, తదితర సంస్థల కృషి గణనీయమైనది. ప్రస్తుత రాజ్యాలు సాధిస్తున్న వైజ్ఞానిక సాంకేతిక ప్రగతి, అణుశక్తి ఒకవిధంగా ప్రమాదకరంగా పరిణమిస్తున్నది. ఈ పరిస్థితులలో అంతర్జాతీయ సంబంధాలను క్రమబద్ధము చేయుటలో అంతర్జాతీయ న్యాయము ప్రధాన పాత్ర వహిస్తున్నవి. వీటిని అధ్యయనము చేయటం రాజనీతి శాస్త్ర పరిధిగా పరిగణించవచ్చును.

**1.6. సారాంశము :** రాజ్య కార్యక్రమాలు విస్తృత మౌతున్నకొద్దీ రాజకీయ చైతన్యం క్రమంగా వ్యాప్తి చెందుతున్నది. రాజకీయ పరిపాలనా క్షేత్రాలలో రాజ్యాన్ని వివరించడం వరకే రాజనీతి శాస్త్రం పరిమితం కాదు. అందులో వ్యక్తిగత ప్రవర్తనతోపాటు సామాజిక రాజకీయ ప్రవర్తనకు సంబంధించిన సాంఘిక, మనోవైజ్ఞానిక విశ్లేషణలు అనేకం చేరినవి. ఇతర సాంఘిక శాస్త్రాలతో సహకరిస్తూ రాజకీయ పరిణామాల వికాసానికి సానుకూలత ఏర్పడింది. ఈ కారణాలన్నింటివల్ల రాజనీతి శాస్త్ర పరిధి చాలా విస్తృతంగా మారిపోయింది.

## అభ్యాసాలు

**I. వ్యాస ప్రశ్నలు:**

1) రాజనీతి అనగానేమి? అది ఎట్లు వికాసము పొందెను.
2) రాజనీతి శాస్త్రముపై వెలువడిన సాంప్రదాయిక నిర్వచనాలను చర్చించుము.
3) రాజనీతి శాస్త్ర భావమును, పరిధిని వర్ణింపుము.

**II. సంక్షిప్త వ్యాస ప్రశ్నలు:**

1) రాజనీతి శాస్త్రముపై ఆధునిక భావన లేవి?
2) రాజనీతి శాస్త్ర ఆవిర్భావానికి దారితీసిన పరిస్థితులేవి?

**III. లఘువ్యాస ప్రశ్నలు :**

1) మానవుడు సంఘజీవి.
2) నగర రాజ్యము
3) రాజనీతి సిద్ధాంతాలు
4) శక్తి - అధికారము

**IV. కుశాగ్రబుద్ధి ప్రశ్నలు**

1. నగరరాజ్యాల కార్యకలాపాలను నిశితంగా పరిశీలించి అధ్యయనము చేయటమే రాజనీతి అని గ్రీకు శాస్త్రవేత్తలైన ---------------, --------------- లు భావించారు.
2. "రాజనీతి శాస్త్రానికి ఆద్యంతాలు రెండూ రాజ్యమే" అని --------------- నిర్వచించాడు.
3. అధికారంలో ఉండడానికి కాని లేక అధికారంలో ఉన్నవారిని ప్రభావితం చేయడానికి కాని జరిగే సంఘర్షణ రాజనీతి శాస్త్రము అని ------------- నిర్వచించాడు.
4. -------------------- రాజనీతి శాస్త్రంలో ఇమిడి ఉన్న అనేక భావనలను, సూత్రాలను విశదీకరించి దానిని ఒక ------------------- శాస్త్రంగా వర్ణించాడు.
5. ప్రభుత్వ కార్యకలాపాలపై ప్రత్యక్షంగా ప్రభావం కలిగిన రాజకీయ పక్షాలు, ప్రభావ వర్గాలను అధ్యయనం చేయటంలో -------------------- పరిధి విస్తరించింది.

## ఉపయుక్త గ్రంథాలు


1) V.D. Mahajan — Principles of Political Science
2) Dr. R.L. Gupta — Political Theory
3) K.R. Acharya, Sastry, Raghava and Bhogendra — A Text Book of Political Science


-రచయిత

డా.యస్.కె. రావు

పాఠం - 2

# రాజనీతి శాస్త్రం : పరిణామం, స్వభావం, ప్రాధాన్యత

## 2.0. లక్ష్యం

రాజనీతి శాస్త్ర పరిణామ దశలను వివరించటం, శాస్త్రీయ స్వభావాన్ని నిర్ధారించటం, రాజనీతి శాస్త్ర అధ్యయన ప్రాధాన్యతను వివరించటం ఈ పాఠం లక్ష్యాలు.

**2.1. విషయక్రమం:**

- 2.2. రాజనీతి శాస్త్రం - పరిణామదశలు
- 2.3. స్వభావము
- 2.4. రాజనీతి శాస్త్రం విజ్ఞాన శాస్త్రమా లేక కళా?
- 2.5. అధ్యయన ప్రాధాన్యత
- 2.6. సారాంశము

## 2.2. రాజనీతి శాస్త్రం - పరిణామదశలు :

రాజనీతి శాస్త్రం ఒక సాంఘిక శాస్త్రం. ఇతర సాంఘిక శాస్త్రాలైన చరిత్ర, తత్త్వ శాస్త్రం, న్యాయ శాస్త్రం, అర్థ శాస్త్రం వంటి అధ్యయన రంగాలనుండి పరిణామం చెంది ఎప్పటికప్పుడు వికాసాన్ని పొందుతూవచ్చింది. ఇది, మానవుడు, అతని సాంఘిక పరిసరాల చుట్టూ పరిభ్రమిస్తుంది. రాజనీతి శాస్త్రం కూడా ఒక ప్రాచీన శాస్త్రం అవటం వల్ల దీని స్వరూప, స్వభావాలు, పరిధి, కాలక్రమంలో అనేక మార్పులకు చేర్పులకు లోనయ్యాయి.

రాజనీతి శాస్త్రం ఒకప్పుడు ఇతర విద్యా విభాగాలలో భాగంగా ఉండేది. ప్రాచీన గ్రీకు అధ్యాపకులైన సోఫిష్టులతో (Sophists) రాజనీతి శాస్త్ర అధ్యయనం ప్రారంభమైంది. వారి వారసుడైన సోక్రటీస్ రాజనీతి భావాలను సామాన్య ప్రజలకు అందజేసి రాజనీతి ప్రవక్తగా పేరుపొందాడు. ప్రఖ్యాత గ్రీకు తత్త్వజ్ఞులైన ప్లేటో, అరిస్టాటిల్ రచనల ద్వారా రాజనీతి ఒక ప్రత్యేక స్థానాన్ని పొందింది. "మానవుడు సంఘజీవి" అన్న అరిస్టాటిల్ భావనలో రాజ్య ఆవశ్యకతను గుర్తించవచ్చు. రాజనీతి పోలిస్ (Polis) అనగా నగర రాజ్యానికి సంబంధించిన ఒక అధ్యయనం. రాజనీతి శాస్త్ర ప్రథమ పాఠాలు ప్రాచీన గ్రీకునగర రాజ్యాలలో ప్రారంభమయ్యాయి.

రాజ్యానికి సంబంధించిన సిద్ధాంతాలు, వాస్తవిక పరిశోధనలను ప్రాచీన గ్రీకులు, వారిలో ప్రధానంగా ప్లేటో, అరిస్టాటిల్ సాగించారు. వారి అభిప్రాయంలో వ్యక్తి, సంఘం రెండూ ఒకటే. అట్టి సంఘాన్ని నియంత్రించి నడపగలిగేది రాజ్యము. "వ్యక్తి విరాట్ స్వరూపమే రాజ్యము" (ప్లేటో). ఆదర్శ పౌరుల ద్వారా ఆదర్శ రాజ్య నిర్మాణము జరుగుతుందని తన "రిపబ్లిక్" గ్రంథంలో ప్లేటో అభిప్రాయ పడ్డాడు. పౌరసత్వం, రాజకీయ ఆదర్శాలు, బానిసత్వం, విప్లవాలు, ఉత్తమ రాజ్యాంగ విధానాలు మొదలైన వాటిని "పాలిటిక్స్" గ్రంథంలో అరిస్టాటిల్ చర్చించాడు. చట్టము, ధర్మ వివేచన (Jurisprudence) దృక్పథంతో ప్రభుత్వ పాలనా రంగాలలో అధ్యయనాలు చేసి ప్రాచీన రోమను తత్త్వ వేత్తలు రాజనీతి శాస్త్ర వికాసానికి తోడ్పడ్డారు.

రాజ్యము, చర్చిల మధ్య సంఘర్షణే మధ్యయుగపు రాజనీతిశాస్త్రమని చెప్పవచ్చు. కొంత కాలము మతముతో రాజ్యము సమానత్వాన్ని పొందింది. క్రమంగా మత ప్రాబల్యానికి లొంగి ఉండవలసి వచ్చింది. ఐహిక చింతన కన్నా ఆధ్యాత్మిక విలువలు ప్రజాదరణ పొందాయి. మతాధికారులు దైవదూతలుగా పరిగణింపబడేవారు. సెయింట్ అగస్టిన్, సెయింట్ థామస్ అక్వినాస్‌ల రాజకీయ భావాలు గౌరవాన్ని సంపాదించుకున్నాయి.

మత పునరుజ్జీవన కాలంలో మతసంస్కరణోద్యమాలు ప్రారంభమయ్యాయి. పశ్చిమ యూరప్‌లో జాతీయ భావాలు బలపడి జాతీయ రాజ్యాలు అవతరించాయి. మతాధికారుల బంధనాల నుండి రాజనీతి శాస్త్రం, రాజ్యం రెండూ విముక్తిని పొందటం ఈదశ యొక్క విశేషం. లౌకికతత్వానికి, ఆధ్యాత్మిక తత్వానికి మధ్య సమతూకం ఏర్పడింది.

16 వ శతాబ్దానికి చెందిన ప్రముఖ రాజనీతి తత్త్వవేత్త మాకియవేల్లి "ప్రిన్స్" అనే గ్రంథంలో మతాన్ని రాజకీయాలనుండి వేరుచేశాడు. దీనితో మధ్యయుగాల భావాలు అంతరించాయి. రాజనీతి శాస్త్రంలో ఆధునిక యుగం ప్రారంభమైంది. రాజ్యానికి ఆధారమైన సార్వభౌమాధికారాన్ని బోడిన్ వివరించాడు. 18 వ శతాబ్దానికి చెందిన ఫ్రెంచి తత్త్వవేత్త మాంటెస్క్యూ తన 'అధికార పృథక్కరణ' సిద్ధాంతము ద్వారా ప్రభుత్వాధికారాల వేర్పాటును సూచించి నియంతల పాలనను ఎదుర్కొన్నాడు. "సమతౌల్య భావనలు" (Checks and balances) ప్రవేశించాయి.

19 వ శతాబ్దపు మధ్యభాగంలో, డార్విన్ పరిణామ సిద్ధాంతం రాజనీతి శాస్త్రాన్ని ప్రభావితం చేసింది. సమాజ శాస్త్ర వికాసంతో ప్రభుత్వంపై సాంఘిక శక్తుల ప్రభావాన్ని రాజనీతి శాస్త్రజ్ఞులు మరింత శ్రద్ధగా గమనించనారంభించారు. నవ్య ప్రేరణ కలిగింది. పారిశ్రామికీకరణ వలన సాంప్రదాయిక ఆర్థిక సిద్ధాంతాలను మార్క్సిస్టు ఆర్థిక సిద్ధాంతానికి మధ్య ఘర్షణ తీవ్రతరమైంది. ఈ పరిణామ దశలో రాజకీయ సమస్యలను సృష్టించి రాజకీయ ప్రవర్తనకు ఆధారమయే ఆర్థిక కారణాలను మరింతలోతుగా అధ్యయనం చేయడం మొదలయింది.

రాజనీతి శాస్త్ర అధ్యయనానికి 20వ శతాబ్దము ఒక నూతన శకము. మానవశాస్త్రం, మనస్తత్వశాస్త్రం, సమాజశాస్త్రం వంటి సాంఘిక శాస్త్రాల ప్రభావం ప్రవర్తనా వాద ఉద్యమానికి దారితీసింది. వాస్తవికంగా, నిర్ధారికంగా వ్యవహరిస్తూ, రాజనీతి సిద్ధాంతాలు రూపొందించే ప్రయత్నాలు జరిగినవి. రెండు ప్రపంచ యుద్ధాలు, వైజ్ఞానిక, సాంకేతిక పురోభివృద్ధి, స్వతంత్ర జాతీయ రాజ్యాల అవతరణలు వంటి పరిణామాల ప్రభావం రాజనీతి శాస్త్రముపై పడింది. నూతన విశ్లేషణ, వ్యాఖ్యాన పద్ధతులు అవలంబించేటట్లు రాజనీతి శాస్త్రజ్ఞులు ప్రేరేపింపబడ్డారు. అనుభవాదార (empiricist) పద్ధతులు ఉపయోగింపబడ్డాయి. ఈ విధంగా 20వ శతాబ్దపు మొదటి, రెండవ దశాబ్దాల కాలమునాటి రాజనీతి శాస్త్రం అంతిమంగా స్వతంత్ర అధ్యయన శాస్త్ర స్థాయికి చేరుకుంది.

## 2.3. రాజనీతి శాస్త్రము- స్వభావము :

రాజనీతి స్వభావాన్ని నిర్ధారిస్తూ ఒక విజ్ఞాన శాస్త్రంగా పరిగణించడంలో భిన్నాభిప్రాయాలున్నాయి. ఈ నిర్ధారణ చేసే ముందు విజ్ఞాన శాస్త్ర లక్షణాలు తెలుసుకోవాలి.

శాస్త్రీయ దృక్పథంతో శాస్త్రీయ పద్ధతులలో పరిశీలించి, పరిశోధించి, రూపొందించిన నిర్దిష్ట సూత్రాల, ధర్మాల సముదాయానికి విజ్ఞాన శాస్త్రమని పేరు. దీనిలో (1) సార్వ జనీయత (2) ప్రామాణికత్వము అనే రెండు లక్షణాలుంటాయి. విజ్ఞాన శాస్త్ర అధ్యయనము ఈ క్రింది విధముగా జరుగుతుంది. (1) విషయసేకరణ, విభజన (2) సార్వజనీయత (3) భవిష్యత్పరిణామాలను ఊహించటం. సాంప్రదాయిక విజ్ఞాన శాస్త్రాలు రెండు రకాలు. భౌతిక శాస్త్రాలు ఉదా : రసాయనిక శాస్త్రము మొదలైనవి. (2) జీవశాస్త్రాలు ఉదా : వృక్షశాస్త్రము, జంతు శాస్త్రము మొదలైనవి.

జె.ఎస్.మిల్, మెయిట్ లాండ్, కాంప్టే మొదలైన రచయితలు ఈ క్రింది కారణాలవలన రాజనీతిని విజ్ఞానశాస్త్రంగా ఆమోదించలేదు.

1) అధ్యయన పద్ధతులు, సూత్రాలు, నిర్ణయాల విషయంలో రాజనీతి గ్రంథరచయితలలో ఏకాభిప్రాయము లేదు.

2) రాజనీతి అధ్యయనానికి ఒక క్రమబద్ధమైన నిరంతరమైన అభివృద్ధి లేదు.

3) ఈ అధ్యయనము యొక్క ఆధారాలు అనిశ్చితమైనవి. భిన్నత్వము కలవి. వాటిని కనుగొనటం, నియంత్రణ చేయటం కష్టం.

4) రాజకీయ పరిస్థితులు జటిలంగా ఉండి నిరంతరము మార్పులు చెందుతూ ఉంటాయి. అందువలన శాస్త్రీయ పద్ధతులలో పరిశోధనావకాశాలు పరిమితం.

5) రాజనీతికి మూలాధారం మానవుడు. అతని వ్యక్తిత్వము అభిప్రాయాలు, ప్రవర్తనకు స్థిరత్వము లేదు. అందువలన రాజనీతి సిద్ధాంతాలకు, సూత్రాలకు, ధర్మాలకు సార్వజనీయత లోపిస్తుంది.

6) రాజకీయ పరిస్థితులను ప్రభావితం చేసే కారణాలను నియంత్రణ చేయటం అసాధ్యం. దీనివలన భవిష్యత్పరిణామాలను యథాతథంగా ఊహించటం కష్టసాధ్యం.

7) రాజనీతి శాస్త్ర పరిశోధకుడు రూపొందించే సూత్రాల పైన, సిద్ధాంతాల పైన అతని వ్యక్తిగత రాగద్వేషాల ప్రభావముండటానికి అవకాశం చాలా ఎక్కువ.

8) మానవనైజము, ఆలోచనలు, ప్రవర్తనలు ఊహించటం కష్టసాధ్యం. అందువలన రాజకీయ సంస్థలకు, సూత్రాలకు సిద్ధాంతాలకు ప్రామాణికత లోపిస్తుంది.

పైన ఉదహరించిన అభ్యంతరాలున్నప్పటికి అరిస్టాటిల్, బ్రైస్, గెటిల్, గార్నర్, సీలీ, బర్గెస్, విలోబి, బోడిన్ మొదలైన ప్రఖ్యాత గ్రంథకర్తలు రాజనీతిని ఒక విజ్ఞాన శాస్త్రంగా ఆమోదించారు. రాజనీతిశాస్త్రం ఒక అత్యున్నతమైన విజ్ఞాన శాస్త్రం అని అరిస్టాటిల్ వర్ణించాడు.

భౌతిక రసాయనిక జీవశాస్త్రము మాదిరి రాజనీతి ప్రామాణిక శాస్త్రంకాదు. అయినప్పటికి రాజనీతిశాస్త్రం ఈ క్రింది కారణాలవలన సూత్రప్రాయమైన శాస్త్రంగా పరిగణించబడింది. దీనికి ఈ క్రింది కారణాలు పేర్కొనవచ్చు.

(1) నిర్దిష్టంగా, క్రమపద్ధతిలో శాస్త్రీయ బద్ధముగా అధ్యయనము చేసే అవకాశం

(2) క్రమబద్ధమైన పరిశోధనల ఫలితంగా రాజనీతి శాస్త్రసూత్రాలు ధర్మాలు, సిద్ధాంతాలు రూపొందటం.

(3) రాజనీతి శాస్త్రము ఇతర విజ్ఞాన శాస్త్రాల వలె అనుభవపూర్వక సాక్ష్యాధారాల ద్వారా సార్వజనీయ ధర్మాలను ప్రతిపాదిస్తుంది. ప్రత్యేక సంఘటలను పరిస్థితులను విశ్లేషించి తార్కికంగా మానవ ప్రవర్తనలో మార్పులను కనుగొనవచ్చు. ఉదా : మానవుడు సహజసిద్ధంగా రాజకీయ జీవి అనే అరిస్టాటిల్ నిర్ధారణ సార్వజనీయమైనది. అదేవిధముగా అసమానత్వమే విప్లవాలకు కారణము అను కార్ల్‌మార్క్స్ సూత్రము అనుభవపూర్వక పరిశీలన ద్వారా నిర్ధారింపబడింది.

(4) రాజనీతి శాస్త్రము భవిష్యత్ పరిణామాలను ఒక పరిమిత పరిధిలో ఊహిస్తుంది. పరిశోధనల ద్వారా, నిశిత విశ్లేషణల ద్వారా ప్రజల ఓటింగ్ ప్రవర్తనను ఎన్నికలకు ముందుగా ఊహించిన సందర్భాలు అనేకము కలవు.

(5) ప్రయోగశాలలకు మాత్రమే పరిమితము కానివి రాజనీతి శాస్త్ర ప్రయోగాలు, ప్రభుత్వాలు రూపొందించే ప్రయోగాత్మక శాసనాలు, సంస్కరణలు, విధానాలు, పరిపాలనాపద్ధతులు, మొదలైనవి వాస్తవమైన ప్రయోగాలు. వాటి పరిణామాలే భవిష్యత్తులో మార్గదర్శకాలు.

(6) ప్రస్తుత కాలంలో రాజనీతి శాస్త్రము మరింతగా ఆధునీకరణ పొందింది. ప్రవర్తనా పరిశీలనా వాదులు అత్యంత ఆధునిక, సాంకేతిక పద్ధతులు ప్రవేశపెట్టారు. సాంఖ్యక పద్ధతి (Statistical Method) కంప్యూటర్, గ్రాపులు, ఛార్టులు, స్కేలో గ్రాపులు, గణాంకనమూనాలు (Mathematical models) మొదలైనవి విరివిగా వినియోగింపబడుట చేత రాజనీతి శాస్త్రానికి విజ్ఞాన శాస్త్ర స్థాయిని చేరుకునే అవకాశం కలిగింది.

## 2.4. రాజనీతి శాస్త్రం విజ్ఞాన శాస్త్రమా లేదా కళా?

పైన వివరించిన కారణాల వలన రాజనీతి శాస్త్రం ఒక సమగ్రమైన విజ్ఞాన శాస్త్రంగా ఆమోదింబపడింది. మానవుని సామాజిక పరిస్థితులు, అతడు నిర్మించుకొన్న రాజ్యము దాని కార్యకలాపాలు అధ్యయనం చేసే రాజనీతి శాస్త్రము ఒక ప్రామాణిక సాంఘిక శాస్త్రము. ఒక వైపు వాస్తవ విషయాలను యధాతథంగా అధ్యయనం చేయటం, రెండవ వైపు లక్ష్యసాధనకు అనుకూలమైన, సాధారణీకరణలను సూచించటం రాజనీతి శాస్త్ర ముఖ్యోద్దేశం.

మానవ ప్రవర్తనాసరళి, జటిలమైన సామాజిక పరిస్థితుల వలన ఇతర విజ్ఞాన శాస్త్రాల స్థాయిలో సాధారణీకరణలు (Generalisations) చేకూరే అవకాశం లేదు. ఈ అవరోధాలను అధిగమించి రాగద్వేషాలకు అతీతంగా రాజ్య సంబంధ ప్రాథమిక సత్యాలను కనుగొనటానికి నిరంతర కృషి జరుగుతున్నది. ఈ రంగంలో జరిగే పరిశోధనలకు అత్యంత ఆధునిక శాస్త్రీయ పద్ధతులు, సాంకేతికపరిజ్ఞానము తోడ్పడడం వలన రాజనీతి శాస్త్రము ప్రామాణికతను సాధించటంలో మరింతగా ముందడుగు వేసింది.

రాజనీతి శాస్త్రాన్ని ఒక ప్రత్యేకమైన కళ (Art) గా కూడా భావించేవారుఉన్నారు. రాజ్య వ్యవహారాలకు అనుభవైక మార్గదర్శకాలు కనుగొనటం, రాజ్యాధిపతులకు, పరిపాలకులకు ఆచరణాత్మక ప్రత్యామ్నాయాలు సూచించటం రాజనీతిశాస్త్ర ధ్యేయం. రాజ్యవ్యవహారాలను కాలానుగుణంగా పున: పరిశీలనచేసి, సవరించి, వృత్తి నైపుణ్యతను పెంపొందించటానికి తోడ్పడుతుంది. అందువలన ఆచరణాత్మక రాజనీతి ఒకకళ అని చెప్పవచ్చు.

## 2.5. రాజనీతిశాస్త్రము : అధ్యయన ప్రాధాన్యత

రాజనీతిశాస్త్ర అధ్యయన ప్రాధాన్యతను ఈ క్రింది విధంగా వివరించవచ్చు.

**2.5.1.** నిర్దిష్టమైన అర్ధాలతో పారిభాషిక పదాల నిర్మాణము మొదటి ప్రయోజనమని చెప్పవచ్చు. పర్యాయపదాలుగా వాడబడుతున్న రాజ్యం, ప్రభుత్వం, జాతి, జాతీయత, న్యాయం, చట్టం, ప్రజాస్వామ్యం, సామ్యవాదం మొదలైన పదాలకు స్పష్టత, నిర్దిష్టత కలిగిస్తుంది. రాజ్య వ్యవహారాల పరిశీలన మరింతగా మెరుగుపడింది.

**2.5.2.** రాజనీతి ఒక ప్రాచీన అధ్యయన విజ్ఞానము. గతించిన కాలాలకు సంబంధించిన రాజకీయాలు, రాజకీయ ఉద్యమాలు, కారణాలు, ప్రేరణలు వాటి ఫలితాల పై రాజనీతిశాస్త్ర అధ్యయనం అవగాహన కలిగిస్తుంది. దీని ఆధారంగా వర్తమాన, భవిష్యత్ కాలాలలో మానవ జీవన వికాసానికి అనువైన ప్రణాళికలు రూపొందించవచ్చు. మానవుని సామాజిక ప్రవర్తన వ్యక్తిగత ప్రవర్తనలను తెలిసికొని, వాటి కనువైన అధికార విధానాలను రూపొందించి అమలుపరచవచ్చు.

**2.5.3.** రాజనీతి తత్త్వ చరిత్రలో ప్రముఖ మేధావులు రచించిన గ్రంధాలలో వారి భావాలను సన్నిహితంగా పరిశీలించే అవకాశం కలుగుతుంది. ఉదా. ప్లేటో రచన 'రిపబ్లిక్' అరిస్టాటిల్ రచన 'పాలిటిక్స్' సెయింట్ అగస్టిన్ రచన ' సిటి ఆఫ్ గాడ్' మాకియావెల్లీ రచన 'దిప్రిన్స్' కార్ల్‌మార్క్స్ రచన 'దాస్ కాపిటల్' కౌటిల్యుని రచన 'అర్థశాస్త్రం' మొదలైనవి. ఇటువంటి మూల గ్రంధాల అధ్యయనము వలన మేధాశక్తి పెరగటమేగాక అంతర్గత మనోవికాసం కూడా ఏర్పడుతుంది.

**2.5.4.** రాజనీతి శాస్త్రం రూపొందించిన సిద్ధాంతాలు, సూత్రాలు, ధర్మాలు క్రమబద్ధమైన రాజనీతిజ్ఞతకు, రాజకీయ నాయకత్వానికి, ఆదర్శ పౌరసత్వానికి దోహదపడతాయి. రాజ్యాంగ విషయ పరిజ్ఞానం వలన మానవ సమాజాన్ని సంపూర్ణంగా అవగాహన చేసుకొనవచ్చు. మానవ పురోభివృద్ధికి సహాయ పడే మార్గాలను విధానాలను కనుగొనవచ్చు. ఆధునిక అణుయుగంలో ప్రపంచ రాజ్యాల మధ్య శాంతియుత సహజీవనం నెలకొల్పటంలో రాజనీతిశాస్త్ర విజ్ఞానం సహాయపడుతుంది.

**2.5.5.** రాజనీతి శాస్త్రం ద్వారా రాజ్యావతరణ, రాజ్య పరిణామాభివృద్ధి తెలుసుకొని, ఆధునిక రాజ్యాల స్వభావం వాటిపాత్రను నిర్ధారించవచ్చు. రాజకీయ సమస్యల పరిశీలనకు పరిష్కార మార్గాల అన్వేషణకు ఈ జ్ఞానము అత్యంత ఆవశ్యకము.

**2.5.6.** రాజ్యంలో నివసించె ప్రజల స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు న్యాయపాలనపై ఆధారపడతాయి. సమర్ధమైన న్యాయవ్యవస్థ ఉన్నప్పుడు సమర్ధమైన పాలన పొందవచ్చు. రాజనీతి శాస్త్రం సక్రమన్యాయ పరిజ్ఞానాన్ని కలిగిస్తుంది.

**2.5.7.** ప్రస్తుత ప్రపంచంలో బహుజాతి రాజ్యాలున్నాయి. జాతిపరమైన విభేదాలతోపాటు, వర్గ, వృత్తి, మత సంబంధమైన వ్యత్యాసాలున్నాయి. ఈ వర్గాలు తమ విద్యుక్త ధర్మాలను సక్రమంగా నిర్వహించాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలో వారు చైతన్య పూరిత భాగస్వాములుగా రాజ్య కార్యకలాపాలలో పాల్గొనటానికి, ఆదర్శ జీవనం పొందటానికి రాజనీతి శాస్త్ర విజ్ఞానం ఉపకరిస్తుంది.

**2.5.8.** మానవుడు ప్రతి నిత్యం ప్రభుత్వం రూపొందించే అసంఖ్యాకమైన నియమనిబంధనలు అనుసరించవలసి ఉంటుంది. పౌర సంస్థలు, నగరసంస్థలు, రాజకీయపక్షాలు మొదలైన విషయాలలో ప్రతి వ్యక్తికి రాజనీతితో జీవిత పర్యంతము ఎడతెగని సంబంధం ఉంటుంది.

## 2.6. సారాంశము

సంఘ నిర్మిత సంస్థలలో రాజ్యము ఒక ప్రధానమైన అధికారయుతమైన సంస్థ. మానవ జీవనానికి సంబంధించిన ఇతర సంస్థలన్నింటిని రారాజ్యము నియంత్రించి, నిర్దేశిస్తుంది. ఇతర సాంఘిక శాస్త్రాల నుండి పరిజ్ఞానాన్ని పొంది రాజనీతి శాస్త్రం సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక సమస్యలను పరిష్కరించె మార్గాలను అన్వేషిస్తుంది.

సాంఘిక శాస్త్రాలన్నింటికి మానవుడే మూలాధారం. అతడిచే నిర్మితమైనది మానవసమాజం. అందువలన అన్ని విషయాలలోమానవుడే ప్రమాణము (Man is the measure of all things-sophists) అని గ్రీకు రాజనీతి తాత్త్వికులు భావించారు. మానవనైజం, మానవప్రవర్తన, సాంఘికనడత, ప్రవర్తనలను సంపూర్ణంగా అవగాహన చేసికొని ఆదర్శ రాజ్య వ్యవస్థలను స్థాపించవలసి ఉంది. సర్వతోముఖాభివృద్ధి కల అత్యుత్తమ జీవనం అందించాలని నిరంతర ప్రయత్నం సాగించే రాజనీతి శాస్త్రం ఇతర సాంఘిక శాస్త్రాల కన్న అత్యంత ప్రాధాన్యత కలిగి ఉంది.

## అభ్యాసాలు

**I.** వ్యాస ప్రశ్నలు

1) రాజనీతిశాస్త్రం అధ్యయనములో కల పరిణామదశలను విశదీకరించుము.
2) రాజనీతి ఒక విజ్ఞానశాస్త్రము చర్చించుము.

**II.** సంక్షిప్త వ్యాస ప్రశ్నలు

1) రాజనీతి శాస్త్ర అధ్యయన ప్రాధాన్యతను తెలుపుము
2) రాజనీతి శాస్త్రము అత్యుత్తమ శాస్త్రముగా అరిస్టాటిల్ భావించుటకు గల కారణమేమి?

**III.** లఘు వ్యాస ప్రశ్నలు

1) మధ్యయుగపు మత రాజకీయాలు
2) రాజనీతి - నైతికత
3) ఒక కళగా రాజనీతి

**IV.** కుశాగ్రబుద్ధి ప్రశ్నలు

1. రాజనీతి శాస్త్ర అధ్యయనం గ్రీకు అధ్యాపకులైన .......... .......................................................................... లతో ప్రారంభమైనది.
2. వ్యక్తి విరాట్ స్వరూపమే రాజ్యము అని................................................................ పేర్కొన్నాడు.
3. రాజ్యము, చర్చిల మధ్య సంఘర్షణే ................................................................ రాజనీతి శాస్త్రము.
4. ............................................ తన ............................................ గ్రంథంలో మతాన్ని రాజకీయాల నుండి వేరుచేశాడు.
5. .................................................................. విషయ పరిజ్ఞానం వల్ల మానవ సమాజాన్ని అవగాహన చేసుకొనవచ్చు.

## ఉపయుక్త గ్రంథాలు


1) A.C. Kapoor — Principales of Political Science
2) Telugu Akademy- — రాజనీతి శాస్త్రము, భావనలు, సిద్ధాంతాలు, సంస్థలు


రచయిత **డా. యస్. కె. రావు**

పాఠం - 3

# రాజనీతి శాస్త్ర అధ్యయన పద్ధతులు: సాంప్రదాయ ఆధునిక వైఖరులు

## 3.0. లక్ష్యం

రాజనీతి శాస్త్ర అధ్యయన వైఖరులను పరిచయం చేయటం, ప్రతి ఒక్క వైఖరిలోని గుణదోషచర్చ, సాంప్రదాయిక వైఖరుల, ఆధునిక వైఖరుల పరిశీలన ఈ పాఠంయొక్క ప్రధాన లక్ష్యాలు.

## 3.1. విషయక్రమం:


3.2. పరిచయం

3.3. సాంప్రదాయ, వైఖరులు - లక్షణాలు

3.3. 1. తాత్విక పద్ధతి

3.3. 2. చారిత్రక పద్ధతి

3.3. 3. న్యాయశాస్త్ర పద్ధతి

3.3. 4. సంస్థాగత పద్ధతి

3.4. ఆధునిక వైఖరులు - లక్షణాలు

3.4. 1. వ్యవస్థాగత పద్ధతి

3.4. 2. నిర్మాణ విధుల పద్ధతి

3.4. 3. ప్రవర్తనా వాద పద్ధతి

3.4. 4. పరిశీలనాత్మక పద్ధతి

3.4. 5. తులనాత్మక పద్ధతి

3.4. 6. శాస్త్రీయ పద్ధతి

3.5. సారాంశము


## 3.2. పరిచయం

శాస్త్రీయమైన అధ్యయనానికి నిర్దిష్టమైన పద్ధతులు అవసరమౌతాయి. ఒక ప్రత్యేక పరిణామాన్ని గమనించి, అధ్యయనం చేసే విధానానికి వైఖరి అనిపేరు. విషయ సేకరణ, పరిశోధన, ఊహావాద విశ్లేషణ మొదలైనవి వైఖరిలో అంతర్భాగాలై ఉంటాయి. అనేకమంది మేధావులు, వేర్వేరు దృక్పధాలతో పై అంశాలను పరిశీలించవచ్చు. ఈ కారణంగా అనేక వైఖరులు రూపొందుతాయి. వైఖరులు, పద్ధతులు ఒకదానికొకటి అత్యంత సన్నిహితమైనవి. పద్ధతి అనేది వైఖరిలో ఒక భాగం. సమస్యలను ఎంపిక చేసుకోవడం, అవసరమైన విషయ సేకరణలకు సంబంధించిన ప్రమాణాలను గుర్తించటంను వైఖరి అనవచ్చు. వీటిని సమకూర్చుకొనేందుకు, ఉపయోగించు కొనేందుకు ఎంపిక చేసుకునే తీరు తెన్నులే పద్ధతులు.

## 3.3. సాంప్రదాయ, వైఖరులు - లక్షణాలు

అధ్యయన పద్ధతి ప్రధానంగా జ్ఞానాన్వేషణకు ప్రాతిపదికలను సూచించే ఒకవిధానం. రాజనీతి శాస్త్రంలో విభిన్న పద్ధతులు ఉపయోగించబడుతున్నాయి. విభిన్న వైఖరులలో సమస్యల ఎంపిక, విషయ సేకరణ, విశ్లేషణలు జరుగుతాయి. అందువలన రాజనీతిశాస్త్ర అధ్యయన వైఖరులను రెండు తరగతులుగా విభజించవచ్చు. (1) సాంప్రదాయ లేక ప్రామాణిక వైఖరి (2) ఆధునిక లేక అనుభవాధార వైఖరి. విలువలపై ఆధారపడేది సాంప్రదాయ వైఖరి. విలువలకు, నీతినియమాలకు, ధ్యేయాలకు అధిక ప్రాధాన్యతనిచ్చే చారిత్రక, వర్ణనాత్మక స్వభావం దీనికి ఉంటుంది. ప్రాచీన అధ్యయనాలలో అత్యధికశాతం సాంప్రదాయ వైఖరిని అనుసరించినవి.

ఆధునిక వైఖరి విలువలకు బదులుగా అనుభవైక వాదాన్ని ఆధారంగా చేసుకుంటుంది. ఇది విషయ వివరాలకు సంబంధించిన అనుభవాధార, శాస్త్రీయ పరిశోధన. రాజనీతి శాస్త్రాన్ని ఒక ప్రత్యేక "విజ్ఞాన శాస్త్రం" గా రూపొందించటానికి రాజనీతి శాస్త్రజ్ఞులు జరిపిన ఉద్యమ ఫలితమే ఆధునిక వైఖరి.

లక్షణాలు : రాజనీతికి, నైతికతకు మధ్య తేడాలేని కాలంలో ఒక సూత్రప్రాయ దిశోన్ముఖత (Normatitive Orientation) ఈ సాంద్రాయ వైఖరుల విశిష్టస్వభావంగా ఉంటుంది. ఉదా: ఆదర్శ రాజ్యవర్ణన. స్వభావరీత్యా సాంప్రదాయ వైఖరులు వర్ణనాత్మకంగా ఉంటాయి. వాస్తవాలతో ప్రమేయం లేకుండా సాంప్రదాయవేత్తలు తమ స్వంత అభిప్రాయాలు, అభిమానాలు కలిగి ఉండేవారు. కేవలం విలువలకు మాత్రమే ప్రాధాన్యతనిచ్చే అధ్యయనాలుగా సాంప్రదాయ వైఖరులు భావించబడ్డాయి, ఈ క్రింది అధ్యయనాలు అత్యంత ప్రధానమైన సాంప్రదాయ వైఖరులని చెప్పవచ్చు.

**3.3. 1. తాత్విక పద్ధతి (Philosophical Method) :** తాత్విక పద్ధతికి నిగమన పద్ధతి (Deductive Method) అని పేరు. అనేక సాధారణ సూత్రాలు, సత్యాల ఆధారంగా నిర్దిష్ట సిద్ధాంతాలు, నిర్ణయాలను ఉహాత్మకంగా కనుగొని, వాస్తవ పరిస్థితులకు అన్వయింప చేసే మార్గాలను సూచించటాన్ని తాత్విక పద్ధతి అని అంటారు. ఉదా॥ ప్లేటో తన "రిపబ్లిక్" గ్రంథములో పాలకులు తత్వవేత్తలై ఉండాలని సూచించాడు. ఒక ఆదర్శ రాజ్య నిర్మాణాన్ని ఊహించి సమకాలిక నగరరాజ్యాలకు అన్వయం చేయటానికి ప్రయత్నించాడు. రూసో, బొసాంకె, కాంట్, సిడ్జవిక్ మొదలైన వారు తాత్విక పద్ధతిని అనుసరించి రాజనీతి భావాలు చర్చించి, సిద్ధాంతాలు రూపొందించారు. వాస్తవ సమస్యలను ఉహాత్మక ప్రతిపాదనలతో విశ్లేంచటానికి ప్రయత్నించారు. ఈ పద్ధతి చారిత్రక సత్యాలకు ఆదర్శ ప్రతిపాదనలకు మధ్య సమన్వయం సాధించటానికి ప్రయత్నిస్తుంది.

విమర్శ : భవిష్యత్ రాజ్యాల స్థితిగతులను అధ్యయనం చేసే రాజనీతి శాస్త్రం కొంత వరకు ఊహాజనితమని (Speculative) చెప్పవచ్చు. రాబోయేకాలంలో రాజ్యము ఉండవలసిన విధానమును వర్ణించి అదే విధంగా ఉండాలని ఆశించడం ఆదర్శవాదంగా పరిగణించవచ్చు. ఆదర్శాలు భావాత్మకమైనవే కాని వాస్తవం కావు. వాస్తవాలను విస్మరించి ఉహాసౌధాలు నిర్మించుకొనటం తాత్వికవేత్తల ప్రధాన లోపం. ప్లేటో రచన 'రిపబ్లిక్', సర్ థామస్ మోర్ రచన 'ఉటోపియా'(Utopia) అనుగ్రంథాలు మానవనైజానికి, చారిత్రక వాస్తవాలకు పూర్తిగా భిన్నంగా ఉంటాయి. వాటిలో సూత్రీకరించిన సిద్ధాంతాలు వాస్తవంలో ప్రమాదకర పరిణామాలకు దారితీయవచ్చును. ఈ కారణంగా ఆదర్శ రాజ్యసూత్రాలు ప్రతిపాదించటానికి ముంధు అవి ఎంత వరకు ఆచరణీయమైనవో గమనించవలసి ఉంటుంది. ఆచరణ యోగ్యమైన ఆదర్శ రాజ్యాన్ని, ఆదర్శ ప్రభుత్వ నిర్మాణాన్ని నిరంతరం అన్వేషించటమే రాజనీతి శాస్త్ర ముఖ్యోద్దేశం.

**3.2. 2. చారిత్రక పద్ధతి (Historical Method):** రాజకీయ సంస్థలు ఒకే సారిగా సృష్టించబడవు. క్రమ పరిణామంద్వారా ఆవిర్భవించివృద్ధి పొందుతాయి. అనేక అంశాల ఆధారంగా రాజ్యము అనేకదశలలో పరిణామం పొందుతుంది. ఈ పరిణామాలను చరిత్ర ద్వారా తెలుసుకోవచ్చు. "రాజ్యాల చరిత్రలో పొందిన అనుభవం యొక్క ఫలితాలను క్రోడీకరించేందుకు రాజనీతి శాస్త్ర అధ్యయనం కృషి చేయాలని" లాస్కి అభిప్రాయం. రాజనీతిశాస్త్ర ప్రయోగాలకు చారిత్రక విజ్ఞానమే మూలాధారమని గిల్ క్రిష్ట్ భావించాడు. గతంలో ప్రభుత్వ విధానాలలో పరిణామాలు, చైతన్యవంతమైన చట్టాల నిర్మాణం, రాజ్యాధికారము కొరకు జరిగిన ఘర్షణలు, యుద్ధాలు మొదలైన వాటిని సాక్ష్యాధారాలతో చరిత్ర ద్వారా గ్రహించవచ్చు. చారిత్రక విశ్లేషణ లేని రాజనీతి ధర్మాలు నిరుపయోగం. భూత, వర్తమాన కాలాల విషయ పరిజ్ఞానం ద్వారా ముందు తరాలకొరకు నిర్మించే ఆదర్శ రాజ్యం యొక్క ప్రణాళికను రూపొందించవచ్చు. మాంటెస్క్యూ, హెన్రీమెయిన్, లాస్కీ, సీలీ, సాలిగ్నే మొదలైన రచయితలు రాజనీతి శాస్త్ర అధ్యయానానికి చారిత్రక పద్ధతిని అనుసరించారు.

విమర్శ: సమకాలికసమస్యలకుగాని, భవిష్యత్ అవసరాలకు గాని చారిత్రక పద్ధతి వలన ప్రయోజనం లేదని సిడ్జ్‌విక్ వంటి విమర్శకులు భావించారు. సమస్యలు కాలానుగుణమైనవి. వాటి పరిష్కార మార్గాలు కూడా ఆయా కాలాలకు మాత్రమే వర్తిస్తాయి. చారిత్రక విజ్ఞానం ద్వారా వర్తమాన సమస్యల పరిష్కార మార్గాలు అన్వేషించటం అవివేకము. గతంలోని సంఘటనలను యథాతథంగా తెలియచేయటమే కాని వాటి మంచి, చెడులతో చరిత్రకు నిమిత్తంలేదు. ఆకర్షణీయమైన బాహ్య సంఘటనల అంతరార్థము గ్రహించలేకపోవటం చరిత్ర ప్రధానలోపము. చారిత్రక సంఘటనల వివరణపై చరిత్రకారుని రాగద్వేషాల ప్రభావముండటానికి అవకాశముంటుందన్న జేమ్స్‌బ్రైస్ విమర్శ సబబైనదే. అందువల్ల చారిత్రక పద్ధతిని ఎంచుకున్న రాజనీతి శాస్త్ర పరిశోధకుడు వివేకంతో వ్యవహరించ వలసి ఉంటుంది.

**3.2. 3. న్యాయశాస్త్ర పద్ధతి (Legal Approach) :** రాజ్యసంస్థలు పనిచేసే విధానాన్ని న్యాయశాస్త్ర పరంగా పరిశీలించే పద్ధతిని న్యాయశాస్త్ర పద్ధతి అని అంటారు. న్యాయ శాస్త్రజ్ఞుల భావంలో రాజ్యమొక సాంఘిక సంస్థ. అది ఒక అధికారజనిత న్యాయసూత్రాల సమ్మేళన. చట్టాలు నిర్మించబడతాయి. అవి అధికారయుతంగా అమలు చేయబతాయి. సమర్థవంతంగా, ధర్మబద్ధంగా శాంతిభద్రతలకు రాజ్యం బాధ్యత వహిస్తుంది. న్యాయపరిధిలో శాసనాలున్నంతవరకు ప్రజల స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు కాపాడబడతాయి. హక్కులు, బాధ్యతల పరిధికి మానవుని సామాజిక జీవనం లోబడి ఉంటుంది. ఆధునిక యుగ ఆరంభంలో జీన్ బోడిన్, విక్టర్ హ్యూగో, గ్రోషియస్, థామస్ హాబ్స్ న్యాయశాస్త్ర పద్ధతిని విస్తృతంగా వివరించారు. సార్వభౌమాధికారం అందులో ఒక ప్రధానాంశం. బెంథామ్, జాన్ ఆస్టిన్, సర్ హెన్రీమెయిన్, డైసీ మొదలైన వారు ఈపద్ధతిని విరివిగా వినియోగించారు. రాజనీతి అధ్యయనంలో న్యాయపాలన దాని నుంచి జనించే స్వేచ్ఛ, సమానత్వాలు ముఖ్యాంశాలు. రాజ్యము కొన్ని చర్యలు చేపట్టడానికి, మరికొన్ని చర్యలు నిషేధించటానికి న్యాయ చట్టాలు సూచనలు చేస్తాయి.

విమర్శ : మానవ జీవితంలో న్యాయం అనేది కేవలం ఒక అంశం మాత్రమే. సమస్త రాజకీయ చర్యల ప్రవర్తనను అది ఒక్కటే నిర్దేశించలేదు. ఎందువలననగా రాజకీయ సంస్థల నిర్మాణం, నిర్వహణలను ప్రభావితం చేసే అంశాలు మరెన్నో ఉంటాయి. రాజ్యాంగేతర శక్తులను, వ్యక్తులను ప్రభావాలను విస్మరించటం న్యాయశాస్త్ర పద్ధతి యొక్క ప్రధాన లోపం.

**3.2. 4. సంస్థాగత పద్ధతి (Institutional Method) :** కార్య నిర్వాహక వర్గం, శాసన సభ, న్యాయశాఖలకు సంబంధించిన లాంఛన నిర్మాణాలను గురించి అధ్యయనం చేయటాన్ని సంస్థాగత పద్ధతి అని అంటారు. ప్రాచీన తత్త్వవేత్తలైన అరిస్టాటిల్ నుండి నేటి ఆధునిక గ్రంథకర్తలైన ఫైనర్ వరకు అనేకమంది రచనలలో సంస్థాగత వైఖరిని స్పష్టంగా తెలుసుకొనవచ్చు. రాజకీయ పార్టీల అధ్యయనం కూడా ఇందులో ఒక భాగమే.

విమర్శ : సంస్థాగత పద్ధతిలో అధ్యయనం చాలా పరిమితం గాను, సంకుచితంగాను ఉంటుంది. రాజకీయ వ్యవస్థల నిర్మాణంలో, అవి పనిచేసే పద్ధతిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా కీలక పాత్ర వహించే వ్యక్తుల స్వభావానికి గాని, ప్రభావానికి గాని ఈ పద్ధతి ప్రాధాన్యత ఇవ్వదు. కేవలం రాజకీయ సంస్థలను విశ్లేషించటమే ఈ పద్ధతి పరమార్థము. ఇటీవల అనేక ఆధునిక పద్ధతులు ఆవిర్భవించటంలో సంస్థాపక అధ్యయన ప్రాముఖ్యం తగ్గింది.

## 3.4. ఆధునిక వైఖరులు - లక్షణాలు

ఇటీవలి కాలంలో సాంప్రదాయ పద్ధతులకు భిన్నంగా విభిన్న వైఖరులు రాజనీతి శాస్త్ర అధ్యయనంలో చోటుచేసుకున్నాయి. ప్రత్యేకించి రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత నవ్యత పెరిగి, ఒక నూతన ఉద్యమం అమెరికాలో తలెత్తింది. సమాజ శాస్త్రం, మానవ శాస్త్రం, మనస్తత్వ శాస్త్రం మొదలైన ఇతర సాంఘిక శాస్త్రాలలో వస్తున్న మార్పులతో ప్రభావితమయిన ఈ ఉద్యమాన్ని ప్రవర్తనావాద ఉద్యమమని, ప్రవర్తనావాద వైఖరి అని పిలుస్తాము. దీనితోబాటు అనేక యితర వైఖరులు కూడా ఆవిర్భవించాయి. అవి:

**3.4. 1. వ్యవస్థా పద్ధతి ( Systems Approach) :** ఒక వ్యవస్థలో అంతర్భాగమైన అన్ని ఉపవ్యవస్థల మధ్య ఉండే సంబంధాన్ని అధ్యయనం చేయటమే వ్యవస్థాగత పద్ధతి. ప్రతి వ్యవస్థ అనేక ఉపవ్యవస్థల సముదాయము. అవి ఒకదానిపై ఒకటి ఆధారపడుతూ పరస్పర పోషకంగా ఉంటాయి. వాటన్నిటి సమగ్ర అధ్యయనం వలన వ్యవస్థ స్వరూప, స్వభావాలను వివరించవచ్చును. డేవిడ్ ఈస్టన్,

కప్లాన్ వంటి రచయితలు వ్యవస్థా పద్ధతిని విరివిగా వినియోగించారు. రాజకీయ వ్యవస్థలు పనిచేసే తీరుతెన్నులను వ్యవస్థా పద్ధతి పరిశీలిస్తుంది. వ్యవస్థ అనగా క్రియాశీల సంబంధాల సముదాయము. వాటి అధ్యయనం వల్ల గతిశీలమయిన రాజకీయ ప్రక్రియను సమగ్రంగా అర్థం చేసుకోవటానికి వీలు ఏర్పడుతుంది.

**3.4. 2. నిర్మాణ - విధుల పద్ధతి (Structural and Functional Approach) :** రాజకీయ వ్యవస్థలలోని వివిధ నిర్మాణాలు, అవి నిర్వహించె ప్రాథమిక విధుల అధ్యయనానికి నిర్మాణ - విధుల పద్ధతి అనిపేరు. ప్రతి సమాజం పరస్పర ఆధారిత నిర్మాణాల సముదాయం. ప్రతి నిర్మాణం ఒక ప్రత్యేక విధిని నిర్వహిస్తుంది. పరస్పర ఆధారితం కాబట్టి పరస్పర చర్య, ప్రతిచర్య నిరంతరం జరుగుతూ ఉంటాయి. వాటి పర్యవసానంగా వ్యవస్థ యొక్క సమతౌల్యస్థితి పరిరక్షింపబడుతుందని ఈ పద్ధతి నిరూపిస్తుంది. అందువలన విభిన్న రాజకీయ వ్యవస్థలలో ఉండే నిర్మాణాలు, విధులు నిశితంగా పరిశీలించే అవకాశం కలుగుతుంది. విధుల నిర్వహణకు జరిగే ఏర్పాట్లకే నిర్మాణాలని పేరు. ఉదా. రాజకీయ పార్టీ ఒక నిర్మాణం. రాజకీయ పార్టీ నిర్వర్తించే పనులు విధులు. నిర్మాణ, విధుల పద్ధతి ఒకవైపు రాజకీయ వ్యవస్థను గురించి అధ్యయనం చేస్తూ, ప్రధానంగా ఆ వ్యవస్థకు ఆధారితమైన నిర్మాణాలు, విధులపై పరిశీలన చేస్తుంది.

**3.4. 3. ప్రవర్తనా వాద పద్ధతి (Behaviourl Approach) :** ప్రవర్తనా వాదం యొక్క భావాలు ప్రథమంగా 1908లో గ్రహమ్‌వాలస్ గ్రంథం "Human Nature in Politics" లోను, ఆర్థర్ బెంట్లీ గ్రంథం "The Process of Government" లోను కనిపిస్తాయి. ఈ గ్రంథాలు మానవ ప్రవర్తన పరిశీలనావశ్యకతను తెలియచేస్తాయి. రెండవ ప్రపంచ యుద్ధానంతరం "రాజకీయ ప్రవర్తన" (Political Behavior) అనే పదము ప్రపంచరాజకీయాల అధ్యయనంలో బహుళ ప్రచారం పొందింది. వాస్తవంలో జరిగే సంఘటనలకు తగిన కారణాలు కనుగొనటమే ప్రవర్తనా పరిశీలన.

1950 ప్రవర్తనావాదం స్పష్టమైన విధానాలతో అధిక ప్రచారంలోకి వచ్చింది. డేవిడ్ ఈస్టన్, హెరాల్డ్ లాస్‌వెల్, జి.ఎ. ఆల్మండ్, డేవిడ్ ట్రూమన్, రాబర్ట్ ఎ.డాల్, ఛార్లస్ ఇ.మెరియమ్, డేవిడ్ ఈస్టన్, పావెల్ మొదలైన రాజనీతిజ్ఞులు తమ రచనల ద్వారా రాజకీయ సమస్యలను రాజకీయేతర పరిణామాల పూర్వాపర సంబంధాలను అధ్యయనం చేయడానికి ప్రయత్నించారు. రాజనీతికి మూలాధారము మానవుని ప్రవర్తన. రాజ్యపరంగా అతని చర్యలు (Actions) ప్రేరణలు (Motives) స్పందనలు (Reactions) అభిలాషలు (Expressions) లక్ష్యాలు (Objectives) అధ్యయనం చేయటమే ప్రవర్తనా వాదం. సాంప్రదాయ సిద్ధాంతానికి భిన్నంగా ప్రవర్తనా రాజకీయ సిద్ధాంతం వాస్తవికతలపై పరిశోధనలను జరుపుతుందని డేవిడ్ ఈస్టన్ అభిప్రాయం. అనుభవ వాదం ద్వారా రాజనీతిని మరింత శాస్త్రీయంగా రూపొందించే ప్రయత్నమే ప్రవర్తనా వాదమని రాబర్ట్ డాల్ వర్ణించాడు. అందువలన ప్రవర్తనా వాదపద్ధతిని శాస్త్రీయ దృక్పథం లేదా శాస్త్రీయ పద్ధతిగా భావిస్తారు. వాస్తవికతలను అన్వేషించడంలో అనుభవంతో కూడిన సాక్ష్యాధారాలు, విషయ సేకరణ, సాంకేతిక ప్రక్రియలు (శాంపిల్ సర్వే, స్కేలో గ్రామ్, ప్రశ్నావళి మొ.వి) వినియోగించబడతాయి.

విమర్శ : (1) పరిమిత అంశాల పరిశీలనకు మాత్రమే వినియోగపడుతుంది.

(2) యధాతధంగా రాజకీయ ప్రవర్తన కనుగొనటం అసాధ్యం

(3) నిరంతర చలనం గల మానవ ప్రవర్తన ఆధారంగా రూపొందించె సూత్రాలకు ప్రామాణికత లోపిస్తుంది.

(4) వాస్తవ సంఘటనలకే గాని శాశ్వత విలువలకు ప్రాధాన్యత లేదు.

పైవిమర్శలున్నప్పటికి ప్రవర్తనా వాదం వలన రాజనీతి శాస్త్ర పరిశోధనకు ఒక నూతన దృక్పథం ఏర్పడింది.

**3.4. 4. పరిశీలనాత్మక పద్ధతి (Observational Method) :** ప్రత్యేక సమయాలలో, ప్రత్యేక స్థలాలలో జరిగే సంఘటనలను నిశితంగా పరిశీలించే పద్ధతిని పరిశీలనాత్మక పద్ధతి అంటారు. జీవశాస్త్ర అధ్యయనంలో ఈ పద్ధతి వాడబడుతున్నది. లార్డ్ బ్రైస్ తన రచనలకు పరిశీలనాత్మక పద్ధతినే ప్రముఖంగా వినియోగించాడు. ఒకే ప్రాంతంలో స్థానిక సంస్థలకు మాత్రమే పరిమితం కాకుండా, వివిధ రాజ్యాంగాలను, వివిధ దేశాల ప్రభుత్వాలను, రాజకీయ సంస్థలను పరిశీలించాలని బ్రైస్ అభిప్రాయము. రాజ్యవ్యవస్థల సామర్థ్యము ప్రధానంగా మానవ నైజము, రాజకీయ ప్రవర్తనలపై ఆధారపడుతుంది. అందువలన రాజ్యాలు, ప్రభుత్వాల స్వరూపాలు, స్వభావాలు, ప్రయోజనాలు, గుణదోషాలు వివరించటానికి వివిధ రాజ్యాలు, వ్యవస్థల విధానాలు, రూపొందించె శాసనాలు, పరిపాలనా పద్ధతులు పరిశీలించవలసి ఉంటుంది.

విమర్శ : బాహ్య స్వరూపానికి, అంతర్గత స్వభావానికి భిన్నత్వం ఉండవచ్చు. పరిశోధనలో వ్యక్తిగత రాగద్వేషాల ప్రభావముండటానికి అవకాశముంది. అందువలన సుశిక్షితులు, నిష్పక్షపాతులైన పరిశోధకులు మాత్రమే పరిశీలనా పద్ధతికి న్యాయము చేకూర్చగలుగుతారు.

**3.4. 5.** తులనాత్మక పద్ధతి **(Comparative Method)** : రాజనీతిశాస్త్ర అధ్యయనంలో అరిస్టాటిల్ ప్రప్రథమంగా తులనాత్మక పద్ధతిని అనుసరించాడు. 158 నగర రాజ్యాంగాలను పరిశీలించి, వాటి తారతమ్యాలను విశ్లేషించి తన సిద్ధాంతాలను ప్రతిపాదించాడు. మాంటెస్క్యూ, బ్రైస్ మొదలైన వారు ఈ పద్ధతినే అవలంభించారు. వివిధ కాలాలకు చెందిన రాజకీయ సంస్థలను పరిశీలించి, సేకరించిన సమాచారము నుండి అవసరమైన విషయాలను ఎంచుకొని, వీటి సామ్యాలను, వ్యత్యాసాలను వివరించి మూల సిద్ధాంతాలను సూక్ష్మీకరించడాన్నే తులనాత్మక పద్ధతి అంటారు.

విమర్శ : సార్వజనీనమైన, అత్యుత్తమమైన ఒక ప్రభుత్వమున్నదని కాని, అటువంటి దానిని సర్వామోదముగా నిరూపించటానికి తులనాత్మక పద్ధతికి అవకాశము లేదు. ఒక రాజ్యానికి అనుగుణమైన విధానాన్ని వేరొక రాజ్యానికి అన్వయించే వీలులేదు. సాంస్కృతిక, నైతిక ఆర్థిక, రాజకీయ, మానసిక ప్రవృత్తులలో కల బేధాలవలన అనేక పరిమితులేర్పడతాయి. ఉదా: బ్రిటీష్ పార్లమెంటరీ విధానము యథాతథంగా భారతదేశానికి అన్వయించదు. తులనాత్మక పద్ధతిని వినియోగించటంలో మానవ ప్రవృత్తి, ఆహార వ్యవహారాలు, నైసర్గిక పరిసరాలు గమనించవలసి ఉంటుంది.

**3.4. 6.** శాస్త్రీయ పద్ధతి **(Scientific Method)** : రాజనీతి అంశాలను శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం చేయటంవలన సమస్యలను తార్కికంగా పరిశీలించి పరిష్కార మార్గాలు కనుగొనవచ్చు. సిద్ధాంతాలకు వాస్తవికత, ఆచరణ యోగ్యత లభిస్తుంది. రాజ్య కార్యకలాపాలపై రూపొందించిన సూత్రాలకు, ధర్మాలకు నిర్దిష్టత, ప్రామాణికత, పటిష్టత, ఆచరణ యోగ్యత లభిస్తాయి. శాస్త్రీయ పద్ధతిలో విషయసేకరణ, పరిశీలన, సిద్ధాంతీకరణ ఈ క్రింది ప్రధాన సాధనలద్వారా జరుగుతుంది:

1) పరిశీలన **(Observation) :** పరిశీలనకు అనుకూలమైన విషయాన్ని కనుగొని, దాని అర్హతలు నిర్ణయించటం

2) వర్ణన **(Discription) :** పరిశీలనలో ఉన్న విషయానికి సంబంధించిన అంశాలను వర్ణించి వాటి వాస్తవికతను నిరూపించటం

3) పరీక్ష **(Examination) :** అమలులో ఉన్న సిద్ధాంతము యొక్క ఫలితాలు ఎంతవరకు ఆశించిన స్థాయిలో ఉన్నయో పరీక్షించటం

4) సవరణ **(Correction) :** ఆశించిన ఫలితాలకు, లభించిన ఫలితాలకు మధ్య వ్యత్యాసమున్నపుడు తగిన విధంగా సిద్ధాంతమును సవరించటం.

5) ఊహ **(Prediction) :** ప్రస్తుత పరిస్థితుల్ని పూర్వానుభవాన్ని సమీక్షించి భవిష్యత్పరిణామాలను ఊహించటం

పై సాధనాల ద్వారా శాస్త్రీయ పద్ధతిలో రాజనీతి శాస్త్ర అధ్యయనము, పరిశోధన జరిపినపుడు నిర్దిష్టమైన పదజాలము (Terminology) ప్రక్రియలు(Processes) నమూనాలు(Models) లభిస్తాయి. వాటివలన ప్రాచీనయుగములో, మధ్యయుగములో, ఆధునిక యుగములో వెలువడిన రాజనీతి సిద్ధాంతాల సార్థకత నిర్ణయించవచ్చు.

## 3.5. సారాంశము

రాజనీతి శాస్త్రానికి సంబంధించిన ప్రధాన వైఖరులన్నిటికి వేటి ప్రత్యేకత వాటికున్నది. అదే విధంగా ప్రతి వైఖరిలోను కొన్ని లాభాలు, మరికొన్ని లోపాలు ఉన్నాయి నైతిక పునాదిని ధార్మిక లక్షణాలను నిర్దేశించటం తాత్త్విక వైఖరి లక్ష్యము. ప్రయోగాత్మక పద్ధతులపై నిర్ణయాలు ఎలా చేస్తారు; సంఘాలు, సంస్థలు మానవ ప్రవర్తనను ఎలా ప్రభావితం చేస్తాయి అనే అంశాలపై ప్రవర్తనా వాదం కేంద్రీకరిస్తుంది. వర్గ మార్పులు, కులీన వర్గ ప్రవర్తన, సాంఘిక స్థితి, సుస్థిరత, సమగ్రతల పై వ్యవస్థా వైఖరి కేంద్రీకరిస్తుంది.

పైన వివరించిన విధంగా పరిణామానికి సంబంధించిన వివరణను అనేక దృక్పధాల నుండి అధ్యయనం చేయవచ్చు. రాజనీతికి సంబంధించిన సాహిత్యం నిరంతరం పెరుగుతూనే ఉంది ఫలితంగా వైఖరుల సంఖ్య కూడా పెరగ సాగింది. ఏ ఒక్క వైఖరి సంపూర్ణమైనది కాదు. ఒక వైఖరిని ఇతర వైఖరులతో అవసరమైన మేరకు జోడించి అధ్యయనం చేసినపుడే రాజనీతి గురించి సమగ్ర అవగాహన కలుగుతుంది.

## అభ్యాసాలు

**I. వ్యాస ప్రశ్నలు :**

1) రాజనీతి శాస్త్ర అధ్యయనంలో సాంప్రదాయిక నైఖరులను వివరింపుము.
2) ఆధునిక నైఖరుల లక్షణా లేవి?
3) ప్రవర్తన వాద ప్రాధాన్యత ఎట్టిది?

**II. సంక్షిప్త వ్యాస ప్రశ్నలు :**

1) తాత్త్విక పద్ధతిని చర్చింపుము.
2) శాస్త్రీయ పద్ధతిని వివరింపుము.

**III. లఘు వ్యాస ప్రశ్నలు :**

1) చారిత్రక పద్ధతి.
2) నిర్మాణ, విధుల పద్ధతి.

**IV. కుశాగ్రబుద్ధి ప్రశ్నలు :**

1. సూత్రప్రాయ దిశోన్ముఖత ............................................................ విశిష్ట స్వభావంగా ఉంటుంది.
2. తాత్త్విక పద్ధతికి ....................................................... పద్ధతి అని పేరు.
3. రాజ్యసంస్థలు పనిచేసే విధానాన్ని న్యాయశాస్త్ర పరంగా పరిశీలించే పద్ధతిని ................................... పద్ధతి అని అంటారు.
4. రెండవ ప్రపంచ యుద్ధానంతరం ................................ అనే పదం ప్రపంచ రాజకీయాల అధ్యయనంలో బహుళ ప్రచారం పొందింది.
5. వివిధ కాలాలకు చెందిన రాజకీయ సంస్థలను పరిశీలించి వీటి సామ్యాలను, వ్యత్యాసాలను వివరించి మూల సిద్ధాంతాలను సూక్ష్మీకరించడాన్ని ................................. పద్ధతి అంటారు.

## ఉపయుక్త గ్రంధాలు


1) C.E. Merrian — New Aspects of Politics
2) J.R. Seeley — Introduction to Political Science
3) S.P. Varma — Modern Political Theory


రచయిత డా. యస్.కె రావు

పాఠం - 4

# రాజనీతి శాస్త్రం - ఇతర సాంఘిక శాస్త్రాలు

## 4.0. లక్ష్యం

సాంఘికశాస్త్రాల వికాసం, స్వతంత్ర విజ్ఞాన అధ్యయనాలుగా వాటి అభివృద్ధిని గురించి వివరణ -సమాజశాస్త్రం రాజనీతిశాస్త్ర వికాసం, ఇతర సాంఘికశాస్త్రాలైన చరిత్ర, అర్థశాస్త్రం, ప్రభుత్వ పాలన ప్రభావాన్ని చర్చించుట - రాజనీతిశాస్త్రం, ఇతర సాంఘిక శాస్త్రాల పరస్పర సంబంధం - భిన్నత్వాలను వర్ణించటం - ఈ పాఠం లక్ష్యం.

## 4.1. విషయక్రమం:


4.2. సాంఘికశాస్త్రాలు - వికాసం

4.3. రాజనీతి శాస్త్రం - ఇతర సాంఘిక శాస్త్రాలతో సంబంధం

4.3.1 రాజనీతి శాస్త్రం - చరిత్ర

4.3.2 రాజనీతి శాస్త్రం - అర్థశాస్త్రం

4.3.3 రాజనీతి శాస్త్రం - సమాజశాస్త్రం

4.3.4 రాజనీతి శాస్త్రం - ప్రభుత్వ పాలన


## 4.2 సాంఘిక శాస్త్రాలు - వికాసం

ఏదైనా ఒక విషయానికి సంబంధించిన క్రమబద్ధమైన జ్ఞానానికి శాస్త్రం అని పేరు. మానవుని వికాసం, పరిపూర్ణతలను గురించి తెలియజేసే అధ్యయనాలన్నీ సాంఘికశాస్త్రాలనవచ్చు. మానవులు ఒకరితో ఇంకొకరు కలిసి జీవనం సాగించటం ప్రారంభించిన నాటినుండి సమాజ వ్యవస్థ ఏర్పడింది.'కలిసి జీవించే ప్రజలే సమాజం.' అటువంటి ప్రజలు తమను క్రమబద్ధంగా పరిపాలించేటందుకు అధికారాన్ని తమ నాయకునికి అందచేశారు. 'ఆజ్ఞ', 'విధేయత', శిక్ష'లు ఏర్పడ్డాయి. రాజ్యవ్యవస్థ యొక్క సృష్టి జరిగింది. ఈ మానవ వికాసాన్ని పరిణామాన్ని, నిశితంగా పరిశీలించటానికి సాంఘికశాస్త్రాలు ఆవిర్భవించాయి.

19వ శతాబ్దం చివరి భాగంలోను 20 వ శతాబ్దం ఆరంభంలోను సాంఘిక శాస్త్రాలు ప్రత్యేక అధ్యయనాలుగా అవతరించాయి. ప్రతి ఒక్క సాంఘిక శాస్త్రము మానవ ప్రవర్తనకు చెందిన విభిన్న కోణాలను అధ్యయనం చేయ సాగింది. ఉదా: మానవుని ఆర్థిక కార్యకలాపాలను అర్థ శాస్త్రం, ప్రవర్తనలో గల మార్పులను మనస్తత్వ శాస్త్రం, రాజకీయ జీవనాన్ని రాజనీతి శాస్త్రం, మానవ జీవన పరిణామంలో జరిగిన సంఘటనలను చరిత్ర, అతని సమాజాన్ని, సంస్కృతిని సమాజ శాస్త్రం విశ్లేషణ చేయ సాగినాయి.

ఇదే మాదిరిగా మానవ స్వభావం, కార్యకాలాపాలు, ఆలోచనలు, కార్యాచరణ మొదలైనవన్నీ అధ్యయనం చేసేవి సాంఘిక శాస్త్రాలుగా రూపొందాయి. వీటన్నింటికీ మానవుడు కేంద్ర బిందువు. రాజనీతి అధ్యయనం మానవ ప్రవర్తనకు సంబంధించిన సకల విషయాలును చర్చించే ఒక సాధారణ అధ్యయనంగా చాలా కాలం వరకు భావించబడింది. అది ఒక ప్రత్యేక విజ్ఞాన శాస్త్రంగా రూపొందింది. సాంఘికాభివృద్ధిని ప్రభావితం చేయటంలో రాజ్య వ్యవస్థ పాత్ర ఎడల రాజనీతి శాస్త్రజ్ఞులు ప్రత్యేక శ్రద్ధాసక్తులు చూపించారు. సాంఘిక శాస్త్రాలు ప్రధానంగా మూడు అంశాలను పరిశీలిస్తాయి - మానవుడు, సమాజము, సాంఘిక జీవనం. ఈ కారణంగా సాంఘిక శాస్త్రాల మధ్య పరస్పరానుబంధాలు పెంపొందినవి. సాంఘిక విజ్ఞానం పెరిగిన కొద్దీ సాంఘిక శాస్త్రాలు అనేక శాఖలుగా విస్తరించి ప్రత్యేక అధ్యయనాలుగా పరిణితి చెందినవి.

## 4.2. రాజనీతి శాస్త్రం - ఇతర సాంఘిక శాస్త్రాలతో సంబంధం

రాజనీతి శాస్త్రానికి ఇతర అన్ని సాంఘిక శాస్త్రాలతో సన్నిహిత సంబంధం ఉంది. అన్ని సాంఘిక శాస్త్రాలు పరస్పరాధారితంగా, పరస్పర సంబంధితంగా ఉంటాయి. రాజనీతి శాస్త్రం మిగిలిన సాంఘిక శాస్త్రాల మీద, వాటి ప్రభావం సాంఘిక శాస్త్రాల మీద పడటం వలన రాజనీతి శాస్త్రానికి ఇతర సాంఘిక శాస్త్రాలతో గల పరస్పర అనుబంధాన్ని, వ్యత్యాసాలను గమనించ వలసి ఉంటుంది.

**4.2. 1.1 రాజనీతి శాస్త్రం - చరిత్ర (Political Science and History) పోలిక:** చరిత్ర ఒక ప్రయోగశాల వంటిది. ఇతర సాంఘిక శాస్త్రాలన్నిటికి చరిత్ర మూలాధారము. గత కాలాలకు సంబంధించిన రాజ్యాలు, రాజరిక వంశాలు, యుద్ధాలు, ఒడంబడికలు, రాజ్య పరిణామము, రాజకీయ సంఘటనలు, ఉద్యమాలు, జాతీయ - అంతర్జాతీయ సంస్థల కార్యకలాపాలు, విదేశీ వ్యవహారాలు మానవ నాగరికత, మత, సాంస్కృతిక, ఆర్థిక, సాంఘిక విషయాల లిఖిత పత్రమే చరిత్ర. ఆదిమ కాలంనుండి నేటివరకు మానవ జీవితంలో సంభవించిన సంఘటనలు, ఉద్యమాలు, వీటి పరిణితి, ఫలితాలు యధాతధంగా చరిత్ర వివరిస్తుంది.

**4.2. 1.2 రాజనీతి శాస్త్రం - చరిత్ర పరస్పర ఆధారితాలు:** రాజనీతిశాస్త్రానికి, చరిత్రకు అత్యంత సన్నిహిత సంబంధమున్నది. రాజనీతిశాస్త్ర విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవటానికి, వర్తమానాన్ని అర్థం చేసుకోవటానికి, భవిష్యత్తును ఊహించటానికి చరిత్ర ఒక మార్గదర్శి. "చరిత్ర అంటే గత రాజకీయాలు" అని ఫ్రీమన్ (Freeman) నిర్వచించాడు. "రాజనీతిశాస్త్రము లేని చరిత్ర ఫలరహితము చరిత్ర లేని రాజనీతి శాస్త్రము మూలరహితము" అని సీలీ అన్నాడు. "History without politics has no fruit Politics without History has no root" (Seelay). పై అభిప్రాయంలో కొంత వరకు అతిశయోక్తి ఉన్నప్పటికి ఈ రెండు శాస్త్రాలు పరస్పరాధారిత మన్నది నిర్వివాదాంశము.

రాజ్యము, రాజకీయ వ్యవస్థలు ఆది నుండి పరిణామ క్రమంలో వృద్ధి పొందినవే కాని ఒకే సారిగా సృష్టింప బడినవి కావు. ఈ వ్యవస్థల పరిణామ క్రమాన్ని చరిత్ర వివరిస్తుంది. ఈ వ్యవస్థ పుట్టుక, పరిణామ దశలు, వాటి లక్ష్యాలు విశిదీకరింప బడతాయి. ఆదర్శ రాజ్య నిర్మాణానికి అవసరమైన సమాచారం లభిస్తుంది. తులనాత్మకంగా వివిధ రాజ్య వ్యవస్థలను పరిణామ దశలను పరిశీలించేందుకు సహాయకారి చరిత్ర. ఈ విజ్ఞానం ద్వారా భవిష్యత్ రాజ్యవ్యవస్థలను ఆదర్శవంతంగా రూపొందించు కొనవచ్చు. చరిత్రకారుల వివరణలు రాజనీతి శాస్త్రజ్ఞులకు నిధులుగా ఉపయోగపడతాయి. ఇదే విధంగా రాజనీతి శాస్త్రం పై చరిత్ర ఆధారపడి ఉంది. రాజకీయ సంఘటనలు, ఉద్యమాల ప్రస్తావన లేని చరిత్ర నిస్సారము. జాతీయ తత్త్వం, సామ్రాజ్య తత్త్వం, వ్యక్తి శ్రేయోవాదం, సామాజిక వాదం మొదలైన రాజకీయ ఉద్యమాల వివరణ లేకపోతే 19వ శతాబ్దపు చరిత్ర నిరుపయోగమై, నిరర్ధకమై ఉండేది. అదే విధంగా భారత జాతీయ కాంగ్రెస్, ముస్లిమ్‌ల వేర్పాటు వాదము, 1909 భారత ప్రభుత్వ చట్ట నిరంకుశత్వము, 1919 చట్టములో సంస్కరణలు, సైమన్ కమిషన్, రౌండ్ టేబిల్ సమావేశాలు, కాబినెట్ మిషన్ ప్రణాళిక, 1947 భారత స్వాతంత్ర్య చట్టము మొదలైన రాజకీయ ఘటనలే మన స్వాతంత్రోద్యమ చరిత్రకు మూలాధారాలు.

**4.2. 1.3 రాజనీతి శాస్త్రం - చరిత్రల మధ్య వ్యత్యాసము :** రాజనీతి శాస్త్ర చరిత్రలు పరస్పరాధారిత మైనప్పటికి, వాటి మధ్య కొన్ని వ్యత్యాసాలు ఉన్నాయి. సమాచారాన్ని సేకరించడంలో రాజనీతి శాస్త్రం కొంతభాగం మాత్రమే చరిత్ర నుండి గ్రహిస్తుంది. గత కాలాలకు సంబంధించిన సమస్త విషయాలను గ్రంధస్థం చేయటం చరిత్ర కర్తవ్యము. వీటి నుండి అవసరమైన విషయాలను మాత్రమే సేకరించి, శాస్త్రీయంగా విభజించి రాజనీతి శాస్త్రం నిశితంగా పరిశీలిస్తుంది. విశ్లేషణాత్మకంగా రాజ్య కార్యకలాపాలు, రాజకీయ సంస్థలు, రాజ్యాంగాలు, వాటి గుణ దోషాలు, సాధ్యా సాధ్యాలు, పర్యవసాన ఫలితాలు తెలియ చేయవలసిన బాధ్యత రాజనీతిశాస్త్రంపై ఉన్నది. ఉదా. 1688లో బ్రిటన్ లో జరిగిన ఉదాత్త విప్లవము(Glorious Revolution), 1789 లో ఫ్రెంచి విప్లవం, 1917లో సోవియట్ విప్లవం, బ్రిటన్ ద్వారా ప్రచారం పొందిన రాజ్యాంగ బద్ధ రాజరికం(Constutional Monarchy) రాజనీతిశాస్త్రంలో ప్రముఖంగా చోటుచేసుకున్నాయి. అదే విధంగా రెండవ ప్రపంచ యుద్ధంలోని ఇరు వర్గాల యుద్ధ నైపుణ్యతతో ఈ శాస్త్రానికి సంబంధము లేదు. దానిని ప్రజా స్వామ్యానికి, నియంతృత్వానికి మధ్య సంఘర్షణగానే భావిస్తుంది.

గత కాల సంఘటనలను యథాతథంగా వివరించటమె చరిత్ర ధ్యేయము. రాజ్యము, రాజ్యాంగము, ప్రభుత్వాలకు సంబంధించిన సిద్ధాంతాలు, విలువలను పరిశీలించుట, భవిష్యత్‌లో రాజ్యాలకుండవలసిన ఆదర్శ విధానాలను ఊహాత్మకంగా వివరించుట రాజనీతిశాస్త్ర లక్ష్యం. ఈ కారణాల వలన, చరిత్ర, రాజనీతి శాస్త్రాలు ఆధునిక కాలములో స్వతంత్ర అధ్యయనాలుగా రూపొందినవి.

**4.3. 2 రాజనీతి శాస్త్రం - అర్థశాస్త్రం (Political Science & Economics) :** అంతులేని మానవుని కోర్కెలను, వాటిని తీర్చుకునే శాస్త్రాన్ని గ్రీకు సామాజిక శాస్త్రజ్ఞులు "రాజకీయ అర్థశాస్త్రం" (Political Economy) గా భావించారు. "ట్రీటైజస్ ఆన్ సివిల్ గవర్న్‌మెంట్" అనే తన గ్రంథంలో జాన్‌లాక్ అనే రాజనీతి శాస్త్రజ్ఞుడు చర్చించిన అనేక విషయాలు నేటి అర్థ శాస్త్ర పరిధిలో చేరినవి. గ్రీకుల భావంతో బ్రిటిష్ అర్థ శాస్త్రవేత్త ఆడమ్ స్మిత్ ఏకీభవించాడు. సార్వభౌమాధి కారికి, ప్రజలలకు సంపదచేకూర్చుటమే రాజకీయ - అర్థశాస్త్ర లక్ష్యమని అభిప్రాయ పడ్డాడు. కారల్ మార్క్స్ రచనలు ఆర్థిక - రాజకీయ పరిణామాలకున్న అవినాభావ సంబంధము ప్రతిబింబిస్తాయి. ఈ విధముగా 19వ శతాబ్దం వరకు అర్థశాస్త్రం, రాజనీతీ శాస్త్రాలు ఒకే అధ్యయనంగా భావించ బడినాయి.

ఈ సాంప్రదాయిక భావాలతో ఆధునిక ఆర్థిక శాస్త్రజ్ఞులు ఏకీభవించరు. మానవుడు ఆదాయం పొందే, వినియోగించె విధానాన్ని, వివరించే అర్థశాస్త్రం ఒక ప్రత్యేకమైన స్వతంత్ర అధ్యయనమని వీరు భావించారు. వస్తువుల ఉత్పత్తి (Production), వినియోగము (consumption), వినిమయము(Exchange), పంపిణి (Distribution) మొదలైన అంశాల పరిశీలన ద్వారా మానవాభ్యుదయానికి తోడ్పడటం ఆధునిక అర్థశాస్త్ర ప్రధాన లక్ష్యము. ఆర్థిక ప్రగతి సాధించి ఉత్తమ జీవనాన్ని సమకూర్చటమె అర్థశాస్త్ర పరమావధి.

**4.3. 2.1 రాజనీతి శాస్త్రం అర్థశాస్త్రం పరస్పర ఆధారితాలు :** రాజనీతి శాస్త్రం అర్థశాస్త్రం స్వతంత్ర అధ్యయనాలైనప్పటికి పరస్పరాధారితాలు. ఆహారము, వస్త్రము, వసతి మానవుని కనీసావసరాలు. తన అనంతమైన కోర్కెల సాధనలో కొన్ని నియమాలను మానవుడు పాటించటానికి సామాజిక, రాజకీయ వ్యవస్థలు, ప్రవర్తనా నియమావళిని రూపొందించాయి. నిత్యావసర వస్తువులు క్రమ బద్ధంగా అందు బాటులో ఉన్నంత వరకు నియమ బద్ధుడై, ఆదర్శ ప్రాయంగా మానవుడు ప్రవర్తిస్తాడు. రాజనీతిశాస్త్రానికి, ఆర్థికశాస్త్రానికి మానవ సంక్షేమమే ప్రధాన లక్ష్యము. శాంతి భద్రతలు స్వతంత్ర ప్రతిపత్తి, సమానావకాశాల ద్వారా సామజికాభివృద్ధిని సాధించి మానవాభ్యుదయమునకు తోడ్పడటం రాజ్యం యొక్క ధ్యేయం. ఆర్థికపర సమస్యలను పరిష్కరించి, దోపిడి వ్యవస్థను నిర్మూలించి, ధనిక - పేద వర్గాల మధ్య అంతరాన్ని రూపుమాపి సమసమాజ నిర్మాణం కొరకు రాజ్యం నిరంతర యత్నం కొనసాగిస్తుంది.

విభిన్న ఆర్థిక సమస్యలను రాజ్యము పరిష్కరించవలసి ఉంటుంది. ఉత్పత్తి విధానము, మారక ద్రవ్య సద్వినియోగము, ధరల అదుపు, బాంకుల నిర్వహణ, ఆర్థిక రక్షణ, వ్యవసాయాభివృద్ధి, పారిశ్రామికాభివృద్ధి మొదలైనవి కొన్ని ఉదాహరణలు. ఈ సమస్యల పరిష్కారాలు రాజనీతి విధానాలపై ఆధారపడి ఉంటాయి. ఒకనాటి జర్మనీ, ఇటలీ దేశాల ఆర్థిక దుస్థితికి అనాటి నాజి, ఫాసిస్ట్ ప్రభుత్వాల నియంతృత్వ విధానాలే ప్రధాన కారణం. నేటి అంతర్జాతీయ సమస్యలకు కూడా అంతర్గతంగా ఆర్థిక పరమైన కారణాలుంటాయి. ఆధునిక ప్రజాస్వామ్యాల విజయం అవి అనుసరించే రాజకీయ విధానాల కన్నా అవి సాధించే ఆర్థిక ప్రగతి పైనే ప్రముఖంగా ఆధారపడి ఉంటుంది. రాజకీయ సంఘర్షణలు, యుద్ధాలు, ఉద్యమాలను నిశితంగా పరిశీలిస్తే వాటి వెనుక ఆర్థికపరమైన కారణాలను గుర్తించవచ్చు. అదే విధంగా రాజ్య కార్యకాపాలపైన, ప్రభుత్వ విధానాలపైన ఆర్థిక పర సమస్యల పరిష్కారాల మార్గాలు ఆధారపడి ఉంటాయి.

**4.3. 2.2 రాజనీతి శాస్త్రం - ఆర్థిక శాస్త్రాల మధ్య వ్యత్యాసము :** 1) అర్థశాస్త్ర పరిధి పరిమితంగా ఉంటుంది. రాజనీతి శాస్త్ర పరిధి సువిశాలమైనది 2) సంపదకు సంబంధించినది అర్థశాస్త్రము (Science of Wealth). రాజ్య సంబధమైనది రాజనీతిశాస్త్రం 3) ఆర్థిక ప్రగతి అర్థశాస్త్ర లక్ష్యం. శ్రేయోరాజ్య నిర్మాణం రాజనీతిశాస్త్ర లక్ష్యం 4) భౌతిక విషయాల ప్రాధాన్యత కలది అర్థశాస్త్రం. ఆదర్శాలకు, విలువలకు ప్రాధాన్యత ఇచ్చేది రాజనీతిశాస్త్రం.

పైన వివరించిన సాంకేతిక పరమైన వ్యత్యాసాలున్నప్పటికి, రాజనీతిశాస్త్రం, అర్థశాస్త్రాలు పరస్పర పోషకాలు.

**4.3. 3 రాజనీతిశాస్త్రం - సమాజశాస్త్రం (Political Science & Sociology) :** సాంఘిక శాస్త్రాలన్నింటికి సమాజశాస్త్రం ఒక మాతృక వంటిది. మానవ నిర్మిత సంఘాలు, సాంఘిక వ్యవస్థలు, వాటి స్వరూపాలు, స్వభావాలు, లక్షణాలు, కర్తవ్యాలు, క్రమానుగత

పరిణామం మొదలైన విషయాలను సమాజశాస్త్రం వివరిస్తుంది. సామజిక, నైతిక, ఆర్థిక, సాంస్కృతిక వ్యవస్థలను వర్ణిస్తుంది. మానవునికి, సమాజానికి మధ్య సంబంధాలు, సామాజిక పరిస్థితులు, వివిధ వ్యవస్థల పుట్టుక, నిర్మాణము, పరిణామం, వికాసాలను ఈ శాస్త్రం విశ్లేషిస్తుంది. ప్రభుత్వాలు చేసిన సంఘ సంస్కరణ చట్టాలు, ప్రజల ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాలు, నాగరికత, సంస్కృతి, జీవనోపాధికై అనుసరించదగిన మార్గాలు సమాజశాస్త్రం ద్వారా తెలిసికొన వచ్చు.

**4.3. 3.1 రాజనీతి శాస్త్రానికి - సమాజ శాస్త్రానికి మధ్య పోలిక:** సంఘంలో సభ్యులుగా మానవ జీవితానికి సంబంధించిన విషయాలన్నింటిని అధ్యయనం చేసే సమాజశాస్త్ర పరిధి చాల విస్తృతమైనది. సమాజశాస్త్రం నుండి ఇతర సాంఘిక శాస్త్రాలు క్రమంగా వేరుపడి ప్రత్యేక అధ్యయనాలుగా రూపాంతరం చెందినవి. రాజనీతిశాస్త్రం కూడా సమాజశాస్త్రంలో ఒక భాగమేనని ప్రాచీన కాలంలో భావించబడింది. "రాజ్యము ఒక రాజకీయ సంఘము" అని మెక్ ఐవర్ తన" 'మోడరన్ స్టేట్' గ్రంథములో చెప్పాడు. రెండు శాస్త్రాలు పరస్పర అనుబంధితమే కాక అత్యంత సన్నిహితంగా కూడా ఉంటాయి. అనేక సామజిక సిద్ధాంతాలతో రాజకీయ భావన ఇమిడి ఉంది. రాజ్యము, రాజ్యవ్యవస్థ, వాటి నిర్మాణం, కార్య కలాపాలను రాజనీతిశాస్త్రం నుండి సమాజ శాస్త్రం గ్రహిస్తుంది. అదే విధంగా ప్రజల రాజకీయాసక్తి, పాలనా విధానాలు, వాంఛనీయ చట్టాలు మొదలైన వాటి వివరాలను సమాజశాస్త్రం నుండి రాజనీతిశాస్త్రం గ్రహిస్తుంది. ఈ విధంగా రాజనీతిశాస్త్రానికి సమాజశాస్త్ర జ్ఞానం ఎంత అవసరమో, సమాజశాస్త్రానికి రాజకీయ జ్ఞానం అంతే అవసరం.

ప్రస్తుత కాలంలో సమాజశాస్త్రంతో రాజనీతిశాస్త్రం అత్యంత సన్నిహిత సంబంధాన్ని ఏర్పరచుకొన్నది. ఒక వ్యక్తి రాజకీయ ప్రవర్తన మీద సమకాలిక, సాంఘిక వ్యవస్థల ప్రభావం ఎంతైనా ఉంటుంది. ఇదే కారణంగా 'రాజకీయ సమాజశాస్త్రం'(Political Sociology) ఒక స్వతంత్ర అధ్యయనంగా రూపొందింది. రాజకీయ జీవనంలో భాగాలైన రాజకీయ పార్టీలు, ముఠాలు, వత్తిడి సముదాయాలు (Pressure groups), ప్రజాభిప్రాయం చాల వరకు సామాజిక ప్రభావాలకు లోనవుతాయి. సామాజిక ధర్మాలున్నట్లే రాజకీయ ధర్మాలుంటాయి. ఒక ప్రత్యేక కాలంలో, ఒక నిర్దిష్ట ప్రదేశం యొక్క రాజకీయ జీవన అవగాహనలో సమకాలిక సాంఘిక పరిస్థితుల అధ్యయనం తోడ్పడుతుంది. ఉదా. భారత రాజకీయాలపై కుల, మత, సాంఘిక వర్గాల ప్రభావాన్ని విశ్లేషించటంలో సమాజశాస్త్రం సహాయపడుతుంది. అదే విధంగా సాంఘిక వ్యవస్థలపై రాజకీయ ప్రభావం ఉంటుంది.

**రాజనీతిశాస్త్రానికి - సమాజశాస్త్రానికి మధ్య వ్యత్యాసాలు:**

(1) సాంఘిక వ్యవస్థలన్నింటినీ చర్చించె సమాజశాస్త్ర పరిధి విస్తృతము. రాజ్యవ్యవస్థను మాత్రమే అధ్యయం చేసే రాజనీతిశాస్త్ర పరిధి పరిమితంగా ఉంటుంది. (2) మానవుని సంఘజీవనము అతి ప్రాచీనమైనది. రాజనీతిశాస్త్రము కన్నా సామాజిక శాస్త్రము అతి ప్రాచీనమైనది. (3) నిర్దిష్ట వ్యవస్థాపిత రూపమైన రాజ్యాన్ని మాత్రమే రాజనీతిశాస్త్రం అధ్యయనం చేస్తుంది. వ్యవస్థాపితం కాని ఆదిమ మానవుల జీవన విధానాన్ని కూడా సమాజశాస్త్రం చర్చిస్తుంది. (4) భూత, వర్తమాన కాలాల వ్యవస్థలను తెలిపేది సమాజశాస్త్రం. భూత, భవిష్యత్, వర్తమాన కాలాలకు సంబంధించి రాజకీయ వ్యవస్థలను రాజనీతిశాస్త్రం వివరిస్తుంది. కొంత వరకు రాజనీతిశాస్త్రం ఊహా జనితమైనదిగా భావించవచ్చు. పైన వివరించిన వైరుధ్యాలున్నప్పటికి, రాజనీతిశాస్త్రం, సమాజశాస్త్రం పరస్పరపోషకాలు.

**4.3. 4 రాజనీతిశాస్త్రం - ప్రభుత్వ పాలన :** ప్రభుత్వ పాలనకు సంబంధించిన సూత్రాలు, ధర్మాలు, సిద్ధాంతాలు, భావనలు, చర్యలను వివరించేది ప్రభుత్వ పాలన శాస్త్రం. రాజ్యం యొక్క లక్ష్యసాధనలో ప్రభుత్వం చేస్తున్న, చేయవలసిన, చేయదగిన కార్యకలాపాలను ప్రభుత్వ పాలన శాస్త్రం వివరిస్తుంది. 19వ శతాబ్ది వరకు ప్రభుత్వ పాలన, రాజనీతిశాస్త్ర శాఖగా భావించబడింది.

'రాజనీతి - పరిపాలన' ద్విభాగత్వ సిద్ధాంతం అనే నూతన భావనను ప్రతిపాదించి ఉడ్రోవిల్సన్ ఈ రెండు శాఖలకు వేర్వేరు అధ్యయనాల స్థాయిని కలిగించే ప్రయత్నానికి నాంది పలికాడు. విధానాల నిర్ణయం, నిర్మాణం రాజనీతిశాస్త్ర కర్తవ్యం. విధానాలను అమలుపరచడం పరిపాలన భాధ్యత. పాలనాధికారుల, రాజకీయాధికారుల స్థాయి, కర్తవ్యాలు, విధులలో వ్యత్యాసాలను పిఫ్నర్ వివరించాడు. రాజ్యం కేవలం పోలీస్ విధుల నిర్వహణ వరకే పరిమితంకాదు. శ్రేయోరాజ్యస్థాపన కోసం సర్వతో ముఖాభివృద్ధి సాధించవలసి ఉంది.

శాస్త్రీయ, సాంకేతిక విజ్ఞానం పెరుగుదల, సంక్షేమ సాధన, ఆదర్శ లక్ష్యాలు మొదలైన కారణాలవలన ప్రభుత్వ పాలన భాధ్యతలు అపరిమితంగా పెరిగాయి. విద్య, వైద్యం, వ్యాపారం, పరిశ్రమలు, వ్యవసాయం, విద్యుశ్చక్తి, సహకారం మొదలైన రంగాలలో ప్రభుత్వ ప్రమేయ మేర్పడింది. ప్రభుత్వ ప్రక్రియ జటిలమైంది. పాలనాధికారుల కర్తవ్యాలు, భాధ్యతలు విపరీతంగా పెరిగాయి. ఈ కారణాల వలన 'పరిపాలన' ఒక ప్రత్యేక అధ్యయనంగా అభివృద్ధి చెందింది. రాజనీతిశాస్త్రం నుండి వేరుపడి ప్రభుత్వ పాలన ఒక ప్రత్యేకశాస్త్రంగా రూపొందింది. ప్రభుత్వ రంగాలలో పాలనా సంబంధమైన కార్య నిర్వాహక వర్గాన్ని ప్రధానాంశముగా ప్రభుత్వపాలన శాస్త్రం అధ్యయనం చేస్తుంది. ప్రభుత్వ శాఖలు, వాటి నిర్మాణం, విధులు, ప్రభుత్వోద్యోగుల వర్గీకరణ (Classification'), పదవుల భర్తీ (Recruitment), శిక్షణ (Training), తటస్థ వైఖరి (Neutrality) మొదలైన ఉద్యోగి బృంద పాలనకు (Personnel Administration) సంబంధించిన అంశాలను శాస్త్ర బద్ధంగా ప్రభుత్వ పాలనాశాస్త్రం వివరిస్తుంది.

**4.3. 4.1 రాజనీతిశాస్త్రం - ప్రభుత్వపాలనా శాస్త్రం మధ్య పోలికలు:** రాజనీతిశాస్త్రం ప్రభుత్వపాలనా శాస్త్రాల మధ్య ద్విభాగత్వ సిద్ధాంతాన్ని (Dichotomy theory) ఆధునిక రచయితలు తిరస్కరించారు. రాజ్య లక్ష్య సాధనకు పరిపాలన నైపుణ్యత ఒక మార్గము. ప్రభుత్వం కర్తవ్యాలను వర్గీకరణ చేసి సంపూర్ణంగా వేరుపరచుట అసాధ్యం. శాసన నిర్మాణం, పరిపాలనలు వేర్వేరుగా గోచరించినప్పటికి కర్తవ్య నిర్వహణలో అనేక స్థాయిలలో ఒకటిగానే పనిచేస్తాయి. ఆధునిక ప్రజాస్వామ్యాలలో ఉన్నతాధికారులు విధాన నిర్ణయ రూపకల్పనలో పాల్గొంటారు. వీరు పాలనా సమస్యలను సమగ్రంగా పరిశీలించి అందించిన సమాచారం ఆధారంగా రాజకీయ వేత్తలు నిర్ణయాలు చేస్తారు. ఆధునిక కాలంలోవృద్ధిపొందిన దత్తశాసనాధికారాన్ని అనుసరించి చట్టాల అమలులో అధికారులు విధాన నిర్ణయాలు చేస్తారు. ఈ విధంగా పాలనా కర్తవ్యాలకు కొన్ని సమయాలలో రాజకీయ స్వభావం ఏర్పడుతుంది. ఈ కారణాల వలన విధాన నిర్ణయ కర్తవ్యాల నుండి పరిపాలన కర్తవ్యాలను వేరుపరచటం సమంజసం కాదని ఆధునిక శాస్త్రజ్ఞుల భావం.

**4.3. 4.2 రాజనీతిశాస్త్రం - ప్రభుత్వపారలనా శాస్త్రం మధ్య వ్యత్యాసాలు :**

(1) ప్రభుత్వపాలన కన్నా రాజనీతి శాస్త్ర పరిధి విస్తృతమైనది. (2) రాజనీతి శాస్త్రం యొక్క భవిష్యత్ దృక్పథం వలన ప్రభుత్వ పాలన ప్రభావితం అవుతుంది. (3) రాజ్య స్వభావం, కర్తవ్యాలు, రాజనీతికి ప్రధానాంశాలు. ప్రభుత్వ విధానాల అమలులో నైపుణ్యత సాధించటం పాలనా శాస్త్ర కర్తవ్యం. (4) ప్రభుత్వ పాలన సాంఘిక శాస్త్రం అయినప్పటికి సాంకేతిక విజ్ఞాన స్థాయికి చేరుకున్నధి. రాజనీతిశాస్త్రం సాంకేతిక జ్ఞానం కన్నా జీవిత విలువలకు ప్రాధాన్యత నిస్తుంది.

పైన వివరించిన వ్యత్యాసాలు సాంకేతిక పరమైనవేకాని వాస్తవంలో రాజనీతిశాస్త్రం, ప్రభుత్వపాలనలు పరస్పరాధారితాలు, పరస్పర పోషకాలు.

## అభ్యాసాలు

**I. వ్యాస ప్రశ్నలు :**

1) రాజనీతి శాస్త్రానికి చరిత్ర, అర్థశాస్త్రాలతో గల సంబంధమేమిటి ?

2) రాజనీతి శాస్త్రానికి సమాజశాస్త్రంతో గల అనుబంధ మెట్టిది ?

**II. సంక్షిప్త వ్యాస ప్రశ్నలు :**

1) సాంఘికశాస్త్రాల వికాసాన్ని వర్ణింపుము.

2) రాజనీతిశాస్త్రం, ప్రభుత్వ పాలనలు ఎంతవరకు పరస్పరాధారితాలు ? చర్చింపుము.

III. లఘువ్యాస ప్రశ్నలు :

1) రాజనీతి, అర్థశాస్త్రాల మధ్య వ్యత్యాసాలను గమనింపుము.

2) ద్విభాగిత్వ సిద్ధాంతము.

3) రాజకీయ సమాజశాస్త్రం.

IV. కుశాగ్రబుద్ధి ప్రశ్నలు

1. సాంఘిక శాస్త్రాలు..........................................................వ శతాబ్దం ఆరంభంలో ప్రత్యేక అధ్యయనాలుగా అవతరించినాయి.
2. సాంఘిక శాస్త్రాలన్నింటికి ...................................................... కేంద్రబిందువు.
3. చరిత్ర అంటే గత రాజకీయాలు అని ............................................. నిర్వచించాడు.
4. జాన్‌లాక్ అనే రాజనీతి శాస్త్రజ్ఞుడు చర్చించిన అనేక అంశాలు నేటి .................................. పరిధిలో చేరినవి.
5. సాంఘిక శాస్త్రాలన్నింటికి ............................................... ఒక మాతృక వంటిది.

## ఉపయుక్త గ్రంథాలు


1) Gilchrist, R.N. — Principles of Political Science.
2) Garner, J.W. — Introduction to Political Science
3) Lipset, S.M. — Politics and the social science
4) Krishna Rao, V. & Satyanarayana, V. — రాజకీయ సిద్ధాంతము; సంస్థలు.


రచయిత డా. యస్. కె. రావు

పాఠం - 5

# సమాజం - రాజ్యం - జాతి

## (Society - State - Nation )

### 5.0 లక్ష్యం

రాజనీతి శాస్త్ర అధ్యయనంలో ప్రధాన భావనలైన సమాజం, రాజ్యం, జాతులను గురించి స్పష్టమైన అవగాహన కల్గించడం; ఈ మూడు భావనల మధ్య ఉన్న పరస్పర సంబంధాన్ని, భేధాన్ని వివరించడం; వీటితో ప్రభుత్వానికి ఉన్న పరస్పరాశ్రయత్వాన్ని విశదపరచడం ఈ పాఠం లక్ష్యాలు.

### 5.1. విషయక్రమం :


5.2 సమాజం అంటే ఏమిటి ?

5.3 సమాజ జీవనం వలన ప్రయోజనాలు

5.4 ఆధునిక సమాజ స్వరూపం

5.5 సమాజం - వ్యక్తి

5.6 రాజ్యం అంటే ఏమిటి ?

5.7 రాజ్యం - పదవ్యుత్పత్తి

5.8 రాజ్య నిర్వచనాలు

5.9 రాజ్య లక్షణాలు

5.9.1 జనాభా 5.9.2 ప్రదేశం 5.9.3 ప్రభుత్వం 5.9.4 సార్వభౌమాధికారం 5.9.5 అంతర్జాతీయ గుర్తింపు

5.10 రాజ్యం - సమాజం - పరస్పర సంబంధం

5.11 రాజ్యం - సంస్థలు

5.12 ప్రభుత్వం అంటే ఏమిటి ?

5.13 రాజ్యం - ప్రభుత్వం - పరస్పర సంబంధం

5.14 జాతి అంటే ఏమిటి ?

5.15 జాతీయత అంటే ఏమిటి ? - వివరణ

5,16 జాతి - జాతీయత - జాతీయతా భావం

5.17 జాతీయతా భావాన్ని పెంపొందించే అంశాలు

5.17.1 ఒకే జాతి

5.17.2 ఒకే మతం

5.17.3 ఒకే భాష

5.17.4 ఉమ్మడి ప్రయోజనాలు

5.17.5 భౌగోళిక సాన్నిహిత్యం

5.17.6 ఒకే చరిత్ర - సంప్రదాయాలు

5.18 ఏక జాతి రాజ్యము.

5.19 జాతి రాజ్యం

5.20 జాతి స్వయం నిర్ణయాధికార సిద్ధాంతం

5.21 బహుళ జాతి రాజ్యం
5.22 సారాంశము

## 5.2. సమాజం అంటే ఏమిటి ?

ప్రకృతికి మకుటం మానవుడైతే, మానవుల సమూహము ఒక అందమైన సమాజమవుతుంది. వ్యక్తి జీవితానికి సంతృప్తినీ, సాఫల్యాన్ని కల్పించేది సమాజమే. సమాజంతో వ్యక్తికి అవినాభావ సంబంధముంది. వ్యక్తికి పరిపూర్ణత్వాన్ని కల్పించి పరమార్ధాన్ని ప్రసాదించేది సమాజమే. అయితే సమాజము అంటే ఏమిటి ? అనే ప్రశ్న సహజంగా ఉదయిస్తుంది. కలిసిమెలిసి జీవిస్తున్న వ్యక్తుల సమూహాన్నే సమాజము అంటారు. ఒక వ్యక్తితో సమాజం ఏర్పడదు. వ్యక్తుల కలయికే సమాజంఅవతరించటానికి కావలసిన లక్షణం. ఆమాటకొస్తే ప్రపంచంలో వున్న మానవులంతా కలిసి మానవసమాజంగా రూపొందుతారు. పరస్పరమైన సాంఘిక సంబంధాలతో పెనవేసుకుపోయిన వ్యక్తి జీవనవ్యవస్థను సమాజం అనవచ్చు. సమాజంలో ఎన్నో సంఘాలు ఉండవచ్చు. సంస్థలు వుండవచ్చు. వ్యవస్థలు వుండవచ్చు. వర్గాలు వుండవచ్చు. ప్రతి వర్గానికి తనదైన ప్రత్యేక సంస్కృతి వుండవచ్చు. ఇవన్నీ సమాజంలో అంతర్లీనాలైన అంశాలే. అందువలననే రాజనీతి శాస్త్రానికి 'పితామహుడు' గా పిలువబడే సుప్రసిద్ధ గ్రీకు తత్త్వవేత్త అరిస్టాటిల్ "మానవుడు సంఘజీవి" అన్నాడు. అనగా సాటిమానవునితో కలిసి జీవించటం సాటి మానవుడికి సహకరించటం, మానవుడికి జన్మత: వచ్చే గొప్పలక్షణాలు. మానవుడులేని సమాజము , సమాజమే అక్కరలేని మానవుడు ఊహాతీతాలు. కేవలం కల్పితాలు.

## 5.3 సామాజిక జీవనం వల్ల ప్రయోజనాలు :

మానవుడి జీవిత వికాసానికి, వ్యక్తిత్వ పరిపూర్ణతకు ఈ సంస్థలు, సంఘాలు ఆవశ్యకాలు. వివిధాలైన వ్యక్తిగత, సాంఘిక, ఆర్థిక సాంస్కృతిక, ఆధ్యాత్మిక, అవసరాలను తీర్చడానికి సంస్థలు దోహదం చేస్తాయి. సంస్థలు రెండు రకాలుగా వుంటాయి. ఒకటి నిర్బంధ సంస్థలు రెండు స్వచ్ఛంధ సంస్థలు. వ్యక్తి ఇష్టాఇష్టాలతో సంబంధంలేకుండా సభ్యత్వం పొందేవి నిర్బంధ సంస్థలు. ఇది రాజ్యము. ఇక వ్యక్తి కోరికపై సభ్యత్వంకలిగించేవి స్వచ్ఛంధ సంస్థలు. సామాన్యంగా సేవారూపకమైన విధులను స్వచ్ఛంధసంస్థలు నిర్వర్తిస్తాయి. సమాజము అతి విశాలమైన మానవ సమూహము కనుక సమాజం వలన ఒనగూడే ప్రయోజనాలు కూడా అపరిమితాలు.

**5.3. 1** సామాజిక జీవనం వలన వ్యక్తుల అవసరాలు తీరుతాయి. వారి ప్రాథమిక అవసరాలు నేరవేరుతాయి. కనీస అవసరాలు అయిన ఆహారము, బట్ట, వసతి, వైద్యం సామాజిక జీవనం వలన సులభంగా నెరవేరుతాయి.

**5.3. 2** సామాజిక జీవనంలో పరస్పర సహకారం అనేది అంతర ప్రాణం. దీనివలన వ్యక్తికి ప్రాణ రక్షణ లభిస్తుంది. ప్రాకృతిక వైపరీత్యాలు సంభవించినపుడు వ్యక్తిని ఆదుకొనేది సమాజమే. అలాగే క్రూర జంతువుల బారినుండే, సంఘ విద్రోహశక్తులనుండి మానవుడికి సమాజం రక్షణ కల్పిస్తుంది.

**5.3. 3** సమాజంలో వివిధ వృత్తులు చేపట్టినవాళ్లు వుంటారు. శ్రమ విభజన కారణంగా ప్రతి వ్యక్తికి సమాజంలో ఆదరణ, గుర్తింపు వస్తాయి. శ్రమ విభజన వలన సమాజం ఆర్థికాభివృద్ధిని సాధిస్తుంది. ఆర్థిక ప్రగతి వ్యక్తుల జీవన ప్రమాణాలను పెంచి జీవనాన్ని సౌభాగ్యవంతం కావిస్తుంది.

**5.3. 4** సామాజిక జీవనం వలన వ్యక్తి నైతిక అభ్యున్నతిని కూడా సాధిస్తాడు. సహన శీలత, త్యాగబుద్ధి, నిజాయితీ, మైత్రీ భావం వంటి ఉత్తమ లక్షణాలను వ్యక్తి సంతరించుకుంటాడు. అలాగే కారుణ్యాం, దాతృత్వం, సానుభూతి, సౌజన్యం వంటి ఉన్నతమైన మానవతా విలువలు వ్యక్తికి అలవడుతాయి.

**5.3. 5** విజ్ఞాన సాంకేతిక శాస్త్రాల అభివృద్ధి సమాజంలో సాధ్యమవుతుంది. పరంపరగా వస్తున్న విజ్ఞానాన్ని భద్రపరచి, మరింత వృద్ధి పరచి రాబోయే తరాలవారికి అందించటానికి , మహా ప్రవంతి లాగా సాగిపోయే సమాజమే మూలకారణము.

**5.3. 6** ప్రాచీనతనుండి నాగరికతకు నడిపించి, వ్యక్తి జీవన రీతులకు వన్నెలు దిద్ది అధునాతన సౌకర్యాలను సమాజం అందిస్తుంది. సంగీత సాహిత్యాలు, కళలు, నాగరికత వంటి పెక్కు ప్రయోజనాలు వ్యక్తుల సమిష్టి జీవనం వలన ఒనగూరుతాయి. అందువలననే

సమాజానికి మానవుడికి మధ్య విడదీయరాని సంబంధం వున్నది. అయితే మానవుడికి సమాజానికి మధ్య ఎలాంటి సంబంధం వుండాలి అనే ప్రశ్న ఉదయిస్తుంది.

సమాజానికి కుటుంబము మూలము. మేకైవర్ భావనలో పక్షులలోగాని జంతువులలోగానీ, మానవులలోగానీ, కుటుంబంతోనే సామూహిక జీవనం ప్రారంభమైంది. కుటుంబానికి రక్తసంబంధం ప్రాతిపదిక. కాగా వివాహము మొదలైన అంశాలవల్ల ఇది విపరీతంగా విస్తరించి ఒక పెద్ద సాంఘిక వ్యవస్థగా రూపొందింది కనుక పెక్కు కుటుంబాల సముదాయమే గ్రామము లేక సమాజం అని అరిస్టాటిల్ భావించాడు.

## 5.4 ఆధునిక సమాజ స్వరూపం

ఆధునిక సమాజం బహుముఖమైనది. శాఖోపశాఖలుగా విస్తరించిన మానవసంబంధాల కారణంగా నేటి సమాజము ఎంతగానో విస్తరించింది. నేటి సమాజంలో అసంఖ్యాకంగా వృత్తి సంఘాలు, వర్తక సంఘాలు, కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు, రాజకీయ సంఘాలు ఎన్నో మిళితమై యున్నాయి. వీటితోపాటు లక్షలాది స్వచ్ఛంధ సంస్థలుకూడా ఆధునిక సమాజంలో అంతర్భాగాలుగా ఉన్నాయి. ఇందులో ప్రతి సంఘానికి లేదా సంస్థకు నిర్దిష్టమైన లక్షణాలు, లక్ష్యాలు వుంటాయి. వ్యక్తులు తమకు ప్రయోజనం కలిగించే సంస్థలలోను, లేదా సంఘాలలోను సభ్యులుగా చేరతారు. తద్వారా వారి వ్యక్తిత్వాలను పెంపొందించుకోవటంతోపాటు నిర్దిష్టమైన ప్రయోజనాలను కూడా సాధించుకుంటారు. కుటుంబము ప్రాథమిక సంస్థ మానవ సమాజం సమున్నత సంస్థ. బంధుత్వం కుటుంబాన్ని సృష్టిస్తే, కుటుంబాలు సమాజాన్ని సృష్టించాయి. సమాజం రాజ్యాన్ని సృష్టించింది. వ్యక్తుల అవసరాలను బట్టి సంస్థలు ఏర్పడుతుంటాయి. ఈ విధంగా సంస్థలు, వర్గాలు సంఘాలు కలిస్తే ఏర్పడిన సమాజం ఈనాడు మానవ నాగరికతకు రక్షణకవచంగా , ప్రగతి సాధనంగా ఉపకరిస్తున్నది.

## 5.5 సమాజం - వ్యక్తి

వ్యక్తి కన్నా సమాజమే మిన్న. వ్యక్తి గతమైన సమాజ ప్రయోజనాలకు మధ్య ఘర్షణ ఉత్పన్నమైనపుడు సామాజిక శ్రేయాన్నే సమర్థించాలని ప్లేటో, హాబ్స్, రూసో వంటి ప్రాచీన రాజనీతివేత్తలు మొదలు గాంధీజీ వరకు భావించారు. సాంఘిక ప్రగతికి వ్యక్తులు సాధనాలు. విస్తృతమైన సాంఘిక శ్రేయస్సుకు పరిమితమైన వ్యక్తిగత ప్రయోజనాలను ఒక్కొక్కసారి త్యాగం చేయవలసి ఉంటుంది. అందువలననే కొంతమంది రాజనీతి శాస్త్రజ్ఞులు సమాజాన్ని మానవ శరీరంతో పోల్చారు. మానవశరీరంలోని అవయవాలన్నీ కలసి శరీర సమగ్రతను కాపాడే విధంగా వ్యక్తులందరు కలసి సమాజ సమగ్రతను పరిరక్షించాలి. ఈ సిద్ధాంతాన్నే 'అంగాంగి సిద్ధాంతము ' (Organic Theory) అంటారు. అనగా శరీరానికి అవయవాలు ఎంత ముఖ్యమో సమాజానికి వ్యక్తులూ అంతే ముఖ్యం.

అయితే సమాజం కన్నా మానవుడే ముఖ్యమనీ మానవ సౌఖ్యానికి సమాజం కృషి చేయవలసివుంటుందని జాన్‌లాక్, సువర్ట్ మిల్, ప్రభృతులు భావించారు. సమాజం వ్యక్తుల కోసం ఏర్పడిందని వ్యక్తి ప్రయోజనాలకు విరుద్ధంగా సమాజం పని చేయరాదని వీరు భావించారు. ఈ సిద్ధాంతాన్నే వ్యక్తి స్వేచ్ఛా వాదం అంటారు. అయితే ఈ రెండు వాదాలలోను గుణ దోషాలు కనిపిస్తాయి. సమాజాన్ని అందలం ఎక్కించి వ్యక్తి స్వేచ్ఛను హరించటం ఎంత అవాంఛనీయమో మనకు ముస్సోలినీ, హిట్లర్, ఖోమైనీ, వంటి నియంతలు నిరూపించారు. అలాగే అపరిమితనయిన వ్యక్తి స్వేచ్ఛ వలన సమాజంలో ఎంతటి దోపిడీ, అరాచకము జరుగుతుందో నడుస్తున్న చరిత్ర స్పష్టంచేస్తుంది. ఈ రెండిటి మధ్య ఏర్పడిన సంఘర్షణల ఫలితమే సమ సమాజభావము. "అందరి కోసం ఒకరు ఒక్కని కోసం అందరు అన్న స్ఫూర్తి ఎప్పుడూ ఆచరణ యోగ్యమయినది. నిజానికి సమాజానికి వ్యక్తికీ మధ్య అవినాభావ సంబంధమున్నది. వ్యక్తి సమాజము పరస్పర పోషకాలు. వ్యక్తులు సుఖంగా, శాంతి యుతంగా ఉండగలిగినప్పుడు సమాజం పురోగమిస్తుంది. సమాజంలో వ్యక్తుల మధ్య చక్కని స్నేహం సహకారం త్యాగబుద్ధి అవగాహన వున్నప్పుడే సమాజం భూతల స్వర్గం అవుతుంది.

## 5.6 రాజ్యం అంటే ఏమిటి ?

ఆధునిక కాలంలో State అనే పదాన్ని 16వ శతాబ్దంలో ఇటలీకి చెందిన మేకియవెల్లి అనే రాజనీతి తత్త్వవేత్త తన 'ప్రిన్స్' (Prince) అనే గ్రంథంలో ప్రయోగించాడు. అనాటి నుంచి రాజ్యము అనే పదము అత్యంత ప్రచారాన్ని పొందుతూ వచ్చింది. మానవుడు

నిర్మించుకొన్న మహా సంస్థ రాజ్యము. రాజ్యం సాంఘిక జీవనాన్ని నియంత్రించి క్రమబద్ధం చేస్తుంది. ఆదిమవాసుల కాలం నుంచి నేటి వరకు రాజ్య వ్యవస్థ అనంతమైన మార్పులు చెంది నేటి సమగ్ర రూపాన్ని రూపొందింది. ఇంతకు ముందే ప్రస్తావించినట్లు కుటుంబ వ్యవస్థ రాజ్యానికి ప్రాతిపదిక. కుటుంబాలు తెగలుగాను, తెగలు గ్రామాలుగాను, గ్రామాలు రాజ్యాలుగాను అవతరించాయి. మెకైవర్ అన్నట్లు బంధుత్వం సమాజాన్ని సృష్టించింది. సమాజం చివరకు రాజ్యాన్నే సృష్టించింది. మానవుడు సంఘ జీవే గాక రాజకీయ జీవికూడా అని అరిస్టాటిల్ పేర్కొన్నాడు. రాజ్యంలో నివసించడమూ మనిషిగా జీవించడమూ రెండు సమానమే అని అరిస్టాటిల్ భావించాడు. అంతేగాక రాజ్యంతో సంబంధం లేని వ్యక్తి దేవుడైన కావాలి లేదా పశువైనాకావాలి అని ఆయన నిర్దిష్టమైన అభిప్రాయము. కనుకనే మానవుడు రాజ్యంలో నిర్బంధముగా పుట్టుకతోనే సభ్యుడవుతాడు. రాజ్యం లేని సమాజం అరాచకానికి నిలయమవుతుంది. జనజీవనానికి శాంతి సౌభాగ్యాలను అభ్యుదయాన్ని రాజ్యం కల్పిస్తుంది. రాజ్యము రాజనీతి అధ్యయనానికి కేంద్ర బిందువు. మానవుడు పుట్టుకతోనే రాజ్యంలో సభ్యుడవుతాడు. తన సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి రాజ్యంపై ఆధారపడతాడు.

## 5.7. రాజ్యం - పద వ్యుత్పత్తి

రాజ్యం అనే పదము ఇటీవల కాలంలో విశేషమైన ప్రాచుర్యాన్ని పొందింది. 'వ్యక్తులపై చెలాయించబడు అధికారం రాజ్యం' అని మేకియవెల్లి పేర్కొన్నాడు. ప్రాచీన కాలం నాటి గ్రీకులు రాజ్యం అనే పదానికి సమానమైన అర్థాన్ని ఇచ్చే పోలీస్' (Polis) అనే పదాన్ని వాడారు. 'పోలిస్' అంటే నాటి కాలంలో నగర రాజ్యము (city-State) అని అర్థము. ఆనాటి గ్రీకు నగర రాజ్యాలు అతి చిన్నవి. జనభాకూడా చాల పరిమితంగా వందలలో వుండి ప్రజాస్వామికంగా పాలించబడేవారు. వాస్తవానికి నాటి నగర రాజ్యాలను జనాభా వైశాల్యానికి సంబంధించి నేటి గ్రామాలతో పోల్చవచ్చును. అయితే అవి స్వతంత్రమైన రాజ్యాలుగా గూడా భావించబడేవి కనుక వాటిని నగర రాజ్యాలు అని పిలిచేవారు. ఆనాటి నగర రాజ్యాలే ఈనాటి జాతి రాజ్యాలుగా పరిణామం చెందాయి. ఆధునిక కాలంలో రాజ్యం అనే పదాన్ని వివిధ సందర్భాలలో వుపయోగిస్తున్నారు. రాజ్యం అంటే ఇంగ్లీషులో స్టేట్ అని అర్థము. స్టేట్ (లేక) రాజ్యం అనే పదానికి చాల అర్థాలు వున్నాయి. ఒక దేశంలోని ప్రాంతాలను లేదా ఒక సమాఖ్య రాజ్యంలోని భాగాలను స్టేట్ అంటారు. ఉదాహరణకు అమెరికా సంయుక్త రాష్ట్రాలు. అలాగే భారత సమాఖ్యలో భాగాలైన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు. కర్ణాటక, కేరళ, ఒరిస్సా మొదలైన రాష్ట్రాలను కూడా మనం స్టేట్స్ అని అంటున్నాము. మరొక సందర్భంలో స్టేట్ అంటే ప్రభుత్వము అని అర్థము. ఉదాహరణకు State Guest, State Control అనే మాటలలో స్టేట్ అంటే ప్రభుత్వము అని అర్థము, కాని రాజ్యమూ ప్రభుత్వమూ ఒక్కటి కావు. ప్రభుత్వం రాజ్యం ప్రతినిధి మాత్రమే. అలాగే స్టేట్ అనే పదానికి సమాజము (Society) జాతి (Nation) అనే అర్థాలు కూడా వున్నాయి. కాని రాజనీతి శాస్త్ర అధ్యయనానికి సంబంధించినంతవరకు సాధారణంగా స్టేట్ అంటే రాజ్యము లేక దేశము అని అర్థము. ఉదా. భారత్, పాకిస్తాన్, యు.యస్.ఏ, శ్రీలంక, చైనా మొదలైనవి.

## 5.8 రాజ్యం - నిర్వచనము

రాజ్యనికి ప్రామాణికమైన నిర్వచనమంటు ఏదీలేదు. కానీ రాజ్యన్ని గురించిన చక్కని విశ్లేషణ, అవగాహన వున్నవి. రాజ్యం యొక్క స్వరూప, స్వభావ, కర్తవ్యాలను గురించిన ఏకాభిప్రాయం లేకపోవటం చేత రాజ్యాన్ని స్పష్టంగా నిర్వచించటం సాధ్యం కాదు. అయినా ఒక అవగాహనకై కొన్ని నిర్వచనాలను మనం పరిశీలించవచ్చు. ఒక నిర్ణీత భూభాగంలో చట్టబద్ధమైన ప్రభుత్వం కలిగిన జన సముదాయమే రాజ్యము అని నాటి అమెరికా అధ్యక్షుడు ఉడ్రో విల్సన్ నిర్వచించాడు.

State is a people organised for law within a definite territory - Wooodrow Welson.

ఇది రాజ్యానికి సంబంధించిన చక్కని సంక్షిప్త నిర్వచనము. దీని ప్రకారము ఒక నిర్ణీత ప్రదేశము, ప్రజలు, ప్రభుత్వము, రాజ్య మౌలికాంశాలు.

గార్నర్ నిర్వచనము మరింత స్పష్టంగా కన్పిస్తుంది. 'ఒక నిర్దిష్ట ప్రదేశంలో శాశ్వత నివాసులై వ్యవస్థాపిత ప్రభుత్వ విధేయులై వుండే స్వతంత్ర ప్రజా సముదాయమే రాజ్యము'. "The Stae is a community of persons, more or less, numerous, permanently occupying a definite portion of territory, independent or nearly so, of external control and

possessing an organised government to which the great body of inhabitants render habitual obedience." Professor Garner.

గార్నర్ నిర్వచనం రాజ్యమౌలికాంశాలను మాత్రమే గాకుండా వాటిస్వరూప, స్వభావాలను గూడా సూత్రీకరిస్తుంది. ప్రజలు ఒక నిర్ణీత ప్రదేశంలో స్థిరనివాసులై ఉండాలని, ప్రభుత్వం వ్యవస్థాపితమై ఉండాలని, ప్రభుత్వాధికారానికి అందరూ సహజమైన విధేయత కలిగి ఉండాలని, పైగా ఆ ప్రజలు బాహ్యనియంత్రణకు లోను కాకుండా స్వతంత్రులై వుండాలని దీని భావం. అందువలననే గార్నర్‌నిర్వచనాన్ని ఎక్కువమంది సమర్థిస్తారు. గార్నర్ నిర్వచనం ప్రకారం రాజ్యం ఏర్పడటానికి నాలుగు ప్రధాన లక్షణాలు వుండాలి.

1. ప్రజలు (Population) 2. ప్రదేశము (Territory) 3. ప్రభుత్వము (Government) 4. సార్వభౌమాధికారము (Sovereignity).

ప్రాచీన భారతీయ రాజనీతితత్త్వ వేత్త అయిన కౌటిల్యుడు రాజ్యాన్ని 'సప్తాంగస్వరూపం' అన్నాడు. అనగా రాజ్యం ఏర్పడటానికి ఏడు అంగాలు వుండాలి. అవి 1 స్వామి లేక ప్రభువు 2. రాష్ట్రము (ప్రదేశము లేక ప్రజలు) 3. అమాత్యులు లేక మంత్రులు 4. పురము (కోట) 5. కోశము లేక ధనాగారము 6.బలము లేక సైన్యము 7. మిత్రుడు లేక మిత్రరాజ్యాలు.

ఇటీవల కాలంలో రాజ్యానికి పర్యాయపదంగా రాజకీయవ్యవస్థ అనే పదాన్ని గేబ్రియల్ ఆల్మండ్ ప్రయోగించాడు. మరికొందరు రాజ్యం ఒక వర్గనిర్మాణం అని (Class Structure), మరికొందరు అధికార వ్యవస్థ (Power System) అని భావించారు.

## 5.9 రాజ్యము - లక్షణాలు

రాజ్యం ఏర్పడటానికి కొన్ని ప్రధానమైన అంశాలు అవసరం. పైన పేర్కొన్నట్లుగా అవి నాల్గు అంశాలు (1) ప్రజలు (2) ప్రదేశము (3) ప్రభుత్వము (4) సార్వభౌమాధికారము. ఈ నాల్గు అంశాలతోపాటు కొందరు రచయితలు మరొక అంశాన్ని గూడా చేర్చారు. అది - అంతర్జాతీయ గుర్తింపు. పైన పేర్కొన్న అంశాలలో ఏ ఒక్కటి లోపించినా అది రాజ్యము అనటానికి వీలుపడదు.

**5.9.1 జనాభా లేక ప్రజలు:** రాజ్యము మానవ మహాసంస్థ. ప్రజలు లేని రాజ్యాన్ని ఊహించలేము. అంటార్కిటికా వంటి నిర్జన ప్రాంతాలు రాజ్యాలుకాలేవు. కనుక రాజ్యనిర్మాణానికి మొట్ట మొదట ప్రజలు ఉండాలి. మానవ జీవనం కోసం ఉదయించి, జీవన వికాసం కోసం కొనసాగేదే రాజ్యము. అయితే ఒకరాజ్యంలో ఎంతమంది ప్రజలుండాలి అనే ప్రశ్న సహజంగా తలెత్తుతుంది. రాజ్యానికి నిర్ణీతమైన జనసంఖ్య అంటూ ఏదీలేదు. ప్రాచీన గ్రీకు నగర రాజ్యాలుగా చెప్పబడే ఏథెన్స్, స్పార్టాలలో జనాభా కేవలం కొన్ని వేలకే పరిమితమై యుండేది. అందువలన గ్రీకు తత్త్వవేత్త అయిన ప్లేటో ఆదర్శరాజ్యంలో పౌరులసంఖ్య 5,040కి మించగూడదన్నాడు. ప్లేటో శిష్యుడైన అరిస్టాటిల్ గూడా రాజ్యంలో జనాభా మరీ ఎక్కువగా కానీ మరీ తక్కువగా కానీ ఉండరాదని భావించాడు. ప్రత్యక్ష ప్రజాస్వామ్య ప్రవక్త రూసో తన ఆదర్శరాజ్యానికి జనసంఖ్యను 10 వేలుకు పరిమితం చేసాడు. జనాభా రాజ్యం పోషించగలిగినంత సంఖ్యలో మాత్రమే ఉండాలని పేర్కొన్నాడు.

ఆధునిక రాజ్యాలు జనబాహుళ్య రాజ్యాలు 125 కోట్ల జనాభాతో చైనా, సుమారు 100 కోట్ల జనాభాతో భారతదేశం నేడు మనకు కనిపిస్తున్నాయి. అలాగే మొనాకో, సాన్‌మారినో, వంటి రాజ్యాలు కేవలం వేల సంఖ్యలో జనాభాను కలిగి ఉన్నాయి. కనుక ఒక రాజ్య సంఖ్యతో నిమిత్తం లేకుండా ఈ దేశాలన్ని రాజ్యాలుగా గుర్తించబడుతున్నాయి. అధిక జనాభా ఉన్నందువలన లాభాలూ ఉన్నాయి నష్టాలు ఉన్నాయి. మానవ వనరులు ( Human Resources) కు మించిన విలువైన సంపద మరొకటి వుండదు. ఎక్కువ జనాభా ఉన్నందువలన దేశంలో గల ప్రకృతి సంపదను సద్వినియోగపరచుకోవడానికి దోహదం చేస్తుంది. అంతేగాక దేశరక్షణకూ పారిశ్రామికాభివృద్ధికి, హరితవిప్లవానికి, ఆర్థికాభివృద్ధికి కూడా అధిక జనాభా తోడ్పడుతుంది.

అయితే ఉత్పత్తి సాధనాలు, ప్రకృతి వనరులు పరిమితంగా ఉన్న దేశాలలో అపరిమితమైన జనాభా అరిష్టదాయకం. తనప్రజలకు కనీస అవసరాలు అయిన కూడు, గుడ్డ నీడలను తీర్చలేని రాజ్యంలో అధిక జనాభా చాలా భయంకరమైన పరిణామాలకు దారితీస్తుంది.

దారిద్ర్యం, వ్యాధి, నిర్లక్ష్యం, నిరక్షరాస్యత, వంటి భయంకర క్లేశాలు అధిక జనాభా వలన రాజ్యానికి సంక్రమిస్తాయి. అందువలననే అధిక జనాభా కల్గిన చైనా, భారత్ వంటి దేశాలు జనాభా నియంత్రణకు భారీఎత్తున ప్రోత్సాహకాలను ప్రజలకు అందిస్తున్నాయి.

**5.9.2 ప్రదేశము (Territory):** ప్రజలు వలె ప్రదేశం కూడా రాజ్యానికి మౌలిక లక్షణం. అసలు నిర్ణీతమైన భూభాగం అంటూ లేని రాజ్యాలు ఊహాతీతాలు. జనసంఖ్యలాగానే ప్రదేశానికి కూడా నిర్ణీతమైన వైశాల్యం అంటూ ఏదీలేదు. తక్కువో ఎక్కువో ప్రతి రాజ్యానికి నిర్ణీతమైన, తనదైన భూభాగం అంటూ వుండాలి. జిప్సీలకూ, సంచార జాతులకూ రాజ్యం అంటూ ఏదీ వుండదు. ఒక రాజ్యానికి ఉన్న భూభాగంతో పాటు నిర్ణీతమైన ఆకాశ భాగాన్ని కూడా ఆ రాజ్యపు ప్రాదేశిక వియత్తలం(Territorial Space) గా భావిస్తారు. అలాగే ఒక రాజ్యానికి సముద్ర తీరం ఉంటే సముద్రంలో కొంత మేరకు దాని ప్రాదేశిక జలాలు (Territorial Water) గా భావిస్తారు. ఒక రాజ్యపు భూభాగంలో వుండే పర్వతాలు, నదులు, అరణ్యాలు మాత్రమే కాక భూగర్భంలో ఉండే ఖనిజ సంపద, శైలసంపద కూడా ఆ రాజ్యానికే చెందుతుంది. ఒక రాజ్య భూభాగం సమగ్రంగా ఉండవచ్చు. లేదా చెల్లాచెదురుగా కూడా వుండవచ్చు. రాజ్యప్రదేశం ఒకే భూభాగానికి పరిమితమైతే ఆ ప్రజలలో ఉన్నతమైన దేశభక్తి, జాతీయత భావం వృద్ధిపొంది సమర్ధవంతమైన, శక్తివంతమైన ప్రభుత్వపాలనకు తోడ్పడుతుంది. ఒకరాజ్య భూభాగానికి సంబంధించి నిర్దిష్టమైన పరిమితి ఏదీ లేదు. నేటిప్రపంచంలో మనకు అతి చిన్న రాజ్యాలు, మరీ పెద్దరాజ్యాలు కూడా కన్పిస్తాయి. ఉదాహరణకు మొనాకో 8 చ.మైళ్ల విస్తీర్ణం కలిగివుంది. సాన్ మారినో 38 చ.మైళ్లు కలిగివుంది. అండోరా రాజ్యవిస్తీర్ణం 91 చ. మైళ్లు. అమెరికా 3 లక్షల, 22 వేల చ.మైళ్ల పెద్దరాజ్యంగా ఉండగా, భారతదేశం గూడా 1 లక్ష 56 వేల చ.మై.తో పెద్ద రాజ్యాల సరసన చేరుతుంది. కనుక రాజ్యానికి కావలసింది నిర్ణీత భూభాగమేతప్ప అది ఎంత విస్తారమైనది అన్న విషయం కాదు. ప్లేటో, అరిస్టాటిల్, రూసో, మాంటెస్క్యూ మొదలయిన వారు చిన్న ప్రదేశం కలిగిన రాజ్యాలే శ్రేష్ఠమని భావించారు. పెద్ద విస్తీర్ణం కలిగిన రాజ్యాలకు కొన్ని లాభాలున్నాయి. ఆర్థికంగా, సైనికంగా, పెద్దరాజ్యాలు ప్రాబల్యాన్ని కలిగి వుంటాయి. అలాగే చిన్న రాజ్యాలు ఆంతరంగికంగా సమర్ధవంతమైన పరిపాలనకు, శాంతి భద్రతల నిర్వహణకు దోహదం చేస్తాయి.

**5.9.3 ప్రభుత్వం (Government):** రాజ్యం ప్రభుత్వం లేకుండా ఏర్పడలేదు. ప్రభుత్వం రాజ్యానికి ప్రధాన అంగము. ప్రభుత్వం లేని జన సమూహం, అసంబద్ధమైన అరాచకమైన గుంపుగానే మిగిలిపోతుందని 'గెటిల్' పేర్కొన్నాడు. రాజ్యం తన యిష్టాయిష్టాలను ప్రభుత్వం అనే తన ప్రతినిధి ద్వారా రూపొందిస్తుంది. వ్యక్తం చేస్తుంది. ప్రభుత్వం ద్వారానే అమలుగూడా చేస్తుంది. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య సర్దుబాటు యంత్రాంగంగా, ప్రభుత్వం రాజ్యతంత్రాన్ని నిర్వహిస్తుంది. ప్రజల ప్రవర్తనను నియంత్రణ చేసి క్రమబద్ధంగా మలచి రాజ్య శాసనాలకు ప్రజలను తలవంచేటట్లు చేస్తుంది. ప్రభుత్వం రాజ్యం లోపల శాంతి భద్రతలను పరిరక్షించి ప్రజల నైతిక వాస్తవిక అభ్యున్నతికి కృషి చేస్తుంది. ప్రజల సర్వతోముఖాభివృద్ధికి అవిచ్ఛిన్నంగా, అహరహం పని చేస్తుంది. అంతేగాక దేశాన్ని ఇతర దేశాల బారినుండి రక్షించే బాధ్యతకూడా ప్రభుత్వానిదే. అందువలననే పౌరసమాజంలో వుండే ప్రముఖ ప్రగతి శీలక సంస్థయే ప్రభుత్వమని ప్రొఫెసర్ 'గిడ్డింగ్స్' అన్నాడు.

ప్రభుత్వంలో మూడు శాఖలుంటాయి. శాసనశాఖ, కార్యనిర్వాహణశాఖ, న్యాయశాఖలు. అలాగే వివిధ స్థాయిలలో ప్రభుత్వం పనిచేస్తుంది. జాతీయస్థాయిలో కేంద్రప్రభుత్వం, ప్రాంతీయ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం, స్థానికంగా పంచాయితీలు లేదా పురపాలక సంస్థలువంటివి పనిచేస్తాయి. అలాగే ప్రభుత్వం కూడా రాజరికం, కులీనపాలన, ప్రజాస్వామ్యం, నియంతృత్వం అనే వివిధరూపాల్లో వుంటుంది. అంతేగాక ఆ దేశ ప్రజల ఇష్టాన్ని బట్టి ప్రభుత్వ పద్ధతులుకూడా నిర్ణయించబడతాయి. ఉదా: పార్లమెంటరీ పద్ధతి, లేదా అధ్యక్షపద్ధతి.

**5.9.4 సార్వభౌమాధికారం (Sovereingity)** : సార్వభౌమాధికారం ఒక రాజ్యానికి వుండే అత్యున్నతమైన అధికారం. ఇది రాజ్యానికి ప్రాణప్రదమైనది. సార్వభౌమాధికారం లేనిదే రాజ్యానికి గుర్తింపురాదు. సార్వభౌమాధికారం లేని రాజ్యం ప్రాణం లేని శరీరం లాంటిది. ఇది ద్విముఖమైనది. అంతరంగిక సార్వభౌమత్వం, బాహ్య సార్వభౌమత్వం. ఒకరాజ్యం లోపలవుండే వ్యక్తులందరి పైన సంస్థలు అన్నింటిపైనా రాజ్యానికి మాత్రమేగల అత్యున్నతమైన అధికారమే ఆంతరంగిక సార్వభౌమాధికారం. రాజ్యానికి తప్ప రాజ్యం లోపల మరి ఏ ఇతర సంస్థకూ లేక వ్యక్తికి సార్వభౌమాధికారం వుండదు. ఈ లక్షణం వలననే రాజ్యానికి తిరుగులేని శాసనాధికారం, పాలనాధికారం, దండనాధికారం సంక్రమిస్తాయి.

దేశం తన రాజ్యం వెలుపల ఇతర రాజ్యాలతో సమానస్థాయిలో అంతర్జాతీయ వ్యవహారాలను నిర్వహిస్తుంది. ఇతర రాజ్యాల అధికారానికి లేదా ప్రాబల్యానికి తలవంచక పోవటం ఒక రాజ్యానికి వుండే బాహ్యసార్వభౌమత్వానికి నిదర్శనం. అయితే బాహ్య

సార్వభౌమాధికారం అనే భావనకు గెటిల్ వంటి రచయితలు ఆక్షేపణ తెలిపారు. ఎందుకంటే బాహ్యసార్వభౌమత్వం అన్నప్పుడు రాజ్యానికి ఇతర రాజ్యాల సరిహద్దులలో గుండా అధికారం ఉన్నదనే అర్ధం స్ఫురిస్తుంది. నిజానికి ఒకరాజ్యానికి మరొక రాజ్యంలో నివసించే ప్రజలపై ఎలాంటి అధికారం వుండదు. కనుక ఒక రాజ్యానికి బహిర్గతంగా వుండే సార్వభౌమత్వాన్ని స్వాతంత్రం అనాలని గెటిల్ పేర్కొన్నాడు. సార్వభౌమాధికారం ఆధునిక రాజ్యానికిగల ముఖ్య లక్షణం. ఈ ఒక్క లక్షణం లోపించి మిగిలిన మూడు లక్షణాలు (ప్రజలు ప్రదేశం, ప్రభుత్వం) ఉన్నా రాజ్యంగా గుర్తించబడదు. ఉదా: మనకు స్వాతంత్ర్యం రావటానికి పూర్వం (1947 ఆగస్ట్) భారతదేశం ఒక రాజ్యం కాదు. అపుడు మనకు ప్రజలు, ప్రభుత్వం, ప్రదేశం ఉన్నప్పటికి సార్వభౌమాధికారం లేదు. అప్పుడు భారత దేశం ఒక వలస దేశం మాత్రమే. లేదా బ్రిటిష్ సామ్రాజ్యంలో ఒక భాగం మాత్రమే. అలాగే ఐక్యరాజ్య సమితి గూడా ఒక రాజ్యంగా గుర్తించబడదు. ఎందుకంటే దానికి తనదైన భూభాగం అంటూ ఏదీలేదు. పైగా అందరి సభ్యదేశాలపై శాసనాధికారంగాని లేదా దండనాధికారం కాని, న్యాయబద్ధంగా లేదు. సార్వభౌమాధికారం అనేది రాజ్యలక్షణమే గాని, ప్రభుత్వ లక్షణం కాదు అన్న విషయాన్ని గుర్తించుకోవాలి. అయితే రాజ్యానికి వుండే సార్వభౌమాధికారాన్ని ప్రభుత్వం చెలాయిస్తుంది. మనం ముందు పేర్కొన్న - ప్రజలు, ప్రదేశం, ప్రభుత్వం సార్వభౌమాధికారం అనే నాల్గు అంశాలతోపాటు మరొక అంశం కూడా రాజ్యానికి అవసరమని రాజనీతిశాస్త్రజ్ఞులు కొందరు భావించారు. అది అంతర్జాతీయ గుర్తింపు.

**5.9.5 అంతర్జాతీయ గుర్తింపు :** ఒక నిర్ణీత దేశంలో వుండే ప్రజలపై ఒక రాజ్యానికి గల సార్వభౌమాధాకారాన్ని ఇతర రాజ్యాలు లాంఛనప్రాయంగా గుర్తించవలసివుంది. దాని వలన రాజ్యం ఉనికికి, పెద్దగా లాభం లేకపోయినా అంతర్జాతీయ గుర్తింపు అనేది ఒక లాంచనమైన అవసరం. పైగా మానవుడు తన మాతృదేశపరిధిని దాటి ప్రపంచ పౌరుడుగా పరిగణించవలసిన నేటికాలంలో ఒక రాజ్యం ఇతర రాజ్యాల గుర్తింపు పొందినప్పుడే దాని సార్వభౌమాధికారానికి విలువవుంటుంది. ఇతర రాజ్యాల గుర్తిపు లేనంత మాత్రాన ఒక రాజ్యం రాజ్యం కాకుండా పోదు. అలాగే రాజ్యానికి శాశ్వతత్వం (Permanence) ఉండాలని ప్రొఫెసర్ గార్నర్ పేర్కొన్నాడు. అలాగే ఒకరాజ్య ప్రజల యొక్క ఇచ్ఛ లేక సమ్మతి రాజ్యమౌలికాంశాలలో ఒకటని విలోబి భావించాడు.

## 5.10 రాజ్యం - సమాజం - పరస్పర సంబంధం

రాజ్యం, సమాజం అనే రెండు మాటలను పర్యాయపదాలుగా సందర్భాన్ని బట్టి వాడుతూవుంటారు. కాని రాజనీతి శాస్త్రంలో ఈ రెండిటికి మధ్య స్పష్టమైన తేడాలున్నాయి. అయితే గ్రీకు తత్త్వ వేత్తలయిన ప్లేటో, అరిస్టాటిల్ ఈ రెండిటిని ఒకటిగానే భావించారు. అయితే ఆనాటి గ్రీకు నగర రాజ్యాలకూ నేటి జాతిరాజ్యాలకూ పూర్తిగా తేడాలున్నాయి. రాజ్యం, సంఘం లేక సమాజము ఒకే భూభాగానికి సంబంధించినవైనా మౌలికంగా సాంఘిక వ్యవస్థలే అయినా ఈ రెండిటిని ఒకటిగానే భావించటం లేదా వ్యవహరించటం సరికాదని ఆధునిక రాజనీతి శాస్త్రజ్ఞులు భావించారు. మెకైవర్ ఇలా అన్నాడు : "సామాజిక వ్యవస్థను రాజకీయవ్యవస్థతో సమానంగా గుర్తించటం లేదా రెండిటిని ఒకటిగానే భావించటం వలన ఎన్నో సందిగ్ధతలు తలెత్తగల పొరబాటుని చేసినవాళ్లము అవుతాము. ఈ పొరపాటు వలన మనము రాజ్యాన్ని గానీ సంఘాన్నిగాని, పూర్తిగా అవగాహన చేసుకోలేము. కనుక రాజ్యాన్ని సంఘాన్నీ ఒకటిగానే భావించటం సమంజసం కాదు. 'మానవుడు స్వభావరీత్యా సంఘజీవి' అని ఏనాడో అరిస్టాటిల్ అన్నాడు. ఆయనే 'మానవుడు రాజకీయజీవి' అనికూడా అన్నాడు. దీన్నిబట్టి సాంఘిక జీవితానికీ రాజకీయ జీవితానికి మధ్య ఎంత సాన్నిహిత్యం ఉన్నదో మనకు తెలుస్తుంది. సామాజిక జీవనంలో పరస్పర సహకారం సామూహిక కృషి కన్పిస్తాయి. మానవజీవితాన్ని శోభాయమానం చేసుకోవడానికి సాంఘిక జీవనం నిరుపమానమైన పాత్రను వహిస్తుంది. అయితే రాజ్యం కూడా కుటుంబము, మతసంస్థలలాగే ఒక వ్యవస్థేనని మైటలాండ్, బార్కర్ భావించారు.

రాజకీయంగా వ్యవస్థీకృతమైన సమాజాన్నే రాజ్యం అనవచ్చు. బహుతావాదుల దృష్టిలో పైన చెప్పినట్లు సంఘంలోని పెక్కు వ్యవస్థలలాగె రాజ్యం కూడా రాజకీయమైన ఒక వ్యవస్థ. రాజ్యనికీ, సంఘానికీ మధ్యగల సంబంధం చాల సన్నిహితమే అయినా ఈ రెంటి మధ్య తేడాలు లేక పోలేదు. పరిణామక్రమంలో సమాజం ముందు పుట్టింది. తరువాత రాజ్యం అవతరించింది. కనుకనే మానవుడు మొదట సంఘజీవి అయినాడు. తరువాత రాజ్యాన్ని ఏర్పరచుకొని రాజకీయ జీవి అయినాడు. సంఘంలో అనేక సంస్థలుంటాయి. వాటిలోకొన్ని నిర్మాణాత్మకమైనవి కాగా మరికొన్ని తాత్కాలికంగా అవతరించి అంతరిస్తూవుంటాయి. రాజ్యం కేవలం తన భౌగోళిక సరిహద్దులకే పరిమితమై ఉంటుంది. సంఘం అపరిమితమైనది, నిరవధికమైనది. మానవ సమాజము అన్నప్పుడు అందులో ఎన్నో సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, ధార్మిక, వైజ్ఞానిక సంస్థలుంటాయి. కనుక ఆయా సంస్థల లక్ష్యాలను బట్టి సమాజం విస్తరించి ఉంటుంది.

మానవ సమాజం అన్నప్పుడు రాజ్యాల ఎల్లలను దాటి మానవాళిమొత్తానికి చెందిఉంటుంది. అయితే రాజ్యం కేవలం వ్యక్తి రాజకీయ వ్యవహారాలకు మాత్రమే సంబంధించినది. ఈ కోణంలో పరిశీలిస్తే రాజ్యం పరిధికన్నా సమాజపరిధి ఎంతో విశాలమైనది. సంఘం మానవుడికి సహజమైనది. కాని రాజ్యం మానవుడు ప్రయత్నపూర్వకంగా సృష్టించుకొన్న సంస్థ. రాజ్యం, సంఘం వాటి పనితీరులో గూడా విభేదిస్తాయి. బలప్రయోగాధికారంపై రాజ్యం అధికారాన్ని చెలాయిస్తుంది. కాని సమాజం సనాతనంగా వస్తున్న సంప్రదాయాలు ఆచారాలు ప్రాతిపదికగా ప్రజల ఆమోదంతో మాత్రమే పనిచేస్తుంది. అయితే సార్వభౌమాధికారం లేనటువంటి సంస్థ సంఘం. కనుక అది శాసించలేదు. ప్రజలను భౌతికంగా దండించనూ లేదు. ఇలా మనం పరిశీలిస్తే సమాజానికి రాజ్యానికీ మధ్యగల తేడాలు స్పష్టమవుతాయి. ఆ తేడాలను ఈ దిగువ పట్టికలో సమీక్షిద్దాము.

| సమాజం / సంఘం | రాజ్యం |
|---|---|
| 1. పరిణామ క్రమంలో రాజ్యాని కంటే ముందే సమాజం అవతరించింది | సంఘజీవి అయిన మానవుడు ప్రయత్న పూర్వకంగా రాజ్యన్ని సృష్టించుకున్నాడు. కాబట్టి సంఘం ఏర్పడిన తరువాత రాజ్యం అవతరించింది. |
| 2. సంఘం పరిధి రాజ్యం పరిధి కన్నా విస్తృతమైనది. ఉదా: యు. యన్.ఓ., అంతర్జాయతీయ రెడ్ క్రాస్ | రాజ్యం సమాజంలో ఒక భాగం మాత్రమే. ఇది భౌగోళికంగా పరిమితమైనది. |
| 3. సమాజానికి భౌగోళికమయిన సరిహద్దు లంటూ వుండాలనే నియమంలేదు | రాజ్యం అన్నప్పుడు నిర్దిష్టమైన ప్రాదేశిక సరిహద్దులుంటాయి |
| 4. సంఘం మానవుడి స్వాభావికము, సహజము అయిన ప్రేరణవల్ల ఏర్పడింది | రాజ్యం మానవప్రయత్న పూర్వకంగా ఏర్పడింది. |
| 5. సంఘానికి బహుముఖాలయిన విధులుంటాయి. మానవజీవితానికి సంబంధించిన అన్ని విషయాలలోను సంఘానికి ప్రమేయం వుంటుంది. | రాజ్యానికి దేశ రక్షణ, శాంతిభద్రతల నిర్వహణ వంటి నిర్దిష్టమైన విధులుంటాయి. |
| 6. సంఘం మానవుల పరస్పర సహకారంపై ఆధారపడి పనిచేస్తుంది. దీనికి దండనాధికారం ఉండదు. | రాజ్యనికి సార్వభౌమాధి కారం వుంటుంది. కనుక దండనాధికారం చెలాయిస్తుంది. |
| 7 సంఘంలో ప్రజలు సంప్రదాయాలనూ ఆచారాలను, నీతినియమాలను ఆధారంగా చేసుకొని జీవిస్తారు. ఇది ప్రధానంగా నైతికవ్యవస్థ | రాజ్యం శాసనాల ద్వారా ప్రజలను పాలిస్తుంది. ఇది ప్రధానంగా అధికారవ్యవస్థ |

రాజ్యం, సంఘం, పరస్పరం వేరుగా కనిపించినప్పటికీ ఈ రెండూ పరస్పర పూరకాలు. రాజ్యము సంఘపునాదులపై మనుగడ సాగిస్తుంది. సాంఘిక జీవనంలో రాజ్యానికి ఎనలేని ప్రాముఖ్యత వుంది. రాజ్యప్రమేయంలేని సాంఘిక జీవనం ఈ రోజుల్లో అనూహ్యమైనదని ఎర్నెస్ట్ బార్కర్ అన్నాడు.

## 5.11 రాజ్యం - సంస్థలు

ఒక నిర్ణీతమైన ప్రయోజనంకోసం, సంస్థలు ఏర్పడతాయి. ఇవి సమాజంలో అసంఖ్యాకంగా ఉదయించి వ్యక్తుల జీవితాలకు పరిపూర్ణత్వాన్ని ప్రసాదిస్తాయి. వ్యక్తులు బహు విధాలైన ప్రయోజనాలను ఆపేక్షించి ఈ సంస్థలను నిర్మించుకుంటారు. వృత్తి, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ, ధార్మిక, వర్తక ప్రయోజనాలకోసం వాటికి సంబంధించిన సంస్థలను వ్యక్తులు స్థాపిస్తారు. మనకు

సమాజంలో కనిపించే వివిధ వృత్తి సంఘాలు, సాంఘిక సంస్థలు, ఆర్థిక సంస్థలు, ధార్మిక సంస్థలు, సంగీతసాహిత్యనా ఇలాంటివన్నీ మన ప్రయోజనాలను నెరవేర్చటానికి మన జీవితాలను సాఫల్యంకావించటానికి ఏర్పడినట్టివే. అయితే ఈ సంస్థలు అన్నింటికీ, ఒకే లక్ష్యంగాని, ఒకే స్వభావం కాని ఒకే వ్యవస్థకాని వుండవు. ఈ సంస్థలలో కొన్ని శాశ్వతమైనవి. ఉదాహరణకు రాజ్యం శాశ్వతమైన మానవ సంస్థ. రాజ్యంలో ప్రభుత్వాలు మారవచ్చుకానీ రాజ్యం మారదు. కొన్ని సంఘాలు తాత్కాలికాలు. అవి పరిమితమైన ప్రయోజనాలకొరకు అవతరిస్తాయి. ఉదా: వరద బాధితుల సంఘం అగ్నిబాధితుల సంఘం మొదలయినవి.

సభ్యత్వాన్ని బట్టి సంస్థలను నాల్గురకాలుగా వర్గీకరించవచ్చు. అవి

1. జన్మతహ సభ్యత్వం లభించే సంస్థలు ఉదా: కుటుంబం.
2. వ్యక్తులు తమయిష్ట పూర్వకంగా సభ్యత్వాన్ని పొందే సంస్థలు ఉదా : రోటరీక్లబ్, సేవాసంస్థలు, క్రీడా సంస్థలు మొదలయినవి.
3. వత్తిడివల్ల లేదా అనివార్యమైన పరిస్థితుల వల్ల సభ్యత్వం లభించే సంస్థలు మరికొన్ని వున్నాయి. ఉదా : కార్మికసంఘాలు.
4. నిర్బంధంగా సభ్యత్వం లభించే సంస్థ. ఉదా : రాజ్యం

ప్రొఫెసర్ డామ్లే (Prof. Damle) అన్నట్లు వివిధరకాలైన సంస్థలు వ్యక్తి పురోగమనానికి కాకుండా సమాజ కళ్యాణానికి కూడా తోడ్పడేటట్లు వుండాలి. అపుడే వాటికి నిజమైన విలువకలుగుతుంది. ఈసందర్భంగా ఒక్క విషయం గుర్తుంచుకోవాలి. అది వివిధ సంస్థలమధ్య ఘర్షణ ఏర్పడినపుడు ఏం చేయాలి అనేది. అలాంటప్పుడు ఉన్నతమైన ప్రయోజనాలకై స్వల్పమైన లేదా తాత్కాలిక ప్రయోజనాలను త్యాగం చేయాల్సివుంటుంది. వంశంకోసం ఒక్కరిని, గ్రామంకోసం వంశాన్ని, దేశం కోసం గ్రామాన్ని త్యాగం చేయాలనే ధర్మం మనకు సర్వదా మార్గదర్శకం, అనుసరణీయం.

## 5.12 ప్రభుత్వం అంటే ఏమిటి ?

ప్రభుత్వం అనగా రాజ్యంలో ఉండే అధికారవ్యవస్థ. ఇది రాజ్యం యొక్క మౌలిక లక్షణం. ఇది రాజ్యంలోపల పరిపాలనను సాగించే అధికారిక వ్యవస్థ. రాజ్యం యొక్క ఇచ్ఛను ప్రభుత్వం వ్యక్తం చేస్తుంది. శాసనం చేస్తుంది. అమలుపరుస్తుంది. శాసన ధిక్కారానికి పాల్పడిన వారిని శిక్షిస్తుంది. రాజ్యంలో శాంతి బధ్రతలు నెలకొల్పుతుంది. ప్రజలదైనందిన అవసరాలను తీరుస్తుంది. అంతేగాక రాజ్యం తరపున ఇతర రాజ్యాలతో అంతర్జాతీయ వ్యవహారాలను నిర్వహిస్తుంది. అన్ని విషయాలలోను ప్రభుత్వం రాజ్యానికి అత్యంత విశ్వసనీయమైన, ప్రతినిధిగా వ్యవహరిస్తుంది. అందువలననే రాజ్యం తనసార్వభౌమాధికారాన్ని ప్రభుత్వానికి దత్తం చేసినట్లుగా స్ఫురిస్తుంది. రాజ్యం తరపున సార్వభౌమాధికారాన్ని ప్రభుత్వమే చెలాయిస్తుంది. గనుక స్థూలంగా పరిశీలిస్తే రాజ్యానికి ప్రభుత్వానికి మధ్య తేడావున్నట్లు కనిపించదు. ఆ మాటకొస్తే రాజ్యం, ప్రభుత్వం అనే పదాలను సర్వసాధారణంగా పర్యాయపదాలుగా వాడుకుంటాము. ప్రముఖరాజనీతి తత్త్వవేత్తలయిన థామస్‌హాబ్స్, హెగల్, రాజ్యానికి ప్రభుత్వానికి మధ్యతేడాలను పాటించలేదు. ఈ రెండు ఒకటిగానే కనిపించినా వాస్తవానికి రాజ్యము, ప్రభుత్వము ఒకటిగావు.

ప్రభుత్వం రాజ్యాంగ పరిధిలో మాత్రమే పనిచేస్తుంది. ప్రజాస్వామ్యంలో సార్వభౌమాధికారం ప్రజలకే చెంది వుంటుంది. కనుక ప్రజల తీర్పును ప్రభుత్వం శిరసావహిస్తుంది. అందువలననే ప్రభుత్వవిధానాలు ప్రజాభిప్రాయానికి అనుకూలంగా వుండటం తప్పనిసరి. ఆధునిక రాజ్యంలో ప్రభుత్వం క్రమక్రమంగా పటిష్టమవుతున్నది. అధికార కేంద్రీకరణ కారణంగా ప్రభుత్వం అత్యంత శక్తివంతమవుతున్నది.

## 5.13 రాజ్యం - ప్రభుత్వం - పరస్పర సంబంధం

రాజ్యానికి ప్రభుత్వానికి మధ్యగల సంబంధం యజమానికి సేవకుడికి మధ్యగల సంబంధం లాంటిది. ఈక్రింది పట్టిక రాజ్యానికి, ప్రభుత్వానికి మధ్యగల బేధాలను స్థూలంగా వివరిస్తుంది.

| రాజ్యము | ప్రభుత్వము |
|---|---|
| 1. రాజ్యం యజమాని. రాజ్యానికి ఉన్న నాల్గులక్షణాలలో ప్రభుత్వం ఒకటి మాత్రమే. | 1. ప్రభుత్వం రాజ్యానికి ప్రతినిధి. రాజ్యం ఆదేశాలను అమలుపరచడానికై ప్రభుత్వం ఏర్పడింది. |
| 2. రాజ్యం పరిధి, జనసంఖ్య రీత్యాకూడా విస్తృతమైనది. | 2. ప్రభుత్వం పరిధి పరిమితమైనది. ఇది కొద్దిమంది ఉద్యోగులతో ఏర్పడిన వ్యవస్థ. |
| 3. రాజ్యాధికారాలు స్వతఃసిద్ధాలు | 3. ప్రభుత్వాధికారాలు అన్నీ రాజ్యం ద్వారా సంక్రమించినవే |
| 4. రాజ్యానికి సార్వభౌమాధి కారం విశిష్ట లక్షణం. | 4. ప్రభుత్వానికి స్వతఃసిద్ధంగా సార్వభౌమాధికారం లేదు. రాజ్యం తరపున రాజ్యాధికారానికి లోబడి తగిన పరిమితులతో సార్వభౌమాధికారాన్ని ప్రభుత్వం చెలాయిస్తుంది. |
| 5. రాజ్యానికి స్వతఃసిద్ధంగా తన దైనరూపం అంటూ ఏదీలేదు. | 5. ప్రభుత్వరూపాన్ని రాజ్యమే రాజ్యాంగం ద్వారా నిర్ణయిస్తుంది. |
| 6. రాజ్యము శాశ్వతమైనది. సార్వభౌమత్వాన్ని కోల్పోయినపుడే రాజ్యత్వం నశిస్తుంది. | 6. కానీ ప్రభుత్వం తాత్కాలికమైనది. ఎన్నికలు, విప్లవాలు, తిరుగుబాట్లు ప్రభుత్వాలను తరుచూ మారుస్తుంటాయి. |
| 7. రాజ్యము ఏకరూపమైనది. ఇందులో రకాలు లేదా రూపాలు అంటూ ఏవీవుండవు. | 7. ప్రభుత్వం వివిధ రూపాలలో వుండవచ్చును. ఉదా : నియంతృత్వం, పార్లమెంటరీ, అధ్యక్ష ప్రభుత్వాలు. |
| 8. రాజ్యానికి పౌరవిధేయత నిర్బంధమైనది. | 8. ప్రజాస్వామిక రాజ్యాలలో ప్రభుత్వ విధానాలను విమర్శించేహక్కు ప్రజలకు ఉంటుంది. |
| 9. రాజ్యము అనేది ఒక మానసిక భావన మాత్రమే దీనికి నిర్దిష్టమైన భౌతిక ఆకృతి లేదు. | 9. ప్రభుత్వం అనేది రాజ్యవిధులను నిర్వహించే ఉద్యోగుల వ్యవస్థ. ఇది స్పష్టమైన యంత్రాంగాన్ని కలిగివుంటుంది. |

పై పట్టికను పరిశీలిస్తే రాజ్యానికీ ప్రభుత్వానికీ మధ్యగల సంబంధం స్పష్టమవుతుంది. ఈరెండిటి మధ్య ఏవోకొన్ని బేధాలు వున్నంతమాత్రాన పరస్పరం విరుద్ధమైనవిగా భావించటానికి వీలులేదు. మానవుడికి మేధస్సు ఎలాంటిదో రాజ్యానికి ప్రభుత్వం అటువంటిది.

## జాతి - జాతీయత - జాతీయతాభావం

### 5.14 'జాతి' అంటే ఏమిటి?

ఆధునిక రాజనీతి శాస్త్ర పరిభాషలో 'జాతి' అనేపదానికి స్పష్టమైన అర్థం వుంది. సాధారణంగా దేశము , రాజ్యము, జాతి అనే పదాలను ఒక్కొక్కసారి సమానార్థకాలుగా వాడుతుంటారు. అలాగే రాజ్యం, జాతి, జాతీయత అనే పదాలను కూడా పర్యాయ పదాలుగా వాడుతూ ఉండటం మనం గమనిస్తూ ఉంటాం. 'జాతి' అనే పదానికి లార్డ్‌బ్రైస్ ఒక చక్కని నిర్వచనాన్ని ఇచ్చాడు. దాని ప్రకారం స్వతంత్ర ప్రతిపత్తి గలిగి లేదా స్వతంత్ర ప్రతిపత్తి కోసం ప్రాకులాడుతూ ఒక రాజకీయ రూపాన్ని పొందిన జాతీయతే 'జాతి'.

## 5.15 జాతీయత అంటే ఏమిటి?

కాబట్టి జాతీయత ఒకరాజకీయ వ్యవస్థగా రూపొందనంతవరకు ఆ సమూహాన్ని మనము ఒక జాతిగా పరిగణించటానికి వీలుపడదు. కనుక రాజకీయంగా పరిశీలిస్తే జాతీయత తొలిసోపానం. జాతి తదుపరి సోపానం. జాతీయత ఒక రాజ్యరూపాన్ని పొందినప్పుడు 'జాతి' అవతరిస్తుంది. అంతమాత్రాన జాతీ, రాజ్యమూ ఒకటికావు. ఒకేజాతి రాజ్యంలో పెక్కు జాతీయతలు వుండవచ్చు.

## 5.16 జాతి - జాతీయత జాతీయతా భావము

ఆధునిక ప్రపంచ వ్యవహారాలలో జాతీయత, జాతీయతా భావం అనేవి చాల శక్తి వంతమైన అంశాలు. జాతీయత అనేది ఒక ఆత్మీయమైన లేదా మానసికమైన భావన. సృజనాత్మకమైన ఆధ్యాత్మిక భావమే 'జాతీయత' అని కొందరంటారు. జాతీయత ఒకే బాష, ఒకే మతము ఒకే ఆచార సాంప్రదాయాలు వల్ల ఉదయించే సమిష్టిభావము అని చెప్పవచ్చు. జాతీయత ఉద్భవించటానికి కొన్ని అంశాలు దోహదం చేస్తాయి. ఒకే జాతి, రక్తసంబంధము, ఒకేమతము, ఒకేభాష, భౌగోళిక సాన్నిహిత్యం ఒకే చరిత్ర వంటి పెక్కు అంశాలు జాతీయతను పరిపుష్టం చేస్తాయి. అయితే ఒక జాతీయత రాజకీయ స్వాతంత్ర్యాన్ని పొంది ఎప్పుడు ఒక ప్రత్యేక రాజ్యంగా ఏర్పడుతుందో అప్పుడు మరొక రాజ్యం నూతనంగా అవతరిస్తుంది. భారతదేశం నుండి వేరైన పాకిస్తాన్ ఒక స్వతంత్రరాజ్యంగా అలా అవతరించిందే. బంగ్లాదేశ్‌కూడా పాకిస్తాన్ నుంచి అదేరీతిని అవతరించింది. ఒక్కొక్కసారి అనేక జాతీయతలు కలిసి ఏకజాతిగా రూపొంది ఏకరాజ్యం ఏర్పడుతుంటాయి. స్విట్జర్లాండ్ వంటి రాజ్యాలు అలా ఏర్పడినవే. భవిష్యత్తులో "ప్రపంచ మానవజాతి సమాఖ్య" ఏర్పడి, ఒకే మానవశాసన సభ అవత ంచాలనే టెన్నిసన్ ఊహ నిజంకావటానికి జాతులమధ్య ఏకతాభావం వాంఛనీయం. కనుక పరిణామక్రమంలో జాతీయత జాతిని సృష్టించగా 'జాతి' రాజ్యాన్ని సృష్టించింది.

జాతీయతాభావం క్రమవికాసంతో బలపడిన భావన. ఇది మొదట యూరప్‌లో రూపురేఖలను సంతరించుకొని క్రమక్రమంగా ప్రపంచనలుమూలలకు వ్యాపించింది. మధ్యయుగాలలో జాతీయతా భావము ఉన్నట్లు తోచదు. 14వ శతాబ్దినాటికి జాతీయతాభావము అంకురించి 19వ శతాబ్దినాటికి బలపడింది. జాతీయతాభావము వ్యాప్తి చెందటానికి ఎన్నో కారణాలు దోహదం చేసాయి. వాణిజ్యకారణాలు, జాతీయ భాషలవికాసం, కేంద్రీకృత ప్రభుత్వాలు, ప్రొటెస్టెంట్ ఉద్యమం, ప్రజాసార్వభౌమాధికార సిద్ధాంతం, పారిశ్రామిక విప్లవం మొదలయినవి జాతీయతాభావాన్ని ప్రచారంలోకి తీసుకొని వచ్చాయి. కాగా 20వ శతాబ్దపు ప్రారంభం నుండి 'జాతుల స్వయం నిర్ణయాధికార సిద్ధాంతం'( Theory of National Self- determination) ప్రపంచంలో జాతులన్నీ స్వతంత్ర రాజ్యాలుగా అవతరించటానికి హక్కు కలిగివున్నాయి అనే వాదానికి బలాన్ని చేకూర్చింది. మొదటి ప్రపంచ యుద్ధానంతరం కుదుర్చుకున్న 'వెర్సైయిల్స్ సంధి' ( Treaty of Versailes (1919) ఈ సిద్ధాంతాన్ని ఆచరణలోకి తీసుకువచ్చింది.

## 5.17. జాతీయతా భావాన్ని పెంపొందించే అంశాలు

1) ఒకేజాతి 2) ఒకే మతం 3) ఒకే భాష 4) ఉమ్మడి ప్రయోజనాలు 5) భౌగోళికసాన్నిహిత్యం 6) ఒకే చరిత్ర - సంప్రదాయాలు మొదలైనవి జాతీయతాభావాన్ని పెంపొందించాయి. వీటిని గురించి సంక్షిప్తంగా తెలుసుకుందాం.

**5.17.1 ఒకే జాతి:** జాతీయత అనేది ఒక జాతి ప్రజలమధ్యనే రూపొందుతుంది, అని కొందరు భావించగా మరికొందరు ఆ వాదనను అంగీకరించలేదు. ఏ ఒక్కజాతి కూడా తన మాతృభూమిని తనకు మాత్రమే చెంది ఇతరులకు చెంది యుండలేదు, అని వాదించలేదు. ఒకేజాతి వారంతా కలిసికట్టుగా ప్రవర్తించవచ్చు. అలాగే విభిన్న జాతుల వారు కూడా సమైక్యతా భావంతో ఒకే జాతిగా మనుగడ సాగించవచ్చు. అమెరికా , స్విట్జర్లాండ్ వంటి రాజ్యాల ప్రజలే దీనికి ఉదాహరణ.

ప్రజలను సంఘటిత పరచటానికి ఒకే జాతి, ప్రజలమధ్య బంధుత్వాలు దోహదం చేస్తాయి. అయితే రెనాన్ అనే శాస్త్రజ్ఞుడు ఏ జాతి "స్వచ్ఛమైనది కాదు" అంటాడు. గతంలో ఎపుడైనా స్వచ్ఛమైన జాతి అంటూవుండి వుంటే, వలసలు, యుద్ధాలు, దండయాత్రలు, దేశాంతర ప్రయాణాలు, వర్ణాంతరవివాహాలు, వంటి పెక్కు కారణాల వలన అవి అంతరించిపోయి వుంటాయి. లేదా సంకరమైనా అయి వుంటాయి. ఆ మాటకొస్తే ఆధునిక జాతులన్నీ వివిధ జాతులనుంచి లేదా తెగలనుండి ఉత్పన్నమైనవే.

**5.17.2 ఒకే మతం :** మతం పునాదుల మీద రాజ్యాలు, లేదా జాతులు అవతరించాయి. అవే పునాదులు మీద సామ్రాజ్యాలు అవతరించాయి. మతం ఒక ఆధ్యాత్మికమైన విశ్వాసానికీ, ఒక నిర్దిష్టమైన జీవన విధానానికి సంబంధించింది. ఇది ప్రజలను బలీయంగా ప్రభావితం చేస్తుంది. సంఘటిత పరుస్తుంది. పాకిస్తాన్ వంటి మతరాజ్యాల అవతరణలో మతం ప్రాముఖ్యాన్ని స్పష్టం చేస్తాయి.

**5.17.3 ఒకే భాష :** ప్రజలలో జాతీయతాభావాన్ని సృష్టించి పరిపుష్ఠం చేయటంలో భాష నిరుపమానమైన పాత్రను పోషిస్తుంది. ఉమ్మడి భాష ఒక జాతి ప్రజల మధ్య ఉమ్మడి సాహిత్యాన్నీ, ఉమ్మడి ఆశయాలనూ, ఉమ్మడి జానపద గాథలనూ రూపొందిస్తుంది. భాష అనేది ఒక జాతికి ఆత్మవంటిది. అంతమాత్రాన ఒకేభాష ఒకే జాతిని రూపొందించలేదు. ఇంగ్లీషు భాష మాట్లాడే ప్రజలు పెక్కుజాతులుగా ఈనాడు ఏర్పడటం మనకు తెలిసినదే

**5.17.4 ఉమ్మడి ప్రయోజనాలు :** ఉమ్మడిప్రయోజనాలు లేదా సమిష్టి వ్యవహారాలు ప్రజాసముదాయంలో ఐక్యతాభావాన్ని పెంపొందిస్తాయి. వాణిజ్యం, పరిశ్రమలు, వంటి ఆర్థికాంశాలు బెల్జియం, హాలెండ్ వంటి రాజ్యాల అవతరణకు ఎంతో తోడ్పడ్డాయి. అలాగే సమిష్టి రక్షణ, ప్రయోజనాలు కూడా రాజ్య నిర్మాణానికి దోహదం చేస్తాయి. ఉదాహరణకు అమెరికాసంయుక్తరాష్ట్రాలు. అయితే సమిష్టి ప్రయోజనాలె జాతి ఆవిర్భావానికి, పూర్తిగా దోహదం చేస్తాయనటానికి వీలులేదు.

**5.17.5 భౌగోళిక సాన్నిహిత్యము :** జాతి ఆవిర్భావానికీ, మనుగడకు భౌగోళిక సాన్నిహిత్యం అవసరమని కొందరు వాదిస్తారు. ఈ అంశం ప్రధానంగా దేశభక్తిని పెంపొందిస్తుంది. భౌగోళిక సాన్నిహిత్యం వలన రాజ్యంలో ప్రజలు ఒకే రకమైన అనుభూతులను భావనలను పంచుకొంటారు గనుక అది వారికి మాతృదేశం పట్ల ఆదరాభిమానాలను పెంపొందిస్తుంది. "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి" 'జననీ, జన్మభూమి స్వర్గం కంటే గొప్పవి' అని దాని అర్థము.

**5.17.6 ఒకే చరిత్ర - సంప్రదాయాలు :** ఒకే చరిత్ర, సంప్రదాయాలు జాతీయతా భావం ఆవిర్భవించడానికి అత్యవసరమైన అంశాలు అని "రామ్‌సేమ్యూర్" భావించాడు. ఒకే చరిత్రను, ఒకే సంస్కృతిని, కలిగిన ప్రజలు భావసారూప్యతను పెంపొందించుకుంటారు. భారత ప్రజల మధ్య ఏకరూప్యతగలిగిన జాతీయతా భావానికి ఆ జాతికిగల ఒకే చరిత్ర, ఒకే సంస్కృతి ప్రధానమైన కారణాలుగా కనిపిస్తాయి. ఏ రెండుజాతులు ఒకే అంశం నుండి జాతీయతా భావస్ఫూర్తిని పొందటం జరగటం లేదని మెకైవర్ పేర్కొన్నారు. ఒక ప్రదేశంలో ఏదోఒక అంశం దుర్బలంగా వున్నా, ఇతర అంశాలు శక్తిమంతంగా వుంటే జాతీయతాభావం పటిష్ఠం అవుతుంది. జాతీయతా భావాన్ని కలగ చేయటానికి అనేక, భౌతికాంశాలు దోహదం చేసినా అది మౌలికంగా ఒక మానసిక భావన మాత్రమే. ఏ రూపంలో అయినా ప్రజా సముదాయంలో సమైక్యతా భావం అంటూ వుంటే వారిలో జాతీయతా భావం వున్నట్లే . తామంతా ఒకే జాతివారమనుకుంటే చాలు వారు ఒకే జాతివారు అవుతారు. కావలసిందల్లా "కలసిజీవించాలనే ప్రగాఢమైన కోరిక" అన్న టాయన్‌బీ అభిప్రాయం గుర్తుంచుకో తగినది.

## 5.18 ఏకజాతి రాజ్యము

ఒకరాజ్యంలోని ప్రజలు అందరూ ఒకే జాతికి చెందినట్లయితే దానిని 'ఏకజాతి రాజ్యము' అంటారు. బ్రిటన్, ఫ్రాన్స్ ఏకజాతిరాజ్యానికి ఉదాహరణలు. జాతీయరాజ్యాలు మొట్టమొదటి పవిత్ర రోమన్ సామ్రాజ్యంలో చర్చిపాలన ప్రాతిపదికగా ఏర్పడినట్లు చెప్పవచ్చు. యూరప్‌లో జాతి-రాజ్యాలు, పోలెండ్ విభజనతో ప్రారంభమైనాయి. కాలాంతరంలో జాతిస్వయం నిర్ణయాధికార సిద్ధాంత ప్రభావం వలన టర్కీ, గ్రీకు, బాల్కన్, జర్మనీ, రాజ్యాలు రూపొందినాయి. 'రాజకీయంగా సంఘటితమై స్వతంత్రంగా ఉంటున్న లేక ఉండాలని కోరుకుంటున్న ఒక జాతీయ భావంగల ప్రజలే జాతి' అని గార్నర్ భావించాడు. కనుక 1948 వరకు ప్రపంచంనలుమూలల విస్తరించి యున్న యూదులు జాతీయ సముదాయంగానూ, ఆ సంవత్సరంలో వారికి ప్రత్యేక రాజ్యం ఏర్పడినప్పటినుంచి ఒక జాతిగాను పరిగణించ బడతారు. ఒక జాతీయ సముదాయం రాజకీయ సూత్రంపై వ్యవస్థీకరించినప్పుడు మాత్రమే జాతి అవుతుంది.

## 5.19. జాతి - రాజ్యం

పైన పేర్కొన్నట్లు జాతి, రాజ్యం ఒక్కటే అన్న భావాన్ని చాలామంది వ్యక్తపరిచారు. హేస్ (Hayes) అనే శాస్త్రజ్ఞుడి దృష్టిలో రాజకీయ ఐక్యత, సార్వభౌమత్వంతో కూడిన స్వాతంత్ర్యాన్ని పొందిన ఒక జాతీయ సముదాయం జాతి అవుతుంది. అలా ఏర్పడిన జాతినే జాతిరాజ్యం లేదా జాతీయరాజ్యం అని అనవచ్చునని హేస్ పేర్కొన్నాడు. అందువలన జాతి, రాజ్యం రెండు సమానార్థకాలుగా

భావించవచ్చు. ఐక్యరాజ్య సమితి అనే అంతర్జాతీయ సంస్థను ఇంగ్లీషులో United Nations Organisation అంటున్నాము ఇక్కడ జాతి (Nation) అనే పదానికి రాజ్యం అనే అర్థం.

## 5.20 జాతి స్వయం నిర్ణయాధికార సిద్ధాంతం

ప్రతి జాతీయసముదాయానికి స్వతంత్రంగా ఉండటానికి, అంటే రాజ్యంగా ఏర్పడటానికి స్వంత హక్కు వున్నది - అని చెప్పేదే జాతిస్వయం నిర్ణయాధికార సిద్ధాంతం. వియన్నా కాంగ్రెసు (1815) కాలం నుంచి 19వ శతాబ్దం చివరి వరకు 'ఒకే జాతీయ సముదాయం ఒకే జాతి రాజ్యం' అనే సిద్ధాంతం యూరప్ రాజకీయాలను ప్రభావితం చేస్తూవచ్చింది. ఈ సిద్ధాంతాన్ని కారల్ మార్క్స్, ఏంజల్స్, లెనిన్ మొదలగువారు బలపరచారు. అలాగే అమెరికా అధ్యక్షుడు ఉడ్రోవిల్సన్ మొదటి ప్రపంచ యుద్ధకాలంలో తాను ప్రతిపాదించిన '14 అంశాల కార్యక్రమంలో ' ఈ సిద్ధాంతాన్ని చేర్చాడు. 1945లో స్థాపించబడిన ఐక్యరాజ్యసమితి రాజ్యాంగం ఈ సిద్ధాంతానికి మరింత బలాన్ని చేకూర్చింది. ధర్మకర్తృత్వమండలి ఉద్దేశ్యం జాతీయసముదాయాలకు క్రమంగా స్వయం పాలన కలుగ జేయటమే. ఒక్కొక్క జాతీయ సముదాయం ఒక్కొక్క జాతీయ రాజ్యంగా అవతరించినందువల్ల పెక్కు ప్రయోజనాలు వున్నమాట నిజమే. అయితే దానివలన కొన్ని ఇబ్బందులు కూడా వున్నాయి. విశ్వకవి రవీంద్రనాధ్ ఠాగూర్ జాతీయ భావాన్ని ఖండిస్తూ దానిని మొత్తం ప్రజలవ్యవస్థీకృతమైన స్వార్థ ప్రయెజనంగా (Organised self interest of whole people) అభివర్ణించాడు. ఆధునిక కాలంలోజాతీయ భావం ఒక మత భావనకు దారితీస్తున్నదని షిలిటో (Schillito) హెచ్చరించాడు. లార్డ్‌యాక్టన్ అభిప్రాయంలో ఏకజాతిరాజ్యం కన్నా బహుళ జాతిరాజ్యమే అన్నివిధాల మెరుగైనది.

## 5.21 బహుళ జాతి - రాజ్యం

లార్డ్ యాక్టన్ బహుళ జాతిరాజ్యాన్ని సమర్థించిన రాజనీతి శాస్త్రవేత్త. ఆయన అభిప్రాయంలో వివిధ జాతులు వున్న రాజ్యమే నాగరికతకు నిలయము. ఒకేజాతి - ఒకే రాజ్యం సిద్ధాంతాన్ని, బేషరతుగా ఆమోదిస్తే అసంఖ్యాకమైన రాజ్యాలు ప్రపంచంలో అవతరించగలవు. ఒకటిగా వున్నరాజ్యం ముక్కలుచెక్కలై పెక్కు రాజ్యాలుగా విభజనకు గురయ్యే ప్రమాదం వుంది. 1991 ఆగస్ట్ - సెప్టెంబర్‌లో సోవియట్ యూనియన్‌లో జరిగిన రాజకీయ పరిణామాలు ఇతర రాజ్యాలకు విస్తరించి ప్రపంచ రాజ్యాల స్వరూపాన్నే మార్చివేసే ప్రమాదం వున్నది. అందువలన బహుళ జాతిరాజ్యాలు వాంఛనీయాలుగా మేధావులు భావిస్తున్నారు. ఒక రాజ్యంలో విభిన్న జాతీయులు వుండటం బహుళ జాతి రాజ్యలక్షణం. ఒక రాజ్యంలో అనేక జాతులవారు వున్నప్పటికి వారి వారి స్వేచ్ఛాపూర్వకమైన వ్యవస్థలను పెంపొందించుకోవటానికి ఆటంకాలు ఏమీవుండవు, అమెరికా, ఇండియా వీటికి ఉదాహరణలు. సమజంలో భిన్నమైన వ్యక్తులవలెనే విభిన్నమైన జాతులు రాజ్యంలో సమ్మిళితంకావాలి. విభిన్నమైన జాతులు కలసి మెలసి మనుగడసాగించినపుడే ఆ రాజ్యంలో విశిష్టమైన నాగరికత, సంస్కృతి, విలసిల్లి 'వసుధైక కుటుంబానికి' సోపానాలను నిర్మిస్తాయి. జాత్యహంకారాన్ని, పరజాతి ద్వేషాన్ని ఏకజాతి రాజ్యవిధానం పెంపొందిస్తుంది. కాగా బహుళ జాతి రాజ్యవిధానం ప్రజల మధ్య సుహృద్భావాన్నీ, సామరస్యాన్నీ, సహకారాన్నీ సమకూరుస్తుంది. ఒకే రాజ్యంలో వివిధ జాతులూ, ఒకే జాతి వివిధ రాజ్యాలలో మనుగడ సాగించడం నేటి నాగరకత లక్షణం.

## 5.22. సారాంశము

ఈ అధ్యాయంలో మనము రాజానీతి శాస్త్రంలో తరచూ ప్రస్తావించబడే సమాజం, రాజ్యం, జాతి, ప్రభుత్వం, స్వయంనిర్ణయాధికారం వంటి ప్రధాన భావనలను చర్చించాము. రాజనీతి శాస్త్రాన్ని అధ్యయనం చేసే కొత్త విద్యార్థికి ఈ మౌలిక భావనలను గూర్చిన వివరణ స్ఫూర్తినీ, పఠనాసక్తిని కలిగిస్తుంది. సమాజంతో మొదలయిన ఈచర్చ బహుళ జాతిరాజ్యం వరకూ, వసుధైక కుటుంబం వరకు విస్తరించింది.

మానవుడు స్వభావరీత్యా సంఘజీవి. అలాగే రాజకీయ జీవికూడా. సమాజంలో ఎన్నో సంఘాలు, సంస్థలు, వ్యవస్థలు వుంటాయి. సామాజిక జీవనంవల్ల మానవుడికి ఎన్నో ప్రయోజనాలు ఒనగూడుతాయి. ఆధునిక సమాజం బహుముఖమైనది. సమాజాన్ని మానవ దేహంతో పోలుస్తారు. సమాజం పుట్టిన తరువాత రాజ్యం ఏర్పడింది. రాజ్యం సాంఘిక జీవనాన్ని నియంత్రించి వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తుంది. ప్రజలు, ప్రదేశం, ప్రభుత్వం, సార్వభౌమాధికారం- ఈ నాల్గు అంశాలు రాజ్యనిర్మాణానికి కీలకమైన విషయాలు. ప్రభుత్వం రాజ్యానికి ప్రతినిధి. ఇది అధికార యంత్రాంగంగా వ్యవహరించి రాజ్యం తరఫున సార్వభౌమాధికారాన్ని చెలాయిస్తుంది.

రాజ్యం, సమాజం పరస్పర ఆశ్రయాలు. సాంఘిక జీవనంలో రాజ్యం ప్రాణప్రదమైంది కాగా రాజ్యప్రమేయంలేని సాంఘిక జీవనం అనూహ్యం. అలాగే రాజ్యానికి ప్రభుత్వానికి మధ్య అవినాభావసంబంధంవుంది. మనిషికి మేధస్సు ఎలాంటిదో రాజ్యానికి ప్రభుత్వం అలాంటిది.

ఆధునిక కాలంలో జాతి, జాతీయతా, జాతీయతాభావం అనేవి తరచూ ప్రస్తావించబడుతున్నాయి. స్వతంత్ర ప్రతిపత్తి గలిగి ఒక రాజకీయ రూపాన్ని సంతరించుకున్న జాతీయతే జాతి. అంటే జాతీయత ఒక రాజ్యరూపాన్నీ ధరించినప్పుడు జాతి అవతరిస్తుంది. ఇక జాతీయత అనేది ఒక జాతి ప్రజలమధ్య వుండే సృజనాత్మకమై ఆధ్యాత్మిక భావము. ఒకేభాష, ఒకేమతం, భౌగోళిక సాన్నిహిత్యం వంటి అంశాలు జాతీయతాభావాన్ని పెంపొందింప జేసే అంశాలు. ప్రతిజాతి ఒకరాజ్యంగా ఏర్పడటానికి హక్కు కలిగివుంది అనేదే జాతి స్వయం నిర్ణయాధికార సిద్ధాతం. ఇది 'ఒకే జాతి, ఒకేరాజ్యం' అనే సిద్ధాంతాన్ని సమర్థిస్తుంది. ఒక రాజ్యంలో ఒకే జాతి నివసిస్తే దానిని ఏకజాతి రాజ్యము అంటారు. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ దీనికి ఉదాహరణలు. ఒకే రాజ్యంలో పెక్కు జాతులు కలసి మెలసి వుంటే దానిని బహుళజాతి రాజ్యం అంటారు. ఏకజాతి రాజ్యం వలన లాభాలు నష్టాలు వున్నాయి. అలాగే బహుళ జాతి రాజ్యంవలన గుణదోషాలు వున్నాయి. కానీ విభిన్నమైన జాతులు కలిసిమెలసి ఒకే రాజ్యంలో మనుగడ సాగించిన నాడు ఆ రాజ్యంలో విశిష్టమైన నాగరికత, సంస్కృతి, అభ్యుదయం విలసిల్లుతాయి. అలాంటి రాజ్యాలు ' వసుధైక కుటుంబానికి' సోపానాలను నిర్మిస్తాయి.

## అభ్యాసాలు

**I. వ్యాస ప్రశ్నలు**

1. సమాజం అనగానేమి ? సమాజానికి రాజ్యానికి మధ్యగల సంబంధమును చర్చించుము.
2. రాజ్యమును నిర్వచించి, రాజ్య మౌలికాంశములను వివరింపుము.
3. ప్రభుత్వమనగానేమి ? రాజ్యమునకూ ప్రభుత్వమునకు మధ్యగల సంబంధమెట్టిది?

**II. సంక్షిప్త వ్యాసప్రశ్నలు :**

1. జాతి - జాతీయత - జాతీయతాభావం ఈ అంశాలను చర్చింపుము.
2. జాతీయతా భావము పెంపొందించటానికి దోహదపడే అంశాలను పేర్కొనుము.
3. ఏకజాతి, బహుళజాతి, రాజ్యాలను గురించి చర్చించుము.

**III. కుశాగ్రబుద్ధి ప్రశ్నలు**

1. మానవుల సమూహము అందమైన ........................................................ అవుతుంది.
2. వ్యక్తులపై చెలాయించబడు అధికారం రాజ్యం అని ......................................... పేర్కొన్నాడు.
3. రాజ్యం ఏర్పడటానికి................................................ ప్రధాన లక్షణాలు ఉండాలి.
4. స్వతంత్ర ప్రతిపత్తి గలిగి లేదా స్వతంత్ర ప్రతిపత్తి కోసం ప్రాకులాడుతూ ఒక రాజకీయ రూపాన్ని పొందిన జాతీయతే ................................ అని ........................................ నిర్వచించాడు.
5. బహుళ జాతి రాజ్యాన్ని ......................................... సమర్థించాడు.

## ఉపయుక్త గ్రంథాలు


1. రాజనీతి శాస్త్రము - ప్రాథమిక సూత్రాలు — తెలుగు ఎకాడమీ ప్రచురణ
2. రాజనీతి సంస్థలు - భావాలు — "
3. Priciples of Political Science — R.N Gilchrist
4. A Text Book of Political Science - Concepts Theories & Institutions — Prof. K.R Acharya, Ravindra Shastry, Vijaya Raghava & Bhogendra

పాఠం -6

# సార్వభౌమాధికారం - బహుళతావాదం

## (SOVEREIGNTY - PLURALISM)

### 6.0 లక్ష్యం

రాజ్య నిర్మాణానికి సార్వభౌమాధికారం ప్రాణంతో సమానమైనది. అంతర్జాతీయ న్యాయశాస్త్రంలో సార్వభౌమాధికారం అతి ముఖ్యమైన అంశం. సార్వభౌమాధికార భావన పుట్టు పూర్వోత్తరాలనూ, దాని విశిష్ట లక్షణాలనూ చర్చించి దాని అవిభాజ్యతా లక్షణంపై వచ్చిన విమర్శలనూ, ప్రతిఘటననూ అవగాహన చేసుకోవడమే ఈ పాఠ్య లక్ష్యం.

**6.1** విషయ క్రమం :


6.2. సార్వభౌమాధికారం- పుట్టుపూర్వోత్తరాలు.

6.3. సార్వభౌమాధికారం : నిర్వచనాలు

6.4. సార్వభౌమాధికారం : లక్షణాలు.

6.4. 1 నిరపేక్షత

6.4. 2. సార్వజనీనత

6.4.3. శాశ్వతత్వము.

6.4.4. అనన్యసంక్రామకత్వము

6.4. 5. అవిభాజ్యం.

6.5. సార్వభౌమాధికారం : రకాలు

6.5. 1. నామమాత్ర సార్వభౌమత్వము

6.5. 2. వాస్తవ న్యాయ సార్వభౌమత్వము

6.5. 3. శాసన సార్వభౌమత్వము

6.5. 4. రాజకీయ సార్వభౌమత్వము

6.5. 5. న్యాయ సార్వభౌమత్వము

6.5. 6. యదార్థ సార్వభౌమత్వము

6.5.7. అంతర, బాహ్య సార్వభౌమత్వము.

6.6. ఆస్టిన్ సార్వభౌమాధికార సిద్ధాంతము

6.7. సిద్ధాంత వివరణ - సారాంశం

6.8. సిద్ధాంత విమర్శ

6.8.1 నిర్ణీత మానవాధికృుడు

6.8.2. ఆజ్ఞలేని శాసనాలు

6.8.3. నిరపేక్షత

6.8.4. అవిభాజ్యత

6.9. బహుతావాద సార్వభౌమాధికార సిద్ధాంతము
6.10. బహుతావాదంలోని ప్రధానాంశాలపై వివరణ
6.11. విమర్శ
6.12. సారాంశము

## 6.2. సార్వభౌమాధికారం - పుట్టు పూర్వోత్తరాలు

ఒక రాజ్యానికి అవసరమైన మౌలికాంశాలలో సార్వభౌమాధికారం అతి ముఖ్యమైనది. ఇది రాజ్యానికి ప్రాణం వంటిది. రాజ్యం, రాజ్యంగా గుర్తించబడటానికి, రాజ్యంగా కొనసాగటానికి సార్వభౌమాధికారమే కారణం. సార్వభౌమాధికారం ఆధునిక రాజ్యావతరణతో ఉత్పన్నమైన ఒక నూతన భావం అయినప్పటికీ, దానికి చరిత్ర వున్నది. రాజ్యం యొక్క అత్యున్నాధికారంగా అరిస్టాటిల్ సార్వభౌమత్వాన్ని ప్రస్తావించాడు. ఆనాడు రోమన్ న్యాయకోవిదులు కూడా దీనిని 'అధికార సంపూర్ణతగా' పేర్కొన్నారు. మధ్యయుగాలలో మతాధిపతిగా 'పోప్' ఒక వైపు నిలబడగా, మరోవైపు పవిత్ర రోమన్ సామ్రాజ్యానికి లౌకిక అధిపతిగా ఒక చక్రవర్తి యూరప్‌లో అధికారం చెలాయించేవాడు. ఒక ప్రక్క మతాధికారం, వేరొక ప్రక్క లౌకికాధికారం పరస్పరం సంఘర్షణకు దిగటంతో అత్యున్నధికారమైన సార్వభౌమాధికారం ఎవ్వరికీ చెందకుండా పోయింది. పైగా ఆ రోజుల్లో దైవన్యాయం (Divinie Law), ప్రాకృతిక న్యాయం అనేవి అందరికీ శిరోధార్యాలుగా గౌరవించబడేవి.

రాజనీతి శాస్త్రానికి సంబంధించి సార్వభౌమత్వాన్ని గురించి మొట్టమొదట విపులంగా చర్చించినవాడు ఫ్రాన్స్‌కు చెందిన జీన్ బోడిన్ (Jean Bodin). ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన వారిలో తర్వాత కాలంలో గ్రోషియస్, హాబ్స్, లాక్, రూసో, బెంథామ్, ఆస్టిన్ మొదలయిన వారున్నారు. బహుతావాదులు సార్వభౌమాధికార ఔన్నత్యాన్ని ప్రశ్నించారు. జాన్ ఆస్టిన్ ప్రతిపాదించిన ఏకత్వ సార్వభౌమాధికార సిద్ధాంతాన్ని బహుతావాదులు దుయ్యబట్టారు. సార్వభౌమత్వమే రాజనీతిశాస్త్ర అధ్యయన కేంద్ర బిందువుగా కొందరు పేర్కొనగా మరి కొందరు ఆ వాదనను ఖండించారు. చివరకు అసలు ఈ సార్వభౌమత్వభావననే రాజనీతి శాస్త్రపరిధి నుండి తొలగించటం మంచిది అన్నంత వరకూ ఈ వివాదము కొనసాగించిది.

## 6.3. సార్వభౌమాధికారం - నిర్వచనాలు

సార్వభౌమాధికారాన్ని ఇంగ్లీషులో సావరిన్‌టి అంటారు. ఈ 'సావరిన్‌టి' అనే ఇంగ్లీషు పదం 'సూపరానస్' (Superanus) అనే లాటిన్ పదం నుంచి పుట్టింది. లాటిన్ భాషలో సూపరానస్ అంటే 'అత్యున్నతాధికారం' (Supreme Power) అని అర్థం. రాజ్యంలో శాసనాలు చేయటానికి అధికారికంగా వాటిని అమలు చేయటానికి దండనాధికారాన్ని చెలాయించటానికి రాజ్యానికి వుండే అత్యున్నతాధికారాన్నే సార్వభౌమాధికారం అంటారు.

1. "సార్వభౌమాధికారం అంటే ఎలాంటి శాసన పరిమితులు లేకుండా పౌరులందరి పైనా పాలితులపైనా రాజ్యానికి వుండే అత్యున్నతాధికారమే సార్వభౌమాధికారం" (Supreme power of the State over citizens and Subjects unrestrained by law bodies).

2. అత్యున్నతమైన శాసనాధికారాలు ఎవరికి చెంది వుంటాయో, వారి యొక్క అత్యున్నత, అపరిమిత, అనియంత్రిత, అధికారమే సార్వభౌమాధికారమని బ్లాక్ స్టోన్ నిర్వచించాడు (The supreme, irresistible, abosolute, uncontrolled authority in which the supreme legal powers reside - Blackstone).

3. సార్వభౌమాధికారం అంటే వ్యక్తులపైన వ్యక్తులు నిర్మించుకున్న సంస్థలపైన వుండే మౌలికమైన, నిరపేక్షమైన, అపరిమితమైన అధికారం అని బర్జెస్ నిర్వచనము (Original, absolute unlimited power over the individual subjects and over all associations of subjects - Burgess).

అయితే హ్యూగో గ్రోషియస్ సార్వభౌమాధికారాన్ని విపులంగా నిర్వచించాడు. ఆయన నిర్వచనం రాజ్యంలో అంతర్గతమైన అధికారం గురించి కాక బహిర్గత స్వాతంత్ర్యాన్ని గురించి గూడా చర్చిస్తుంది. ఆయన నిర్వచనం ప్రకారం అత్యున్నత రాజకీయాధికారం ఎవరి అధీనంలో వుంటుందో ఎవరి చర్యలు వేరెవరికి లోబడి వుండవో, ఎవరి ఇష్టాన్ని తోసి పుచ్చటానికి వీలులేదో, వారే సార్వభౌమాధికారి.

వీటి సారాంశం ఏమిటంటే రాజ్యానికి వుండే మహోన్నతమైన అధికారమే సార్వభౌమాధికారం. ఈ అధికారానికి ఎలాంటి పరిమితులు, హద్దులు వుండకూడదు. ఇది శాసనానికి అతీతమైంది. రాజ్యంలోపల నిరంకుశమైనది, తిరుగులేనిది. అంతర్జాతీయ వ్యవహారాలలో సర్వ స్వతంత్రమైంది. ఇతర రాజ్యాలు ఈ అధికారాన్ని ప్రశ్నించలేవు, శాసించనూ లేవు.

సార్వభౌమాధికారం హద్దులు లేనిది అనే వాదాన్ని కొందరు సమర్థించరు. చారిత్రకంగా పరిశీలిస్తే ఎప్పుడూ, ఎక్కడా నిరపేక్షమైన సార్వభౌమాధికరం లేదని వారంటారు. అంతర్గతంగా గమనిస్తే ఆ రాజ్యం పౌరుల యొక్క హక్కులు, సంప్రదాయాలు, మత విశ్వాసాలూ, సార్వభౌమాధికారానికి పరిమితులు విధిస్తాయి. బాహ్యంగా పరిశీలిస్తే అంతర్జాతీయ న్యాయ సూత్రాలు, సంబంధాలూ, సంధులూ, సంప్రదాయలూ వంటి పెక్కు అంశాలు సార్వభౌమాధికారాన్ని పరిమితం చేస్తాయి. మరికొందరు శాస్త్రజ్ఞుల అభిప్రాయంలో సార్వభౌమాధికారం దైవ శాసనాలకు ప్రాకృతిక ధర్మాలకు, లోబడి వుంటుంది. కనుక అది నిరపేక్షమూ కాదు, అప్రతిహతమూ కాదు. పైగా మానవ సహజాలు అయిన స్వేచ్ఛ, న్యాయాన్యాయ విచక్షణ, నైతిక విలువలు గుణాలు సార్వభౌమాధికారాన్నీ హద్దులలో వుంచుతాయి.

## 6.4 సార్వభౌమాధికారం - లక్షణాలు

రాజ్యానికి వుండే మహోన్నతాధికారాన్ని సార్వభౌమాధికారం అంటారు. దీనికి కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉన్నాయి. అవి

**6.4. 1** నిరపేక్షత (absoluteness) **6.4. 2** సార్వజనీనత (Universality) **6.4. 3**శాశ్వతత్వము (Permanence)

**6.4. 4** అనన్య సంక్రామకత్వము (In alienability) **6.4. 5** అవిభాజ్యత (Indivisibility) ఈ లక్షణాలను సంక్షిప్తంగా చర్చిద్దాము.

**6.4 1 నిరపేక్షత :** రాజ్యానికి ఉండే సార్వభౌమత్వం మహోన్నతం. ఆ అధికారాన్ని ఏ శక్తి అదుపు చేయలేదు, శాసించనూ లేదు. పైగా దానికి మించిన మరొక అధికారము అంటూ ఏదీ ఉండదు. రాజ్యములో ఉండే సమస్త ప్రజలమీద సకల సంఘాలమీద దీనికి ఎదురులేని అధికారము ఉంది. అందువలన సార్వభౌమాధికారము నిరపేక్షమైనది. సార్వభౌమత్వాన్ని శాసించ గల లేదా ఎదిరించగల అంతర లేదా బాహ్య అధికారం వేరొకటి వుండదు. ఈ అధికారాన్ని ఇతర రాజ్యాలు గుర్తిస్తాయి. అయితే సార్వభౌమాధికారము తనకు తానుగా శిరసావహించే పరిమితులు అన్ని స్వయం నియమితాలు. అయితే సార్వభౌమాధికారము నిరపేక్షతను కొందరు అంగీకరించరు. రాజ్యం లోపల రాజ్యాంగ శాసనం సార్వభౌమాధికారాన్ని కూడా పరిమితం చేస్తుంది కదా అని ఒక వాదన. అయితే వాస్తవానికి ఆ పరిమితి ప్రభుత్వానికి గాని సార్వభౌమత్వానికి కాదు అనేది మరొక వాదన. సార్వభౌమాధికారానికన్నా ప్రాకృతిక న్యాయం, దైవన్యాయం (Natural Law & Divine Law) ఉన్నతమైనవని కొందరు వాదించారు. కాని పై రెండూ న్యాయాలను సార్వభౌమాధికారి ఉల్లంఘించినట్లయితే అతని నిర్ణయమే చెల్లుతుంది కాబట్టి ఆ రెండిటి యొక్క స్థానము సార్వభౌమాధికారి నిర్ణయానికి లోబడి ఉంటుంది అని మరికొందరు వాదిస్తారు.

అలాగే సామాజిక జీవనంలో ఆచారాలు, సంప్రదాయాలు సార్వభౌముణ్ణి శాసిస్తాయని, నిరంకుశుడు అయిన రంజిత్‌సింగ్ వంటిరాజు కూడా ప్రజల ఆచారాలకు తలవంచాడు అని మెయిట్ లాండ్ (Maitland) అన్నాడు. అయితే సార్వభౌముడు ఏ సంప్రదాయాన్ని అమమతిస్తే అదే ఆచరణలోకి వస్తుంది. కాబట్టి సార్వభౌమత్వం అనేది అపరిమితమయిందని మరికొందరు వాదిస్తారు. బహిర్గతంగా అంతర్జాతీయ న్యాయాన్నీ ప్రపంచ ప్రజాభిప్రాయాన్నీ నేటి పరిస్థితులలో ఏ రాజ్యం కూడా తిరస్కరించలేదు. కాబట్టి బహిర్గతంగా సార్వభౌమత్వం పరిమితం చేయబడుతుంది అనేది విమర్శ. కాబట్టి ప్రొఫెసర్ ధామ్‌లె పేర్కొన్నట్లు సిద్ధాంత పరంగా చూస్తే సార్వభౌమాధికారం నిరపేక్షము, అపరిమితము అయినప్పటికిని వాస్తవికంగా దానిని దేశంలోపల పౌరహక్కులు, దేశం వెలుపల పరరాజ్యాల హక్కులు పరిమితం చేస్తాయి.

**6.4. 2 సార్వజనీనత :** రాజ్యంలో వుండే వ్యక్తులందరిమీద అన్ని సంస్థల మీద నిర్నిబంధంగా సార్వభౌమాధికారం చెల్లబడికావటమే సార్వజనీనత. రాజ్యంలోపల ఏ వ్యక్తిగాని లేదా సంస్థకాని లేదా మరోశక్తిగాని సార్వభౌమాధికారాన్ని ప్రతిఘటించలేవు. అయితే దీనికి ఒక ఆక్షేపణ ఉన్నది. ఒక రాజ్యంలో నివసించే విదేశీ దౌత్యవేత్తలు, విదేశీ సైన్యాలు, ఇతర రాజ్యాధిపతులు మొదలయినవారిమీద

సార్వభౌమాధికారం ఒకే రీతిగా చెల్లదు. అయితే అలాంటి విదేశీయులకు లభించే మినహాయింపులు అన్నీ సార్వభౌముడు కల్పించినవే కాబట్టి ఈ ఆక్షేపణ సరికాదు. ఎందువలనంటే విదేశీయులకు ఇచ్చే మినహాయింపులను రాజ్యం ఎపుడైనా ఉపసంహరించుకోవచ్చు.

**6.4. 3** శాశ్వతత్వము : రాజ్యం, సార్వభౌమాధికారం అవినాభావసంబంధము గలవి. అంటే రాజ్యం ఉన్నంతవరకు సార్వభౌమత్వమూ ఉంటుంది. రాజ్యాధిపతి మరణిస్తే అతని స్థానంలో మరొకవ్యక్తి రాజ్యాధిపత్యం వహిస్తాడు. కాబట్టి రాజ్యాధిపతి గతిస్తే సార్వభౌమత్వం నశించదు. కనుక సార్వభౌమత్వం శాశ్వతంగా ఉండి తరతరాలు కొనసాగుతూనే ఉంటుంది. అయితే ప్రాకృతిక వైపరీత్యాలవలన కానీ, యుద్ధంలో ఓటమిపాలై విజేత రాజ్యంలో విలీనమైపోయినందువల్ల కానీ, ఇష్ట పూర్వకంగానే మరొక రాజ్యంలో విలీనమైనందువల్లకానీ, రాజ్యం అంతరిస్తుంది కనుక, సార్వభౌమత్వం అంతరించినట్లే. కానీ ఒక రాజ్యానికి సంబంధించినంతవరకు రాజ్యంతో పాటే సార్వభౌమత్వంకూడా శాశ్వతంగా కొనసాగుతుంది.

**6.4. 4** అనన్య సంక్రామకత్వము : ప్రాణికి ప్రాణం లాగా రాజ్యానికి సార్వభౌమాధికారం ముఖ్యమైనది. సార్వభౌమాధికారాన్ని ఇతరులకు సంక్రమింపచేయటానికి వీలు కాదు. రాజ్యం తన సార్వభౌమాధికారాన్ని మరొకరికి ఇవ్వడం అంటే అది ఆత్మహత్య వలె భావించబడుతుంది. సార్వభౌమత్వం రాజ్య వ్యక్తిత్వానికి జీవాంశ. దానిని మరొకరికి సంక్రమింపచేయటం సాధ్యంకాదు.

ఒక్కొక్క సందర్భంలో రాజ్యం తన భూభాగంలో కొంత ప్రదేశాన్ని మరొక రాజ్యానికి బదిలీ చేస్తుంది. అలాంటప్పుడు ఆ రాజ్యం యొక్క సార్వభౌమాధికారం రాజ్యనికి చెంది యుండి బదిలీ చేయబడిన ప్రదేశంపై మాత్రమే తన ఆధిపత్యాన్ని తానే వదులుకుంటుంది. కనుక అంత మాత్రాన సార్వభౌమాధికారం అన్యాక్రాంతం చేయబడినట్లు భావించకూడదు. కనుక సార్వభౌమాధికారం అనన్య సంక్రామికమైనది.

**6.4. 5** అవిభాజ్యత : సార్వభౌమాధికారం విభజించుటకు వీలుకానిది. అది అఖండమైన రాజ్యమహోన్నత ఆధికారం. ఒక రాజ్యంలో ఒకే సార్వభౌమాధికారం ఉంటుంది. సార్వభౌమాధికారాన్ని విభజించటం అంటే దానిని ధ్వంసం చేసినట్లే. సార్వభౌమాధికారం ఏ కారణం చేతనైనా విభజించటానికి వీలుపడనిది. సగం సార్వభౌమాధికారాన్ని గురించి మాట్లాడటం అంటే సగం చతురస్రం సగం త్రిభుజం మొదలగువాటి గురించి మాట్లాడినట్లు హాస్యాస్పదంగా తోస్తుందని కొందరి అభిప్రాయం. సార్వభౌమత్వం అవిభాజ్యం అనే అభిప్రాయాన్ని కొందరు వ్యతిరేకించారు. వీరిని బహుతావాదులంటారు. వీరిదృష్టిలో రాజ్యం అనేది సమాజంలోని పెక్కు ఇతర సంఘాలవంటిది. సార్వభౌమాధికారం రాజ్యానికి, రాజ్యంలోపలి ఇతర సంఘాలకి మధ్య విభజింపబడుతుంది. కనుక సార్వభౌమాధికారం విభాజ్యం. సమాఖ్య రాజ్యాలలోకూడా సార్వభౌమాధికారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆధికారవిభజన రూపంలో విభజింపబడుతుంది. కాబట్టి ఒకే రాజ్యంలో రెండు సార్వభౌమాధికారాలు ఉండవచ్చు. అయితే ఒకే రాజ్యంలో రెండు సార్వభౌమాధికారాలు ఉండవచ్చునని మనం భావిస్తే అది తర్కానికి నిలువదు. ఆచరణ సాధ్యమూ కాదు. అయితే సార్వభౌమాధికారం సమాఖ్యలలో కేంద్ర ప్రభుత్వం, ప్రాంతీయ ప్రభుత్వాలమధ్య విభజింపబడి ఉంటుంది అనేది సరియైన వాదన కాదు. ఎందువలనంటే సమాఖ్య వ్యవస్థలో ఏర్పడేవి రెండు ప్రభూత్వాలేకాని రెండు సార్వభౌమాధికారాలు కావు. రాజ్యాన్ని ఇతర సంస్థలతో సమానంగా భావించడం సమంజసం కాదు. కాబట్టి సార్వభౌమత్వం అవిభాజ్యం.

## 6.5 సార్వభౌమాధికారం - రకాలు

సార్వభౌమాధికారాన్ని రాజనీతి శాస్త్రజ్ఞులు 7 రకాలుగా గుర్తించారు. అవి:

**6.5. 1.** నామమాత్ర సార్వభౌమత్వము **(Nominal Sovereignty)** : గతంలో కొంతకాలం సర్వంసహాధికారాన్ని చెలాయించిన రాజ్యాధిపతి కొన్ని కారణాల వల్ల ఆ అధికారాన్ని మరొక వ్యక్తికి గాని, వ్యవస్థకుగాని సంక్రమింపచేసి తానుమాత్రం నామమాత్రంగా అదే పదవిలో కొనసాగితే అతడు అపుడు నామమాత్రపు సార్వభౌముడు అవుతాడు. రక్తరహిత విప్లవానికి (1688) పూర్వం ఇంగ్లండ్ దేశపు రాజు నిరంకుశ సార్వభౌముడు. రక్తరహిత విప్లవ ఫలితంగా ఆయనకుండే సార్వభౌమాధికారం ఇంగ్లండ్ పార్లమెంటుకు బదిలీ

చేయబడింది. దాని ఫలితంగా రాజరికం కొనసాగినా రాజుకు ఉండే సార్వభౌమాధికారం పార్లమెంటుకి సంక్రమించి రాజు మాత్రం అలంకారప్రాయమైన నామమాత్రపు సార్వభౌముడు అయ్యాడు.

**6.5. 2. వాస్తవ సార్వభౌమత్వం :** పైన పేర్కొన్నట్లు రాజుకు ఉండే సర్వ అధికారాలు బ్రిటన్ లో పార్లమెంటుకు చెందాయి. పార్లమెంటరీ విధానంలో పార్లమెంటుకు, మంత్రిమండలి బాధ్యత వహిస్తుంది. కనుక వాస్తవానికి ఆ అధికారాలను మంత్రి మండలే చెలాయిస్తుంది. కాబట్టి నామమాత్రపు అధికారాలు బ్రిటిష్ రాజరికానికి చెందినా, వాస్తవ అధికారాలు మంత్రి మండలికి దాని నాయకుడైన ప్రధానమంత్రికి చెందుతాయి. ఇదే విధంగా మనదేశంలోకూడా రాష్ట్రపతి నామమాత్రపు సార్వభౌమత్వానికి, మంత్రి మండలి వాస్తవ సార్వభౌమత్వానికి ఉదాహరణలు.

**6.5. 3. శాసన సార్వభౌమత్వం :** రాజ్యం యొక్క ఆశయాలను శాసన రూపంలో వ్యక్తపరిచే అధికారమే శాసన సార్వభౌమాధికారం. శాసనాలు చేసే అధికారం రాజ్యానికి వుంటుంది. ఈ శాసనాలు ప్రజలందరికి రాజ్యం అంతటికి సమానంగా వర్తిస్తాయి. శాసన సార్వభౌమత్వం ఎప్పుడు సుస్పష్టంగాను, స్థిరంగాను వుంటుంది. ప్రజల హక్కులు అన్నీ శాసన సార్వభౌమత్వం నుండే వుద్భవిస్తాయి. ఇది నిరంకుశ రాజరిక వ్యవస్థలో రాజ్యాధినేతకు చెందుతుంది. ప్రజాస్వామ్యంలో ప్రజలకు లేదా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు చెందుతుంది. పార్లమెంటు శాసనాధికారం సార్వభౌమత్వానికి చక్కని ఉదాహరణ.

**6.5. 4. రాజకీయ సార్వభౌమత్వం :** శాసనాధికార సార్వభౌమత్వము శాసన సభలకు, లేదా పార్లమెంట్‌కు చెంది వుండగా -రాజకీయ సార్వభౌమత్వం ఆ శాసన సభలకు ప్రతినిధులను ఎన్నుకొనే ప్రజలకు చెంది వుంటుంది. అంటే శాసనాధికార సార్వభౌమత్వానికి రాజకీయ సార్వభౌమత్వం ఆధారభూతం. అయితే రాజకీయ సార్వభౌములు అయిన ప్రజలు పార్లమెంటువలె ఒక స్థిరమైన రూపం కలిగి వుండరు. కనుక న్యాయస్థానాలు న్యాయాన్ని వ్యాఖ్యానించడంలో శాసనాలను మాత్రమే అనుసరిస్తాయి తప్ప, వ్యక్తీకరించబడని ప్రజాభీష్టాన్ని అనుసరించలేవు. ఆధునిక ప్రాతినిధ్య ప్రజాస్వామిక ప్రభుత్వ వ్యవస్థలో ఓటర్లు అయిన ప్రజలలో లేదా నియోజకులలో రాజకీయ సార్వభౌమత్వం ఇమిడి వుంటుంది. అయితే దీనికి స్పష్టమైన రూపం వుండదు.

**6.5. 5. న్యాయ సార్వభౌమాధికారం :** న్యాయరీత్యా పొందబడిన అధికారాన్ని న్యాయ సార్వభౌమాధికారం అనవచ్చు. న్యాయ సార్వభౌమునికి ప్రజలనుండి నిరంతర విధేయతను పొందటానికి చట్టబద్ధమైన హక్కువుంటుంది కానీ ఆచరణలో మాత్రం అధికారాలన్నీ మరొకరికి చెందివుండటం (De-Facto) ఇందలి విశేషం. అంటే సార్వభౌమత్వం కొన్ని సందర్భాలలో న్యాయ సమ్మతంగానూ, ఆచరణలో వాస్తవం గానూ కొనసాగుతుంది. ఉదా. బ్రిటిష్ రాజు న్యాయరీత్యా సార్వభౌముడు కానీ వాస్తవానికి సర్వాధికారాలు మంత్రిమండలి, పార్లమెంట్‌కు చెంది వున్నాయి.

**6.5. 6. యదార్థ సార్వభౌమత్వము :** పైన పేర్కొన్నట్లు న్యాయరీత్యా అధికారం మరొకరికి చెందివుండి, ఆచరణలో మాత్రం ఆ అధికారాలను తాను చెలాయిస్తూ వుంటే అలాంటి దానిని యదార్థ సార్వభౌమత్వం (De-Facto) అంటారు. తన సైనిక బలం వల్లగానీ, లేదా ఇతర శక్తుల ప్రభావం వలనగానీ ప్రజలను ఆజ్ఞాపిస్తూ, వారి విధేయతను యదార్థ సార్వభౌమత్వం పొందతూ వుంటుంది. దురాక్రమణ ద్వారా రాజ్యాధిపత్యం పొందిన రాజు, తమకు తామే అధికారాన్నీ హస్తగతం చేసుకొన్న శాసన సభలు (1789 నాటి ఫ్రాన్స్ జాతీయసభ), సైనిక నియంతలు, మొదలయిన రాజ్యాధిపతులను యదార్ధ సార్వభౌమాధికారులుగా పేర్కొనవచ్చు. అయితే కాలాంతరంలో ప్రజలలో ఓటింగ్ ద్వారా గానీ, రాజ్యాంగం గుర్తింపు ఇవ్వడం ద్వారా కానీ ఇలాంటి సార్వభౌమత్వాలు న్యాయ సార్వభౌమత్వాలుగా కొనసాగవచ్చు. ఉదా. ఒకప్పటి అరబ్ అధ్యక్షుడు నాసర్, పాకిస్తాన్ అధ్యక్షుడు ముషారఫ్.

**6.5. 7. అంతర, బాహ్య సార్వభౌమత్వాలు :** రాజ్యంలోనీ వ్యక్తులందరి మీద అన్ని సంఘాలమీద అధికారం ఎదురులేని రీతిలో చెల్లుబడికావటం అంతర సార్వభౌమత్వ లక్షణం. విదేశీ వ్యవహారాలలో ఇతర దేశాల ప్రాబల్యానికి లొంగకుండా వుండే స్వేచ్ఛను బాహ్య సార్వభౌమత్వం అంటారు. అయితే బాహ్యసార్వభౌమత్వం అనేది ప్రమాదకరమైన అభిప్రాయమని, దానిని రాజనీతి శాస్త్రంనుంచి, అంతర్జాతీయ న్యాయశాస్త్రం నుంచి తొలగించటం మంచిదని కొందరు ఆధునికులు సూచించారు.

## 6.6 ఆస్టిన్ సార్వభౌమాధికార సిద్ధాంతము : ఏకత్వ సార్వభౌమాధికార సిద్ధాంతము (లేక) శాసన సార్వభౌమాధికార సిద్ధాంతము:

రాజనీతి శాస్త్రంలోను, న్యాయ శాస్త్రంలోను సార్వభౌమాధికారం అనేది ఒక ముఖ్యమైన భావన. సార్వభౌమాధికారం రాజ్యం యొక్క ప్రధాన లక్షణం. ఆధునిక జాతి రాజ్యాలకు సార్వభౌమత్వం ప్రాణప్రదమైంది. సార్వభౌమత్వంపై నిశితమైన పరిశీలన చేసి, విపుల వాఖ్యానాన్ని సమకూర్చినవాడు 16 శతాబ్దం నాటి జీన్ బోడిన్ అనే ఫ్రెంచి రాజనీతి తత్త్వవేత్త . పాలితులపైన లేదా పౌరులపైన ప్రభువుకు లేదా రాజ్యానికి వుండే అత్యున్నత అధికారాన్ని బోడిన్ సార్వభౌమాధికారం అని పిలిచాడు. అంతర్ సార్వభౌమాధికారాన్ని బోడిన్ విశ్లేషించగా, 17వ శతాబ్దంనాటి డచ్ న్యాయ శాస్త్రవేత్త అయిన గ్రోషియస్ బాహ్య సార్వభౌమత్వాన్ని వివరించాడు. వారి తరువాత థామస్ హబ్స్ న్యాయ సార్వభౌమత్వాన్ని వివరించాడు. అనంతరం వచ్చిన జాన్ లాక్ రాజకీయ సార్వభౌమాధికారాన్ని విపులీకరించాడు. జాన్ ఆస్టిన్ ప్రతిపాదించిన సిద్ధాంతాన్ని ఏకత్వ సార్వభౌమాధికార సిద్ధాంతం(Monestic Theory of Sovereignty) అంటారు.

జాన్ ఆస్టిన్ గొప్ప ఇంగ్లీషు న్యాయశాస్త్రవేత్త. ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయాలు ఆనాటి న్యాయశాస్త్ర పద్ధతులకు ఆధారమైనాయి. ఈయన 1832లో ప్రచురించిన న్యాయశాస్త్ర ఉపన్యాసాలు (Lectures on Jurisprudence) అనే గ్రంథంలో సార్వభౌమాధికారం పైన తన అభిప్రాయాలను వివరించాడు. ఈయన ఇంగ్లండ్, అమెరికాలలో రాజనీతి తత్వాన్ని తీవ్రంగా ప్రభావితం చేసాడు. ఆయనను న్యాయ సార్వభౌమాధికార సిద్ధాంత ప్రధాన ప్రవక్తగా భావిస్తారు. ఆస్టిన్ మొదట చట్టాన్ని నిర్వచించి తద్వారా సార్వభౌమాధికారాన్ని నిర్వచించాడు. క్లుప్తంగా చెప్పాలంటే 'సార్వభౌముడి ఆజ్ఞయే శాసనము' అనేది ఆస్టిన్ శాసనానికి ఇచ్చిన నిర్వచనము.

**6.7 ఆస్టిన్ సిద్ధాంతము వివరణ :** ఆస్టిన్ సార్వభౌమత్వాన్ని ఇలా నిర్వచించాడు. "ఒక సమాజంలో ఏ ఇతరుల అధికారానికి లోబడి వుండకుండా, అందరి విధేయతను పొందుతూ ఉన్నటువంటి నిర్ణీత మానవాధిక్యుడు సార్వభౌముడు. అటువంటి మానవాధిక్యులతోనూ విధేయులతోనూ కూడిన సమాజం రాజకీయంగా స్వతంత్రమైనది"

ఆస్టిన్ సిద్ధాంతంలోని ప్రధానాంశాలు:

6.7 .1 ప్రతి రాజ్యంలో నిర్ణీతుడైన మానవాధిక్యుడు అంటూ ఒకడు వుంటాడు. సమాజంలో అత్యధికులు అతనికి విధేయులై వుంటారు.

6.7. 2 సార్వభౌముడు నిర్ణీతుడైన వ్యక్తి.

6.7. 3 ఈ మానవాధిక్యుడు జారీచేసే ఆజ్ఞలే శాసనాలు. అంటే ఇతడే లేకపోతే శాసనాలే వుండవు

6.7. 4 ఈ సార్వభౌముని అధికారానికి పరిమితులువుండవు. వానికి వుండే అధికారం నిరపేక్షమైనది. అతని ఆజ్ఞలు అందరూ పాటిస్తారు. కాని అతడు ఏ అధికారానికి తలవంచనవసరం లేదు.

6.7. 5 సార్వభౌమాధికారం అవిభాజ్యము. అది విభజించడానికి వీలుపడనటువంటి అధికారం.

6.7. 6 శాసనానికి మూలధారం సార్వభౌముడే.

6.7. 7 సార్వభౌముని ఆజ్ఞలే చట్టాలు కనుక చట్టాన్ని వ్యతిరేకించేవారు శిక్షించబడుతారు.

## 6.8 సిద్ధాంత విమర్శ

ఆస్టిన్ సార్వభౌమత్వ సిద్ధాంతం అనేక విమర్శలకు గురి అయింది. హెచ్. జె. లాస్కీ, హెన్రీమెయిన్, సిడ్జివిక్ వంటి రాజనీతి శాస్త్రజ్ఞులు ఆస్టిన్ సిద్ధాంతాన్ని విమర్శించారు.

**6.8. 1. నిర్ణీత మానవాధిక్యుడు :** నిర్ణీత మానవాదిక్యుడనె వాదన సరికాదు : సర్ హెన్రీ మెయిన్ సార్వభౌమాధికారం ఏదో ఒక నిర్ణీత వ్యక్తికే చెందుతుంది అనే వాదన సమంజసము కాదంటాడు. చరిత్ర ప్రసిద్ధమైన పెక్కు సామ్రాజ్యాలలో ఆస్టిన్ పేర్కొనిన మానవాధిక్యుడు ఎవ్వరూ ఎక్కడా కనబడరు. ఎంత బలవంతుడయినా నిరంకుశ సార్వభౌముడయినా, ప్రజల ఆచారాలనూ విలువలనూ అతిక్రమించి ఏ శాసనము చేయలేడు. కాబట్టి ఆస్టిన్ ,చెప్పిన నిర్ణీత మానవాధిక్యుడు చరిత్రలో ఎక్కడా కనిపించడు.

**6.8. 2. ఆజ్ఞలేని శాసనాలు :** "సార్వభౌముని ఆజ్ఞలే శాసనాలు" అన్న ఆస్టిన్ అభిప్రాయాన్ని కొందరు తీవ్రంగా విమర్శించారు. సమాజంలో అనాదిగా వస్తున్న ఆచారాలు, సంప్రదాయాలూ, అలవాట్లూ, కాలాంతరంలో శాసన మూలాధారమౌతాయి. ప్రజలు ఎపుడు వీటికి బద్ధులై వుంటారు. శాసనాలు సహితం ఈ సంప్రదాయాలను అతిక్రమించి రూపొందలేవు. మైకైవర్ అన్నట్లు ఆచారాలనూ, సంప్రదాయాలను రూపొందించడానికి గానీ, రూపుమాపడానికి గానీ రాజ్యానికి తగినంత శక్తి ఉండదు. ఆచారాలు, విశ్వాసాలు, సాంప్రదాయం మొదలైనవి శాసనాలకు మూలాధారాలు. కాబట్టి సార్వభౌముని ఆజ్ఞలే శాసనము అనడం సమంజసము కాదు. పైగా శాసనాలకు వాస్తవమైన మూలాధారం వ్యక్తి అంతరాత్మ అని లాస్కి అభిప్రాయం. రాజ్యానికి మూలాధారం ప్రజల అభీష్టం కాని బల ప్రయోగం కాదని టి.హెచ్. గ్రీన్ అభిప్రాయము. శాసనాలు నీతి బద్ధంగా వుండకపోతే ప్రజలు సమ్మతించరు. కనుక ఎంతటి బలమైన ప్రభువైనా సామాజికమైన నైతిక విలువలను గౌరవించే తీరాలి. శాసనాలు అమలుచేయడానికి అవసరానికి మించిన ప్రాధాన్యతను ఆస్టిన్ బలప్రయోగానికి ఇచ్చాడు. ఇది ఆస్టిన్ సిద్ధాంతంలోని ఒక లోపము. ప్రజలు శాసనాలకు శిరసువంచేది కేవలము దండన భీతివల్ల మాత్రమే కాదు. ఇతరమైన కారణాలు కూడా ప్రజలను శాసనబద్ధుల్ని చేస్తాయి.

**6.8. 3 నిరపేక్షత :** సార్వభౌమత్వం నిరపేక్షమనే అంశాన్ని బ్లంట్ ష్లి ఖండించాడు. ఎంతటి నియంత అయినా నిరపేక్షాధికారాన్ని చెలాయించలేడు. ముందే పేర్కొన్నట్లు, ఆచారాలూ, సంప్రదాయాలూ, సార్వభౌమత్వాన్ని పరిమితం చేస్తాయి. అలాగే ఒక రాజ్యపు రాజ్యాంగ శాసనము, అంతర్జాతీయ న్యాయమూ కూడా సార్వభౌమత్వాన్ని కుదిస్తాయి.

**6.8. 4. అవిభాజ్యత :** ఆస్టిన్ సార్వభౌమత్వం అవిభాజ్యం అనటాన్ని కొందరు ఖండించారు. సమాఖ్య రాజ్యాలలో సార్వభౌమత్వం ఒక నిర్ణీతమైన మానవాధిక్యునిలోకానీ లేదా నిర్దిష్టమైన సమూహంలో కాని వుండదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాలు విభజించపడతాయి కాబట్టి ఈ రెండింటిలో ఎవరు నిజమైన సార్వభౌమత్వం కలిగి వున్నారో స్పష్టంగా చెప్పలేము. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా పరిధిలలో స్వతంత్రమైనవి కాబట్టి సార్వభౌమత్వం నిర్ణయాత్మకము కాదు. ఏకత్వము కాదు.

ఆస్టిన్ నిర్వచించిన ఏకత్వ సార్వభౌమత్వాన్ని బహుతావాదులు దుయ్యబట్టారు. సమాజంలో ఎన్నో సంఘాలు వున్నాయి. అలాంటి వాటిలో రాజ్యం ఒకటి. వ్యక్తి వికాసానికి రాజ్యమెంత అవసరమో ఇతర సంఘాలు కూడా అంతే అవసరం. కాబట్టి సార్వభౌమాధికారం రాజ్యానికి మాత్రమే చెందకూడదు. రాజ్యంతో పాటు ఇతర సంఘాలు గూడా సార్వభౌమత్వాన్ని పంచుకొనవలసినదేనని బహుతావాదులు వాదిస్తారు. ఏదీ ఏమైనా సార్వభౌమత్వాన్ని, న్యాయపరంగా, శాసననిర్మాణ పరంగా వివరించిన ఘనత జాన్ ఆస్టిన్‌కు దక్కుతుంది. అయితే ఈ రోజుల్లో ఆస్టిన్ సార్వభౌమత్వ సిద్ధాంతం సమర్థనీయంకాదు.

## 6.9. బహుతావాదం (Pluralism) లేదా సార్వభౌమత్వ బహుతావాద సిద్ధాంతము (Pluralistic Theory of Sovereignty) :

ఆస్టిన్ సార్వభౌమత్వ సిద్ధాంతమును బహుతావాదులుగా పిలవబడే లాస్కీ, జి.డి.హెచ్. కోల్ మొదలయినవారు తీవ్రంగా విమర్శించారు. రాజ్యానికి వుండే సార్వభౌమాధికారము అపరిమితమైనది అనే వాదాన్ని వీరు తీవ్రంగా వ్యతిరేకించారు. సమాజంలో ఎన్నో సంస్థలు, సంఘాలు వుంటాయి. ఇవన్నీ వాటి పరిధులలో వ్యక్తులను శాసిస్తుంటాయి. ఆస్టిన్ సిద్ధాంతం ప్రకారం కేవలం రాజ్యానికే సార్వభౌమాధికారం చెంది వుంటుంది. సార్వభౌమాధికారం అపరిమితమైంది. అప్రతిహతమైంది. ఈ వాదాన్నే ఏకత్వ సార్వభౌమత్వం అంటారు. దీనికి పూర్తిగా వ్యతిరేకమైనదే బహుతావాదము లేదా బహుత్వవాదము. మెయిట్ లాండ్, డర్క్‌హైమ్, సిడ్నీ వెబ్, జి.డి. హెచ్. కోల్, మెకైవర్, లిండ్‌సే, లాస్కీ, ఫాలెట్ మొదలయినవారు బహుతావాదాన్ని సమర్ధించారు.

## 6.10. బహుతావాదంలోని ప్రధాన అంశాల వివరణ

6.10. 1. సమాజంలోని అనేకసంఘాలలో రాజ్యం కూడా ఒకటి. వివిధ కార్యకలాపాలను నిర్వహించటానికి ఏర్పడిన సంఘాలను రాజ్యం సృష్టించలేదు. ఈ సంఘాలు తమ ఉనికికై రాజ్యంపై ఆధారపడిలేవు. రాజ్యమెంత ముఖ్యమైనదో వివిధ సంఘాలు కూడా అంతే ముఖ్యమైనవి. ప్రతి సంఘం కొన్ని నిర్దిష్ట లక్ష్యాలను కలిగివుంటుంది. అవి వ్యక్తి వికాసానికి దోహదం చేస్తాయి. కాబట్టి వాటి కార్యకలాపాలను నిర్వహించటానికి ఆయా సంఘాలకు తగిన స్వేచ్ఛ ఉండాలి. వాటి నిర్వహణలో రాజ్యం తన నియంత్రణాధికారాన్ని చెలాయించకూడదు.

6.10. 2. సార్వభౌమాధికారం రాజ్యానికి మాత్రమే చెంది వుండదు. అది రాజ్యానికి, ఇతర సంఘాలకు మధ్య పంచబడుతుంది. సమాజం సమాఖ్య సదృశమైనది. కాబట్టి అధికారం కూడా సమాఖ్య పద్ధతిలో రాజ్యానికి ఇతర సంస్థలకు మధ్య పంచబడాలి.

6.10. 3. రాజ్యం ఏ విధంగానూ మహోన్నతమైంది కాదు. అనేక సంఘాలలో రాజ్యంకూడా ఒకటి. అయితే సమాన ప్రతిపత్తి కలిగిన సంఘాలలోరాజ్యానిది ప్రదమ స్థానం అనవచ్చు (First among the equals).

6.10. 4. ఆస్టిన్ అన్నట్లు సార్వభౌముని ఆజ్ఞలే చట్టాలుకాదు. అలాగే చట్టానికి మూలాధారం సార్వభౌముడు కాదు. ప్రజలయొక్క న్యాయ చింతనే నిజానికి శాసనమూలాధారము.

6.10. 5. సార్వభౌమాధికారం ఒక నిర్ణీత మానవాధిక్యునికే చెంది వుంటుంది అనే వాదనను బహుతావాదులు ఖండించారు. రాజ్య వ్యవస్థలలో ఏ ఒక్కరి చేతిలోను సార్వభౌమాధికారం వుండదని వీరంటారు.

6.10. 6. సార్వభౌమత్వానికి సంబంధించిన ఈ వాదోపవాదాలు పండితులకే విసుగు పుట్టించాయి. సార్వభౌమత్వ భావనను అసలు వదిలివేస్తే రాజనీతి శాస్త్రానికి శాశ్వతమైన మేలు కలుగుతుంది అని హెరాల్డ్ లాస్కీ వ్యాఖ్యానించారు. రాజనీతి సిద్ధాంతం నుండి సార్వభౌమత్వాన్ని వెడలగొట్టడం మంచిది అని క్రాబ్ అన్నాడు.

## 6.11 విమర్శ

బహుతావాదంలో కూడా కొన్ని లోపాలు కనిపిస్తాయి. ఇందులో అంతర్గతమైన వైవిధ్యాలు వున్నాయని కొందరు భావించారు. రాజ్యంలో వున్న సాధారణ సంఘాల స్థాయికి రాజ్యాన్ని దిగజార్చడం సమర్థనీయంగా కనిపించదు. బహుతావాదులు అందరూ ఒకే రీతిగా తమ వాదాలను వివరించలేదు. రాజ్యనికి సమన్వయాధికారాన్ని, క్రమబద్ధంచేసె అధికారాన్ని ఇవ్వడానికి హెరాల్డ్ లాస్కీ, బార్కర్ అంగీకరించారు. రాజ్యం ఒక్కటే ఏకీకరణ సాధనం అని, జాతీయ సమైక్యతను కాపాడే ప్రతినిధి అని ఫాలెట్ అభిప్రాయం. అలాగే ఏ అధికారాలు రాజ్యానికి వుండాలో, ఏ అధికారాలు సంఘాలకు వుండాలో బహుతావాదులు స్పష్టం చేయలేదు.

## 6.12 సారాంశము

ఆధునిక రాజ్యం శ్రేయోరాజ్యం. రోజురోజుకి శ్రేయోరాజ్యవిధులు పెరిగిపోతున్నాయి. తత్ఫలితంగా రాజ్యాధికారాలు కూడా విస్తరిస్తున్నాయి. రాజ్య స్వరూపం ఏకత్వసిద్ధాంతంగా మారుతున్నది. అందుకనే బహుతావాదులు కూడా రాజ్యానికి ఉన్నతమైన స్థానాన్ని కల్పించాలని ఒప్పుకున్నారు. అధికార వికేంద్రీకరణ పాలనా సామర్థ్యానికి దోహదం చేస్తుంది. కానీ, సార్వభౌమాధికారం రాజ్యానికే చెంది వుంటుంది. వికేంద్రీకరించబడిన అధికారాలను నియంత్రించి సమన్వయపరచే ప్రక్రియలో భాగంగా రాజ్యాధికారం మరింత విస్తరిస్తుంది. ఏది ఏమైనా రాజ్యాధికారం ఉన్నతమైనదే అయినా ఇతర సంస్థల ప్రాముఖ్యతను కాదనటానికి వీలులేదు.

## అభ్యాసాలు

**I. వ్యాస ప్రశ్నలు :**

1. సార్వభౌమత్వము అనగానేమి? దాని లక్షణాలను వివరింపుము?
2. సార్వభౌమత్వాన్ని నిర్వచించి దాని విశిష్ట లక్షణాలను చర్చించుము.
3. ఆస్టిన్ సార్వభౌమత్వ సిద్ధాంతాన్ని వివరింపుము. దానిపై బహుతావాదుల విమర్శను తెలుపుము.

**II. సంక్షిప్త వ్యాస ప్రశ్నలు:**

1. ఏకత్వ సార్వభౌమత్వాన్ని వివరించి విమర్శించుము.
2. బహుతావాదము అనగానేమి ? దాని ప్రధానాంశము లేవి?

**III. కుశాగ్రబుద్ధి ప్రశ్నలు**

1. రాజనీతి శాస్త్రానికి సంబంధించి సార్వభౌమత్వాన్ని గురించి మొట్టమొదట విపులంగా చర్చించినవాడు ..........................................
2. ఆస్టిన్ సార్వభౌమత్వ సిద్ధాంతమును ...................................................... మొదలయిన వారు తీవ్రంగా విమర్శించారు.
3. "సార్వభౌముని ఆజ్ఞలే శాసనాలు" అని...................................................... అభిప్రాయపడ్డాడు.
4. ఆస్టిన్ ప్రకారం సార్వభౌమాధికారం కేవలం .................................................. చెంది వుంటుంది.
5. రాజనీతి సిద్ధాంతం నుండి సార్వభౌమత్వాన్ని వెడలగొట్టడం మంచిది అని ........................................ పేర్కొన్నాడు.

పాఠం - 7

# రాజ్యావతరణ సిద్ధాంతాలు - I

## (సామాజిక ఒడంబడిక సిద్ధాంతము తప్ప మిగిలినవి)

### 7.0. లక్ష్యం

రాజ్యము ఎలా ఏర్పడింది అనే అంశాన్ని సమగ్రంగా పరిశీలించటం వివిధ రాజ్యావతరణ సిద్ధాంతాలను ఏయే రాజనీతిశాస్త్రవేత్తలు ఎలా బలపరిచారో గ్రహించటం.

### 7.1. విషయక్రమం

7.2 చారిత్రక లేక పరిణామ సిద్ధాంతము

7.2. 1. రక్త సంబంధము

7.2. 2. మతము

7.2. 3. ఆర్థిక కారణాలు

7.2. 4. యుద్ధము లేక బలప్రయోగము

7.2. 5. రాజకీయ చైతన్యము.

7.3 దైవదత్తాధికార సిద్ధాంతము

7.4 బలప్రయోగ సిద్ధాంతము

7.5 సారాంశము

### 7.2 చారిత్రాక లేక పరిణామ సిద్ధాంతము

ఆధునిక రాజనీతి శాస్త్ర వేత్తలంతా చారిత్రక లేక పరిణామ సిద్ధాంతాన్ని రాజ్యావతరణ సిద్ధాంతాలలో ఆమోదయోగ్యమైనదిగా భావిస్తారు. ఈ సిద్ధాంతం ప్రకారం రాజ్యందైవనిర్మితం కాదు. జంక్స్, ఓపెన్ హోమ్‌లు చెప్పినట్లు రాజ్యమేర్పడటానికి బలప్రయోగమే ఏకైక కారణంకాదు. హబ్స్, లాక్, రూసోలు భావించినట్లు రాజ్యము సామాజిక ఒడంబడిక ఫలితంగా ఏర్పడలేదు. గార్నర్ చెప్పినట్లు "దైవమువలన కానీ, బలప్రయోగము వలన కానీ, సామాజిక ఒడంబడిక వలన కానీ కుటుంబము పెరగడము వలన కానీ రాజ్యము ఏర్పడలేదు." పరిణామ ఫలితంగానే రాజ్యమేర్పడిందని ఈ సిద్ధాంతము విశ్వసిస్తుంది. ఎన్నో దశలలో పరిణామ చెందుతూ నేటి స్థితికి అభివృద్ధి చెందిన సంస్థె రాజ్యము. బర్జెస్, మెక్ ఐవర్, గెటిల్, గార్నర్‌లు పరిణామ సిద్ధాంతాన్ని బలపర్చారు. ఈ సిద్ధాంతాన్ననుసరించి అనేక అంశాలు రాజ్యనిర్మాణానికి దోహదము చేసాయి. అంతేకానీ, ఏ ఒక్కటీ రాజ్యమేర్పడటానికి పూర్తి కారణం కాదు. పరిణామ సిద్ధాంతము ప్రకారము క్రింది అంశాలు రాజ్యావతరణకు దోహదము చేశాయి.

**7.2. 1. రక్తసంబంధము :** రాజ్యపరిణామంలో బంధుత్వం లేక రక్తసంబంధం చాలా ప్రధానమైన అంశం. తామందరమూ పూర్వీకుడైన ఒక మూలపురుషుని సంతతివారమనే భావము ఒక తెగలోని వ్యక్తులందరినీ ఐక్యపరచింది. అటువంటి నమ్మకము వలన వారి తెగయొక్క నాయకుని ఆదేశాలను పాటించేవారు. ఒక తెగవారు, ఇతర తెగలవారిని శత్రువులుగా పరిగణించేవారు. ప్రాచీన రాజ్యాలలో ప్రాదేశిక సంబంధాలకంటే వ్యక్తిగత సంబంధాలకు ఎక్కువ ప్రాముఖ్యత ఉండేదని గెటిల్ అభిప్రాయపడ్డాడు.

ఆదిమ మానవులను రక్తసంబంధమే సంఘటిత పర్చింది. కుటుంబసభ్యుల మధ్య ఐక్యతకు కారణం వారి రక్తసంబంధమే. ఆదిమ సమాజంలో కుటుంబ పెద్ద మిగిలిన సభ్యులపై పూర్తి అధికారాన్ని కలిగి ఉండేవాడు. క్రమేణా జనాభా పెరగడంతో ఒక కుటుంబమే అనేక కుటుంబాలుగా చీలిపోయింది. కొంతకాలానికి తెగలు, జాతులు ఏర్పడ్డాయి. తెగనాయకుడే రాజ్యాధిపతి అయ్యాడు. అందువలననే "రక్తసంబంధం కుటుంబాన్ని, కుటుంబం సమాజాన్ని, సమాజం రాజ్యాన్ని సృష్టించాయి", అని మెక్ ఐవర్ పేర్కొన్నాడు.

**7.2. 2. మతము :** రాజ్యనిర్మాణములో మతము ఒక ముఖ్యాంశము. ఒకే మతాన్ని స్వీకరించి, ఒకే దైవాన్ని పూజించడం, పితృదేవతారాధన చేయడం వలన మతము ప్రజలందరినీ ఐక్యపరచింది. జననము, మరణము, అగ్ని, వాయువు, వరదలు, ఉరుములు, మెరుపులు, మొదలైన ప్రకృతి రహస్యాలు ఆదిమమానవునికి అగమ్య గోచరంగా ఉండేవి. ఆదిమ మానవుని మూఢనమ్మకాలవలన మతాధికారులు ప్రజలపై అధికారాన్ని చలాయించటం ప్రారంభించారు. మతాధికారి ఆజ్ఞలను పాటించటంలో ఆదిమ మానవునికి విధేయత, క్రమశిక్షణ అలవడినాయి. ఈ విధంగా మతం ప్రజలను సంఘటిత పరచి రాజ్యపరిణామానికి దోహదము చేసింది. నేటికీ కొన్నిరాజ్యాలు మత ప్రాతిపదికపై ఏర్పడి ఉన్నాయి.

**7.2. 3. ఆర్థిక కారణాలు :** ఆదిమసమాజంలో మానవుని ఆర్థిక కార్యకలాపాలను మూడు భాగాలుగా పేర్కొనవచ్చు. అవి:

a) వేటాడు దశ : అనాగరికులైన ఆదిమ మానవులు వేటగాళ్ళుగా జీవనాన్ని కొనసాగించారు. ప్రకృతి సంపదను సమిష్టిగా అనుభవించారు. జంతువుల మాంసమే ఆహారంగా కొండగుహలే నివాసంగా జీవించారు.

b) పశుపాలన దశ : ఈ దశలో ప్రజలలో కొంతనాగరికత పెరిగింది. పశువులను మచ్చిక చేసుకోవడం, పాలను ఆహారంగా తీసుకోవడం మానవుడు నేర్చుకొన్నాడు. పశువుల రూపంలో స్వంత ఆస్తి ఏర్పడింది. అయితే మానవులు స్థిరనివాసము ఏర్పరచుకోకుండా సంచారులుగనే జీవించారు.

c) వ్యవసాయక దశ : కొంతకాలానికి ప్రజలు ఒక ప్రదేశంలో స్థిరపడి భూమిని సాగుచేసి పంటలను పండించటం ప్రారంభించారు. వ్యక్తిలో స్వార్థం పెరిగి మిగిలిన వారికంటే ఎక్కువ ఆస్తిని సంపాదించాలనే ఆశ కలిగింది. దానితో సమాజంలో ధనిక, పేద వర్గాలు ఏర్పడ్డాయి. వర్గాలు ఏర్పడటంతో వారి మధ్య వివాదాలు ప్రారంభమయ్యాయి. ఈ పరిణామం వలన ఆస్తుల రక్షణకు వివాదాల పరిష్కారానికి శాసనాలు అవసరమయ్యాయి. స్థిర నివాసం వలన ఒక భూభాగంలోని ప్రజలు శాసనాలను రూపొందించటానికి తమ నాయకులను ఎన్నుకొనడం మొదలు పెట్టారు. ఈ విధంగా ఆర్థిక కారణాలు రాజ్యావతరణకు దోహదము చేసాయి.

**7.2. 4. యుద్ధము లేక బలప్రయోగము :** బలప్రయోగం లేక యుద్ధం కూడా రాజ్యావతరణకు దోహదం చేసింది. ప్రైవేటు ఆస్తి వివిధ తెగల మధ్య సంఘర్షణలకు దారి తీసింది. యుద్ధ సమయాలలో ఆత్మరక్షణకు లేక దురాక్రమణ జరుపుటకు ఒక తెగవారు ఒక వ్యక్తి నాయకత్వములో నడుచుకోవలసి వచ్చేది. యుద్ధంలో విజయాన్ని సాధించిన నాయకుడిని పాలకునిగా ప్రజలు గుర్తించారు. ఓడిపోయినవారు ఆ నాయకునిపట్ల విధేయతతో మెలిగేవారు. ఈ విధంగా రాజ్యావతరణకు యుద్ధం కూడ ఒక కారణమయింది.

**7.2. 5. రాజకీయ చైతన్యము :** ఉమ్మడి లక్ష్యసాధనకు ఒక ఉమ్మడి అధికారి అవసరమనే భావననే రాజకీయ చైతన్యమనవచ్చు. ఆదిమ మానవుడు క్రమేణా శాంతి భద్రతల ప్రాముఖ్యతను గుర్తించాడు. వీటి పరిరక్షణకు నియమ నిబంధనలు రూపొందించి అమలు పరచడానికి ఒక వ్యవస్థ అవసరమని కూడా గుర్తించాడు. ఇటువంటి గుర్తింపే రాజకీయ సంస్థల స్థాపనకు దారితీసింది.

## 7.3 దైవ దత్తాధికార సిద్ధాంతము

రాజ్యావతరణ సిద్ధాంతాలన్నింటిలో దైవదత్తాధికార సిద్ధాంతము ప్రాచీనమైనది. రాజ్యమును గురించి చింతన ఎంత ప్రాచీనమైనదో దైవదత్తాధికార సిద్ధాంతము కూడ అంత ప్రాచీనమైనది. ఈ సిద్ధాంతము ప్రకారం రాజ్యము భగవంతుని సృష్టి. దైవప్రతినిధిగా రాజు రాజ్యాన్ని పాలిస్తాడు. రాజు యొక్క అధికారానికి బద్ధులై ఉండటం ప్రజల యొక్క విధి. రాజును ధిక్కరించటం నేరమే కాకుండా పాపం కూడ. రాజును ధిక్కరిస్తే భగవంతుని ధిక్కరించినట్టు అవుతుంది. ప్రాచీన కాలములో దైవదత్తాధికార సిద్ధాంతం రమారమి అన్ని

దేశాలలో ప్రచారంలో ఉండేది. మహాభారతములోని శాంతి పర్వములో దాని ప్రస్తావన ఉంది. అశాంతి, అలజడులనుండి తమను రక్షించవలసినదిగా ప్రజలు భగవంతుని ప్రార్థించగా, వారి మొరను ఆలకించిన భగవంతుడు మనువును వారికి రాజుగా పంపినట్లు భారతములో పేర్కొనబడింది. రాజుకు భగవంతునినుండి అధికారాలు సంక్రమించాయని పాతనిబంధన ప్రస్తావించింది. క్రైస్తవ మతానికి చెందిన సెయింట్‌పాల్ "ప్రతివ్యక్తి అత్యున్నతాధికారానికి లోబడి ఉండాలి. భగవంతుని అధికారమే ఈ అత్యున్నతమైన అధికారము. అధికారాలన్నీ ఆయన నుండి జనించినవే" అని పేర్కొన్నాడు. ప్రాచీన యూదులు కూడా భగవంతుడే తమను ప్రత్యక్షంగా పరిపాలించటానికి రాజును నియమించాడని నమ్మేవారు. మధ్యయుగాలలో ఈ సిద్ధాంతము తిరుగులేకుండా చలామణి అయింది.

**7.3. 1. రాజుల దైవికాధికారాలు :** 16, 17 శతాబ్దాలలో ఇంగ్లండ్‌లో దైవదత్తాధికార సిద్ధాంతము రాజుల దైవికాధికార సిద్ధాంతంగా మారింది. స్టూవర్ట్ వంశరాజులైన జేమ్స్ I, జేమ్స్ II లు తమ అధికారాలను రాజులు భగవంతుని నుండి పొందారని వాదించారు. జేమ్స్ I తన "The Law at Pre Monarchy" అనే గ్రంథంలో రాజుల దైవ దత్తాధికారాన్ని సమర్థించాడు. ఆయన తన గ్రంథంలో "భువిపై భగవంతుని సజీవ ప్రతిబింబాలే రాజులు" అని పేర్కొన్నాడు. రాజు నియంత అయినప్పటికీ ప్రజలకు ఆయనపై తిరుగుబాటు చేసే హక్కు లేదు. తమ అధికార నిర్వహణలో రాజులు దైవానికే గాని ప్రజలకు బాధ్యత వహించరు. ఫ్రాన్స్‌లో 14వ లూయీ నిరంకుశ పాలనను ఈ సిద్ధాంతాన్ని ఆధారముగా చేసికొని అతని మంత్రి బోసెట్ సమర్థించాడు. లూయీ XIV స్వయంగా "నేనే రాజ్యము" అని పేర్కొన్నాడు.

**7.3. 2. సిద్ధాంతములోని ప్రధానాంశాలు :** 1. రాజరికము దైవికమైనది. రాజులు భగవంతుని ప్రతిరూపాలు. వారు తమ అధికారాలను దైవమునుండే పొందుతారు. 2. రాజ్యము దైవ నిర్మితము 3. రాజులు దైవానికే కాని ప్రజలకు బాధ్యులు కారు.

4. దైవ ప్రతినిధియైన రాజు అధికారాన్ని ధిక్కరించటం నేరమే కాక పాపం కూడా.

5. నియంతయైనప్పటికి రాజును తొలగించేఅధికారాము ప్రజలకు లేదు. చెడ్డవారు, పాపులు అయిన ప్రజలను పాలించటానికి తద్వారా శిక్షించటానికి నిరంకుశుడైన రాజును భగవంతుడే పంపుతాడు.

**7.3. 3. సిద్ధాంత లోపాలు:** ఆధునికి రాజనీతి శాస్త్రవేత్త లెవ్వరూ దైవదత్తాధికార సిద్ధాంతాన్ని ఆమోదయోగ్యమైన రాజ్యావతరణ సిద్ధాంతంగా పరిగణించరు. ఈ సిద్ధాంతము తీవ్ర విమర్శలకు గురి అయింది. అవి:

1. రాజును భగవంతుడు నియమించాడనుకోవడము అశాస్త్రీయము. ఆధునిక ప్రపంచంలో హేతువాదానికి ప్రాధాన్యత పెరిగింది. రాజరికము ఎలా అభివృద్ధి చెందిందీ మనకు చరిత్ర చెప్పుచున్నది. కాబట్టి ఈ సిద్ధాంతము హేతుబద్ధమైనది కాదు.

2. దైవ దత్తాధికార సిద్ధాంతము ప్రజాస్వామ్య సూత్రాలకు వ్యతిరేకము. రాజ్య నిర్మాణంలో ప్రజల పాత్ర లేదని ఇది తేల్చింది. రాజరికాన్నే ఆదర్శమైన పాలనా వ్యవస్థగా ఈ సిద్ధాంతం చిత్రీకరించింది.

3. పాలకుల అధికారాన్ని ప్రశ్నించే అధికారం ప్రజలకు లేదనటం ప్రజల రాజకీయ సార్వభౌమాధికార సిద్ధాంతానికి వ్యతిరేకము. ప్రజలకు ప్రభుత్వం బాధ్యత వహించాలనే సూత్రానికి గూడ వ్యతిరేకమే.

4. గిల్‌క్రిస్ట్ ప్రకారం దైవ దత్తాధికార సిద్ధాంతం విమర్శకు గురి కావడానికి మూడు కారణాలు ఉన్నాయి. అవి A) సామాజిక ఒడంబడిక సిద్ధాంతము ప్రచారములోకి రావడం B) మతాన్ని రాజ్యమునుండి వేరు చేయడంతో ఐహిక జీవితములో మత ప్రాధాన్యత తగ్గటం C) ప్రజాస్వామ్య భావాలు ప్రబలటంతో ప్రజలు తమ హక్కుల విషయంలో చైతన్యవంతులవటం.

**7.3. 4. సిద్ధాంత ప్రాధాన్యత :** పై లోపాలు ఉన్నప్పటికీ దైవ దత్తాధికార సిద్ధాంతానికి కొంత ప్రాధాన్యత లేకపోలేదు. ఆదిమ సమాజంలో సమాజాన్ని క్రమబద్ధం చేయటంలో ఆ సిద్ధాంతము ఎంతో తోడ్పడింది. అనాగరికులైన ప్రజలలో శాసన విధేయతను పెంపొందించింది. రాజ్యంలో సుస్థిర శాంతి భద్రతలను నెలకొల్పటంలో ఆ సిద్ధాంతం తోడ్పడింది. ప్రజా జీవితంలోను, రాజకీయాలలోను ఈ సిద్ధాంతం కొంతవరకు నైతిక విలువలను నెలకొల్పగలిగింది. 15,16 శతాబ్దాలలో యూరప్ రాజ్యాలలో భూస్వాముల వలన అంతర్యుద్ధాలు ప్రబలాయి. ఆ సమయంలో రాజులు ఈ సిద్ధాంతం ద్వారా తమ దేశాలలో శాంతి భద్రతలను నెలకొల్పి సమైక్యతను పెంపొందింపగల్గారు.

## 7.4 బలప్రయోగ సిద్ధాంతము

రాజ్యావతరణ సిద్ధాంతాలలో బలప్రయోగసిద్ధాంత మొకటి. ప్రాచీన కాలంలో వివిధ జాతుల, తెగల మధ్య నిరంతర యుద్ధాలు జరిగాయి. ఓడిపోయిన జాతులపై గెలుపొందిన వారు అధికారాన్ని చలాయించే వారని కాలక్రమేణా బలప్రయోగం ద్వారానే విజేతలు స్వాధీనం చేసికొన్న విశాలమైన భూభాగాలే రాజ్యములైనవని ఈ సిద్ధాంతం విశ్వసిస్తుంది. బలప్రయోగ సిద్ధాంతాన్ని బలపరచిన వారిలో ఓపెన్‌హోమ్, లీకాక్, జంక్స్ వార్డ్ అను అమెరికన్ శాస్త్రవేత్తలు ముఖ్యులు. ఓపెన్ హోమ్ ఈ సిద్ధాంతము ఆధారంగా రాజ్యావతరణ ఆరుదశలలో జరిగినట్లు వివరించాడు. అవి :

1. మొదటిదశలో వివిధజాతుల, తెగలమధ్య నిరంతర యుద్ధాలు జరుగుతూ ఉండేవి. ఈ యుద్ధాలలో విజేతలు ఓడిపోయినవారిని చంపి వారి ఆస్తులను, భార్యలను స్వాధీనం చేసికొనేవారు. 2. రెండవదశలో రైతులు తమ ఆస్తిపాస్తులను రక్షించుకొనడానికి దురాక్రమణ దారులను తరిమికొట్టడానికి విఫలప్రయత్నం చేసి చివరికి వారికి లొంగిపోయేవారు. 3. మూడవదశలో గెలుపొందిన, ఓడిపోయిన తెగల మధ్య సదవగాహన ఏర్పడేది. పరిపాలన సాఫీగా జరగడానికి, శాంతి భద్రతలను నెలకొల్పడానికి అవకాశం కలిగేది. 4. నాల్గవదశలో అందరూ ఏకమై నిలబడి విదేశీ దురాక్రమణదారులను ప్రతిఘటించేవారు. 5. ఐదవదశలో ప్రజలలోని అంతః కలహాలను రూపుమాపి మధ్యవర్తిత్వం నెరపే వ్యవస్థ ఏర్పడేది. అదే ప్రభుత్వము. 6. చివరిదశలో సైన్యాధికారులే రాజులై అధికారాన్ని చేపట్టి శాంతిభద్రతలను నెలకొల్పేవారు. వీరి అధికారం క్రింది ప్రజలు, ఇతరజాతుల ప్రాబల్యం లేకుండ స్వతంత్రంగా ఉండేవారు. ఈ విధంగా రాజ్యమేర్పడింది

రాజ్యావతరణ మాత్రమే కాక కొంతవరకు రాజ్యం మనుగడ కూడా బలప్రయోగం పైన ఆధారపడి ఉంటుంది. రాజ్యభాగంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు బలగాన్ని, రాజ్యభూభాగ రక్షణకు సైన్యాన్ని ప్రతిరాజ్యం పోషిస్తుంది. అహింస అంతర్జాతీయ సహకారాలలో విశ్వాసమున్న భారతదేశం గూడ 1962 చైనా యుద్ధం తరువాత తనసైనికశక్తిని పెంచుకొనక తప్పలేదు. శిక్షపడుతుందనే భయంవల్లనే ప్రజలు చట్టాలపట్ల విధేయులగా ఉంటారని ఈ సిద్ధాంతం విశ్వసిస్తుంది. ప్రపంచరాజకీయాలలో తమ ఆధిక్యతను పెంచుకొనుటకు శక్తివంతమైన సైనికశక్తి కూడ ఒక కారణమవుతున్నది.

**7.4. 1. బలప్రయోగసిద్ధాంతాన్ని సమర్థించినవారు :** బలప్రయోగ సిద్ధాంతాన్ని వివిధకారణాల వలన అనేకమంది బలపర్చారు. వారిలో క్రింది వారు ముఖ్యులు.

1. **మధ్యయుగంలో మతాధికారులు:** మధ్యయుగాలలో చర్చి అధినేతలకు రాజులకు మధ్య అధికారాన్ని చలాయించే విషయంలో వివాదాలేర్పడినాయి. ఆ సమయంలో ఐరోపాలోని మతాధికారులు కేవలము పశుబలముపై ఆధారపడిన రాజ్యంకంటే దేవునిచే నెలకొల్పబడిన చర్చియే గొప్పదని నిరూపించడానికి ఈ సిద్ధాంతాన్ని సమర్ధించారు.
2. **వ్యక్తి శ్రేయోవాదులు :** బలంకలిగినవాడే బ్రతకాలి, బలహీనుడు అంతంకావడము ప్రకృతిన్యాయము. ఈ విధంగా వ్యక్తులమధ్య పోటీని సమర్ధించడానికి వ్యక్తి శ్రేయోవాదులు సిద్ధాంతాన్ని సమర్ధించారు.
3. **కమ్యూనిస్టులు :** పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాల రాజ్యాధికారాన్ని బలప్రయోగము చేతనే కూలద్రోసి శ్రామిక నియంతృత్వాన్ని నెలకొల్పి సమసమాజాన్ని నెలకొల్పాలని బోధిస్తారు. పెట్టుబడిదారీ వర్గాల నిర్మూలనకు కమ్యూనిస్టులు బలప్రయోగాన్ని సమర్ధిస్తారు.
4. **అరాచకవాదులు :** అరాచక వాదులు అధికారాన్ని అది ఏ రూపంలో ఉన్నా వ్యతిరేకిస్తారు. రాజ్యరహిత సమాజస్థాపన వారి లక్ష్యము. తమ లక్ష్యసాధనకు అరాచకవాదులు బలప్రయోగాన్ని సమర్ధిస్తారు.
5. **నియంతలు :** జర్మనీలో బెర్న్‌హోరట్, సొరెల్ బలప్రయోగసిద్ధాంతాన్ని సమర్ధించారు. ఏది తప్పు ఏది మంచిది అనేది యుద్ధము ద్వారా తేలవలసిందేనని బెర్న్‌హోరట్ అంటాడు. యుద్ధము ఆంతరంగిక కలహాలను రూపుమాపి ప్రజలలో దేశభక్తిని, జాతీయ సమైక్యతను పెంపొందిస్తుందని వారి అభిప్రాయం. ముస్సోలినీ, హిట్లర్‌లు కూడా బలప్రయోగాన్ని, యుద్ధాన్ని కీర్తించారు.

**7.4. 2 బలప్రయోగ సిద్ధాంతలోపాలు :** 1. బలప్రయోగము వలననే రాజ్యావతరణ జరిగిందనటం ఆమోదయోగ్యం కాదు. మతము, ఆర్థికకారణాలు ప్రజలలో రాజకీయ చైతన్యంతో బాటు బలప్రయోగం కూడ రాజ్యావతరణకు దోహదం చేసింది. అంతేగాని

అదిఒక్కటే పూర్తికారణం కాదు. 2. కేవలము బలప్రయోగము పై రాజ్యాలు ఎక్కువ కాలము నిలువలేవు. "ప్రజాభీష్టమేగాని బల ప్రయోగము రాజ్యానికి ఆధారము కాదు" అని T.H. గ్రీన్ చెప్పినది చారిత్రక సత్యము. 3. బలవంతుడిదే రాజ్యమనే భావన ప్రమాదకరమైనది. ఈ భావన అరాచకానికి దారితీస్తుంది. 4. బలప్రయోగ సిద్ధాంతము ప్రజాస్వామ్య, ఉదారతావాదాలకు వ్యతిరేకము. 5. ఈ సిద్ధాంతము అంతర్జాతీయ శాంతికి గొడ్డలిపెట్టు. ఇది స్వతంత్ర రాజ్యాలమధ్య యుద్ధాన్ని ప్రేరేపిస్తుంది. 6. ఈ సిద్ధాంతము నియంతృత్వ ప్రభుత్వాలను నెలకొల్పడానికి దోహదం చేస్తుంది.

## 7.5 సారాంశము

రాజ్యావతరణ సిద్ధాంతాలు చాలా ఉన్నాయి. రాజ్యమెందుకు, ఏవిధంగా పుట్టిందో ఒక్కొక్క సిద్ధాంతము ఒక్కొక్క రకంగా వివరిస్తుంది. ఉదాహరణకు రాజ్యము దేవునిచే సృజింపబడిందని దైవ దత్తాధికార సిద్ధాంతము చెప్పింది. యుద్ధము వలన రాజ్యమేర్పడిందని బలప్రయోగ సిద్ధాంతము చెప్పింది. రాజ్యము వివిధ కారణాల వలన క్రమంగా అభివృద్ధి చెందిందని పరిణామ సిద్ధాంతము చెప్పింది. ప్రస్తుతమందరూ పరిణామ సిద్ధాంతాన్ని అంగీకరిస్తున్నారు. మిగిలిన సిద్ధాంతాలన్నిటిలోను ఉన్న మంచి లక్షణాలు ఈ సిద్ధాంతములో ఉన్నాయి.

### అభ్యాసాలు

**I. వ్యాస ప్రశ్నలు :**

1. రాజ్యావతరణ సిద్ధాంతాలను వివరింపుము.
2. చారిత్రక పరిణామ సిద్ధాంతాన్ని చర్చించుము.

**II. సంక్షిప్త వ్యాస ప్రశ్నలు :**

1. దైవ దత్తాధికార సిద్ధాంతాన్ని పరిశీలింపుము.
2. బలప్రయోగ సిద్ధాంతాన్ని వివరించండి.

**III. కుశాగ్రబుద్ధి ప్రశ్నలు**

1. "రక్త సంబంధం కుటుంబాన్ని, కుటుంబం సమాజాన్ని, సమాజం రాజ్యాన్ని సృష్టించాయి". అని .......................... పేర్కొన్నాడు
2. .................................. "నేనే రాజ్యము" అని పేర్కొన్నాడు.
3. ఓపెన్ హోమ్ ప్రకారం బలప్రయోగ సిద్ధాంతం రాజ్యావతరణ .................................... దశలలో జరిగినట్లు వివరించాడు.
4. "ప్రజాభీష్టమే గాని బలప్రయోగము రాజ్యానికి ఆధారము కాదు" అని .........................................అభిప్రాయపడ్డాడు.
5. చారిత్రక సిద్ధాంతం ప్రకారం రాజ్యం........................................ ఫలితంగా ఏర్పడుతుంది.

పాఠం - 8

# రాజ్యావతరణ సిద్ధాంతాలు - II

## సామాజిక ఒడంబడిక సిద్ధాంతము

## 8.0 లక్ష్యం :

రాజ్యం ఎలా అవతరించింది అనేది వివాదాలతో కూడిన విషయం. పెక్కుమంది రాజనీతి తత్త్వవేత్తలు రాజ్యావతరణకు సంబంధించి పెక్కు సిద్ధాంతాలను ప్రతిపాదించారు. ఈ సిద్ధాంతాలన్నీ అనేక అంశాలను ఆధారంగా చేసుకొని తమ వాదనలను వినిపిస్తాయి. ఈ పాఠంలో ప్రధానంగా సామాజిక ఒడంబడిక సిద్ధాంతం ప్రకారం రాజ్యం ఎలా అవతరించిందో చర్చిస్తాము. ఈ సిద్ధాంతాన్ని ముగ్గురు ప్రముఖ రాజనీతి తత్త్వవేత్తలు హాబ్స్, లాక్, రూసో ప్రతిపాదించారు. రాజ్యం సామాజికమైన ఒప్పందం ఫలితంగా ఏర్పడినట్లు ఈ పాఠం వివరిస్తుంది.

## 8.1. విషయక్రమం

8.2. రాజ్యావతరణం

8.3. సామాజిక ఒడంబడిక సిద్ధాంతాలు

8.4. హాబ్స్ సిద్ధాంతం

8.5. లాక్ సిద్ధాంతము

8.6. రూసో సిద్ధాంతము

8.7. హాబ్స్, లాక్, రూసోల సిద్ధాంతపరమైన భేదాలు తులనాత్మక పట్టిక

8.8. సారాంశము

## 8.2. రాజ్యావతరణం

రాజనీతి శాస్త్ర అధ్యయనానికి కేంద్ర బిందువు రాజ్యము. రాజ్య మౌలికాంశాలను ఇంతకుముందే మనం తెలుసుకున్నాం. అయితే రాజ్యం అనేది ఎలా పుట్టింది, పరిణామం చెందింది అనేది ఉత్సాహాన్ని కల్గించే విచారణ. రాజ్యావతరణం మొదలు నేటి రాజ్య స్వరూపం వరకు ఎంతో కాలంగా రాజ్యం క్రమ వికాసాన్ని చెంది రూపురేఖలను సంతరించుకొని ఈనాటి సంక్షేమ రాజ్య రూపాన్ని పొందింది. రాజ్యం ఎలా అవతరించింది అనే విషయానికి వస్తే అనేకమంది రాజనీతి తత్త్వవేత్తలు అనేక అభిప్రాయాలు వెలిబుచ్చారు. ఇందులో ఎక్కువ భాగం వ్యక్తిగతమైన ఊహాజనితాలు. తక్కువ భాగం తార్కికబలం, శాస్త్రీయ విశ్లేషణ కలిగిన సిద్ధాంతాలు. అయితే ఈ సిద్ధాంతాలన్నీ ఒకే కాలం నాటివికావు. అనేక కాలాలకు చెంది, ఆనాటి సమకాలిక సాంఘిక, రాజకీయ మత పరిస్థితులవలన ప్రభావితమైన సిద్ధాంతాలు. అంతేకాకుండా ఈ సిద్ధాంతాలన్ని రాజ్యాన్ని నిర్వచించి రాజ్య విధేయత కారణాలను కూడా విపులంగా విశదీకరిస్తాయి. కాబట్టి రాజ్యావతరణ కేవలం ఊహాజనితంగా మాత్రమే కొట్టివెయ్యకుండా, ఏ అంశాలు, ఏ పరిస్థితులు రాజ్యావతరణకు దోహదం చేసాయో నిష్పక్షపాతంగా మనం ఆలోచించాలి. అంతేకాకుండా ఈ రాజ్యావతరణ సిద్ధాంతాల ప్రభావం అనంతర కాలంలో ఏ మేరకు ఉన్నదో కూడా మనం పరిశీలించాల్సి ఉంది. అయితే ప్రస్తుత చర్చ భారత్, బ్రిటన్ లేక అమెరికా మొదలైన రాజ్యాల అవతరణకు సంబంధించినది కాదని, ఇది మౌలికమైన రాజ్యవతరణకు మాత్రమే సంబంధించిన సాధారణ సిద్ధాంత ప్రతిపాదన అని, మనం గుర్తించాలి. అంతేకాక సాధారణ చారిత్రక దృష్టితో రాజ్యం యొక్క పుట్టుకను మనం ఇందులో చర్చిస్తాము.

## 8.3 సామాజిక ఒడంబడిక సిద్ధాంతము (Social Contract Theory) :

రాజ్యావతరణాన్ని వివరించే ప్రాచీన సిద్ధాంతాలలో సామాజిక ఒడంబడిక సిద్ధాంతం ముఖ్యమైంది. ప్రజలు చేసుకొన్న ఒక ఒప్పందం ద్వారా రాజ్యం అవతరించిందనేది ఈ సిద్ధాంత సారాంశం. పాశ్చాత్య దేశాలలో ఈ సిద్ధాంతాన్ని 18 వ శతాబ్దం దాకా నమ్ముతూ వచ్చారు. ప్రాచీన కాలంలో రాజకీయాధికారానికి ప్రజల ఒడంబడికే కారణం అని బౌద్ధులు విశ్వసించారు. అలాగే కౌటిల్యుని అర్థశాస్త్రం లోనూ, మహాభారతంలోని శాంతి పర్వంలోనూ, సామాజిక ఒడంబడిక సిద్ధాంత ప్రస్తావన మనకు కనిపిస్తుంది. 16, 17 వ శతాబ్దాలలో ఈ సిద్ధాంతం గొప్ప ప్రచారాన్ని పొందింది. మొట్టమొదటి సారిగా సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని శాస్త్రీయ పద్ధతిలో హ్యూగో వివరించాడు. గ్రోషియస్, థామస్‌హాబ్స్, జాన్ లాక్, రూసో, సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని బలపరచిన వారిలో ముఖ్యులు.

**సిద్ధాంతంలోని ప్రధాన అంశాలు :**

8.3. 1 ఈ సిద్ధాంతాన్ని అనుసరించి ప్రాకృతిక వ్యవస్థ (State of Nature) అనేది ఒకటుంది. ఇది రాజ్యం ఏర్పడడానికి ముందువున్న వ్యవస్థ దుర్భరమైన ఈ వ్యవస్థ నుండి మానవుడు బుద్ధిపూర్వకంగా ఒక సామాజిక ఒప్పందం ప్రాతిపదికగా బయటపడ్డాడు. ఈ ఒప్పందం ఫలితమే రాజ్యావతరణం. అయితే కొందరు రచయితలు ప్రాకృతిక వ్యవస్థలో సాంఘిక జీవనమే లేదని భావించారు. కానీ అందరూ ఈ ప్రాకృతిక వ్యవస్థ రాజ్యం ఏర్పడటానికి ముందు వున్న దశ అని అంగీకరించారు.

8.3. 2 ప్రాకృతిక వ్యవవస్థలో మానవుడు కొన్ని ప్రకృతి ధర్మాలను పాటిస్తూవుండేవాడు. ఈ ప్రకృతి ధర్మాలనే లేదా ప్రాకృతిక సూత్రాలనే సహజ న్యాయాలంటారు.

8.3. 3 ఈ సిద్ధాంతంలో ప్రాకృతిక వ్యవస్థ అనేది ప్రధాన అంశము. ఇది సమాజం ఏర్పడటానికి పూర్వం ఉన్నటువంటి పరిస్థితి. ఈ వ్యవస్థలో మానవుడు ఎన్నో చిక్కులను కష్టాలను, భద్రతరాహిత్యాన్ని ఎదుర్కొనేవాడు. ఒకవిధంగా చూస్తే పెద్ద చేప చిన్న చేపను మింగే రీతిలో (మత్స్య న్యాయము) వ్యక్తుల జీవితాలు నడిచేవి. ఇలాంటి దుర్భరమైన పరిస్థితులలో మానవుడు బుద్ధిపూర్వకంగా ఒక ఒప్పందం ద్వారా రాజకీయ సమాజాన్ని లేదా రాజ్యాన్ని లేదా పాలకుడిని ఏర్పరచుకున్నాడు. ప్రాకృతిక నియమాల ప్రకారం నడచిన మానవ జీవనం ఈ ఒప్పందం తరువాత మానవ నిర్మితమైన శాసనాలకు లోబడి నడవటం ప్రారంభించింది.

8.3. 4 మానవుడు పాశవిక స్థితినుండి రాజకీయ చైతన్యంతో గుణాత్మకంగా సంస్కార వంతుడైనాడు. ఈ మహత్తర పరిమాణానికి మూలం సామాజిక ఒడంబడిక. ఈ ఒడంబడిక వలన వ్యక్తి జీవితానికి, స్వేచ్ఛకూ, ఆస్తికి భద్రత లభించింది. ప్రజలు తమ పాలకునికి విధేయులైనారు. పాలకుడు చేసే శాసనాలను శిరసావహించారు. సహజ న్యాయాల స్థానంలో మానవ నిర్మితమైన, శాసనాలు అమలులోకి వచ్చాయి. సహజ హక్కులు బదులు సాంఘిక హక్కులు ఉద్భవించాయి. వీటన్నిటికి ఒడంబడిక ద్వారా ఏర్పడిన రాజకీయ సమాజం లేదా రాజ్యమే మూలం. కాబట్టి రాజ్యావతరణకు సామాజిక ఒడంబడికే మూలకారణం. అయితే ఈ ఒప్పందానికి సంబంధించిన నిబంధనలను గురించి, ఉభయపక్షాల గురించి ఒడంబడిక వాదులలో ఏకాభిప్రాయం లేదు. ఏది ఏమైనా రాజ్యం మానవ నిర్మితమని, రాజ్యావతరణకు సామాజిక ఒప్పందమే మూలమని సామాజిక ఒడంబడిక సిద్ధాంతం నిర్ధారిస్తుంది.

## 8.4 సామాజిక ఒడంబడిక సిద్ధాంతం - థామస్ హాబ్స్

థామస్ హాబ్స్ ఇంగ్లండ్‌కు చెందిన సుప్రసిద్ధ రాజనీతి తత్త్వవేత్త. ఈయన ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో చదివాడు. యూరప్ దేశాలలో పర్యటిస్తూ ఆనాటి విజ్ఞానవేత్త గెలీలియోను కలిసాడు. హాబ్స్‌పై గెలీలియో వైజ్ఞానిక ప్రభావం చాలా ఉంది. 1642 - 51 లో ఇంగ్లండ్‌లో జరిగిన అంతర్ యుద్ధం రాజకీయంగా హాబ్స్‌ను ప్రభావితం చేసింది. ఈ అంతర్ యుద్ధాన్ని హాబ్స్ తీవ్రంగా వ్యతిరేకించాడు. ఇంగ్లండ్ స్టువర్ట్ రాజవంశీయుల నిరవధిక రాజ్యాధికారం వల్లనే రక్షించబడిందని హాబ్స్ నమ్మకం. ఇలాంటి అంతర్‌యుద్ధాలను నివారించటానికి పాలకునికి నిరపేక్షమైన అధికారాలు ఉండాలని వాదిస్తూ దానికి సమర్ధనగా హాబ్స్ సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. థామస్ హాబ్స్ 1651 లో లెవియథాన్ (Leviathan) అనే గొప్ప గ్రంథాన్ని రచించాడు. లెవియథాన్ అంటే అశాశ్వతమైన భగవంతుడు (Mortal God) అని అర్థం. లెవియథాన్ హాబ్స్ రాజకీయ భావాలకు అక్షర రూపం. ఇంగ్లండ్‌ను అంతర్ యుద్ధంనుంచి

రక్షించి ప్రజలకు శాంతి సౌభాగ్యాలను కల్పించడానికి నిరవధికమైన అధికారాలు కలిగిన సార్వభౌముడే ఏకైక సాధనం అని హాబ్స్ సూచించాడు. హాబ్స్ తన నిరపేక్ష సార్వభౌమపు సిద్ధాంతాన్ని సమర్థించుకోవడానికి సామాజిక ఒడంబడిక సిద్ధాంతం ఒక సాధనం అయింది.

**8.4. 1. ప్రాకృతిక వ్యవస్థ :** హాబ్స్ సిద్ధాంతం ప్రాకృతిక వ్యవస్థతో ప్రారంభమవుతుంది. అసలు సమాజమేర్పడటానికి ముందు మానవుడు ఎలా జీవించేవాడో తెలియజేసేది ఈ ప్రాకృతిక వ్యవస్థ. ఈ సమాజ పూర్వ వ్యవస్థను వర్ణించేముందు హాబ్స్ మానవ స్వభావాన్ని వివరిస్తాడు. ఆనాటి ప్రాకృతిక వ్యవస్థ అజ్ఞాన జనిత అంధకారమయం. సాంఘిక జీవనమే లేదు. మానవుడు స్వార్థపరుడు, క్రూరుడు కావటం వల్ల ఎప్పుడు తమ భద్రత గురించి తహతహలాడేవాడు. తన స్వార్థం కోసం, అధికారం కోసం మానవులు పరస్పరం పోటీపడేవారు. ఇది వ్యక్తుల మధ్య పోటి, భద్రతారాహిత్యం, అహంకారం, సంఘర్షణకు దారితీసింది. చివరకు ఒకరిపై ఒకరు తలపడే నిరంతర యుద్ధ స్థితిని సృష్టించింది.

ప్రాకృతిక వ్యవస్థలోని మానవుని జీవితం అనాగరికంగా ఉండేది. సాహిత్యం, కళలు, వ్యవసాయం, పరిశ్రమలు వంటివి లేవు. వ్యక్తిప్రాణానికి, ఆస్తికి భద్రత లేదు. అడవి జంతువుల వలె మనుషులు ప్రవర్తిస్తూ ఉండడం వలన ప్రాకృతిక వ్యవపస్థలోని మానవజీవితం ఏకాంతము, దారిద్ర్యం, పాశవికం, అల్పకాలికంగా మారింది. అయితే ఈ ప్రాకృతిక వ్యవస్థలో ప్రకృతి ప్రసాదించిన సహజ స్వేచ్ఛను మానవుడు అనుభవించేవాడు. ఈ స్వేచ్ఛ అనేది బలవంతుడికే దక్కేది. అంటే బలవంతుడే నీతివంతుడు అన్న నానుడిని సార్థకం చేసినట్లు వుండేది.

**8.4. 2. సామాజిక ఒడంబడిక:** దుర్భరమైన యుద్ధ స్థితినుండి బయటపడడం, బతకకలగడం అప్పటి తక్షణ సమస్య. వ్యక్తి ప్రాణానికి ముప్పు వాటిల్లిన ఆ పరిస్థితినుండి విముక్తి పొందటానికి అందరు ఒక ఒడంబడిక చేసుకున్నారు. అది ప్రజలు తమలో తామే చేసుకొన్న ఒడంబడిక. దీని ప్రకారం ప్రజలు అందరూ తమ హక్కులను తమకు రక్షణ కల్పించగలిగిన ఒక సార్వభౌమునికి ఇచ్చివేశారు. ఒకే ఒక్క ప్రాణరక్షణ హక్కును మాత్రమే ప్రజలు తమ వద్ద వుంచుకున్నారు. మిగిలిన హక్కులు అన్నీ సార్వభౌమునికె వదలివేసారు. వదులుకున్న హక్కులను తిరిగి తీసుకొనే హక్కు ప్రజలకు లేదు. సార్వభౌముడు ఒక వ్యక్తి కావచ్చు లేదా వ్యక్తుల సమూహంకావచ్చు. ఏమైనా సార్వభౌముడు నిరపేక్షమైన అధికారాలను చెలాయిస్తాడు. అయితే ప్రజలను రక్షించలేని సార్వభౌముడి ఆజ్ఞలను ప్రజలు శిరసావహించనవసరం లేదు. అంతేగాక ఏ వ్యక్తిని ఆత్మ వినాశక రీతిలో సార్వభౌముడు శాసించలేడు. దీనిని బట్టి ప్రజలకు జీవించే హక్కును అమలు పరచవలసిన బాధ్యత సార్వభౌమునిది కాగా, ప్రజలు నిర్బంధంగా శిరసావహించాల్సిన విధి ప్రజలది అవుతుంది. ఇదే సామాజిక ఒడంబడికకు మూలసూత్రం.

కాబట్టి ఈ ఒడంబడిక వలన సార్వభౌముడు అవతరించాడు. ఈ ఒప్పందానికి ప్రజలేబద్ధులు కాని సార్వభౌముడు కాదు. దీని పర్యవసానమే దృఢమైన రాజ్యావతరణం. ఇలా అవతరించిన సార్వభౌమత్వం నిరపేక్షమూ, అవిభాజ్యము అయివుంటుంది. హాబ్స్ ప్రభుత్వాలను మూడు రకాలుగా విభజించాడు. సార్వభౌమాధికారం ఒకరికే చెందివుంటే రాజత్వం లేదా రాజరికమని అంటారు. అదే అధికారం కొద్దిమంది వ్యక్తుల చేతిలో వుండే కులీన పాలన అవుతుంది. ఎక్కువ మంది చేతిలో ఉంటే దానిని ప్రజాస్వామ్యం అంటారు. ఈ మూడింటిలో రాజరికమే ఉత్తమమైన పాలనా వ్యవస్థ అని హాబ్స్ సూచించాడు.

**8.4. 3. విమర్శ :** హాబ్స్ ప్రతిపాదించిన సామాజిక ఒడంబడిక సిద్ధాంతం పాశ్చాత్య రాజనీతి తత్త్వశాస్త్రంలో ఎంతో ముఖ్యమైనది. పైగా తార్కికమైన రాజనీతి సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన ప్రధమ ఆంగ్లేయుడుగా హాబ్స్‌ని చెప్పవచ్చు. అయితే హాబ్స్ సిద్ధాంతంలో లొసుగులు లేకపోలేదు. అవి:

**1)** హాబ్స్ వర్ణించిన ప్రాకృతిక వ్యవస్థకు చారిత్రిక ఆధారాలుకానీ తార్కిక బలంకానీ లేవు. **2)** ఒడంబడిక అనేది అనాగరికమైన సమాజ పూర్వ స్థితిలో ఎలా ఉత్పన్నమవుతుందో అర్థం కాదు. **3)** హాబ్స్ గుర్తించిన చట్టబద్ధమైన హక్కులు చర్చకు నిలబడవు. **4)** ప్రాకృతిక వ్యవస్థలో సహజకులాలు ఉన్నాయంటాడు హాబ్స్. కాని వారికి బాధ్యతలు లేవని వాదిస్తాడు. భాద్యతలు లేని హక్కులు ఎలా సమర్థనీయమో బోధపడదు. అయినా హక్కులు అనేవి రాజ్యంలేని స్థితిలో ఎలా సాధ్యమో తెలియదు. **5)** మానవుడు సహజంగా సంఘ ప్రియుడు, సంఘజీవి. అయితే హాబ్స్ దృష్టిలో మానవుడు నీచుడు, క్రూరుడు, పశుప్రాయుడు. నిజానికి ప్రతి వ్యక్తిలోను

మానవత్వం ఏదో ఒక స్థాయిలో వుంటుందనేది సాధారణ విషయం. ఇలాంటి లోపాలు హాబ్స్ సిద్ధాంతంలో చాలా వున్నప్పటికీ ఆయన వ్యక్తపరచిన రాజనీతి భావాలు ఎంతో విలువైనవని రాజనీతి శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

## 8.5 సామాజిక ఒడంబడిక సిద్ధాంతం - జాన్ లాక్

జాన్ లాక్ కూడా ఇంగ్లాండ్ కు చెందిన 19వ శతాబ్దపు గొప్ప రాజనీతి తత్త్వవేత్త. ఈయన ఉదారప్రజాస్వామ్యాన్ని ముఖ్యంగా ప్రాతినిధ్య ప్రభుత్వాన్ని సమర్ధించిన రాజనీతి తాత్త్వికులలో అగ్రగణ్యుడు. తన ప్రజాస్వామిక భావాలను సమర్థించుకోవటానికి సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని సాధనంగా చేసుకొన్నాడు. జాన్ లాక్ కాలంలో ఇంగ్లండ్ రాజకీయ సంక్షోభంలో చిక్కుకొని పోయింది. రాజరికానికి, పార్లమెంట్‌కు ఘర్షణ ఏర్పడి చివరకు అంతర్ యుద్ధానికి దారితీసింది. ఈ విప్లవ ఫలితంగా బ్రిటన్‌లో రాజ్యాంగ బద్ధమైన రాచరికము ఏర్పడింది. పార్లమెంట్ అధికారం బలపడింది.

జాన్ లాక్ తన రాజనీతి భావాలను "టూ ట్రీటైజస్ ఆన్ సివిల్ గవర్నమెంట్" (Two Treatises on Civil Goverment) అనే గ్రంథంలో వివరించాడు. జాన్ లాక్ రాజ్యానికి పరిమితమైన అధికారాలు ఉండాలనీ, రాజ్యాధికారానికి ప్రజాసమ్మతే మూలాధారమనీ, హద్దుమీరి వ్యవహరించే ప్రభుత్వాన్ని గద్దెదించటానికి ప్రజలకు అధికారం వుందని వాదించాడు. పరిమితమైన రాచరికాన్ని సమర్ధించి తద్వారా రాజకీయ సార్వభౌమాధికారానికి (Political Sovereignty) ప్రాణం పోయటమే లాక్ ఒడంబడిక సిద్ధాంతంలోని సారాంశం.

**8.5 1. ప్రాకృతిక వ్యవస్థ :** థామస్ హాబ్స్ వలె లాక్ కూడా ప్రాకృతిక వ్యవస్థలో మానవుడి పరిస్థితిని వర్ణించాడు. అయితే వారు పరస్పర సహకారంతోను సంఘీభావంతోను స్వేచ్ఛగాను వుండేవారు. అయితే రాజకీయ జీవనం మాత్రం లేదు. అందరు నిమ్న, ఉన్నత భావాలు లేకుండా సమానంగా భావించుకుంటూ సామరస్యంగా జీవించేవారు. ఆనాటి ప్రాకృతిక వ్యవస్థ ప్రశాంతం ఉండేది. అప్పటి మానవుడు సంఘజీవి. దయాధర్మాలు కలవాడు. ఆనాటి సహజ న్యాయాలు మానవుని సాంఘీక జీవనాన్ని సరళం చేసాయి. ప్రాకృతిక వ్యవస్థలో కూడా మానవుడు కొన్ని సహజహక్కులను అనుభవించాడు. అవి .

1. జీవించె హక్కు (Right to life)
2. స్వేచ్ఛ హక్కు (Right to Liberty)
3. ఆస్తి హక్కు (Right to Property)

ఈ హక్కులన్నీ సహజ న్యాయాన్ని అనుసరించి మానవులంతా సమానంగా అనుభవిస్తూ వుండేవారు. ఐతే పై మూడింటిలోను లాక్ ఆస్తి హక్కుకు విశేషమైన ప్రాముఖ్యాన్ని ఇచ్చాడు. ప్రాకృతిక వ్యవస్థ శాంతియుతంగా ఉన్నప్పటికీ కొన్ని ఇబ్బందులు కూడా అందులో వున్నాయి. సహజ న్యాయాలను ఎవరికి వారే వారికి నచ్చిన రీతిలో వ్యాఖ్యానిస్తూ అమలు పరస్తూ ఉండడంతో గందరగోళం ఏర్పడింది. మనుషులు నైతికంగా పతనమైనారు. అందరికి ఆమోద యోగ్యమైన శాసనాలు ప్రాకృతిక వ్యవస్థలో లేవు. పైగా రాగద్వేష రహితంగా తీర్పు చెప్పగల న్యాయమూర్తి లేడు. అంతేగాక న్యాయ సమ్మతమైన తీర్పులను అమలు జరపటానికి అవసరమైన పరిపాలక వర్గము లేదు. ఇలాంటి పరిస్థితులు ఉండటంతో ప్రజల మధ్య సంఘర్షణ, సంక్షోభం ఏర్పడింది. ఇక ఈ విషమసమస్యకు పరిష్కారం ఒక రాజకీయ వ్యవస్థ ఆవిర్భవించటమే అని ప్రజలు గుర్తించారు.

**8.5. 2. సామాజిక ఒడంబడిక :** పై సమస్యల పరిష్కారానికి ప్రజలంతా ఒక్కటైనారు. సంక్షుభితమైన ప్రాకృతికవ్యవస్థను తప్పించటానికి ఇష్టపడ్డారు. దానికి బదులుగా ఒక విశాలమైన సామాజిక వ్యవస్థను సృష్టించారు. ఫలితంగా విలక్షణమైన పౌరసమాజం ఏర్పడింది. ఈ ఒడంబడికను ప్రతి ఒక్కరు మరొకనితో చేసుకొని తమకున్న హక్కులలో ఎక్కువ భాగాన్ని వదులుకున్నారు. అంటే మిగిలిన హక్కుల రక్షణకోసం కొన్ని హక్కులను వదలుకొని శాంతి భద్రతలనిమిత్తం ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం సహజన్యాయాన్ని అమలు చేసే హక్కులను ప్రజలు స్వచ్ఛందంగా పౌరసమాజానికి ఇచ్చివేశాయి. లాక్ సిద్ధాంతం ప్రకారం రెండు ఒడంబడికలు జరిగాయి. మొదటిది విశాలమైన సామాజిక వ్యవస్థను సృష్టించిన సామాజిక ఒడంబడిక కాగా, రెండవది ప్రభుత్వాన్ని స్థాపించిన ఒడంబడిక.

ప్రభుత్వాధికారము కేంద్రీకృతం కారాదని లాక్ ఉద్దేశ్యం. సార్వభౌమాధికారం పౌరసమాజానికే చెంది వున్నప్పటికీ శాసనాధికారం మాత్రం ప్రజలకు ప్రాతినిధ్యం వహించే శాసనసభకే చెందివుండాలి. అయితే శాసనసభ అధికారాలు కూడా పరిమితమైనవై వుండాలి. శాసనాలను పరిపాలక శాఖ అమలుచేస్తుంది. పరిపాలన శాఖనుండి న్యాయశాఖను వేరుచేయకపోవడం లాక్ సిద్ధాంతంలోని ప్రత్యేకత. ప్రజాకంటకమైన పాలకులను పదవినుండి తొలగించే హక్కు ప్రజలకు ఉంటుందని, ఆ మాటకొస్తే అలాంటి ప్రభుత్వానికి లేదా రాజుకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసే హక్కు ప్రజలకు ఉన్నదని లాక్ స్పష్టం చేసాడు.

సమీక్ష: జాన్ లాక్ ప్రతిపాదించిన రాజనీతిభావనలు రాజనీతి శాస్త్రంలో విశేష ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయి. జాన్‌లాక్ సిద్ధాంతంలో ప్రస్తావించబడిన సహజన్యాయాలు, పరిమితరాచరికం, ప్రాతినిధ్య ప్రభుత్వం, ప్రజల సమ్మతి, ప్రతిఘటనహక్కు, ఆస్తిహక్కు, వ్యక్తి స్వేచ్ఛావాదం, రాజకీయ సార్వభౌమత్వం, వంటి సిద్ధాంతాలు రాజనీతి శాస్త్రంలో ప్రధాన అంశాలు అయినాయి.

మానవుని సహజహక్కులను రక్షించటానికి రాజ్యం యేర్పడిందని లాక్ వాదించాడు. ఆయన రాజ్యానికి ప్రభుత్వానికి మధ్య భేధాన్ని పాటించలేదు. ఆయన హక్కుల సిద్ధాంతంలో ఆస్తి హక్కుకు మహోన్నత స్థానం వుంది. లాక్ తన ఉదారవాద భావాలతో రాజనీతి శాస్త్రాన్ని సుసంపన్నం చేసాడనటంలో అతిశయోక్తిలేదు.

## 8.6 సామాజిక ఒడంబడిక సిద్ధాంతము - రూసో

తన విలువైన భావపరంపరతో ప్రజాసార్వభౌమాధికారాన్నీ ప్రత్యక్ష ప్రజాస్వామ్యాన్ని సమర్ధించిన ప్రథమ రాజనీతి శాస్త్రజ్ఞుడు జీన్ జక్వీస్ రూసో ఈయన 18వ శతాబ్దికి చెందిన గొప్ప ఫ్రెంచి రాజనీతి తత్త్వవేత్త. రూసో 1712 లో జనీవా నగరంలో జన్మించాడు. దేశదిమ్మరిగా యూరప్ అంతా తిరిగాడు. చివరికి 1744 లో పారిస్‌లో స్థిరపడ్డాడు. రూసో చిన్నతనం నాటికి జనీవా స్వయం పాలనలో ఉన్న చిన్ననగర రాజ్యం. అందువలననే రూసోప్రత్యక్ష ప్రజాస్వామ్యాన్ని సమర్ధించాడేమో ! రూసో గొప్పరచయిత. ఆయన "సోషల్ కాంట్రాక్ట్" (Social Contract) అనే గ్రంథాన్ని రాసాడు. ఈగ్రంథంలోనే రూసో తన సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని వివరించాడు. ఆ రోజుల్లో ఈ గ్రంథం ఎంతో మందికి ఆలోచనామృతంగా పనిచేసింది. అంతేగాక 1789 నాటి ఫ్రెంచి విప్లవానికి కూడా రూసో రచనలే ప్రేరకాలుగా పనిచేసాయి. రూసో సామాజిక ఒడంబడిక సిద్ధాంత ప్రవక్త. హాబ్స్, లాక్ వలేకాకుండా రూసో ప్రజాసార్వభౌమాధికార భావనకు చక్కని ఆధారాలను తన భావనలో ప్రతిపాదించాడు.

**8.6. 1 ప్రాకృతిక వ్యవస్థ :** హబ్స్, లాక్ వలెనే రూసో కూడా తన సిద్ధాంతాన్ని ప్రాకృతిక వ్యవస్థతోనే ప్రారంభించాడు. తన "సామజిక ఒడంబడిక" అనే గ్రంథం "స్వేచ్ఛాజీవిగా జన్మించిన మానవుడు సర్వత్రా సంకెళ్ళతో ఉన్నాడు" (Man is born free but every where is in chains) అన్న వాక్యాలతో ప్రారంభం కావటం ప్రత్యేకంగా గమనించవలసిన విషయం. ఆయన దృష్టిలో మానవుడు జన్మతః స్వేచ్ఛాజీవి. నాగరికమైన, సమాజాన్ని సృష్టించుకొన్న తర్వాత వాని స్వేచ్ఛ క్షీణించిపోయింది. ప్రాకృతిక వ్యవస్థలో మానవుడు పశుప్రాయుడుగా ఉన్నప్పటికీ గౌరవంగా జీవించేవాడు. స్వతంత్రంగా భయరహితంగా తృప్తిగా జీవించేవాడు. మంచితనం, నిరాడంబరత, కరుణ, స్నేహశీలం, ఉన్నంతలో తృప్తి అతని లక్షణాలుగా ఉండేవి. న్యాయాన్యాయాలు, మంచిచెడ్డలు అనేవి వానికి తెలియవు ప్రశాంతమైన ఆనాటి జీవన విధానం కాలక్రమేణా కొన్ని మార్పులకు లోనయ్యింది. సమాజంలో వచ్చిన ఈమార్పులవల్ల మానవుని పతనం ప్రారంభమయింది. జనాభా పెరిగింది. స్వంత ఆస్తి ఏర్పడింది. దీనితో మానవుడు స్వార్ధపరుడైనాడు. వివేకవిజ్ఞానాలు వృద్ధిచెందటంతోపాటు హెచ్చుతగ్గులు అంకురించాయి. అసమానతలు చోటుచేసుకున్నాయి. నాగరికతలో కూడా మార్పులు వచ్చాయి. "నాది, నీది" అనే స్వపరబేధాలు ఉత్పన్నమైనాయి. బలవంతుడు బలహీనుడ్ని, ధనవంతుడు పేదవాడ్ని అణిచి వేయటం ప్రారంభించాడు. వర్గవిభేదాలు, వర్గసంఘర్షణలు మొదలైనాయి. ఈ అనర్ధాలన్నింటికీ వ్యక్తిగతమైన ఆస్తి మూలకారణం అని రూసో భావించాడు. ఇలాంటి పరిస్థితిలో ప్రజలు అంతా కలసి ఈభయంకర వాతావరణం నుండి బయటపడే మార్గం అన్వేషించారు.

**8.6.2 సామాజిక ఒడంబడిక :** శాంతియుతమైన పరిస్థితులు నెలకొనటానికి ప్రజలంతా కలసి ఒక సామాజిక ఒడంబడికను ఏర్పరచుకున్నారు. ప్రతివ్యక్తి ఇతరులందరితోను, ఇతరులందరూ తమలో ప్రతివ్యక్తితోనూ (Each with all and All with Each) అనే

ఒప్పందాన్ని చేసుకొని ఒక నాగరికసమాజాన్ని సృష్టించుకొన్నారు. ఇలాంటి ఒడంబడిక సామాజిక రాజకీయ లక్షణాలను సంతరించుకున్నది. ప్రతి వ్యక్తి తన సర్వహక్కులను తాను అంతర్భాగంగా వున్న సంఘానికి అప్పగించి, తాను ఆ సంఘానికి అధీనుడైనాడు. ఇలా ఏర్పడిన సంఘం "జనేచ్ఛ" (General Will) అని రూసో వర్ణించాడు. వ్యక్తిగతంగా వదులుకున్న తన హక్కులన్నింటిని సమాజ సభ్యునిగా ప్రతి వ్యక్తి తిరిగి పొందటం ఈ జనేచ్ఛ వల్ల మాత్రమే సాధ్యమవుతుంది. జనేచ్ఛ ఒక్కటే అనగా వ్యక్తులందరితో కూడిన సమాజం ఒక్కటే సార్వభౌమాధికారాన్ని కలిగిఉంటుంది. సార్వభౌమత్వాన్ని సమాజ ప్రతిరూపంగా జనేచ్ఛయే చెలాయిస్తుంది.

**8.6. 3. జనేచ్ఛ - లక్షణాలు:** సర్వజన శ్రేయస్సుకు జనేచ్ఛ ఏర్పడి పాటుపడుతుంది కనుక జనేచ్ఛ మాత్రమే సార్వభౌమత్వాన్ని కలిగిఉంటుంది. ప్రతి వ్యక్తికి వ్యక్తిగత ఇచ్ఛ అని, వాస్తవ ఇచ్ఛ అని, రెండు ఇచ్ఛలు ఉంటాయి. ఇందులో వ్యక్తిగత ఇచ్ఛ కేవలం స్వార్ధానికి సంబంధించింది. అయితే వాస్తవ ఇచ్ఛ సర్వజన క్షేమానికి సంబంధించింది. సమాజంలోని ప్రజలందరి యొక్క వాస్తవ ఇచ్ఛ కలయికే జనేచ్ఛ అని రూసో సిద్ధాంతము. అనగా ప్రతి వ్యక్తి శ్రేయస్సును కాంక్షించే జనేచ్ఛ సర్వజన సమ్మతమై ఉంటుంది. కాబట్టి జనేచ్ఛకు లోబడి నడుచుకోవటం లోనే వ్యక్తి నిజమైన స్వేచ్ఛ ఇమిడి ఉంది. జనేచ్ఛకు లోబడని వ్యక్తిని నిర్బంధం చేసే అధికారం కూడా దీనికి ఉంది. జనేచ్ఛ సార్వభౌమాధికారం కలిగి ఉంది. కాబట్టి ఇది నిరపేక్షమూ, అవిభాజ్యమూ, అనన్య సంక్రామకము అయివున్నది. జనేచ్ఛ గుణాత్మకమైనదే కాని పరిణామాత్మకమైంది కాదు. దీనిని ఎవ్వరూ ధిక్కరించడానికి వీలుకాదు. ఇది ఒక మహత్తర సంఘశక్తి. జనవాక్యమే దైవవాక్యము (Voice of the people is voice of the God). రూసో తన జనేచ్ఛ భావన ద్వారా ఒక విలక్షణమైన ప్రజాసార్వభౌమాధికార సిద్ధాంతానికి రూపకల్పన చేసాడు. ప్రభుత్వం ప్రజాశ్రేయస్సుకు విరుద్ధంగా ప్రవర్తిస్తె ప్రజలు ఆ ప్రభుత్వాన్ని ధిక్కరించవచ్చని కూడా పేర్కొన్నాడు. ప్రజలలో సార్వభౌమత్వం వున్నంతవరకూ ప్రభుత్వ వ్యవస్థ ఏ రూపంలో వున్నా అధికార దుర్వినియోగం చేయటానికి వీలులేదు. రూసో సిద్ధాంతానుసారం ప్రత్యేక ప్రజాస్వామ్య వ్యవస్థ అవతరిస్తుంది. రూసో ప్రజాస్వామిక భావనలు అమెరికా, ఫ్రాన్స్ రాజ్యాంగాలను విశేషంగా ప్రభావితం చేసినట్లు కనిపిస్తుంది. అలాగే ఆయన ప్రతిపాదించిన నిరపేక్ష జనేచ్ఛ భావన ఆదర్శవాదానికి లేదా భావన సిద్ధాంతానికి రూపు రేఖలను కల్పించింది.

**8.6. 4. విమర్శ:** రూసో ప్రతిపాదించిన సామాజిక ఒడంబడిక సిద్ధాంతానికి చారిత్రిక ఆధారాలు ఏవి కనిపించవు. జనేచ్ఛ ఊహాజనితమే కానీ ఆచరణాత్మకం కాదు. జనేచ్ఛ సిద్ధాంతరీత్యా ఆదరణీయమైనదే. కానీ ఆచరణలో ఇది నిరంకుశమైన సంపూర్ణాధికారవాదానికి దారితీస్తుంది. పైగా సర్వదా జనేచ్ఛ నీతి బద్ధమూ , శ్రేయో బద్ధమూ, అనటానికి కూడా అవకాశం లేదు. ఏదిఏమైనా రాజ్యాధికారానికి ప్రజాసమ్మతిని పునాదిగా నిర్దేశించిన రూసో సిద్ధాంతం ప్రజాస్వామ్య ఒరవడికి, మనుగడకు మూలసూత్రం.

# 8.7 సామాజిక ఒడంబడిక సిద్ధాంతం

## (రచయితల తులనాత్మక పరిశీలన)

| అంశం /భావన | హోబ్స్ | లాక్ | రూసో |
|---|---|---|---|
| 1. సిద్ధాంత గ్రంథం | లెవియథాన్ Leviathan (1651) | టు ట్రీటైజస్ ఆన్ సివిల్ గవర్న మెంట్ Two treatises on Civil Government (1690) | సామాజిక ఒడంబడిక Social Contract (1762) |
| 2. ప్రాకృతిక వ్యవస్థ | వ్యక్తుల మధ్య యుద్ధ పరిస్థితులు వుంటాయి. తప్పు ఒప్పు అనేది లేదు. మనిషిలో అహంకారం, భయం, అధికారం, ప్రతిష్ట, క్షణికోద్రేకం ఉంటాయి. మనిషి ఒంటరి జీవితం గడుపుతాడు. పశుప్రాయుడు, పేదవాడు, సహనభావం ఉండదు. | వ్యక్తులలో మంచితనం పరస్పర సహకారం భద్రతా భావం ఉంటాయి. యుద్ధవాతావరణం కాక శాంతి వాతావరణం వుంటుంది. ప్రాకృతిక చట్టంపై ఆధారపడుతుంది. ప్రభుత్వంలేదు. ప్రాకృతిక చట్టానికి వ్యాఖ్యానం చేసే న్యాయాధిపతి లేడు. చట్టాన్ని అమలుపరిచే కార్య నిర్వాహక వర్గం లోపించింది. | ఈ వ్యవస్థలో అందరూ సమానమే. స్వయం సమృద్ధమైన తృప్తితో కూడిన జీవనం గడుపుతారు. హేతువుపై గాక తాత్కాలికోద్రేకంపై మనిషి సంచరిస్తాడు. ప్రైవేటు ఆస్తి వచ్చి సాంఘిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసింది. |
| 3. ప్రాకృతిక శాసనం | దీనిలో పౌరశాసనం లేదు. ప్రాకృతిక శాసనమే మానవ కార్యకలాపాలను నిర్దేశిస్తుంది జీవితాన్ని భద్రపరచటానికి యిది ఒక హేతువాద సిద్ధాంతం. శాంతి భద్రతలు నెలకొల్పటంకోసం వ్యక్తులు అందరూ కలిసి అంగీకారానికి వచ్చి ఒక సార్వభౌమునికి తమ సహజ హక్కులన్నింటినీ దత్తంచేయాలి. తాత్కాలిక కార్యసాధన మార్గాలే ముఖ్యం. | హేతువాదంపై ఆధారపడి మానవ ప్రవర్తన తీర్చి దిద్దేదే నైతికశాసనం. ఇందులో తాత్కాలిక ఉద్రేకాలకు తావులేదు. | ఇది మనిషి యొక్క సామాజిక సహజత్వంపై ఆధారపడి ఉంటుంది. ఈ సంఘీభావ దృక్పధం ఆవేశ పూరిత మైనది. హేతువాద బద్ధమైనది కాదు. |

| అంశం/భావన | హాబ్స్ | లాక్ | రూసో |
|---|---|---|---|
| 4. సహజహక్కులు | ఎటువంటి సహజహక్కులు లేవు. మనిషి పశుబలంపై నసే ఆధారపడివుంటాడు. శక్తి వున్నంతవరకు కావాల్సిన వాటి నన్నింటిని సంపాదించుకుంటాడు | జీవనము, స్వేచ్ఛ ఆస్తికి సంబంధించినవే. సహజమైన హక్కులు ప్రాకృతిక వ్యవస్థలో కూడా వ్యక్తి యీ హక్కులు అనుభవించాడు. రాజ్యం ఈ హక్కులను పరిహరించలేదు. | ప్రాకృతిక వ్యవస్థలో మనిషి స్వేచ్ఛా జీవి. సహజహక్కులు అనుభవించే స్థితిలో వుంటాడు. |
| 5. సామాజిక ఒడంబడిక | ఇది ఏకపక్షమైనది. ఆత్మరక్షణ తప్ప మిగతా హక్కులన్ని సార్వభౌమునికి దత్తం చేస్తారు. ఈ సామాజిక ఒడంబడిక ఒక కామన్ వెల్త్‌ను, సార్వభౌముని సృష్టిస్తుంది. సార్వభౌమునికి ఒడంబడికతో ప్రమేయంలేదు. ఏర్పడినది పౌరసమాజమా లేక ప్రభుత్వమా అన్నది స్పష్టంగా లేదు. | ఇది ద్విపక్షమైనది. సార్వభౌముడుకూడా ఒప్పందానికి బాధ్యుడు. వ్యక్తి సామజిక ఒడంబడిక చేసుకొని రాజ్యాన్ని సృష్టిస్తాడు. ప్రాకృతిక శాసనం పై వ్యాఖ్యానం చెప్పటానికి ఒక సంస్థ ఉంటుంది. ప్రజలు సర్వహక్కులను వదులుకోరు. ప్రభుత్వాధికారం పరిమితం.ఈ ఒడంబడిక వల్ల జనేచ్ఛకు సార్వభౌమాధికారం ఉన్నది. ఒడంబడిక ఫలితమే జనేచ్ఛ. | ఒడంబడిక వ్యక్తి సమాజం మధ్య జరిగింది. వ్యక్తి సమాజంలో సభ్యుడు. ABCD లు వ్యక్తిగత హోదాలో తమ హక్కులను A+B+C+D+ అనే కార్పొరేట్ సంస్థకు దత్తం చేశారు. |
| 6. సార్వభౌమత్వం | సార్వభౌముడు నియంత. అపరిమితమైన అధికారాలు కలిగి వుంటాడు. అవి విడదీయలేనివి. సార్వభౌముడు చట్టాన్ని చేస్తాడు. కాని చట్టానికి అతీతుడు. ప్రజలకు తిరుగబడే హక్కు లేదు. చర్చిపైన రాజ్యం పైనా కూడా సార్వభౌముడు అధికారం చెలాయిస్తాడు. | సార్వభౌమునికి పరిమిత అధికారాలుంటాయి. ప్రభుత్వానివి కూడా పరిమిత అధికారాలే. జీవనము స్వేచ్ఛ, ఆస్తి వంటి సహజ హక్కులను ప్రభుత్వం పరిమితం చేయలేదు. ప్రజాదరణ పొందిన సార్వభౌమత్వాన్ని తానే సృష్టించాడు. అది చట్ట బద్ధమైనది కాదు. | ప్రజలందరిలోను సార్వభౌమత్వంవుంది సమాజానికి సార్వభౌమ హక్కులు వున్నాయి. ఐకమత్యం అవిభాజ్యత విడదీయరానితనం, శాశ్వత్వము, దోషరహితం, ప్రాతినిధ్య రాహిత్యం- ఇవి సార్వభౌమత్య లక్షణాలు. ఇవి జనేచ్ఛలో కూడా ఉంటాయి. రూసో దృష్టిలో జనాదరణ పొందినదే సార్వభౌమత్వం. ప్రభుత్వం సార్వభౌమునికి లోబడి ఉండాలి. |

| అంశం/భావన | హాబ్స్ | లాక్ | రూసో |
|---|---|---|---|
| 7. స్వేచ్ఛ | ప్రాకృతిక వ్యవస్థలో స్వేచ్ఛలను నిశృంఖలంగా భావించారు. రాజ్యం మాత్రమే పౌరస్వేచ్ఛను యివ్వగలదు. అది రాజ్యం యిచ్చే బహుమతి. అందుచేత రాజ్యం దానిని రద్దు చేయవచ్చు రాజ్యానికి వ్యతిరేకంగా స్వేచ్ఛను ఉపయోగించరాదు. | ప్రాకృతిక వ్యవస్థలో కూడా వ్యక్తికి కొన్ని సహజహక్కులుంటాయి. అవి జీవితము, స్వేచ్ఛ, ఆస్థికి సంబంధించినవి. అవి అతను, తప్పక అనుభవిస్తాడు. రాజ్యం ఆ హక్కులను పరిహరించలేదు. | పౌర సమాజంలో వ్యక్తికి స్వేచ్ఛ, సార్వభౌమత్వ రాజ్యం ప్రసాదించిందే. దానిని రాజ్యనియంతృత్వ విధానంతో సమన్వయపరచాలి. సార్వభౌమునికి వ్యతిరేకంగా ఆ హక్కును ఉపయోగించరాదు. సమాజంలోనే సార్వభౌమత్వం ఉన్నది. |
| 8. వ్యక్తి - రాజ్యం | రాజ్యంలో వ్యక్తి ఉత్తముడు. కానీ అతడు రాజ్యానికి సార్వభౌమునికి పన్నులు కట్టాలి. అతని స్వేచ్ఛ రాజు దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉంటుంది. పౌరసమాజంలో కూడా జీవనం స్వేచ్ఛలకు సంబంధించిన హక్కులు వుంటాయి. వ్యక్తి ఆత్మహత్య చేసుకోరాదు. వ్యక్తి ప్రాణాలను కాపాడలేని సార్వభౌమునిపై ప్రజలు తిరుగుబాటు చేసి అతనిని తొలగించవచ్చు. | రాజ్యంకంటే వ్యక్తికి ప్రాధాన్యం ఎక్కువ. జీవితం స్వేచ్ఛ ఆస్తిహక్కులు వ్యక్తికి ఉంటాయి. రాజ్యంపై తిరుగుబాటు చేసే హక్కు కూడా వుండాలి. ప్రజాదరణ పొందిన సార్వభౌమత్వము, పరిమితాధికారాలున్న ప్రభుత్వం కావాలన్నాడు లాక్. ఆస్తిహక్కు పవిత్రమైనది. ఆస్తి హక్కులో జీవితము, స్వేచ్ఛ మొదలయిన హక్కులు కూడా యిమిడి వున్నాయి. | రాజ్యానికి వెలుపల వ్యక్తికి మనుగడ లేదు. వ్యక్తులు తమ జీవనము ఆస్తి, స్వేచ్ఛ హక్కులను రాజ్యంలో సభ్యులుగానే అనుభవించాలి. వారి స్వేచ్ఛ పౌర సంబంధమైనదే కానీ సహజ సిద్ధమైనదీ కాదు. అయితే ఈ హక్కులు వదలుకున్నా కూడా సమాజంలో సభ్యుని హోదాలో వీటిని అనుభవిస్తాడు. ఎందు కంటే తాను సభ్యునిగా వున్న సమాజానికి హక్కులను దత్తం చేస్తాడు. |
| 9. రాజ్యం - ప్రభుత్వం | రాజ్యానికి ప్రభుత్వానికి భేదం సూచించలేదు. అలాగే నామమాత్ర, వాస్తవ సార్వభౌముల మధ్య కూడా భేదం సూచించలేదు. రాజరిక నియంతృత్వాన్ని సమర్థించాడు. | రాజ్యానికి ప్రభుత్వానికి మధ్య, రాజ్యానికి సమాజానికి మధ్యతేడా చూపించాడు. పరిమితాధికారాలు గల రాజ్యాంగబద్ధమైన ప్రభుత్వం ఉండాలన్నాడు. | రాజ్యానికి ప్రభుత్వానికి మధ్య తేడా సూచించాడు. రాజ్యానికే సార్వభౌమత్వం ఉంటుంది. ప్రభుత్వం సార్వభౌముడు సృష్టించింది. అందుచేత ప్రభుత్వం రాజ్యానికి లోబడి వుంటుంది. |

## 8.8 సారాంశము

రాజ్యం ఎలా అవతరించింది అనేది రాజనీతి శాస్త్రంలో ఒక ప్రధానమైన ప్రశ్న. దీనికి పెక్కుమంది రాజనీతి తత్త్వవేత్తలు విభిన్నమైన సిద్ధాంతాలను ప్రతిపాదించారు. వాటిలో ముఖ్యమైనది "సామాజిక ఒడంబడిక సిద్ధాంతం". ఈ సిద్ధాంతం రాజ్యం మానవులు చేసుకొన్న ఒక ఒప్పందం ద్వారా రాజ్యమవతరించినట్లు చెప్తుంది. ఈ సిద్ధాంతంలో 'ప్రాకృతిక వ్యవస్థ', 'సామాజిక ఒడంబడిక' అనే రెండు ప్రధానాంశాలున్నాయి. అసలు సమాజమేర్పడడానికి ముందు నెలకొనివున్న మానవ జీవన విధానాన్ని ఈ ప్రాకృతిక వ్యవస్థ వివరిస్తుంది. ఏఏ పరిస్థితులలో మానవులు ఒక ఒప్పందం ద్వారా రాజ్యాన్ని లేదా సార్వభౌమత్వాన్ని ప్రతిష్ఠించారు అనేది ఈ 'సామాజిక ఒడంబడిక' విశదీకరిస్తుంది.

సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన వారిలో హాబ్స్, లాక్, రూసో అనేవారు ముఖ్యులు. ఈ ముగ్గురూ సిద్ధాంతాన్ని చివరకు ఆమోదించినా, దాని ప్రధానాంశాలకు సంబంధించి మాత్రం భిన్నమైన వివరణలు ఇచ్చారు. హాబ్స్ నిరవధిక రాజరికాన్నీ, లాక్ పరిమిత ప్రభుత్వాన్ని, పరోక్ష ప్రాతినిధ్యాన్ని, ప్రతిపాదించగా, రూసో ప్రజాసార్వభౌమత్వాన్నీ, ప్రత్యక్ష ప్రజాస్వామ్యాన్ని బలపరిచాడు. అయితే ఈ సిద్ధాంతానికి చారిత్రకమైన ఆధారాలు కానీ, శాస్త్రీయ విశ్లేషణగాని లేకపోవడంచేత, ఆమోదయోగ్యమైన ఆధారాలను రాజ్యావతరణకు అందించలేక పోయింది.

### అభ్యాసాలు

**I. వ్యాస ప్రశ్నలు:**

1. సామాజిక ఒడంబడిక సిద్ధాంతమును చర్చించుము.
2. సామాజిక ఒడంబడిక సిద్ధాంత సారాంశమును పేర్కొని, హాబ్స్, లాక్, రూసో విభేదించిన అంశాలను స్థూలముగా వివరింపుము.
3. హాబ్స్, లాక్, రూసోల సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని తులనాత్మకంగా పరిశీలింపుము.

**II. సంక్షిప్త వ్యాస ప్రశ్నలు:**

1. జనేచ్ఛ అనగానేమి? దాని స్వరూప స్వభావములను గూర్చి వ్రాయుము.
2. ప్రాకృతివ వ్యవస్థ అనగానేమి? హాబ్స్, లాక్, రూసోలు దీనినెట్లు వర్ణించిరి.
3. రాజ్య వ్యవస్థ విషయములో హబ్స్, లాక్, రూసోల భావాలను వివరింపుము.

**III. కుశాగ్రబుద్ధి ప్రశ్నలు**

1. ప్రజలు చేసుకొన్న ఒక ఒప్పందం ద్వారా రాజ్యం అవతరించిందనేది ........................................ సిద్ధాంత సారాంశం.
2. ........................................................ అనేది హాబ్స్ రచించిన ప్రసిద్ధ గ్రంథం.
3. హాబ్స్ ప్రకారం ప్రజలు .................................. హక్కును తమ వద్దనే ఉంచుకొని మిగిలిన హక్కులన్నీ సార్వభౌమునికి వదిలివేసారు.
4. రాజ్యాధికారానికి .......................... మూలాధారమని జాన్‌లాక్ తన గ్రంథం...........................లో వివరించాడు.
5. ప్రజాసార్వభౌమాధికారాన్ని, ప్రత్యక్ష ప్రజాస్వామ్యాన్ని సమర్ధించిన ప్రథమ రాజనీతి శాస్త్రజ్ఞుడు ...............................

### ఉపయుక్త గ్రంథాలు

ఇంతకు ముందు పాఠంలో పేర్కొనిన గ్రంథములనే పరిశీలించుము.

- చిలకపాటి విజయ రాఘవాచార్యులు

పాఠం - 9

# చట్టము

## 9.0 లక్ష్యం :

చట్టం యొక్క అర్థాన్ని, దాని స్వభావాన్ని పరిశీలించి దాని మూలాధారాలను వివరించడం, చట్టానికి నీతికి మధ్యనున్న సంబంధాన్ని వివరించడం, వివిధ రకాల చట్టాలను పరిశీలించడం, సమన్యాయపాలన అర్థాన్ని, లక్షణాలను వివరించడం ఈ పాఠము యొక్క లక్ష్యం

## 9.1 విషయ క్రమం


9.2. చట్టము-అర్థము, నిర్వచనాలు

9.3. చట్టము - మూలాధారాలు

9.3. 1. ఆచార సాంప్రదాయాలు

9.3. 2. మతము

9.3. 3. న్యాయస్థాన తీర్పులు

9.3. 4. శాస్త్రీయ వ్యాఖ్యానాలు

9.3. 5. సమత లేక న్యాయబద్ధత

9.3. 6. శాసన సభలు

9.4. సమన్యాయ పాలన

9.5. సమన్యాయ పాలనకు పరిమితులు

9.6. సారాంశము.


## 9. 2. చట్టము - అర్థము, నిర్వచనాలు

**అర్థము :** చట్టమనే పదానికి సమానమైన ఆంగ్లపదము 'Law' : ఈ పదము ట్యుటానిక్ భాషలోని "Lag" అనే పదమునుండి గ్రహించబడింది. లాగ్ అంటే స్థిరంగా లేక సమంగా ఉంచుట అని అర్థము. వ్యక్తుల ప్రవర్తనను క్రమబద్ధం చేయడానికి రాజ్యం రూపొందించి, అమలు పరచె నియమాల సముదాయమే చట్టము. చట్టం సామాజిక జీవనాన్ని క్రమబద్ధం చేస్తుంది. సంఘవిద్రోహక శక్తులను శిక్షించి న్యాయాన్ని నెలకొల్పుతుంది. చట్టం సాంఘిక, ఆర్థిక మార్పులను తీసికొని వచ్చే సాధనంగా కూడా పనిచేస్తుంది. వ్యక్తి స్వేచ్ఛను పరిరక్షిస్తుంది.

నిర్వచనాలు: **ఆస్టిన్ :** "సార్వభౌమాధికారి ఆజ్ఞయే చట్టము."

**T.H. గ్రీన్ :** "రాజ్యము అమలుపరిచే హక్కుల విధుల వ్యవస్థయే చట్టము."

**సాల్మండ్ :** "న్యాయపాలన కొరకు రాజ్యము గుర్తించి అమలు పరచు నియమాల సముదాయమే చట్టము."

**సిడ్జివిక్ :** "ఏయే పనులు చేయవలెనో, ఏయే పనులు చేయరాదో వివరించి వాటినతిక్రమించిన వాళ్ళు శిక్షార్హులని ప్రకటించు సాధారణ నియమాలే చట్టము."

## 9.3. చట్టము మూలాధారాలు

ప్రఖ్యాత రాజనీతి శాస్త్రవేత్త హాలెండ్ అభిప్రాయంలో చట్టానికి ఆధారాలు ఆరు. అవి :

**9.3. 1. ఆచార సాంప్రదాయాలు :** ఆచార సాంప్రదాయాలు చట్టానికి అతి ప్రాచీనమైన, ప్రధానమైన మూలాధారాలు. రాజకీయ సంస్థలేర్పడని ఆదిమ సమాజంలో సాంప్రదాయాలే సమాజ జీవితాన్ని క్రమబద్ధం చేసాయి. సాంప్రదాయాలను ఉల్లంఘించినవారు సమాజ పెద్దలచేత శిక్షించబడేవారు. నేడు ఆచార సాంప్రదాయాలన్నీ చట్టాలు కావు. అయితే రాజ్యము సాంప్రదాయాలను గుర్తించి దృష్టిలో పెట్టుకొంటుంది. పూర్వం ఇంగ్లండ్‌లో న్యాయమూర్తులు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి ప్రజల ఆచారాలననుసరించి న్యాయపాలన చేసేవారు. అందుకే గెటిల్ "రాజ్యము చట్టాలను రూపొందించడానికి బదులు, ఆచారాలను గుర్తించి, వ్యాఖ్యానించి, అమలు చేస్తుంది" అని పేర్కొన్నాడు. ఇంగ్లండ్, ఇండియా దేశాలలో వివిధ చట్టాలు, ఆచార సాంప్రదాయాల ఆధారంగా రూపొందించబడ్డాయి.

**9.3. 2. మతము:** ప్రాచీన కాలములో సాంప్రదాయాలకు, మతానికి మధ్య నిర్దుష్టమైన వ్యత్యాసముండేది కాదు.ఆ కాలములో మతాధికారులు మతాచారాల ప్రకారము వివాదాలను విచారించి పరిష్కరించేవారు. ప్రస్తుతం కూడ అనేక రాజ్యాలలో చట్టానికి మతము ఆధారంగా ఉన్నది. న్యాయశాసనాలు చాలా వరకు మతసూత్రాల ననుసరించి రూపొందించబడినవే. ఇండియాలో "హిందూ లా" "ముస్లిం లా" లు ఆయా మత సూత్రాలపై ఆధారపడి రూపొందించబడినవే. 1986 ఫిబ్రవరిలో భారత పార్లమెంటు ఆమోదించిన "ముస్లిం మహిళల రక్షక బిల్లు" ఇస్లామిక్ మత సూత్రాల ఆధారంగా రూపొందించబడిందే. ఇండియాలో వివాహము, కుటుంబం, ఆస్థి మొదలైన చట్ట సంబంధమైన అంశాలకు మాత్రమే మూలాధారము. సౌదీ అరేబియా, ఇరాన్, పాకిస్తాన్, మొదలగు దేశాలు మత సూత్రాలననుసరించే శాసనాలు రూపొందించుకొంటున్నవి.

**9.3. 3. న్యాయస్థాన తీర్పులు:** శాసన సభలు చట్టాలను రూపొందిస్తాయి. న్యాయస్థానాలు వివాదాలను విచారించేటపుడు అమలులో నున్న శాసనాలను దృ ష్టిలో పెట్టుకొంటాయి. చట్టాలను చేయటం, న్యాయమూర్తుల కర్తవ్యం కాకపోయినప్పటికి చట్టాలను వ్యాఖ్యానించడం ద్వారా పరోక్షంగా చట్టాలను చేసే కర్తవ్యాన్ని వారు నిర్వహిస్తారు. న్యాయస్థానాలు రాజ్యాంగ చట్టాన్ని వ్యాఖ్యానించడం ద్వారా క్రొత్త న్యాయసూత్రాలను రూపొందిస్తాయి. అమెరికా, భారత సుప్రీంకోర్టులు తమ న్యాయ సమీక్ష అధికారం ద్వారా అనేక న్యాయసూత్రాలను రూపొందించాయి. అమెరికా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టీస్ హోమ్స్ అభిప్రాయం ప్రకారం "న్యాయమూర్తులు చట్టాలను చేస్తారు, వారు తప్పక చేయాలి."

**9.3. 4. శాస్త్రీయ వ్యాఖ్యానాలు:** న్యాయశాస్త్రం, న్యాయపాలన మొదలయిన అంశాలపై ప్రముఖ రచయితలు, మేధావులు వ్యాఖ్యానాలు చేస్తుంటారు. వీరి వ్యాఖ్యానాలు గూడ చట్టానికి ఒక ఆధారము. న్యాయశాస్త్ర ప్రవీణులు అమలులో ఉన్న చట్టాలను, సాంప్రదాయాలను, న్యాయస్థాన తీర్పులను క్రోడీకరించి కొన్ని నూతన సూత్రాలను ప్రతిపాదిస్తారు. వీరి అభిప్రాయాలను ప్రభుత్వము గుర్తించి అమలు చేసినపుడు అవి చట్టానికి ఆధారమవుతాయి. బ్రిటన్‌లో కోక్, బ్లాక్ స్టోన్ అనేవారు, అమెరికాలో కెంట్, స్టోరీ అనేవారు, ఇండియాలో మనువు, యజ్ఞవల్కుడు, విజ్ఞానేశ్వర, అపరార్కులు చేసిన వ్యాఖ్యానాలు ప్రముఖపాత్ర వహించినవి.

**9.3. 5. సమత లేక న్యాయబద్ధత:** కొన్ని వివాదాలను విచారించి పరిష్కరించడంలో న్యాయమూర్తులకు అమలులో ఉన్న ఏ ఆధారము లభించక పోవచ్చును. అమలులో ఉన్న న్యాయశాసనాలను అక్షరత: అమలు పరచడం వలన కొన్ని సందర్భాలలో తమ అంతరాత్మకు వ్యతిరేకంగా తీర్పులను ప్రకటించవలసి రావచ్చును. పై రెండు పరిస్థితులలో న్యాయమూర్తులు వారి అనుభవాన్ని, లోకజ్ఞానాన్ని, అంతరాత్మప్రభావాన్ని అనుసరించి తీర్పులు ఇస్తారు. ఇటువంటి తీర్పులు భవిష్యత్తులో న్యాయస్థానాలకు మార్గదర్శకము కావడమే కాకుండా నూతన న్యాయశాసనాలకు ఆధారమవుతాయి.

**9.3. 6. శాసన సభలు:** ఆధునిక కాలంలో చట్టానికి ప్రత్యక్షమైన, ప్రముఖమైన ఆధారం శాసన సభలు. ప్రస్తుతం ప్రతి దేశంలోనూ శాసన నిర్మాణ ఆవశ్యకత పెరిగింది. శాసనసభలు ప్రతి విషయానికి సంబంధించి శాసనాలను రూపొందించవలసి వచ్చింది. ఆధునిక ప్రజాస్వామ్య రాజ్యాలలో ప్రజాప్రతినిధులైన శాసన సభ్యులు ప్రజాభిప్రాయానికి అనుగుణంగా చట్టాలను రూపొందిస్తున్నారు.

## 9.4. సమన్యాయ పాలన (RULE OF LAW)

సమన్యాయపాలన అనేది బ్రిటిష్ రాజ్యాంగ ప్రధాన లక్షణం. బ్రిటిష్ న్యాయ నిర్వహణ విధానానికి అది గీటురాయి. ప్రజాస్వామ్య విధానానికి స్వేచ్ఛ, సమానత్వము, న్యాయము అనేవి మూలస్థంభాలు. సమానత్వం లేనినాడు వ్యక్తులు హక్కులను, స్వేచ్ఛను అనుభవించలేరు. అనగా ప్రజాస్వామ్య విజయము చాలావరకు సమానత్వ భావనపై ఆధారపడి ఉంటుంది. చట్టం దృష్టిలో ప్రజలందరూ సమానమే. కుల, మత, వర్గ, ఆస్తి, హోదా, స్త్రీ పురుష ప్రాతిపదికగా చట్టము వ్యక్తుల మధ్య ఎలాంటి విచక్షణ చూపదు. చట్టమే అత్యున్నతమైనది. వ్యక్తులందరు చట్టబద్ధులుగానే వ్యవహరించవలసి ఉంటుంది. దీనినే సమన్యాయ పాలన అంటారు.

సమన్యాయ పాలనను నిర్వహించి దాని ఔన్నత్యాన్ని కీర్తించినవాడు ప్రముఖ బ్రిటీషు రాజనీతిశాస్త్రవేత్త ఎ.వి. డైసీ. ఆయన "ఇన్‌ట్రడక్షన్ టు ది లా ఆఫ్ ది కాన్‌స్టిట్యూషన్" అనే తన గ్రంథంలో సమన్యాయపాలన భావనను విపులీకరించాడు. ఎ.వి. డైసీ అభిప్రాయంలో "సమన్వయ పాలన వ్యక్తి హక్కులకు, స్వేచ్ఛకు కంచుకోట." "వ్యక్తుల పాలన కన్న శాసన పాలనే శ్రేష్టమైనదని" అరిస్టాటిల్ పేర్కొన్నాడు.

**9.4. 1. సమన్యాయ పాలన లక్షణాలు :** ఎ. వి డైసీ ప్రకారము సమన్యాయ పాలనకు మూడు ప్రధాన లక్షణాలు ఉన్నాయి. అవి
1. అమలులో ఉన్న చట్టాన్ని ధిక్కరించాడని న్యాయస్థానంలో ఋజువు కానిదే ఏ వ్యక్తినీ శారీరకంగా గాని, ఇతరత్రా గాని శిక్షించకూడదు. అనగా ప్రభుత్వోద్యోగులు నిరంకుశంగా వ్యవహరించి తగిన కారణం లేకుండా ఒక వ్యక్తిని నిర్బంధములోనికి తీసికొని శిక్షించకూడదు.

2. చట్టము దృష్టిలో ప్రజలందరూ సమానమే. కులము, మతము, ఆస్తి, హోదా మొదలగు వాటితో నిమిత్తము లేకుండా వ్యక్తులు వారు చేసిన నేరాలను బట్టి శిక్షింపబడతారు. అనగా సాధారణ పౌరులు, ప్రభుత్వోద్యోగులు అందరూ ఒకే రకమైన చట్టానికి, ఒకే రకమైన న్యాయస్థానాల అధికారానికి బద్దులై ఉంటారు. ఎ.వి. డైసీ అభిప్రాయంలో "ఇంగ్లండ్‌లో ప్రధానమంత్రి మొదలు సాధారణ కానిస్టేబుల్ వరకు అనగా ప్రభుత్వోద్యోగులందరు తమ చట్ట వ్యతిరేక చర్యలకు సాధారణ పౌరులవలె జవాబుదారి వహిస్తారు"

3. ప్రైవేటు వ్యక్తుల వివాదాలను పరిష్కరించటంలో పౌర హక్కులను నిర్ణయిస్తూ న్యాయస్థానాలు ఇచ్చే తీర్పుల ఫలితంగా రాజ్యాంగంలోని హక్కులకంటే న్యాయస్థానాల తీర్పుల ఫలితంగా ఆవిర్భవించిన హక్కులకే ఎక్కువ రక్షణ వుంటుందని డైసీ అభిప్రాయం.

ఎ.వి. డైసీ ప్రకటించిన పై అభిప్రాయాలను బట్టి సమన్యాయ పాలనకు క్రింది లక్షణాలున్నాయని చెప్పవచ్చు.

a. దేశ వ్యాప్తంగా ఒకేరకమైన చట్టము అమలులో ఉంటుంది. b.సాధారణ పౌరులు, ప్రభుత్వోద్యోగులు అనే విచక్షణ లేకుండా వారందరూ ఒకే రకమైన చట్టానికి ఒకే రకమైన న్యాయస్థానాల అధికారానికి బద్ధులై ఉంటారు. c. చట్టము దృష్టిలో ప్రజలందరూ సమానమే. d. చట్టము వ్యక్తుల మధ్య ఎలాంటి విచక్షణ చూపించదు. e. న్యాయస్థానాల తీర్పు ఫలితంగా లభించిన పౌర హక్కులకు ఎక్కువ భద్రత ఉంటుంది. f. ప్రభుత్వోద్యోగుల వలన ఒక వ్యక్తి కి ఏదైనా నష్టం జరిగితే అతనికి నష్టపరిహారము చెల్లించే విషయమై ప్రభుత్వం బాధ్యత తీసుకోదు. నష్టానికి బాధ్యుడైన ప్రభుత్వోద్యోగి వ్యక్తికి నష్టపరిహారం చెల్లిస్తాడు.

ఆధునిక రాజ్యాలలో సమన్యాయ పాలన అమలులో ఉన్న రాజ్యంగా ఇంగ్లాండు ప్రసిద్ధి చెందింది. శాసన పాలన లేక సమన్యాయపాలన అమలులో ఉన్న కారణంగానే బ్రిటీషు ప్రజలు ఎక్కువ స్వేచ్ఛను అనుభవించగలుగుతున్నారని ఎ.వి. డైసీ అభిప్రాయపడ్డాడు.

## 9.5. సమన్యాయ పాలనకు పరిమితులు

ఎ.వి. డైసీ భావించినట్లు నేడు ఇంగ్లాండ్‌లో కూడా పూర్తిగా సమన్యాయపాలన అమలులో లేదు. సమన్యాయ పాలనకు కొన్ని పరిమితులు ఉన్నాయి. అవి:

**9.5. 1.** ఇంగ్లండ్‌లో నేడు పూర్తి సమన్యాయ పాలన లేదు. రాజు, రాయబారులు, న్యాయమూర్తులు మొదలయిన వారికి కొన్ని ప్రత్యేక రక్షణలు కల్పించబడ్డాయి. "రాజు ఏ తప్పూ చేయడు" అనేది ఇంగ్లండ్‌లో బహుళ ప్రజామోదం పొందిన నానుడి. ఇంగ్లండ్‌లో ప్రభుత్వోద్యోగులు కూడా వారి విధి నిర్వహణలో చేసిన చర్యలకు రక్షణ పొందగలుగుచున్నారు.

**9.5. 2.** 19వ శతాబ్దంలో వ్యక్తి శ్రేయోవాద సిద్ధాంతము ఎ.వి. డైసీ పై చూపిన ప్రభావము ఫలితంగానే ఆయన సమన్యాయపాలనా వాదాన్ని చేశాడు. కాని ఈనాడు రాజ్య విధులు విపరీతంగా పెరిగాయి. దానితో ప్రభుత్వోద్యోగుల పెత్తందారీతనము గూడ పెరిగింది. రాజ్యవిధులు విపరీతంగా పెరిగిన ఫలితంగా ప్రభుత్వోద్యోగులకు కొన్ని ప్రత్యేక హక్కులు లభ్యమయినాయి. ఇంగ్లండ్‌లో గాని, ఇతర ప్రజాస్వామ్య దేశములో గాని సమన్యాయ పాలన పూర్తిగా అమలులో లేదు.

**9.5. 3.** ఆధునిక కాలంలో రాజ్యవిధులు పెరగడంతో శాసన నిర్మాణంలో కొంత భాగాన్ని వివిధ కారణాల వలన మంత్రి వర్గానికి బదిలీ చేసినవి. దీనినే దత్తశాసనాధికారమంటారు. ఈ దత్త శాసనాధికారం కూడా సమన్యాయ పాలనను పరిమితం చేసింది.

**9.5. 4.** నేడు పరిపాలన న్యాయం అమలులో ఉన్న ఫ్రాన్సులోనే కాక అన్ని దేశాలలో పరిపాలక న్యాయస్థానాలు నెలకొల్పబడుతున్నాయి.

**9.5. 5.** జాతీయ అత్యవసర పరిస్థితి కాలంలో సమన్యాయపాలన అమలు జరుపబడటం లేదు.

**9.5. 6.** ఎ.వి. డైసీ భావించినట్లు ఇంగ్లండ్‌లో అన్ని పౌరహక్కులు న్యాయస్థానాల తీర్పుల ఫలితంగా ఆవిర్భవించినవి కావు. పార్లమెంటు రూపొందించి[illegible] చట్టము, పబ్లిక్ ఆర్డర్ చట్టము మొదలగు చట్టాల వలన గూడా పౌరహక్కులు సంక్రమించాయి.

## 9.6. సారాంశము

రాజనీతిశాస్త్ర ముఖ్య భావాలలో చట్టమొకటి. రాజ్యాధికారం యొక్క మద్దతుగల సాధారణ నియమాలే చట్టాలు. సార్వభౌముడే చట్టానికి మూలాధారమంటే సరిపోదు. ఆచారాలు, మతము, న్యాయస్థాన తీర్పులు, సమత మొదలయిన అంశాలు చట్ట రూపకల్పనకు తోడ్పడినవి. చట్టానికి, నీతికి తేడాలున్నప్పటికీ ఆ రెండిటి మధ్య సంబంధం కూడా ఉంది. సమన్యాయపాలన వ్యక్తి స్వేచ్ఛ పరిరక్షణకు ఒక ముఖ్య సాధనం.

### అభ్యాసాలు

**I. వ్యాస ప్రశ్నలు:**

1. చట్టాన్ని నిర్వచించి దాని మూలధారాలను వివరింపుము.
2. సమన్వాయ పాలన అనగానేమి? సమన్వాయ పాలన యొక్క మూల సూత్రాలను, పరిమితులను వివరింపుము.

**II. సంక్షిప్త వ్యాస ప్రశ్నలు :**

1. చట్టము - నీతులు మధ్యగల వ్యత్యాసమును పరిశీలించండి.
2. చట్ట వర్గీకరణను వివరించండి.

**III. కుశాగ్రబుద్ధి ప్రశ్నలు**

1. చట్టమనే పదానికి సమానమైన ఆంగ్లపదము 'లా' ............................ భాషలోని............................ అనే పదమునుండి గ్రహింపబడినది.
2. డైసీ తన ............................ గ్రంథంలో సమన్యాయపాలన భావనను విపులీకరించాడు.
3. "న్యాయమూర్తులు చట్టాలను చేస్తారు, వారు తప్పక చేయాలి" అని ............................ అభిప్రాయపడ్డాడు.
4. "సమన్యాయపాలన వ్యక్తి హక్కులకు, స్వేచ్ఛకు కంచుకోట. వ్యక్తుల పాలనకన్నా శాసన పాలనే శ్రేష్టమైనది" అని ............................ పేర్కొన్నాడు.

### ఉపయుక్త గ్రంథాలు


1. Political Theory — E. Asirvadham
2. Principles of Political Science — A.C. Kapoor
3. A Text book of Political Scientce — V. Ravindrasastry & Others


రచయిత

దామోదర నాయుడు

పాఠం - 10

# స్వేచ్ఛ - సమానత్వం

## 10.0. లక్ష్యం

ఈ పాఠంలో ఆధునిక ప్రపంచములో స్వేచ్ఛ, సమానత్వాల ప్రాధాన్యత, వాటికి గల పరిమితులు, వాటి మధ్యగల సంబంధం చర్చించటానికి ఉద్దేశించబడినది.

## 10.1. విషయ క్రమం


10.2. స్వేచ్ఛ - అర్థము

10.3. స్వేచ్ఛ - నిర్వచనాలు

10.4. స్వేచ్ఛ - రకాలు

10.5. స్వేచ్ఛ - పరిరక్షణలు

10.6. స్వేచ్ఛ - చట్టముల మధ్య సంబంధము

10.7. సమానత్వము - రకాలు

ఎ. రాజకీయ సమానత్వము బి. పౌర సమానత్వము సి. సాంఘిక సమానత్వము డి. ఆర్థిక సమానత్వము

10.8. స్వేచ్ఛా సమానత్వాల మధ్య సంబంధము

10.9. సారాంశము


## 10.2. స్వేచ్ఛ - అర్థము

ఆధునిక కాలంలో ప్రాధాన్యత పొందిన భావనలలో అతి ముఖ్యమైనది స్వేచ్ఛ. క్రీ.శ. 16, 17 శతాబ్దాలలో ఐరోపా ఖండంలో వచ్చిన పారిశ్రామిక విప్లవము మరియు ఆనాటి ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిస్థితుల ప్రభావం ఫలితంగా అభివృద్ధి చెందుతున్న పెట్టుబడిదారీ విధానానికి అనుగుణంగా నూతన రాజకీయ సిద్ధాంతాలు రాజకీయ సంస్థలు, భావనలు రూపొందాయి. 1688లో ఇంగ్లండ్‌లో జరిగిన రక్తరహిత విప్లవం, 1776 లో అమెరికన్ విప్లవం, 1789 లో ఫ్రెంచి విప్లవాల ద్వారా ఈ భావనలు మరింత ప్రాబల్యాన్ని సంపాదించాయి. ఫ్రెంచివిప్లవంలో స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం నినాదాలుగా వర్ధిల్లాయి. మొదటి ప్రపంచం యుద్ధం తరువాత వివిధ జాతులు తమ స్వేచ్ఛకై జాతీయోద్యమాలను కొనసాగించాయి. రెండవ ప్రపంచ యుద్ధానంతరం నూతనంగా స్వతంత్రం పొందిన దేశాలలోని ప్రజలు నియంతృత్వాలకు వ్యతిరేకంగా స్వేచ్ఛకోసం ఉద్యమించటం జరుగుతూనే వున్నది. ఇటీవల కాలంలో నేపాల్ , బర్మా మొదలైన దేశాలలో ప్రజలు స్వేచ్ఛకోసం అనేక ఉద్యమాలు నడిపారు. పై అంశాలను పరిశీలిస్తే సమకాలీన మానవజాతి చరిత్రను, స్వేచ్ఛకోసం మానవులు జరుపుతున్న పోరాటంగా వర్ణించవచ్చు. స్వేచ్ఛ కావాలనటం మానవుని సహజమైన వాంఛ. స్వేచ్ఛ యొక్క ప్రాముఖ్యాన్ని నొక్కి చెపుతూ రూసో "స్వేచ్ఛాయుతంగా ఉండక పోవటం మానవుడుగా మనలేకపోవటమే" అంటాడు.

'స్వేచ్ఛ'కు సమానార్థకం గల 'లిబర్టీ' అనే ఆంగ్ల పదం 'లిబర్' అనే లాటిన్ పదంనుండి ఉద్భవించింది. లిబర్ అంటే 'స్వేచ్ఛ' లేదా 'స్వాతంత్ర్యము'. స్వేచ్ఛ అనే పదం చాలా సులభమైనదిగా కనిపించినప్పటికీ ప్రపంచ రాజకీయ రంగంలో ఈ భావన ఒక ప్రధానమైన అంశంగా మారింది. ఎందుకంటే, ఈ భావన ప్రపంచాన్ని రెండు ప్రత్యర్థివర్గాలుగా విభజించింది. ఒక వర్గం ప్రజాస్వామ్య ప్రపంచానికి ప్రాతినిధ్యం వహిస్తే, రెండోవర్గం మార్క్సిస్టు సిద్ధాంతాలకు ప్రాతినిధ్యం వహించింది. ప్రజాస్వామ్య ప్రపంచం రాజకీయ

స్వేచ్ఛకిచ్చే ప్రాధాన్యత ఆర్థిక స్వేచ్ఛకు ఇవ్వరని మార్క్సిస్టుల వాదన కాగా, సోషలిస్టు దేశాలలో అసలు స్వేచ్ఛే ఉండదని ప్రజాస్వామ్య ప్రపంచానికి నాయకత్వం వహించేవాళ్లు వాదిస్తూ వచ్చారు.

## 10.3. స్వేచ్ఛ - నిర్వచనాలు

ప్రొఫెసర్ లాస్కీ అభిప్రాయంలో "ఏ స్వేచ్ఛా వాతావరణంలోనైతే ప్రతి వ్యక్తి తన పరిపూర్ణ అభివృద్ధికి కృషి చేయగలిగే అవకాశముంటుందో అదే స్వేచ్ఛ". హక్కుల ద్వారా కూడా స్వేచ్ఛ ఏర్పడుతుందని, అందుకోసం సమాజంలో అందరికీ హక్కులను ఎట్టి వివక్షత లేకుండా లభించే పరిస్థితులను ఏర్పరచాలని లాస్కీ చెప్పాడు.

బార్కర్ అభిప్రాయంలో "ప్రతివ్యక్తీ తన శక్తి సామర్థ్యాలనుపయోగించి తన హక్కులను అనుభవించాలనే వుద్దేశంతో రాజ్యం రూపొందించే నియమావళి సముదాయమే స్వేచ్ఛ".

రామ్‌సే మ్యూర్ స్వేచ్ఛను నిర్వచిస్తూ "స్వేచ్ఛ అంటే ప్రతి వ్యక్తి లేదా జాతికి, మతానికి సంబంధించిన సంస్థలకు లేదా కార్మిక సంఘాలకు తమయొక్క అభిప్రాయాలను వెలిబుచ్చటానికి, వాటికనుగుణంగా వ్యవహరించటానికి వున్న అవకాశాలే. ఇతరుల హక్కులకు భంగం కలిగించకుండా చట్టం కల్పించిన రక్షణతో వ్యక్తులు లేదా సంస్థలు తమ పద్ధతుల్లో తమ ప్రయోజనాలు సాధించటానికి కృషి చేయటం" అని చెప్పాడు.

ప్రొఫెసర్ సీలీ అభిప్రాయంలో "ప్రభుత్వ అధిక జోక్యానికి వ్యతిరేకమైనదే స్వేచ్ఛ". హెర్బర్ట్ స్పెన్సర్ స్వేచ్ఛను నిర్వచిస్తూ "ఇతరుల స్వేచ్ఛకు భంగం కలుగకుండా ప్రతివ్యక్తీ తనకు తోచినట్లు వ్యవహరించటమే స్వేచ్ఛ" అని అన్నాడు.

పైన వివరించిన నిర్వచనాలు ప్రధానంగా రెండు అర్థాలు సూచిస్తాయి. మొదటి మూడు నిర్వచనాలు నిశ్చయాత్మక స్వేచ్ఛను (Positive Liberty) వివరించగా, తర్వాత రెండు నిర్వచనాలు వ్యతిరేకభావములో (Negative Liberty) చెప్పాయి. నిశ్చయాత్మక స్వేచ్ఛ అంటే వ్యక్తులు తమ శక్తి సామర్థ్యాలను వినియోగించుకొని అభివృద్ధిని సాధించటానికి ఏర్పడే అవకాశాల సముదాయము. వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన పరిస్థితులు సృష్టించినప్పుడు మాత్రమే స్వేచ్ఛ పేదవారితో సహా అందరికీ అందుబాటులో వుంటుంది. స్వేచ్ఛ అంటే నిర్బంధాలు లేకపోవడం కాదు. సహేతుక, న్యాయమైన నిర్బంధాలు వుండటం అని లాస్కీ, బెంథామ్, యీషయా బెర్లిన్ మొదలైన వారు పేర్కొన్నారు.

వ్యతిరేక భావములో స్వేచ్ఛ అంటే సమాజపరమైన జోక్యం లేకుండా వ్యక్తి యథేచ్ఛగా తన ఇష్టము వచ్చినట్లు వ్యవహరించే స్వేచ్ఛ కలిగి వుండటమే. ఈ విధానము బలవంతుడు బాగుపడటానికి, బలహీనుడు నశించటానికి దారితీసే పరిస్థితులను ఏర్పరుస్తుంది. 19వ శతాబ్దంలో పారిశ్రామిక విప్లవం తర్వాత మితిమీరిన స్వేచ్ఛను వ్యక్తి శ్రేయోవాదులు కోరటం వలనే పారిశ్రామిక అధిపతులు ధనవంతులై, కార్మికుల జీవితం దుర్భరమైంది. వ్యక్తులు తమ ఇష్టమొచ్చినట్లు చేసుకోవడానికి స్వేచ్ఛను ఇవ్వడం వలన సమాజంలో అరాచక పరిస్థితులేర్పడవచ్చు. అందువలన స్వేచ్ఛను క్రమబద్ధం చేయవలసిన అవసరం ఎంతైనా వుంది. స్వేచ్ఛను క్రమబద్ధం చేసి, వ్యక్తుల మధ్య సత్సంబంధాలేర్పడి వారు సామాజిక, వ్యక్తిగత ప్రయోజనాలను సామరస్య వాతావరణంలో సాధించేటట్లు చేయవలసిన బాధ్యత ప్రభుత్వానికి, సమాజానికి వున్నది.

## 10.4. స్వేచ్ఛ - రకాలు

స్వేచ్ఛ అనే పదాన్ని వివిధ అర్థాలలో వాడటం జరుగుతుంది. స్వేచ్ఛ బహుత్వ స్వభావం కలది. దానికి అనేక రూపాలున్నాయి. స్వేచ్ఛ స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి దాని వివిధ రూపాలను తెలుసుకోవాలి.

**10.4. 1. సహజ స్వేచ్ఛ:** రాజ్యం ఆవిర్భవించకముందు ప్రాకృతికావస్థలో మానవుడనుభవించిన అపరిమిత స్వేచ్ఛను సహజస్వేచ్ఛ అంటారు. పౌరసమాజం ఏర్పడక పూర్వం మానవుడు ఈ విధమైన సహజ స్వేచ్ఛను అనుభవించి వుండవచ్చుని భావిస్తున్నారు. ఈ వ్యవస్థలో మానవుడనుభవించే స్వేచ్ఛే సహజ స్వేచ్ఛ అనీ హాబ్స్, రూసోలు భావించారు. అయితే ఈ స్థితి ఎక్కువకాలం కొనసాగలేదు.

సాంఘిక, రాజకీయ సంస్థల ఆవిర్భావంతో సహజస్వేచ్ఛ అంతరించింది. సాంఘిక ఒడంబడిక ద్వారా మానవుడు తన సహజ స్వేచ్ఛను కోల్పోయి దాని స్థానంలో పౌర స్వేచ్ఛలను పొందుతాడు. నాగరిక సమాజంలో అపరిమిత స్వేచ్ఛకు బదులు పరస్పరం కలిసి జీవిస్తారు. నిజమైన స్వేచ్ఛ రాజకీయ, సాంఘిక సంస్థలు ఏర్పడిన పౌర సమాజంలోనే సాధ్యమవుతుంది. ఎందుకంటే ఇతరుల స్వేచ్ఛకు భంగం కలుగకుండా ప్రతి ఒక్కరూ స్వేచ్ఛను అనుభవించవచ్చు.

**10.4. 2.** పౌర స్వేచ్ఛ: సమాజంలో ఒక వ్యక్తి అనుభవించే వ్యక్తిగతమైన స్వేచ్ఛనే పౌర స్వేచ్ఛ అంటారు. ప్రతి వ్యక్తి తన హోదాకు భంగం లేకుండా జీవిస్తూ, సామాజిక వికాసంలో సృజనాత్మక కార్యకలాపాల ద్వారా పాల్గొంటూ, అదే సమయంలో తన వికాసం కోసం కూడా ప్రయత్నించడానికి తగిన అవకాశాలను, వాతావరణాన్ని స్వేచ్ఛ కల్పిస్తుంది. ప్రొ. అప్పాదొరై అభిప్రాయంలో, "పౌర స్వేచ్ఛ అనగా చట్టం ద్వారా, సంస్థల ద్వారా రాజ్యం పౌరులకు కల్పించే హక్కుల సముదాయమే." "రాజ్యం గుర్తించి అమలు జరిపే హక్కులే పౌర స్వేచ్ఛ" అని ప్రొ. గెటిల్ అభిప్రాయపడ్డారు. ఈ విధంగా స్వేచ్ఛ సమాజం యొక్క గుర్తింపును పొంది, చట్టము ద్వారా హామీని కల్గి, రాజ్యాంగంలో ఒక భాగంగా వుంటుంది. ఒక వ్యక్తి గాని, సంస్థ గాని స్వేచ్ఛను అరికట్టటానికి ప్రయత్నించినట్లయితే రాజ్యాంగ సంస్థలైన న్యాయ వ్యవస్థల ద్వారా దీనిని కాపాడుకోవచ్చు. అయితే కొన్ని సందర్భాలలో జాతీయ ప్రయోజనాల దృష్ట్యా పౌర స్వేచ్ఛపై కొన్ని పరిమితులు విధించవచ్చు. ప్రజాస్వామిక రాజ్యాలలో పౌరస్వేచ్ఛ ప్రాణ రక్షణ హక్కు, పనిహక్కు, ఆస్తి హక్కు, మత హక్కు, భావస్వాతంత్ర్యపు హక్కు మొ. వాటి ద్వారా వ్యక్తమవుతుంది. అయితే పౌరులకు వాస్తవంలో అందుబాటులో ఎంత స్వేచ్ఛ, హక్కులు ఉంటాయనేది ప్రభుత్వ వ్యవస్థను బట్టి ఆధారపడి వుంటుంది.

**10.4. 3.** రాజకీయ స్వేచ్ఛ: రాజ్య వ్యవహారాలలో క్రియాత్మకంగా పాల్గొనే అవకాశాన్ని రాజకీయ స్వేచ్ఛగా పేర్కొన వచ్చు. రాజకీయ స్వేచ్ఛను లాస్కీ వివరిస్తూ, "నా అభిప్రాయాలను యధేచ్ఛగా వ్యక్తీకరించడానికి, నేను ఆలోచించిన పద్ధతిలో రాజకీయ కార్యకలాపాలలో పాల్గొనడానికి నాకున్న అవకాశమే రాజకీయ స్వేచ్ఛ'' అని పేర్కొన్నాడు. రాజకీయ స్వేచ్ఛ అనేది ప్రజాస్వామ్య ప్రభుత్వాలున్నపుడే సాధ్యమవుతుంది. పౌరునికి స్వేచ్ఛ వున్నపుడే రాజ్య వ్యవహారాలలో స్వేచ్ఛగా, ఉత్సాహంగా పాల్గొని వాటిని ప్రభావితం చేయగల్గుతాడు. రాజకీయ స్వేచ్ఛ పౌరునికి కొన్ని రాజకీయ హక్కులను కల్పిస్తుంది. ఓటుహక్కు, ప్రభుత్వ పదవులు చేపట్టే హక్కు, విజ్ఞాపన హక్కు, విమర్శించే హక్కు మొ.వి రాజకీయ స్వేచ్ఛ వున్నపుడే పొందగలుగుతాము. లాస్కీ అభిప్రాయంలో విద్య, స్వేచ్ఛాయుతమైన పత్రికలు రాజకీయ స్వేచ్ఛను సాధించటానికి, సంరక్షించుకోవటానికి వుపయోగపడే శక్తివంతమైన సాధనాలు.

**10.4. 4.** ఆర్థిక స్వేచ్ఛ: ఆర్థిక స్వేచ్ఛ లేనిదే పౌర, రాజకీయ స్వేచ్ఛలకు అర్థం ఉండదు. ఆకలితో అలమటిస్తూ పేదరికంలో ఉన్న వ్యక్తికి సంఘ ప్రయోజనాలకు తన శక్తి సామర్థ్యాలనుపయోగించే అవకాశం లభించదు. అందువలనే ప్రొ. లాస్కీ "ఆర్థిక స్వేచ్ఛ లేని రాజకీయ స్వేచ్ఛ అర్థరహితము'' అని చెప్పాడు. ఉదా : 1947 లో పొందిన స్వాతంత్ర్యం ద్వారా భారత ప్రజలు రాజకీయ స్వేచ్ఛను పొందినప్పటికి, నేటికీ ఆర్థిక స్వేచ్ఛ లేకపోవటంతో నిరాశా నిస్పృహలకు గురవుతున్నారు. ఆర్థిక స్వేచ్ఛ ఆర్థిక సమానత్వానికి దారితీస్తుంది. ఆర్థిక సమానత్వం అంటే ప్రతి పౌరునికి కనీస జీవనావసరాలను సమానత్వ ప్రాతిపదికపై కల్పించి అందరికీ సంతృప్తినిచ్చే ఆర్థిక న్యాయాన్ని ఏర్పరచటం. ఆర్థిక స్వేచ్ఛకు ప్రజాస్వామ్య దేశాలకంటే సామ్యవాద దేశాలు ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చాయి. ముఖ్యంగా పనిచేయటానికి గల హక్కు ఈ దేశాలలో ప్రధానమైనదిగా గుర్తించారు. అయితే నేటి కాలంలో ఆర్థిక హక్కుల యొక్క అవసరం, ప్రాముఖ్యత సార్వజనీనంగా అన్ని దేశాలలోను గుర్తిస్తున్నారు.

**10.4. 5.** జాతీయ స్వేచ్ఛ: జాతీయ స్వేచ్ఛ అంటే ఒక జాతి మరో జాతికి లోబడి వుండకుండా సార్వభౌమాధికారాన్ని, స్వతంత్ర్యాన్ని కలిగి వుండటం. అంటే బాహ్యంగాను, ఆంతరంగికంగాను ఒక రాజ్యం సార్వభౌమాధికారాన్ని కలిగివున్నప్పుడు అది జాతీయ స్వేచ్ఛను కలిగివుంటుందని చెప్పవచ్చు. ఇటువంటి రాజ్యము ఎట్టి విదేశీ జోక్యము లేకుండా తన దేశీయాంగ, విదేశాంగ విధానాలను స్వతంత్రంగా రూపొందించుకుంటుంది. రెండో ప్రపంచ యుద్ధానికి ముందు ప్రపంచంలో అనేక దేశాలు ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలు జాతీయ స్వేచ్ఛను కలిగి లేవు. మొదటి ప్రపంచ యుద్ధానంతరం ఈ దేశాలలో జాతీయోద్యమాలు ప్రారంభమై జాతీయ స్వేచ్ఛను సాధించాయి.

## 10.5. స్వేచ్ఛా-పరిరక్షణలు

మానవులు ఆంతరింగిక, బాహ్య శక్తుల నుండి స్వేచ్ఛను సంపాదించుకోవడానికి నిరంతరమైన పోరాటం చేయవలసి ఉన్నది. స్వేచ్ఛను సంపాదించిన తరువాత సమాజంలో వారి స్వేచ్ఛలను అరికట్టే వ్యతిరేక శక్తులు ఎప్పుడూ పొంచి వుంటాయి. సమకాలీన ప్రపంచంలో షుమారుగా వున్న 170 దేశాలలో ఎక్కువ దేశాల ప్రజలు స్వేచ్ఛను అనుభవించలేక పోతున్నారు. ఆఫ్రికా, లాటిన్ అమెరికా మొదలైన ఖండాలలో ఎక్కువ దేశాల ప్రజలు నియంతృత్వ విధానాలనే చవిచూస్తున్నారు. బంగ్లాదేశ్, పాకిస్తాన్, ఫిలిప్పైన్స్ మొదలైన దేశాలో స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు ప్రజలు పోరాటం చేసి సాధించుకున్నప్పటికి అవి నిలబడటం లేదు. అనేక దేశాలలో ప్రజల హక్కులను, స్వేచ్ఛను అక్కడి ప్రభుత్వాలు హరిస్తున్నాయని అమ్నెస్టీ ఇంటర్నేషనల్ సంస్థ తమ నివేదికలలో పేర్కొన్నది. కాబట్టి స్వేచ్ఛను కాపాడుకోవాలంటే రాజ్యాంగపరమైన, సాంఘిక పరమైన రక్షణలు అవసరము. ఈ క్రింది మార్గాల ద్వారా స్వేచ్ఛను పరిరక్షించుకోవచ్చు.

**10.5. 1. హక్కులను రాజ్యాంగంలో పొందుపరచవచ్చు:** ప్రజల హక్కులను నిర్వచిస్తూ, స్పష్టంగా, ఎటువంటి విపరీతార్ధాలకు దారితీయని విధంగా రాజ్యాంగంలో పొందుపరచాలి. అప్పుడే అవి ప్రాథమిక హక్కులుగా మనగలుగుతాయి. అలా చేయడం వల్ల వ్యక్తి స్వేచ్ఛకు రాజ్యాంగ బద్ధతను, రక్షణను, పవిత్రతను ఆపాదించినట్లవుతుంది. రాజ్యాంగ నిబద్ధత కలిగిన ఈ స్వాతంత్ర్యాలను న్యాయస్థానాలు కూడా రిట్లను జారీచేయడం ద్వారా అమలు చేస్తాయి, కాపాడ గలుగుతాయి. ప్రభుత్వం నుంచి గాని, ప్రభుత్వేతర సంస్థల నుంచి గాని ప్రజల హక్కులకు హాని జరుగకుండా రాజ్యాంగం హామీని ఇచ్చినట్లు అవుతుంది.

**10.5. 2. సమన్యాయ పాలన :** వ్యక్తి తన హక్కులను స్వేచ్ఛగా అనుభవించడానికి సమన్యాయపాలన అవసరం. కుల, మత, వర్గ వర్ణ, ప్రాంతీయ, హోదా, స్త్రీ పురుష విచక్షణ లేకుండా శాసనం దృష్టిలో అందరూ సమానులేనని చెప్పడాన్ని సమన్యాయ పాలన అంటారు. అలాగే వ్యక్తి తప్పుచేసినప్పుడే శిక్షార్హుడు. నేరం చేయని వ్యక్తిని నిర్బంధించకూడదు. న్యాయస్థానాలు విచారించి, నేరస్తుడని నిర్ణయించినప్పుడే వ్యక్తిని శిక్షించాలి. సమాజంలో, ఏ వర్గానికీ, ఏ సమూహానికీ ప్రత్యేక రక్షణలుండవు. చట్టం అందరికీ సమానంగా వర్తిస్తుంది. సమన్యాయ పాలనలోని ఈ అంశాలు ప్రజల హక్కులను, స్వాతంత్ర్యాన్ని సంరక్షిస్తాయి.

**10.5. 3. స్వతంత్ర ప్రతిపత్తి, నిష్పాక్షికత గల పత్రికా రంగం :** ఏ దేశంలోనైనా, ప్రజాభిప్రాయాన్ని నిర్మించేవి, సమీకరించేవి, వ్యక్తీకరించేవీ పత్రికలే. ఇవి నిజాయితీగా, స్వేచ్ఛగా ప్రజలకు సమాచారాన్ని అందించినప్పుడే ప్రజలు సరియైన అభిప్రాయాన్ని, ఆలోచనలను కలిగి ఉంటారు. ప్రజల హక్కులపై ఏ విధమైన దురాక్రమణ జరిగినా సహజంగానే పత్రికలు ప్రతిస్పందించి, హక్కులకు రక్షణ కవచాలుగా నిలుస్తాయి. అందుకోసం స్వతంత్రమైన, నిష్పక్షపాతమైన, బాధ్యతాయుతమైన పత్రికారంగం అవసరం. పత్రికలు అభిప్రాయాల సారధులు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తేవడం, ప్రభుత్వం తప్పొప్పులను ప్రజల ముందుకు కొనిపోవడం పత్రికలే చేస్తాయి. విమర్శనాత్మకమైన సంపాదకీయాలు, వార్తా విశ్లేషణలు, వ్యాసాల ద్వారా ప్రజలను రాజకీయ, సాంఘిక, ఆర్థిక రంగాల్లో విద్యావంతులను, చైతన్యవంతులను చేస్తాయి. తద్వారా ప్రభుత్వ నిరంకుశ ధోరణులను నిరోధించడమే కాక, పౌరస్వేచ్ఛను కాపాడతాయి.

**10.5. 4. అధికార వికేంద్రీకరణ :** ఎక్కడైనాసరే అధికారాలను కేంద్రీకరిస్తే నియంతృత్వము ప్రబలుతుంది. వ్యక్తి స్వేచ్ఛ దెబ్బతింటుంది. బానిసత్వం పెరుగుతుంది. అందుచేత అధికార వికేంద్రీకరణ వ్యక్తి స్వాతంత్ర్యానికి అవసరం. వికేంద్రీకరణ వల్ల అధికార దుర్వినియోగం, బాధ్యతా రాహిత్యం, క్రూరపాలన అంతమవుతాయి. మనదేశంలో జాతీయ స్థాయినుంచి గ్రామీణస్థాయి వరకు అధికారాన్ని వివిధ సంస్థలకు పంపిణీచేసి పంచాయితీ రాజ్యవ్యవస్థను ప్రవేశ పెట్టారు. "అధికారాన్ని విస్తృతంగా పంపిణీ చేసినప్పుడే దానిని దుర్వినియోగం చేసే వ్యక్తులను నియంత్రించడం సాధ్యమవుతుంది" అని లాస్కీ పేర్కొన్నాడు.

**10.5. 5. స్వతంత్ర న్యాయశాఖ :** స్వేచ్ఛ పరిరక్షణకు, స్వేచ్ఛాయుతమయిన, నిష్పక్షపాతమయిన న్యాయస్థానాలు కూడా అవసరం. ప్రభుత్వంలో భాగాలైన శాసనసభలు, కార్యనిర్వాహక శాఖలు ప్రజాభీష్టాన్ని గమనించక, శాసనాలు, నిర్ణయాలు, విధానాలు రూపొందించి అమలు చేసినపుడు పౌరుల హక్కులు దెబ్బతింటాయి. ప్రజాసంక్షేమం పేరుతో పాలనా యంత్రాంగానికి అపరిమితాధికారాలు అప్పజెప్పడం వల్ల కూడా వ్యక్తి స్వేచ్ఛ అణగారిపోతుంది. అందుచేత నిష్పక్షపాతమైన న్యాయస్థానాలు పౌరుల గోడు ఆలకించి, కోల్పోయిన హక్కులకు రక్షణ కల్పించి ప్రభుత్వ పాలనా యంత్రాంగాన్ని అదుపులో ఉంచుతాయి. దీనికోసం అమెరికా, ఇండియా వంటి దేశాల్లో

న్యాయ వ్యవస్థకు "న్యాయ సమీక్షాధికారం" కల్పించారు. దీనివల్ల శాసనసభ ఆమోదించిన చట్టాలను, కార్యవర్గం జారీచేసిన ఆదేశాలను, ఆర్డినెన్సులను న్యాయమూర్తులు సమీక్షించి, వానిలోని రాజ్యాంగ బద్ధతను పరిశీలించి అవి స్వేచ్ఛను పరిమితం చేసేవిగా గాని, లేదా రాజ్యాంగాన్ని ఉల్లంఘించేవిగా గాని ఉన్నట్లయితే వాటిని రాజ్యాంగ విరుద్ధాలని ప్రకటించి, కొట్టివేసే అధికారం న్యాయమూర్తులకున్నది. ఇంకా, అనేక ప్రజాస్వామ్య దేశాల్లో పౌరుల హక్కుల రక్షణ నిమిత్తం హెబియస్ కార్పస్, మాండమస్, కో వారెంటో, సెర్షియోరారి, ఇంజక్షన్, ప్రొహిబిషన్ వంటి నిషేధాత్మక రిట్లను న్యాయస్థానాలు జారీ చేస్తున్నాయి.

**10.5. 6. అధికార పృథఃక్కరణ:** ప్రభుత్వ అధికారాల కేంద్రీకరణ నిరంకుశ పాలనకు దారి తీస్తుందని భావించిన మాంటెస్క్యూ అధికార పృథఃక్కరణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. దీని ప్రకారం అధికార దుర్వినియోగాన్ని నియంతృత్వ పాలనను నిరోధించడం సాధ్యమవుతుంది. ఆదేవిధంగా ప్రభుత్వంలోనే ఒక శాఖ అధికారాన్ని మరొక శాఖ నిరోధించేటట్లు ఉండాలి. శాసన నిర్మాణాన్ని కార్యనిర్వాహక వర్గం నుంచి వేరుచేస్తే కాని, అట్లే న్యాయనిర్ణయాధికారాన్ని కార్య నిర్వాహక శాఖ నుంచి వేరు పరిస్తే కాని వ్యక్తి స్వేచ్ఛ సాధ్యం కాదు. న్యాయాధికారాన్ని శాసనాధికారంతో ముడి పెట్టడం వల్ల శాసన నిర్మాతలే న్యాయాధికారులై, శాసన లోపాలను సవరించేవారు లేక ప్రజలు ఇబ్బందుల పాలవుతారు. ఇదేవిధంగా కార్యనిర్వాహకులకే న్యాయాధికారం అప్పగించినట్లయితే నిరంకుశాధికారులకు లైసెన్స్ ఇచ్చినట్లవుతుంది. అందుచేత అధికార దుర్వినియోగాన్ని అరికట్టి ప్రజా హక్కులను కాపాడటానికి ప్రభుత్వాధికారాలను విభజించి వేరు వేరు వ్యక్తులకు గాని, శాఖలకు గాని అప్పగించడం అవసరం. ఈ శాఖలు తమ అధికారాలను పరస్పర జోక్యం లేకుండా నిర్వహించాలి. శాసనసభ శాసనాలు రూపొందించడం, కార్యనిర్వాహక వర్గం వాటిని అమలు చేయడం, న్యాయశాఖలు చట్టాలను వివరించి న్యాయం చేకూర్చడం తమ తమ పరిధుల్లో చేయగలవు. దీనితో పాటు ఏ ఒక్క శాఖ తన పరిధి నతిక్రమించి అధికార దుర్వినియోగానికి జోక్యానికి పాల్పడకుండా నిరోధించడానికి మూడు శాఖల మధ్య సమతౌల్యాన్ని సాధించడానికి నిరోధ సమతౌల్య పద్ధతి (Checks and Balances) ని అనుసరించడం అవసరం.

**10.5. 7. బాధ్యతాయుత ప్రతిపక్షం :** ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా స్వార్థబుద్ధితో పనిచేసే అధికార పక్షాన్ని బాధ్యతాయుతమైన ప్రతిపక్షం అడ్డుకొంటుంది. అధికార పార్టీ తప్పుడు ధోరణులను నిరంతరం గమనిస్తూ, శాసనసభల్లోనూ బయటా విమర్శిస్తూ ప్రభుత్వం గాడి తప్పకుండా చూస్తూఉండి, తత్ఫలితంగా ప్రతిపక్షం సరైన ప్రజాభిప్రాయాన్ని రూపొందించే అవకాశముంది. శాసన సభల్లో జరిగే చర్చలు, నిశిత విమర్శల ద్వారా ప్రతిపక్షం అధికార దుర్వినియోగాన్ని నిరంకుశ పోకడలను అరికడుతుంది. అందుచేతనే ప్రతిపక్షాన్ని ప్రజల హక్కుల సంరక్షణకర్తగా భావించవచ్చు. ప్రజా సమస్యలను పెడచెవిని పెట్టే ప్రభుత్వంపై ప్రతిపక్షం అంకుశంగా పనిచేస్తుంది.

**10.5. 8. ఆర్థిక, సాంఘిక సమానత్వం:** సమానత్వ భావన స్వేచ్ఛకు ప్రేరణ వంటిది. సమానావకాశాలు నెలకొన్న సమాజంలోనే వ్యక్తి స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు వెల్లివిరుస్తాయి. విపరీతమైన, నిర్నిబంధమైన వ్యక్తి స్వేచ్ఛ అసమానతలను సృష్టిస్తుంది. అదేవిధంగా అసమానతలున్నచోట స్వేచ్ఛ సాధ్యంకాదు. ఒకవిధంగా అపరిమిత స్వేచ్ఛపై గల హేతుబద్ధమైన నిబంధన సమానత్వమే. కనీసావసరాలు తీరే అవకాశాలు లేనిచోట తీవ్ర ఆర్థిక అసమానతలు చోటుచేసుకొని ప్రజలను విప్లవాలవైపు, హింసాయుత చర్యల వైపు అనివార్యంగా నెట్టుతాయి. అరాచకం, అంతర్యుద్ధాలు అసమానతల ఫలితాలు. ఇట్లాంటి సమాజంలో ఎవరో కొద్దిమంది మాత్రమే స్వేచ్ఛను చేజిక్కించుకొని, అనుభవించగల్గుతారు. అందుచేత ఆర్థిక సమానావకాశాలు స్వేచ్ఛకు పెట్టని కోటల వంటివి. కనుకనే ఆధునిక రాజ్యాలన్నీ ప్రాధమికంగా తమ పౌరులకు ఆర్థిక సామాజిక న్యాయాన్ని, సమానత్వాన్ని కల్పించే పథకాలను, ప్రణాళికలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నాయి. వీటి వల్లనే వ్యక్తులు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను సంపూర్ణంగా అనుభవించగలుగుతారు.

**10.5. 9. విద్యావంతులైన పౌరులు :** తమ స్వేచ్ఛను సమగ్రంగా అనుభవించడానికి, కాపాడుకోడానికి పౌరులందరూ విద్యావంతులై ఉండడం అవసరం. నిరక్షరాస్యులు, అజ్ఞానులు అధికులుగా ఉన్న రాజ్యంలో హక్కులు, అవకాశాలు కొద్దిమంది ప్రజలకే అందుబాటులో ఉంటాయి. అక్షరాస్యత లేనివారు తమకు తెలియకుండానే దోపిడీకి, అణచివేతకు గురయ్యే అవకాశముంది. విద్యావంతులు రాజ్య కార్యకలాపాల్లో చురుకుగా పాలుపంచుకొని చైతన్యవంతులవుతారు. రాజకీయ పరిజ్ఞానం, చైతన్యం గలవారు అన్ని రంగాల్లో అవకాశాలను వినియోగించుకొని బాధ్యతాయుతమైన మంచి పౌరులుగా రూపొందుతారు. స్వేచ్ఛా స్వాతంత్ర్యాల పట్ల అవగాహన కోసం విద్య అత్యవసరం.

**10.5. 10. ప్రజాస్వామ్య ప్రభుత్వము :** ప్రజాస్వామ్య ప్రభుత్వ విధానంలో మాత్రమే పౌరులకు హక్కులు, స్వాతంత్ర్యం లభిస్తాయి. ప్రజాస్వామ్య విధానానికి స్వేచ్ఛ, సమానత్వాలు మూలస్థంభాలవంటివి. ప్రజలెన్నుకొన్న ప్రభుత్వం పౌరులకు రాజకీయ, ఆర్థిక, సాంఘిక రంగాలలో స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలకు హామీనిస్తుంది. ప్రజాస్వామ్యములోనే పౌరులు తమ పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసాన్ని సాధించటానికి కృషిచేస్తారు. ప్రజాప్రభుత్వాలు రాజకీయ సామాజిక స్వాతంత్ర్యాలు కల్పించడం ద్వారా ప్రజలను పాలిస్తాయి. ప్రజాస్వామ్యములోనే పౌరులు తమ హక్కులు, విధుల పట్ల పూర్తి జాగరూకులై ఉంటారు. ప్రజాభిప్రాయము ప్రకారమే ప్రభుత్వము కొనసాగుతున్నది. కనుక హక్కుల రంగములో ప్రభుత్వము సాధ్యమైనన్ని రక్షణలు చేకూరుస్తుంది.

**10.5. 11. నిరంతర అప్రమత్తత :** ప్రజల నిరంతర అప్రమత్తత, స్వేచ్ఛను రక్షించె మార్గాలన్నింటికంటే ప్రధానమైనది. ప్రజల నిరంతర అప్రమత్తత, స్వేచ్ఛా ప్రాముఖ్యాన్ని గుర్తించడం, స్వేచ్ఛకు భంగము కలిగినపుడు పోరాడి దానిని కాపాడుకోవడం, స్వేచ్ఛా స్వాతంత్ర్యాల పట్ల తగినంత ఆసక్తి, ఆకాంక్ష స్వేచ్ఛారక్షణకు కోటగోడల వంటివి. లాస్కీ అన్నట్లు " స్వేచ్ఛకు అసలైన పరిరక్షణ, శాసనము కంటే కూడా స్వేచ్ఛ పట్ల ఉన్న సగర్వమైన భావనే". థామస్ జఫర్సన్ అభిప్రాయములో "ప్రజలు స్వేచ్ఛను కాపాడుకోవటానికి అవసరమైతే సంఘర్షణలకు దిగుతారన్న భయం పాలకులకు లేకపోతే లేదా అట్లాంటి హెచ్చరికను పాలకులు పౌరుల నుండి గ్రహించలేనప్పుడు అటువంటి ప్రజ, స్వేచ్ఛను ఏ విధముగానూ కాపాడుకొనలేదు".

**10.5. 12. బహుతా సార్వభౌమత్వ భావము :** బహుతా సార్వభౌమాధికార వాదుల అభిప్రాయంలో అధికారం కేవలం రాజ్యానికి ఒక్కదానికే కాదు, సమాజములోని మత, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక సంఘాలన్నింటికి ఉంటుంది. ఈ సాంఘిక సంస్థలు రాజ్యము కంటే అధికంగా సభ్యులైన పౌరులను నియంత్రణ చేస్తాయి. అందువలన నిరంకుశమైన రాజ్యాధికారము ఈ సంస్థల చేత పరిమితము చేయబడుతుంది. వీటిలో సభ్యులైన పౌరులు వీటి ద్వారానే రాజ్య సార్వభౌమాధికారాన్ని ఎదుర్కొని తమ హక్కులను కాపాడుకొంటారు. పౌరుల స్వాతంత్ర్య పరిరక్షణకు వివిధ సామాజిక స్వచ్ఛంద సంస్థలు కృషిచేస్తాయి. రాజ్యాధికారము మితిమీరి పౌరుల వ్యక్తిగత వ్యవహారాలలో జోక్యం చేసుకోకుండా రాజకీయపార్టీలు, కార్మిక సంఘాలు, రైతు కూలీ సంఘాలు, పత్రికారంగము, మత సంస్థలు తమ వంతు కృషిచేస్తాయి.

ఈ అంశాలను బట్టి వ్యక్తి స్వేచ్ఛను రక్షించుకోవటానికి సమాజమే కొన్ని రక్షణ మార్గాలను కల్పిస్తుందని చెప్పవచ్చు. వ్యక్తి స్వాతంత్ర్యం కోసం సమాజం కల్పించిన అవకాశాలే స్వేచ్ఛ కనుక సమాజము, శాసనాలు వ్యక్తి స్వేచ్ఛను రక్షించటానికి అవసరమైన పరిస్థితులను నెలకొల్పుతాయి.

## 10.6. స్వేచ్ఛ-చట్టముల మధ్య సంబంధము

ఆధునిక రాజ్యాలలో చట్టానికి స్వేచ్ఛకు సరిహద్దులను నిర్ణయించలేము. రాజ్యం సార్వభౌమాధికారాన్ని ఉపయోగించి శాసనాలను రూపొందించి, దండనాధికారంతో అమలు చేస్తుంది. వ్యక్తి స్వేచ్ఛ హక్కుల రూపంలో ఉంటుంది. స్వాతంత్ర్యం, హక్కులు వ్యక్తిత్వ వికాసానికి పరిపూర్ణ అభివృద్ధికి ఆవశ్యకాలు. రాజ్య చట్టాలు సామాజిక క్రమబద్ధమైన జీవనానికి, ఉమ్మడి సంక్షేమానికి శాంతి భద్రత పరిరక్షణకు తోడ్పడతాయి. అందువల్ల చట్టానికి స్వేచ్ఛకు మధ్య సంబంధాలు ఏ విధంగా ఉండాలనే సమస్య ఉదయిస్తుంది. దీనికి కారణం, చట్టం వ్యక్తి స్వేచ్ఛను అభివృద్ధి చేస్తుందా లేక పరిమితం చేస్తుందా అనే మీమాంస. రాజనీతి తత్వ విచారణలు చట్టము స్వేచ్ఛా పరస్పర పోషణ లేక పరస్పర విధ్వంసకాలనే విపరీతమైన భావనలకు దారితీసింది. రాజనీతి శాస్త్రవేత్తల్లో కొందరు చట్టం, స్వేచ్ఛ మనుగడకు అత్యంత ఆవశ్యకం అని భావిస్తే మరో వర్గం దీనిని వ్యతిరేకిస్తుంది. ఈ వాదనలు చివరకు వ్యక్తి స్వేచ్ఛకు, రాజ్య ధిక్కారానికి మధ్య ఉండే సంబంధాలను గురించి చర్చించేటంత దూరం వెళ్ళిపోయింది. ఈ వివాదాలను ఇరుపక్షాల వైపు నుంచి కూలంకషంగా పరిశీలించి సహేతుకమైన సమాధానాన్ని రూపొందించవలసి వుంటుంది.

అరాచకవాదులు, సిండికలిస్టులు బలమైన అధికార వాద వ్యతిరేకులు. ప్రౌధాన్, బకూనిన్, క్రాపోట్కిన్ వంటి అరాచకవాదులు, సొరెల్, పెలూటియర్ వంటి సిండికలిస్టులు రాజ్యాన్ని దోపిడికి, అణచివేతకు సాధనంగా భావించి వర్గరహిత, రాజ్యరహిత సమాజ నిర్మాణాన్ని కోరుకున్నారు. ఇట్టి సమాజంలో వ్యక్తి స్వేచ్ఛను పరిమితం చేసే లేదా నాశనం చేసే చట్టాలేమి ఉండవని వారి భావన.

సమాజంలో పెట్టుబడిదారి వర్గం రాజ్యాధికారాన్ని చేపట్టి చట్టాన్ని, స్వప్రయోజనాలను కాపాడుకోవడానికి, పెంపొందించుకొనడానికి సాధనంగా ఉపయోగించుకుంటుంది. పార్లమెంట్, న్యాయస్థానాలు ఈ వర్గానికి ఏజెంట్‌లుగా ఉపయోగపడతాయి. కనుక ప్రస్తుత రాజ్య వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలి. ఏ విధంగా చూసినా చట్టం వ్యక్తి స్వేచ్ఛను అణచివేసే సాధనమే. అందుచేత రాజ్యాన్ని, అధికారాన్ని, చట్టాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు.

అరాచకవాదులు సిండికలిస్ట్‌ల తీవ్ర ధోరణిని కొంత సరళం చేస్తూ జాన్ స్టువర్ట్‌మిల్, హెర్బర్ట్ స్పెన్సర్, ఆడమ్‌స్మిత్ మొదలగు వ్యక్తి వాదులు రాజ్యాన్ని "ఆవశ్యక్లేశము" గా భావించారు. వ్యక్తి స్వేచ్ఛ రంగములో రాజ్యం సాధ్యమైనంత తక్కువ జోక్యం కల్పించుకోవాలని వాదించారు. వ్యక్తి స్వేచ్ఛ మీద విపరీతమైన పరిమితులు విధించే శాసనం 'పాపము' అని, ఇట్లాంటి చట్టాలను రూపొందించె శాసన సభ్యులు 'పాపాత్ములు' అని స్పెన్సర్ అభిప్రాయం.

కాని సోషలిస్ట్‌లు చట్టాన్ని, స్వేచ్ఛను పరస్పర పోషకాలుగా భావించారు. వారి ఉద్దేశ్యంలో రాజ్యం సంక్షేమ వ్యవస్థ. శాసన వ్యవస్థ ద్వారా ఉత్తమమైన, న్యాయమైన సాంఘిక వ్యవస్థ నెలకొల్పవచ్చు. సామాజిక వికాసానికి శాసనం విధించే నిర్బంధాలు చాల అవసరమైనవి. పెట్టుబడిదారి వర్గం కార్మిక వర్గాన్ని పీడించే మాట నిజమైతే ఆ పీడనాన్ని నిర్మూలించేందుకు రాజ్యం అవసరమైన చట్టాలను రూపొందిస్తుంది. స్వేచ్ఛ నిరపేక్షం కాదు. కనుక రాజ్యం అపారమైన వ్యక్తి స్వాతంత్ర్యంపై అవసరమైన ఆంక్షలు విధిస్తుంది. సాంఘిక భద్రతకు, పని పరిస్థితుల నియంత్రణకు కావలసిన చట్టాలను తయారుచేస్తుంది. ప్రజోపయోగం కోసం ప్రైవేటు ఆస్థిని కూడా జాతీయం చేస్తుంది. లాస్కీ అభిప్రాయంలో సమిష్టి నాగరిక జీవనంలో వ్యక్తుల ప్రవర్తనపై కొన్ని సామాన్య నియమ నిబంధనలను విధించడం ద్వారా, శాసనం స్వేచ్ఛకు సన్నిహితమవుతుంది.

అయితే ఆదర్శవాదులు రాజ్యాన్ని నైతిక వ్యవస్థగా భావించి ఆరాధిస్తారు. వారి అభిప్రాయంలో ప్రతి చట్టమూ సమాజపు జనేచ్ఛను ప్రతిబింబిస్తుంది. కనుక రాజ్య చట్టాన్ని ప్రజలు తప్పక శిరసావహించాలి. శాసనానికి విధేయులైనప్పుడే స్వాతంత్ర్యం సాధ్యం. వ్యక్తి విధేయతను చూపకపోతే చట్టం దండించి విధేయతను పొందుతుంది. అందుచేత రూసో, గ్రీన్ స్వేచ్ఛను సృష్టించడానికి రాజ్యం దండనాధికారాన్ని ప్రయోగించవచ్చునన్నారు. హెగెల్ ఉద్దేశంలో రాజ్యం మానవుని వాస్తవ ప్రయోజనాలకు వ్యతిరేకం కాదు. ఈ ఆదర్శవాదానికి వాస్తవ రూపమే ఫాసిజం. ముస్సోలిని "రాజ్యానికి వ్యతిరేకంగా (వ్యక్తికి) ఏమీ లేదు" అన్నాడు. దీన్ని బట్టి వ్యక్తి ప్రయోజనాల కొరకు రాజ్యం చట్టాలు చేస్తుంది. దీనికి ప్రతిఫలంగా వ్యక్తి తన ప్రయోజనాల పెంపుదల కొరకే రాజ్యానికి సంపూర్ణ విధేయతను ప్రకటించాలి. రాజ్యానికి విధేయతలోనే తన ప్రయోజనం ఇమిడి ఉంది. ప్రజాహితానికి చట్టం విరుద్ధమనే భావన ఊహించలేనిది. ఎందుకంటే రాజ్యం తప్పు చేయదు. వ్యక్తి చట్టం ముందు సాష్టాంగపడి, విధేయుడై మెలగాలి. రాజ్యాన్ని ఆరాధించాలి.

పైన వివరించిన భావాలన్ని నిష్ప్రయోజనకరమైన విపరీత భావాలుగా కనపడుతాయి. అందుకే అటువంటి విపరీత భావాలకు సమకాలీన సమాజంలో స్థానం లేదు. ఎందుకంటే అట్టి భావాలు అరాచకత్వానికి లేదా అధికార వాదానికి దారితీస్తాయేతప్ప శాసనానికి, స్వేచ్ఛకు మధ్య సమన్వయాన్ని సాధించలేవు. అదుపులేని మితిమీరిన స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు అత్యధిక సంఖ్యాకుల బానిసత్వానికి కొద్దిమంది సమర్థుల స్వేచ్ఛకు మాత్రమే మార్గాన్ని చూపుతాయి. రాజ్యం శాసనం ద్వారా నిర్దేశించగలిగినప్పుడే స్వేచ్ఛ ఒక ముఖ్య లక్ష్యానికి సాధనంగా ఉపయోగపడుతుంది. దాని ముఖ్య లక్ష్యం ప్రతివ్యక్తికి సుఖసంతోషాలను ప్రసాదించి శాంతియుత జీవనాన్ని, వ్యక్తిత్వాన్ని పెంపొందించుకొనేటట్లు చేయడం. అటువంటి లక్ష్యసాధనకు దోహదం చేసే స్వేచ్ఛ అనేది నైతిక స్వాతంత్ర్యమే కాని, ఎటువంటి ఆంక్షలు లేని విశృంఖలమైన స్వేచ్ఛ మాత్రం కాదు. సమాజ జీవనం సుఖవంతం, ఫలవంతం కావాలంటే స్వచ్ఛమైన సహేతుకమైన ఆంక్షలు లేదా పరిమితులు అవసరం. ఎందుకంటే అపరిమితమైన స్వేచ్ఛ కళ్లెం లేని గుర్రంగా మారి అరాచకానికి, సంక్షోభానికి దారితీస్తుంది. సంఘంలో శాంతి భద్రతలు దృష్ట్యా ప్రతివ్యక్తి స్వేచ్ఛ ఇతరుల స్వేచ్ఛకు లోబడి వుంటుంది. సామరస్యపూర్వకమైన హక్కులే స్వేచ్ఛ.

ఒకరి హక్కులు మరొకరికి విధులైనప్పుడు విధులనేవి అపరిమితమైన స్వేచ్ఛ మీద ఆంక్షలవుతున్నాయి. అంటే శాసనం స్వేచ్ఛకు ఒక నిబంధన లేదా షరతు వంటిది. ఇతర సంస్థల వల్ల స్వేచ్ఛకు హాని జరగకుండా శాసనం దానికి రక్షణ కల్పిస్తుంది. ప్రతివ్యక్తి ఇతరుల హక్కులకు భంగం కాని రీతిలో వారితో సమానంగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అనుభవించే పరిస్థితులను కల్పిస్తుంది. కొన్ని శాసనాలు

వ్యక్తిలోని సృజనాత్మక శక్తులను పెంపొందించేంత ఉన్నతంగా ఉంటాయి. వ్యక్తికి నిజమైన స్వేచ్ఛను కల్పించి అతని పరిపూర్ణ పెంపుదలకు అనువైన అవకాశాలను, పరిస్థితులను శాసనం మాత్రమే సృష్టించగలదు. ఉదాహరణ: నిర్బంధ విద్య, టీకాలు వేయడం, భూసంస్కరణలు, భూపరిమితి చట్టాలు మొదలగునవి.

విద్య, ఆరోగ్యం మానవ ప్రగతికి ఎంత అవసరమో అనుభవ పూర్వకంగా తెలుసుకొన్న తరువాత వారు ప్రభుత్వ శాసనంతో సహకరిస్తున్నారు. అదే విధంగా సాంఘిక ఆర్థిక న్యాయాన్ని మానవాళికి ప్రసాదించే పవిత్రాశయంతో ప్రభుత్వం రూపొందించే భూపరిమితి చట్టాలను, అస్పృశ్యతా నివారణ చట్టం వంటి వాటిని ప్రజలు ఆదరిస్తున్నారు. అంటే స్వేచ్ఛ మీదున్న ఆంక్షలు, పరిమితులు తప్పనిసరిగా స్వేచ్ఛను హరించేవి కావు. అవి స్వేచ్ఛను పెంపొందించే సహేతుక పరిమితులు మాత్రమే. వివేకవంతమైన, విజ్ఞతాపూర్వకం అయిన శాసనాలు నిజానికి సాంఘిక, ఆర్థిక సుస్థిరతకు దోహదం చేస్తాయి. శాసనాలు స్వేచ్ఛకు మార్గాలే కాని ఆటంకాలు కావు.

అయితే అవసరానికి మించిన పరిమితులను, నిషేధాలను స్వేచ్ఛపై విధించే శాసనాల అమలుకు ప్రతికూల పరిస్థితులేర్పడే ప్రమాదం ఉంది. ఎందుకంటే అట్టి పరిమితులు, నిషేధాలు వ్యక్తి జీవనాన్ని కలవరపరచి అతని స్వేచ్ఛ పట్ల దురాక్రమణగా పరిణమిస్తాయి. అవి వ్యక్తి నైతిక స్థాయిని క్రుంగదీస్తాయి. అందుకే ప్రజాభిప్రాయానికనుగుణంగానే శాసనం రూపుదిద్దుకోవాలి. అప్పుడే అది రాణిస్తుంది. అట్టి పరిస్థితులు అంటే శాసనానికి స్వేచ్ఛకు మధ్య సమతౌల్యాన్ని సాధించే పరిస్థితులు ఒక ప్రజాస్వామ్య ప్రభుత్వంలోనే రూపొందుతాయి. ఎందుకంటే అంతిమ సార్వభౌమాధికారులు ప్రజలే. శాసనాన్ని రూపొందించి అమలు పరిచే సంస్థలు రెండూ ప్రజలకు బాధ్యత వహిస్తాయి. అప్పుడే నిజమైన స్వేచ్ఛ శాసనం ద్వారా ప్రజలందరికీ సమానత్వ ప్రాతిపదికపై లభిస్తుంది.

## 10.7. సమానత్వము-రకాలు

ఆధునిక సమాజాలలో స్వేచ్ఛతో పాటు ప్రాచుర్యము పొందిన మరొక రాజకీయ భావన సమానత్వము. ఈ సిద్ధాంతం యూరప్‌లో కరుడుగట్టిపోయిన భూస్వామ్య వ్యవస్థకు నిరశనగా ఆవిర్భవించింది. భూస్వామ్య విధానమునకు వ్యతిరేకముగా వచ్చిన అమెరికన్, ఫ్రెంచి విప్లవాలలో ఈ భావన ప్రాధాన్యత వహించింది. 1789లో ఫ్రాన్స్ దేశపు జాతీయ మహాసభ ఆమోదించిన మానవ హక్కుల ప్రకటనలో "మానవులందరు స్వేచ్ఛా సమానత్వాలతో జన్మించి వాటితోనే జీవితాంతం కొనసాగుతారు" అని పేర్కొన్నది. 1917లో రష్యాలో వచ్చిన సామ్యవాద విప్లవం ప్రధానంగా సమానత్వపు భావనపైనే ఆధారపడినది. సమానత్వం అంటే అన్నిటికంటే ముందుగా అన్నిరకాల ప్రత్యేక హక్కులు, వసతులు రద్దుకావటం, పుట్టుక, సంపద, జాతి, మతము, వర్గము, కులము వల్ల ఏర్పడిన విభేదాలన్ని తొలగి ఏ వ్యక్తి ఆర్థిక సాంఘిక, రాజకీయ విచక్షణకు గురికాని పరిస్థితి ఏర్పడాలి.

సమానత్వాన్ని లాస్కీ, బార్కర్, లార్డ్ బ్రైస్ వివిధ రకాలుగా వర్గీకరించారు. ఈ వర్గీకరణలన్నింటిలో మౌలికంగా 5 రకాల సమానత్వం కన్పిస్తున్నది.

**10.7. 1. రాజకీయ సమానత్వము :** పౌరులందరికి సమానమైన రాజకీయ హక్కులు ఉండాలనటమే రాజకీయ సమానత్వం. ప్రభుత్వ వ్యవహారాలలో పౌరులందరికి సమానమైన భాగస్వామ్యం ఉండాలి. వయోజన ఓటు హక్కు, ఎన్నికలలో పోటిచేసి ఏ పదవినైన చేపట్టే హక్కు, విమర్శించే హక్కు కలిగి వుండి ప్రభుత్వ నిర్మాణంలో నిర్వహణలో పౌరులందరు పాల్గొనే అవకాశం వుంటే దానిని రాజకీయ సమానత్వం అంటారు. ప్రజాస్వామ్యం విజయవంతం కావాలంటే రాజకీయ సమానత్వం అవసరం. కాని ఆర్థిక సమానత్వం లేనిదే రాజకీయ సమానత్వం ఎన్నటికి వాస్తవం కాలేదు. రాజకీయ సమానత్వం వలన ప్రజల అంగీకారంపై మాత్రమే ఆధారపడి ప్రభుత్వాన్ని నడపవలసి వుంటుంది. ప్రజలు అవసరమనుకుంటే ఏ సమయంలోనైనా ప్రభుత్వరూపాన్ని మార్చివేయగలరు.

**10.7. 2. పౌర సమానత్వము :** ఎటువంటి వివక్షతా లేకుండా చట్టము ముందు అందరు సమానమే అనే సూత్రాన్ని పాటించినపుడే పౌర సమానత్వం సాధించగలం. వర్గ, లింగ, కుల, రాజకీయ విశ్వాసాలు ప్రాతిపదికలుగా సమాజంలోని కొద్దిమందికి ప్రత్యేక సౌకర్యాలను కల్పించటం పౌర సమానత్వానికి విరుద్ధమైన విషయము. పౌరులందరు సమానహక్కులను రక్షణలను పొందటంలోనే పౌర సమానత్వం ఇమిడివుంది. అందుకే పౌర సమానత్వం రాచరికంలోను, భూస్వామ్య వ్యవస్థలోను కాక ప్రజాస్వామిక వ్యవస్థలోనే సాధ్యమవుతుంది. సమన్యాయ సూత్రము పౌర సమానత్వానికి ప్రతిరూపముగా ప్రజాస్వామిక దేశాలలో ఆచరించటం జరుగుతున్నది.

**10.7. 3. సాంఘిక సమానత్వము :** సాంఘిక విచక్షణలను రూపుమాపటం సమానత్వము యొక్క ముఖ్య లక్ష్యము. ఒక ఉన్నత కులములో జన్మించటం వలన కాని లేదా ఒక ప్రత్యేక వర్గానికి చెందివుండటం వలన కాని ఏ వ్యక్తికి ప్రత్యేక గుర్తింపు లేదా హోదా లభించరాదు. సాంఘిక సమానత్వం ఒక వ్యక్తి పట్ల మరో వ్యక్తి అమానుషంగా ప్రవర్తించడాన్ని నిరోధిస్తుంది. ఆధునిక ప్రజాస్వామ్య దేశాలలో సాంఘిక అసమానతలను రూపుమాపటానికి ఎన్నోరక్షణలు ప్రవేశపెట్టినప్పటికి సాంఘిక వివక్షత కొనసాగుతూనే వున్నది. పెద్ద ప్రజాస్వామ్య దేశంగా పేర్కొనే అమెరికాలో నీగ్రోల పట్ల ఈ నాటికి సాంఘిక వివక్షత కొనసాగుతుంది. భారత రాజ్యాంగంలోని 17వ నిబంధన ప్రకారం అంటరానితనము అన్ని రూపాలలో నిషేధించబడినప్పటికి, హరిజన, గిరిజనులపై ఈ నాటికి సామాజిక పీడన జరుగుతూనే ఉంది. శాసన సభలు చేసిన చట్టాలే సాంఘిక సమానత్వాన్ని తీసుకు వస్తాయని చెప్పలేము. సాంఘిక విచక్షణకు గురయ్యే ప్రజల ఆర్థిక, సాంఘిక స్థాయిని పెంచటం, వారిలో విద్యాస్థాయిని పెంపొందించటం, తద్వారా రూపొందే భావాలు సాంఘిక వ్యవస్థలోనికి చొచ్చుకు పోవటం మొదలైనవి జరిగినప్పుడే సాంఘిక సమానత్వానికి అవకాశం ఏర్పడుతుంది.

**10.7. 4. ఆర్థిక సమానత్వం :** భౌతిక వనరుల యాజమాన్య విషయంలో గల తీవ్ర అసమానతల నిర్మూలనమే ఆర్థిక సమానత్వపు ప్రధాన ధ్యేయం. సమాజంలో ఆర్థిక అసమానతలున్నప్పుడు పేదలకు రాజకీయ వ్యవస్థలో సరైన భాగస్వామ్యం లభించదు. అటువంటి సమయాల్లో రాజ్య యంత్రాంగమంతా ఆర్థికంగా బలవంతులైన ధనికుల చేతుల్లో కీలుబొమ్మ అయిపోతుంది. అంతేకాక, రాజ్యం ఒక వర్గ వ్యవస్థగా రూపొంది సమాజంలోని ధనవంతుల అభిరుచులకు, ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించే ప్రమాదం తలెత్తుతుంది. ఇది చివరకు హింసాయుతమైన విప్లవాలకు దారితీయవచ్చు. ఆర్థిక సమానత్వాన్ని కమ్యూనిష్టులు చాలా ముఖ్యమైనదిగా భావిస్తారు. నేటి ప్రపంచంలో అనేక ప్రజాస్వామ్య దేశాలు కూడా ఆర్థిక సమానత్వ ఆవశ్యకతను గుర్తించాయి. అయితే ఈ లక్ష్యాన్ని సాధించే పద్ధతుల్లో మాత్రం తీవ్రమైన భేదాలున్నాయి.

లార్డ్‌బ్రైస్ అభిప్రాయంలో ఆర్థిక సమానత్వం అనగా "సంపద విషయంలో తేడాలన్నింటినీ తొలగించి లభ్యమయ్యే వస్తువులలో ప్రతి పురుషునికి, స్త్రీకి సమాన భాగాన్ని ఇవ్వడానికి చేసే ప్రయత్నం". ప్రొ. అప్పాదొరై అభిప్రాయంలో ఆర్థిక సమానత్వమంటే " ప్రజల మధ్య ఏర్పడిన విపరీత ఆర్థిక వ్యత్యాసాలను సాధ్యమైనంత వరకు తగ్గించటం". అందువలన సమాజంలో ప్రతి ఒక్కరు జీవనం కొనసాగించడానికి అవసరమైన అవకాశాలు వ్యక్తి పరిపూర్ణతకు దోహదం కలిగించే విధంగా ఉండటం ఆర్థిక సమానత్వం. ఒకరిని మరొకరు, ఒక వర్గాన్ని మరొక వర్గం దోచుకొనడానికి వీలు లేని పరిస్థితినే ఆర్థిక సమానత్వంగా పరిగణించవచ్చు.

**10.7. 5. సహజ సమానత్వము :** నిజం చెప్పాలంటే సహజ సమానత్వమనేది లేనే లేదు. సమాజంలో ఎటుచూసినా అసమానతలు కన్పిస్తూనే వుంటాయి. మానవుల్లో కన్పించే ఈ అసమానతలను గురించి వ్యాఖ్యానిస్తూ జి.డి. హెచ్. కోల్ "మానవులంతా బలము, శారీరక శక్తి, మానసిక సామర్థ్యము, సృజనాత్మక లక్షణాలు మరియు తాత్విక దృక్పధాలలో పూర్తిగా తేడాలను కలిగి వుంటారు" అని భావించాడు. అయితే ప్రకృతి సిద్ధమయిన అసమానతలకన్నా ఈనాడు మానవుడు సృష్టించిన అసమానతలే ఇతర మానవుల దుర్భర స్థితికి కారణమవుతున్నాయి. ఈ కృత్రిమ అసమానతలనుండి సమాజాన్ని విముక్తి పరచడంలోనే సహజ సమానత్వం అర్థం యిమిడి వుంది. సాంఘిక, ఆర్థిక అవకాశాలను చట్టం ద్వారా ప్రజలందరికి ఎట్టి విచక్షణా లేకుండా సమకూర్చాలి. రాజ్య శాసనాలు, విధానాలు పౌరులందరికి సమాన అవకాశాలను కల్పించే విధముగా రూపొందాలి.

## 10.8. స్వేచ్ఛ సమానత్వాల మధ్య సంబంధము

ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకు స్వేచ్ఛ సమానత్వాలు మూల స్థంభాలవంటివి. ఈ రెండింటి మధ్య సామరస్యాన్ని కల్పించి సమతౌల్యాన్ని సాధించటం రాజ్యం ముఖ్య కర్తవ్యం. జాతీయ స్వేచ్ఛను ఆర్థిక రాజకీయ స్వాతంత్ర్యంగా భావించి సమానత్వ ప్రాతిపదిక మీద జాతి సంపదను సంఘశ్రేయస్సుకు వినియోగించడం రాజ్యం యొక్క విధి. స్వేచ్ఛ స్వాతంత్ర్యాల మధ్య ఎట్లాంటి సంబంధముండాలనే సమస్య రాజనీతి శాస్త్రవేత్తలలో చర్చనీయాంశంగా మారింది. చారిత్రాత్మకంగా మానవుడు స్వేచ్ఛకు యిచ్చినంత ప్రాముఖ్యత సమానత్వానికి యివ్వలేదు. కాని నేటి ప్రపంచములో తత్త్వవేత్తలు, రచయితలు, సమానత్వ భావనకు అధిక ప్రాముఖ్యత నిస్తున్నారు. ఉదాహరణకు బానిస సమాజాలలో మానవులందరు స్వేచ్ఛాజీవులు కాకపోవటంతో ప్రాచీన గ్రీకు, రోమన్ తత్త్వవేత్తలు స్వేచ్ఛా భావనను సమానత్వ ప్రాతిపదికతో

ముడి పెట్టలేకపోయారు. తరువాతి కాలంలో స్టాయిక్ తత్త్వవేత్తలు మానవులందరికి సహజ సమానత్వము వున్నదని ఒప్పుకొన్నా ఆ భావన అంతగా రాణించలేదు. పాలీబియస్, సిసిరో వంటి వారు స్టాయిక్ సిద్ధాంతాన్ని, రోమన్ సామ్రాజ్యంలో మారుతున్న పరిస్థితుల ఆధారంగా సమర్థించినప్పటికీ వారి భావములు సమకాలీన రాజనీతి తత్త్వవేత్తల ఆమోదాన్ని పొందలేకపోయాయి. క్రైస్తవ మతం అధికార మతంగా అమలులోనికి వచ్చేంతవరకు రోమన్ పౌరులకు, విదేశీయులకు, గ్రీకు పౌరునికి, 'అనాగరికుని'కి మధ్య ఉండే తేడా పెద్ద యెత్తున కొనసాగింది. క్రైస్తవం మాత్రమే మొదటిసారిగా "దైవ పితృత్వాన్ని మానవ సోదరత్వాన్ని"(Fatherhood of God and Brotherhood of Man) ఎలుగెత్తి చాటింది.

స్వాతంత్ర్యాలు సమాజములో ఉన్నత వర్గాలకు మాత్రమే బలమైన రక్షణలుగా మిగిలి పోయినాయి. జాన్ లాక్ వంటి గొప్ప సామాజిక ఒడంబడిక సిద్ధాంతవేత్త స్వేచ్ఛను సహజమైన హక్కుగా భావిస్తూనే, సమానత్వపు హక్కును గురించి పట్టించుకోలేదు. ప్రపంచంలో మొదటిసారిగా స్వేచ్ఛ భావనతో సమానత్వాన్ని సమైక్యపరచిన ఘనత 1776 నాటి అమెరికా స్వాతంత్ర్య ప్రకటనకు దక్కుతుంది. ఇదే భావనను 1789 లో ఫ్రెంచి విప్లవం "స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం" అనే నినాదరూపములో పునరుద్ఘాటించింది. అప్పటినుండి స్వేచ్ఛకు, సమానత్వానికి మధ్య వుండవలసిన సంబంధాన్ని గురించి శాస్త్రవేత్తలలో ఏకాభిప్రాయం లేదు. ఈ రెండింటి మధ్య సంబంధం గురించి చర్చించే సందర్భంలో వారు రెండు వర్గాలుగా విడిపోయారు. వారిలో కొందరు స్వేచ్ఛా సమానత్వాలు పరస్పర విరుద్ధాలు అని, మరికొందరు అవి పరస్పర పోషకాలు అని వాదించారు.

**10.8. 1. స్వేచ్ఛా సమానత్వాలు పరస్పర విరుద్ధాలు :** లార్డ్ ఆక్టన్, డి టాకియవెలిలు స్వేచ్ఛా సమానత్వాలు పరస్పర వ్యతిరేకాలని అభిప్రాయపడినారు. కొందరు శాస్త్రవేత్తలు, సమానత్వము వ్యక్తి స్వేచ్ఛను నాశనము చేస్తుందని తద్వారా సమాజ వ్యవస్థను తారుమారు చేస్తుందని వాదించారు. తమ వాదనను సమర్థించుకొవడానికి వారు రెండు కోణాల నుండి ఈ సమస్యను పరిశీలించారు. సహజంగానే మానవులు సమానులుకారు. కొందరు బలవంతులయితే కొందరు బలహీనులు. కొంతమంది మేధావులయితే మరికొందరు అజ్ఞానులు. సహజమైన ఈ అసమానతలను నిర్మూలించలేకపోగా, సాంఘిక, ఆర్థిక రాజకీయ రంగాలలో మానవుల మధ్య సమానత్వాన్ని నెలకొల్పుతామనడం 'ఇత్తడిని పుత్తడి' చేసినట్లే అవుతుంది. దక్షతతో, యోగ్యతతో, నిజాయితీగా పనిచేసే మేధావుల పట్ల సమానత్వ భావన అడ్డుగోడగా నిలుస్తుంది. ప్రతిభగలవారు, సమర్థులు సాంఘిక సంక్షేమ సాధనలో అమూల్యమైన సేవలనందిస్తారు. వీరితోపాటు అజ్ఞానులకు, అసమర్థులకు కూడా ఒకే ఆర్థిక, రాజకీయ స్థోమతను, హోదాను కల్పింపబూనుకోవటం ఏ విధంగా చూసినా ఆమోదయోగ్యం కాదు. ఎందుకంటే శక్తి సామర్థ్యాలు లేని వారు సమాజం మీద భారం కావడమే కాక, సాంఘిక ప్రయోజనాల కేవిధంగానూ తోడ్పడలేరు. అందుచేత ఒకఫ్యాక్టరీ కార్మికుడిని లేదా రైల్వేకూలీని, గొప్ప శాస్త్రవేత్తతో లేదా పండితుడితో సమానంగా భావించి, ఒకే ఆర్థిక రాజకీయ స్థాయిని కల్పించడం అన్యాయమే కాగలదని వాదించారు. డి టాకియ వెలి అభిప్రాయంలో "సమానత్వం పెరుగుదల స్వేచ్ఛను తగ్గిస్తుంది." లార్డ్ ఆక్టన్ మాటలలో "సమానత్వం పిపాస స్వేచ్ఛను వమ్ము చేస్తుంది."

అయితే ఆక్టన్ సమానత్వానికి, స్వేచ్ఛకు మధ్య సంబంధాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేదని చెప్పవచ్చు. 19వ శతాబ్దానికి చెందిన వ్యక్తి వాదులు అనుసరించిన "లెసఫేర్" భావననే తామూ అనుసరించారు. లెసఫేర్ అంటే యజమానులు, పనివారి మధ్య నిర్నిబంధమైన పోటి. అట్లే యజమానుల మధ్య స్వేచ్ఛాయుతమైన పోటి. కాని ఇది వాస్తవంలో స్వేచ్ఛాయుతమైన పోటీకి దారితీయలేదు. కొద్దిమంది పెట్టుబడిదారులు సంపదలో తేలియాడుతుంటే అధికసంఖ్యాకులైన సామాన్య ప్రజానీకం దరిద్రంలో పేదరికంలో కొట్టుమిట్టాడుతుండేవారు. ఈ పరిస్థితి ఆర్థిక రంగంలో అరాచకత్వానికి దారితీసింది. సంపన్నుల "స్వేచ్ఛ"ను పేదలను దోపిడి చేయడాన్ని అందరూ వ్యతిరేకించే పరిస్థితి ఏర్పడింది. పెట్టుబడిదారులు స్వైర విహారం చేసే ఆర్థిక వ్యవస్థను ఏ ప్రజలూ సహించలేరు. కనుక కార్మికుల పనిగంటలను, విశ్రాంతి సమయాన్ని, కనీస వేతనాలను నిర్ణయించే స్థాయికి రాజ్యం ఎదిగింది.

**10.8. 2. స్వేచ్ఛా సమానత్వాలు పరస్పర పోషకాలు :** ఇపుడు ప్రపంచమంతటా ఆర్థిక సమానత్వం స్వేచ్ఛ పరస్పర విరుద్ధాలు కావని గుర్తించారు. సమానత్వం లేని స్వేచ్ఛ నిష్ప్రయోజనమూ, స్వేచ్ఛ లేని సమానత్వం నిరర్థకమని చెప్పవచ్చు. ఆర్థిక సమానత్వం లేకపోయినా రాజకీయ స్వేచ్ఛ సాధ్యమని ఒకప్పుడు ప్రజాస్వామ్యవాదులు వాదించారు. సమాజంలో ప్రతి పౌరునికి ఓటుహక్కు, యింకా ఇతర రాజకీయ హక్కులు కల్పిస్తే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందని అభిప్రాయపడినారు. పరిశ్రమలు, వాణిజ్యాలు ప్రైవేటు వ్యక్తుల పరం

చేసినట్లైతే రాజ్యంలో తీవ్ర ఆర్థికాసమానతలు నెలకొని ఉన్నా, ప్రజాస్వామ్య విధానానికే మాత్రం ముప్పులేదని అనుకొన్నారు. కాని, ఈనాడు వాస్తవం చూడ నిరాకరించే సంకుచిత "కుహనా ప్రజాస్వామ్య వాదులు" మాత్రమే ఇట్లా వాదిస్తారు.

ఓటు ఎంత బలమైన ఆయుధమైనా విపరీతమైన ఆర్థికాసమానతలున్న సమాజంలో అది రాజకీయ స్వేచ్ఛకు గ్యారంటీ నివ్వలేదు. ఒక స్కూలు అటెండరు లేదా తోటమాలి, సంపన్నుడైన న్యాయవాదితో గాని, మిల్లు యజమానితో గాని రాజకీయంగా ఒక మెట్టుపై నిలబడగలడా? లాస్కి అభిప్రాయంలో "వాస్తవమైన, ఆర్థిక సమానత్వం ప్రాతిపదికపై తప్ప రాజకీయ సమానత్వం ఆచరణ సాధ్యంకాదు". ఎక్కడైతే దారుణమయిన ఆర్థిక అసమానతలుంటాయో అక్కడ వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన పరిస్థితులు నెలకొల్పడం వీలుకానిపని. మన దేశంలోనే పురుషులకంటే స్త్రీలు రాజకీయంగా వెనుకబడి ఉన్నారు. పేద కుటుంబాల్లో పుట్టిన అనేకమంది బాలబాలికల్లో సి.వి. రామన్ లేదా టాగూర్‌లకున్న సృజనాత్మకత, శక్తి సామర్థ్యాలుండవచ్చుగానీ, తన ప్రతిభను అభివృద్ధి పరచుకొనే అవకాశాలనందుకొనే లోపే మట్టిలో కలసిపోతున్నారు. సమాజంలోని భౌతిక వనరులను అందరికీ అందేట్లు పంపిణీ చేయనంతకాలం రాజకీయ సమానత్వం ఎండమావే. దారిద్ర్యం, సంపద రెండూ ప్రజాస్వామ్యం ఒరలో యిమడని కత్తులే. పేదలు తమ ఓట్లను అమ్ముకోడానికి వెనుదీయరు. వారి అమాయకత్వం కలవారి విషపూరిత ప్రభావానికి దాసోహమంటుంది. ప్రజాభిప్రాయ సాధనాలన్నీ సంపన్నుల చేతిలోనే ఉంటాయి. పెట్టుబడిదార్లు ఎన్నికల ప్రచారంలో భారీఎత్తున సొమ్ము వెదజల్లుతారు.

ఉత్పత్తి సాధనాలు ఎవరి ఆధీనంలో ఉంటాయో రాజకీయాధికారం వారి చేతుల్లోనే కేంద్రీకృత మవుతుందని చరిత్ర చెపుతుంది. సంపాదన, సంపదలో వ్యత్యాసాలున్నంత కాలం కలవారు లేనివారిని అణచివేస్తూనే ఉంటారు. అమెరికా వంటి పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద దేశాల్లోని శాసన సభలలో అత్యధిక సంఖ్యాకులైన శాసనసభ్యులు ఉన్నత మధ్య తరగతి లేదా మధ్య తరగతి వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నవారే. ఈ దేశాల్లో సమానత్వం కూడా సాధ్యం కాదు. ప్రజాస్వామ్య దేశమని కొనియాడబడుతున్న బ్రిటన్‌లో రెండురకాలు శాసనాలున్నాయి. ఒకటి సంపన్నులకు, మరొకటి పేదవారికి. క్లుప్తంగా చెప్పాలంటే ఆర్థిక సమానత్వం లేని రాజకీయ స్వేచ్ఛ మిధ్య.

ప్రజాస్వామ్య విధానానికి సమానత్వం ఎంత ఆవశ్యకమో భారత రాజ్యాంగ నిర్మాణకర్త డా. అంబేద్కర్ ఇచ్చిన ఈ సూచనలో గమనించవచ్చు. "భారత సమాజంలో ప్రధానంగా రెండు అంశాలు లోపించినాయి. ఈరెండింటిలో ఒకటి సమానత్వం. సాంఘిక రంగంలో ఒకవైపు కొంతమందికి ప్రత్యేక హోదాలు రెండోవైపు ఘోరమైన అసమానతలు. అంటే అధిక సంఖ్యాకులపై అణచివేత, కొద్దిమందికి అందలం. ఆర్థిక రంగంలో కొందరికి అంతులేని సంపద. మరెందరికో కటిక పేదరికం. 1950 జనవరి 26న మనం దానికి విరుద్ధమైన జీవనంలోనికి అడుగు పెట్టబోతున్నాం. రాజకీయ రంగంలో మనకు సమానత్వం లభిస్తుంది. అయితే సాంఘిక ఆర్థిక రంగాల్లో అసమానతలుంటాయి. సాధ్యమైనంత త్వరలో ఈ అసంగత జీవన విధానాన్ని తొలగించే ప్రయత్నం చేయాలి. లేకపోతే మనం ఎంతో కష్టపడి నిర్మించిన ఈ రాజకీయ ప్రజాస్వామిక కట్టడం, సమాజంలో తరతరాలుగా అణచివేతకు, దౌర్జన్యాలకు గురవుతున్న నిరుపేదల కోపాగ్నికి తట్టుకోలేక తునాతునకలవుతుంది".

20వ శతాబ్దంలో ముఖ్యంగా రెండో ప్రపంచ యుద్ధం తరువాత, స్వేచ్ఛా సమానత్వాలలో ఏది గొప్పదని, ఏది ముఖ్యమైనదనే చర్చకు రాజనీతి శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధి, సాంఘిక ఆర్థిక రంగాల్లో మార్పు, మానవుని ఆలోచనలో ప్రవర్తనలో సంభవించిన గణనీయమైన మెరుగుదల, జాతీయ అంతర్జాతీయ రంగాల్లో పురోగామి శక్తులపాత్ర ఈ చర్చను పూర్వపరం చేశాయి. ఈనాటి మానవునికి కావలసింది సమానత్వంపై ఆధారపడిన సాంఘికార్థిక రాజకీయ వ్యవస్థే కాని సమానత్వ పునాదిలేని స్వాతంత్ర్యం కాదు. సమానత్వంలోనే స్వేచ్ఛ కూడా ఇమిడియుంది. ఆర్థిక సమానత్వం కోసం పోరాడుతున్నామంటే ఆర్థిక స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నామనే అర్థం. రెండింటినీ వేరుచేసి చూడలేము. మావో మాటల్లో దేశాలు స్వాతంత్ర్యాన్ని, జాతులు విముక్తిని, ప్రజలు విప్లవాన్ని కోరుతున్నారంటే ఆర్థిక స్వేచ్ఛా సమానత్వాల కోసం పోరాడుతున్నారనే అర్థం. శతాబ్దాలుగా అన్ని రంగాలలో వెనకబాటుతనానికి, అత్యాచారాలకు, అన్యాయాలకు గురవుతున్న ప్రపంచ మానవాళి పెట్టుబడిదారీ, భూస్వామ్య, సామ్రాజ్యవాదుల పట్టునుంచి విముక్తికోసం నిరంతరం సంఘర్షణ జరుపుతూనే ఉంది. సాముదాయక స్వేచ్ఛ, సమానత్వాల కోసం పెనుగులాడుతున్న ప్రజలను స్వేచ్ఛ కావాలా, సమానత్వం కావాలా అని ప్రశ్నించడం అవివేకం అవుతుంది. ఈ రెండింటిలో ఏదో ఒకటే సాధ్యం కనుక ఏదో ఒక్కదాన్నే పొందమని చెప్పడం కూడా పోరాటాన్ని దారి మళ్లించడమే అవుతుంది.

పైగా ఆకలితో పస్తులుంటున్న పౌరునికి స్వేచ్ఛలోని మాధుర్యాన్ని, గొప్పదనాన్ని వివరించడం, స్వేచ్ఛకన్న ఉన్నతమైనది లేదని వాదించడం అర్థంలేని పని. నేటి జాతులన్నీ ఆర్థికావకాశాలు సమృద్ధిగా గల నూతన సమాజాన్ని అభిలషిస్తున్నాయి. మనిషిని మనిషి దోపిడీ చేసే ఈ అసమాన వ్యవస్థను కూలదోసే సమాజ ఆవిర్భావం కోసం కృషి చేస్తున్నాయి. ఇంతగా మారిన పరిస్థితుల్లో కూడా ఇంకా రెండువందల సంవత్సరాల నాటి ఈ సమస్యనే తిరగదోడడం, సాంప్రదాయకమేధో సంబంధమైన చర్చనే ప్రోత్సహించడం, స్వేచ్ఛా సమానత్వాల మధ్య (స్వాభావికంగానే) లేని వ్యతిరేక భావాన్ని ఎత్తి చూపడం సమంజసం కాదు. సమకాలీన రాజకీయ భావాలకు, పోరాటాలకు ఇది తీరని అపచారమే అవుతుంది.

## 10.9. సారాంశము

సమకాలీన చరిత్రకు స్వేచ్ఛ, సమానత్వాలు మూల స్థంభాలు. ప్రతి సమాజం యొక్క సామాజిక, రాజకీయ జీవనంలో ఇవి రెండూ ప్రధాన పాత్ర వహిస్తున్నాయి. ఈ రెండింటి మధ్య సామరస్యాన్ని, సమతౌల్యాన్ని సాధించడం ఆధునిక రాజ్యాలకు పెద్ద సమస్యగా తయారైంది. స్వేచ్ఛా సమాజాలుగా పేర్కొనబడుతున్న ప్రజాస్వామ్య దేశాలలో రాజకీయ స్వేచ్ఛను కల్పించినప్పటికి ఆర్థిక స్వేచ్ఛ, ఆర్థిక సమానత్వం కల్పించటంలో చాలా వరకు విఫలమైనాయి. సోషలిస్టు దేశాల వ్యవస్థలను పరిశీలిస్తే అవి ఆర్థిక స్వేచ్ఛను, సాంఘిక భద్రతను కల్పించటంలో సఫలమైనప్పటికి, రాజకీయ స్వేచ్ఛ, హక్కులు ప్రజలకు యివ్వటంలో విఫలమైనాయని ఇటీవల పరిణామాలు తెలుపుతున్నాయి. స్వేచ్ఛ, సమనత్వాలను సమన్వయపరచి, అభివృద్ధి ఫలితాలను ప్రజలందరికి అందేలా చేయటమే ప్రస్తుతం రాజనీతి శాస్త్రజ్ఞులు, రాజకీయ వ్యవస్థలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య.

### అభ్యాసాలు

**I. వ్యాస ప్రశ్నలు :**

1. స్వేచ్ఛను నిర్వచించి, స్వేచ్ఛలో రకాలను తెలుపుము.
2. స్వేచ్ఛను పరిరక్షించే మార్గాలను తెలుపుము.
3. ఆధునిక కాలమున సమానత్వ ప్రాధాన్యతను తెలిపి సమానత్వ రకాలను వివరింపుము.

**II. సంక్షిప్త వ్యాస ప్రశ్నలు :**

1. స్వేచ్ఛకు, చట్టానికి గల సంబంధము తెలుపుము.
2. స్వేచ్ఛా, సమానత్వాలు పరస్పర పోషకాలు - చర్చించుము.

**III. కుశాగ్రబుద్ధి ప్రశ్నలు**

1. లిబర్టి అనే పదము ................................................ అను లాటిన్ పదంనుండి ఆవిర్భవించింది.
2. ఫ్రెంచి విప్లవము ................................................ సంవత్సరంలో జరిగింది.
3. ................................................ ప్రజలు స్వేచ్ఛకు చెల్లించవలసిన మూల్యము.
4. " ఆర్థిక స్వేచ్ఛ లేని రాజకీయ స్వేచ్ఛ అర్థరహితము" అని ........................................ చెప్పెను.
5. "స్వేచ్ఛా, సమానత్వాలు పరస్పర విరుద్ధాలు" అని ........................................ చెప్పెను.

పాఠం - 11

# స్వేచ్ఛాభావన - వ్యక్తి స్వేచ్ఛావాద, అధికారవాద - సామ్యవాదుల అభిప్రాయాలు

## 11.0 లక్ష్యం

ఆధునిక ప్రభుత్వాలు ఏదోఒక సిద్ధాంత ప్రాతిపదికపైన పనిచేస్తున్నాయి. ప్రజాస్వామ్యప్రభుత్వాలు పెట్టుబడిదారీ లక్షణాలకుఅనుగుణంగాను,నియంతృత్వ ప్రభుత్వాలు "అధికారవాద" లక్షణాలకు అనుగుణంగాను, సామ్యవాద ప్రభుత్వాలు మార్క్సిస్టు సిద్ధాంతాలకు అనుగుణంగాను ఏర్పడి పనిచేస్తున్నాయి. "స్వేచ్ఛ" గురించి ఈ ప్రభుత్వాల దృక్పధాలు తెలుసుకోవాలంటే, వ్యక్తి స్వేచ్ఛావాద, అధికారవాద, సామ్యవాదుల అభిప్రాయాలు తెలుసుకోవాలి.

## 11.1. విషయ క్రమం

11. 2. స్వేచ్ఛ పై వ్యక్తి స్వేచ్ఛావాదుల అభిప్రాయాలు

11. 3. స్వేచ్ఛ పై అధికారవాదుల అభిప్రాయాలు

11. 4. స్వేచ్ఛ గురించి సామ్యవాదుల అభిప్రాయాలు

11. 5. సారాంశం

## 11. 2. స్వేచ్ఛపై వ్యక్తి స్వేచ్ఛావాదుల అభిప్రాయాలు

18, 19 శతాబ్దాలలో బ్రిటన్ తదితర ఐరోపా దేశాలలో వ్యక్తి స్వేచ్ఛావాదం ప్రముఖ పాత్ర వహించింది. దీనిని జె.యస్. మిల్, హెర్బర్ట్ స్పెన్సర్ మొదలైన వారు ప్రతిపాదించారు. రాజ్యము వ్యక్తి విషయాలలో అతి తక్కువ జోక్యము చేసుకోవాలని భావించారు. వారి ఉద్దేశ్యములో రాజ్యము ఒక "అవసరమైన చెడు", వీరి వాదన ప్రకారము ప్రతి వ్యక్తికి తన బాగు గురించి తనకే బాగా తెలుస్తుంది. కాబట్టి వ్యక్తి మంచి చెడ్డలు రాజ్యం నిర్ణయించకూడదు. వ్యక్తి అభివృద్ధిని పెంపొందించే మిషతో రాజ్యము వ్యక్తి కార్యకలాపాలలో జోక్యము చేసుకొనరాదు. అభివృద్ధి సాధించటానికి పూర్తి స్వేచ్ఛ అవసరమని వ్యక్తి స్వేచ్ఛావాదులు నమ్మారు. వ్యక్తి స్వేచ్ఛావాదులు చేసిన ప్రచారం ఫలితంగా ఐరోపాలో పెట్టుబడిదారి విధానము అభివృద్ధి చెందింది.

వారి అభిప్రాయములో రాజ్యము కేవలము "పోలీసు విధులు" మాత్రమే నిర్వహించాలి. ప్రజల వ్యవహారాలలో ఏ విధముగాను జోక్యము చేసుకోరాదు. వ్యక్తుల ప్రాణరక్షణ, ఆస్థిరక్షణ, దేశ రక్షణ కల్పించటమే రాజ్య కర్తవ్యం అని వీరు భావిస్తారు. ప్రభుత్వము లేకుంటే ప్రజలకు రక్షణ వుండదు. ప్రభుత్వము వుంటే వ్యక్తి స్వేచ్ఛ పరిమితం అవుతుంది. అందు వలన వీరు రాజ్యమును ఆవశ్యకక్లేశంగా భావించారు. ఏ ప్రభుత్వం తక్కువగా పరిపాలిస్తుందో ఆ ప్రభుత్వమే వారి దృష్టిలో ఉత్తమమైంది.

వ్యక్తి స్వేచ్ఛను ప్రగాఢముగా సమర్థించిన ఆధునిక రాజనీతి తత్వవేత్తలలో జె.యస్.మిల్ ను అగ్రగణ్యుడుగా భావించవచ్చు. "ఆన్ లిబర్టి" అనే గ్రంధములో మిల్ వ్యక్తి కార్యకలాపాలను రెండు రకాలుగా విభజించాడు. ఒకటి, వ్యక్తిగత కార్యకలాపాలు. రెండు, సమాజానికి సంబంధించిన కార్య కలాపాలు. మొదటి వాటిలో వ్యక్తికి సంపూర్ణ స్వేచ్ఛ వుండాలని, రెండవ వాటిలో సమాజం లేదా ప్రభుత్వం జోక్యం చేసుకోవచ్చని మిల్ వాదించాడు. వ్యక్తి కార్యకలాపాలవల్ల ఇతరులకు హాని కలగనంతకాలం వీటిలో ప్రభుత్వ జోక్యం వుండరాదంటాడు. వ్యక్తికి సంబంధించినంతవరకు "తన శరీరముపై, మనస్సుపై వ్యక్తి సార్వభౌముడు" అని మిల్ పేర్కొన్నాడు.

అయితే వ్యక్తి స్వేచ్ఛావాద సిద్ధాంతము యొక్క దుష్ఫలితాలు ఆకాలములోనే ప్రజలు అనుభవించారు. పారిశ్రామిక విప్లవము ఏర్పడిన ఆ రోజులలో ఈ సిద్ధాంతము పేరుతో పారిశ్రామిక వేత్తలు కార్మికులను దుర్భర పరిస్థితులకు గురిచేశారు. ధనిక వర్గము మాత్రమే స్వేచ్ఛను అనుభవించగలిగి కార్మికులు, ప్రజలు అనేక కష్టాలకు గుర్తైనారు. సమాజములో ఆర్థిక అసమానతలు ఎక్కువైనాయి. దీనిఫలితముగానే సామ్యవాద సిద్ధాంతాలు ఆవిర్భవించటం ప్రారంభమైంది.

వ్యక్తి ఇష్టానుసారం ఎట్టి ఆటంకము లేకుండా ప్రవర్తించే అవకాశాన్ని స్వేచ్ఛ అని వ్యక్తి స్వేచ్ఛావాదులు భావించారు. అయితే వారు ఆశించిన స్వేచ్ఛ వాస్తవంలో జనసామాన్యానికి ఉపయోగపడలేదు. ఎందుకంటే అది వ్యతిరేకమైనదేకాని సంవర్ధకమైన స్వేచ్ఛకాదు. సహేతుకమైన పరిమితులకు లోబడని స్వేచ్ఛ విశృంఖలత్వానికి దారితీస్తుంది. తద్వారా బలవంతులు, వనరులు వున్నవారు బాగుపడతారేకాని బలహీనులకు అటువంటి స్వేచ్ఛ ఉపయోగపడదు. అందువలనే 20వ శతాబ్దం మొదటి భాగము నాటికి వ్యక్తి స్వేచ్ఛావాదం తన రూపును మార్చుకోవలసి వచ్చినది.

## 11. 3. స్వేచ్ఛపై అధికార వాదుల (Authoritarian) అభిప్రాయాలు

అధికారమంతా ఒక వ్యక్తి చేతుల్లో కాని లేదా కొద్దిమంది వ్యక్తుల చేతులలోకాని కేంద్రీకృతమైన దానిని అధికార వాదం అంటారు. అధికారయుత రాజ్యంలో పాలకులు ప్రజలకు బాధ్యత వహించరు. ప్రభుత్వ వ్యవహారాలలో పాల్గొనే అవకాశం ప్రజలకు వుండదు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ప్రజలకు సంబంధముండదు, కాని అటువంటి నిర్ణయాలకు ప్రజలందరు కట్టుబడి వుండాలి. ఇటువంటి రాజ్యములో ప్రతిపక్షాలకు స్థానముండదు. 17వ శతాబ్దములో ఫ్రాన్సును పాలించిన 14వ లూయి, ఇటలీలో ఫాసిజం, జర్మనీలో నాజీయిజం అధికారవాద రాజ్యాలకు ఉదాహరణలుగా పేర్కొనవచ్చు. ఆధునిక కాలములో వివిధ దేశాలలో వున్న సైనిక నియంతల పాలనలు కూడా అధికారవాద వ్యవస్థనే కలిగి వుంటాయి. ప్రజాస్వామ్య దేశాలలోకూడా అత్యవసర పరిస్థితి ప్రకటించినప్పుడు అధికారవాదం తలెత్తుతుంది. స్వభావ సిద్ధంగా అధికార వాదం స్వేచ్ఛకు పూర్తిగా విరుద్ధమైనది.

ఆదర్శవాదుల సిద్ధాంతాలు కూడా అధికార వాదం పెరగటానికి దోహదపడ్డాయి. ఉదాహరణకు ఆదర్శవాదుల భావాలు నియంతలైన ముస్సోలిని, హిట్లర్లను ఎంతగానో ప్రభావితం చేసాయి. ఫాసిస్టుల సిద్ధాంతాలలో వ్యక్తి స్వేచ్ఛకు ప్రాముఖ్యత లేదు. కాంట్, హెగెల్, గ్రీన్ మొదలైన ఆదర్శవాదుల భావాలు స్వేచ్ఛను పరిమితం చేయటానికి దోహదపడ్డాయి. రాజ్యానికి పూర్తిగా విధేయుడైనప్పుడే వ్యక్తికి స్వేచ్ఛ లభిస్తుంది అని హెగెల్ చెప్పాడు. నైతిక శాసనసూత్రాలను పాటించినప్పుడే వ్యక్తి స్వేచ్ఛను పొందగలడని కాంట్ చెప్పాడు.

అధికార వాదానికి వ్యక్తి స్వేచ్ఛలో నమ్మకములేదు. ఇటువంటి రాజ్యములో ఒకే పార్టీ ప్రభుత్వం వుంటుంది. ప్రతిపక్షాలు వుండటానికి వీలులేదు. భావప్రకటన స్వాతంత్ర్యము, పత్రికా స్వాతంత్ర్యము, సంఘాలు ఏర్పరచుకొనే స్వాతంత్ర్యం మొదలైనవి అధికార వాద రాజ్యంలో వుండవు. పత్రికలు, రేడియో, సినిమా, కళలు, టెలివిజన్ మొదలైన వాటిని ప్రభుత్వం నియంత్రణ చేస్తుంది. అన్ని రంగాలలో సమ్మెలు నిషేధిస్తారు. విద్యాసంస్థలను రాజకీయప్రచార సాధనాలుగా ప్రభుత్వం వినియోగించుకుంటుంది. దేశప్రజలంతా ఒకేరీతిలో ఆలోచించేటట్లు ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రచారం జరుగుతూవుంటుంది. ప్రజల మనోభావాలను రెచ్చగొట్టి వారి మద్దతును పొందటానికి నియంతలు ప్రయత్నిస్తూ వుంటారు. వ్యక్తికి ఎటువంటి స్వేచ్ఛ యివ్వని అధికారవాదానికి ఫాసిజం, నాజీయిజం మంచి ఉదాహరణలు. స్వేచ్ఛ, సమానత్వం, ఇతర హక్కులను వ్యక్తికి యివ్వటానికి ఫాసిజం నిరాకరించింది. "అంతా రాజ్యం లోపలే, రాజ్యం వెలుపల, రాజ్యానికి వ్యతిరేకంగా ఏదీలేదు" అని ఫాసిజం చెప్పింది. అధికారవాదుల ఉద్దేశ్యములో స్వేచ్ఛ హక్కు కాదు. బాధ్యతలను నిర్వహించటంలోనే వ్యక్తికి స్వేచ్ఛ లభిస్తుందని వారు వాదిస్తారు. ఈ రకమైన సిద్ధాంతాలను అధికార వాదం కలిగి యుండటం వలన ప్రపంచంలో నేటికి అత్యధిక దేశాలలో వున్న ప్రభుత్వ రూపమైన నియంతృత్వంలో ప్రజలు ఎటువంటి హక్కులను, స్వేచ్ఛను అనుభవించలేక పోతున్నారు.

## 11. 4. స్వేచ్ఛపై సామ్యవాదుల అభిప్రాయాలు

సామ్యవాదం పెట్టుబడిదారి విధానానికి వ్యతిరేకముగా అభివృద్ధి చెందింది. కారల్ మార్క్స్ సామ్యవాదాన్ని శాస్త్రీయ పద్ధతులలో వివరించినందువలన అతనిని శాస్త్రీయ సామ్యవాద పితామహుడు అంటారు. వ్యక్తి స్వేచ్ఛావాదులు, అధికార వాద సిద్ధాంతకర్తల

అభిప్రాయాలకు భిన్నముగా మార్క్సు స్వేచ్ఛగురించి వివరించాడు. మార్క్సు అభిప్రాయంలో బూర్జువా సమాజంలో వ్యక్తికి నిజమైన స్వేచ్ఛలేదు. అటువంటి సమాజములో వ్యక్తికి వ్యక్తికి మధ్య సంబంధం వుండదు. కొద్ది మంది ధనవంతులు, ప్రాబల్యము కలవారు, ఉత్పత్తి సాధనాలను సొంతం చేసుకున్నవారు మాత్రమే స్వేచ్ఛను అనుభవిస్తారు. అధిక సంఖ్యలో వున్న పేదవారికి స్వేచ్ఛ వుండదు. అందువల్ల వ్యక్తి సమాజానికి దూరమై అతనిలో "వై మనస్యాన్ని" (Alienation) కలిగించటం వలన ఎటువంటి స్వేచ్ఛను అనుభవించలేడు. మార్క్సు అభిప్రాయములో నిరంతరం జీవనోపాధి సంఘర్షణలో మునిగితేలే అసంఖ్యాక శ్రామిక వర్గం బూర్జువా సమాజంలో నిజమైన స్వేచ్ఛను అనుభవించలేదు. అలాంటి సమాజంలో వ్యక్తి పరిపూర్ణ వికాసాన్ని పొందలేడు.

సమాజంలో ధనికులు పేదవారిని దోపిడి చేసినంతకాలం అసమానతలు వుంటాయి. కాబట్టి, నిజమైన స్వేచ్ఛను అందరు అనుభవించాలి మనిషి మనిషిని దోపిడి చేసే విధానం అంతరించాలి అంటే ఆర్థిక సమానత్వం కల సమాజంలో మాత్రమే వ్యక్తికి నిజమైన స్వేచ్ఛ లభిస్తుంది. నిజమైన స్వేచ్ఛకు ఆర్థిక సమానత్వం ప్రాతిపదికగా వుండాలి. సామ్యవాద సమాజ స్థాపన విప్లవం ద్వారా మాత్రమే సాధ్యపడుతుంది. సామ్యవాదంలో ప్రతి వ్యక్తి ప్రాథమిక అవసరాలైన తిండి, బట్ట, గృహవసతిని తీర్చుకోగలడు. వ్యక్తి సంపూర్ణ అభివృద్ధికి కావలసిన పరిస్థితులను సామ్యవాద సమాజం మాత్రమే కల్పించగలదు. ఈ విధముగా మానవ విలువలను సామ్యవాద సమాజం పునరుద్ధరించి ఒక కొత్త స్వేచ్ఛా శకాన్ని ప్రారంభిస్తుంది.

క్లుప్తంగా చెప్పాలంటే స్వేచ్ఛపై సామ్యవాదుల అభిప్రాయాలు వ్యక్తి స్వేచ్ఛావాదులు, అధికార వాదులు చెప్పిన అభిప్రాయాలకంటే భిన్నమైనవి. విప్లవం ద్వారా ఏర్పడే సామ్యవాద సమాజం స్వేచ్ఛా సమాజంగా వుండటమే కాక, వ్యక్తి తన భౌతిక అవసరాలతో పాటు జీవిత ఉన్నత ఆశయాలనుకూడా తీర్చుకోగలడు. అయితే సామ్యవాదులు ఆర్థిక స్వేచ్ఛకు ఇచ్చిన ప్రాధాన్యత రాజకీయ స్వేచ్ఛ, ఇతర స్వేచ్ఛలకు ఇవ్వలేదని విమర్శ వున్నది. ఈ విమర్శ నిజం చేసే పరిణామాలు ఇటీవల సంభవించాయి.

సోవియట్ యూనియన్ మరియు ఇతర తూర్పు ఐరోపా సోషలిస్టు దేశాలలో ఇటీవల సంభవించిన పరిణామాలు స్వేచ్ఛపై సామ్యవాదుల అభిప్రాయాలను త్రోసిపుచ్చేవిగా వున్నాయి. ఆ దేశాల సామ్యవాద వ్యవస్థలు ప్రజలకు నిజమైన స్వేచ్ఛ కల్పించక పోగా నియంతృత్వ విధానాలతో ప్రజలను అణచివేయటం వలనే ఆ వ్యవస్థలు కూలిపోయాయని అనేకమంది అభిప్రాయ పడుతున్నారు. శ్రామిక వర్గ నియంతృత్వం పేరుతో నాయకులే అధికారవాద రాజ్యాల వలే నియంతృత్వ విధానాలు అవలంబించారని అనేక వ్యాసాలు తెలియచేస్తున్నాయి. ఈ కారణం వలనే సామ్యవాద వ్యవస్థలో నిజమైన స్వేచ్ఛ సాధ్యమేనా ? అని ప్రపంచ వ్యాప్తముగా చర్చ జరుగుతున్నది.

## 11. 5. సారాంశము

పెట్టుబడిదారీ విధానములో ప్రజలు "నిజమైన" స్వేచ్ఛను అనుభవించలేరని నాటి వ్యక్తి స్వేచ్ఛా విధాన కాలంనుండి నేటి ఆధునిక పెట్టుబడిదారీ విధానం వరకు అనేకమంది రాజనీతి శాస్త్రజ్ఞులు వాదిస్తున్నారు. ఈ విధానములో 'రాజకీయ స్వేచ్ఛ' కు యిచ్చిన ప్రాధాన్యత 'ఆర్థిక స్వేచ్ఛ' కు యివ్వరని వారి అభిప్రాయము. 'మార్క్సిజం' ఒక సిద్ధాంతముగా రూపొందిన తరువాత పెట్టుబడిదారీ దేశాలు కూడ 'సంక్షేమ రాజ్యాలుగా '' రూపొందక తప్పలేదు. అయినప్పటికి ఆర్థిక అసమానతలు కొనసాగుతూనే వస్తున్నాయి.

మార్క్సిస్టు సిద్ధాంతాల ఆధారంగా ఏర్పడిన సామ్యవాద రాజ్యాలలో ప్రజలు "నిజమైన" స్వేచ్ఛను అనుభవించగలరనే అభిప్రాయమున్నది. కాని కొద్ది సంవత్సరాలుగా ఆ దేశాలలో జరిగిన పరిణామాలు పరిశీలిస్తే పార్టీ నియంతృత్వం, నాయకుల నియంతృత్వం ప్రజలకు రాజకీయ స్వేచ్ఛ లేకుండా చేశాయని అర్థం అవుతున్నది. సామ్యవాద సిద్ధాంత ఆచరణలో లోపాలపై చర్చ జరగవలసివున్నది. 'స్వేచ్ఛ' గురించి రోజాలగ్జెంబర్గ్ వంటివారి అభిప్రాయాలు మరోసారి చర్చించబడుతున్నాయి.

పైన వివరించిన నేపథ్యంలో స్వేచ్ఛపై వ్యక్తి స్వేచ్ఛావాదుల, అధికారవాదుల, సామ్యవాదుల అభిప్రాయాలకు మరోసారి ప్రాధాన్యత ఏర్పడినది.

## అభ్యాసాలు

**I వ్యాస ప్రశ్నలు:**

1. స్వేచ్ఛ గురించి వ్యాసము వ్రాయుము.

**II. సంక్షిప్త వ్యాస ప్రశ్నలు : క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానము వ్రాయుము.**

1. స్వేచ్ఛపై వ్యక్తి స్వేచ్ఛావాదుల అభిప్రాయము తెలుపుము.
2. స్వేచ్ఛపై అధికారవాదుల అభిప్రాయములు వివరించుము.
3. స్వేచ్ఛపై సామ్యవాదుల అభిప్రాయాలను చర్చించుము.

**III. కుశాగ్రబుద్ధి ప్రశ్నలు**

1. వ్యక్తి స్వేచ్ఛావాదమును.................................................. ప్రతిపాదించెను.
2. వ్యక్తి స్వేచ్ఛావాదమును .............................................. అని కూడ పిలుస్తారు.
3. ..................................................... అధికార వాదమునకు ఉదాహరణ.
4. ........................................................... శాస్త్రీయ సామ్యవాద పితామహుడు.

## ఉపయుక్త గ్రంధాలు


1. J.C. Johari — Principles of Modern Political Science
2. H.J. Laski — Grammar of Politics



రచయిత

కె.యస్. లక్ష్మణరావు

పాఠం - 12

# వ్యక్తి హక్కుల సిద్ధాంతాలు - హక్కుల రకములు లక్ష్యం

## 12. 0. లక్ష్యం

ఆధునిక రాజ్యాంగాల ద్వారా పౌరులకు వివిధరకాల హక్కులు కల్పించవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. 1688 'రక్తరహిత విప్లవం', 1776 అమెరికా విప్లవం, 1789 ఫ్రెంచ్ విప్లవాలు ఆధునిక మానవుడు కొన్ని పౌర, రాజకీయ హక్కులు పొందటానికి దోహదపడ్డాయి. 1917 సోవియట్ విప్లవం 'ఆర్థిక హక్కుల' కు కూడా (ఉదా : పనిహక్కు) ప్రాధాన్యత కల్పించేటట్లు చేసింది. అయితే ఇప్పటికీ అనేక దేశాలలో పౌరులు కనీస హక్కులు కూడా పొందలేని సందర్భాలున్నాయి. హక్కుల ప్రాముఖ్యతను, ప్రాధాన్యతను వివరించడం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## 12.1 విషయక్రమం :


12.2. హక్కుల సిద్ధాంతము

12.3. హక్కులు - నిర్వచనాలు

12.4. హక్కుల వర్గీకరణ

12.5. పౌరహక్కులు

12.6. పౌరహక్కులు

12.7. విధులు లేదా బాధ్యతలు

12.8. విధుల వర్గీకరణ

12.9. పౌరుని ముఖ్యవిధులు

12.10. హక్కుల విధుల మధ్య సంబంధం

12.11. సారాంశము.


## 12.2. హక్కుల సిద్ధాంతాలు

వ్యక్తి అభివృద్ధికి హక్కులు చాలా అవసరము. ప్రతి రాజ్యం పౌరులకు కొన్ని హక్కులు ప్రసాదిస్తుంది. హక్కులు లేకుండా వ్యక్తి పరిపూర్ణమైన జీవనాన్ని గడపలేడు. గుర్తించబడిన హక్కులను బట్టి రాజ్యస్వభావాన్ని తెలుసుకోవచ్చని లాస్కి చెప్పాడు. రాజ్యంనందుగల స్వేచ్ఛ స్థాయిని పరిశీలించటానికి కూడా హక్కులు సహాయ పడతాయి. పౌరుల అభివృద్ధికి, వారి వ్యక్తిత్వాన్ని కాపాడటానికి కొన్ని సాధారణ పరిస్థితులను కల్పించవలసిన బాధ్యత రాజ్యానికి వున్నది. స్వేచ్ఛ గురించి వెలువడిన సిద్ధాంతాలన్ని హక్కుల ఉనికిని గుర్తిస్తూనే వున్నాయి. హక్కుల మీద ప్రజల రాజకీయ జీవనం ఆధారపడి వుంటుంది. ఈ హక్కుల గురించి వివరించే అనేక సిద్ధాంతాలు వెలువడినాయి.

**12.2. 1. సహజ హక్కుల సిద్ధాంతము :** హక్కులు రాజకీయ సమాజం ఏర్పడక ముందే వ్యక్తికి వున్నాయని, వాటిని కాపాడుకోవడానికి, మరింత మెరుగైన వాతావరణంలో వాటిని అనుభవించడానికి రాజకీయ సంస్థలను మానవుడు ఏర్పాటు చేసుకున్నాడని సహజ హక్కుల సిద్ధాంతం చెపుతుంది. ప్రాణ రక్షణ హక్కు, ఆస్థి హక్కు, స్వేచ్ఛ, సహజ హక్కులని అవి రాజకీయ సమాజం ఏర్పడటానికి ముందే వున్నాయని, మానవుడు నుండి అవి విడదీయరానివని ఈ సిద్ధాంతం చెపుతుంది. సహజ హక్కుల సిద్ధాంతాన్ని మొదట ప్రాచీన రోమన్ సామ్రాజ్య కాలంనాటి సిసిరో ప్రస్తావించాడు. ఆధునిక కాలంలో 17వ శతాబ్దానికి చెందిన జాన్ లాక్ ఈ సిద్ధాంతానికి

ప్రాధాన్యత కల్పించాడు. జాన్ లాక్ బోధనలు అమెరికా, ఫ్రెంచ్ ప్రజలపై అపార ప్రభావం కల్గించాయి. జాన్ లాక్ ప్రాణరక్షణ, స్వేచ్ఛ, ఆస్థి హక్కులను సహజహక్కులుగా గుర్తించి రాజ్యం ఈ హక్కులను రక్షించాల్సి ఉంటుందని చెప్పాడు. పౌర సమాజం సహజ హక్కుల పరిరక్షణకు ఏర్పడింది. సహజ హక్కులకు భంగం వాటిల్లినప్పుడు ప్రజలు తిరుగుబాటు చేయటం తప్పదన్ని, ఈ హక్కులు మానవ వికాసానికి గట్టి పునాదులు వేస్తాయని పేర్కొన్నాడు. అమెరికా, ఫ్రెంచి విప్లవాల అనంతరం ఆ దేశాల రాజ్యాంగాలలో ప్రకటించిన మానవ హక్కుల ప్రకటనలవలన సహజ హక్కుల సిద్ధాంతం బాగా ప్రాచుర్యంలోనికి వచ్చింది.

**12.2. 2. చట్టబద్ధ హక్కుల సిద్ధాంతము :** రాజ్యాంగం ద్వారా చట్టాల ద్వారా, ప్రజలకు లభించేవే హక్కులు అని స్పష్టం కావటంతో చట్టబద్ధ హక్కుల సిద్ధాంతం ఏర్పడింది. ఆధునిక కాలంలో సహజ హక్కుల సిద్ధాంతం కూడా చట్ట బద్ధ హక్కుల సిద్ధాంతానికి లోబడవలసి వచ్చింది. దీని ప్రకారం రాజ్యమే హక్కులను రూపొందించి పౌరులకు చట్టాల ద్వారా హక్కులను కల్పిస్తుంది. వాటి లభ్యతకు హామీనిస్తుంది. హక్కులకు రాజ్యమే మూలము. మానవులకు స్వభావతః సంక్రమించే హక్కులు ఏమి వుండవు. అయితే బహుతావాదులు ఈ సిద్ధాంతాన్ని అంగీకరించరు. లాస్కీ అభిప్రాయంలో "రాజ్యం హక్కులను సృష్టించదు, వాటిని అది గుర్తిస్తుంది". అయితే రాజ్య చట్టాల ద్వారా అమలుకాని హక్కులు ప్రతిపాదనలుగా మిగిలిపోతాయి. కాబట్టి బార్కర్ అన్నట్లు హక్కుల పరిపోషణ రాజ్యం ద్వారానే సాధ్యమౌతుంది.

**12.2. 3. సాంఘిక సంక్షేమ హక్కుల సిద్ధాంతము :** ఈ సిద్ధాంతం ప్రకారం సాంఘిక సంక్షేమానికై నిర్ణయించిన నిబంధనలే హక్కులు. సమాజం వాటిని సృష్టించింది. చట్టాలు, ఆచారాలు, సాంప్రదాయాలు, హక్కులు - ఇవన్నీ సామాజిక ప్రయోజనానికి ఉపయోగపడాలి. సమాజంలో అధిక సంఖ్యాకులకు సంతోషాన్ని కలిగించేది ఏదో అదే సమాజానికి లాభదాయకం అవుతుంది. ఉపయోగితా వాదులైన బెంథామ్, మిల్ ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. హక్కులకు ఆధారం వాటి ఉపయోగము. లాస్కీ కూడా ఈ అభిప్రాయాలు అంగీకరించాడు.

**12.2. 4. మార్క్సిస్టు హక్కుల సిద్ధాంతము :** రాజ్యం పై మార్క్సిస్టు అభిప్రాయాలనుండే మార్క్సిస్టు హక్కుల సిద్ధాంతము కూడా అవతరించింది. మార్క్సు దృష్టిలో రాజ్యము, చట్టము చారిత్రక స్వభావము కలవి. సమాజపు ఆర్థిక ప్రాతిపదికపై రాజ్యం నిర్మితమై వుంటుంది. రాజ్యమేర్పరచిన చట్టాలన్ని సామాన్య మానవులకొరకు కాక సమాజములోని ఉన్నత వర్గ ప్రయోజనాలు కాపాడుతూ వుంటాయి. రాజ్యము కల్పించే హక్కులను కూడా ఉన్నత వర్గాలే అనుభవిస్తాయి. బానిస సమాజంలో బానిస యాజమానులు, ఫ్యూడల్ సమాజంలో భూస్వాములు, పెట్టుబడిదారి సమాజంలో పెట్టుబడి దారులు తమ ప్రయోజనాలను కాపాడుకోవడానికి రాజ్యాంగ యంత్రాంగాన్ని ఉపయోగించుకుంటారు. సమాజంలో ఉన్నత వర్గానికే హక్కులు, మర్యాదలు వుంటాయి. పెట్టుబడిదారి విధానమున్న ప్రజాస్వామ్య దేశాలలో రాజ్యాంగాలు ప్రజలందరికి అనేక హక్కులు కల్పించినప్పటికి ఆచరణలో ఆ దేశాలలోని శ్రామిక వర్గం ఆ హక్కులను అనుభవించలేదు. విప్లవానంతరం ఏర్పడే సామ్యవాద వ్యవస్థలో మాత్రమే ప్రజలందరు హక్కులను సమానంగా పొందగలుగుతారు.

## 12.3. హక్కులు - నిర్వచనాలు

హెచ్. జె.లాస్కీ "వ్యక్తి తన సహజ గుణాలకు అనుగుణంగా తన వ్యక్తిత్వాన్ని ఉత్తమ స్థాయికి పెంపొందించుకోవటానికి అవసరమైన సాంఘిక అవకాశాలు, హక్కులు" అని పేర్కొన్నాడు. టి. హెచ్. గ్రీన్ అభిప్రాయంలో "సమాజశ్రేయస్సు కొరకు వ్యక్తుల చేత కోరబడి, రాజ్యము చేత గుర్తించబడిన అవకాశాలే హక్కులు".

పైన తెల్పిన అంశాలను బట్టి హక్కుల స్వభావాన్ని క్రింది విధంగా అంచనా వేయవచ్చు.

1) హక్కులు సామాజికజీవనంతో ముడిపడి వున్నాయి. అవి సంఘములోనే వుద్భవిస్తాయి. మానవుని సాంఘిక జీవన స్వభావానికి ప్రతిబింబమే హక్కులు. 2) హక్కులకు, విధులకు అవినాభావ సంబంధముంది. హక్కులలోనే విధులు ఇమిడివున్నాయి. 3) తాను కోరుకునే జీవన పరిస్థితులు ఇతరులు కూడా అనుభవించగలగాలని ప్రతి మానవుడు భావించాల్సి వుంది. తను కోరుకుంటున్న అవకాశాలే ఇతరులు కూడా కోరుకోవచ్చునన్న సహృదయత ఉండాలి. 4) రాజ్యం హక్కులను గుర్తిస్తుంది. రాజ్యాంగం ద్వారా హక్కులకు న్యాయబద్ధతను కల్పించి వాటిని అమలు చేస్తారు.

## 12.4. హక్కుల వర్గీకరణ

హక్కులను నైతిక హక్కులు, చట్టబద్ధమైన హక్కులు అని వర్గీకరించారు. చట్టబద్ధమైన హక్కులను తిరిగి పౌరహక్కులు, రాజకీయ హక్కులని విభజించారు. కొన్ని రాజ్యాంగాలలో ప్రాథమిక హక్కుల పేరుతో కొన్ని మౌలిక హక్కులను చేర్చారు. అయితే కొన్ని రాజ్యాంగాలలో హక్కులతోబాటు విధులను కూడా పొందుపరచారు.

**12.4. 1.** నైతిక హక్కులు : సమాజం చేత గుర్తించబడి అంగీకరింపబడిన హక్కులను నైతిక హక్కులు అంటారు. నైతిక హక్కులకు చట్టబద్ధతలేదు. వాటిని ఉల్లంఘించినా చట్టరీత్యా శిక్షించే అవకాశం లేదు. తల్లిదండ్రులు తమ పిల్లలను సంరక్షించాలి. వారికి తమ శక్తి మేరకు విద్యాబుద్ధులు చెప్పించాలని సాంఘిక ధర్మాలు చెప్తాయి. ప్రతి భార్యకు తన భర్త ప్రేమానురాగాలను పొందే నైతిక హక్కువుంది. కాని తల్లి, తండ్రులు తమ పిల్లలను నిర్లక్ష్యపరచినా, ఏ భర్తా తన భార్యను ప్రేమతో చూసుకోకపోయినా వారిపై న్యాయస్థానాల్లో ఫిర్యాదు చేసి ఈ నైతిక హక్కులను పొందే అవకాశం ఆ పిల్లలకు, ఆ భార్యకు లేదు. కాని సమాజం నైతిక హక్కులను ఉల్లంఘించిన వారిని వెలివేస్తుంది, బహిష్కరిస్తుంది, చిన్నచూపు చూస్తుంది. ఇక్కడ మనం గుర్తుంచుకొనవలసిన ఒక ముఖ్యాంశం ఉంది. సాంఘిక ధర్మాలకు, నైతిక విలువలకు అంగీకారమైన ఏ ప్రతిపాదన కూడా హక్కుకానేరదు. నైతిక హక్కులను మనం నైతిక సత్యాలనే ఉద్దేశ్యంతోనే మాట్లాడతాము. ఈ నైతిక ధర్మాలను రాజ్యం గుర్తించి శాసన రీత్యా న్యాయస్థానాల ద్వారా అమలు చేయడానికి సంకల్పించినప్పుడు మాత్రమే అది నైతిక హక్కు అవుతుంది. ఒకవేళ నైతిక హక్కులను రాజ్యం గుర్తించినా, వాటిని అమలు చేసే శక్తి సామర్థ్యాలు సమాజానికి ఉన్నంతగా రాజ్యానికి ఉండవు. అయినప్పటికి కాలక్రమంలో నైతిక ధర్మాలను చట్టాల రూపంలో రాజ్యం అమలు చేస్తూనే ఉంటుంది.

**12.4. 2.** చట్టబద్ధమైన హక్కులు : చట్టబద్ధమైన హక్కులే యదార్థమైన హక్కులు. ఈ హక్కులను రాజ్య శాసనాలు గుర్తించి అమలు చేస్తాయి. వీటికి హాని జరిగినప్పుడు పౌరులు న్యాయస్థానాల ద్వారా ప్రభుత్వానికి వ్యతిరేకంగాగాని, ఇతర పౌరులకు వ్యతిరేకంగా గాని పోరాడే అవకాశం ఉంది. చట్టబద్ధమైన హక్కులు అందరికి సమానంగా వర్తిస్తాయి. న్యాయబద్ధమైన హక్కులను తిరిగి పౌరహక్కులు, రాజకీయ హక్కులుగా విభజించవచ్చు.

**12.4. 3.** పౌరహక్కులు : పౌరహక్కులు సాంఘిక జీవనానికి అవసరమైన ప్రాథమిక అవకాశాలను, పరిస్థితులను సమకూరుస్తాయి. పౌరహక్కులను రాజ్యం కాపాడుతుంది. ఇవి లేకపోతే పౌరజీవనం సాధ్యం కాదు. ఇవి పౌరుల ధన, మాన, ప్రాణ ఆస్తిపాస్తుల రక్షణకు సంబంధించినవి. పౌరహక్కులు స్వేచ్ఛాయుత ప్రగతిశీల మానవ జీవనానికి అత్యావశ్యకాలు. పౌరహక్కుల వల్ల ప్రతిపౌరుడు పౌర కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా ఒక సంపూర్ణమైన పౌరుడుగా తనను తాను తీర్చిదిద్దుకోవడానికి అవకాశముంది. ఈ హక్కులను ఒక రాజ్యంలో పౌరులు, విదేశీయులు కూడా అనుభవించవచ్చు.

**12.4. 4.** రాజకీయ హక్కులు : వ్యక్తి వ్యక్తిగత హోదాలో కాక ఒక పౌరుడిగా రాజకీయ హక్కులను అనుభవిస్తాడు. రాజ్యం తన పౌరులకు దేశపాలనలో భాగస్తులు కావడానికి, శాసనాల ద్వారా కల్పించే అవకాశాలను రాజకీయ హక్కులు అంటాము. ప్రజాస్వామ్య ప్రభుత్వం సక్రమంగా పనిచేయడానికి రాజకీయ హక్కులు అవసరము. అయితే పౌర, రాజకీయ హక్కుల మధ్య విభజన అంత ఖచ్చితమైందికాదు. ఎందుకంటే కొన్ని హక్కులు రెండింటి పరిధికి చెందినవి. ఉదాహరణకు ప్రభుత్వాన్ని విమర్శించడానికి తన రాజకీయాభిప్రాయాలను వ్యక్తీకరించడానికి ప్రతిపౌరుడికి వాక్, సభ, పత్రికా, సమావేశ స్వాతంత్ర్యాలనే హక్కులు ఉన్నాయి. ఇవి పౌరజీవనానికి, రాజకీయ జీవనానికి ఉమ్మడిగా సంబంధించినవి. అసలు పౌరుడు అంటేనే రాజ్యంలో సభ్యుడు కనుక ప్రతి పౌరునికి రాజకీయ స్వాతంత్ర్యం హక్కుల రూపంలో లభిస్తుంది. కనుక ఈ రెండింటికి మధ్య ఉన్న భేదం అంత స్పష్టమైంది కాదు. అయితే ఈ విభజనకు ఒక చారిత్రక ప్రాముఖ్యత ఉన్నది. రాజకీయ హక్కులను నిరాకరించిన దేశాలలో కూడా ప్రజలకు హక్కులుండేవి, ఉన్నాయి. రాజకీయ హక్కులు ప్రజాస్వామిక రాజ్యాల్లో ప్రజలకు ఇవ్వబడిన అసాధారణ సౌకర్యాలు. ఏ దేశంలోనైనా విదేశీయులకు రాజకీయ హక్కులుండవు. అలానే అన్ని దేశాలలో మైనర్లను, నేరస్థులను, ఉన్మాదులను హక్కులనుంచి మినహాయించారు. కొన్ని దేశాలు స్త్రీలనుండి హక్కులను దూరంచేసాయి. రాజకీయ హక్కులను అనుభవించే వయోజనుల వయోపరిమితిలో కూడా ఒకే విధానం లేదు. కనుక అందరికి సమాజ రాజకీయ హక్కులు సాధ్యంకావు.

హక్కుల వర్గీకరణ ఈ క్రింది పటం నుంచి తెలుసుకొనవచ్చు.

| నైతిక హక్కులు<br>పౌరహక్కులు | చట్టబద్ధమైన హక్కులు<br>రాజకీయ హక్కులు |
|---|---|
| 1. ప్రాణరక్షణ హక్కు | 1. ఓటు హక్కు |
| 2. వ్యక్తిస్వాతంత్ర్యపు హక్కు | 2. ఎన్నికల్లోపోటీ చేసే హక్కు |
| 3. భావప్రకటనా స్వాతంత్ర్యపు హక్కు | 3. ప్రభుత్వపదవులు చేపట్టేహక్కు |
| 4. ఆస్తి హక్కు | 4. విజ్ఞాపన హక్కు |
| 5. పనిహక్కు | 5. ప్రభుత్వాన్ని విమర్శించేహక్కు |
| 6. విద్యార్జన హక్కు | |
| 7. సమానత్వపు హక్కు | |
| 8. మతస్వాతంత్ర్యపు హక్కు | |
| 9. సంఘాలు, సంస్థలు ఏర్పరచుకొనే హక్కు | |
| 10. కుటుంబ హక్కు | |
| 11. ఒప్పందపు హక్కు | |
| 12. రాజ్యాంగ పరిహారపు హక్కు | |
| 13. సాంస్కృతిక హక్కు | |

## 12.5. పౌరహక్కులు

పౌరహక్కుల వల్ల నాగరిక జీవనం సాధ్యమవుతుంది. ఇవి ప్రజల ధన, మాన, ప్రాణ, ఆస్థిపాస్తుల సంరక్షణకు అవసరమైన సాంఘిక పరిస్థితులను ఏర్పరుస్తాయి. పౌరహక్కులలో ఈ క్రిందివి ముఖ్యమైనవి.

**12.5. 1. ప్రాణరక్షణ హక్కు :** రాజ్యానికి, సమాజానికి వ్యక్తి మూలము, ప్రధానము. వ్యక్తుల సుఖ జీవనం కోసం హక్కులనే అవకాశాలు అవతరించాయి. మనిషిలేనిదే రాజ్యంలేదు. అందుచేతనే మనిషి ప్రాణరక్షణకు హక్కు అవసరము. ఇది అన్ని హక్కులకు మౌలికమైంది. దీన్ని జీవించి ఉండటానికి హక్కు అంటారు. రాజ్యం ప్రాణ రక్షణను కల్పిస్తుంది. ఆత్మరక్షణ హక్కుతోపాటు ఆత్మహత్య నిషేధించబడింది. ఆత్మహత్య చేసుకునే వారిని చట్టం శిక్షిస్తుంది. హత్య, ఆత్మహత్యల వల్ల రాజ్యానికి నష్టం. అందుచేత తామే వ్యక్తి ప్రాణాలను రక్షించడానికి సమాజం రాజ్యం పూనుకొంటాయి. ప్రకృతి ప్రసాదించిన జీవితాన్ని ఇతరులు బలికొనడం గాని లేదా తనకు తాను వ్యక్తి బలి చేసుకోవడం కాని ఒక అవినీతి కార్యం. అందుకే ఆత్మహత్యను వ్యక్తి తన మీద, చివరకు భగవంతునీ మీద జరిపే దురాక్రమణగా ఆక్వినాస్ భావించాడు.

**12.5. 2. వ్యక్తి స్వాతంత్ర్యపు హక్కు :** వ్యక్తి స్వాతంత్ర్యపు హక్కు పౌరహక్కులలో అత్యంత ప్రధానమైంది. ఎందుకంటే హక్కు మానవుని అస్తిత్వానికి, మనుగడకు మూలస్తంభంవంటిది. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అనేవి మానవుని శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవటానికి, సమాజం పట్ల తన విద్యుక్త ధర్మాలను నిర్వర్తించడానికి అవసరం. అవి లేకపోతే మానవుడు బానిసగా, పశువుగా పరిగణించబడతాడు. అందుకే మౌలికమైన ఈ హక్కును రాజ్యం కాని, ఇతర వ్యక్తులు కాని నిరోధించలేరు. అదే విధంగా

ప్రతి వ్యక్తి రాజ్యంలో ఏ ప్రాంతంలోనైనా స్వేచ్ఛగా పర్యటించడానికి స్థిర నివాసం ఏర్పర్చుకోవడానికి హక్కు ఉంది. ప్రతివ్యక్తి తన ప్రతిభా విశేషాలను ప్రదర్శించుకోవడానికి సంచార స్వాతంత్ర్యం అవసరం అంటాడు ఆర్. ఎన్.యస్. గిల్ క్రైస్ట్. ప్రతి వ్యక్తి ఏదో విధంగా సమాజశ్రేయస్సుకు దోహదం చేస్తాడు. ఆ కారణంగానే వ్యక్తి స్వాతంత్ర్యపు హక్కును సంచార స్వాతంత్ర్య హక్కును, గుర్తించాలంటారు జె.యస్.మిల్, రూసో వంటివారు. స్వేచ్ఛలో వ్యక్తిగత స్వాతంత్ర్యం ప్రధానమైంది. అందుకే నేరం న్యాయస్థానంలో రుజువైతే తప్ప ఏ వ్యక్తినీ నిర్బంధించటానికి ఏ రాజ్య శాసనానికి అధికారం లేదు. పౌరుని వ్యక్తిగత స్వేచ్ఛ ఎవరైనా నిరంకుశంగా అరికడితే న్యాయస్థానం ద్వారా రక్షణపొందవచ్చు. అసాధారణ పరిస్థితులు రాజ్యంలో నెలకొన్నప్పుడు శాంతిభద్రతల దృష్ట్యా వ్యక్తి స్వేచ్ఛ పై ప్రభుత్వం సహేతుకమైన ఆంక్షలు విధించవచ్చు.

**12.5. 3. భావప్రకటన స్వాతంత్ర్యపు హక్కు :** మానవుని ప్రాథమిక హక్కులలో భావప్రకటనా స్వాతంత్ర్యం ఒకటి. వ్యక్తి స్వేచ్ఛగా, నిర్భయంగా తన అభిప్రాయాలను వ్యక్తం చేసి ఇతరుల అభిప్రాయాలను తెలుసుకొనే అవకాశం లేకపోతే సంతృప్తికరమైన సాంఘికజీవనం సాధ్యం కాదు. మానసిక, నైతిక పురోభివృద్ధి కుంటుపడుతుంది. అందుకే భావప్రకటనా స్వాతంత్ర్యపు హక్కును ప్రజాస్వామిక ప్రభుత్వాలు విలువైన హక్కుగా గుర్తిస్తాయి. ఈ హక్కులో వాక్ స్వాతంత్ర్యం, పత్రికా స్వాతంత్ర్యం ఇమిడి ఉన్నాయి. ఇవి ప్రజాస్వామ్య విజయానికి తోడ్పడతాయి. వీటివల్లనే ప్రభుత్వ విధానాలను, నిర్మాణాత్మకంగా విమర్శించే వీలుకలుగుతుంది. విచక్షణా పూర్వకమైన ప్రజాభిప్రాయాన్ని రూపొందించి ప్రజాసమస్యలను పరిష్కరించ వీలు కలుగుతుంది. అయితే భావ ప్రకటనా స్వాతంత్ర్యపు హక్కు ఎంత విలువైనదైనా మితిమీరిన వాక్స్వాతంత్ర్యాల్ని అరికట్టవలసిన అవసరం ప్రతి ప్రభుత్వానికి ఉంటుంది. అందుకు సహేతుకమైన ఆంక్షలను విధిస్తుంది.

**12.5. 4. ఆస్థిహక్కు :** సంపదను, ఆస్థిని సమకూర్చుకోవాలనే కాంక్ష మానవునికి స్వాభావికంగా ఉంటుంది. అందుకే న్యాయమార్గంలో ఆస్థిని సంపాదించటానికి, అనుభవించటానికి, దానధర్మాలు చేయటానికి ప్రతీవ్యక్తికీ హక్కు ఉంది. అయితే ఆధునిక కాలంలో ఈ హక్కు సామ్యవాదుల తీవ్ర విమర్శలకు గురయింది. ఆస్థి హక్కును సమర్థించేవారు ఆస్థి, వ్యక్తి జీవితానికి భద్రతను స్వేచ్ఛను చేకూరుస్తుందని, కష్టపడి పనిచేయటానికి ప్రేరణ కలిగిస్తుందని అంటారు. ఆస్థికి ఒక నైతిక ప్రాతిపదిక ఉందనీ, అది వ్యక్తి సామర్ధ్యానికి ప్రతిరూపమని భావిస్తారు. ఆదర్శవాదులు, సామ్యవాదులు మాత్రం వ్యక్తిగత ఆస్థిని రద్దుచేస్తేగాని సమానత్వం, సాంఘికన్యాయం ఏర్పడవని భావిస్తారు. ఆస్థిహక్కు సాంఘిక, ఆర్థిక, రాజకీయ అసమానతలకు మూలకారణమని అది సమాజాన్ని వర్గ సమాజంగా రూపొందించి అశాంతిని రేపుతుందని వాదిస్తారు. ఉత్పత్తి, వినిమయ సాధనాలన్నింటిని జాతీయం చేయాలని భూసంస్కరణలను అమలుపరచాలని అంటారు.

**12.5. 5. పనిహక్కు :** మానవుడు తమ శ్రమకు లభించే ప్రతిఫలం మీదనే ఆధారపడి జీవిస్తాడు. అందుకవసరమైన పనిని వ్యక్తికి సమాజం చేకూర్చవలసి ఉంటుందని లూయీ బ్లాంక్ 19వ శతాబ్దంలోనే వాదించాడు. ఆధునిక రాజ్యం పౌరుల పని హక్కును గుర్తించాలని, పనిని కల్పించలేనపుడు కొంత జీవనభృతిని చెల్లించాలని ఈనాడు సర్వత్రా భావిస్తున్నారు. కనీస వేతనాలు, కార్మికుల సంక్షేమం, శ్రమకు తగిన వేతనం, విశ్రాంతిని పొందే హక్కు మొదలైనవన్నీ పనిహక్కుతో ముడిపడి ఉన్నాయని గ్రహించాలి. న్యాయానికి ప్రతి శ్రామికునికి ఒక స్థాయి జీవితాన్ని గడపటానికి కావలసినంత వేతనం లభించాలి. పని హక్కుకు చట్టబద్ధమైన గుర్తింపు ఇవ్వాలి. కాని ఈనాటికి అనేక దేశాలు ఈ విషయంలో ఉపేక్షిస్తున్నాయి. సోవియట్ రష్యా వంటి దేశాలు పనిహక్కును చట్టబద్ధంగా అమలు పరుస్తున్నాయి. భారతదేశం పనిహక్కును ఆదేశ సూత్రాలలో చేర్చి ప్రభుత్వాన్ని యధాశక్తి అమలు పరచమని నిర్దేశిస్తుంది.

**12.5. 6. విద్యార్జన హక్కు :** విద్యార్జన హక్కు అంటే రాజ్యమే పౌరులను విద్యావంతులుగా తీర్చి దిద్దటానికి కావలసిన సౌకర్యాలను సమకూరుస్తుందని అర్థం. ప్రజాస్వామ్యంలో పౌరులే పాలకులు, పాలితులు. ప్రభుత్వ కార్యకలాపాలు, రాజ్యాంగం, రాజ్యం పట్ల ప్రజలకు సరైన అవగాహన లేకపోతే ప్రజాస్వామ్యం విజయవంతం కాజాలదు. స్వేచ్ఛా పూరితమైన వ్యక్తి వికాసానికి, పౌర బాధ్యతలను తెలియచేయటానికి విద్య ఆయుధం వంటిది. పౌరునికి కనీసం ప్రాథమిక విద్యనైనా నిర్బంధంగా బోధిస్తే వయోజన ఓటింగు హక్కును సద్వినియోగం చేసుకోగలుగుతాడు. రాజకీయ విద్యా విహీనుడు భావదాస్యానికి లోనై నిష్ప్రయోజకుడుగా

రూపొందుతాడు. అట్టి పరిస్థితులలో ప్రజాస్వామ్యం హాస్యాస్పదంగా తయారవుతుంది. అందుకే ప్రజాస్వామ్య వివాదాన్ని ప్రజలను విద్యావంతులుగా చేయడం అని లాస్కీ అన్నాడు. భారతదేశం వంటి ఆధునిక ప్రజారాజ్యాల విద్యా ప్రాధాన్యతను గుర్తించి నిరక్షరాస్యత రూపుమాప ప్రయత్నిస్తున్నాడు.

**12.5. 7. సమానత్వపు హక్కు :** ప్రజాస్వామ్యం సమానత్వ సూత్రంపై ఆధారపడి పనిచేస్తుంది. మానవులలో సహజ అసమానతలు ఉన్నా చట్టరీత్యా అందరూ సమానులే. జాతి, కుల, మత, వర్ణ, వర్గ, లింగ బేధాల పట్ల చట్టబద్ధమైన విచక్షణ లేకపోడమే సమానత్వపు హక్కు అని చెప్పవచ్చు. ఒకప్పుడు కొన్ని వర్గాల వారికి ప్రత్యేక స్వాధికారాలుండేవి. కాని రాజ్యంలోని పౌరులందరికీ ఒకే న్యాయాన్ని సమానత్వం ప్రాతిపదికగా వర్తింపజేయటం ఆధునిక ప్రజాస్వామ్య విధానం. చట్టం దృష్టిలో అందరూ సమానులేనని భారత రాజ్యాంగం స్పష్టం చేసి సమానత్వపు హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తిస్తుంది. అస్పృశ్యత, కట్టుబానిసత్వం వంటి సాంఘిక దురాచారాలు శిక్షార్హమైనవని ప్రకటించింది. ఈనాడు నాగరిక సమాజాలన్నీ ఆర్థిక, సాంఘిక, రాజకీయ సమానత్వాలకోసం పాటుపడుతున్నాయి.

**12.5. 8. మత స్వాతంత్ర్యపు హక్కు :** పౌర హక్కులలో మత స్వాతంత్ర్యపు హక్కు ఒకటి. ఆధునిక రాజ్యాలు చాలావరకు మత ప్రమేయంలేని లౌకికరాజ్యాలు. అంటే రాజ్యాలు మత సంబంధ విషయాలలో తటస్థంగా ఉంటాయి. రాజ్యమతం ఏదీ ఉండదు. కాని పౌరులు మాత్రం తమ అంతరాత్మ ప్రబోధం అనుసరించి ఎవరి ఇష్టం వచ్చిన మతాన్ని వాళ్లు అవలంభించి ప్రచారం చేసుకోవచ్చు. వారు తమ మత దాన ధర్మ సంస్థలను స్థాపించుకొని వాటి నిర్వహణకోసం ఆస్థిపాస్తులను సంపాదించి ఖర్చు పెట్టుకోవచ్చు. అంటే పౌరులకు సంపూర్ణమైన మత స్వాతంత్ర్యం, స్వేచ్ఛ ఉంటుందన్న మాట. మతం అనేది కేవలం వ్యక్తిగతమైనది. అయితే లౌకిక రాజ్యంలో పౌరులు ఇతర మతాల పట్ల సహనం, ఓర్పును ప్రదర్శించే విశాల హృదయాన్ని, అవగాహనను కలిగి ఉండాలి. భారత రాజ్యాంగం లౌకిక రాజ్యాంగం అయినా పౌరులకు మత స్వాతంత్ర్యపు హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తిస్తుంది. ఇతర స్వాతంత్ర్యాల మీద ఆంక్షలు విధించినట్లే మత స్వాతంత్ర్యం పై కూడా దేశ భద్రత దృష్ట్యా కొన్ని హద్దులను విధించింది.

**12.5. 9. సంఘాలు, సంస్థలు ఏర్పర్చుకొనే హక్కు :** ప్రధాన పౌరహక్కులలో సంస్థలను స్థాపించుకొనే హక్కు ఒకటి. సమాజం వివిధ సాంఘిక ఆర్థిక, సాంస్కృతిక, మత సంస్థలతో కూడుకొని ఉంది. సంఘ నిర్మాణంలో సంస్థలు ప్రధాన పాత్రను నిర్వహిస్తాయి. మానవుడు వ్యక్తిగతంగా, కేవలం రాజ్యంలో సభ్యుడిగా ఏమీ సాధించలేడు. వివిధ సంఘాలలో సభ్యత్వం పొందటం వల్ల వికాసాన్ని, వ్యక్తిత్వ సమగ్రాభివృద్ధిని సాధిస్తాడు. అందుకే పౌరులకు సంస్థలను, సంఘాలను ఏర్పాటు చేసి నిర్వహించడానికి హక్కు ఉంది. సభలు, సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి, అభిప్రాయాలను స్వేచ్ఛగా వెలిబుచ్చడానికి స్వాతంత్ర్యం ఉంది. అయితే దేశ శాంతి, భద్రతల దృష్ట్యా ఈ సంస్థలు, సంఘాలు అన్నీ రాజ్యనియంత్రణకు లోబడి పని చేస్తాయి. కాని లాస్కీ వంటి బహుతావాదులు రాజ్యాన్ని కూడా మిగతా సంస్థలతో పాటు ఒక సంస్థగా భావించారు. నిజానికి ఆధునిక రాజ్యం సార్వభౌమాధికారం కలిగియుండి ఈ సంస్థల ప్రాబల్యం నుంచి వ్యక్తి స్వేచ్ఛను పరిరక్షించే బాధ్యతను తీసుకుంది. ఈ సంస్థలను, సంఘాలను సమన్వయపరిచి వాటిని సక్రమ మార్గంలో నడిపిస్తుంది. అవి కళ్లెం లేని గుర్రాలైనప్పుడు మాత్రం వాటిని నిషేధిస్తుంది.

**12.5. 10. కుటుంబ హక్కు :** మానవుని సాంఘిక హక్కులలో ప్రధానమైనది కుటుంబ హక్కు. మానవ సమాజ పరిణామంలో కుటుంబం తొలిదశగా గుర్తించబడింది. కుటుంబం మౌలిక సాంఘిక వ్యవస్థ. అది సంస్కృతి, నాగరికతా వికాసంలో ప్రముఖపాత్రను నిర్వహించింది. అందుకే దీనిని ప్రధానమైన హక్కుగా భావించారు. ఈ కుటుంబ హక్కుతో వివాహపు హక్కు, వైవాహిక సంబంధ పవిత్రత పరిరక్షణ హక్కు, వారసత్వపు హక్కు ముడిపడి వున్నాయి. కుటుంబ సంస్థల పవిత్రతను స్వేచ్ఛను రాజ్యాంగం గుర్తిస్తుంది. సమాజ శ్రేయస్సు దృష్ట్యా కుటుంబ సభ్యుల సంబంధాలను చట్టాల ద్వారా క్రమబద్ధం చేస్తుంది. అట్టి చట్టాలలో వివాహం, విడాకులు, వారసత్వం, బహుభార్యల నిషేధచట్టం ముఖ్యమైనవి.

**12.5. 11. ఒప్పందపు హక్కు :** ఒక వ్యక్తి స్వేచ్ఛగా సమాన ప్రాతిపదికపై మరోవ్యక్తితో లేదా సంస్థతో ఒడంబడిక సామాజిక జీవనానికి ప్రాతిపదిక. అందుకే దాన్ని ఒక ప్రముఖ హక్కుగా గుర్తిస్తారు. ఈ హక్కు వర్తక, వాణిజ్య వ్యవస్థలను పటిష్టం చేస్తుంది. ఒడంబడిక హక్కును రాజ్యం గుర్తించి క్రమబద్ధం చేస్తుంది. ఈ ఒడంబడిక హక్కుకు హానికలిగించే విధంగా రాష్ట్రప్రభుత్వాలు ఏ శాసనాన్ని చేయకూడదని భారత్ అమెరికన్ రాజ్యాంగాలు నిర్దేశిస్తాయి. మానవతా వాద దృక్పథంతో రాజ్యాలు కొన్ని ఒడంబడికలను గుర్తించవు. వాటిని అధర్మ చర్యలుగా భావించి శిక్షార్హం చేశాయి. ఉదాహరణకు బానిస వ్యాపారాన్ని, అవినీతికర వ్యాపార ఒడంబడికలను ఏ రాజ్యం గుర్తించదు. అదే విధంగా సమాజ శ్రేయస్సు దృష్ట్యా భారత రాజ్యాంగం అస్పృశ్యతను, కట్టుబానిసత్వాన్ని, వ్యభిచారం కోసం స్త్రీల విక్రయాన్ని నిషేధించింది.

**12.5. 12. రాజ్యాంగ పరిరక్షణ హక్కు :** రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను పరిరక్షించుకునే హక్కు పౌరులకు అవసరం. ట్టి హక్కు లేకపోతే పౌరహక్కులు రాజకీయ హక్కులు అర్థరహితమే కాక నిష్ప్రయోజనమవుతాయి. ఈ రక్షణ హక్కును భారత ్యాంగం ప్రాథమిక హక్కుగా గుర్తిస్తుంది. పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగినపుడు వారు ప్రత్యక్షంగా హైకోర్టు నుండి గాని ుప్రీంకోర్టు నుండి గాని రక్షణ కోరవచ్చు. ప్రాథమిక హక్కులకు పరిరక్షణకు గాను సుప్రీంకోర్టు లేదా హైకోర్టు 6 రకాల రిట్లను రీచేస్తుంది. అవి (1) హెబియస్‌కార్పస్ (2) మాండమస్ (3) ప్రొహిబిషన్ (4) కోవారెంటో (5) ఇంజక్షన్ (6) సెర్షియోరారి. అదే ఎన్‌లో ప్రత్యేకించి ప్రాథమిక హక్కులేవి లేకపోయినా సాధారణ న్యాయాన్ని న్యాయస్థానాలు అమలుపరుస్తాయి. భారత దేశంలో ఈ ిరక్షణ హక్కు అత్యవసర పరిస్థితి ప్రకటించినపుడు రద్దవుతుంది.

**12.5. 13. సాంస్కృతిక హక్కు :** సాంఘిక హక్కులలో సాంస్కృతిక హక్కు ముఖ్యమైనది. ఎందుకంటే మానవుడు ప్రదంగా చూసుకొనే భాష, లిపి, సంస్కృతి, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలను పరిరక్షిస్తుంది. రాజ్య సమైక్యతకూ, సుస్థిరతకూ, స్కృతిక రంగంలో భిన్నత్వంలో ఏకత్వంను సాధించటానికి ఈ హక్కు అత్యంత ప్రధానమైనది. దీనివలన ఎవరి సంస్కృతిని వారు ిరక్షించుకుంటారు. అల్ప సంఖ్యాకుల సంస్కృతులు అధిక సంఖ్యాకుల సంస్కృతితోపాటు మనుగడను సాగిస్తాయి. ఈ విషయమై రత రాజ్యాంగం ప్రపంచ రాజ్యాంగ చరిత్రలో మరెక్కడాలేని విధంగా అల్పసంఖ్యాక వర్గాల వారికి రక్షణలను కల్పించింది.

## 12.6. రాజకీయహక్కులు

పౌరజీవనానికి పౌరహక్కులు ఎంత ముఖ్యమో రాజకీయ జీవనానికి రాజకీయ హక్కులు అంత ముఖ్యము. ప్రజలు పాల్గొనే జాస్వామ్యపాలనలో రాజకీయ హక్కులు అధిక ప్రాధాన్యతను పొందుతాయి. వీటి ద్వారా పౌరుడు ప్రభుత్వ కార్యకలాపాల్లో పాల్గొంటాడు. ఈ హక్కులు పౌరుణ్ణి రాజకీయంగా చైతన్యవంతం చేయటమే కాకుండా ప్రజాప్రభుత్వ పాలనలో తన వంతు బాధ్యతను నిర్వర్తించేటట్లుగా స్తాయి. రాజకీయ హక్కులను 5 రకాలుగా విభజించవచ్చు.

**12.6. 1. ఓటుహక్కు :** ప్రజాస్వామ్య వ్యవస్థలలో అత్యంత ప్రాధాన్యతను పొందినది రాజకీయ హక్కు. ప్రజాస్వామ్యం ప్రత్యక్షంగా పరోక్షంగా ఉండవచ్చు. ప్రత్యక్ష ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రత్యక్షంగా రాజకీయ వ్యవహారాలలో పాల్గొని తమ అభిప్రాయాలను ిబుచ్చి రాజ్య నిర్వహణలో పాలుపంచుకొంటారు. పరోక్ష ప్రజాస్వామ్యంలో పౌరులు ఎన్నికైన ప్రజాప్రతినిధుల ద్వారా ప్రభుత్వ వ్యవహారాల్లో పాల్గొంటారు. దానినే ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం అంటారు. అట్టి రాజ్యాలలో సార్వజనీన వయోజన ఓటుద్వారా కుల, మత, వర్గ, వర్ణ, లింగ భేధాలు లేకుండా వయోజనులైన పౌరులందరికి ఈ ఓటు హక్కు ఉంటుంది. ఓటుహక్కుద్వారానే పౌరుడు తన రాజకీయ నిర్ణయాన్ని ప్రకటిస్తాడు.

**12.6. 2. ఎన్నికలలో పోటీచేసే హక్కు :** ప్రజాస్వామ్య మనుగడకు ఓటుహక్కుతో బాటు ఎన్నికలలో నిలబడి ప్రజలకు ప్రాతినిధ్యం వహించడానికి సంబంధించిన హక్కు పౌరుడికి అవసరం. జాతి, కుల, మత, వర్గ, లింగ భేదాలు లేకుండా ఏ పౌరుడైనా ఎన్నికల్లో పోటీ చేయవచ్చు. ప్రతినిధిగా ఎన్నిక కావచ్చు. ఈ ఓటుహక్కు వల్లనే సామాన్య పౌరుడు దేశాధ్యక్షుని వంటి అత్యున్నత పదవులను కూడా చేపట్టవచ్చు.

**12.6. 3. ప్రభుత్వ పదవులు చేపట్టే హక్కు :** ప్రజాస్వామ్యం ప్రసాదించే రాజకీయ హక్కుల్లో ప్రభుత్వ పదవులు నిర్వహించే హక్కు ఒకటి. పౌరులందరికీ సమానత్వ ప్రాతిపదికపై జాతి, కుల, మత, వర్ణ, లింగ భేదాలు లేకుండా పౌరులందరికీ ఉద్యోగావకాశాలను కల్గించడమే ఈ హక్కు ప్రధానాశయం. అయితే ఆయా పదవులకు కావలసిన విద్య, సాంకేతిక వయో అర్హతలను రాజ్యం నిర్దేశించవచ్చు. భారత రాజ్యాంగం కొన్ని చారిత్రక, సాంఘిక కారణాల దృష్ట్యా షెడ్యూల్డు కులాల వారికి ఈ విషయంలో కొంత మినహాయింపును ఇవ్వడం జరిగింది. అట్టి మినహాయింపు తాత్కాలికమే కాకుండా సాంఘిక న్యాయం చేకూర్చే నిమిత్తం ఏర్పర్చబడిందని గ్రహించాలి.

**12.6. 4. విజ్ఞాపన హక్కు :** ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం ప్రజలదే కాబట్టి తమ ప్రజలకు కష్ట ... అధికారులకు విజ్ఞాపన చేసుకునే హక్కు ఎంతైనా అవసరం. ప్రజల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయరాదు. లేకపోతే రాబోయే

ఎన్నికలలో దాని మనుగడకే హాని కలుగుతుంది. భారతదేశం వంటి ప్రాతినిధ్య ప్రభుత్వం ఉన్న రాజ్యాలలో ప్రజాప్రతినిధులు శాసనసభలలో ప్రజల విజ్ఞాపనలను ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తారు. ప్రత్యక్ష ప్రజాస్వామ్యం గల స్విట్జర్‌లాండ్‌లో ప్రజలే ఒక నిర్ణీత సంఖ్యలో సంతకాలు చేసి విజ్ఞాపనలను సమర్పిస్తారు. అట్టి విజ్ఞాపనను అభిప్రాయ నివేదన అంటారు (Referendum).

**12.6. 5. ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు :** రాజకీయ హక్కులలో ఈ హక్కు అత్యంత ప్రధానమైంది. ఈ హక్కు పౌరులకు భావ ప్రకటన స్వేచ్ఛ ఉన్నపుడే సాధ్యమవుతుంది. నిజమైన ప్రజాస్వామ్య ప్రభుత్వంలో అట్టి విమర్శే ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్టం చేస్తుంది. ప్రజల నిరంతర అప్రమత్తతే ప్రజాస్వామ్య విజయానికి కారణభూతమవుతుంది. ప్రభుత్వ విధానాలను నిర్మొహమాటంగా విమర్శించే హక్కు పౌరులకున్నప్పుడే ప్రభుత్వం బాధ్యతాయుతంగా ప్రవర్తించగలదని జాన్ స్టూవర్టుమిల్ ప్రవచించాడు. ఆధునిక ప్రభుత్వాధికారాలు రోజురోజుకీ విస్తృతమవుతూ వ్యక్తి జీవితాన్నంతటిని ప్రభావితం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు పౌరులకుండటం ఎంతైనా అవసరం.

**12.7. విధులు లేదా బాధ్యతలు :** సమాజ శ్రేయస్సుకు హాని కలుగకుండా ప్రవర్తించే బాధ్యత ప్రతివ్యక్తి మీదా ఉంది. హక్కులను అనుభవిస్తున్నపుడు వాటితోపాటు కొన్ని విధులను కూడా వ్యక్తి నిర్వర్తించాల్సి ఉంది. సమాజం వ్యక్తులకు కొన్ని చేయదగిన పనులను, కొన్ని చేయకూడని పనులను నిర్దేశిస్తుంది. వీటినే విధులంటారు. పన్నుల చెల్లింపు విధితో బాటు, దొంగతనం చేయకపోవటం కూడా విధే అవుతుంది. మానవుడు సంఘజీవి కనుక తోటి వ్యక్తుల పట్ల అతడు కొన్ని బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉంది. ఒక వ్యక్తి అనుభవించే హక్కు ఇతరుల పట్ల విధికూడా అవుతుంది. అంటే మన హక్కులు ఇతరులకు విధులవుతాయి. ఇతరుల హక్కులు మనకు విధులవుతాయి. సాంఘిక ప్రయోజనాలను సాధించడానికి హక్కులు, విధులు సమతౌల్యంగా పనిచేయవలసి ఉంటుంది. కేవలం హక్కులే ఉండి విధులే లేకపోతే అరాచకం ప్రబలుతుంది. బాధ్యతలు మాత్రమే ఉండి హక్కులు లేకపోతే బానిసత్వానికి దారితీస్తుంది.

## 12.8. విధుల వర్గీకరణ

హక్కుల మాదిరిగానే విధులు కూడా రెండు రకాలు. అవి (1) నైతికము (2) చట్టబద్ధము

**12.8. 1. నైతిక విధులు :** సమాజంలోని నైతిక విలువలను, కట్టుబాట్లను ప్రతిపౌరుడు తప్పకుండా పాటించాలి. నైతిక విధులంటే సామాజిక నైతిక సూత్రాలపై, నైతిక ఆధారాలపై అనుభవించే విధులు. ఈ విధుల వెనుక రాజ్యానుమతి, శాసనాధికారం ఉండవు. వీటిని నిర్వర్తించని వారిని చట్టాలేమీ చేయలేవు. సమాజమే నైతిక విధులను పాటించని వారిని అభిశంసిస్తుంది. పేదలకు సహాయం చేయడం, తల్లిదండ్రులపట్ల వినయ విధేయతలను చూపడం నైతిక బాధ్యతలు. సమాజశ్రేయస్సుకు తోడ్పడే నైతిక పరిస్థితులను కల్పించడం పౌరుల నైతిక బాధ్యత.

**12.8. 2. చట్టబద్ధమైన విధులు :** ప్రజలమీద విధించినవి, శాసనపర పరిమితులు, న్యాయస్థానాల ద్వారా అమలుచేవలసినవి చట్టబద్ధమైన విధులవుతాయి. సహజంగానే నైతిక బాధ్యతలు శాసనపరమైన విధులకు ఆధారాలు అవుతాయి. చట్టబద్ధమైన విధులను నిర్వర్తించలేకపోతే శిక్షార్హులవుతారు. చట్టాలను శిరసావహించడం ప్రతి పౌరుడి బాధ్యత. కాని ఏ పౌరుడైనా శాసనధిక్కారం చేస్తే శిక్షార్హుడవుతాడు. చట్టబద్ధమైన విధులను మళ్ళీ సంవర్ధక విధులు, సంరక్ష విధులనే రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

**12.8. 3. సంవర్ధక విధులు :** సాంఘిక ప్రగతికి, సంక్షేమానికి సమధికంగా దోహదంచేసే విధులను వ్యక్తి నిర్వర్తించినట్లైతే అతడు సంవర్ధక విధులను నిర్వర్తిస్తున్నాడు అని చెప్పవచ్చు. అంటే చట్టం చెప్పిన పనులను చేస్తాడన్నమాట. శాంతిభద్రతలను కాపాడటంలో, రాజ్యానికి సహకరించడం, నీతిగా ఓటువేయడం, ప్రజాప్రతినిధిగా తన విధులను నిర్వర్తించడం సంవర్ధక విధులు.

**12.8. 4. సంరక్షక విధులు :** చట్టం నిర్దేశించిన పనిని పౌరుడు చేయకపోతే అతడు సంరక్షక విధులను నెరవేరుస్తున్నట్లు అర్థం. సంరక్షక విధి చట్టం నిర్దేశించిన నిషేధాల పట్ల విధేయతను తెలుపుతుంది. సంరక్షక విధులు సక్రమంగా నిర్వర్తించబడాలంటే రాజ్య శాసనాలు ప్రజాభిప్రాయానికి అనుగుణంగా రూపొందించబడాలి.

## 12.9. పౌరుని ముఖ్యవిధులు

**12.9. 1. శాసనాల పట్ల విధేయత :** ప్రతిదేశంలోనూ ప్రభుత్వ శాసనాలను ఆదేశాలను పాటించడం, చట్టాలపట్ల విధేయుడుగా ఉండటం పౌరుని ముఖ్యవిధి. సమాజశ్రేయస్సు కోసమే శాసనాలు ఉన్నాయని భావించి వానిని గౌరవించాలి. పాత సోవియట్ యూనియన్‌లో

పౌరుడు శాసనాలకు కట్టుబడి ఉండటం రాజ్యాంగపరమైన విధి. శాసనోల్లంఘన, రాజ్యాధికారానికి ఎదురు తిరగడం, ప్రభుత్వ ఆదేశాలను అతిక్రమించడం, వ్యాధిగ్రస్తమైన రాజ్యానికి లక్షణాలు. అందుచేతనే అరిస్టాటిల్ "మంచి పౌరుడు మంచి రాజ్యాన్ని సృష్టిస్తాడు" అంటారు.

**12.9. 2. లోపభూయిష్టమైన శాసనాలను వ్యతిరేకించడం :** పౌరుడు మంచి శాసనాలను ఏవిధంగా శిరసావహించి అనుసరిస్తాడో అదేవిధంగా ప్రజావ్యతిరేక శాసనాలను ఉపసంహరించేటందుకు పోరాడుతాడు కూడా. చెడ్డశాసనాలను వ్యతిరేకించడం మంచి పౌరుని బాధ్యత. నిరంకుశ అధికారాలను చెలాయించే రాజ్యాలు ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా చేసిన శాసనాలను పౌరులు నిర్మూలించబూనుకోవడం నైతికమైన, న్యాయసమ్మతమైన బాధ్యతేనని గాంధీజీ అంటాడు. చెడ్డ శాసనాలు పౌరుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను హరిస్తాయి. కనుక వాటికి ఎదురు తిరగడం ధర్మమే.

**12.9. 3. రాజ్యంపట్ల విధేయత :** ప్రతి పౌరుడు రాజ్యానికి విధేయుడుగా ఉండటం అతని నైతిక బాధ్యత. రాజ్యరక్షణ, రాజ్య సమగ్రత కోసం కృషిచేయడం, అంతర్ యుద్ధాల బారినుండి రాజ్యాన్ని రక్షించుకోవడం పౌరుని బాధ్యత. దేశరక్షణ కోసం ప్రాణాన్నైనా అర్పించాలి. కొన్ని రాజ్యాలలో నిర్బంధ సైనిక సేవ అమలులో వుంది.

**12.9. 4. పన్నుల చెల్లింపు :** రాజ్యపాలనా యంత్రాంగానికి ధనం ఇంధనం వంటిది. ప్రజా సంక్షేమ కార్యకలాపాలను చేపట్టడానికి, రాజ్య సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పనిచేస్తున్నపుడు పౌరులు చెల్లించే పన్నులు, సుంకాలు, శిస్తులు ప్రభుత్వానికి ఉపయోగపడతాయి. అందుచేత సకాలంలో సక్రమంగా అన్ని పన్నులను చెల్లించడం ఒక చట్టబద్ధమైన విధి.

**12.9. 5. నీతితో ఓటువేయడం :** ప్రజాస్వామ్యరాజ్యంలో వయోజనులకున్న ఓటు హక్కు అంకుశం వంటిది. నిజాయితీతో ఓటు చేయడం పౌరుని విధి. ఓటుహక్కును సక్రమంగా నిర్వర్తించకపోతే అనేక అనర్థాలు జరుగుతాయి. కనుక ప్రతి పౌరుడు ఓటుహక్కును పవిత్రమైన బాధ్యతగా గుర్తించి వివేకంతో విచక్షణా జ్ఞానంతో, చైతన్యంతో, బుద్ధికుశలతతో వినియోగించాలి. అప్పుడే ప్రజాస్వామ్య ప్రభుత్వం విజయవంతమవుతుంది.

**12.9. 6. శాంతిభద్రతలను కాపాడటం :** శాంతిభద్రతలను కాపాడటంలో ప్రభుత్వానికి తోడ్పడటం పౌరుని కర్తవ్యం. ఒక వ్యక్తి నేరం చేసినాడని కాని, చేయబోతున్నాడని కాని తెలిసినా అపరాధ పరిశోధన విషయంలో తనకు తెలిసిన సమాచారాన్ని అధికారులకు అందచేయడం ప్రజల బాధ్యత.

**12.9. 7. ఇతర విధులు :** అనేక పౌర సంఘాలలోను, సంస్థలలోను సభ్యుడుగా పౌరుడు దేశసేవ చేయాలి. ప్రతి పౌరుడు సామాజిక చైతన్యాన్ని పెంపొందించుకొని, ప్రజా సేవపట్ల ఆసక్తిని కల్గియుండి స్వప్రయోజనాలకంటే సమాజ సేవకే ప్రాముఖ్యతనీయాలి. యుద్ధం, అంతర్యుద్ధం, కరువు కాటకాలు, వరదలు, తుఫానులు మొదలగు ప్రకృతి వైపరీత్యాలు సంభవించి జనజీవనం అస్తవ్యస్తమైనపుడు పౌరుడు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బాధితులకు సేవచేయాలి. సత్‌పౌరుల లక్షణాలను పెంపొందించుకోవాలి.

## 12.10. హక్కులు, విధుల మధ్య సంబంధం

హక్కులు వ్యక్తి పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి సమాజం కల్పించే సాంఘికావకాశాలే. వ్యక్తి ఇతరుల పట్ల నిర్వర్తించాల్సిన ధర్మాలను బాధ్యతలు లేదా విధులంటారు. హక్కులు, విధుల మధ్య సన్నిహిత సంబంధముంది. అవి ఒకే నాణానికి గల రెండు ముఖాలవంటివి. హక్కును అనుసరించి ఒక బాధ్యత ఉంటుంది. అదేవిధంగా రెండూ సామూహిక జీవన ఫలితాలే. ఉదాహరణకు, వ్యక్తికున్న ఆస్తిహక్కు సాంఘిక హితానికి లోబడి ఆస్తిని సంపాదించుకోవడానికి, అనుభవించడానికి, వారసులకు సంక్రమింపచేయడానికి అవకాశం కల్పిస్తుందని అర్థం. అదే సమయంలో ఇతరులకు కూడా అదేవిధమైన హక్కు ఉందని గ్రహించి, వారు ఆస్తిని కలిగి ఉండేందుకు తాను అడ్డుకారాదనే బాధ్యత కూడా తనపై ఉందని గమనించాలి. హక్కులు, విధుల మధ్య సంబంధాన్ని ఈ క్రింది కోణాలనుంచి పరిశీలించవచ్చు.

i. సాంఘిక ప్రగతికి దోహదం చేసే విధంగా పౌరుడు తన హక్కులను అనుభవించడం అతని ప్రధానమైన విధి. సమాజ సంక్షేమానికి హానికలుగని విధంగా పౌరులు హక్కులను అనుభవించాలి. పౌరుని హక్కులకు, సాంఘికశ్రేయస్సుకు మధ్య ఘర్షణ తలెత్తరాదు. వ్యక్తి సుఖసంతోషాలను, వృద్ధిచేయడమే సంఘజీవన ధ్యేయం. ఇతరుల క్రమబద్ధమైన జీవనానికి ఆటంకం కలగని పరిస్థితుల్లోనే వ్యక్తి హక్కులకు ప్రయోజకత్వం వుంటుంది. దాదాపు ఆధునిక ప్రజాస్వామిక దేశాలన్నింటిలోను పౌరులు మత స్వాతంత్ర్యపు హక్కును కలిగియున్నారు. అదే సమయంలో, ఇతరుల మతస్వేచ్ఛా హక్కును గౌరవిస్తూ నడుచుకోవడం ప్రతి పౌరుని విధికూడా.

ii. తోటి పౌరుల హక్కులను గుర్తించి, తదనుగుణంగా ప్రవర్తించడం పౌరులందరి విధి. అంటే ఇతరుల హక్కుల పరిధిలోనికి జోక్యం కలిగించుకోకపోవడం అన్నమాట. ప్రతిఒక్కరు తమహక్కులను స్వేచ్ఛగా, సంపూర్ణంగా అనుభవించడానికి ఇట్లాంటి రక్షణ కల్పించడం అవసరం. ఉదాహరణకు, వ్యక్తి ఆస్థి హక్కును కలిగి ఉన్నాడంటే ఇతరులెవ్వరూ అతని హక్కు విషయంలో జోక్యం కల్పించుకోకపోవడమే కాక, దానిని సంరక్షించడం, గౌరవించడం, సమర్థించడం లేదా దూరంగా ఉండటం వారి విధి. ఒకరి హక్కుల్లో అనవసరంగా జోక్యం చేసుకుంటే, మనం మన హక్కులను స్వేచ్ఛాయుత పరిస్థితుల్లో అనుభవించలేము.

iii. హక్కులున్న ప్రతివ్యక్తి ఇతరులపట్ల కొన్ని నిర్దిష్ట ప్రమాణాలను పాటించాలి. అది అతని విధి. పౌరులు హక్కులన్నీ తన బాధ్యతలని, తన హక్కులు ఇతరుల బాధ్యతలనీ గ్రహించాలి. హక్కులు, విధులు పరస్పర పోషకాలన్న వాస్తవాన్ని సమాజంలోని ప్రతి సభ్యుడూ తెలుసుకోవాలి. హక్కుల్లోనే బాధ్యతలు ఇమిడి వున్నాయి. బాధ్యతలు, హక్కులపైగల నిర్బంధాలని చెప్పవచ్చు. ఈ ఆంక్షలు లేకుండా ప్రజాజీవనం సాధ్యం కాదు.

హక్కులకు, విధులకు ఈ విధంగా సన్నిహిత సంబంధముంది. హక్కులు లేని విధులు నిరర్థకమైనవి. అట్లాంటి విధులు మనిషి సృజనాత్మక ఆలోచనలను, ఆసక్తిని కార్యకలాపాలను నాశనంచేస్తాయి. మానవుడు బానిస కావడానికి దారితీస్తాయి. అదేవిధంగా, బాధ్యతలు లేకుండా హక్కులను మనం ఊహించలేము. ఆంక్షలు, నిర్బంధాలు, షరతులులేని హక్కులు వ్యక్తులను స్వార్థపరులుగా, బాధ్యతారహితులుగా, అవిధేయులుగా, అహంకారులుగా మారుస్తాయి. కనుక హక్కులు లేని విధులు, విధులు లేని హక్కులు వాస్తవంలో సాధ్యం కావు. వీని మధ్య సంబంధమును మనిషికి, అతని నీడకుగల అవినాభావ సంబంధంతో పోల్చవచ్చు. మానవ శరీరం నుండి అతని నీడను ఎట్లా వేరుపరచలేమో, అట్లే హక్కులను, విధులను విభజించలేము. హక్కులు, విధులు సమాజంలో శాంతిభద్రతలను నెలకొల్పుతాయి. అవి మానవ ప్రవర్తనను నియంత్రిస్తాయి. హక్కుల వల్ల వ్యక్తి కార్యకలాపాలు అనేక రంగాలకు విస్తరిస్తాయి. విధులు వ్యక్తి హక్కులపై కొన్ని పరిమితులను విధిస్తాయి. సమాజంలో రెండూ ఆవశ్యకాలే. వ్యక్తి, సమాజం అభివృద్ధి చెందడానికి, ఔన్నత్యాన్ని సాధించడానికి రెండూ పూర్వావసరాలని చెప్పవచ్చు. హక్కులు, విధుల మధ్య సంబంధం వృక్షానికీ, శాఖలకు గల సంబంధంతో పోల్చవచ్చు. వృక్షంతో సంబంధం లేకుండా శాఖలకు స్వతంత్ర్య జీవనం అసాధ్యం. అదేవిధంగా బాధ్యతలు హక్కులు విడివిడిగా మనలేవు.

## 12.12. సారాంశము

హక్కుల ద్వారానే మానవుడు స్వేచ్ఛ పొందగలడు. రాజ్యములోని స్వేచ్ఛ స్థాయిని పరిశీలించడానికి హక్కులు తోడ్పడతాయి. సమాజంలో అనేక శతాబ్దాలుగా అణచివేతకు గురైన ప్రజలు క్రమక్రమంగా చైతన్యవంతులు కావటంతో హక్కుల ప్రాధాన్యత యింకా పెరుగుతున్నది. ఐక్యరాజ్యసమితి హక్కుల ప్రాముఖ్యత గుర్తించి 1948 డిశంబర్ 10 న "మానవ హక్కుల ప్రకటన" చేసింది. అయితే భారత దేశం వంటి కొన్ని దేశాలలో రాజ్యాంగమునందు ప్రకటించిన హక్కులు సామాన్య ప్రజలకు అందుబాటులోకి రావటంలేదు. వివిధ రకాల హక్కులు, వాటి ప్రాముఖ్యతను అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాలి.

### అభ్యాసాలు

**I. వ్యాస ప్రశ్నలు :**

1. హక్కులను వర్గీకరింపుము. 2. హక్కులలోనే విధులు ఇమిడి ఉన్నవి - చర్చించుము.

**II. సంక్షిప్త వ్యాస ప్రశ్నలు :** 1. హక్కుల సిద్ధాంతాలను వివరింపుము.

2. పౌరుడి విధులను తెలుపుము. 3. పౌరుడి "చట్టబద్ధమైన హక్కులు" అనగానేమి?

**III. కుశాగ్రబుద్ధి ప్రశ్నలు**

1. గుర్తించబడిన హక్కులని బట్టి రాజ్య స్వభావం తెలుసుకోవచ్చని .................................. చెప్పెను.
2. రాజకీయ హక్కులలో ................................................. ఒకటి.
3. ......................... లోనే విధులు ఇమిడి ఉన్నవి. 4. ................................. ఒకే నాణెమునకున్న బొమ్మ, బొరుసుల వంటివి.
5. ఐక్యరాజ్య సమితి ............................ సం.లో మానవ హక్కుల ప్రకటన చేసెను.

పాఠం -13

# న్యాయ భావన - చట్టబద్ధ, రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయం

## 13.0. లక్ష్యం

రాజనీతిశాస్త్ర అధ్యయనంలో ఒక ప్రధాన సిద్ధాంతంగా భావించబడుతున్న "న్యాయ భావన" ను వివరించడం, ఆధునిక సమాజాలలో ప్రజలు కోరుకొంటున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయాలను వివరించటం.

## 13.1 విషయక్రమం


13.2. ఆధునికకాలము - న్యాయము

13.3. చట్టబద్ధ న్యాయము

13.4. రాజకీయ న్యాయము

13.5. సామాజిక న్యాయము

13.6. ఆర్థిక న్యాయము

13.7. సారాంశము


రాజనీతి అధ్యయనంలో న్యాయసిద్ధాంతం చాలా ముఖ్యమైంది. "జస్టిస్" అనే ఆంగ్లపదము దీనికి మూలము. ఆంగ్లభాషలో "జస్టిస్" అన్న పదానికి నాయ్యం, ధర్మం అన్న తెలుగు పదాలు వాడుతూ వుంటారు. రెండింటిలో న్యాయమన్న పదమే ఆధునిక కాలంలో వాడబడుతున్నది. మారుతున్న పరిస్థితులను బట్టి న్యాయ సిద్ధాంతము కూడా అనేక మార్పులకు గురైంది. నిన్నటి దాకా అంగీకరించబడిన న్యాయము నేడు అన్యాయము కావచ్చు. నిన్నటిదాకా అన్యాయము అని భావించినది నేడు న్యాయము కావచ్చు. గ్రీకుల కాలము నుండి న్యాయభావన అమలులో వున్నప్పటికి దీని అర్థం అన్ని కాలాలలో ఒకే విధంగా లేదు. సమాజములో వున్న విలువలపై న్యాయ భావన ఆధారపడి ఉంటుంది.

గ్రీకుల కాలమునుండి నేటి వరకు రాజనీతి తత్త్వవేత్తలు న్యాయాన్ని రకరకాలుగా నిర్వచించారు. గ్రీకు తత్త్వవేత్తలు న్యాయభావన గురించి మొట్టమొదట సమగ్రంగా చర్చించారు. ప్లేటో రిపబ్లిక్ గ్రంధంలో న్యాయాన్ని గురించి వివరించాడు. కెఫాలస్, పాలిమార్కస్, త్రాసి మార్కస్, గ్లాకన్ మొదలైన వారు సమకాలీన, సాంప్రదాయక భావాలను చర్చించి తరువాత న్యాయముపై తన భావాలను వెల్లడించారు. రాజ్యములో ప్రతి ఒక్కరు తమకు నిర్దేశించిన పనులు చేస్తూ ఇతరుల పనులలో జోక్యము కలిగించుకోకుండా ఉండటాన్ని ప్లేటో న్యాయంగా భావించాడు. రోమన్ తత్త్వవేత్తలు న్యాయాన్ని అత్యున్నత శాసనానికి కట్టుబడిన నిశ్చయాత్మక శాసనంగా వర్ణించారు. వివాదాలు, సంఘర్షణలు లేకుండా వుండి మానవుడికి దేవుడికి మధ్య సరైన సమన్వయము ఏర్పడటాన్ని న్యాయముగా థామస్ అక్వినాస్ భావించాడు. యూరప్ ఖండములో సాంస్కృతిక పునర్జీవనము వచ్చిన తరువాత న్యాయ సిద్ధాంతానికి లౌకిక భావన ఏర్పడింది. థామస్ హబ్స్, రూసో, గ్రోషియస్ మొదలైన వారు సహజన్యాయము గురించి ప్రస్తావించారు.

## 13.2. ఆధునిక కాలము - న్యాయము

న్యాయ భావనను ఆధునిక కాలంలో మౌలికముగా రెండు రకాలుగా వర్గీకరించారు. ఒకటి, వివాదాలు ఉత్పన్నమయినప్పుడు న్యాయ స్థానాల ద్వారా బాధితులకు న్యాయము ార్చటం, రెండవది ఆధునిక రాజ్యములో నివసించే ప్రజలకు వివిధ రంగాలలో వారికి

చెందవలసిన సౌకర్యాలను కల్పించటం. మొదటిది చట్టబద్ధ న్యాయముగా భావించబడితే, రెండవ దానిని ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయాలుగా భావిస్తున్నారు.

18, 19 శతాబ్దాలలో ఆధునిక ప్రజాస్వామ్యం అభివృద్ధి చెందిన తరువాత ఆర్థిక, సాంఘిక, రాజకీయ న్యాయాలకు ప్రాముఖ్యత ఏర్పడింది. 1776లో జరిగిన అమెరికన్ విప్లవం, 1789లో జరిగిన ఫ్రెంచి విప్లవం, 1917లో జరిగిన రష్యన్ విప్లవం వీటి ప్రాధాన్యతను మరింత పెంచాయి. స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం నినాదాలు ఫ్రెంచి విప్లవానికి ప్రాతిపదిక కాగా, ఆర్థిక సాంఘీక న్యాయం, రష్యన్ విప్లవానికి ప్రాతిపదిక అయింది. ఆధునిక కాలములో అన్ని దేశాలు తమ రాజ్యాంగాలలో ఆర్థిక, సాంఘిక, రాజకీయ, న్యాయాలకు ప్రాధాన్యత యిస్తున్నాయి. న్యాయ భావాలను క్రింది విధంగా వివరించవచ్చు.

## 13.3. చట్టబద్ధ న్యాయము

వ్యవహారిక భాషలో న్యాయము అంటే నిర్ణయాత్మకమైక చట్టాలను అమలుపరచటం. శాసన శాఖ రూపొందించిన చట్టాలను కార్యనిర్వాహక వర్గం అమలు చేస్తుంది. వీటికి సంబంధించి ఏర్పడిన వివాదాలను పరిష్కరిస్తున్నప్పుడు న్యాయ స్థానాలు చట్టాలను వ్యాఖ్యానిస్తాయి. అందువలననే న్యాయ భావనకు చట్టాలకు సన్నిహిత సంబంధం కలదని చెప్పవచ్చు. సమాజము అంగీకరించిన సామాజిక, రాజకీయ, నైతిక, సాంస్కృతిక విలువలను చట్టం ప్రతిబింబిస్తుంది. చట్టము యొక్క ప్రాధాన్యత సామాజిక శ్రేయస్సు దృష్ట్యా అది ప్రాతినిధ్యం వహించే సామాజిక, నైతిక శక్తులపై ఆధారపడి వుంటుంది.

న్యాయాన్ని కాపాడే సందర్భములో న్యాయస్థానాలు కొన్ని దేశాలలో న్యాయ సమీక్ష అధికారాన్ని కూడా ఉపయోగిస్తాయి. ప్రభుత్వం చేసిన చట్టాలు రాజ్యాంగానికి, న్యాయానికి విరుద్ధముగా వున్నాయని న్యాయస్థానాలు భావించినట్లయితే, ఆ చట్టాలు చెల్లవు అని చెప్పే అధికారము న్యాయస్థానాలకు ఉంటుంది. ఈ విధంగా న్యాయస్థానాలు యిచ్చే తీర్పుల ద్వారా నిశ్చయాత్మక న్యాయానికి ప్రాముఖ్యత ఏర్పడుతుంది.

## 13.4. రాజకీయ న్యాయము

రాజకీయ న్యాయభావన ఆధునిక కాలంలో రూపొందింది. ఐరోపా ఖండంలోని వివిధ దేశాలలో రాజకీయ విప్లవాలు జరిగిన తరువాత ఈ భావనకు ప్రాధాన్యత ఏర్పడింది. రాజకీయ న్యాయం ప్రజలకు రాజకీయ కార్యకలాపాలలో స్వేచ్ఛాయుతమైన భాగస్వామ్యాన్ని కల్పించటానికి ఉద్దేశించబడింది. ఓటు హక్కు ప్రాథమిక హక్కులు, రాజకీయ పార్టీల స్థాపన, ప్రభుత్వ కార్యకలాపాలలో పాల్గొనే అవకాశం, ఎన్నికలలో పోటీ చేసే హక్కు మొదలైనవి ప్రజలందరికీ కల్పించటం రాజకీయ న్యాయంతో ముడిపడి వుంది. ప్రభుత్వ ఉద్యోగాలలో ఎటువంటి విచక్షణ లేకుండా అందరికి అవకాశం కల్పించటం కూడా రాజకీయ న్యాయంలో ముఖ్యాంశంగా చెప్పవచ్చు. ఆధునిక ప్రజాస్వామ్య దేశాలలో ఆర్థిక, రాజకీయ, విద్య, వైజ్ఞానిక సాంస్కృతిక రంగాలలో ప్రభుత్వ విధానాలను ప్రజలే నిర్ణయించవలసి వుంటుంది. ఈ నిర్ణయాలు చేసే హక్కు ప్రజలకు రాజకీయ న్యాయం ద్వారానే లభిస్తుంది.

వ్యక్తిత్వ వికాసం, వ్యక్తిత్వ అభివృద్ధి, పౌరుడికి సామాజిక కార్యకలాపాలలో పాల్గొనేటట్లు చేయటానికిగల అవకాశాలు రాజకీయ పౌరహక్కుల ద్వారా, రాజ్యాంగంలో కల్పించాలి. అప్పుడే రాజకీయ న్యాయం సార్థకమవుతుంది. ఉదా :- భారత రాజ్యాంగములో ప్రజలకు రాజకీయ న్యాయము ప్రాథమిక హక్కుల ద్వారా, రాజ్యాంగ పీఠిక ద్వారా కల్పించారు.

## 13.5. సామాజిక న్యాయము

ఆధునిక కాలములో అభివృద్ధి చెందిన ఉదారవాద సిద్ధాంతాలు సామాజిక న్యాయభావనకు దారితీసాయి. సంక్షేమ రాజ్యభావన రూపొందిన తరువాత సామాజిక న్యాయం ప్రాధాన్యత వహించే అంశముగా తయారు అయింది. రాజ్యాంగము ద్వారా పౌరులకు రాజకీయ, పౌర హక్కులు కల్పించినప్పటికి అట్టడుగునుండే ప్రజలు వీటిని ఉపయోగించుకోలేకపోతున్నారు. అందువలన సామాజిక న్యాయము సమాజములో అన్ని వర్గాల వారికి న్యాయము జరగాలని కోరుతుంది.

సమాజములోని అన్ని తరగతుల ప్రజలకు న్యాయము జరగటానికి అవసరమయిన సామాజిక వ్యవస్థను ఏర్పరచటానికి సామాజిక న్యాయం ప్రయత్నిస్తుంది. అమెరికా అగ్రరాజ్యముగా ఎదిగినప్పటికి ఆ దేశములోని నల్లజాతి ప్రజలు సామాజిక అణచివేతకు గురవుతూనే

వున్నారు. దక్షిణాఫ్రికాలో నల్లజాతి ప్రజల పట్ల జాతివిచక్షణా విధానం అమలు జరుగుతున్నది. భారత దేశంలో హరిజనులు నేటికీ సామాజిక అణచివేతకు గురవుతూనే వున్నారు. సామాజిక న్యాయం ద్వారా మాత్రమే వీరిని అభివృద్ధి చేయటానికి అవకాశం వుంటుంది. మన దేశములో సామాజిక న్యాయం కోసం ఆదేశిక సూత్రాలలో అనేక అంశాలను పొందుపరిచారు. బలహీన వర్గాలకు ఉద్యోగ, విద్యావకాశాలను కల్పిస్తున్నారు. సామాజికముగా అణగత్రొక్కబడిన ప్రజలకోసం అనేక అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నారు.

## 13.6. ఆర్థిక న్యాయము

సామాజిక న్యాయానికి సన్నిహితమైనది ఆర్థిక న్యాయము. ఈ రెండింటికి సన్నిహిత సంబంధము వున్నది. ఆర్థిక సమానత్వము లేకుండా సామాజిక న్యాయం సాధ్యంకాదు. సామాజిక న్యాయం జరుగకుండా ప్రజలు ఆర్థికంగా ముందడుగు వేయలేరు. 19, 20 శతాబ్దాలలో జరిగిన అనేక రాజకీయ విప్లవాలు, పారిశ్రామిక విప్లవం తరువాత అభివృద్ధి చెందిన భావనలలో ఆర్థిక న్యాయం ఒకటి. ఆర్థిక న్యాయం యొక్క ముఖ్య ఉద్దేశ్యము సామాన్య ప్రజలు వారి శ్రమకు తగిన ప్రతిఫలం పొందటం, ప్రజల మధ్య ఆర్థిక తారతమ్యాలు కనీస స్థాయిలో వుండటం, అన్ని రకాల అవకాశాలు ప్రజలందరికీ అందుబాటులో వుండేలా చూడటం. నేటి శాస్త్రపారిశ్రామిక వైజ్ఞానిక యుగంలో న్యాయం ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. దేశాలు సంక్షేమ దృక్పథంతో ఆర్థిక వ్యవస్థను రూపొందించి ప్రజలకు జీవనోపాధి అవకాశాలు కల్పించి వారి జీవన స్థాయిని పెంపొందించటమే ఆర్థిక న్యాయం యొక్క ముఖ్య లక్ష్యము.

## 13.7. ముగింపు

రాజకీయ, సామాజిక, ఆర్థిక అసమానతలు సామాజిక శక్తుల ప్రేరణయే కాని ప్రకృతి సిద్ధమైనవి కావన్న విషయం ఆధునిక యుగంలో అందరూ అంగీకరిస్తున్న విషయం. ఈ అసమానతలను పూర్తిగా తొలగించలేక పోయినా న్యాయభావన ద్వారా కొంతవరకు తగ్గించటానికి అవకాశం ఉంది. అందుకే అనేక ఆధునిక రాజ్యాలు ఆర్థిక, సాంఘిక, రాజకీయ న్యాయ భావనను తమ రాజ్యాంగాలలో ఇముడ్చుకుని ఆ దిశగా కృషి చేస్తున్నాయి.

### అభ్యాసాలు

I. వ్యాస ప్రశ్నలు :

1. ఆధునిక కాలంలో ఆర్థిక, సాంఘిక, రాజకీయ న్యాయ ప్రాధాన్యతను పరిశీలించండి.

II. సంక్షిప్త వ్యాస ప్రశ్నలు :

1. చట్టబద్ధ న్యాయమును చర్చించుము.
2. ఆర్థిక న్యాయం గురించి వివరించుము.
3. సాంఘిక న్యాయం గురించి వ్రాయుము.
4. రాజకీయ న్యాయం గురించి వివరించండి.

III. కుశాగ్రబుద్ధి ప్రశ్నలు

1. "న్యాయం" అనే పదం ........................................ అను ఆంగ్లపదం నుండి ఆవిర్భవించింది.
2. ........................................ శతాబ్దాలలో ఆధునిక ప్రజాస్వామ్యం అభివృద్ధి చెందింది.
3. .................................. బట్టి న్యాయ సిద్ధాంతము అనేక మార్పులకు గురైంది.
4. న్యాయ భావనను .................................. మొట్టమొదట సమగ్రంగా చర్చించారు.
5. సామాజిక న్యాయానికి సన్నిహితమైనది .................................. న్యాయము.

పాఠం - 14

# ప్రభుత్వ రకాలు - రాజరిక, కులీన, ప్రజాస్వామ్య ప్రభుత్వాలు

## 14.0. లక్ష్యం

ప్రాచీన కాలంనుండి నేటి వరకు మారుతూ వస్తున్న ప్రభుత్వ రూపాలను తెలుసుకోవడం, ఆధునిక కాలానికి అనుగుణ్యమైన ప్రభుత్వాలను గురించి చర్చించటం పాఠం యొక్క ముఖ్య లక్ష్యం.

**14.1 విషయక్రమం**

14.2. అరిస్టాటిల్ ప్రభుత్వ వర్గీకరణ

14.3. డా. లీకాక్ వర్గీకరణ

14.4. డా. సి. ఎఫ్. స్ట్రాంగ్ వర్గీకరణ

14.5. రాజరికము

14.6. కులీన పాలన

14.7. సారాంశము

ప్రజా సంక్షేమాన్ని సాధించటమే రాజ్య లక్ష్యాలు ప్రభుత్వం అనే సాధనం ద్వారా రాజ్యం దాని లక్ష్యాలను సాధిస్తుంది. అన్ని సమాజాలలో రాజ్యం ఒకే విధంగా వుంటుంది. కాని రాజ్య సాధనమైన ప్రభుత్వం దేశ దేశానికి మారుతూ ఉంటుంది. రాజ్యాధికారాన్ని రాజ్యములో ఎవరూ, ఏ విధముగా వినియోగిస్తారు అనేది ఆ రాజ్యములో వున్న ప్రభుత్వ స్వరూప స్వభావాలపై ఆధారపడి వుంటుంది. అరిస్టాటిల్ నుండి నేటి వరకు అనేక మంది శాస్త్రజ్ఞులు అనేక విధాలుగా వర్గీకరించారు.

## 14.2. అరిస్టాటిల్ ప్రభుత్వ వర్గీకరణ

ప్రభుత్వ వర్గీకరణపై అరిస్టాటిల్ వెలిబుచ్చిన అభిప్రాయాలు వాస్తవంగాను, హేతుబద్ధం గాను వున్నాయి. ఆయన 158 సమకాలీన రాజ్యాంగాలను క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వాలను వర్గీకరించాడు. అరిస్టాటిల్ వర్గీకరణ రెండు సూత్రాలపై ఆధారపడి వుంది.

ఒకటి ఉన్నత అధికారాన్ని నిర్వహించే వారి సంఖ్య, రెండు ఉన్నతాధికారం ఏ ఆశయం పై ఆధారపడి వున్నది అనే అంశంపై.

| రాజ్యాధికారం నిర్వహించే వారి సంఖ్య | రాజ్య లక్ష్యం ప్రజాక్షేమం సహజరూపం - (Normal Form) | రాజ్య లక్ష్యం - పాలకుల సంక్షేమం వికృతరూపం (Perverted form) |
|---|---|---|
| ఎ) ఒక వ్యక్తి పరిపాలన | రాజత్వము (Monarchy) | క్రూర ప్రభుత్వము (Tyranny) |
| బి) కొద్దిమంది పాలన | కులీన పాలన (Aristocracy) | అల్పజన దుష్టపాలన (Oligarchy) |
| సి) అనేకమంది పాలన | పాలిటీ - ప్రజారాజ్యం (Polity) | ప్రజాస్వామ్యము (Democracy) |

ఒక వ్యక్తి ప్రజాక్షేమం కోసం పరిపాలన సాగిస్తే ఆ విధానాన్ని రాజత్వము అంటారు. రాజు ప్రజాక్షేమాన్ని విస్మ
పీడించడం మొదలుపెడితే అది క్రూర ప్రభుత్వం అవుతుంది. అటువంటప్పుడు ప్రజలు తిరుగుబాటు చేసి, రాజును తు ది
అధికారం సమర్థులైన కొద్దిమందికి అప్పగిస్తారు. ఈ మేధావుల పరిపాలనను కులీన పాలన అంటారు. అయితే వారు కూడా చివరకు స్వార్థపరులుగా మారితే ప్రజలు పూర్తి అధికారం తామే చేపడతారు. ఆ విధంగా ప్రజా రాజ్యాలు ఏర్పడతాయి. అధికారం అనేకమంది చేతులలో ఉంచినా అందరూ మూకుమ్మడిగా అధికార దుర్వినియోగానికి పాల్పడితే ఏర్పడే ప్రభుత్వమే ప్రజాస్వామ్యము అని అరిస్టాటిల్ భావించాడు. ఇక్కడ చరిత్ర పునరావృతం అవుతుంది అని తిరిగి రాజరికాలు తలెత్తుతాయని అతడు అభిప్రాయపడ్డాడు.

ఇతర వర్గీకరణ : ఈ మధ్యకాలం దాకా అరిస్టాటిల్ సూచించిన ప్రభుత్వాల వర్గీకరణ ప్రాథమికమైనదిగా భావించబడింది. కాని ప్రభుత్వ పరిణామంలో నూతన ప్రక్రియలు తలెత్తడంతో ఆధునిక రచయితలు తదనుగుణంగా ప్రభుత్వాల వర్గీకరణకు కొత్త మార్గాలు అన్వేషించారు. వారిలో డా. లీకాక్ (Dr. Leacock) డా. సి.ఎఫ్ స్ట్రాంగ్ (Dr. C.F. Strong) మొదలైన వారు ముఖ్యులు. వారు సూచించిన వర్గీకరణను ఈ క్రింది పట్టికలు వివరిస్తాయి.

## 14.3. డా. లీకాక్ వర్గీకరణ :

ఎ) నియంతృత్వాలు : నియంతృత్వ ప్రభుత్వాలు నిరపేక్షమైనవి. వీటిలో నియంత స్వప్రయోజనాలకు మినహా ప్రజాశ్రేయస్సుకు ప్రాధాన్యమివ్వడు. అతడు ప్రజలకు బాధ్యత వహించడు. ఇటువంటి ప్రభుత్వాలు 20 వ శతాబ్ది ప్రారంభంలో రష్యా, టర్కీ, ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్‌లలో ఉండేవి. నేటికీ నేపాల్, మొరాకో, సౌదీ అరేబియాలో రాజులు చాలా శక్తిమంతులు. ఇరాన్ రాజు షా పరిపాలన, ఉగాండా సైనిక నియంత అమీన్ పరిపాలన ఈ మధ్యనే అంతమైనవి.

బి) పరిమిత రాజరిక ఏక కేంద్ర పార్లమెంటరీ విధానం : దీనిలో రాజుకు పరిమితాధికారాలు ఉంటాయి. అతడు నామమాత్రపు కార్యనిర్వాహకుడు. నిజమైన అధికారాలు కాబినెట్‌కు ఉంటాయి. దీనిలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మధ్య అధికారాల పంపిణీ ఉండదు. కేంద్రము బలమైనది. ప్రాంతీయ ప్రభుత్వాలు దానికి లోబడి పనిచేస్తాయి. ఇటువంటి విధానము బ్రిటన్, డెన్మార్క్, జపాన్, నార్వే, స్వీడన్‌లలో ఉంది.

సి) పరిమిత రాజరిక, ఏక కేంద్ర అధ్యక్ష పాలనా విధానము : దీనిలో అధ్యక్షుడు నిజమైన అధికారాలు అనుభవిస్తాడు. ఇటువంటి ప్రభుత్వాలు 1914 కు ముందు ప్రష్యా (Prussia) లోను 1919 కి ముందు సెర్బియా (Serbia) లోను ఉండేవి.

డి) పరిమిత రాజరిక, సమాఖ్య, పార్లమెంటరీ విధానము : దీనిలో అధికారులు కాబినెట్ చేతిలో ఉంటాయి. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పంపిణీ జరుగుతుంది. ఈ పద్ధతి ఆస్ట్రేలియా, కెనడాలలో ఉంది. ఆ రాజ్యాలు నేటికీ బ్రిటీష్ రాణికి విధేయత చూపుతాయి.

ఇ) గణతంత్ర, ఏకకేంద్ర, పార్లమెంటరీ విధానము : దీనిలో రాజ్యాధినేత ప్రజా ప్రతినిధి. అతడు నామమాత్రపు అధికారి. నిజమైన అధికారాలు కాబినెట్ అనుభవిస్తుంది. పరిపాలన అంతా ఒకే కేంద్రం నుంచి నిర్వహించబడుతుంది. ఇటువంటి ప్రభుత్వం ఫ్రాన్స్‌లో ఉంది.


ఎఫ్) పరిమిత రాజరిక, సమాఖ్య అధ్యక్ష పాలనా విధానము : ఈ విధానము 1914 కు ముందు జర్మన్, ఆస్ట్రియా, హంగేరీలలో ఉండేది.

జి) గణతంత్ర, ఏక కేంద్ర, అధ్యక్ష పాలనా విధానము : ఈ పద్ధతి బోలివియా, చిలి, క్యూబా, కోస్టారికా, పనామా రాజ్యాలలో ఉంది.

హెచ్) గణతంత్ర, సమాఖ్య, పార్లమెంట్ విధానము : ఇండియాలోను, పశ్చిమ జర్మనీలోను ఉన్న పద్ధతి ఇటువంటిదే. కాని ఇండియాలో ప్రభుత్వానికి సమాఖ్య లక్షణాలతోపాటు ఏక కేంద్ర లక్షణాలు కూడా ఉన్నాయి.

ఐ) గణతంత్ర, సమాఖ్య, పాలనా విధానము : అమెరికా సంయుక్త రాష్ట్రాలు, బ్రెజిల్, మెక్సికో, స్విట్జర్లాండ్‌లలో ఇటువంటి పాలనా విధానం ఉంది.

## డా. లీకాక్ వర్గీకరణ




పై వర్గీకరణలో ఆధునిక ప్రభుత్వాలకు సంబంధించిన అన్ని లక్షణాలు లేవు. ఆధునిక రాజ్యాలను వాటి వేరువేరు లక్షణాలను బట్టి డా. సి. యఫ్. స్ట్రాంగ్ ఈ క్రింది విధంగా వర్గీకరించారు.

## 14.4. డా. సి. ఎఫ్. స్ట్రాంగ్ వర్గీకరణ

| | | |
|---|---|---|
| 1) ప్రభుత్వ అధికార పరిధిని బట్టి రాజ్య విభజన | వ్యక్తి స్వేచ్ఛను ప్రోత్సహించే రాజ్యాలు ప్రజారాజ్యాలు | వ్యక్తి స్వేచ్ఛ తగ్గించి ప్రభుత్వాధికారాన్ని నిరాటంకంగా పెంచే నియంతృత్వాలు కమ్యూనిస్ట్, ఫాసిస్ట్ రాజ్యాలు |
| 2) రాజ్యాంగ నిర్మాణాన్ని బట్టి విభజన రాజ్య స్వభావాన్ని బట్టి రాజ్యాంగ స్వభావాన్ని బట్టి | ఏక కేంద్ర రాజ్యము అదృఢ రాజ్యాంగమున్న రాజ్యము | సమాఖ్య రాజ్యము దృఢరాజ్యాంగమున్న రాజ్యము |
| 3) నియోజక వర్గాన్ని బట్టి | ఎ) నియోజక ఓటింగ్ ఉన్నది. | పరిమిత ఓటింగ్ ఉన్నది. |
| | బి) ఏకసభ్య నియోజక వర్గం ఉన్న రాజ్యము | బహుసభ్య నియోజక వర్గాలు ఉన్న రాజ్యము |
| 4) ఎ. శాసన సభ స్వభా వాన్ని బట్టి | ద్వంద్వ శాసనసభ ఉన్నది | ఏకశాసనసభ ఉన్నది |
| బి. శాసనసభ నిర్మాణాన్ని బట్టి | కొంతవరకుగాని, లేదా పూర్తిగాగాని ఎన్నుకొన్న సభ్యులున్న ఎగువ సభ ఉన్న రాజ్యాలు | ఎన్నుకొన్న సభ్యులులేని ఎగువసభ ఉన్నరాజ్యాలు |
| 5) కార్యనిర్వాహక వర్గ స్వభావాన్ని బట్టి | పార్లమెంటరీ విధానము లేదా బాధ్యతాయుతపాలన | అధ్యక్షపాలనా విధానం |
| 6) న్యాయ శాఖ స్వభావాన్ని బట్టి | ఏకన్యాయ విధానమున్న రాజ్యాలు | పరిపాలనా న్యాయమున్న రాజ్యా |

పై పట్టికలో ఏ రాజ్యమూ పూర్తిగా "ఎ" వర్గానికి గాని లేదా "బి" వర్గానికి గాని చెంది ఉండదు అనే విషయం స్పష్టమవుతుంది. పైన సూచించిన పట్టికలన్నీ అసంపూర్ణమైనవే. వాటిలో ఒక దానిలో ఉన్న విషయాలు మరొక దానిలో లేవు. నిజానికి ఆధునిక రాజ్యాల లక్షణాలన్నిటిని సవివరంగా సూచిస్తూ, సమగ్రంగా ఉండే ప్రభుత్వాల వర్గీకరణ పటం రూపొందించడం కష్టమే.

ప్రభుత్వాల వర్గీకరణ పద్ధతులు గురించి తెలుసుకోవటమే కాక వాటిలో ముఖ్యమైన కొన్ని ప్రభుత్వ పద్ధతులను గురించి మరికొంత వివరంగా తెలుసుకోవలసి ఉంటుంది.

## 14.5. రాజత్వము లేదా రాజరికము

రాజరిక విధానము చాలా పురాతనమైనది. ప్రజాస్వామ్యాల అవతరణలో ఇవి మరుగున పడినాయి. అయినా నేటికి బ్రిటన్ నేపాల్, భూటాన్, జోర్డాన్, స్వీడన్ మొదలైన రాజ్యాలలో ఇది అమలులో ఉంది. దీనిని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

1) నిరాపేక్ష రాజరికము (Absolute Monarchy)

2) పరిమిత లేదా రాజ్యాంగ బద్ధ రాజరికము (Limited - Constitutional Monarchy)

వీటిలో మొదటి పద్ధతిలో రాజు ఎటువంటి పరిమితులు లేక సర్వాధికారాలు అనుభవిస్తాడు. రెండవ విధానంలో రాజులు రాజ్యాంగంలో చెప్పినట్లు నడుచుకొంటారు. వారికి పరిమితంగా మాత్రమే అధికారాలు ఉంటాయి.

రాజు సమర్థుడైతే దేశాన్ని ప్రజారంజకంగా పాలిస్తాడు. సుసంఘటితమైన ప్రభుత్వానికి, నిర్దిష్టమైన పాలనా విధానానికి రాజరికం అవకాశమిస్తుంది. పార్టీ కుతంత్రాలకు ఇది అతీతమైనది. అధికారం దీనిలో ఒక వ్యక్తి చేతులలో ఉంటుంది. కాబట్టి నిర్ణయాలు త్వరిత గతిని తీసుకొని అమలుపరచవచ్చు. స్థిరమైన ప్రభుత్వం కావడం వల్ల దేశీయ, విదేశాంగ వ్యవహారాలు చక్కగా నిర్వహించవచ్చు. అనాగరిక మానవుని అదుపులో పెట్టడానికి రాజరికమే తగిన పద్ధతి అని జె. ఎస్. మిల్ చెప్పాడు.

అయితే రాజరికంలో లోపాలు లేకపోలేదు. చరిత్రలో సమర్థులైన రాజులను వేళ్ళమీద లెక్కించవచ్చు. రాజు దుష్టుడైతే రాజరికం నియంతృత్వంగా మారుతుంది. అటువంటివారి పరిపాలనలో ప్రజలు బానిసలుగా బతకవలసి వస్తుంది. ఈ పద్ధతిలో వారసత్వం ఆధారంగా పదవి లభిస్తుంది. కాబట్టి అనర్హులు ప్రభువులయ్యే అవకాశముంది. ఒక్కొక్కప్పుడు అరాచకం చెలరేగి నియంతలను గద్దెదించి కొద్దిమంది ప్రజలే అధికారం చేపట్టడం ద్వారా కులీన పాలన ఏర్పడటం కాని లేదా కొత్తవారికి పట్టం కట్టడం కాని జరుగుతుంది.

ఈ మధ్య ఇరాన్‌లో ఇటువంటి విప్లవమే తలెత్తగా ఇరాన్ షా దేశం వదిలి పారిపోయాడు. ప్రజా నాయకుడుగా అయతుల్లా ఖొమేని అధికారం చేపట్టాడు. ఉగాండా సైనిక నియంత ఇడ్డీ అమీన్‌కు కూడా ఇదే గతి పట్టింది. అందుకే నేడు నిరంకుశ రాజరికాలు (నియంతృత్వాలు) అరుదు, ప్రజాస్వామ్యానికి ప్రాముఖ్యముంది.

## 14.6. కులీన పాలన

రాజరికాలలో అధికారం ఒకరి చేతిలో ఉండటం వల్ల అధికార దుర్వినియోగానికి, నియంతృత్వంలో ఆస్కారం ఎక్కువ. కులీన పాలనలో అధికారం కొద్దిమంది యోధులు ఉన్నత వంశస్థులు, మేధావులు, ధనిక వర్గాల వారి చేతులలో ఉంటుంది. వీరి పరిపాలన అన్ని విధాల మానవాభ్యుదయానికి, దేశ ప్రగతికి అనువుగా ఉంటుంది. కులీన పాలనను ఆంగ్లభాషలో అరిస్టాక్రసీ (Aristocracy) అంటారు. ఆ పదం అరిస్టో (Aristo) క్రషియా (Cratia) అనే రెండు గ్రీక్ పదాల నుంచి పుట్టింది. దానికి అర్థం ఉన్నతమైన వ్యక్తుల పరిపాలన అని చెప్పవచ్చు.

ఇటువంటి వారి పరిపాలనలో రాజ్యము అన్ని రంగాలలోను అభివృద్ధి చెందుతుంది. పాలకులు ఉన్నత వంశాలవారు, మేధావులు, సజ్జనులు, అర్హులు, యోధులు అయిన కారణంగా వారు నిస్వార్థంగాను, నిజాయితీగాను పరిపాలన చేస్తారు. అంతేగాక వారి పాలన అన్ని రంగాలలో సమర్థవంతంగా ఉంటుంది.

కులీన పాలనలో కొన్ని ప్రయోజనాలున్నా, ఈ పద్ధతి ప్రజాస్వామ్య విరుద్ధము. ప్రజల మీద అధికారం కొన్ని ప్రత్యేక వర్గాలకు ఉండటం మంచిది కాదు. ఉన్నత వంశంలో జన్మించినంత మాత్రాన, సంపద ఉన్నంత మాత్రాన వ్యక్తులను యోగ్యులు, మేధావులు అని అనలేము.

నిజానికి కులీన పాలన కొంత కాలానికి అల్పజన దుష్టవర్గ పాలనగా మారుతుంది. కులీన పాలనలో పాలకులు రాజకీయ చైతన్యం కలగనీయక తమ ప్రత్యేకతను ఎల్లకాలం కాపాడుకోవడానికి ప్రయత్నిస్తారు. అయితే చివరకు వీరి దుష్టపాలనను ప్రజావిప్లవాలు అంతం చేస్తాయి. ఈ పాలనా పద్ధతులలోని లోపాలన్నిటిని ఆధునిక కాలంలో శాస్త్రీయమైన ప్రజాస్వామ్యాలు తొలగించ గలుగుతున్నాయి. ప్రజాస్వామ్యంలో అధికారం ఏ ఒక్కరి చేతిలో గాని లేదా కొన్ని వర్గాల చేతులలోగాని ఉండక ప్రజలందరికి చెంది ఉండటమే దానిలోని విశేషము.

## 14.7. సారాంశము

గ్రీక్ తత్వవేత్తలు ప్లేటో, అరిస్టాటిల్ నుండి నేటివరకు అనేక మంది రాజనీతి శాస్త్రజ్ఞులు ప్రభుత్వాలను వర్గీకరణ చేసారు. విస్తృత పరిధిలో వీటిని పరిశీలిస్తే ముఖ్యంగా మూడు ప్రభుత్వ రూపాలు - రాజరికం, కులీన పాలన, ప్రజాస్వామ్యం కనబడతాయి. ఆధునిక ప్రపంచంలో ప్రజాస్వామ్య ప్రభుత్వమే ప్రాధాన్యత పొందుతున్నది.

## అభ్యాసాలు

**I. వ్యాస ప్రశ్నలు :**

1. ప్రభుత్వాల వర్గీకరణను తెలుపుము.
2. డా. లీకాక్ వివరించిన ప్రభుత్వాల వర్గీకరణ తెలుపుము.

**II. సంక్షిప్త వ్యాస ప్రశ్నలు :**

1. అరిస్టాటిల్ వర్గీకరణను తెలుపుము.
2. రాజరికము గురించి వ్యాసము వ్రాయుము.
3. కులీన పాలనను వివరింపుము.

**III. కుశాగ్రబుద్ధి ప్రశ్నలు**

1. అరిస్టాటిల్ .......................................... రాజ్యాంగాలను పరిశీలించి ప్రభుత్వాలను వర్గీకరించాడు.
2. ఒక వ్యక్తి ప్రజాక్షేమం కోసం పరిపాలన సాగిస్తే ఆ విధానాన్ని ..................................... అంటారు.
3. అధికారం కొద్దిమంది ఉన్నతుల చేతులలో ఉంటే దానిని ..................................... అంటారు.
4. కులీన పాలన .................................................... విరుద్ధము.
5. ఆధునిక ప్రపంచంలో ..................................... ప్రభుత్వం ప్రాధాన్యత సంతరించుకొంది.

## ఉపయుక్త గ్రంథాలు


1. A.C. Kapoor : Principles of Political Science
2. R.N. Girl Christ : Principles of Political Science

పాఠం - 15

# ప్రజాస్వామ్యము - ప్రత్యక్ష, పరోక్ష ప్రజాస్వామ్యాలు

## 15.0 లక్ష్యం

ఆధునిక ప్రజాస్వామ్య ప్రయోజనాలు, లోపాలు, ప్రజాస్వామ్యం విజయవంతంగా పనిచేయడానికి అనుకూలమైన పరిస్థితులు, ప్రత్యక్ష, పరోక్ష ప్రజాస్వామ్యాలను చర్చించడం.

## 15.1 విషయక్రమం


15.2 ప్రత్యక్ష, పరోక్ష ప్రజాస్వామ్యాలు

15.3 ప్రజాస్వామ్య నిర్వచనాలు

15.4 ప్రజాస్వామ్య సిద్ధాంతాలు

15.5 ప్రజాస్వామ్య ప్రయోజనాలు

15.6 ప్రజాస్వామ్య లోపాలు

15.7 విజయవంతం కావటానికి కావలసిన పరిస్థితులు

15.8 ప్రత్యక్ష ప్రజాస్వామ్య పద్ధతులు

15.9 సారాంశము


మధ్య యుగాల నాటి భూస్వామ్య వ్యవస్థ క్రమేణా క్షీణించడంతో ప్రజాస్వామ్యం అభివృద్ధి చెందింది. ప్రజాస్వామ్య భావన 15 వ శతాబ్దిలో అంకురించి 17, 18 శతాబ్దిలలో అభివృద్ధి చెంది 19 వ శతాబ్దం నాటికి విస్తారముగా ఆచరణలోకి వచ్చింది. ప్రజాస్వామ్యం అభివృద్ధి చెందటానికి అనేక కారణాలు దోహదం చేసాయి. మధ్య యుగాలలో ప్రారంభమైన సహజ హక్కుల సిద్ధాంతం ప్రజాస్వామ్య వ్యవస్థ పెరగడానికి తోడ్పడింది. ప్యూరిటన్ విప్లవం, జాన్ లాక్, రూసో వంటి వారి రచనలు ప్రజాస్వామ్యానికి సిద్ధాంతపరమైన ఆధారాన్ని చేకూర్చాయి. అమెరికా విప్లవం, ఫ్రెంచి విప్లవం, పారిశ్రామిక విప్లవం మొదలైనవి కూడా ప్రజాస్వామ్యం అభివృద్ధి చెందటానికి దోహదం చేసాయి.

అన్ని ప్రభుత్వ రూపాలలోను ఇప్పటివరకు ప్రజాస్వామ్య ప్రభుత్వ రూపమే ఉన్నతమైనదని అనేకమంది రాజనీతి శాస్త్రవేత్తల అభిప్రాయము. "డెమొక్రస్" అనే ఆంగ్లపదం డెమొక్రతియా అనే గ్రీకు పదంనుండి వచ్చినది. డెమొక్రతియా అంటే ప్రజల అధికారము అని అర్థము. పరిపాలనాధికారము ఒక ప్రత్యేకమైన వర్గములో కాక సంఘములో ఉన్న వ్యక్తులందరిలోను ఉండే రాజ్య విధానమే ప్రజాస్వామ్యమని బార్డ్ బ్రైస్ చెప్పారు.

## 15.2 ప్రత్యక్ష పరోక్ష ప్రజాస్వామ్యాలు

ప్రజాస్వామ్యము రెండు రకాలు. ప్రత్యక్ష ప్రజాస్వామ్యము పరోక్ష ప్రజాస్వామ్యము. ప్రత్యక్ష ప్రజాస్వామ్యము విధానంలో ప్రజలే ప్రత్యక్షముగా ప్రభుత్వ విధానాలను నిర్వహిస్తారు. ప్రజలే ప్రభుత్వ విధానాలను నిర్ణయిస్తారు. ఇటువంటి ప్రత్యక్ష ప్రజాస్వామ్యం ప్రాచీన గ్రీకు నగర రాజ్యాలైన ఏథెన్స్, స్పార్టా మొదలైన చోట్ల ఉండేది. కాని అతి పెద్దవైన ఆధునిక రాజ్యాలలో ప్రత్యక్ష ప్రజాస్వామ్యము సాధ్యం కాదు. కాబట్టి ఆధునిక దేశాలలో అమలులో ఉన్న ప్రజాస్వామ్యాన్ని పరోక్ష ప్రజాస్వామ్యం లేక ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం అని పిలుస్తారు. అయితే ఈనాటికి స్విట్జర్లాండ్‌లో కొన్ని రాష్ట్రాలలో ప్రత్యక్ష ప్రజాస్వామ్య పద్ధతులు అమలులో ఉన్నాయి.

## 15.3 ప్రజాస్వామ్యము - నిర్వచనములు

అబ్రహాం లింకన్ : ప్రజల యొక్క ప్రజల కొరకు ప్రజల చేత నడపబడే ప్రజాస్వామ్యము.

జె. ఎస్. మిల్ : ప్రజల తమంతతాముగా గాని లేక తమచే నిర్ణీత కాలానికి ఎన్నుకోబడిన ప్రతినిధుల ద్వారా గాని ప్రభుత్వమును నడిపించినట్లయితే అదే ప్రజాస్వామ్యము.

ప్రొఫెసర్ సీల్ : ప్రభుత్వ అధికారములో ప్రతి ఒక్కరికి భాగస్వామ్యం గల విధానమే ప్రజాస్వామ్యం.

ప్రొఫెసర్ గెటిల్ : రాజ్య సార్వభౌమాధికార ప్రయోగములో జన సముదాయం భాగస్వామ్యాన్ని పొందే హక్కు ఉంటే అది ప్రజాస్వామ్యమౌతుంది.

## 15.4 ప్రజాస్వామ్య సిద్ధాంతాలు

ప్రజాస్వామ్యాన్ని గురించి మేధావుల భావాలను విశ్లేషిస్తూ స్థూలంగా సిద్ధాంతాలు కనబడుతున్నాయి. అవి:

**15.4. 1 ఉదార ప్రజాస్వామ్య సిద్ధాంతం :** ప్రజాస్వామ్యం మూలతత్వాన్ని వివరిస్తూ అనేక సిద్ధాంతాలు ఆవిర్భవించాయి. వాటిలో సాంప్రదాయక ఉదార వాద సిద్ధాంతం ఒకటి. సాధారణంగా పాశ్చాత్య ప్రజాస్వామ్యాలన్నీ ఉదారవాద ప్రజాస్వామ్యాలుగానే గుర్తించబడుతున్నాయి. సంఘ సంక్షేమాన్ని రాజకీయ సమానత్వాన్ని ఈ సిద్ధాంతం నమ్ముతుంది. ఎన్నికయిన ప్రజాప్రతినిధులతో కూడిన శాసన సభల ద్వారా ఏర్పడిన ప్రజాభిప్రాయానికి ఈ సిద్ధాంతం ప్రాధాన్యత నిస్తుంది. ఉదార ప్రజాస్వామ్యవాదులు రాజకీయ సాంఘిక అంశాలకు ఇచ్చిన ప్రాముఖ్యత ఇతర విషయాలకు ఇవ్వరు.

**15.4. 2 శిష్ట ప్రజాస్వామ్య సిద్ధాంతం :** శిష్ట ప్రజాస్వామ్య సిద్ధాంతాన్ని ఆధునిక సామాజిక శాస్త్రజ్ఞులు ప్రతిపాదించారు. ప్రాచీన కాలంలో ఈ సిద్ధాంతం గురించి ప్లేటో చెప్పాడు. ఆధునిక కాలంలో విల్‌ఫ్రెడ్ పారిటో, మొస్కా, రాబర్ట్ మిచెల్స్, జేమ్స్ బెర్న్‌హామ్, రైట్ మిల్స్ మొదలైనవారు దీన్ని ప్రతిపాదించారు. "ది పవర్ ఎలైట్" అనే గ్రంథంలో రైట్ మిల్స్, "ది రూలింగ్ క్లాస్" అనే గ్రంథంలో మోస్కా ఈ సిద్ధాంతం గురించి వివరంగా చెప్పారు. ప్రతి రాజకీయ వ్యవస్థలో పరిపాలనా దక్షత విజ్ఞానం, సైనికాధికారం, నైతికబలం మొదలైన గుణాలు కల కొద్దిమంది శిష్ట జనులు మాత్రమే అధికారాన్ని పలుకుబడిని కలిగి ఉంటారు. వీరు సమాజంలో అత్యున్నత స్థానాలను పొంది నిర్ణయాలు చేస్తారు. అధికారాన్ని, పలుకుబడిని వారిలో వారు పంచుకొంటారు. ప్రజాస్వామ్య సిద్ధాంతాన్ని ఆధునిక పరిస్థితులకనుగుణంగా ఈ సిద్ధాంతం వివరించడానికి ప్రయత్నిస్తుంది.

**15. 4. 3 మార్క్సిస్ట్ సిద్ధాంతం :** మార్క్సిస్ట్ దృక్పథం, పాశ్చాత్య దేశాలలో అమలులో వున్న ప్రజాస్వామ్యం వట్టి బూటకమని అంటుంది. లెనిన్ మాటలలో "అది కొద్దిమంది సంపన్నుల కోసం ఏర్పడిన ప్రజాస్వామ్యం", మార్క్సిస్టులు ఈ ప్రజాస్వామ్యాన్ని 'బూర్జువా ప్రజాస్వామ్యమని' పిలుస్తారు. దీనిలో పెట్టుబడిదారీ వర్గాలు శ్రామిక వర్గాలపై అధికారము చెలాయిస్తూ తమ వర్గ ప్రయోజనాలను కాపాడుకొంటాయి. ప్రజాస్వామ్య ప్రక్రియలు, ఓట్లు వేయడం, తమ ప్రతినిధులను ఎన్నుకోవడం మొదలైన వాటిద్వారా ప్రజలు ప్రభుత్వ వ్యవహారాలలో భాగస్వామ్యం పొందుతున్నారని భ్రమను కల్పిస్తాయి. మార్క్సిస్టుల అభిప్రాయంలో ఆర్థిక సమానత్వం లేని ప్రజాస్వామ్యం నిరర్థకమైంది. సమాజములో ధనిక, పేద తేడాలు ఉన్నంత కాలం ఆర్థిక సమానత్వం అసాధ్యం. సోషలిస్టు వ్యవస్థలో మాత్రమే ప్రజాస్వామ్యం ప్రజలందరికి చెందుతుంది. ఈ వ్యవస్థలో ప్రజలు నిజమైన స్వేచ్ఛా సమానత్వాలు పొందుతారు. ప్రజాస్వామ్య ఫలితాలు ప్రజలందరికి చెందుతాయి. అదే నిజమైన, సంపూర్ణ ప్రజాస్వామ్యము.

## 15. 5 ప్రజాస్వామ్యము - ప్రయోజనాలు

ప్రపంచ చరిత్రలో ఇప్పటి వరకు రూపొందిన ప్రభుత్వ రూపాలలో ప్రజాస్వామ్యము అత్యున్నతమైనదిగా పేర్కొనబడుతుంది. ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించడానికి తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకోవటానికి, పూర్తి విఫలం కావటానికి ఒక ప్రధాన కారణం ప్రజలకు ఆ స్వేచ్ఛ లేకపోవడమే. ప్రజాస్వామ్యము ప్రయోజనాలను క్రింది విధముగా పేర్కొనవచ్చును.

**15.5. 1 సమానత్వనియమము :** ప్రజాస్వామ్యములో ప్రజలందరు సమానులే. జాతి, మత, కుల, వర్గ విచక్షణ లేకుండ పౌరులందరు ప్రభుత్వ నిర్మాణములో పాల్గొనే అవకాశము లభిస్తుంది. అధికార స్థానాలను అధిష్టించే విషయములో ప్రజలందరు సమానముగా పరిగణించబడతారు. ప్రజల్లో కొందరు పాలకులుగా, మరి కొందరు పాలితులుగా జన్మిస్తారు అన్న సూత్రాన్ని ప్రజాస్వామ్యం వ్యతిరేకిస్తుంది. ఉదాహరణకు భారతదేశములో ఎన్నికలలో పోటీ చేయటానికి, ఓటు చేయటానికి కుల, మత, వర్గ విచక్షణ లేకుండా ప్రజలందరూ హక్కును కలిగి వున్నారు.

**15. 5. 2 ఉన్నతాదర్శాలు :** మానవులకు అత్యంత అవసరమైన స్వేచ్ఛ, సమానత్వం, లౌకికత్వం, సౌభ్రాతృత్వం మొదలైన ఉన్నతాదర్శాలు ప్రజాస్వామ్యంలో ఆదరణ పొందుతాయి. ఆధునిక మానవులు ఈ ఆదర్శముల కోసం అనేక ఉద్యమాలను కొనసాగిస్తున్నారు. ఉదాహరణకు నేపాల్, దక్షిణాఫ్రికా, నమీబియా, మైన్‌మార్ మొదలైన దేశాలలో ఇటీవల ప్రజలు జరిపిన, జరుపుతున్న ఉద్యమాలు ఈ ఆదర్శాల కోసమే.

**15. 5. 3 బాధ్యతాయుతమైన ప్రభుత్వము :** ప్రజాస్వామ్యములో ప్రజాప్రతినిధులే ప్రభుత్వ యంత్రాంగాన్ని నిర్వహిస్తారు. వారు శాసన సభల ద్వారా ప్రజలకు బాధ్యత వహిస్తారు. ఏదైనా పొరపాటు తమ వల్ల జరిగితే భవిష్యత్తు దెబ్బతింటున్నదన్న పరిజ్ఞానం వారికి ఉంటుంది. తమను గురించి ప్రజలు ఏమనుకుంటున్నారో పత్రికలు మొదలైన సాధనాల ద్వారా తెలుసుకొంటారు. ప్రజాభిప్రాయాన్ని మన్నించి తమ వ్యక్తిగత ప్రవర్తనను సరిదిద్దుకొంటారు. అవసరాన్ని బట్టి ప్రభుత్వ విధానాల్లో కూడా మార్పులు చేస్తారు. ప్రతిపక్ష పార్టీల భయం వల్ల పాలకులు నియంతలుగా వ్యవహరించరు.

**15. 5. 4 ప్రజల హక్కుల పరిరక్షణ :** ప్రజాస్వామ్యములో పౌరుడికి కొన్ని హక్కులు రాజ్యాంగం ద్వారా లభిస్తాయి. వ్యక్తిత్వ అభివృద్ధికి సామాజిక జీవనానికి హక్కులు ఎంతో ముఖ్యమైనవి. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో మాత్రమే పౌరుడు తన హక్కులను స్వేచ్ఛగా అనుభవించగలడు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో స్వేచ్ఛా సమానత్వాలు పరిరక్షింపబడతాయి. ఇందులో ఏ ఒక్కరికి లేదా ఏ వర్గానికి ప్రత్యేక హక్కులు, సదుపాయాలు ఉండక అందరికి సమాన అవకాశాలు లభిస్తాయి. మానవుడు తన శక్తి సామర్ధ్యాలను పూర్తిగా అభివృద్ధి చేసుకొనే అవకాశాన్ని ప్రజాస్వామ్య ప్రభుత్వం కలుగజేస్తుంది. ఉదాహరణకు భారత రాజ్యాంగం ద్వారా పౌరుడికి 6 రకాల ప్రాథమిక హక్కులు, అనేక ఆదేశిక సూత్రాలు కల్పించారు.

**15. 5. 5 రాజకీయ పరిజ్ఞానం పెరుగుతుంది :** ప్రజాస్వామ్య వ్యవస్థలో సార్వజనీన ఓటు, ఎన్నికలు, రాజకీయపార్టీలు మొదలైనవి రాజకీయ కార్యకలాపాలకు తోడ్పడే ముఖ్య సాధనాలు. దేశం ఎదుర్కొంటున్న వివిధ ఆర్థిక రాజకీయ, సాంఘిక సమస్యలను ప్రజల దృష్టికి తెచ్చే వారిలో స్వతంత్రమైన ఆలోచన విధానాన్ని పెంపొందించి తద్వారా ప్రజలలో రాజకీయ చైతన్యాన్ని, రాజకీయ విజ్ఞానాన్ని, రాజకీయ పార్టీలు కలుగజేస్తాయి. ఎన్నికల సమయాలలో ఆయా సమస్యల గూర్చి సభల ద్వారా ప్రచారము జరిగి ప్రజల యొక్క రాజకీయ పరిజ్ఞానం పెరుగుతుంది. ఎన్నికల తరువాత కూడా శాసన సభలలో జరిగే చర్చలను పౌరులు వార్తా పత్రికలు, టి.వి.లు, రేడియోల ద్వారా తెలుసుకొని రాజకీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకొంటారు.

**15. 5. 6 విప్లవాలకు అవకాశం ఉండదు :** ప్రజాస్వామ్యంలో సాధారణంగా విప్లవాలకు అవకాశం ఉండదు. ప్రభుత్వాలను శాంతియుతంగా మార్చవచ్చు. విప్లవాలకు, రక్తపాతానికి ఈ వ్యవస్థలో తావులేదు. ప్రభుత్వ విధానాలు ప్రజాప్రతినిధులకు నచ్చకపోతే అవిశ్వాస తీర్మానము ద్వారా ప్రభుత్వాన్ని తొలగించవచ్చు. పాలకులు అవినీతి పరులు, అసమర్థులైనచో తిరిగి ఎన్నికలపుడు ప్రజలు వారిని ఓడించవచ్చు. ఐరోపా దేశాలలో ప్రజాస్వామ్య వ్యవస్థ వలన ప్రభుత్వాలు శాంతి యుతంగా మారిపోతూ వుంటాయి. ఉదాహరణకు ఇటలీలో రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఇప్పటివరకు 52 ప్రభుత్వాలు మారాయి. అదే ఆఫ్రికా దేశాలలో ఎక్కువగా నియంతృత్వ ప్రభుత్వాలుండటంతో అక్కడ తరచుగా తిరుగుబాటులు, రక్త పాతాలు జరుగుతున్నాయి. అందుకే ప్రజాస్వామ్యాన్ని "ఎ గవర్నమెంట్ బై బాలట్ నాట్ బై బుల్లెట్స్" అని అంటారు.

**15. 5. 7 దేశభక్తి భావన, జాతీయ సమైక్యత :** ప్రజాస్వామ్యములో ప్రజలు ప్రభుత్వంలో భాగస్వామ్యం పొందే అవకాశం లభిస్తుంది. ప్రభుత్వం తమదే అన్న భావం వారిలో చోటు చేసుకొంటుంది. అందువల్ల వారిలో బాధ్యత పెరిగి పరిపాలనా విషయాలలో

ఆసక్తి కనబరుస్తారు. దీని ఫలితంగా దేశభక్తి భావన పెరిగి జాతీయ సమైక్యత వృద్ధి చెందుతుంది. ఈ విషయముపై జె.ఎస్. మిల్ ఈ విధముగా చెప్పారు. "ప్రజాస్వామ్యం వల్ల ప్రజలలో దేశభక్తి భావం పెరుగుతుంది ఎందుకంటే ప్రభుత్వం తమదేనన్న అభిప్రాయం వారికి ఉంటుంది. ప్రభుత్వ అధికారులు తమపై యాజమానులు అన్నభావం కంటే తమ సేవ నిమిత్తమై ఉన్నారన్న భావం ప్రజలలో అధికంగా వుంటుంది."

**15. 5. 8 సంస్కరణలకు అనుకూలమైనది :** ప్రజాస్వామ్య వ్యవస్థలో మార్పులను సంస్కరణల ద్వారా సాధించవచ్చు. ఈ విధానములో ప్రభుత్వము సాంఘిక, ఆర్థిక, రాజకీయ సంస్కరణలను సులువుగా చేపడుతుంది. మనదేశంలో జమిందారీల రద్దు, భూసంస్కరణల చట్టాలు, బ్యాంకుల జాతీయకరణ మొదలైనవన్నీ ప్రజాస్వామ్య వ్యవస్థవలనే సాధ్యమైనాయి. వివిధ రాజకీయ పార్టీలు ఎన్నికల సందర్భంగా తమ ప్రణాళికలలో చెప్పిన విధముగా సంస్కరణలు తేవటానికి ప్రయత్నిస్తాయి కనుక ప్రజల నుండి వ్యతిరేకత రావటానికి అవకాశం వుండదు.

**15. 5. 9 ప్రజాసమ్మతి :** ప్రజాస్వామ్యము ఒక్కటే నిజమైన ప్రజాప్రభుత్వము ఎందుకంటే ఇది ప్రజాసమ్మతిపై ఆధారపడి పనిచేస్తుంది. ఉడ్రోవిల్సన్ చెప్పినట్లు ఈ విధానం వ్యక్తులలో సృజనాత్మకతను మేల్కొల్పుతుంది. ప్రజలలో త్యాగం, సహనం, సహకార భావనలను పెంపొందించి సత్పౌరులుగా తీర్చిదిద్ది వారిలో రాజకీయ స్పృహను రాజకీయ ప్రవర్తనను పెంపొందిస్తుంది.

**15. 5. 10 వ్యక్తి ప్రతిభను గుర్తిస్తుంది :** దేశంలోని ప్రతివ్యక్తిలో ఔన్నత్యాన్ని, ప్రతిభను గుర్తించి పాలనా వ్యవస్థలో ప్రతి వ్యక్తిని భాగస్వామిగా చేసేది ప్రజాస్వామ్య ప్రభుత్వ మొక్కటే. ఇది ఏ వ్యక్తిని నిర్లక్ష్యము చేయదు. ప్రతి వ్యక్తికి సమాన అవకాశాలు కల్పించి మూర్తిమత్వాభివృద్ధికి తోడ్పడుతుంది. ప్రతి వ్యక్తి దేశములో పరిపాలనా వ్యవస్థలోగాని, రాజకీయ వ్యవస్థలో గాని ఎలాంటి పదవినైనా చేపట్టే అవకాశాన్ని కలిగి వుంటాడు.

## 15. 6 ప్రజాస్వామ్యము - లోపాలు

ప్రజాస్వామ్యవ్యవస్థలో అనేక సుగుణాలు ఉన్నప్పటికి కొన్ని లోపాలు కూడా ఉన్నాయి.' ఇంతవరకు ఏర్పడిన ప్రభుత్వ రూపాలలో ప్రజాస్వామ్యమే ఉత్తమమైనదని భావించినప్పటికి ఈ లోపాలను తొలగించినట్లయితే ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత పటిష్టంగా పనిచేస్తుంది.

**15. 6. 1 అసమర్థుల ప్రభుత్వము :** అరిస్టాటిల్, ప్లేటో మొదలైన వారు ప్రజాస్వామ్యాన్ని అమాయకులు, అసమర్థుల పాలనగా భావించారు. ఈ కారణంచేతనే అరిస్టాటిల్ ప్రజాస్వామ్యాన్ని ప్రభుత్వ వికృత రూపాలలో చేర్చారు. అందుకు కారణం ప్రభుత్వాన్ని చేపట్టేవారు ప్రతిభను బట్టి నిస్వార్థపరత్వాన్ని బట్టి ఎన్నికయిన వారు కాదు. ఎన్నికలలో నిలబడే అభ్యర్థుల గుణగణములను పరిశీలించి ఎన్నుకొనే శక్తి, రాజకీయ పరిజ్ఞానం ప్రజలందరికి ఉండదు. ప్రజలు అనేక ప్రలోభాలకు, ఆవేశాలకు లోనయి ఓటు హక్కును ఉపయోగిస్తారు. అందువలన అసమర్థులు, అవినీతి పరులు, ఆకర్షణీయమైన ఉపన్యాసాలు ఇవ్వగలిగిన వారు మాత్రమే ఎన్నికయ్యే అవకాశమున్నది. అందువలెనే ముస్సోలినీ ప్రజాస్వామ్యాన్ని 'మూకస్వామ్యము'గా అభివర్ణించాడు. ప్రొఫెసర్ లేకి అభిప్రాయంలో "ప్రజాస్వామ్యం కేవలం పేదవారి, అమాయకుల, చేతకాని వారి, అధిక సంఖ్యాకుల ప్రభుత్వము".

**15. 6. 2 ప్రజాస్వామ్యములో గుణముకంటే సంఖ్యకే ప్రాధాన్యత :** ప్రజాస్వామ్యములో పరిమాణానికిచ్చినంత ప్రాధాన్యత గుణానికివ్వరు. సమానత్వ ప్రాతిపదికపై అందరికి సమాన అవకాశాలు ఉండటం వల్ల మేధావులకు గుర్తింపు లభించదు. అధిక సంఖ్యాకుల అభిప్రాయం ప్రకారం నిర్ణయాలు తీసుకోబడి, అల్పసంఖ్యాకుల అభిప్రాయం ఎంతటి ఉన్నతమైనదైనా నిర్లక్ష్యం చేయబడుతుంది. ఈ విధముగా సంఖ్యా ప్రాబల్యంతో గుణము నిర్లక్ష్యానికి గురై, అవివేకమైన నిర్ణయాలు పట్టాలు అమలు జరిగే ప్రమాదమున్నది.

**15. 6. 3 వర్గపోరాటాన్ని ప్రేరేపిస్తుంది :** ప్రజాస్వామ్యం వర్గపోరాటాన్ని ప్రేరేపిస్తుంది. ఎందుకంటే ఎన్నికలలో సాధారణంగా భూస్వాములు, ధనవంతులు మాత్రమే నిలబడి గెలుపొందుతారు. అధికారాన్ని హస్తగతం చేసుకొని తమ వర్గ ప్రయోజనాలను సాధించుకొనేటట్లు శాసనాలు రూపొందించి అమలు పరుస్తారు. ఈ విధానం బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్ వంటి దేశాలలో కూడా ఉన్నది.

అందువలనే కొందరు అమెరికన్ డెమొక్రసిని వ్యంగ్యముగా డాలర్ డెమొక్రసి అని అంటారు. మనదేశంలో కూడా ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా టాటాలు, బిర్లాలు, అంబానీలు మొదలైన వారు ప్రాముఖ్యత వహిస్తున్నారనే విమర్శ వున్నది. ఈ ప్రాబల్యం వర్గపోరాటానికి దారితీస్తుంది.

ఆర్థిక ప్రజాస్వామ్యము లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యము నెలకొల్పితే ఇలాంటి పరిణామాలే సంభవిస్తాయి.

**15. 6. 4 అధిక వ్యయము - కాలయాపన :** ప్రజాస్వామ్య ప్రభుత్వములో దుబారా ఖర్చు ఎక్కువని, అది వ్యయముతో కూడిన ప్రభుత్వమనే విమర్శ వున్నది. ఈ విధానములో నిర్ణీత కాలములో తప్పనిసరిగా ఎన్నికలు నిర్వహించాలి. ఎన్నికల నిర్వహణకు, శాసనసభ్యుల, మంత్రుల జీతభత్యాలకు ఎంతో ప్రజాధనము ఖర్చు అవుతుంది. నిర్ణీత కాలములోగానే ప్రభుత్వాలు పడిపోతే మధ్యంతర ఎన్నికల కోసము ఎంతో ఖర్చుచేయవలసి వస్తుంది. ఉదాహరణకు భారతదేశములో 9వ లోక్‌సభ కేవలము 18 నెలలే కొనసాగటం వలన మరల ఎన్నికల నిర్వహణకు సుమారు 500 కోట్లు ఖర్చు అయినాయి. అంతేకాక ప్రభుత్వ యంత్రాంగం చాలా సంక్లిష్టముగా, విస్తృతమైనదిగా వుంటుంది. ఈ విధానములో జాప్యం, కాలవ్యయం, ధనవ్యయం అమితంగా జరుగుతుందని, లంచగొండితనానికి అవకాశమెక్కువని అనుభవజ్ఞుల అభిప్రాయం.

**15. 6. 5 రాజకీయ పార్టీలు - పాత్ర :** ప్రజాస్వామ్యములో పార్టీ పద్ధతి తప్పని సరి. రాజకీయ పక్షాలు అవినీతిని, కపటాన్ని ప్రోత్సహించి రాజకీయ విధానాన్ని కలుషితము చేయవచ్చు. దీనివలన ఎన్నికలంటే మేధావి వర్గం విముఖతను ప్రదర్శిస్తాయి. ఈనాడు ఆచరణలో వున్న పార్టీ పద్ధతి వల్ల రాజ్యం కొందరి సత్పౌరుల సేవలను కోల్పోతుంది. అధిక సంఖ్యాక పార్టీ అల్పసంఖ్యాక పార్టీలను అణగద్రొక్కటానికి ప్రయత్నించవచ్చు. ప్రస్తుతము మనదేశంలో పార్టీవ్యవస్థలో కనబడుతున్న లోపాలు దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు.

**15. 6. 6 రాజకీయ అస్థిరత్వం :** ప్రపంచంలో ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ, ఇండియా, జపాన్ మొదలైన ఎక్కువ దేశాలలో బహుపార్టీ విధాన ప్రజాస్వామ్యము అమలులో వున్నది. దీని వలన సంకీర్ణ మంత్రి వర్గాలు ఏర్పడి తరచుగా కూలిపోతుంటాయి. తత్ఫలితంగా దేశంలో రాజకీయ అస్థిరత్వం ఏర్పడవచ్చు. ఉదాహరణకు ఇటలీలో గత 47 సం.లలో 52 మంత్రి వర్గాలు మారాయి. మనదేశంలో కూడా 9, 10 లోక్‌సభల అనంతరం ఏ పార్టీకి పూర్తి మెజారిటీ రాక రాజకీయ అస్థిరత్వం ఏర్పడినది. రాజకీయ అస్థిరత్వం వలన ప్రజలు ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసాన్ని కోల్పోయినట్లయితే అది అరాచకానికి దారితీయవచ్చు.

**15. 6. 7 సామాజిక విలువలు క్షీణిస్తాయి :** ప్రజాస్వామ్యంలో ఎన్నికల సమయంలో వివిధ రాజకీయ పార్టీల మధ్య చెలరేగే ఘర్షణలు, ద్వేషాలు, వైషమ్యాలు ఎన్నికల తదనంతరం కూడా కొనసాగి సామాజిక వాతావరణం కలుషితమవుతుంది. నిజాయితీ, నీతి మృగ్యమవుతాయి. కులతత్వం, మతతత్వం, ప్రాంతీయతత్వం, భాషాతత్వం, వంటి ప్రమాదకరమయిన సంకుచిత భావాలను రాజకీయ నాయకులు తమ స్వార్థప్రయోజనాల కొరకు ఉపయోగించుకొని దేశ సమైక్యతకే భంగం కలిగించవచ్చు.

అనేక లోపాలున్నప్పటికి రాజకీయంగా మానవుడు రూపొందించిన ప్రభుత్వాలలో ప్రజాస్వామ్యము అత్యున్నతమైనదిగా నేటికి పరిగణించబడుతుంది. అది ఒక ప్రభుత్వ విధానమే కాక ఒక ఉదాత్తమైన జీవిత విధానము కూడా. నేడు ప్రపంచములో ప్రభుత్వ రూపాలుగా వున్న నియంతృత్వము, రాజరికము, సోషలిజమ్, కులీన పాలనా, ప్రజాస్వామ్యాలలో ఎక్కువ దేశాలలో ప్రజాస్వామ్య వ్యవస్థ ఉన్నతమైనదిగా భావిస్తున్నారు. సోషలిస్టు దేశాలలో ఇటీవల జరిగిన పరిణామాలు ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రాధాన్యతను మరింత పెంచాయి.

## 15. 7 ప్రజాస్వామ్యం విజయవంతం కావటానికి కావలసిన పరిస్థితులు

సమాకాలీన ప్రపంచంలో ఇప్పటికీ అనేక దేశాలలో నియంతృత్వమే కొనసాగుతున్నది. కొన్ని దేశాలలో ప్రజాస్వామ్యప్రభుత్వాలు ఏర్పడినప్పటికి అవి కొద్ది కాలములోనే కూలిపోతున్నాయి. ముఖ్యముగా ఆఫ్రికా, లాటిన్ అమెరికా ఖండాలలోని అనేక దేశాలలో ప్రజాస్వామ్య విధానం విజయవంతం కాలేదు. దీనికి కారణం ఆ దేశాలలో ప్రజాస్వామ్యం వ్యవస్థ పని చేయటానికి కావలసిన పరిస్థితులు లేకపోవటమే. ఈ క్రింది పరిస్థితులు ఉన్నట్లయితే ప్రజాస్వామ్య వ్యవస్థ విజయవంతముగా పనిచేయటానికి అవకాశము ఉన్నది.

**15. 7. 1 అక్షరాస్యులైన ప్రజలు :** ప్రజాస్వామ్యం విజయవంతం కావాలంటే దేశప్రజలకు అక్షరాస్యత, విద్య అవసరము. ప్రజలు ప్రజాస్వామ్యము యొక్క ఆదర్శాలను, లక్ష్యాలను అర్థం చేసుకోవాలి. తమ హక్కులను, విధులను గుర్తించి రెండింటికి

సమన్వయాన్ని సాధించాలి. రాజ్యాంగం, మంత్రి మండలి, రాజకీయ పార్టీలు, ప్రభావ వర్గాలు మొదలైన వ్యవస్థల ఉపయోగం తెలుసుకొని ఉండాలి. విద్య ప్రజలలో రాజకీయ పరిజ్ఞానాన్ని, వివేకాన్ని పెంపొందిస్తుంది. పౌరులు విద్య, విజ్ఞానము కలవారైతే ప్రజాస్వామ్యం సజావుగా కొనసాగుతుంది. కావున విద్యావంతులైన ప్రజలున్నపుడే ప్రజాస్వామ్యం సఫలీకృతమవుతుంది.

**15.7. 2 పటిష్టమైన పార్టీ వ్యవస్థ :** ప్రజాస్వామ్యములో అనేక పార్టీలు పనిచేస్తేనే అది పటిష్టముగా కొనసాగుతుంది. ఒక పార్టీ పద్ధతి నియంతృత్వానికి దారితీస్తుంది. అయితే రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్య విలువలను, సాంప్రదాయాలను, రాజ్యాంగ సూత్రాలను కాపాడేవిగా వుండాలి. చిత్తశుద్ధితో నిస్వార్థముగా ప్రజాసేవ చేయాలన్న సంకల్పముతో రాజకీయపార్టీలు పనిచేయాలి. రాజకీయ పార్టీలు అవకాశ వాదం, బంధుప్రీతి మొదలైన వాటితో పనిచేస్తే ప్రజలకు వాటిపట్ల వ్యతిరేకత పెరిగి ఫలితముగా ప్రజాస్వామ్యము పట్లకూడా అసహ్యాభావం ఏర్పడవచ్చు. ఆఫ్రికా దేశాలలో పార్టీవ్యవస్థ పటిష్టంగా లేకపోవటమే నియంతృత్వానికి దారితీస్తున్నది.

**15.7. 3 బలమైన ప్రతిపక్షం :** ప్రజాస్వామ్యం విజయవంతం కావాలంటే బలమైన ప్రతిపక్ష పార్టీ వ్యవస్థ అవసరము. ఐరోపా దేశాలలో ప్రజాస్వామ్య విజయానికి ఇదొక ప్రధాన కారణం. రాజకీయపార్టీలు ప్రతిపక్షముగా తమ బాధ్యతలను పొందాగా, నిజాయితీగా నిర్వర్తించాలి. స్వార్థముతో, పక్షపాతముతో బాధ్యతారాహితముగా అధికార పార్టీని విమర్శ కోసం విమర్శించరాదు. అధికార పార్టీ అనుసరించే నియంతృత్వ విధానాలకు వ్యతిరేకముగా ప్రజలను సంఘటిత పరిచి ప్రజాభిప్రాయాన్ని సేకరించాలి. ఉదా : బ్రిటన్‌లో ప్రతిపక్ష పార్టీ నిర్మాణాత్మకమైన విమర్శలుచేస్తూ అధికారం చేపట్టటానికి సిద్ధముగా వుంటుంది.

**15.7. 4 ఆర్థిక సాంఘిక సమానత్వం :** ప్రజాస్వామ్యం విజయం నేడు ఆర్థిక సాంఘిక సమానత్వములతో ముడిపడి వున్నది. దేశములో పేదరికం, నిరుద్యోగం, విపరీతమైన ఆర్థిక అసమానతలు వున్నట్లయితే ప్రజాస్వామ్యం విఫలమవుతుంది. ప్రొ. లాస్ చెప్పినట్లు "ఆర్థిక సమానత్వము లేని రాజకీయ సమానత్వం అర్థరహితం ". సంపద కొద్ది మంది చేతులలో కేంద్రీకృతమైతే ప్రజలలో అసమానతలు ఏర్పడి వర్గపోరాటాలకు దారితీయవచ్చు. ప్రజలకు ఆర్థిక సాంఘీక సమానత్వం ప్రసాదిస్తేనే ప్రజాస్వామ్యానికి మనుగడ వుంటుంది.

**15. 7. 5 స్వేచ్ఛ :** ప్రజాస్వామ్యానికి ఇది ఊపిరి వంటిది. ప్రజాస్వామ్య విధానములో భావస్వాతంత్ర్యం, పత్రికా స్వాతంత్రం, వాక్‌స్వాతంత్ర్యం మొదలైనవి ప్రముఖ పాత్ర వహిస్తాయి. ఈ స్వాతంత్ర్యములు స్వేచ్ఛ ద్వారానే ప్రజలకు లభిస్తాయి. ఆధునిక ప్రజాస్వామ్యరాజ్యాలు ప్రజలకు స్వేచ్ఛను కల్పించటానికి రాజ్యాంగాలలో హక్కులను పొందుపరుస్తున్నాయి. అమెరికా రాజ్యాంగము బిల్ ఆఫ్ రైట్స్ పేరుతో, భారత రాజ్యాంగం ప్రాథమిక హక్కుల పేరుతో పౌరునికి స్వేచ్ఛ కల్పించాయి. ఒక దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ ఉన్నదో లేదో ఆ దేశ పౌరుడికి కల్పించే స్వేచ్ఛను బట్టి నిర్ణయించవచ్చు.

**15.7. 6 స్వతంత్ర న్యాయ వ్యవస్థ :** ప్రజాస్వామ్య విజయానికి స్వయంప్రతిపత్తి కలిగిన న్యాయవ్యవస్థ ఎంతో అవసరము. న్యాయ వ్యవస్థ రాజకీయాలకు అతీతముగా వుండి నిష్పక్షపాతముగా, నిర్భయముగా న్యాయపాలన చేయాలి. ప్రజల హక్కులను రక్షించాలి. న్యాయశాఖను శాసన, కార్యనిర్వాహక శాఖలనుండి వేరుచేసినపుడే అది నిష్పక్షపాతముగా వ్యవహరిస్తుంది. ఇలాంటి వ్యవస్థ వలన ప్రభుత్వం తన హద్దులను అధికమించదు.

**15.7. 7 అధికార వికేంద్రీకరణ :** ప్రజాస్వామ్య విజయానికి అధికారం వికేంద్రీకరణ జరగాలి. అధికార కేంద్రీకరణ అధికార దుర్వినియోగానికి, నియంతృత్వానికి దారితీస్తుంది. కాబట్టి రాజ్యాంగం ద్వారా అధికార వికేంద్రీకరణ చేసి స్థానిక స్వపరిపాలన సంస్థలను ఏర్పరచాలి. దీని వలన స్థానిక సమస్యలను ప్రజలే తీర్చుకొనడంతోపాటు ప్రజాస్వామ్య విధానంలో ప్రజలకు కావలసిన రాజకీయ శిక్షణ కూడా లభిస్తుంది. వారిలో పాలనా అనుభవం అభివృద్ధి చెంది ప్రజాస్వామ్య విజయానికి దోహదం చేస్తుంది.

**15.7. 8 బలమైన ప్రజాభిప్రాయం :** ప్రజాస్వామ్యం కావాలనే కోరికతో పాటు దాన్ని కార్యరూపంలో పెట్టగల సామర్థ్యం ప్రజలకు వుండాలి. ప్రజాస్వామ్యం విజయం నిజమైన ప్రజాభిప్రాయంపై ఆధారపడి వున్నది. పాలక వర్గ చర్యలపట్ల ప్రజలు నిరంతర జాగరూకులై వుండాలి. కేవలం తమ ఓటు హక్కును వినియోగించుకోవటంతో బాధ్యత తీరిపోయినదని భావించక, ప్రభుత్వ వ్యవహారాలను పాలకుల చర్యలను ఎప్పటికప్పుడు గమనించాలి. పాలకపక్షము యొక్క అధికార దుర్వినియోగాన్ని నిరోధించాలి. తమ అభిప్రాయాలకు

అనుగుణముగా ప్రభుత్వం ప్రవర్తించేటట్లు చూడాలి. ప్రభుత్వవిధానముల పట్ల ప్రజలు నిర్లిప్త వైఖరిని ప్రదర్శిస్తే ప్రజాస్వామ్యానికి ముప్పువాటిల్లినట్లే.

**15. 7. 9 సమర్థులైన నాయకులు :** ప్రజాస్వామ్య విజయానికి సమర్థులు, నిజాయితీపరులైన నాయకులుండాలి. నిస్వార్థపరులు, విజ్ఞానవంతులు, దేశక్షేమాన్ని కోరేవారు నాయకులుగా ఎన్నుకోబడాలి. నాయకుల శక్తిసామర్థ్యాలు, వారి గుణగణాలమీదే ప్రజాస్వామ్య భవిష్యత్ ఆధారపడి వుంటుంది. ఉదా : 1947 - 64 ల మధ్య కాలంలో భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టముగా పనిచేయటానికి అనేక చర్యలు తీసుకున్నాడు.

## 15. 8 ప్రత్యక్ష ప్రజాస్వామ్య పద్ధతులు

ప్రజలు ప్రత్యక్షముగా రాజకీయ వ్యవహారములో పాల్గొని తమ అభిప్రాయాలు వెలిబుచ్చి రాజ్యకార్యకలాపాలలో భాగస్వామ్యులైనప్పుడు ఆ ప్రభుత్వాన్ని ప్రత్యక్ష ప్రజాస్వామ్యం అంటారు. అతి తక్కువ జనాభా కలిగిన ప్రాచీన గ్రీకు నగర రాజ్యాలలో ఈ విధానం అమలులో వుండేది. ఈనాడు ప్రత్యక్ష ప్రజాస్వామ్య పద్ధతులు అమలు చేయటం సాధ్యం కాదు. విపరీతమైన జనాభా కల జాతీయ రాజ్యాలు రూపొందటమే దీనికి కారణము. స్విట్జర్లాండ్‌లోను, అమెరికాలోను స్థానిక ప్రభుత్వాలలోను ప్రత్యక్ష ప్రజాస్వామ్య పద్ధతులు యిప్పటికి అమలు జరుగుతున్నాయి. ప్రత్యక్ష ప్రజాస్వామ్య పద్ధతులు 4 రకాలుగా అమలులో వున్నాయి. అవి : ఒకటి ప్రజాభిప్రాయ సేకరణ, రెండు ప్రజాభిప్రాయ నివేదన, మూడు ప్రజానిర్ణయ సేకరణ, నాలుగు పునరాయనము.

**15. 8. 1 ప్రజాభిప్రాయ సేకరణ :** ఈ పద్ధతి వల్ల ప్రభుత్వం తలపెట్టిన ఒక విషయంపై ప్రజామోదాన్ని కాని, ప్రజాతిరస్కృతిని తెలుసుకోవటానికి అవకాశముంటుంది. రిఫరెండమ్ అనే మాటకు ప్రజలకు నివేదించండి అనే అర్థము. స్విట్జర్లాండ్‌లో అమలులో వున్న తీరును బట్టి ప్రజాభిప్రాయ సేకరణ రెండు రకాలు ఎ) నిర్బంధ ప్రజాభిప్రాయ సేకరణ బి) ఐచ్ఛిక ప్రజాభిప్రాయ సేకరణ .

**ఎ) నిర్బంధప్రజాభిప్రాయ సేకరణ :** స్విట్జర్లాండులో అన్ని రాజ్యాంగ సవరణలను నిర్బంధముగా ప్రజాభిప్రాయ సేకరణకు పంపాలి. అధిక సంఖ్యాక ప్రజలు ఆమోదిస్తే అవి చెలామణి అవుతాయి. లేకపోతే అవి అమలులోకి రావు.

**బి) ఐచ్ఛిక ప్రజాభిప్రాయ సేకరణ :** స్విట్జర్లాండ్‌లో ఫెడరల్ శాసనాలన్నిటిపైన ప్రజాభిప్రాయ సేకరణ జరగాలని నిర్బంధములేదు. కొన్ని ముసాయిదా బిల్లులను ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం పంపవచ్చు కొన్నింటిని పంపకపోవచ్చు. సాధారణముగా 8 కాంటన్లు ఏ బిల్లునైనా ప్రజాభిప్రాయసేకరణకు పంపాలని కోరినట్లయితే దానిని గురించి ప్రజాభిప్రాయ సేకరణ జరపవచ్చు. సాధారణముగా 15 సంవత్సరముల కాలపరిమితికి మించి చేసుకొనే అంతర్జాతీయ ఒడంబడిక ప్రజాభిప్రాయ సేకరణకు గురవుతాయి.

**సి) ప్రజాభిప్రాయ సేకరణ - గుణాలు :** శాసన సభలలో అధికార పార్టీకి మెజారిటీ వుండి తన ఇష్టానుసారం చట్టాలు రూపొందించటానికి ప్రయత్నించవచ్చు. ప్రజాభిప్రాయ సేకరణ మెజారిటీ నియంతృత్వాన్ని అడ్డుకుంటుంది. రాజకీయ పార్టీలు విధించే క్రమశిక్షణకు భయపడి శాసనసభ సభ్యులు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయక పోవచ్చు. కాని పౌరులు మాత్రం భయం లేకుండా ఈ విధానంలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తారు. సామాన్యముగా ఎన్నికల సమయాలలో మాత్రమే శాసన సభ్యులు ప్రజలతో సంబంధం కలిగి వుంటారు. కాని ప్రజాభిప్రాయ సేకరణలో శాసన సభ్యులు తాము ప్రతిపాదించిన బిల్లును ప్రజలచే ఆమోదం పొందటానికి ప్రజలతో నిత్యసంబంధం కలిగివుంటారు. ప్రజాభిప్రాయ సేకరణ మూలముగా ప్రజలకు రాజకీయ వ్యవహారాలలో పరిజ్ఞానం పెరిగి జాతీయ దృక్పథం కలవారిగా తయారవుతారు. శాసనాలకు ప్రజామోదం వుండటం వలన ప్రజలు తమకు తాముగా శాసనాల పట్ల విధేయత కలిగి వుంటారు. బిల్లువిషయంలో రెండు సభల మధ్య అభిప్రాయభేదాలు తలెత్తి ప్రతిష్ఠంభన ఏర్పడితే ప్రజాభిప్రాయ సేకరణ జరిపి దానిని తొలగించవచ్చు.

**డి) లోపాలు :** శాసన నిబంధనలను అర్థం చేసుకోవటానికి న్యాయశాస్త్ర పరిజ్ఞానం అవసరము. పౌరులందరికి ఆ పరిజ్ఞానముండదు. కనుక శాసన సభ ఆమోదించిన బిల్లులపై పౌరుల అభిప్రాయాలను సమర్థవంతముగా వ్యక్తం చేయలేకపోవచ్చు. ఫైనర్ అభిప్రాయములో ఇది ఆచరణ సులభమైన ప్రక్రియ కాదు. శాసన సభలు ఆమోదించిన బిల్లులను ప్రజలు కూడా ఆమోదించాల్సిన ఆవశ్యకత ఏర్పడటం ఒక విధముగా శాసన సభను కించ పరచటమే. దీని వలన శాసన సభ్యులలో తమ విధుల పట్ల ఆసక్తి తగ్గుతుంది.

శాసన సభలు పరిపాలనా పరంగా ఎన్నో శాసనాలను రాజ్యాంగ సవరణలను ఆమోదించవలసి వుంటుంది. మాటిమాటికి వీటిని ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం పెడితే కాలముతో పాటు ధనము కూడా దుబారా అవుతుంది. దీని వలన ప్రజలలో ఈ విధానం పట్ల వ్యతిరేకత ఏర్పడవచ్చు. ప్రొ. ఫైనర్ అభిప్రాయములో సాధారణముగా మనస్తత్వరీతిగా పౌరులందరికి రాజ్య వ్యవహారాలపట్ల ఆసక్తి వుండదు. అలాంటి విషయాలపై ప్రజాభిప్రాయ సేకరణ చేయబోతే ప్రజలు తమకు తాముగా ముందుకు రారు. ప్రత్యక్ష ప్రజాస్వామ్యముండే దేశాలలో కూడా రాజకీయ పార్టీల జోక్యం వుంటుంది. అధికార పార్టీలు బిల్లులను సమర్ధిస్తూ ప్రచారం చేస్తే ప్రతిపక్ష పార్టీ బిల్లుకు వ్యతిరేకముగా ఓటర్లను ప్రభావితం చేస్తాయి. దీని వలన ప్రజలలో అపోహలు ఏర్పడవచ్చు.

**15. 8. 2.** ప్రజాభిప్రాయ నివేదన : ఈ పద్ధతిననుసరించి స్విట్జర్లాండ్‌లో ప్రజలు ఒక విషయంపై చట్టం అవసరమని భావిస్తే తమ అభిష్టాన్ని ప్రభుత్వానికి నివేదిస్తారు. ప్రజలు ఒక దరఖాస్తును తయారుచేసి కనీసం **50,000** మంది సంతకాలతో ప్రభుత్వానికి నివేదిస్తారు. తరువాత ఆ నివేదనను దేశములోని ప్రజలందరికి పంపి వారి అభిప్రాయాలను తెలుసుకుంటారు. అధిక సంఖ్యాకుల ఆమోదం లభిస్తే దానిని శాసన సభ శాసనముగా రూపొందిస్తుంది. అయితే ఈ పద్ధతిలో అభిప్రాయ నివేదనను బిల్లు రూపములో ప్రజలు నివేదించినపుడు దానిని బిల్లు రూపములో వున్న నివేదన అని అంటారు. స్విట్జర్లాండ్‌లో 9 కాంటన్‌లలో ఈ పద్ధతి అమలులో వున్నది.

**ఎ) గుణాలు :** ప్రజాభిప్రాయనివేదనలో ప్రజలు తమకు ఇష్టమైన రీతిలో స్వయముగా చట్టాలను రూపొందించుకుంటారు. ప్రజలకు తమ అవసరాలు తమకే బాగా తెలుస్తాయి కనుక ఈ చట్టాల ద్వారా ప్రజాసంక్షేమం పెంపొందించటానికి అవకాశమున్నది. అభిప్రాయ నివేదన ద్వారా రూపొందిన చట్టాలు ప్రజలు స్వయముగా ఏర్పాటుచేసుకున్నవి. కాబట్టి వాటిని అమలు చేయటం సులభం. వాటి పట్ల ప్రజలకు విధేయత వుంటుంది.

**బి) లోపాలు :** శాసన సభ రూపొందించాల్సిన చట్టాలను ప్రజలే చేయటం వలన శాసన సభ ప్రాముఖ్యత దెబ్బతింటుంది. ప్రజలకు నాయకత్వం వహించే రాజకీయ పార్టీలు ప్రజలను ప్రక్కదోవలు పట్టించవచ్చు.

ప్రజలు రూపొందించే బిల్లులలో చాలా లోపాలు వుంటాయి. చట్టాలు రూపొందించాలంటే న్యాయ శాస్త్ర ప్రావీణ్యత అవసరము. వాటిని రూపొందించటానికి కావలసిన పరిజ్ఞానం ప్రజలకు వుండదు. దీని ఫలితముగా కొంతమంది రాజకీయ నాయకులు ప్రాబల్యము వహించి ప్రజల అజ్ఞానాన్ని ఉపయోగించుకోవచ్చు.

**15. 8. 3.** ప్రజానిర్ణయం సేకరణ : ఈ పద్ధతిలో ప్రభుత్వం ముఖ్యమైన ప్రజాసమస్యలపై, కీలక విధానాలపై, ప్రభుత్వ విధానాలపై ప్రజానిర్ణయాన్ని సేకరించవచ్చు. సాధారణంగా ఈ పద్ధతి ద్వారా రాజకీయ సమస్యలను పరిష్కరించే ప్రయత్నం జరుగుతుంది. ఫ్రెంచ్ చక్రవర్తి నెపోలియన్ క్రీ. శ **1804** లో ఈ పద్ధతి ఉపయోగించినట్లు చరిత్ర తెలియజేస్తుంది. అనేక దేశాలు ముఖ్య రాజకీయ సమస్యలపై యిప్పటికి ప్రజానిర్ణయ సేకరణ విధానాన్ని అనుసరిస్తున్నాయి. బంగ్లాదేశ్ అధ్యక్షపాలనా విధానము నుండి పార్లమెంటరీ విధానానికి మారటానికి యిటీవల ప్రజానిర్ణయ సేకరణ చేసినది. యిటీవల ఐరోపా ఆర్థిక సమాజ దేశాన్ని ఐరోపా యూనియన్‌లో చేరాలా? వద్దా ? అనే విషయం నిర్ణయించుకోవటానికి తమ దేశాలలో ప్రజానిర్ణయ సేకరణ చేస్తున్నాయి.

**ఎ) గుణాలు :** ముఖ్యమైన రాజకీయ సమస్యలపై ప్రజలు తమ నిర్ణయాలను ప్రజానిర్ణయ సేకరణల ద్వారా తెలియ చేస్తారు. ప్రజాప్రాముఖ్యముగల విషయాలలో యిది ప్రజల ఆసక్తిని రేకెత్తిస్తుంది. ప్రజలు కీలకమైన అంశాలపై తమ నిర్ణయాలను ప్రకటించటానికి వారిని సన్నద్ధులను చేస్తుంది. అత్యంత కఠినమైన రాజకీయ సమస్యలను పరిష్కరించటానికి ఈ పద్ధతి ఉపయోగపడుతుంది. ఉదా : పాలస్తీనా సమస్య పరిష్కారానికి ఆక్రమిత ప్రాంతాలలో ప్రజానిర్ణయ సేకరణ జరపటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

**బి) లోపాలు :** ప్రజానిర్ణయ సేకరణ ఒక రాజకీయ సమస్య పరిష్కారానికై ముఖ్య సాధనముగా కనపడుతున్నప్పటికి ఆచరణలో యిది దుర్వినియోగం కావచ్చు. నియంతలు, రాజకీయ నాయకులు ఈ పద్ధతిని ఉపయోగించి తమ లక్ష్యాలను సాధించుకోవచ్చు. చరిత్రలో నెపోలియన్, హిట్లర్ ఈ పద్ధతి ద్వారానే తమ లక్ష్యాలను సాధించారు. జయవర్ధనే శ్రీలంక అధ్యక్షుడిగా వుండగా చేసిన

ప్రజాభిప్రాయ సేకరణ తమిళుల అణచివేతకు ఉపయోగించుకున్నాడు. అనేక నియంతృత్వ రాజ్యాలలో నియంతలు తమ లక్ష్యాలు నెరవేర్చుకోవటానికి ప్రజానిర్ణయ సేకరణ ఒక సాధనంగా ఉపయోగిస్తున్నారు.

**15. 8. 4. పునరాయనం :** పునరాయనం అంటే వెనుకకు పిలవటం. ఈ పద్ధతిలో ప్రజాప్రతినిధులు తమ బాధ్యతలను విస్మరిస్తే ప్రజలు ఒక నిర్ణీత సంఖ్యలో తీర్మానించి అటువంటి వారిని పునరాయనం చేస్తారు. అంటే అసమర్థులని భావించిన ప్రతినిధులను పదవినుండి తొలగిస్తారు. ఈ పద్ధతి స్విట్జర్లాండ్‌లోను, అమెరికాలోను, ఆరిగాన్ రాష్ట్రములోను అమలులో ఉన్నది.

**ఎ) గుణాలు :** ఈ పద్ధతి ప్రజాప్రతినిధి తమ నియోజక వర్గ ప్రజల అభీష్టానుసారం వ్యవహరించేటట్లు చేస్తుంది. దీనివల్ల శాసన సభ్యులు బాధ్యతగా ప్రవర్తించి, సమర్థవంతంగా పనిచేయటానికి వీలవుతుంది. తమ పరిపాలన సక్రమముగాను, చట్టబద్ధముగాను, నిష్పక్షపాతముగాను వుండే విధముగా పాలకులు జాగ్రత్త వహిస్తారు. ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం చూపటానికి అవకాశం ఉండదు.

**బి) లోపాలు :** ఈ పద్ధతిలో ప్రజా ప్రతినిధులు భయం వలన తమ విధులను సక్రమముగా నిర్వర్తించక పోవచ్చు. ప్రజాప్రతినిధి పట్ల వ్యక్తిగత కోపంతో కూడా ప్రజలలో కొంతమంది ఫిర్యాదులు చేయవచ్చు. నిజాయితీతో చట్టబద్ధముగా వ్యవహరించే ప్రతినిధులు కూడా ఇబ్బందులకు గురయ్యే అవకాశం వుంటుంది.

## 15. 9 సారాంశము :

ప్రజాస్వామ్య వ్యవస్థలో కొన్ని లోపాలున్నప్పటికి, అనేకమంది రాజనీతిశాస్త్ర వేత్తలు దానిని ఉత్తమమైన ప్రభుత్వరూపంగా భావిస్తున్నారు. అయితే ప్రజాస్వామ్యంలో రాజకీయ స్వేచ్ఛకిచ్చిన ప్రాధాన్యత ఆర్థిక, సాంఘిక సమానత్వాలకు యివ్వటం లేదనే విమర్శ వున్నది. ఏమైనప్పటికీ, అనేక దేశాలలో ప్రజాస్వామ్యం కోసం ఉద్యమాలు జరుగుతూనే వున్నాయి.

### అభ్యాసాలు

**I. వ్యాస ప్రశ్నలు :**

1. ప్రజాస్వామ్యమును నిర్వచించి, గుణదోషాలు తెలుపుము.
2. ప్రజాస్వామ్యం విజయవంతం కావటానికి కావలసిన పరిస్థితులు వివరించుము.
3. ప్రత్యక్ష ప్రజాస్వామ్య పద్ధతులను విమర్శనాత్మకంగా చర్చించుము.

**II. సంక్షిప్త వ్యాస ప్రశ్నలు :**

1. ప్రత్యక్ష, పరోక్ష ప్రజాస్వామ్యములను వివరింపుము.
2. ప్రజాభిప్రాయ సేకరణను విపులీకరింపుము.
3. అభిప్రాయ నివేదన గురించి వ్రాయుము.
4. పునరాయనం గురించి వ్రాయుము.

**III. కుశాగ్రబుద్ధి ప్రశ్నలు**

1. ప్రభుత్వ రూపాలన్నింటిలోనూ .................................. ప్రభుత్వ రూపమే ఉన్నతమైనదని అనేకమంది శాస్త్రవేత్తల అభిప్రాయం.
2. "డెమొక్రసీ" అనే ఆంగ్లపదం ..............................అనే గ్రీకుపదం నుండి వచ్చినది. దానికి .................................. అని అర్థము.
3. ఆర్థిక సమానత్వం లేని ప్రజాస్వామ్యం నిరర్థకమైనదని ............................................. భావించారు.
4. ప్రత్యక్ష ప్రజాస్వామ్య పద్ధతులు ................................................ రకాలు.
5. ఫ్రెంచ్ చక్రవర్తి నెపోలియన్ క్రీ. శ.................................. లో ప్రజానిర్ణయ సేకరణ ఉపయోగించినట్లు చరిత్ర తెలియజేస్తుంది.

# సమాఖ్య, ఏక కేంద్ర ప్రభుత్వాలు

## 16.0. లక్ష్యం :

సమాఖ్య, ఏకకేంద్ర తరహా ప్రభుత్వాలను వివరించుట; వీటి మధ్యగల తేడాలను విశదపరచటం; పై రెండు ప్రభుత్వాలలోగల ప్రయోజనాలను లోపాలను విశదీకరించటం.

## 16.1 విషయక్రమం :


16. 2. సమాఖ్య ప్రభుత్వము

16. 3. సమాఖ్య ప్రభుత్వ నిర్వచనాలు

16. 4. సమాఖ్య ప్రభుత్వ లక్షణాలు

16. 5. సమాఖ్య ప్రభుత్వ ప్రయోజనాలు

16. 6. సమాఖ్య ప్రభుత్వ లోపాలు

16. 7. ఏకకేంద్ర ప్రభుత్వము - అర్థము

16. 8. ఏక కేంద్ర ప్రభుత్వ నిర్వచనాలు

16. 9. ఏక కేంద్ర ప్రభుత్వ లక్షణాలు

16. 10. ఏక కేంద్ర ప్రభుత్వ ప్రయోజనాలు

16. 11. ఏక కేంద్ర ప్రభుత్వ లోపాలు

16. 12. సమాఖ్య, ఏక కేంద్ర ప్రభుత్వాల మధ్యగల తేడాలు

16. 13. సారాంశము


## 16. 2. సమాఖ్య ప్రభుత్వము

" ఒక రాజ్యంలో కేంద్ర ప్రభుత్వంతోపాటు కొన్ని రాష్ట్ర లేక ప్రాంతీయ ప్రభుత్వములను నెలకొల్పి కేంద్ర, రాష్ట్రాల మధ్య రాజ్యాంగబద్ధంగా అధికార విభజన చేయబడితే దానిని సమాఖ్య రాజ్యం అనవచ్చును." సమాఖ్య అనే పదానికి సమానమైన ఆంగ్లపదం "ఫెడరల్". ఈ ఆంగ్ల పదము 'ఫొడస్' అనే లాటిన్ పదం నుండి గ్రహించబడింది. ఫొడస్ అనగా ఒడంబడిక లేక ఒప్పందము అని అర్థము. ఆర్థికంగా, సైనికంగా బలహీనంగా ఉన్న కొన్ని ఇరుగు , పొరుగు రాజ్యాలు తమ ప్రగతికి, సార్వభౌమాధికారాన్ని వదలుకొని ఒక నూతన రాజ్యంలో శాశ్వత భాగాలుగా ఉండటానికి ఒప్పందం కుదుర్చు కోవడం ద్వారా సమాఖ్య రాజ్యం ఏర్పడుతుంది.

## 16. 3. నిర్వచనాలు :

1. హామిల్టన్ : "కొన్ని రాజ్యాల కలయిక వలన ఏర్పడిన కొత్త రాజ్యమే సమాఖ్య రాజ్యము"

2. **A.V.** డైసీ : "ప్రాంతీయ ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం మధ్య అధికార విభజన ఫలితంగా వాటి వాటి పరిధులలో నిర్ణయాలు తీసుకొని, ఆయా ప్రభుత్వాలు స్వతంత్రంగా వ్యవహరించు విధానమే సమాఖ్య."

సమాఖ్య రాజ్యాలకు ఉదాహరణ : అమెరికా, స్విట్జర్లాండ్, ఇండియా, కెనడా, ఆస్ట్రేలియా మొదలగునవి ముఖ్య సమాఖ్య రాజ్యాలు.

## 16. 4. సమాఖ్య లక్షణాలు

**16.4. 1.** రెండు స్థాయిలలో ప్రభుత్వాలు : ఫెడరల్ విధానంలో రెండు స్థాయిలలో అనగా కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో ప్రభుత్వాలు నెలకొల్పబడుతాయి. ఉదా: అమెరికాలో వాషింగ్టన్ రాజధానిగా ఒక కేంద్ర ప్రభుత్వము, 50 రాష్ట్ర ప్రభుత్వాలు నెలకొల్పబడ్డాయి.

**16.4. 2.** అధికార విభజన : కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికార విభజన జరగటం సమాఖ్య రాజ్య ప్రధాన లక్షణము. సమాఖ్య రాజ్యంలోని రాజ్యాంగమే ఈ అధికార విభజన చేస్తోంది. సాధారణంగా జాతీయ ప్రాముఖ్యత కల్గిన దేశరక్షణ, విదేశీ వ్యవహారాలు, కరెన్సీ, రైల్వేలు, తంతితపాల మొదలైనవి కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వబడతాయి. స్థానిక ప్రాముఖ్యతకల స్థానిక స్వపరిపాలన, వ్యవసాయము, ఆరోగ్యము, విద్య, శాంతిభద్రత మొదలైనవి రాష్ట్ర ప్రభుత్వాలకు ఇవ్వబడతాయి.

**16.4. 3.** లిఖిత రాజ్యాంగము : సమాఖ్య రాజ్యము తప్పనిసరిగా లిఖిత రాజ్యాంగాన్ని కలిగి ఉండాలి. కేంద్ర, రాష్ట్రాల మధ్యగల అధికార విభజనను స్పష్టం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్మాణం, వాటి విధులు వివరించటానికి ఈ లిఖిత రాజ్యాంగము చాలా అవసరము.

**16.4. 4.** పరుష రాజ్యాంగము : సమాఖ్య రాజ్యము పరుష రాజ్యాంగాన్ని కలిగి ఉండాలి. అనగా రాజ్యాంగ సవరణ పద్ధతి కష్టతరంగా ఉండాలి. రాజ్యాంగ సవరణ పద్ధతి సులభంగా ఉంటే కేంద్రం తన ఇష్టానుసారం రాజ్యాంగాన్ని సవరించి రాష్ట్రాల హక్కులను హరించే అవకాశం ఉంటుంది.

**16.4. 5.** ఉన్నత న్యాయస్థానము : సమాఖ్య రాజ్యము స్వతంత్ర ప్రతిపత్తి కల్గిన ఒక ఉన్నత న్యాయస్థానాన్ని లేక సుప్రీమ్ కోర్టును కల్గి ఉండాలి. స్వతంత్ర ప్రతిపత్తి కల్గిన న్యాయస్థానము కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటి వాటి పరిధులలో పని చేసేటట్లు చూస్తుంది. కేంద్ర, రాష్ట్రాల మధ్య లేక రాష్ట్రాల మధ్య ఏర్పడే వివాదాలను పరిష్కరిస్తుంది.

**16.4. 6.** ద్వంద్వ పౌరసత్వము : సమాఖ్య రాజ్యాలలోని పౌరులు రెండు పౌరసత్వాలను కలిగి ఉంటారు. ప్రతి పౌరుడు తాను నివసిస్తున్న రాష్ట్రపౌరసత్వము మరియు జాతీయ, లేక దేశ పౌరసత్వాలను కలిగి ఉంటాడు. అమెరికా, స్విట్జర్లాండ్‌లలోని పౌరులు ద్వంద్వ పౌరసత్వాన్ని కలిగి ఉన్నారు.

**16.4. 7.** ద్వంద్వ న్యాయశాఖ : సమాఖ్య రాజ్యము ఒక జాతీయ రాజ్యాంగంతోపాటు రాష్ట్ర రాజ్యాంగాన్ని కూడా కలిగి ఉంటుంది. అనగా సమాఖ్య రాజ్యములోని ప్రతిరాష్ట్రం ఒక ప్రత్యేక రాజ్యాంగాన్ని కల్గి ఉంటుంది. ఉదా: అమెరికాలో అమెరికా రాజ్యాంగంతోపాటు 50 రాష్ట్ర రాజ్యాంగాలు కూడా ఉన్నాయి.

**16.4. 8.** పార్లమెంటులోని ఎగువసభలో రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యము : పార్లమెంటులోని ఎగువ సభలో సమాన సంఖ్యలో రాష్ట్రాలు ప్రాతినిధ్యాన్ని కలిగి ఉండడం సమాఖ్య రాజ్య మరో లక్షణం. ఉదా: అమెరికా కాంగ్రెస్‌లో ,(పార్లమెంటులోని) ఎగువసభను సెనెట్ అంటారు. ఈ సభకు అమెరికాలోని ప్రతిరాష్ట్రము ఇద్దరు సభ్యులను ఎన్నుకొంటుంది. దీనిని బట్టి సెనేట్‌లో మొత్తం సభ్యుల సంఖ్య - 50 × 2 = 100.

## 16.5. సమాఖ్య ప్రభుత్వ ప్రయోజనాలు

**16.5. 1.** జాతీయ సమైక్యత, రాష్ట్రాలహక్కుల సమన్వయము : A.V డైసీ అభిప్రాయంలో సమాఖ్య రాజ్యము జాతీయసమైక్యతను, రాష్ట్రాలహక్కులను సమన్వయపరుస్తుంది. రాష్ట్రాలు ఒకవైపు తమకు రాజ్యాంగబద్ధముగా లభించిన అధికారాలను అనుభవిస్తూ మరొక వైపు జాతీయ సమైక్యతకు కృషి చేస్తాయి. ప్రతి రాష్ట్రం సమాఖ్య రాజ్యంలో భాగమే.

**16.5. 2. పెద్ద రాజ్యాలకు ప్రయోజనకారి :** సమాఖ్య విధానము అమెరికా, ఇండియా వంటి పెద్ద రాజ్యాలకు ప్రయోజనకారి. విభిన్న భాషలు, మతాలు, ఆచారాలు కలిగిన ప్రజల మధ్య సహజీవనం పెంపొందించటానికి సమాఖ్య విధానం తోడ్పడుతుంది. K.C వేర్ దృష్టిలో, "భిన్నత్వంలో ఏకత్వానికి, ఏకత్వంలో భిన్నత్వానికి చిహ్నంగా నిలబడేదే సమాఖ్య విధానము".

**16.5. 3. ప్రాంతీయ అవసరాల పరితృప్తి :** సమాఖ్య రాజ్యంలో ప్రాంతీయ అవసరాలు త్వరితంగా తీర్చబడతాయి. ఈ విధానంలో కేంద్ర ప్రభుత్వంతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాలలో రాష్ట్రప్రభుత్వాలు పనిచేయటం వలన ప్రాంతీయ అవసరాలు వెనువెంటనే పరిష్కరించబడేందుకు అవకాశం ఉంటుంది.

**16.5. 4. ప్రపంచ రాజ్య ఆశయం :** ప్రపంచ రాజ్యాన్ని లేక ప్రపంచ ప్రభుత్వాన్ని నెలకొల్పాలనే, వేల్స్ వంటి రచయితల ఆశయం నెరవేరడానికి సమాఖ్య విధానాన్ని నాందిగా పేర్కొనవచ్చును.

**16.5. 5. నూతనప్రయోగాలు చేపట్టడానికి అవకాశం :** పరిపాలన, శాసన, ఆర్థిక విషయాలలో నూతన ప్రయోజనాలను చేపట్టడానికి సమాఖ్య విధానము అనువైంది. ఒక రాష్ట్రంలో ప్రవేశపెట్టబడిన నూతన ప్రయోగం సత్ఫలితాలను ఇస్తే దాన్ని దేశమంతటికి విస్తరింప చేయవచ్చు. ఉదా: ఇండియాలో పంచాయితీరాజ్ వ్యవస్థను మొదట రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ప్రవేశపెట్టి తర్వాత దానిని అన్ని రాష్ట్రాలకు వ్యాప్తి చేయడం జరిగింది. ఒక రాష్ట్రంలో క్రొత్తగా ప్రవేశపెట్టబడిన ప్రయోగము విఫలమైతే అంతటితో దానికి స్వస్తి పలకవచ్చు.

**16.5. 6. నిరంకుశత్వ నిరోధము :** సమాఖ్య విధానము కేంద్ర ప్రభుత్వ నిరంకుశత్వాన్ని నిరోధించ గలుగుతుంది. ఈ విధానంలోని అధికార విభజన కేంద్ర ప్రభుత్వ అధికారాన్ని పరిమితం చేస్తుంది.

**16.5. 7. కేంద్ర ప్రభుత్వ భారం తగ్గింపు :** సమాఖ్య విధానంలోని రాష్ట్రాలకు రాజ్యాంగ బద్ధంగా కొన్ని అధికారాలు ఇవ్వబడుట వలన కేంద్ర ప్రభుత్వ బరువు బాధ్యతలు తగ్గుతాయి. కొన్ని సమస్యలపై కేంద్రం తన దృష్టిని సారించకుండా ఉండేందుకు వీలౌతుంది.

**16.5. 8. స్వపరిపాలనకు ప్రోత్సాహం :** సమాఖ్య రాజ్యంలో అనేక రాష్ట్రప్రభుత్వాలు నెలకొల్పబడతాయి. దేశంలో వివిధ ప్రభుత్వాలు ఉండటంవలన స్వపరిపాలనకు ప్రోత్సాహం ఉంటుంది. ఒక రాష్ట్రపాలనా విధానంలో ఆ రాష్ట్రంలోని వారే పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది.

**16.5. 9. బలహీనరాజ్యాలకు ప్రయోజనకారి :** రాజకీయంగా, ఆర్థికంగా బలహీనంగా ఉన్న రాజ్యాలకు సమాఖ్య విధానము ప్రయోజనకారి. అటువంటి రాజ్యాలు సమాఖ్యలో భాగాన్ని పొంది తన సమస్యలను పరిష్కరించుకోవచ్చు. ఉదా : 1976 లో సిక్కిం అనే రాజ్యం స్వచ్ఛందంగా భారత సమాఖ్యలో చేరి ఇండియాలో 22 వ రాష్ట్రంగా పరిగణించబడుతున్నది.

## 16.6. సమాఖ్య ప్రభుత్వ లోపాలు

**16.6. 1. వివాదాలు :** సమాఖ్య విధానంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య లేక రాష్ట్రాల మధ్య వివాదాల ఏర్పడవచ్చు. ఉదా: అమెరికాలో అబ్రహాంలింకన్ దేశాధ్యక్షుడుగా ఉన్నప్పుడు (1860-65) బానిసత్వ నిర్మూలన విషయమై ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య పెద్ద అంతర్యుద్ధం జరిగింది. నేడు ఇండియాలో వివిధ రాష్ట్రాల మధ్య నదీజలాల వివాదాలు, సరిహద్దు వివాదాలు కలవు.

**16.6. 2.అధిక వ్యయం :** సమాఖ్య విధానంలో ఒక కేంద్ర ప్రభుత్వంతో పాటు అనేక రాష్ట్రప్రభుత్వాలు పనిచేస్తుంటాయి. ఈ విధానంలో అనేక ప్రభుత్వాలు పనిచేయవలసి ఉన్నందువల్ల పాలనా సంబంధమైన వ్యయం చాలా ఎక్కువగా ఉంటుంది.

**16.6. 3. జాప్యం :** సమాఖ్య విధానంలో నిర్ణయాలు తీసుకోవడంలోను రాజ్యాంగ సవరణ విషయంలోను జాప్యం ఉంటుంది. వివిధ పాలనా విషయాలలో కేంద్రం రాష్ట్రాలను, రాష్ట్రాలు కేంద్రాన్ని సంప్రదించవలసి ఉండటమే ఇందుకు కారణము.

**16.6. 4. పరిపాలనా సమైక్యత ఉండదు :** సమాఖ్య విధానంలో పాలనా సమైక్యత, శాసన సమైక్యత ఉండవు. ఉదా: ఇండియాలోని గుజరాత్ రాష్ట్రంలో మద్యపాన నిషేదం అమలులో ఉంటే దాని పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రలో అమలులో లేదు. అలాగే ఇండియాలో వివిధ రాష్ట్రాల ఉద్యోగుల వేతనాలలో, పదవీ విరమణ, వయసులో తేడా కలదు.

**16.6. 5. వేర్పాటు ధోరణి :** సమాఖ్య రాజ్యంలోని కొన్ని రాష్ట్రాలు ప్రత్యేక రాష్ట్ర ప్రతిపత్తిని కోరుతూ వేర్పటు ధోరణిని ప్రదర్శించే అవకాశం ఉంది. ఉదా : ఇండియాలో పంజాబ్ రాష్ట్రంలోని ఉగ్రవాదులు 1980 నుండి తమ రాష్ట్రాన్ని ప్రత్యేక ఖలిస్థాన్‌గా ఏర్పాటు చేయాలని ఆందోళన జరుపుతున్నారు.

**16.6. 6. ప్రాంతీయ సంకుచితత్వము :** సమాఖ్య రాజ్యంలోని రాష్ట్రాలు కొన్ని సందర్భాలలో ప్రాంతీయతత్వాన్ని ప్రోత్సహించే అవకాశముంది. రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ సమస్యలను నిర్లక్ష్యం చేసి తమ రాష్ట్ర లేక ప్రాంతీయ సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇస్తాయి.

**16.6. 7. సమాఖ్య రాజ్య నిర్మాణము కష్టము :** సమాఖ్య రాజ్య నిర్మాణము వ్యయ ప్రయాసలతో కూడుకున్నది. ఇందులో కేంద్రంతో పాటు అనేక రాష్ట్ర ప్రభుత్వాలను నెలకొల్పవలసి ఉన్నందువల్ల దాని నిర్మాణం కష్టం. సమాఖ్య రాజ్యానికి రాజ్యాంగాన్ని తయారు చేసే రాజ్యాంగ నిర్మాతల పనికూడా చాలా క్లిష్టంగా ఉంటుంది.

**16.6. 8. బలహీన కేంద్ర ప్రభుత్వము :** ఈ విధానంలో కేంద్రము బలహీనంగా ఉంటుంది. పాలనాధికారాలన్నింటిని అది చెలాయించలేదు. రాజ్యాంగ బద్దంగా కొన్ని అధికారాలను రాష్ట్రాలకు బదలాయించడం వలన కేంద్రం బలహీనమవుతుంది.

## 16.7. ఏక కేంద్ర రాజ్యము (లేక) యూనిటరీ రాజ్యము

ఏక కేంద్ర రాజ్యంలో రాజ్యాధికారమంతా ఒకే ప్రభుత్వం చెలాయిస్తుంది. అనగా ఏక కేంద్ర రాజ్యంలో రాజ్యానికంతా ఒకే ప్రభుత్వం నెలకొల్పబడి ఉంటుంది.

జపాన్, ఇంగ్లాండ్, ఫ్రాన్స్ మొదలయినవి ప్రముఖ ఏక కేంద్ర రాజ్యాలు.

## 16.8. నిర్వచనాలు

1. డైసీ : "ఒకే కేంద్ర ప్రభుత్వం చేత సర్వోన్నత శాసనాధికారములు చెలాయించబడే ప్రభుత్వ విధానమే ఏక కేంద్ర రాజ్యము".
2. విల్లోబి : "ఏక కేంద్ర విధానంలో సర్వాధికారాలు కేంద్ర ప్రభుత్వానికే చెందుతాయి తరువాత కేంద్ర ప్రభుత్వమే అధికారాలను తన ఇష్టం వచ్చినట్లు ప్రాంతీయ ప్రభుత్వాలకు అప్పచెబుతుంది."

## 16.9. ఏకకేంద్ర ప్రభుత్వ లక్షణాలు

**16.9. 1.** ఏక కేంద్ర రాజ్యంలో ఒకే కేంద్ర ప్రభుత్వం నెలకొల్పబడి ఉంటుంది. అది ప్రభుత్వాధికారాలన్నింటిని నిరాటంకంగా చెలాయిస్తుంది.

**16.9. 2.** ఏక కేంద్ర విధానంలో రాష్ట్రాలుండవు. ఐతే పరిపాలనా సౌలభ్యం కోసం కొన్ని స్థానిక ప్రభుత్వాలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చు. అటువంటి స్థానిక ప్రభుత్వాలకు రాజ్యాంగ బద్ధమైన అధికారాలుండవు. కేంద్ర ప్రభుత్వం దత్తము చేసిన అధికారాలను మాత్రమే అది చెలాయిస్తుంది. ఈ స్థానిక ప్రభుత్వాలను ఏర్పాటు చేయడానికి లేక రద్దు చేయడానికి కేంద్ర ప్రభుత్వానికి పూర్తి అధికారాలుంటాయి.

**16.9. 3.** ఏక కేంద్ర రాజ్యాంగం లిఖితం కావచ్చు లేదా అలిఖితం కావచ్చు. ఉదా : ఏక కేంద్ర రాజ్యాలైన ఫ్రాన్స్ లిఖిత రాజ్యాంగాన్ని, ఇంగ్లండ్ అలిఖిత రాజ్యాంగాన్ని కలిగి యున్నాయి.

**16.9. 4.** ఏక కేంద్ర రాజ్యాంగం పరుషంగా ఉండవచ్చు, లేదా సరళంగా ఉండవచ్చు. ఉదా: ఏక కేంద్ర రాజ్యాలైన ఐర్లండ్ పరుష రాజ్యాంగాన్ని, ఇంగ్లండ్ సరళ రాజ్యాంగాన్ని కలిగి యున్నాయి.

**16.9. 5.** ఏక కేంద్ర రాజ్యములో స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఉన్నత న్యాయస్థానం ఉండాలనే నియమం లేదు. ఉదా : ఇంగ్లండ్‌లో పార్లమెంటు లోని ఎగువసభయైన ప్రభువుల సభ (లార్డ్స్ సభ) దేశానికంతటికి అత్యున్నత న్యాయస్థానంగా పనిచేస్తుంది. అంతేకాని అమెరికా, ఇండియాలో వలె సుప్రీంకోర్టు లేదు.

**16.9. 6.** ఏక కేంద్ర రాజ్యాలలో పౌరులకు ఒకే పౌరసత్వముంటుంది.

## 16.10. ఏక కేంద్ర ప్రభుత్వ ప్రయోజనాలు

**16.10. 1. పరిపాలనా సమైక్యత :** ఏక కేంద్ర ప్రభుత్వంలో ఒకే కేంద్ర ప్రభుత్వం మొత్తం దేశాన్ని పరిపాలిస్తుంది. అందువలన దేశమంతటికి ఒకే పాలనా విధానం అమలులో ఉంటుంది. ఒకే శాసనం దేశ వ్యాప్తంగా ఒకే విధంగా అమలు చేయబడుతుంది.

**16.10. 2. శక్తివంతమైన కేంద్ర ప్రభుత్వం :** ఏక కేంద్ర విధానంలో అన్ని అధికారాలు ఒకే కేంద్రం ప్రభుత్వం చేతిలో కేంద్రీకరించబడటం వలన అది అతి శక్తివంతంగా ఉంటుంది. దేశంలో అంతరంగిక శాంతిభద్రతలు కాపాడటంలో, విదేశీ దండయాత్రలను ఎదుర్కొనడంలో సమర్థవంతంగా పనిచేసి దేశాన్ని ఒక తాటిపైన నడిపించగలుగుతుంది.

**16.10. 3. వివాదాలకు చోటు లేదు :** ఏక కేంద్ర విధానంలో రాజ్యానికంతటికి ఒకే ప్రభుత్వం ఉంటుంది. అధికార విభజన అనే ప్రసక్తి ఈ రాజ్యంలో లేదు. అందువలన వివాదాలకు ఏమాత్రం చోటు లేదు.

**16.10. 4. నిర్మాణము సులభము :** ఏక కేంద్ర రాజ్య నిర్మాణం చాలా సులభం. ఒకే కేంద్ర ప్రభుత్వాన్ని నెలకొల్పటమే ఇందుకు కారణం. ఏక కేంద్రానికి రాజ్యాంగాన్ని తయారుచేసే రాజ్యాంగ సభ పనికూడా తేలిక అవుతుందని విలోభి అభిప్రాయపడ్డారు.

**16:10. 5. తక్కువ వ్యయం :** ఏకకేంద్ర రాజ్యంలో ఒకే శాసనసభ, ఒకే కార్యాంగం ఉంటాయి. అందువలన ప్రభుత్వ నిర్మాణంలో పరిపాలనలో వ్యయం చాలా తక్కువగా ఉంటుంది.

**16.10. 6. త్వరిత నిర్ణయాలు :** దేశం మొత్తానికి ఒకే ప్రభుత్వం, ఒకే శాసనసభ ఉండటం వలన నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం ఉండదు. క్లిష్ట పరిస్థితులలో త్వరిత నిర్ణయాలను తీసుకొని సమస్యలను పరిష్కరించడం సాధ్యమవుతుంది.

**16.10. 7. చిన్న రాజ్యాలకు ప్రయోజనకరం:** భౌగోళికంగా జనాభారీత్యా చిన్న రాజ్యాలకు ఏక కేంద్రవిధానం అనువైంది. జపాన్, ఇంగ్లండ్, స్వీడన్, ఇటలీ మొదలగు చిన్న రాజ్యాలు ఏక కేంద్ర విధానాన్ని అవలంబిస్తున్నాయి.

## 16.11. లోపాలు

**16.11. 1. కేంద్ర ప్రభుత్వ పాలనా భారం పెరుగుతుంది :** ఏకకేంద్ర రాజ్యంలో అధికారాలన్నీ ఒకే ప్రభుత్వం చేతిలో కేంద్రీకరించబడతాయి. అన్ని పాలనాంశాలను కేంద్ర ప్రభుత్వమే నిర్వహించటం వలన దాని పాలనా భారం ఎక్కువ అవుతుంది. కొన్ని పాలనాంశాలను పని ఒత్తిడి వలన విస్మరించడం లేక అశ్రద్ధ చేయడం జరుగుతుంది.

**16.11. 2. పెద్ద దేశాలకు అనువైనది కాదు :** ఏక కేంద్ర ప్రభుత్వ విధానం ఇండియా వంటి పెద్ద రాజ్యాలకు ఏమాత్రం ఉపయోగకరం కాదు.

**16.11. 3. కేంద్ర ప్రభుత్వ నిరంకుశత్వం :** ఏకకేంద్ర విధానంలో అధికారాలన్నీ ఒకే కేంద్ర ప్రభుత్వం చేతిలో కేంద్రీకరించబడతాయి. సర్వాధికారాలుకల్గిన కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించుటకు అవకాశం ఉంటుంది.

**16.11. 4. స్థానిక సమస్యల నిర్లక్ష్యం :** ఏకకేంద్ర విధానంలో రాష్ట్ర ప్రభుత్వాలుగాని, అధికార విభజనగాని ఉండదు. దేశంలో ఏక ప్రభుత్వం అన్ని ప్రాంతాల సమస్యలను సమర్థవంతంగా పర్యవేక్షించలేదు. అనగా స్థానిక సమస్యలు నిర్లక్ష్యం చేయబడతాయి.

**16.11. 5. స్థానిక స్వపరిపాలనకు ప్రోత్సాహం ఉండదు :** ఏకకేంద్ర ప్రభుత్వం స్థానిక స్వపరిపాలనను ప్రోత్సహించదు. "గార్నర్" అభిప్రాయంలో ఏకకేంద్ర ప్రభుత్వం స్థానిక స్వపరిపాలనను, ప్రజా చొరవను నశింపజేస్తుంది. స్థానిక ప్రభుత్వాల ప్రతిపత్తిని నాశనం చేస్తుంది.

**16.11. 6. ప్రపంచ ప్రభుత్వ ఆశయానికి విరుద్ధము :** ప్రపంచ ప్రభుత్వాన్ని నెలకొల్పాలనే రాజనీతిజ్ఞుల ఆశయం ఏకకేంద్ర ప్రభుత్వ విధానంలో సిద్ధించే అవకాశం లేదు.

## 16.12. ఏక కేంద్ర మరియు సమాఖ్య రాజ్యాల మధ్య తేడాలు

రాజ్య నిర్మాణం అధికార విభజనను బట్టి రాజ్యాలను రెండు విధాలుగా విభజింపవచ్చును. అవి 1) ఏక కేంద్ర రాజ్యము 2) సమాఖ్య రాజ్యము

**16.12. 1.** ఏక కేంద్ర విధానంలో రాజ్యాధికారములన్నియు ఒకే ప్రభుత్వము చేతిలో కేంద్రీకరింపబడి ఉంటాయి. సమాఖ్య విధానంలో అధికారాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విభజింపబడి ఉంటాయి.

**16.12. 2.** ఏక కేంద్ర విధానంలో రాష్ట్ర ప్రభుత్వాలు ఉండవు. పరిపాలనా సౌలభ్యం కొరకు రాజ్యంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేస్తే కొన్ని ప్రభుత్వాలు ఉండవచ్చు. కానీ వాటికి స్వతంత్ర ప్రతిపత్తి అధికారాలు ఉండవు.

సమాఖ్య విధానంలో దేశం అనేక రాష్ట్రాలుగా విభజింపబడి ఉంటుంది. ఒక కేంద్ర ప్రభుత్వంతో పాటు కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ విధానంలో ఉంటాయి. రాష్ట్రాలు రాజ్యాంగబద్ధంగా కొన్ని అధికారాలు కల్గి ఉంటాయి.

**16.12. 3.** ఏక కేంద్ర రాజ్యము లిఖితమై ఉండవచ్చు లేదా అలిఖితమై ఉండవచ్చు.

సమాఖ్యరాజ్యము తప్పనిసరిగా లిఖితంగా ఉండాలి.

**16.12. 4.** ఏకకేంద్ర విధానంలో రాజ్యాంగం సరళంగా ఉండవచ్చు లేదా పరుషంగా ఉండవచ్చు.

సమాఖ్య విధానంలో తప్పనిసరిగా పరుషరాజ్యాంగం ఉండాలి.

**16.12. 5.** ఏకకేంద్ర విధానంలో స్వతంత్ర ప్రతిపత్తి కల్గిన ఉన్నత న్యాయస్థానం తప్పనిసరి.

**16.12. 6.** ఏకకేంద్ర విధానంలో ఒకే రాజ్యాంగము ఉంటుంది.

సమాఖ్య విధానంలో జాతీయ రాజ్యాంగంలో పాటు ప్రతిరాష్ట్రము ఒక ప్రత్యేక రాజ్యాంగాన్ని కల్గి ఉంటుంది.

**16.12. 7.** ఏకకేంద్ర విధానంలో ఒకే పౌరసత్వం ఉంటుంది. సమాఖ్య విధానంలో జాతీయ పౌరసత్వంతోపాటు రాష్ట్ర పౌరసత్వం కూడా ఉంటుంది.

**16.12. 8.** ఏకకేంద్ర విధానంలో త్వరితంగా నిర్ణయాలు తీసుకొనడానికి అవకాశం ఉంటుంది.

సమాఖ్య విధానంలో కేంద్ర, రాష్ట్రాలు కలసి కొన్ని నిర్ణయాలు తీసుకోవలసి వుంటుంది. అందువలన కాలయాపన జరిగేందుకు అవకాశం వుంటుంది.

**16.12. 9.** ఏక కేంద్ర రాజ్య నిర్మాణం కష్టము. "విలోభి" అభిప్రాయంలో రాజ్యాంగాన్ని రూపొందించే రాజ్యాంగకర్తల పని శ్రమతో కూడి వుంటుంది.

**16.12. 10.** ఏక కేంద్ర విధానంలో స్థానిక సమస్యలు త్వరితంగా, సమర్ధవంతంగా పరిష్కరించబడక పోవచ్చు.

సమాఖ్య విధానంలో స్థానిక సమస్యలు రాష్ట్ర ప్రభుత్వంచేత త్వరితంగా పరిష్కరించేందుకు అవకాశం ఉంటుంది.

**16.12. 11.** ఏకకేంద్ర విధానంలో అధికారాలన్నీ ఒకే కేంద్ర ప్రభుత్వం చేతిలో కేంద్రీకరింపబడి వుండటం వలన నిరంకుశంగా వ్యవహరించేందుకు అవకాశం ఉంటుంది.

సమాఖ్య విధానంలో కేంద్రం నిరంకుశంగా వ్యవహరించేందుకు వీలులేదు.

**16.12. 12.** విభిన్న భాషలు, జాతులు కల్గిన చిన్న రాజ్యాలకు ఏక కేంద్ర విధానము అనువైంది. సమాఖ్య విధానము విభిన్న భాషలు, జాతులు కల్గిన పెద్ద రాజ్యాలకు అనువైంది.

**16.12. 13.** ఏక కేంద్ర విధానంలో వివాదాలకు అవకాశం లేదు. సమాఖ్య విధానంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య లేక రాష్ట్రాల మధ్య వివాదాలకు అవకాశం ఉంటుంది.

**16.12. 14.** ఏక కేంద్ర విధానంలో శాసనాలు దేశమంతటా ఒకే రకంగా అమలు పరచబడలేవు.

సమాఖ్య విధానంలో శాసనాల విషయంలో భిన్నత్వం లేక వైవిధ్యం లేక వ్యత్యాసం గోచరిస్తుంది.

**16.12. 15.** ప్రపంచ ప్రభుత్వ స్థాపన అనే భావనకు ఏకకేంద్ర విధానం వ్యతిరేకం.

సమాఖ్య విధానం ప్రపంచ ప్రభుత్వ ఆశయానికి తొలిమెట్టు.

## 16.13. సారాంశము

ఆధునిక ప్రభుత్వాలు సమాఖ్య, ఏకకేంద్ర అని రెండు విధాలుగా ఉంటాయి. అధికారాలన్నీ ఒకే ప్రభుత్వంలో కేంద్రీకృతమై ఉంటే ఏకకేంద్ర మని, అవి జాతీయ రాష్ట్ర ప్రభుత్వాలమధ్య విభజింపబడి ఉంటే సమాఖ్య అని అంటారు. సమాఖ్య విధానాన్ని కొన్ని స్వతంత్ర రాజ్యాలు ఏర్పాటు చేసుకోవచ్చు లేదా ఒక కేంద్ర రాజ్యము నుంచి గూడా సమాఖ్య ఏర్పడవచ్చు. పెద్ద రాజ్యాలకు సమాఖ్య విధానము ప్రయోజనకారి. సమాఖ్యలో జాతీయ ప్రయోజనాలకు, ప్రాంతీయ ప్రయోజనాలకు మధ్య సమన్వయం సాధ్యమవుతుంది. ఏకకేంద్ర విధానము చిన్న, చిన్న రాజ్యాలకు ప్రయోజనకారి.

### అభ్యాసాలు

**I. వ్యాస ప్రశ్నలు :**

1. సమాఖ్య ప్రభుత్వ గుణదోషాలను వివరించండి.
2. ఏక కేంద్ర ప్రభుత్వ గుణదోషాలను వివరింపుము.
3. సమాఖ్య ప్రభుత్వానికి, ఏకకేంద్ర ప్రభుత్వానికి మధ్య గల తేడా లేవి?

**II. సంక్షిప్త వ్యాస ప్రశ్నలు :**

1. సమాఖ్య ప్రభుత్వ లక్షణాలేవి ?
2. ఏక కేంద్ర ప్రభుత్వ లక్షణాలేవి ?

**III. కుశాగ్రబుద్ధి ప్రశ్నలు**

1. సమాఖ్య అనే పదానికి సమానమైన ఆంగ్లపదం ......................అది ఫొడస్ అనే ...................... పదం నుండి గ్రహించబడింది.
2. ఫొడస్ అనగా ...................................... అని అర్థము.
3. డైసీ అభిప్రాయంలో సమాఖ్య రాజ్యము ......................................, ...................................... లను సమన్వయపరుస్తుంది.
4. ...................................... రాజ్యాలలో పౌరులకు ఒకే పౌరసత్వముంటుంది.
5. ...................................... విధానంలో స్వయం ప్రతిపత్తి కల్గిన ఉన్నత న్యాయస్థానం తప్పనిసరి.

పాఠం - 17

# పార్లమెంటరీ, అధ్యక్ష తరహా ప్రభుత్వాలు

## 17. 0 లక్ష్యం :

పార్లమెంటరీ, అధ్యక్షతరహా ప్రభుత్వాలను వివరించటం, వీటి మధ్యగల తేడాలను విశదపరచటం, పై రెండు ప్రభుత్వాలలో గల లాభాలను లోపాలను చర్చించటం.

విషయక్రమం :

17. 2 పార్లమెంటరీ ప్రభుత్వ లక్షణాలు

17. 3 పార్లమెంటరీ ప్రభుత్వ లాభాలు

17. 4 పార్లమెంటరీ ప్రభుత్వ లోపాలు

17. 5 అధ్యక్ష ప్రభుత్వ విధాన లక్షణాలు

17. 6 అధ్యక్ష ప్రభుత్వ విధాన లాభాలు

17. 7 అధ్యక్ష ప్రభుత్వ విధాన లోపాలు

17. 8 సారాంశము.

## 17. 2 పార్లమెంటరీ ప్రభుత్వ లక్షణాలు :

శాసన, కార్యనిర్వాహక శాఖల మధ్య వుండే సంబంధం ప్రాతిపదికగా ప్రభుత్వాలను, పార్లమెంటరీ, అధ్యక్ష ప్రభుత్వాలుగా విభజించవచ్చు. పార్లమెంటరీ కార్యనిర్వాహక విధానాన్ని కాబినెట్ ప్రభుత్వ విధానమని కూడా వ్యవహరిస్తారు. పార్లమెంట్ విధానం అమలులోవున్న దేశాలకు ఇంగ్లాండు, ఇండియాలు ఉదాహరణలు.

**17. 2.1** నామమాత్రపు, వాస్తవ కార్యవర్గాలు :పార్లమెంటరీ విధానంలో రాజ్యాధినేత నామమాత్రపు అధికారాలు గల్గిన కార్యనిర్వాహకుని గాను, రాజ్యాంగబద్ధుడైన పాలకునిగాను వ్యవహరిస్తాడు. ఉదా. బ్రిటిషు రాజు, భారత రాష్ట్రపతి, బ్రిటన్ భారతదేశాలలో వాస్తవాధికారాలను ప్రధానమంత్రి నాయకత్వానగల మంత్రిమండలాలు చెలాయిస్తాయి.

**17. 2.2** మంత్రులకు పార్లమెంటులో సభ్యత్వము : పార్లమెంటరీ విధానంలో మంత్రులందరు పార్లమెంటులో సభ్యత్వాన్ని కలిగి ఉండాలి. సభ్యుడుకాని వ్యక్తి మంత్రిగా నియమింపబడినట్లయితే, అతడు నిర్ణీత గడువు లోపల పార్లమెంటుకు ఎన్నిక కావలసి వుంటుంది.

**17. 2.3** ఒకే పార్టీకి చెందిన మంత్రులు : మంత్రివర్గ సభ్యులంతా ఒకే పార్టీకి చెందినవారై ఉంటారు. అదే దిగువ సభలో మెజారిటీ పార్టీయే ఉంటుంది. మంత్రులంతా ఒకేపార్టీ వారైనందున వారి మధ్య ఐక్యత, సహకారాలు వుంటాయి.

**17. 2. 4** పార్లమెంటుకు మంత్రిమండలి బాధ్యత : ఈ విధానంలో మంత్రిమండలి వ్యక్తిగతంగాను, సమిష్టిగాను పార్లమెంటుకు బాధ్యత వహిస్తుంది. పార్లమెంటు (దిగువ సభల) విశ్వాసాన్ని పొందినంతకాలమే మంత్రిమండలి అధికారంలో వుంటుంది. ప్రశ్నలు, ఉపప్రశ్నలు, తీర్మానాలు, అవిశ్వాస తీర్మానము మొదలయిన పద్ధతుల ద్వారా పార్లమెంటు మంత్రిమండలిని అదుపులో వుంచుతుంది.

**17. 2.5 మంత్రివర్గానికి నిర్ణీత పదవీ కాలపరిమితి ఉండదు :** పార్లమెంటరీ విధానంలో మంత్రి వర్గానికి నిర్ణీత పదవీ లపరిమితి లేదు. ఎన్నుకోబడిన పదవీ కాలపరిమితిలోపు ఎప్పుడైనా అవిశ్వాస తీర్మానం ద్వారా పార్లమెంటు మంత్రిమండలిని అధికారం ండి తొలగించగలదు.

**17. 2.6 ప్రధానమంత్రి నాయకత్వం :** పార్లమెంటరీ విధానంలో వాస్తవాధికారాలను ప్రధానమంత్రి నాయకత్వావగల మంత్రివర్గాలే ాయిస్తాయి. మెజారటీ పార్టీ నాయకుడే ప్రధానమంత్రి. ఈ విధానంలో కాబినెట్ తీసుకొన్న నిర్ణయాలు రహస్యంగా ఉంచబడతాయి.

## 7. 3 పార్లమెంటరీ ప్రభుత్వ లాభాలు

**17. 3.1 శాసన, కార్యనిర్వాహక శాఖల మధ్య సమన్వయం :** పార్లమెంటరీ విధానం శాసన, కార్యనిర్వాహక శాఖల మధ్య ాకారాన్ని, సాన్నిహిత్యాన్ని నెలకొల్పుతుంది. పార్లమెంటు, మంత్రిమండలి రెండూ కూడా మెజారిటీ పార్టీ ఆధీనంలోనే వుంటాయి. బట్టి వాటి మధ్య సంఘర్షణలు వచ్చే అవకాశాలు తక్కువ.

**17. 3. 2. మంత్రివర్గ నిరంకుశత్వంపై అదుపు :** పార్లమెంటరీ విధానం మంత్రివర్గ నిరంకుశత్వాన్ని నిరోధిస్తుంది. మంత్రివర్గం ్లమెంటుకు బాధ్యతవహిస్తుంది. ప్రశ్నలు, తీర్మానాల ద్వారా పార్లమెంటును మంత్రిమండలి అదుపులో ఉంచుతుంది లేదా అవిశ్వాస ్మానాన్ని ఆమోదించుట ద్వారా మంత్రిమండలిని తొలగించగల్గుతుంది. కావున ఈ విధానంలో ప్రభుత్వం నియంతృత్వాధికారాలను ాయించగల అవకాశం ఉండదు.

**17. 3. 3 మంత్రులుగా ప్రజాప్రతినిధుల నియామకం :** ఈ విధానంలో ప్రజాప్రతినిధియైన మెజారిటీ పార్టీ నాయకుడే ానమంత్రిగా నియమించబడతాడు. ఆయన ప్రజాప్రతినిధులను తన మంత్రివర్గ సహచరులుగా ఎంపికచేసు కొంటాడు. అందువలన ్లమెంటరీ విధానంలో పరిపాలన ప్రజానురంజకంగా ఉంటుంది.

**17. 3. 4 ప్రత్యామ్నాయ ప్రభుత్వము :** ఈ విధానంలో రాజకీయ విప్లవాల అవసరముండదు. మంత్రివర్గం అవిశ్వాస ్మానం ద్వారా తొలగింపబడినప్పుడు, వెంటనే ప్రతిపక్ష పార్టీలు శాంతియుతంగానే ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని యేర్పాటు చేస్తాయి.

**17. 3. 5 రాజకీయ చైతన్యం :** పార్లమెంటరీ విధానం ప్రజలలో రాజకీయ చైతన్యాన్ని పెంపొందిస్తుంది. పార్లమెంటులోని ర్చలు, విమర్శలు, ప్రతిపక్ష పార్టీ విమర్శలు ప్రజలలో రాజకీయ పరిజ్ఞానాన్ని పెంపొందిస్తాయి.

## 17. 4 పార్లమెంటరీ ప్రభుత్వ లోపాలు

**17. 4. 1 అస్థిర ప్రభుత్వము :** పార్లమెంటరీ విధానంలో మంత్రివర్గానికి నిర్ణీత కాలపరిమితి లేదు. పార్లమెంటు విశ్వాసాన్ని ొదినంతకాలం మాత్రమే మంత్రివర్గం అధికారంలో ఉంటుంది. అందువలన ఈ విధానంలో తరచు ప్రభుత్వాలు, వాటి విధానాలు ారుతూ ఉంటాయి.

**17. 4. 2 మంత్రివర్గ నియంతృత్వము :** పార్లమెంటరీ విధానం కాబినెట్ నియంతృత్వానికి దారితీస్తుంది. పార్లమెంటులోని తన మెజారిటీ పార్టీ సభ్యుల మద్దతువలన మంత్రివర్గం పార్లమెంటుచేత తన ఇష్టం వచ్చిన శాసనాలను ఆమోదింపచేసుకొంటుంది. ార్లమెంటును రద్దుచేయించే అధికారం కూడా ప్రధానమంత్రికి వుంటుంది. అందువల్లనే ఆధునిక పార్లమెంటరీ దేశాలలో కాబినెట్ ియంతృత్వము పెరుగుతున్నదనే ఆందోళనను హివార్టు, రామ్సేమ్యూర్‌లు వ్యక్తం చేశారు.

**17. 4. 3 అధికార పృథఃక్కరణ సిద్ధాంతానికి వ్యతిరేకం :** ఈ విధానంలో మంత్రిమండలి పార్లమెంటులో అంతర్భాగంగా నిచేస్తుంది. అందువలన ఇది అధికార పృథఃక్కరణ సిద్ధాంతానికి వ్యతిరేకం.

**17. 4. 4 పార్టీ ప్రయోజనాలకు ప్రాధాన్యత :** పార్లమెంటరీ ప్రభుత్వం ఒక విధంగా పార్టీ ప్రభుత్వమే. అందువలన ్రభుత్వము ఎల్లప్పుడూ పార్లమెంటులో తన మెజారిటీని నిలుపుకోవటానికి కృషిచేస్తుంది. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తుంది. పార్టీ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తూ వ్యవహరించినందువలన పాలనా సామర్థ్యం దెబ్బతింటుంది.

**17. 4. 5 పరిజ్ఞానంలేని మంత్రులు :** ఈ విధానంలో మంత్రులు తమ పార్టీల విషయాలపై తమ కాలాన్ని వినియోగిస్తారు పైగా సాధారణ రాజకీయ నాయకులైన వారికి సాంకేతిక పరిజ్ఞానం, పరిపాలనానుభవం ఉండవు. అందువలన వారు ప్రతిదానికి ఆయా శాఖల కార్యదర్శులపైన ఆధారపడి పనిచేస్తారు. అందువల్లనే మంత్రులను చమత్కారంగా "Yes Men" అంటారు.

**17. 4. 6** అత్యవసర పరిస్థితులలో పార్లమెంటరీ ప్రభుత్వాలు త్వరితగతిన నిర్ణయాలను తీసుకునే అవకాశాలు తక్కువ.

## 17.5 అధ్యక్ష ప్రభుత్వ విధానము

అధ్యక్ష ప్రభుత్వ విధాన లక్షణాలు :

1. వాస్తవ కార్యవర్గ అధినేత (అధ్యక్షుడు) ప్రజలచే ప్రత్యక్షంగా ఎన్నికవుతాడు.
2. రాజ్యాధినేత వాస్తవాధికారాలను చలాయించగల ప్రభుత్వాధిపతియై ఉంటాడు. ఉదా. అమెరికా అధ్యక్షుడు రాజ్యాంగమిచ్చిన అధికారాలన్నింటిని స్వయంగా చెలాయిస్తాడు.
3. మంత్రివర్గ సభ్యులు శాసన సభలకు ఎన్నికై ఉండాలనీ నియమం లేదు. అధ్యక్షుడు తన ఇష్టం వచ్చిన వ్యక్తులను మంత్రులుగా నియమించుకోవచ్చు.
4. ఈ విధానంలో మంత్రివర్గ సభ్యులంతా ఒకే పార్టీకి చెంది ఉండాలని లేదు. అసలు ఏ పార్టీకి చెందని వ్యక్తులను గూడా మంత్రులుగా నియమించుకోవచ్చును.
5. అధ్యక్ష ప్రభుత్వ విధానంలో మంత్రిమండలి శాసన సభలకు బాధ్యత వహించదు. వారు అధ్యక్షునికి బాధ్యులు. అతని విశ్వాసాన్ని పొందినంతకాలమే వారు అధికారంలో ఉంటారు. అధ్యక్షుడు గూడా శాసన సభలకు బాధ్యత వహించడు. శాసన సభలను రద్దుచేసే అధికారము గూడా ఆయనకుండదు.
6. ఈ విధానంలో కార్యనిర్వాహక వర్గానికి నిర్ణీత పదవీ కాలపరిమితి ఉంటుంది. ఉదా: అమెరికా అధ్యక్షుని 4 సం.లు పదవీ కాలపరిమితి లోపల మహాభియోగ తీర్మానం ద్వారా తప్ప కాంగ్రెస్ అతనిని అధికారంనుండి తొలగించలేదు.

## 17. 6 అధ్యక్ష ప్రభుత్వ విధాన లాభాలు

ఈ క్రింది అధ్యక్షపాలనా విధానపు ప్రయోజనాలు.

**17. 6. 1 అధికార పృథఃక్కరణ సిద్ధాంతానికి అనుగుణము :** ఈ విధానంలో శాసన, కార్యనిర్వాహక శాఖలు వేరుగా ఉంటాయి. కాబట్టి ఇది అధికార పృథఃక్కరణ సిద్ధాంతానికి అనుగుణంగా ఉంటుంది. శాసన, కార్యనిర్వాహక శాఖలు వేరుగా ఉండటము వ్యక్తి స్వేచ్ఛా పరిరక్షణకు అవసరము. అది నియంతృత్వాన్ని నిరోధిస్తుంది.

**17. 6. 2 స్థిరమైన ప్రభుత్వము :** ఈ విధానంలో ప్రభుత్వాలు తరచుగా మారవు. కార్యనిర్వాహక వర్గం నిర్ణీత కాలం వరకు అధికారంలో కొనసాగుతుంది. అందువలన ఇది స్థిరమైన ప్రభుత్వ విధానము.

**17. 6. 3 ప్రజలకు బాధ్యత :** అధ్యక్ష ప్రభుత్వ విధానంలో కార్యనిర్వాహక వర్గము శాసన సభలకు బాధ్యత వహించినంత మాత్రాన అది ప్రజాస్వామ్య వ్యతిరేకము గాదు. అందుచేత ఎన్నుకోబడే అధ్యక్షుడు ప్రజలకే బాధ్యత వహిస్తాడు.

**17. 6. 4 సమర్థులైన మంత్రులు :** ఈ విధానంలో అధ్యక్షడు శాసనసభా సభ్యత్వము, పార్టీ సభ్యత్వములతో నిమిత్తము లేకుండా సమర్థులైన వ్యక్తులను నియమించుకోగల్గుతాడు. అందువలన పాలనా సామర్థ్యము పెరుగుతుంది.

**17. 6. 5 త్వరితగతిన నిర్ణయాలు :** దేశ అత్యవసర పరిస్థితులలో సర్వాధికారియైన అధ్యక్షుడు ఈ విధానంలో త్వరగా నిర్ణయాలు తీసికొని వాటిని శక్తివంతంగా అమలుచేయగలుగుతాడు.

**17. 6. 6 జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యత :** అధ్యక్ష ప్రభుత్వ విధానంలో కార్యనిర్వాహక వర్గం తన మనుగడకు శాసనసభలోని పార్టీ బలంపై ఆధారపడవలసిన అగత్యం లేదు. అందువలన ఈ విధానంలో అధ్యక్షుడు, అతని మంత్రివర్గము పార్టీ ప్రయోజనాల దృష్ట్యాగాక, జాతీయ ప్రయోజనాల దృష్ట్యా వ్యవహరించగలుగుతాడు.

## 7. 7 అధ్యక్ష ప్రభుత్వ విధానంలోని లోపాలు

ఈ విధానంలో అధ్యక్షుడు, నిరంకుశంగాను, బాధ్యతారహితంగాను వ్యవహరించవచ్చును. అతడు శాసనసభకు బాధ్యత వహించడు. అవిశ్వాస తీర్మానంద్వారా తప్ప అతనిని తొలగించే అవకాశములేదు. కాబట్టి ఈ విధానంలో అధ్యక్షుడు నిరంకుశంగా వ్యవహరించే అవకాశం ఉంది.

ఈ విధానంలో శాసన, కార్యనిర్వాహక శాఖలు వేరుచేయబడినందున వాటి మధ్య ఐక్యత నశించి, తరచు వివాదాలు తలెత్తుతాయి.

ఈ విధానంలో కార్యనిర్వాహక వర్గం శాసన సభల చర్చలలో పాల్గొనదు. అందువలన పార్లమెంటుకు నాయకత్వము వహించే అవకాశము మంత్రివర్గానికి ఉండదు.

అసమర్థుడైన అధ్యక్షుని పదవీకాల పరిమితి లోపల తొలగించడం చాలా కష్టమవుతుంది.

పైన పేర్కొనబడినవి అధ్యక్ష పాలనావిధానంలోవి లోపాలు.

## 7. 8 సారాంశము

ప్రభుత్వాలనేవి పార్లమెంటరీ లేక అధ్యక్షతరహా వ్యవస్థలుగా ఉండవచ్చు. పార్లమెంటరీ విధానంలో శాసనసభ, కార్యనిర్వాహక ర్గం సమన్వయముతో పనిచేస్తాయి. శాసనసభలో మెజారిటీ పార్టీ నాయకుడు ప్రధానమంత్రి అవుతాడు. మంత్రిమండలి సమిష్టిగాను, ్యక్తిగతంగాను శాసనసభకు బాధ్యత వహిస్తుంది.. అధ్యక్ష ప్రభుత్వ విధానంలో అధ్యక్షుడే అన్ని అధికారాలను చెలాయిస్తాడు. శాసనసభతో ంబంధం ఉండదు. రాజ్యాంగం అధ్యక్షుని పదవీకాలాన్ని నిర్ణయిస్తుంది.

### అభ్యాసాలు

వ్యాస ప్రశ్నలు :

పార్లమెంటరీ ప్రభుత్వ లక్షణాలను, దాని గుణదోషాలను వివరింపుము.

పార్లమెంటరీ, అధ్యక్ష తరహా ప్రభుత్వాల మధ్య గల తేడాలేవి?

అధ్యక్ష తరహా ప్రభుత్వ లక్షణాలను దాని గుణదోషాలను వివరింపుము.

II. సంక్షిప్త వ్యాస ప్రశ్నలు :

1. కాబినెట్ ప్రభుత్వ విధానమును విపులీకరించుము.
2. అధ్యక్ష ప్రభుత్వ విధానమును వివరించుము.
3. పార్లమెంటరీ ప్రభుత్వ లాభాల గూర్చి వ్రాయుము.
4. అధ్యక్ష ప్రభుత్వ లోపాలను వివరించుము.

III. కుశాగ్రబుద్ధి ప్రశ్నలు

1. పార్లమెంటరీ కార్యనిర్వాహక విధానాన్ని ........................................ ప్రభుత్వ విధానమని కూడా పిలుస్తారు.
2. ........................................విశ్వాసాన్ని పొందినంత కాలమే మంత్రిమండలి అధికారంలో ఉంటుంది.
3. పార్లమెంటరీ విధానంలో మంత్రివర్గానికి నిర్ణీత పదవీకాల పరిమితి ........................................
4. పార్లమెంటరీ విధానం ........................................ నియంతృత్వానికి దారి తీస్తుంది.
5. అధ్యక్ష ప్రభుత్వ విధానంలో మంత్రిమండలి ........................................ కి బాధ్యత వహిస్తుంది.

Lesson -18

# అధికార పృథఃక్కరణ సిద్ధాంతము

## 18.0 లక్ష్యాలు

1. మాంటెస్క్యూకు పూర్వము అధికార పృథఃక్కరణ సిద్ధాంతము ఏ విధంగా ఉన్నది తెలుసుకోవటం. మాంటెస్క్యూ అభిప్రాయాలన అవగాహన చేసికొనటం. ఆధునిక ప్రభుత్వాలకు ఈ సిద్ధాంతము ఎలా వర్తించేది వివరించటం.

## 18.1 విషయ క్రమం


18.2. అధికార పృథఃక్కరణ సిద్ధాంతము - అర్థము

18.3. సిద్ధాంత చరిత్ర

18.4. మాంటెస్క్యూ అధికార పృథఃక్కరణ సిద్ధాంత వివరణ

18.5. మాంటెస్క్యూ సిద్ధాంత ప్రధానాంశాలు

18.6. సిద్ధాంత విమర్శ

18.7. మాంటెస్క్యూ సిద్ధాంత ప్రాధాన్యత

18.8. అమెరికాలో అధికార పృథఃక్కరణ సిద్ధాంత ఆచరణ

18.9. ఇంగ్లండ్, ఇండియాలలో అధికార పృథఃక్కరణ సిద్ధాంతము

18.10 సారాంశము


## 18.2. అధికార పృథఃకరణ సిద్ధాంతము - అర్థము

ప్రభుత్వాంగాలైన శాసన, కార్యనిర్వాహక, న్యాయశాఖల మధ్య సంబంధం ఎలా ఉండాలనే సమస్యలపై రాజనీతి శాస్త్రవేత్తల మధ్య ఏకాభిప్రాయం లేదు. కొందరి దృష్టిలో ప్రభుత్వాంగాల మధ్య సన్నిహిత సంబంధం వుండటం అవసరం. కాని మాంటెస్క్యూ ఈ మూడు శాఖలను స్వతంత్రములయిన మూడు విభిన్న సంస్థలకు అప్పగించాలని వాదించాడు. మాంటెస్క్యూ అధికార కేంద్రీకరణను గర్హించాడు. మాంటెస్క్యూ ప్రతిపాదించిన సిద్ధాంతాన్నే అధికార పృథఃక్కరణ సిద్ధాంతమంటారు.

## 18.3. సిద్ధాంత చరిత్ర

ప్రాచీన గ్రీకు తత్వవేత్త అరిస్టాటిల్ మొదటిసారిగా ప్రభుత్వాధికారాలను 1) శాసన 2) మెజిస్టీరియల్ 3) న్యాయసంబంధమైనవిగా వర్గీకరించాడు. కాని ఈ వర్గీకరణ ఆధునిక శాస్త్రవేత్తలకు ఆమోదయోగ్యంకాదు. ఆ తర్వాత జాన్ లాక్ ప్రభుత్వాధికారాలను 1) శాసన 2) కార్యనిర్వాహక 3) విదేశీ సంబంధమైనవిగా విభజించాడు. కాని ఇది కూడా సరియైన వర్గీకరణ కాదు. ఆ తర్వాత ఫ్రెంచ్ రచయిత అయిన మాంటెస్క్యూ ప్రభుత్వాధికారాలను శాసన, కార్యనిర్వాహక, న్యాయాధికారాలుగా విభజించాడు. ఈ విభజనను ఆధునిక శాస్త్రవేత్త లందరు అంగీకరిస్తారు. కాని మాంటెస్క్యూ ప్రభుత్వ శాఖల మధ్య ఎలాంటి సంబంధంఉండరాదని, అవి పూర్తిగా వేరై ఉండాలంటూ అధికార పృథఃక్కరణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు.

మాంటెస్క్యూ ఫ్రెంచి నియంతయైన 14వ లూయీ హయాంలో ఫ్రాన్స్‌లో జీవించాడు. అందువలన సమకాలీన ఫ్రెంచి రాజకీయ పరిస్థితుల ప్రభావం ఆయనపై విశేషంగా పడింది. 1720 సం. తరువాత ఆయన కొంతకాలము ఇంగ్లండ్‌లో నివసించాడు. ఆ కాలంలో మాంటెస్క్యూ బ్రిటిష్ ప్రజలు అనుభవిస్తున్న స్వేచ్ఛాస్వాతంత్ర్యాల చేత ప్రభావితుడైనాడు. బ్రిటన్‌లోని రాజ్యాంగబద్ధమైన రాజరిక

పాలనను తన మాతృదేశంలోని 14వ లూయీ నిరంకుశ రాజరికపాలనతో పోల్చి బ్రిటన్‌లో ప్రభుత్వాంగాల మధ్య ఎలాంటి సంబంధం ఉండ అవి స్వతంత్రంగా వున్నందువల్లనే బ్రిటిష్ ప్రజలు పరిపూర్ణమయిన స్వేచ్ఛను అనుభవిస్తున్నారనే నిర్ణయానికి వచ్చాడు.

## .4. మాంటెస్క్యూ అధికార పృథఃకరణ సిద్ధాంత వివరణ

మాంటెస్క్యూ తన అధికార పృథఃకరణ సిద్ధాంతాన్ని "స్పిరిట్ ఆఫ్ లాస్" అనే గ్రంథంలో ఈ క్రింది విధంగా వివరించాడు.

శాసన, కార్యనిర్వాహకాధికారాలు ఒకే వ్యక్తి లేదా ఒకే సంస్థ చేతిలో వుండటం వ్యక్తి స్వేచ్ఛకు భంగకరం. ఎందుకంటే శాసనాలను పొందించిన వ్యక్తే వాటిని నిరంకుశంగా అమలుచేసే అవకాశం వుంటుంది. అలాగే న్యాయశాఖను, శాసన, కార్యనిర్వాహక శాఖల ండి వేరుచేయకపోవటం కూడా వ్యక్తి స్వేచ్ఛకు ప్రమాదమే. న్యాయ శాసనాధికారాలను ఒకే వ్యక్తి చెలాయించినట్లయితే వ్యక్తి స్వేచ్ఛ ని నిరంకుశత్వానికి లోనై ఉండవలసి వస్తుంది. శాసనాన్ని తయారుచేసే వ్యక్తి న్యాయపాలన చేసినట్లయితే వ్యక్తి స్వేచ్ఛకు రక్షణ ండదు. అలాగే న్యాయాధికారాన్ని కార్యనిర్వాహకాధికారంతో చేర్చినట్లయితే న్యాయమూర్తి దౌర్జన్యముగా వ్యవహరించే అవకాశం ది. కాబట్టి వ్యక్తి స్వేచ్ఛ పరిరక్షణకు కార్యనిర్వాహక న్యాయాధికారాలలో ఏ రెండూ కూడా ఒకే వ్యక్తి లేదా ఒకే సంస్థ చేతిలో ంద్రీకృతం కాకూడదు.

## 18.5. సిద్ధాంత ప్రధానాంశాలు

మాంటెస్క్యూ అధికార పృథఃక్కరణ సిద్ధాంతంలో ఈ క్రిందివి ప్రధానాంశాలు :

1. వ్యక్తి స్వేచ్ఛ పరిరక్షింపబడాలంటే శాసన; కార్యనిర్వాహక, న్యాయాధికారాలను వేరుచేసి విభిన్న వ్యక్తులకుగాని, విభిన్న సంస్థలకు గాని అప్పజెప్పాలి.
2. పై మూడు అధికారాలలో ఏ రెండూ ఒకే వ్యక్తి చేతిలో ఉండకూడదు.
3. అధికార కేంద్రీకరణ వ్యక్తి స్వేచ్ఛకు భంగకరము.
4. అధికార కేంద్రీకరణ నిరంకుశత్వానికి అధికార దుర్వినియోగానికి దారితీస్తుంది.

## 18.6. సిద్ధాంత విమర్శ

మాంటెస్క్యూ సిద్ధాంతం ఈ క్రింది విధంగా నిశిత విమర్శకు గురియైంది.

**18.6. 1.** మాంటెస్క్యూ భావించినట్లు ఇంగ్లండ్‌లో పూర్తి అధికార విభజనలేదు. పార్లమెంటరీ విధానము అమలులో వున్నందున ఇంగ్లండ్‌లో రాజు, రాజ్యాంగబద్ధుడైన పాలకుడుగా వ్యవహరిస్తున్నాడు. మంత్రిమండలి పార్లమెంటుకు బాధ్యత వహిస్తూ ర్యనిర్వాహణాధికారాన్ని చెలాయిస్తుంది. అదీకాక ఇంగ్లాండులో న్యాయశాఖ గూడ శాసన విభాగం నుండి వేరుచేయబడలేదు. లార్డ్స్ సభ ఉన్నత న్యాయస్థానంగా వ్యవహరిస్తుంది. కాబట్టి మాంటెస్క్యూ భావించినట్లు ఇంగ్లండ్‌లో శాసన, కార్యనిర్వాహక, న్యాయాధికారాలు భిన్న సంస్థలకు అప్పగించడం జరగలేదు. బ్రిటిషురాజును వాస్తవ కార్యనిర్వాహణాధికారిగా భావించి, ఆయనను ఫ్రెంచి రాజుతో పోల్చడంతో మాంటెస్క్యూ సిద్ధాంతము తప్పుత్రోవపట్టింది.

**18.6. 2. ప్రభుత్వాంగాలను పూర్తిగా వేరుచేయడం సాధ్యం కాదు :** ప్రభుత్వాంగాలను పూర్తిగా వేరుపరచటం సాధ్యపడదు. ప్రభుత్వము గూడ జీవమున్న ప్రాణి. అందువలన ప్రభుత్వాధికారాలను సంపూర్ణంగా వేరుపరచి వాటిని స్వతంత్రములైన విభిన్న సంస్థలకు అప్పగించడానికి వీలుపడదు. అలా చేయడం వలన పాలనా సామర్థ్యము దెబ్బతింటుంది. ప్రభుత్వాంగాలను పూర్తిగా వేరుపరిస్తే వాటిమధ్య తరచూ సంఘర్షణలు రావచ్చు.

**18.6. 3. శాసన వ్యవస్థ ఉన్నతమైనది :** మాంటెస్క్యూ అభిప్రాయంలో ప్రభుత్వాంగాలు మూడూ సమాన ప్రాధాన్యతను కలిగి ఉన్నాయి. కాని శాసన విభాగము మిగిలిన రెండింటికంటే ఉన్నతమైనది. శాసన సభలు ఆమోదించిన శాసనాల పరిధులలోనే కార్యనిర్వాహక, న్యాయశాఖలు పనిచేస్తాయి.

**18.6. 4. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి వ్యతిరేకము :** అధికారపృథఃక్కరణ సిద్ధాంతమునకు పార్లమెంటరీ విధానం పూర్తిగ వ్యతిరేకం. ఈ విధానంలో శాసన, కార్యనిర్వాహక వర్గాలు సన్నిహిత సంబంధాన్ని కలిగి ఉంటాయి. మంత్రిమండలి శాసన సభక బాధ్యత వహిస్తూ తన అధికారాన్ని వినియోగిస్తుంది.

**18.6. 5. ప్రభుత్వాంగాల మధ్య అంతర్గత సంబంధమున్నది :** ప్రభుత్వాంగాలను, వాటి అధికార విధులను బట్టి పూర్తిగా వేరుపరచటం సాధ్యం కాదు. ప్రభుత్వాంగాల మధ్య అంతర్గత సంబంధమున్నది. శాసనసభలు, శాసన నిర్మాణంతోపాటు అనేక ఇతర విధులను కూడా నిర్వర్తిస్తున్నాయి. అలాగే కార్యనిర్వాహక వర్గం నియోజిత శాసనాధికారము క్రింద కొంత శాసనాధికారాన్ని వినియోగిస్తున్నది అలాగే న్యాయశాఖ తన న్యాయ సమీక్షాధికారము క్రింద శాసనాలను రాజ్యాంగ విరుద్ధాలని ప్రకటిస్తున్నది. కావున ప్రభుత్వాంగా విధులను పూర్తిగా వేరుపరచుట సాధ్యపడదు. సమర్థవంతమైన పాలనకు ప్రభుత్వాంగాలమధ్య సన్నిహిత సంబంధం ఉండవలసి అవసరం ఎంతైనా ఉంది.

**18.6. 6.** మాంటెస్క్యూ ఊహించిన విధంగా అభివృద్ధి చెందిన పార్టీ విధానం ప్రభుత్వాంగాలను ముఖ్యంగా శాసన, కార్యనిర్వాహ శాఖలను సన్నిహితం చేసింది.

## 18.7. మాంటెస్క్యూ సిద్ధాంత ప్రాధాన్యత

మాంటెస్క్యూ ప్రతిపాదించిన అధికార పృథఃక్కరణ సిద్ధాంతం ఆచరణ యోగ్యము, ఆమోద యోగ్యము కాకపోయినప్పటి దానికి కొంత ప్రాధాన్యత లేకపోలేదు. మాంటెస్క్యూ సిద్ధాంతాన్ని ప్రముఖ ఇంగ్లండ్ న్యాయవాది బ్లాక్ స్టోన్, ప్రఖ్యాత అమెరిక రచయిత హెమిల్టన్ గూడ సమర్ధించారు. మాంటెస్క్యూ చేసిన సిద్ధాంత వివరణ సరియైనది కాకపోయినప్పటికి, అతడు ప్రతిపాదిం లక్ష్యాలు ఉదాత్తమైనవి. అవి 1) వ్యక్తి స్వేచ్ఛను రక్షించడం 2) అధికార దుర్వినియోగాన్ని నిరోధించడం. అధికార కేంద్రీకరణ వ్య స్వేచ్ఛకు ప్రతిబంధకమనే విషయాన్ని అందరూ అంగీకరిస్తారు. మాంటెస్క్యూనే చెప్పినట్లు శాసన, కార్యనిర్వాహక శాఖలను పూర్తిగ వేరుపరచుట సాధ్యం కాదు. కాని న్యాయశాఖను మాత్రం మిగిలిన ప్రభుత్వాంగాలనుండి తప్పక వేరుచేయాలి. స్వతంత్ర న్యాయశ ప్రాముఖ్యాన్ని ఆధునిక రాజ్యాలు గుర్తించాయి. మాంటెస్క్యూ సిద్ధాంతం అమెరికా రాజ్యాంగ నిర్మాతలపైన, ఫ్రెంచి మేధావులపై విశేషమైన ప్రభావాన్ని చూపింది. అధికార పృథఃక్కరణ సిద్ధాంతం ప్రాతిపదికగానే అమెరికా రాజ్యాంగము రచించబడింది. ఫ్రెం మానవహక్కుల ప్రకటనగూడ ఈ సిద్ధాంతాన్ని ఆమోదించింది. కాని అధికారపృథఃక్కరణ సిద్ధాంతాన్ని పూర్తిగా ఆధునిక రాజ్యాలల అమలుచేయడం సాధ్యం కాదు.

## 18.8. అమెరికాలో అధికారపృథఃక్కరణ సిద్ధాంత ఆచరణ

మాంటెస్క్యూ సిద్ధాంతం అమెరికా రాజ్యాంగ నిర్మాతలను ప్రభావితుల్ని చేసిన మాట యధార్థమే. అధికారపృథఃక్కరణ సిద్ధాంతం ప్రాతిపదికగానే అమెరికా రాజ్యాంగం తయారుచేయబడింది. కాని అమెరికాలో గూడ ఈ సిద్ధాంతం పూర్తిగా ఆచరణలో లేదు.

అమెరికాలో అధ్యక్ష పాలనా విధానం అమలులో ఉంది. కార్యనిర్వాహక, శాసన విభాగాలు సిద్ధాంతరీత్యా వేరుచేయబడినాయి అమెరికా అధ్యక్షుడు కాంగ్రెసుకు బాధ్యత వహించడు. కాంగ్రెసును అతడు రద్దు చేయలేడు. కాంగ్రెస్ కూడా మహాభియోగ తీర్మా ద్వారా తప్ప అధ్యక్షుని 4 సం.ల పదవీకాల పరిమితి లోపు తొలగించలేదు. అమెరికాలో న్యాయశాఖకూడా శాసన, కార్య నిర్వాహ శాఖనుండి వేరు చేయబడివుంది. తన న్యాయసమీక్షాధికారాన్ని ఉపయోగించి అమెరికా సుప్రీంకోర్టు కాంగ్రెసు శాసనాలను గాని అధ్యక్షుని ప్రత్యేక ఆజ్ఞలనుగాని రాజ్యాంగ విరుద్ధాలని ప్రకటించగలడు. కావున సిద్ధాంతరీత్యా అమెరికాలో ప్రభుత్వాంగాలు పూర్తిగ వేరుచేయబడినాయి. కాని కాంగ్రెసు అధ్యక్షుడు, సుప్రీంకోర్టుల మధ్య వాస్తవానికి సన్నిహిత సంబంధం వుంది.

1) అమెరికా అధ్యక్షుడు తాను కాంగ్రెసు సమావేశాలకు పంపే సందేశాల ద్వారా సభ్యులను ప్రభావితుల్ని చేయగలడు.

2) అధ్యక్షుడు చేసే ఉన్నతాధికారుల నియామకాలను, ఇతర రాజ్యాంగాలతో కుదుర్చుకొనే సంధులను సెనేట్ ఆమోదించాలి.

అమెరికా అధ్యక్షుడు సుప్రీంకోర్టు న్యాయమూర్తులను నియమిస్తాడు. వీరి నియామకాన్ని సెనేట్ ఆమోదించాలి.

కాంగ్రెసు శాసనాలను, అధ్యక్షుడి ప్రత్యేకాజ్ఞలను న్యాయసమీక్షచేసి సుప్రీంకోర్టు రాజ్యాంగ విరుద్ధాలని ప్రకటించగలదు.

) కాంగ్రెస్ చేసిన శాసనాలను అధ్యక్షుడే వీటో చేయవచ్చును. కాని ఆయన వీటోను 2/3 వంతు మెజారిటీతో కాంగ్రెస్ త్రోసిపుచ్చగలదు.

మహాభియోగ తీర్మానం ద్వారా అమెరికా కాంగ్రెస్ అధ్యక్షుని పదవీచ్యుతుని చేయగలదు.

ఇటీవల కాలంలో పరిపాలక న్యాయం అభివృద్ధి చెందటంతో ప్రభుత్వోద్యోగులు కొన్ని న్యాయసంబంధమైన అధికారాలను చెలాయించడం జరుగుతుంది.

) నియోజిత శాసనాధికారం క్రింద కార్యనిర్వాహకశాఖ చేసే శాసనాల సంఖ్య పెరుగుతున్నది.

) పార్టీ విధానము అమెరికాలో ప్రభుత్వాంగాలను సన్నిహితం చేయటం ద్వారా అధికార పృథఃక్కరణ సిద్ధాంతాన్ని దెబ్బతీసింది.

పై చర్చనుబట్టి అమెరికాలో కూడ అధికార పృథఃక్కరణ సిద్ధాంతం ఆచరణలో లేదు అని చెప్పవచ్చు.

## 18.9. ఇంగ్లండ్, ఇండియాలలో అధికారపృథఃక్కరణ సిద్ధాంతము

పార్లమెంటరీ విధానము అమలులో వున్న ఇంగ్లండ్, ఇండియా దేశాలలో అధికారపృథఃక్కరణ సిద్ధాంతము అమలు జరిగే అవకాశమేలేదు. అసలు పార్లమెంటరీ విధానమే ఈ సిద్ధాంతానికి వ్యతిరేకం. మాంటెస్క్యూ ప్రకారం శాసన, కార్యనిర్వాహక, న్యాయశాఖలు స్వతంత్రంగా ఉండాలి. కాని పార్లమెంటరీ విధానమువలన ఈ రాజ్యాలలో మంత్రివర్గాలు పార్లమెంటులో అంతర్భాగంగా వుంటూ, చర్చలలో పాల్గొంటూ పార్లమెంటుకే నాయకత్వం వహిస్తాయి. మంత్రిమండలి పార్లమెంటుకు వ్యక్తిగతంగాను, సమిష్టిగాను బాధ్యత వహిస్తుంది. పార్లమెంటు విశ్వాసాన్ని పొందినంత కాలం మాత్రమే మంత్రివర్గాలు అధికారంలో ఉంటాయి. కాని వాస్తవానికి తన పార్టీ మెజారిటీ సభ్యుల మద్దతుతో మంత్రిమండలే పార్లమెంటును నడిపిస్తుంది. పార్లమెంటును రద్దుచేయవలసిందని బ్రిటిష్ ప్రధాని రాజుకు, భారత ప్రధాని రాష్ట్రపతికి సలహా ఇవ్వవచ్చును. వారి సలహాను సాధారణంగా పాటించడం జరుగుతుంది.

1. కాబట్టి ఇంగ్లండ్, ఇండియా దేశాలలో పార్లమెంటరీ విధానమున్నందున శాసన, కార్యనిర్వాహక శాఖలు అత్యంత సన్నిహితంగా పనిచేస్తాయి.
2. పరిపాలనా, న్యాయభావన వృద్ధిచెందడంతో ఈ దేశాలలో ప్రభుత్వోద్యోగులు న్యాయాధికారాలనుగూడ కొంతవరకు చెలాయిస్తున్నారు.
3. రెండు దేశాలలోను కార్యనిర్వాహక వర్గము నియోజిత శాసనాధికారాన్ని వినియోగించుకుంటున్నది.
4. శ్రేయోరాజ్యభావన వ్యాప్తి చెందడంతో కార్యనిర్వాహకశాఖ అధికారాలు, విధులు విపరీతంగా పెరిగాయి.

పైగా ఇంగ్లండ్‌లో న్యాయశాఖ పార్లమెంటునుండి పూర్తిగా వేరుచేయబడలేదు. లార్డ్స్ సభయే దేశంలో ఉన్నత న్యాయస్థానంగా వ్యవహరిస్తుంది. బ్రిటన్‌లో న్యాయస్థానాలకు న్యాయసమీక్షాధికారం లేదు.

కాబట్టి ఇంగ్లండ్, ఇండియా దేశాలలో అధికారపృథఃక్కరణ సిద్ధాంతం పూర్తిగా అమలులో లేదు. అలాగే పార్టీ నియంతృత్వము కొనసాగే సోవియట్ యూనియన్ లో గూడ ఈ సిద్ధాంతము ఆచరణలో లేదు. సోవియట్ యూనియన్ లో న్యాయశాఖకు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించబడలేదు. అక్కడి న్యాయస్థానాలకు న్యాయసమీక్షాధికారం లేదు. సుప్రీం సోవియట్, సోవియట్ మంత్రి మండలి రెండూ కమ్యూనిస్టు పార్టీ గుత్తాధిపత్యం క్రిందనే ఉంటాయి. కాబట్టి అక్కడ ఈ సిద్ధాంత ప్రసక్తిలేదు. అలాగే స్విట్జర్లాండ్‌లో గూడా శాసన, కార్యనిర్వాహక శాఖలు పూర్తిగా వేరుచేయబడలేదు.

సమర్థమయిన పాలనకు ప్రభుత్వాంగాల మధ్య సన్నిహిత సంబంధము ఉండటము అవసరము. అయితే వ్యక్తి స్వేచ్ఛ పరిరక్షణకు న్యాయశాఖకు మిగిలిన ప్రభుత్వాంగాలనుండి స్వాతంత్ర్యాన్ని కల్పించాలి. ఈ వాస్తవాన్ని ఆధునిక ప్రభుత్వాలు చాలావరకు గుర్తించాయి.

## 18.10. సారాంశము

అధికార పృథఃక్కరణ సిద్ధాంతం ప్రధానంగా శాసన నిర్మాణ, కార్యనిర్వాహక, న్యాయనిర్ణాయక అంగాలనే మూడు ప్రభు అంగాల మధ్య అధికారాల పంపిణీ గురించి తెలియజేస్తుంది. ఈ సిద్ధాంతం ప్రకారం ఈ మూడు అధికారాలు ఒకే సంస్థలో వ్యక్తిలో కేంద్రీకృతమైతే అప్పుడది నిరంకుశ పాలనకు దారితీస్తుంది. కనుక వ్యక్తి స్వేచ్ఛను కాపాడేందుకు వీలుగా ఈ మూ అధికారాలను మూడు వేర్వేరు ప్రభుత్వశాఖలకు అప్పగించాలి.

### అభ్యాసాలు

**I. వ్యాస ప్రశ్నలు :**

1. అధికార పృథఃక్కరణ సిద్ధాంతాన్ని విమర్శనాత్మకంగా పరిశీలింపుము.
2. అమెరికా, ఇంగ్లండ్, ఇండియాలలో అధికార పృథఃక్కరణ సిద్ధాంతం ఏ విధంగా అమలులో ఉంది.

**II. సంక్షిప్త వ్యాస ప్రశ్నలు :**

1. అధికార పృథఃక్కరణ సిద్ధాంతానికి మాంటెస్క్యూ చేసిన కృషిని వివరింపుము.
2. అధికార పృథఃక్కరణ సిద్ధాంతము అంటే ఏమిటి ?
3. అధికార పృథఃక్కరణ సిద్ధాంతము ఏ విధంగా అమెరికా రాజ్యాంగానికి ప్రాతిపదిక అయ్యింది ?

**III. కుశాగ్రబుద్ధి ప్రశ్నలు**

1. మాంటెస్క్యూ అధికార పృథఃక్కరణ సిద్ధాంతాన్ని ....................................అనే గ్రంథంలో వివరించాడు.
2. మాంటెస్క్యూ ప్రకారం శాసన, కార్యనిర్వాహక, న్యాయశాఖలు.................................... గా ఉండాలి.
3. ఇండియాలో న్యాయశాఖకు ....................................కల్పించబడింది.
4. అమెరికాలో అధికార పృథఃక్కరణ చట్టం అమలులో ....................................
5. పార్లమెంటరీ విధానం అధికార పృథఃక్కరణకు ....................................

పాఠం - 19

# శాసన శాఖ

## ఏకశాసనసభ - ద్వంద్వ శాసన సభ (ఉభయశాసనసభ)

## 19.0. లక్ష్యం

శాసన శాఖలో విభాగాలైన ఏకశాసనసభ, ద్వంద్వ శాసన సభ లేక ఉభయ శాసన సభ నిర్మానాలలో విబేధాలు, అక్షనాలు, గుణదోషాలను వివరించడం, శాసన శాఖ కర్తవ్యాలను విపులీకరించడం ఈ పాఠం లక్ష్యం.

విషయ క్రమం

19.1. పరిచయము

19.2. ఏకశాసనసభ

19.3. గుణాలు

19.4. దోషాలు

19.5. ద్వంద్వ శాసన సభ విధానం

19.6. గుణాలు,

19.7. దోషాలు

19.8. సారాంశము

19.8. శాసనసభలు : అధికారాలు, విధులు

## 19. 1. పరిచయం

ప్రభుత్వము ప్రధానంగా మూడు రకాలైన కర్తవ్యాలను నిర్వహిస్తుంది - శాసనాలను రూపొందించటం, శాసనాలను అమలు పరచటం, న్యాయపాలన. మూడుప్రభుత్వాంగాలు పై కర్తవ్యాలను నిర్వహిస్తాయి. శాసన శాఖ శాసనాలను రూపొందిస్తుంది, కార్య నిర్వాహక శాఖ శాసనాలను అమలు పరుస్తుంది, న్యాయ శాఖ న్యాయపాలన చేస్తుంది. పై మూడు అంగాలలో శాసనశాఖ అత్యంత ప్రధాన అంగముగా పరిగణింప బడుతుంది. ప్రస్తుత ప్రజాస్వామ్య యుగంలో శాసనశాఖ ద్వారా ప్రజాభిప్రాయం శాసన రూపం పొందుతుంది. అందువలన అది అత్యంత కీలకమైన పాత్ర నిర్వహిస్తుంది. శాసనశాఖ ఇతర ప్రభుత్వాంగాలైన కార్యనిర్వాహక శాఖ, న్యాయ శాఖలకు ఆధారంగా ఉండే శాసనశాఖ నిర్మాణ పద్ధతులను పరిశీలించవలసి ఉంది. ఈ వ్యవస్థీకరణను రెండు రకాలుగా వర్ణించవచ్చును. (1) ఏక శాసనసభ (2) ద్వంద్వశాసన సభ లేక ఉభయ శాసన సభ.

## 19. 2. ఏకశాసనసభ

ఒకే శాసన సభతో వ్యవస్థీకరింపబడిన శాసనశాఖకు ఏకశాసన సభ అని పేరు. పార్లమెంటరీ వ్యవస్థకు మాతృకగా ప్రసిద్ధి పొందిన ఇంగ్లీషు పార్లమెంటు ప్రధమంలో ఏక సభా విధానాన్ని అనుసరించింది. ప్రఖ్యాత ఉపయోగితావాది జెర్మీ బెంథాం ఏకసభావాది. న్యూజిలాండ్, డెన్మార్క్, స్వీడన్, గ్రీస్, టర్కీ, యుగోస్లేవియా, బల్గేరియా, పోర్చుగల్, ఫిన్‌లాండ్ వంటి దేశాలు, కెనడా, స్విట్జర్లాండు, ఇండియా దేశాలలో కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఏకసభా విధానాన్ని అనుసరిస్తున్నాయి.

ఏక శాసన సభగల రాజ్యాలలో అత్యధికమైన జాతీయ సమైక్యత ఏర్పడుతుందనే భావనతో ఏకశాసనసభను సమర్థించారు. భిన్న సమస్యలు, భిన్న వివాదాలు, భిన్నాభిప్రాయాలు లేని ప్రశాంత వాతావరణంలో శాసనాలు రూపొందించ బడతాయని వారి వాదన. ఈ పద్ధతిలో గల గుణదోషాలు ఈ దిగువ పేర్కొన్న విధంగా ఉంటాయి.

## 19.3. గుణాలు

19.3. 1. తక్కువ ఖర్చు : ఒకే శాసనసభ ఉండటం వలన దీని నిర్మాణానికి అవసరమయ్యే ఎన్నికల నిర్వహణ, సిబ్బంది జీత, భత్యాలు, ప్రతినిధులకు సౌకర్యాలు మొదలైన వాటి విషయములో ఖర్చు తక్కువగా ఉంటుంది.

19.3. 2. ప్రజాభిప్రాయాన్ని సక్రమంగా తెలియపరుస్తుంది.

19.3. 3. సౌలభ్యతతో, సున్నితంగా, త్వరితగతిలో శాసననిర్మాణ కార్యక్రమాలు జరుగుతాయి.

19.3. 4. సభాకార్యక్రమాలు పునరావృతం కావు. జాప్యం నివారించబడుతుంది.

19.3. 5. భిన్నాభిప్రాయాలకు గాని, భిన్న సమస్యలకు గాని తావుండదు. సభా కార్యకలాపాలకు ప్రతిష్టంబన కలగదు. రాజ్యమంతటా ఒకే విధాన నిర్ణయాలను నిరాటంకంగా అమలు చేయవచ్చును.

19.3. 6. ఏక శాసన సభ ఏకైక లక్ష్యంతో తన కార్యక్రమాలను నిర్వహిస్తుంది.

19.3. 7. ప్రగతి పూర్వక శాసన నిర్మాణానికి అనుకూలంగా ఉంటుంది.

19.3. 8. తాను ఆమోదించిన శాసనాల మంచి చెడులకు తానే సంపూర్ణ బాధ్యత వహిస్తుంది.

పైన వివరించిన గుణాలవలన ఏకశాసన సభ సరళమైందిగా, స్పష్టమైనదిగా, నిర్దిష్టమైనదిగా, బాధ్యత కలిగినదిగా ఉంటుంది. ద్వంద్వ ప్రమాణాలకు అతీతంగా అత్యంత శక్తి వంతముగా పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో కార్య నిర్వాహకశాఖ నియంతృత్వాన్ని అంతమొందిస్తుంది.

## 19.4. దోషాలు

19.4. 1. అవాంఛనీయమైన తొందరపాటుతో చట్టాలను ఆమోదించే ప్రమాదముంది. తప్పుడు శాసనాలు, ప్రమాదభరితమైన శాసనాలూ తయారయ్యే అవకాశాలు చాలా ఉన్నాయి.

19.4. 2. ఒకే రాజకీయపార్టీకి అత్యధిక మెజారిటీ సభ్యుల మద్దతు ఉన్నప్పుడు శాసనాలు నియంతృత్వ పద్ధతిలో తయారవుతాయి.

19.4. 3. క్షణికావేశాలకు, ప్రసంగాల ప్రభావానికి లోనయి తొందరపాటు నిర్ణయాలు చేసే అవకాశముంది.

19.4. 4. ఏకశాసన సభ అధికార పార్టీకి చెందిన నాయకుల చేతిలో కీలుబొమ్మగా వ్యవహరిస్తుంది.

19.4. 5. సభా నిర్ణయాలను పునర్విమర్శ చేసే వీలులేదు.

19.4. 6. బాధ్యతారహిత శాసనాలు అంతిమంగా ప్రభుత్వ అస్థిరతకు దారితీస్తాయి.

## 19.5. ద్వంద్వ శాసన సభ లేక ద్విసభావిధానం

దిగువసభ, ఎగువసభ రెండు సభలతో - శాసన శాఖానిర్మాణం జరిగినపుడు దానికి ద్వంద్వ శాసన సభ అని పేరు. 18వ శతాబ్దిలో కొంతకాలం వరకు మాత్రమే ఏకసభావిధానం సమర్థించబడింది. ఒకే సభతో ఏర్పడిన ఇంగ్లీష్ పార్లమెంటు కాలక్రమంలో వచ్చిన సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిణామాల వలన రెండుసభలుగా మార్పుచెందింది. ఈ అనుభవాన్ని పురస్కరించుకొని ఇంచుమించు అన్ని ప్రపంచ రాజ్యాలు ద్విసభావిధానాన్ని అనుసరిస్తున్నాయి. దిగువ సభ ప్రజాప్రతినిధులతో కూడిన సభ. వారు ప్రత్యక్ష ఎన్నికలలో ప్రజలచేత నిర్ణీత కాలానికి ఎన్నుకోబడతారు. ఎగువసభకు ప్రతినిధులు పరోక్ష పద్ధతిలో ఎన్నుకోబడుతారు. ఈ ఎగువ సభ నిర్మాణంలో ప్రపంచ రాజ్యాలు ఈ క్రింది భిన్న పద్ధతులను అనుసరిస్తున్నాయి.

**19.5. 1. వంశ పారంపర్య పద్ధతి :** ఈ పద్ధతిని బ్రిటన్ అనుసరిస్తున్నది. ఎగువ సభయైన హౌస్ ఆఫ్ లార్డ్స్‌కు నేం కొంతమంది సభ్యులు వంశపారంపర్య పద్ధతిలో నియమించబడతారు.

**19.5. 2. నామనిర్దేశం :** వివిధ రంగాలలో ప్రఖ్యాతి గాంచిన వ్యక్తులను నియమితకాలానికి గాని లేక జీవిత సభ్యులుగా గాని నియమించవచ్చును.

**19.5. 3. ప్రత్యక్ష ఎన్నిక పద్ధతి :** అమెరికా సంయుక్తరాష్ట్రాలలో ఎగువ సభయైన సెనేట్‌కు 100 మంది ప్రతినిధులు. 50 రాష్ట్రాలచే ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నుకోబడతారు. ఆస్ట్రేలియాలో కూడా ఇదే పద్ధతి అమలులో ఉన్నది.

**19.5. 4. పరోక్ష ఎన్నిక పద్ధతి :** ప్రాతినిధ్య విధానాన్ని విస్తరించటంకోసం ఈ పరోక్ష ఎన్నిక పద్ధతి అనుసరింపబడుతున్నది ఉదా: భారతదేశంలో ఎగువసభయైన రాజ్యసభకు 238 మంత్రి ప్రతినిధులు రాష్ట్ర విధాన సభలచే ఎన్నుకోబడతారు. 12 మంది సభ్యులను రాష్ట్రపతి నామనిర్దేశం చేస్తాడు. వీరు శాస్త్ర విజ్ఞానం, కళలు, సాహిత్యం, సంఘసేవ మొదలైన వివిధ రంగాలలో ప్రఖ్యాతి పొందిన వారై ఉంటారు.

## 19.6. ద్వంద్వ శాసన సభ - గుణాలు

**19.6. 1. దిగువ సభ నియంతృత్వాన్ని అరికట్టడం :** సాధారణంగా దిగువసభలో అత్యధికస్థానాలను గెలుచుకొన్న రాజకీయపార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. తన సంఖ్యాబలంతో ప్రతిపక్షాల నిరసనలను అధిగమిస్తూ తన ఇష్టమైనరీతిలో ఇష్టమైన శాసనాలను రూపొందించి అమలు చేస్తుంది. అనాలోచితంగా, బాధ్యతారహితంగా వ్యవహరిస్తుంది. మొదటి శాసనసభ అనుసరించే ఇటువంటి నియంతృత్వాన్ని నివారించడానికి రెండవ సభ అవసరమని జె.ఎస్. మిల్ వాదన.

**19.6. 2. తొందరపాటు శాసన నిర్మాణాన్ని అరికట్టడం :** అధికార పార్టీ ప్రాబల్యంతో దిగువ సభలో జరిగే చర్చలు ఆవేశ పూరితంగాను, ఉద్రేకంగాను ఉంటాయి. పక్షపాతవైఖరితోగాని, ద్వేషమువలనగాని అనాలోచితంగా తొందరపాటుతో శాసన నిర్మాణంజరుగుతుంది. శాసన నిర్మాణ బాధ్యత రెండు సభలు పంచుకొన్నప్పుడు దిగువ సభచేసే తొందరపాటు చర్యలను అనుభవజ్ఞులు, నిష్ణాతులు, దూరదృష్టికల సభ్యులున్న ఎగువసభ విజయవంతముగా నివారించగలుగుతుంది, దుష్ఫలితాల నుండి రాజ్యము కాపాడబడుతుంది.

**19.6. 3. ప్రత్యేక వర్గాలకు ప్రత్యేక ప్రాతినిధ్యం :** దిగువ సభ రాజకీయ పక్షాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. రాజకీయాలకు అతీతంగా ఉండే ప్రత్యేకవర్గాలైన విజ్ఞానవేత్తలు, మేధావులు, ప్రత్యేక రంగాలలో నిష్ణాతులకు ఎగువ సభలో ప్రత్యేక ప్రాతినిధ్యం లభిస్తుంది. సాధారణంగా నామనిర్దేశం ద్వారా సభ్యత్వాన్ని పొందిన ఈ అనుభవజ్ఞులు రాజ్యానికి తమ సేవలను యథాశక్తితో అందించగలరు.

**19.6. 4. బిల్లులలో లోప సవరణ :** ఒకే సభ ఉన్నపుడు అది ఆమోదించే బిల్లుల తయారీలో, భాషాపరంగా లేక చట్టపరంగా లోపాలుండవచ్చు. దీనివలన పర్యవసానాలతో కూడిన ఇబ్బందులు మరియు పరిపాలనలో అసౌకర్యము కలుగవచ్చు. ఈ లోపాలు రెండవ సభ ఉన్నప్పుడు సవరించబడతాయి. ప్రజ్ఞావంతులు, మేధావులు, నిష్ణాతులైన రెండవ సభ సభ్యులు తమ పరిశీలనకు వచ్చిన బిల్లులను నిశితంగా పరిశీలించి, వాటి లోపాలను సరిదిద్ది, ఆమోదించి సక్రమమైన శాసన నిర్మాణానికి తోడ్పడతారు.

**19.6. 5. సక్రమమైన ప్రజాభిప్రాయ వ్యక్తీకరణ :** ఒకే శాసన సభ సక్రమమైన ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించలేదు. ఈసభకు సభ్యులు నియమిత కాలపరిమితికి ఎన్నుకోబడతారు. సామాన్య ప్రజానీకానికి మాత్రమే ప్రాతినిధ్యాన్ని వహిస్తారు. ఎగువ సభ సభ్యులు మేధావివర్గాలకు, శిష్టవర్గాలకు, సంపన్న వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ విధంగా ప్రజాభిప్రాయం విస్తరణ చెందుతుంది.

**19.6. 6. శాశ్వత సభ :** దిగువ సభకు సభ్యులు నిర్ణీత కాలపరిమితికి ఎన్నుకోబడతారు. పదవీకాలం ముగియగానే సభ రద్దుచేయబడుతుంది. మరల ఎన్నికలు జరుగుతాయి. ఎగువసభ శాశ్వతమైనది. భారతదేశం వంటి రాజ్యాలలో ప్రతీ రెండు సంవత్సరాలకు 1/3వ వంతు సభ్యులు పదవీ విరమణ చేయగా వారిస్థానంలో నూతన సభ్యులు పదవీస్వీకారం చేస్తారు. అనగా ఎగువసభ ఎప్పుడూ రద్దు కాదు. పాతకొత్తల మేలు కలయికగా సీనియర్ సభ్యుల అనుభవం నుండి నూతన సభ్యులు ప్రయోజనాన్ని పొందుతారు. అవసరమయినంత విషయ పరిజ్ఞానాన్ని సంపాదిస్తారు. చిత్తశుద్ధితో శాసన నిర్మాణ కార్యక్రమంలో పాల్గొంటారు.

**19.6. 7. బరువు, బాధ్యతల పంపిణీ :** శాసనశాఖ నిర్వహించవలసిన అధికారాలు, బాధ్యతలు నిరంతరం అధికమవుతున్నాయి. ఈ బరువు, బాధ్యతలను ఒకే సభ నిర్వహించడానికి తగిన వ్యవధి ఉండదు. కాలం వృధా అవుతుంది. శ్రమ పెరుగుతుంది. ద్వంద్వ శాసనసభా విధానంలో శ్రమ విభజన జరుగుతుంది. అత్యంత ముఖ్యమైన కార్యక్రమాలపై దృష్టి కేంద్రీకరించడానికి దిగువసభకు తగిన వ్యవధి లభిస్తుంది.

**19.6. 8. కార్యనిర్వాహక శాఖకు స్వేచ్ఛావకాశం :** ద్వంద్వ శాసన సభ విధానంలో ఒక సభ రెండవ సభను నియంత్రించుకుంటూ కార్యనిర్వాహక శాఖకు కొంతస్వేచ్ఛావకాశాన్ని కలుగజేస్తాయి. బిల్లుల ఆమోదం కొరకు ప్రభుత్వం పూర్తిగా ఒకే సభపై ఆధారపడే కన్నా రెండు సభలపై ఆధారపడటం మంచిది. కార్యనిర్వాహక శాఖ తనను తాను బలపరచుకొనటానికి విశాలావకాశం లభిస్తుంది.

**19.6. 9. స్వేచ్ఛకు రక్షణ :** ఒకే శాసన సభలో అధికారాలన్నీ కేంద్రీకృతమైనపుడు అది తిరుగులేని, అదుపులేని నియంతృత్వ ధోరణితో శాసనాలు చేస్తుంది. అట్టి శాసనాలు ప్రజాసంక్షేమానికి, ప్రజాస్వామ్యవిలువలకు ఆటంకాలు కలుగచేస్తాయి. రెండు సభలున్నపుడు శాసనాధికారాలు వికేంద్రీకరించబడతాయి. ప్రశాంత వాతావరణంలో ఆలోచనాపునరాలోచనలతో శాసనాలు చేయబడతాయి. వ్యక్తి స్వేచ్ఛకు రక్షణ కలుగుతుంది.

**19.6. 10. సమాఖ్య వ్యవస్థకు అనివార్యం :** దిగువ సభ జనసంఖ్యకు ప్రాతినిధ్యం కలిగిస్తుంది. దీనివలన సమాఖ్యవ్యవస్థలో అధికజనసంఖ్య కల కొద్ది రాష్ట్రాలు మాత్రమే ప్రాబల్యాన్ని పొందగలుగుతాయి. ఈ అసమానత్వాన్ని తొలగించుటకై రెండవసభ అనివార్యం. ఇందులో రాష్ట్రాలకు ప్రాతినిధ్యం లభిస్తుంది. దీనివలన వివిధ రాష్ట్రాల మధ్య వ్యత్యాసాలు, వైషమ్యాలు తొలగించటమే కాక దేశసమైక్యతను పెంపొందించవచ్చును.

## 19. 7. ద్వంద్వ శాసనసభ - దోషాలు

బెంజిమన్ ఫ్రాంక్లిన్, బెంథాం, హెరాల్డ్‌లాస్కీ, సామ్యూల్ ఆడమ్స్ మొదలైన ప్రముఖులు ఈ క్రింది వాదనల ద్వారా ద్వంద్వ శాసన సభా విధానాన్ని విమర్శించారు.

**19.7. 1. ఎగువసభ నిరర్థకం :** దిగువ సభ నిర్ణయాలతో ఎల్లప్పుడూ ఎగువసభ ఏకీభవిస్తే దాని వలన ఏమీ ప్రయోజనం లేదు. అలాగాక వ్యతిరేకించేది అయితే అది కుత్సితమయిన సభ. రెండు సభలున్నప్పుడు భిన్నాభిప్రాయాలుండటం అతిసహజం. అది ప్రజాస్వామ్యానికి విఘాతాన్ని కలిగిస్తుంది.

**19.7. 2. ప్రజాభిప్రాయానికి ఆటంకం :** ప్రజలచేత ప్రత్యక్ష ఎన్నికలద్వారా నియమిత కాలానికి ఎన్నుకొనబడిన సభ్యులతో నిర్మింపబడిన దిగువ సభ మాత్రమే ప్రజాభిప్రాయానికి వాస్తవప్రతిబింబము. పరోక్షపద్ధతిలో పదవిని పొందిన సభ్యులతో నిర్మింపబడిన ఎగువసభ ప్రజాభిప్రాయాన్ని వ్యక్తపరచలేదు. అటువంటి సభ దిగువసభను నియంత్రించడం అప్రజాస్వామిక మవుతుంది.

**19.7. 3. శాసన నిర్మాణంలో కాలహరణం - ప్రతిష్టంబన :** ప్రతిబిల్లు దిగువసభలో ప్రవేశపెట్టింది మొదలు రాజ్యాధినేత ఆమోదం పొందేవరకు ఏడుదశలను దాటవలసి ఉంటుంది. దిగువసభలో చర్చల అనంతరం ఆమోదించబడిన బిల్లు మరల ఎగువసభలో అదేవిధంగా చర్చింపబడటం వలన అనవసరమైన కాలహరణమే కాని ప్రత్యేకప్రయోజనమేమీ లేదు. ఈ చర్చలు లాంఛనప్రాయం గానే ఉంటాయి. దిగువసభ ఆమోదాన్ని పొందిన బిల్లును ఎగువ సభ తిరస్కరిస్తే ప్రతిష్టంబన ఏర్పడుతుంది. కాలయాపన జరుగుతుంది. ఉభయసభల సంయుక్తసమావేశం ఏర్పాటుచేయవలసి ఉంటుంది.

**19.7. 4. దిగువ సభ సార్వభౌమత్వానికి అంతరాయం :** అన్ని రాజ్యాలలో దిగువ సభలే శక్తివంతమైనవి. ప్రజలచే ప్రత్యక్ష ఎన్నికలలో ఎన్నుకొనబడే సభ్యులు ప్రజాభిప్రాయాన్ని వ్యక్తం చేయగలుగుతారు. ప్రజాసార్వభౌమాధికారం దిగువసభ ద్వారా మాత్రమే ఉంటుంది. అంతేకాక సంఖ్యాబలం కూడా ఎగువసభకన్న దిగువ సభకే ఉంటుంది. అందువలన దిగువసభ నిర్ణయాలను ఎగువ సభ తిరస్కరించడం కేవలం ప్రజాసార్వభౌమత్వానికి అంతరాయమే కాని వేరే ప్రయోజన మేమీ ఉండదు.

**19.7. 5. ఎగువ సభ ఒక అప్రజాస్వామిక వ్యవస్థ :** పరోక్ష పద్ధతులలో నిర్మింపబడే ఎగువసభ ఒక అప్రజాస్వామిక వ్యవస్థ అని చెప్పవచ్చు. ఉదా : బ్రిటన్‌లో హౌస్ ఆఫ్ లార్డ్స్ వారసత్వ పద్ధతిని అనుసరిస్తోంది. కెనడాలో సెనేట్ సభ్యులు జీవితకాలానికి

నామనిర్దేశన చేయబడతారు. భారతదేశంలో కూడా రాజ్యసభ ప్రజల తిరస్కారాన్ని పొందిన రాజకీయ వేత్తలకు పునరావాసం కల్పిస్తుందనే విమర్శ ఉన్నది.

**19.7. 6. ప్రగతికి అవరోధం :** ఎగువసభలో ఉండే ప్రత్యేక వర్గాలు ముఖ్యంగా సాంప్రదాయిక వాదులు, సంపన్నులు, పెట్టుబడిదారులు దిగువ సభ ఆమోదించే ప్రగతి పూర్వక నిర్ణయాలకు అనవసరమైన ఆటంకాన్ని, అంతరాయాన్ని, కాలహరణాన్ని కలుగజేస్తూ ప్రగతిపథానికి అవరోధాన్ని కలుగజేస్తాయి.

**19.7. 7. దుర్వ్యయం :** ఏక సభావిధానం ద్వారా సమర్థవంతంగా నిర్వహించగలిగే శాసన నిర్మాణ కార్యక్రమానికి రెండవసభ అనవసరం. ఖర్చుతో కూడినపని. జాతీయ ఆదాయాన్ని దుర్వ్యయం చేయడమే అవుతుంది.

**19.7. 8. సమాఖ్య వ్యవస్థకుద్వంద్వ శాసనసభ అవసరం లేదు :** రాష్ట్రాల ప్రయోజనాలు ఎగువ సభ కాపాడుతుందని చెప్పుటలో వాస్తవంలేదు. అది పొరపాటు. రెండు సభలు పార్టీ ప్రాతిపదికపై నిర్మింపబడతాయి. సభాకార్యకలాపాలకు చెందిన నియమాలు కూడా ఒక్కటే. అందువలన రాష్ట్రాలప్రయోజనాలు కాపాడటంలో ఎగువసభ ముందంజ వేసే అవకాశం లేదు. ఎగువసభ అధికారాలు నామమాత్రమే కాని వాస్తవంకాదు. నిర్ణయాత్మక పాత్ర వహించలేదు.

## 19.8. సారాంశము

ఏక శాసనసభ, ద్వంద్వశాసన సభ విధానాల గుణదోషాలను పరిశీలించినపుడు ఈక్రింది కారణాలవలన ద్వంద్వ శాసన సభ విధానమే శ్రేయస్కరమని చెప్పవచ్చు.

1. సాధారణ బిల్లుల విషయంలో ఎగువ సభ చాలా వరకు సభ కార్యభారాన్ని తగ్గిస్తుంది. పరిమిత కాలంలో అన్ని బిల్లులను ఒకే సభ పరిశీలించడం, సకాలంలో ఆమోదించడం అసాధ్యం.
2. ఉభయసభలలో పార్టీల ప్రాబల్యం ఉంటుంది. ఒక సభ ఆమోదించిన బిల్లు రెండవసభ పరిశీలించి ఆమోదించడంలో అంతగా జాప్యం ఉండదు. కొంత జాప్యం ఉన్నప్పటికి కొన్ని లోపాలను సవరించుకొనే అవకాశం ప్రభుత్వానికి లభిస్తుంది.
3. విస్తృత ప్రజాప్రాతినిధ్యానికి ద్వంద్వ సభావిధానం ఒక ప్రతీక. విభిన్న వర్గాలకు తగిన ప్రాతినిధ్యం లభిస్తుంది. జాతి, తెగ, మతం, భాష, ప్రాంతం మొదలైన భిన్నత్వంకల రాజ్యాలలో సహజసిద్ధంగా ఉండే అసమానతలను తగిన ప్రాతినిధ్యం ద్వారా తొలగించవచ్చును.

చారిత్రకానుభవం ద్వంద్వ సభావిధానాన్ని సమర్థిస్తుందని ప్రొఫెసర్ మెరియట్ అభిప్రాయం, ఇంగ్లండ్‌లో జరిగిన అంతర్యుద్ధ కాలంలో రద్దు చేయబడిన ఎగువసభ మరల పునరుద్ధరింపబడింది. సమ్మేళన రాజ్యంగా అమెరికా ఉన్నప్పుడు అనుసరించిన ఏక సభావిధానం తరువాత కాలంలో అనగా 1787లో సమాఖ్యగా మారినపుడు ద్విసభా పద్ధతి ప్రవేశపెట్టబడినది. చాలావరకు ప్రజాస్వామిక రాజ్యలేకాక కమ్యూనిష్టు రాజ్యాలు కూడా ద్వంద్వసభ పద్ధతిని రాజ్యాంగ బద్ధంగా నిర్మించుకొన్నాయి. కొన్ని చిన్న రాజ్యాలు తమ ఎగువ సభలను రద్దుచేసుకున్న విషయం కూడా గమనించదగినవే. ఉదా : డెన్మార్క్, న్యూజిలాండ్.

## 19. 9. శాసన సభలు - అధికారాలు, విధులు

ప్రజల అభీష్టానుసారము శాసనాలు చేయడమే శాసన సభకు ముఖ్యమైన విధి. ఆధునిక యుగంలో శాసనసభలు శాసనవిధులతోపాటు అనేకమైన ఇతర విధులుకూడా నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వ విధానాలను అనుసరించి శాసనసభల విధులు, అధికారాలు ఆధారపడి ఉంటాయి. ఉదా : శాసనసభల అధికారాలు అధ్యక్షవిధానంలో పరిమితంగా ఉంటాయి. పార్లమెంటరీ విధానంలో విస్తారంగా ఉంటాయి. వివిధ రాజ్యలలో శాసనసభలు నిర్వహించే విధులను ఈ క్రింది విధంగా వివరించవచ్చును.

**19.9. 1.శాసన విధులు :** ప్రజాభిమతాన్ని గుర్తించి దానికనుగుణంగా శాసనాలు చేయటం శాసనసభ ముఖ్యవిధి. ఈ ప్రక్రియలో నూతన శాసనాలు చేయబడతాయి. ప్రస్తుత శాసనాలలో అవసరమయే సవరణలు చేయబడతాయి. పనికిరాని పాతశాసనాలు రద్దుచేయబడతాయి. చట్టంగా రూపొందె ముందు చర్చింపబడే ముసాయిదా (Draft) ను బిల్లు అంటారు. ఈ బిల్లులు రెండు రకాలు. ప్రభుత్వం ప్రతిపాదించే ప్రభుత్వబిల్లులు లేక అధికార బిల్లులు. సాధారణ సభ్యులు ప్రతిపాదించే ప్రయివేటు బిల్లులు లేదా అనధికార బిల్లులు. శాసన సభవారి ఆమోదం, రాజ్యాధినేత అనుమతి పొందిన బిల్లు చట్టమవుతుంది.

**19.9. 2.చర్చాకార్యక్రమము :** వివిధాంశాలపై వివరంగా చర్చలు జరపటం, సమాలోచనలు చేయటం కూడా ఒక ముఖ్యవిధి. ప్రవేశపెట్టబడిన ప్రతి బిల్లు వివరంగా పరిశీలించబడుతుంది. జాతిజీవనానికి సంబంధించిన విషయాలు, ప్రస్తుత సమస్యలు చర్చింపబడతాయి. తీర్మానాలు చేయబడతాయి. ఫలితంగా, రాజ్యంలో నిరంకుశ ధోరణులు, ప్రమాదకర పరిస్థితులు నివారింపబడతాయి. ఉదా : సావధాన తీర్మానము, వాయిదా తీర్మానం మొదలైనవి. అవసరమైనపుడు నివేదనలు లేక హెచ్చరికలు చేయబడతాయి. ఫలితంగా, రాజ్యంలో నిరంకుశ ధోరణులు, ప్రమాదకర పరిస్థితులు నివారింపబడతాయి.

**19.9. 3. పాలనా సంబంధ విధులు :** పార్లమెంటరీ విధానంలో కార్యనిర్వాహక శాఖను నిర్దేశించి, నియంత్రించే అధికారం శాసన సభకు ఉంటుంది. వ్యక్తిగతంగాను, సమిష్టిగాను మంత్రులందరూ శాసనసభకు బాధ్యత వహిస్తారు. పాలనా వ్యవహారాలకు సంబంధించిన ప్రశ్నలు, అనుబంధప్రశ్నలు, అభిశంసనతీర్మానాలు, అవిశ్వాస తీర్మానాలు ద్వారా శాసనసభ కార్యవర్గాన్ని అదుపుచేస్తుంది. దాని అనుమతి, విశ్వాసం ఉన్నంతవరకే ప్రభుత్వం అధికారంలో ఉంటుంది. ఈ విశ్వాసాన్ని కోల్పోతే ప్రభుత్వం రాజీనామా చేస్తుంది. శాసన సభ సమావేశంలో లేనపుడు కార్యనిర్వాహక వర్గానికి ఆర్డినెన్స్‌లను చేసే అధికారం ఉంది. నియమిత కాలంలో ఈ ఆర్డినెన్స్‌లు విధిగా శాసనసభ ఆమోదం పొందితీరాలి. తిరస్కరింపబడిన ఆర్డినెన్స్‌లు రద్దు చేయబడుతాయి. అధ్యక్షపాలనావిధానం అనుసరిస్తున్న అమెరికా సంయుక్తరాష్ట్రాలలో అధ్యక్షులు చేసే ఉద్యోగ నియామకాలకు, విదేశాలతో చేసే సంధి సంప్రదింపులకు సెనేట్ (ఎగువసభ) ఆమోదము ఉండితీరాలి. ఈ విధంగా శాసన సభ తన పాలనా సంబంధ విధులను నెరవేరుస్తుంది.

**19.9. 4. ఆర్థిక సంబంధ విధులు :** ప్రజాస్వామ్య రాజ్యాలలో జాతి ఆర్థిక వనరులమీద శాసన సభ అధికారము అత్యున్నతమైనది. ప్రభుత్వ ఆదాయ, వ్యయ కార్యక్రమాలన్నీ విధిగా శాసనసభ ఆమోదాన్ని పొందితీరాలి. ప్రతి ఆర్థిక సంవత్సరం ఆరంభంలోనే ప్రభుత్వం తన ఆదాయ, వ్యయపట్టిక అయిన వార్షిక బడ్జెట్‌ను సభకు సమర్పిస్తుంది. ఎంత ఆదాయం ఏవిధంగా పొందాలి, ఏయే కార్యక్రమాలకు ఏయే శాఖల ద్వారా ఎంతఖర్చు చేయాలో శాసన సభ నిర్ణయిస్తుంది. పన్నులు విధించాలన్నా, రద్దుచేయాలన్నా శాసనసభ అనుమతిపొందాలి. విత్త బిల్లులన్నీ దిగువసభలోనే ప్రవేశపెట్టాలి. ఈ విషయంలో ఎగువ సభ ప్రమేయం కేవలం నామమాత్రమే.

**19.9. 5. రాజ్యాంగ విధులు :** రాజ్యాంగాన్ని సవరించే అధికారం కూడా శాసన సభకు ఉంటుంది. ప్రతిరాజ్యము ఈ రాజ్యాంగ సవరణకు ప్రత్యేక పద్ధతిని అనుసరిస్తుంది. ఉదా: బ్రిటన్‌లో పార్లమెంట్ సాధారణ మెజారిటీతో రాజ్యాంగ చట్టాల సవరణకు సభలలో అత్యధిక మెజారిటీతోపాటు నాలుగింట మూడువంతుల రాష్ట్రాల శాసనసభల ఆమోదం అవసరము.

**19.9. 6. న్యాయ సంబంధ విధులు :** కొన్ని రాజ్యాలలో శాసన సభలు న్యాయకర్తవ్యాలను కూడా నిర్వహిస్తున్నాయి. ఉదా: భారతదేశంలో, అమెరికాలో శాసనశాఖకు దేశాధినేతను అభిశంసించే అధికారం ఉంది. బ్రిటన్‌లో ఎగువసభయైన హౌస్ ఆఫ్ లార్డ్స్ అత్యున్నత న్యాయస్థానంగా అప్పీళ్ళను పరిష్కరిస్తుంది. వీటితోపాటు ప్రత్యేక సభాహక్కులను అతిక్రమించిన నేరస్తులను సభముందు హాజరు పరచి, విచారించడానికి, నిర్బంధించడానికి, దండించడానికి శాసన సభకు అధికారముంది.

**19.9. 7. ఎన్నిక సంబంధ విధులు :** ఎన్నికలలో పాల్గొని ఓటు ద్వారా అభ్యర్థులను ఎన్నుకోవడం కూడా శాసన సభ కర్తవ్యము. ఉదా: భారతదేశంలో శాసన సభాధ్యక్షుడు, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతులను శాసనశాఖ ఎన్నుకొంటుంది. అమెరికాలో అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు జరిగినప్పుడు ఓట్ల లెక్కింపు, గెలుపుపొందిన అభ్యర్థులపేర్ల ప్రకటింపు శాసనసభచేస్తుంది. స్విట్జర్లాండ్‌లో ఫెడరల్ కౌన్సిల్ సభ్యులు ఫెడరెల్ అసెంబ్లీచే ఎన్నుకోబడతారు.

**19.9. 8. ప్రజల ఇక్కట్ల విచారణ :** శాసన సభ ద్వారా ప్రజల కష్ట నిష్టూరాలు వెలుగులోకివస్తాయి. ప్రభుత్వం దృష్టికి తేబడతాయి. జాతీయసమస్యలతోపాటు అంతర్జాతీయ సమస్యలపై చర్చలు జరుగుతాయి. అత్యంత క్లిష్టమైన సమస్యలకు పరిష్కార మార్గాలు అన్వేషింపబడతాయి.

**19.9. 9. విచారణ విధులు :** ప్రభుత్వరంగ సంస్థలు పనిపాట్లు, లాభనష్టాలు, ప్రభుత్వధోరణివలన ప్రజలనుభవిస్తున్న కష్టనష్టాలు, ఆకస్మిక సంఘటనలు మొదలైనవాటిని నిశితంగా పరిశీలించి, నివేదికలను అందచేయమని కొన్ని విచారణ కమిటీలను నియమించి, ఆజ్ఞాపిస్తుంది.

పైన వివరించిన విధంగా శాసన సభలు విభిన్నమైన విధులను, అధికారాలను వినియోగించుటలో అమోఘమైన పాత్రను నిర్వహిస్తూ ప్రత్యేకంగా వర్ధమాన రాజ్యాలలో రాజకీయాభివృద్ధికి తోడ్పడుతున్నవి.

పాఠం - 20

# శాసన శాఖ, దాని పాత్ర, కమిటీ విధానము, ప్రతి పక్షం పాత్ర

## 20.1. లక్ష్యం

శాసన శాఖ నిర్వహించే విధులు, కర్తవ్యాలను చర్చించటం, ఆధునిక ప్రజాస్వామ్యాలలో శాసన శాఖ ప్రాధాన్యతను అది నిర్వహించే పాత్రను వర్ణించటం కమిటీ విధానం ఆవశ్యకత, రకములు, పనిచేసే విధానాలను పరిశీలించటం, శాసన సభలో ప్రతిపక్షం యొక్క పాత్రను తెలియచేయటం.

విషయ సంగ్రహం :


20.1. పరిచయం

20.2. శాసనశాఖ విధులు

20.3. కమిటి పద్ధతి

20.4. కమిటీలు రకాలు

20.5. ప్రతిపక్ష పాత్ర

20.6. ప్రతిపక్షం - కర్తవ్యాలు

20.7. సారాంశం


## 20.1. పరిచయం

శాసన నిర్మాణ విధులను నిర్వహించటం శాఖ ముఖ్యవిధి. ఈ శాఖ నిర్వహించే విధులు గాని, దాని ప్రాధాన్యతగాని అన్ని రాజ్యాలలోను ఒకే విధంగా ఉండవు. అవి ప్రభుత్వ విధానాన్ని అనుసరించి ఉంటాయి. నిరపేక్షరాజరికవ్యవస్థ ఉన్నరాజ్యాలలో కార్యవర్గానికి శాసన సభ కేవలం సలహా సంఘంగానే పనిచేస్తుంది. ఉద్యోగిస్వామ్య పద్ధతిగల వలసలలో శాసన సభ పూర్తిగా కార్యవర్గ అదుపు ఆజ్ఞలలో ఉంటుంది. అనగా దానికి ఒక ప్రత్యేక వ్యక్తిత్వము ఉండదు. కమ్యూనిష్టు వ్యవస్థలో పార్టీ ఆధీనంలో శాసనశాఖ తన మనుగడ సాగిస్తుంది. అధిష్టానవర్గ ఆధిపత్యానికి లోబడి ఉంటుంది. పార్లమెంటరీ విధానంలో కార్యనిర్వాహక వర్గంకన్న శాసన శాఖ ఆధిపత్యస్థానంలో ఉంటుంది. కార్యవర్గం తన కార్యకలాపాల విషయంలో శాసనశాఖకు బాధ్యతవహిస్తుంది. శాసన సభ విశ్వాసాన్ని పొంది నంత కాలం పదవిలో ఉంటుంది. అధ్యక్షవిధానంలో కార్యవర్గం, శాసన శాఖ పూర్తి కార్యాచరణ స్వాతంత్రాన్ని కలిగి ఉంటాయి. ఒక దానినొకటి నియంత్రించుకొనే అవకాశం చాలా పరిమితంగా ఉంటుంది.

## 20. 2. శాసన శాఖ విధులు

**20.2. 1. శాసన నిర్మాణ విధులు :** శాసన నిర్మాణము శాసన సభ నిర్వహించే అత్యంత ప్రధాన కర్తవ్యము. నూతన శాసనాలను ప్రతిపాదించి, ఆమోదించటం, అవసరమైనపుడు సవరణలు చేయటం, అవసరములేని పాత శాసనాలను తొలగించటం, ముసాయిదాబిల్లులను తయారు చేసి, ప్రతిపాదించి, ఆమోదించటం, ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించటం, ప్రధాన విధులు.

**20.2. 2. ఆర్థిక నియంత్రణ :** ప్రాతినిధ్యం లేనిదే పన్నులు విధించరాదు అనే సూత్రం ఆధారంగా ఆర్థిక నియంత్రణాధికారాన్ని శాసనసభ పొందింది. వార్షిక ఆదాయవ్యయ పట్టిక అయిన జాతీయ బడ్జెటు శాసన సభలో కార్యవర్గము చేత

ప్రవేశపెట్టబడుతుంది. శాసన సభ ఆమోదము పొందిన అనంతరము ప్రభుత్వశాఖలు నిధులను పొందుతాయి. ఆర్థికకమిటీల ద్వారా ప్రభుత్వశాఖల ఆదాయ వ్యయాలను శాసనశాఖ నిశితంగా పరిశీలించి నియంత్రణ చేస్తుంది.

**20.2. 3. కార్య నిర్వాహక శాఖ పై నియంత్రణ :**

**ఎ) పార్లమెంటరీ విధానంలో :** కార్యనిర్వాహక శాఖపై శాసన సభ ప్రత్యక్ష నియంత్రణాధికారం కలిగి ఉంటుంది. పార్లమెంటుకు ఎన్నికైన సభ్యులలో కొందరు మంత్రిమండలిగా నియమింపబడతారు. శాసన కార్యక్రమాలలో పాల్గొంటారు. ప్రశ్నలు, అనుబంధ ప్రశ్నలు, వాయిదా తీర్మానం, కోత తీర్మానం మొదలైన పద్ధతులద్వారా శాసనసభ నియంత్రణ కొనసాగిస్తుంది. మంత్రి మండలి పదవిలో కొనసాగటం శాసన సభ విశ్వాసంపై ఆధారపడి ఉంటుంది.

**బి) అధ్యక్ష విధానంలో :** అధికార పృథఃక్కరణ ద్వారా ప్రభుత్వాంగాలు ఒకదాని నుండి ఒకటి వేరుచేయబడతాయి. అయినా "నిరోధ సమతౌల్యాల" వలన కార్యవర్గం కొంతవరకు అదుపు చేయబడుతుంది. ఉదా॥ అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ఎగువసభయైన సెనేట్ ఈ క్రిందివిధంగా నియంత్రిస్తుంది.

i. అధ్యక్షుడు చేసే నియామకాలు, సంధి సంప్రదింపులు సెనేట్ ఆమోదం పొందితీరాలి.
ii. కార్య వర్గశాఖల అధికారులపై అవినీతి ఆరోపణలపై పరిశీలించటానికి విచారణ సంఘాలను నియమిస్తుంది.
iii. యుద్ధ ప్రకటన, శాంతి ఒప్పందాలకు తప్పనిసరిగా సెనేట్ ఆమోదం పొందాలి.

**20.2. 4. న్యాయ సంబంధకర్తవ్యాలు :** కొన్ని రాజ్యాలలో శాసన శాఖ న్యాయ విధులను నిర్వహిస్తుంది. ఉదా॥ బ్రిటన్ ఎగువ సభయైన ప్రభువుల సభ అత్యున్నత న్యాయస్థానంగా వ్యవహరించి అంతిమతీర్పు ఇస్తుంది. అమెరికాలో అధ్యక్ష, ఉపాధ్యక్షులపై దిగువసభ (హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్) నేరారోపణ చేయగా ఎగువ సభ సెనెట్ మహాభియోగాన్ని నిర్వహించి న్యాయవిచారణ చేస్తుంది. ఇండియాలో రాష్ట్రపతి పైనేవిచారణ, మహాభియోగం జరిపించే అధికారం రెండు సభలకు ఉన్నది.

**20.2. 5. రాజ్యాంగ విధులు :** రాజ్యాంగ సవరణాధికారం సాధారణంగా అన్ని రాజ్యాలలో శాసన శాఖకు ఉంటుంది. ఉదా॥ బ్రిటన్ రాజ్యాంగం అలిఖితం, సరళము. సాధారణ శాసనం మాదిరిగానే రాజ్యాంగ శాసనంను కూడా పార్లమెంటు సాధారణ మెజారిటీ ఓటుతో ఆమోదించవచ్చును. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో కాంగ్రెస్‌లో 2/3 వంతు మెజారిటీ ఆమోదంతో పాటు 3/4 వంతు రాష్ట్రాల ఆమోదంతోనె రాజ్యాంగ సవరణల జరుగుతుంది. స్విట్జర్లాండ్‌లో రాజ్యాంగ సవరణకు ఫెడరల్ అసెంబ్లీ ఆమోదము అవసరము.

**20.2. 6. న్యాయశాఖపై నియంత్రణ :** కొన్ని రాజ్యాలలో శాసన శాఖ న్యాయశాఖపై నియంత్రణ చేస్తుంది. ఉదా॥ ఇండియాలో సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులపై అవినీతి ఆరోపణలను విచారించి, వారిని పదవినుండి తొలగించే అధికారం పార్లమెంటుకున్నది. బ్రిటన్‌లో పార్లమెంటు ఆమోదంతో రాజరికం సలహాపై న్యాయమూర్తులు పదవినుండి తొలగించబడతారు. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో న్యాయమూర్తులపై కాంగ్రెస్ మహాభియోగం జరిపించే విధానం రాజ్యాంగములోనే వివరింపబడింది.

**20.2. 7. ఎన్నిక విధులు :** శాసనసభ ఎన్నికలలో పాల్గొనవచ్చు. ఉదా॥ ఇండియాలో రాష్ట్రపతిని ఎన్నుకునే నియోజక గణములో పార్లమెంటు ప్రధాన భాగస్వామి. ఉపాధ్యాక్షడుఅమెరికా సంయుక్తరాష్ట్రాలలో అధ్యక్ష ఎన్నికలలో అత్యధిక మెజారిటీ ఓటు లభించనపుడు అధ్యక్ష ఎన్నిక దిగువసభయైన ప్రతినిధుల సభచేత ఉపాధ్యక్షుని ఎన్నిక ఎగువసభయైన సెనెట్‌చేత నిర్ణయించబడుతుంది. స్విట్జర్లాండ్‌లో ఫెడరల్ కౌన్సిల్‌కు 7 గురు సభ్యులు ఫెడరల్ అసెంబ్లీచే ఎన్నుకొన బడతారు.

**20.2. 8. క్లేశ నివారణ :** ప్రజల కష్టనష్టాలను విచారించి తగు నివారణ చర్యలను తీదయననుకొనటం కూడా శాసన శాఖ కర్తవ్యమని చెప్పవచ్చు. ప్రజల ఆశలు, ఆశయాలు, అభిలాషలను విధాన నిర్ణయ కర్తలకు తెలియజేస్తుంది.

**20.2. 9. ఇతర విధులు :** కరవు, కాటకాలు, సాంఘిక అశాంతి, విదేశీదండయాత్రలు, అంతర్జాతీయ సంఘటనలు వంటి ఆకస్మిక సంఘటనలు జరిగినపుడు శాసనశాఖ తగు నివారణ చర్యలు తీసికోవడం లేక విచారణ సంఘాలు నియమించటం మొదలైన బాధ్యతలను నిర్వహిస్తుంది.

పైన వివరించిన విధంగా శాసనశాఖ విభిన్న విధులను నిర్వహిస్తూ ప్రజాభిప్రాయానికి తగిన స్థానం కల్పించి దానికి అనుగుణంగా ప్రభుత్వం పనిచేసే చర్యలను తీసుకుంటుంది.

## 20.3. కమిటీ పద్ధతి

ఆధునిక ప్రపంచ రాజ్యాలు తమ పని సామర్థ్యాన్ని మెరుగు పరుచుకోవడానికి కమిటీ పద్ధతిని అనుసరిస్తున్నాయి. ఏనాఒక విషయం గురించి నిశితంగా గుణదోషాలను చర్చించవలసివచ్చినప్పుడు, ఆ బాధ్యతను నెరవేర్చటానికి నియమింపబడే వ్యక్తి లేక వ్యక్తులను కమిటీ అని అంటారు. దానికి ఈ క్రింది లక్షణాలుంటాయి.

1. కమిటీలు శాసన సభచే నియమింపబడతాయి.
2. వాటికి సర్వస్వతంత్రత ఉండదు.
3. తమకు నిర్దేశించిన బాధ్యత ఎడల శాసనసభకు జవాబుదారీగా ఉండును.
4. వాటికి మౌలిక పరిధి అంటూ ప్రత్యేకంగా ఉండదు.
5. బాధ్యత నెరవేర్చిన వెంటనే వాటి అవసరం తీరిపోతుంది.
6. పరిమిత సంఖ్యలో సభ్యులు నియమింపబడతారు.
7. కమిటీలు రాజకీయాలకు అతీతంగా పనిచేస్తాయి.
8. కమిటీ నిర్ణయాలు మెజారిటీ సభ్యుల ఆమోదాన్ని పొంది ఉంటాయి. తగిన సాక్ష్యాధారాలతో నివేదిక రూపంలో వెలువడతాయి.

### ప్రాముఖ్యత, ప్రయోజనాలు :

నేడు కమిటీ పద్ధతి అనుసరించటం అనివార్యంగా తయారయింది. ఈ పద్ధతి వలన ఈ క్రింది ప్రయోజనాలున్నాయి.

1. శాసన సభల స్వరూపం : శాసన సభలలో సభ్యుల సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుంది. ఇంత మంది శాసన సభ్యులు కలిసి బిల్లులను క్షుణ్ణంగా చర్చించడం సాధ్యపడదు. కాబట్టి వివిధ బిల్లులను నిశితంగా పరిశీలించి అభిప్రాయాన్ని తెలియచేయటానికి కమిటీల తోడ్పాటు అవసరము.
2. శాసన పరిజ్ఞానం : ప్రతికమిటీలో అనుభవజ్ఞులైన సీనియర్ సభ్యుల శాసన పరిజ్ఞానం జూనియర్ సభ్యులకు అందజేయబడుతుంది. పరోక్షంగా వారికి శాసనపరిజ్ఞానం, రాజకీయ శిక్షణ లభిస్తుంది.
3. **అనుకూల వాతావరణం :** వందల సంఖ్యలో సభ్యులుండే శాసన సభలో బిల్లులను పరిశీలించడం అసాధ్యం. అందువలన వివిధ బిల్లులను పరిశీలించటానికి వివిధ కమిటీలు నియమింపబడినపుడు, సావకాశంగా సమావేశమై, బిల్లులను కూలంకుషంగా పరిశీలించి తగిన సిఫారసుచేయవచ్చు.
4. సత్వర కార్యసాధన : నిర్ణీత వ్యవధిలో విషయపరిశీలనచేసి నివేదికరూపంలో కమిటీ తన సిఫారసును శాసనసభకు అందజేస్తుంది. శాసన సభ సమయం ఆదా అవుతుంది. తక్కువ వ్యవధిలో ఎక్కువ పనిని చేయగలుగుతుంది.
5. స్వేచ్ఛాయుతంగా భావప్రకటన : కమిటీలో సభ్యులసంఖ్య పరిమితంగా ఉండటం వలన ప్రతిసభ్యునికి సావకాశంగా, స్వేచ్ఛగా తన భావాలను ప్రకటించే అవకాశముంది. రాజకీయ సంకుచితధోరణి ఉండదు. కమిటీ నివేదికకు గౌరవం, విలువ ఉంటాయి.
6. శ్రమ విభజన, బాధ్యతల పరిజ్ఞానం : శాసనసభ కార్యభారం వివిధ కమిటీలకు పంపిణీ అవుతుంది. ఆసక్తిని అనుసరించి ప్రతిసభ్యునికి ఏదో ఒక కమిటీలో సభ్యత్వం లభిస్తుంది. ప్రతీ శాసనసభ్యుడు తన భాగస్వామ్యాన్ని గుర్తెరిగి బాధ్యతాయుతంగా కర్తవ్యనిర్వహణ చేస్తాడు.

7. ప్రజాభిప్రాయానికి విలువ : బిల్లులను లేక తీర్మానాలను పరిశీలించేటప్పుడు ఆయా విషయాల్లో నిపుణులు, మేధావులు, అనుభవజ్ఞులు, సంబంధిత ప్రభావవర్గాల, విభిన్నప్రజావర్గాలు అభిప్రాయాలను కూడా సేకరించి కమిటీ తన సిఫారసు సర్వసమ్మతంగా చేస్తుంది. ప్రజాభిప్రాయానికి విలువ కలుగుతుంది.

## 20.4. కమిటీ రకాలు

అన్ని దేశాలలోనూ కమిటీలు ఒకే విధంగా లేవు.

ప్రధానంగా కమిటీలు రెండు రకాలు : (1) తాత్కాలిక కమిటీలు - కొన్ని ప్రత్యేక సందర్భాలలో ఏర్పాటు చేయబడి అవసరం పూర్తి కావడంతో రద్దుచేయబడుతాయి. (2) శాశ్వత స్థాయీ కమిటీలు - వీటి గడువు సాధారణంగా శాసన సభ గడువుతో సమానంగా ఉండవచ్చు.

శాసన సభ కమిటీలు : 1. యావత్సభా కమిటి 2. స్థాయీ కమిటీలు 3. ప్రత్యేక కమిటీలు 4. సంయుక్త కమిటీలు 5. ప్రైవేటు బిల్లుల పై కమిటి

**20.4. 1. యావత్సభా కమిటి :** ప్రత్యేకమైన బిల్లుల పరిశీలనకు మొత్తం సభ్యులతో దిగువ సభ యావత్సభాకమిటీగా పనిచేస్తుంది. ద్రవ్యబిల్లులను పురస్కరించుకొని పన్నుల ప్రతిపాదనలను పరిశీలించేటపుడు ఈసభ మార్గాల సాధనాల కమిటీగా వ్యవహరించబడుతుంది. అంచనాలు, అదనపు అంచనాలు పరిశీలించేటపుడు సరఫరాల కమిటీగా వ్యవహరింపబడుతుంది.

**20.4. 2. స్థాయీ కమిటీలు :** సాధారణ ఎన్నికల అనంతరం నూతనంగా ఏర్పాటయ్యే పార్లమెంటు స్థాయీ కమిటీలను నియమిస్తుంది. వీటిలో సభ్యత్వం తరచుమారుతూ ఉంటుంది. అన్ని రాజకీయపార్టీలకు తగిన నిష్పత్తిలో ప్రాతినిధ్యం ఉంటుంది. తమవద్దకు వచ్చిన బిల్లులను పరిశీలించి తగిన సిఫారసు చేస్తాయి. సవరణలు ప్రతిపాదించవచ్చు లేక ఇతరుల సూచనలు స్వీకరించవచ్చు. భారతదేశంలో స్థాయీకమిటీలను ఈక్రింది విధంగా వర్గీకరించవచ్చు.

1. విచారణ కమిటీలు - ఎ) విశేషాధికారాలు - సభాహక్కుల కమిటి బి) అర్జీలపై కమిటి.
2. తనిఖీ కమిటీలు - ప్రభుత్వ హామీలపై కమిటి.
3. సలహాకమిటీలు - ఎ) శాసన సభావ్యవహారాలపై కమిటి; బి) ప్రైవేటు సభ్యులబిల్లులు, తీర్మానాల కమిటి; సి) నిబంధనల కమిటి

**20.4. 3. ప్రత్యేక కమిటీలు :** వీటినె ప్రత్యేక విచారణ లేక పర్యవేక్షక కమిటీలు అని అంటారు. బిల్లులను పరిశీలించేటప్పుడు వాస్తవాలను సేకరించి, సాక్షులను లేక సాక్ష్యాధారాలను పరిశీలించి అంతిమంగా తమ సిఫారసులను నివేదికల రూపంలో శాసనసభకు అందజేస్తాయి. తమ కార్యాచరణలో రాజకీయ సంకుచిత భావాలకు అతీతంగా పనిచేస్తాయి. సిఫారసులుగాని, నివేదికలుగాని రహస్యాన్ని పాటించవు. కమిటీ నిర్ణయాలు గాని, సూచనలుగాని రద్దు చేసే వీలులేదు.

**20.4. 4. సంయుక్త కమిటి :** పార్లమెంటు ఉభయ సభలకు చెందిన సభ్యులతో ఈకమిటీలు ఏర్పాటు చేయబడతాయి. తాము పరిశీలించ వలసిన అంశాలపై బహిరంగ విచారణ జరుపుతాయి. ఉభయ సభలు సంయుక్తంగా వీటికి కొన్ని బాధ్యతలు, అధికారాలు ఇస్తాయి. సమస్యలను పరిశీలించేటపుడు సంబంధిత మంత్రులను, శాఖాధికారులను తమ వద్దకు రప్పించుకొని వారినుండి సాక్ష్యాలను చట్టరీత్యా పొందవచ్చు. విచారణ పూర్తయిన తరువాత తమ సిఫారసులను నివేదికలరూపంలో పార్లమెంటుకు అందజేస్తాయి.

**20.4. 5. ప్రైవేటు బిల్లులపై కమిటి :** ప్రైవేటు బిల్లు దిగువ సభలో ప్రవేశపెట్టినపుడు, ద్వితీయ పఠనం తరువాత ఈ కమిటి పరిశీలనకు అందజేయబడుతుంది. పక్షపాతరహితంగా వాటిని పరిశీలించి తమ సిఫారసులను నివేదికల రూపంలో సాధారణ సభకు అందజేస్తాయి.

భారత దేశంలో పార్లమెంటు ప్రభుత్వంపై నియంత్రణ చేయటానికి సహాయపడు కమిటీలు :

ఎ) దత్త నియోజిత శాసనాలపై కమిటీ

బి) ప్రభుత్వ ఖాతాల పరిశీలన కమిటీ

సి) అంచనాలపై కమిటీ

డి) ప్రభుత్వరంగ సంస్థలపై కమిటీ

పైన వివరించిన విధంగా శాసన శాఖ తన బాధ్యతలను కొన్ని కమిటీల ద్వారా నిర్వహించటం వలన సమయము ఆదాచేయుటయే కాకుండా కార్యనిపుణతను సాధిస్తుంది.

## 20.5. ప్రతిపక్ష పాత్ర

ప్రస్తుత కాలంలో ప్రజాస్వామ్య విధానము అత్యంత ఆదరణ పొందినది. ప్రత్యేకంగా ప్రాతినిధ్య ప్రజాస్వామ్యాన్ని రాజ్యాలు అనుసరిస్తున్నాయి. రాజ్య వ్యవహారాల నిర్వహణకు ప్రజాప్రతినిధులు ఎన్నికల ద్వారా ఎన్నుకొనబడతారు. విధానాల రూపకల్పనకు, ప్రజల రాజకీయపరిజ్ఞానాన్ని పెంపొందించటానికి, క్రమపద్ధతిలో ప్రభుత్వ బాధ్యతా నిర్వహణకు రాజకీయపార్టీలు ఉండితీరాలని మెకైవర్ అభిప్రాయం. ప్రజాస్వామ్యానికి రాజకీయపార్టీ విధానం అనివార్యమని బ్రైస్ అభిప్రాయం. అవి ఓటర్లను ఆకర్షిస్తాయి. వారిలో ప్రజాభిప్రాయాన్ని కలిగిస్తాయి. ప్రజాస్వామ్యంలో ఉండే అంతర్గతదోషాలను నివారిస్తాయి.

**ప్రతిపక్షాలు - ప్రాధాన్యత :** ప్రతీ ప్రభుత్వంలో ప్రతిపక్షం అంతర్లీనంగా ఉండి పనిచేస్తుంది. బ్రిటన్ ద్వంద్వ పార్టీ విధానాన్ని అనుసరిస్తోంది. మెజారిటీ స్థానాలను పొందిన పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తుంది. రెండవపార్టీ ప్రతిపక్షంగా వ్యవహరిస్తుంది. రాజ్యాంగపరంగా గుర్తింపు లభిస్తుంది. ప్రతిపక్షనాయకునికి ప్రధాన మంత్రితో సమానస్థాయి, హోదా కలిగించబడుతుంది. అతను తన పార్టీ సహచరులతో "ఛాయా మంత్రిమండలి" (Shadow Cabinet) ఏర్పాటు చేస్తాడు. జాతీయ కార్యక్రమాలలో తగిన ప్రాధాన్యత లభిస్తుంది. ఈ ప్రతిపక్షం ఒక ప్రత్యామ్నాయ ప్రభుత్వంగా వ్యవహరించబడుతుంది. అధికారపక్షం తన మెజారిటీ కోల్పోయినపుడు ఎన్నికల అవసరంలేకుండ వెంటనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలుగుతుంది. ఇతర రాజ్యాలలో కూడా ప్రతిపక్షాలు ఇదేవిధంగా ప్రత్యామ్నాయ ఏర్పాటులతో సిద్ధంగా ఉంటాయి.

## 20.6. ప్రతిపక్షం - కర్తవ్యాలు

ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి మెజారిటీ స్థానాలు పొందలేని రాజకీయపక్షాలన్నీ పార్లమెంటులో ప్రతిపక్షంగా వ్యవహరిస్తాయి. అనగా అధికార పార్టీని మినహాయిస్తే మిగిలినవన్నీ ప్రతిపక్షాలే. ప్రతిపక్షం నిర్వహించే విధులను ఈక్రింది విధంగా పేర్కొనవచ్చును.

**20.6. 1. ప్రభుత్వాన్ని విమర్శించటం :** ప్రభుత్వపక్షం ఏకపక్షంగా నిరంకుశ శాసనాలను ప్రవేశ పెట్టినపుడు, ప్రతిపక్షాలు అతిసమర్ధవంతంగ విమర్శించి, ఆ శాసనాలు ఆమోదాన్ని పొందకుండా చేస్తుంది. తద్వారా వ్యక్తి స్వేచ్ఛను కాపాటమే గాక ప్రజాస్వామ్య విలువలను కాపాడినట్లవుతుంది. ఇట్టి విమర్శలు నిర్మాణాత్మకంగా, సూటిగా, నిర్దిష్టంగా, పక్షపాతరహితంగా, విశాలదృక్పథంతో ఉండాలి. శాసనశాఖ ఒక జాతీయ వాగ్వివాదవేదిక. జాతీయ, అంతర్జాతీయ సమస్యలపై చర్చలు జరుగుతాయి. ప్రభుత్వ విధానాలపై, ప్రభుత్వం పనిచేసే తీరుతెన్నులపై ప్రశ్నలు, అనుబంధప్రశ్నలు, తీర్మానాల ద్వారా ప్రభుత్వాన్ని నియంత్రిస్తుంది. ప్రభుత్వంలో అవినీతి, ఆశ్రిత పక్షపాతాన్ని, బలహీనతలను వెలికితీస్తుంది. ప్రజాప్రయోజనాలను కాపాడుతుంది. ప్రభుత్వంపై నిఘా ఉంచుతుంది. నియంతృత్వధోరణులను అరికడుతుంది. అధికారపక్ష నాయకుల అవినీతి ధోరణులను బహిరంగపరచటం ద్వారా ప్రభుత్వాలు రాజీనామా చేసిన సంఘటనలు అనేక ఉన్నాయి.

**20.6. 2. ప్రభుత్వవిధానాలపై ప్రభావము :** జాతీయ విధానాలు, అంతర్జాతీయ విధానాలు రూపొందించేటపుడు, క్లిష్టసమస్యల పరిష్కారం కొరకు ప్రతిపక్షాలతో సంప్రదించే సత్సాంప్రదాయము కొన్ని రాజ్యాలలో ఉన్నది. ఇది అత్యంత విలువైన, ప్రయోజనకరమైన

సలహాలను అందజేస్తుంది. సాహసోపేతమైన విధానాలవలన ఎదురయ్యే ప్రమాదాలను ప్రభుత్వానికి ముందుగానే సూచించి తగు హెచ్చరికలు చేస్తుంది. సర్వసాధారణంగా ప్రతిపక్షాల సలహాలను ప్రభుత్వం గౌరవిస్తుంది. అత్యవసరపరిస్థితి తటస్థించినపుడు సమస్యలను సమిష్టిగా ఎదుర్కొనడానికి ప్రతిపక్షాలను ఆహ్వానించడం జరుగుతుంది. ఉదా : రెండవ ప్రపంచ యుద్ధకాలంలో బ్రిటన్‌లో ఏర్పడిన జాతీయప్రభుత్వం. ఇటువంటి సమయాలలో విధాననిర్ణయ భాగస్వామ్యాన్ని ప్రతిపక్షం పొందుతుంది.

**20.6. 3.** ప్రజాస్వామ్యపరిరక్షణ : నిరంతర ప్రజాస్వామ్యాన్ని ప్రమాదాలనుండి పరిరక్షించటం ప్రతిపక్షం ప్రధాన కర్తవ్యం. ప్రతి పక్షాల బలహీనత ప్రభుత్వ నియంతృత్వానికి దోహదం చేస్తుంది. ప్రతిపక్షాలు సమర్ధవంతంగా పనిచేసినపుడు ప్రభుత్వం తప్పనిసరిగా బాధ్యతాయుతంగా పనిచేస్తుంది. ప్రజలకు రాజకీయ స్వాతంత్ర్యం లభిస్తుంది. నియంతృత్వ పోకడలనుండి రక్షింపబడి ప్రజాస్వామ్య విలువలకు తగిన స్థానం లభిస్తుంది.

**20.6. 4.** భిన్నప్రయోజనాలకు రక్షణ : ప్రజలలో విభిన్న వర్గాలుంటాయి. వాటికి విభిన్న ప్రయోజనాలుంటాయి. వాటిని శాసనసభల దృష్టికి తీసికొనిరావటానికి ప్రతిపక్షం ఒక్కటే మార్గము. అనేక రాజకీయ పార్టీలు ఉన్నపుడు విభిన్నవర్గాల విభిన్న ప్రయోజనాలను, ఆశలను, ఆశయాలను శాసన సభలలో చర్చిస్తాయి. ప్రజల దృష్టిని, ప్రజాప్రతినిధులదృష్టిని ఆకర్షిస్తాయి. అనియంతంగా ఉండే సమస్యలను క్రమబద్ధం చేస్తాయి. నిర్మాణాత్మక ప్రజాభిప్రాయానికి దోహదం చేస్తాయి.

## 20.7. సారాంశము

ప్రజాస్వామ్యానికి ప్రతిపక్షాలుండాలనటంలో సందేహంలేదు. అయితే క్రమబద్ధీకరణ లోపించిన ప్రతిపక్షాలవలన అంతర్యుద్ధప్రమాదమేర్పడే అవకాశం కూడా ఉంది. బలహీన ప్రతిపక్షం వాస్తవంలో ప్రతిపక్షమే కాదు. అది కేవలం ఒక వత్తిడి వర్గమే (Pressure Group) అవుతుంది. బహుపార్టీవిధానంలో కన్నా ద్వంద్వ పార్టీ విధానంలో ప్రతి పక్షం సమర్ధవంతంగా పనిచేస్తుంది. యదార్ధమైన, సమర్ధమైన ప్రతిపక్షానికి సక్రమమైన వ్యవస్థీకరణ, జాతీయ స్వభావం, పటుత్వంగల ఆశయాలు, నిజాయితీ గల నాయకత్వం, ప్రజాకర్షణ శక్తి మొదలైన లక్షణాలుండాలి.

పాఠం - 21

# కార్య నిర్వాహక శాఖ - విధులు

## 21.0. లక్ష్యము

కార్య నిర్వాహకశాఖ అర్ధ వివరణ, రకములు, విధులు, కర్తవ్యాలు, ప్రాధాన్యతలను చర్చించుట

## 21.1 విషయక్రమం

21.2. కార్యనిర్వాహక వర్గము- అర్ధవివరణ, రకములు

21.3. కార్యనిర్వాహక వర్గము - వర్గీకరణ

21.4. నియామక పద్ధతులు, పదవీకాలం

21.5. అధికార విధులు - బాధ్యతలు

21.6. కార్యనిర్వాహకశాఖ - నమూనాలు

21.7. కార్యనిర్వాహకశాఖ - ప్రాధాన్యత

## పరిచయము

ప్రస్తుత ప్రజాస్వామ్య రాజ్యాలలో కార్యనిర్వాహక శాఖ ప్రధాన పాత్రను నిర్వహిస్తోంది. ప్రజాభిప్రాయాన్ని చట్టాల రూపములో శాసనశాఖ ఆమోదిస్తుంది. ఆ చట్టాలను అమలు చేయటం ద్వారా ప్రజా సంకల్పాన్ని నెరవేర్చే బాధ్యత కార్యనిర్వాహక శాఖపై ఉంటుంది.

## 21.2. అర్ధవివరణ

విశాల దృక్పధంలో రాజ్యాధినేత, ప్రధాన మంత్రి, మంత్రిమండలి వంటి పై స్థాయి వ్యక్తులనుండి దిగువస్థాయి ఉద్యోగి బృందము వరకు కార్యనిర్వాహక శాఖలో అంతర్భాగమని చెప్పవచ్చు. రాజ్య నిర్వహణలో విధానాలను రూపొందించే వ్యక్తులను మాత్రమే కార్యవర్గంగా భావించడమే రాజనీతి శాస్త్ర పరమావధి. అందువలన రాజ్యాధినేత, మంత్రిమండలిని కార్యనిర్వాహక శాఖ అని చెప్పవచ్చును. దిగువ వర్గాలన్నీ కేవలం ఆదేశాలను పాటిస్తాయి.

కార్యనిర్వాహక శాఖను ఈక్రింది విధంగా వర్గీకరించ వచ్చును :

21.2. 1. నామమాత్ర కార్యవర్గం

21.2. 2. వాస్తవ లేక యదార్ధ కార్యవర్గం

21.2. 3. ఏక సభ్య కార్యవర్గం

21.2. 4. బహుళ కార్యవర్గం

21.2. 5. వారసత్వ

21.2. 6. నామ నిర్దిష్ట

21.2. 7. ఎన్నికయ్యే కార్యవర్గం

21.2. 8. పార్లమెంటరీ కార్యవర్గం

21.2. 9. అధ్యక్షతరహా కార్యవర్గం

21.2. 10. రాజకీయ కార్యవర్గం

21.2. 11. శాశ్వత కార్యవర్గం

**21.2. 1. నామమాత్ర కార్యవర్గం :** పార్లమెంటరీ విధానంగల రాజ్యాలలో దేశాధినేత నామ మాత్రపు కార్యనిర్వాహకుడు. పేరుకు మాత్రం అధికారాలన్నీ అతనికి ఉంటాయి. వాస్తవంలో ఈ అధికారాలను స్వయంగా నిర్వహించడు. ఉదా : బ్రిటన్‌లో రాజు లేక రాణి, ఇండియాలో రాష్ట్రపతి, జపాన్‌లో చక్రవర్తి. రాజ్యానికి వీరు కేవలం అలంకార ప్రాయంగా ఉంటారు.

**21.2. 2. వాస్తవ లేక యదార్ధ కార్యవర్గం :** మంత్రి మండలి పరోక్షంగా రాజ్యాధినేత అధికారాన్నీ నిర్వహిస్తుంది. శాసన సభకు వ్యక్తిగతంగాను, సమిష్టిగాను బాధ్యతవహిస్తుంది. అందువలన ఇది యదార్ధ లేక వాస్తవ కార్యవర్గము. బ్రిటన్, ఇండియా వంటి రాజ్యాలలో పై రెండు కార్యవర్గాలు పనిచేస్తున్నాయి.

**21.2. 3. ఏకసభ్య కార్యవర్గం :** అధ్యక్ష విధానంగల రాజ్యాలలో కార్యవర్గ బాధ్యతలన్నీ ఒకే వ్యక్తి నిర్వహిస్తాడు. అధికారాలతో బాటు అన్ని బాధ్యతలు అతనివే. ఉదా : అమెరికా సంయుక్త రాష్ట్రాలలో అధ్యక్షుడు.

**21.2. 4. బహుళ కార్యవర్గం :** అనేకమంది సభ్యులు సమానాధికారాలుకలిగి, సమాన బాధ్యతలను వహించటాన్ని బహుసభ్య కార్యవర్గము అంటారు. ఉదా : స్విట్జర్లాండులో 7గురు సభ్యులుగల కాలేజియేట్.

**21.2. 5. వారసత్వ కార్యవర్గము :** వారసత్వం ఆధారంగా రాజ్యాధినేత పదవిని పొందితే దానికి వారసత్వ కార్యవర్గమని పేరు. వయసు, విద్యార్హతలు, పదవీకాల పరిమితి వంటివి ఉండవు. ఉదా : బ్రిటన్, జపాన్, భూటాన్ లలో రాజు యొక్క కుమారులు, కుమార్తెలు రాజ్యాధికారాన్ని కల్గి ఉంటారు.

**21.2. 6. నామ నిర్దిష్ట కార్యవర్గము :** కొన్ని రాజ్యాలలో నామనిర్దేశ పద్ధతిలో రాజ్యాధినేత లేక ముఖ్యకార్య నిర్వాహకుడు నియమింప బడతాడు. ఈ పద్ధతిలో పదవికి నియమిత కాల పరిమితి ఉంటుంది. ఉదా : ఆస్ట్రేలియా, కెనడా, స్వాతంత్ర్యానికి పూర్వము ఇండియాలకు బ్రిటీష్ రాజు లేక రాణిచే గవర్నర్ జనరల్స్ నియమించ బడేవారు.

**21.2. 7. ఎన్నిక కార్యవర్గము :** రాజ్యాంగ చట్టం నిర్దేశించిన పద్ధతిలో నియమిత కాలానికి ప్రత్యేక అర్హతలున్న అభ్యర్ధిని ప్రత్యక్ష లేక పరోక్ష ఎన్నికల ద్వారా రాజ్యాధినేతగా ఎన్నుకొనవచ్చును. ఉదా : బొలీవియా, చిలీ, మెక్సికో, బ్రెజిల్, పెరూ వంటి లాటిన్ అమెరికా రాజ్యాలు ప్రత్యక్ష ఎన్నికలలో తమ రాజ్యాధినేతను ఎన్నుకుంటాయి. అమెరికా సంయుక్త రాష్ట్రాల అధ్యక్షుడు, భారత రాష్ట్రపతి ప్రత్యేక నియోజక గణాల ద్వారా ఎన్నుకోబడతారు.

**21.2. 8. పార్లమెంటరీ కార్యవర్గం :** పార్లమెంటరీ విధానంలో మంత్రిమండలి శాసన శాఖలో అంతర్భాగంగా ఉండి పనిచేస్తుంది. శాసన శాఖ విశ్వాసం పొందినంత వరకు పదవిలో కొనసాగుతుంది. పాలనా వ్యవహారాలలో బాధ్యత వహిస్తుంది. విశ్వాసం కోల్పోయిన తక్షణం పదవీ విరమణ చేస్తుంది. ఉదా : బ్రిటన్, ఇండియా, జైనా, ఆస్ట్రేలియా, స్వీడన్, స్విట్జర్లాండ్ దీనికే కేబినెట్ కార్యవర్గమని కూడా పేరు.

**21.2. 9. అధ్యక్ష కార్యవర్గం :** శాసన శాఖతో సంబంధం లేకుండా స్వతంత్ర పద్ధతిలో అధికారాలను నిర్వహించే విధానానికి అధ్యక్ష కార్యవర్గం అని పేరు. కార్య నిర్వాహక శాఖకు ఒకే వ్యక్తి ప్రధానాధికారి. అతడే రాజ్యాధినేత, సర్వాధికారి. స్పష్టమైన పదవీకాలం ఉంటుంది. ప్రజలకు మాత్రమే బాధ్యతవహిస్తాడు. ఉదా : అమెరికా సంయుక్తరాష్ట్రాల అధ్యక్షుడు.

**21.2. 10. రాజకీయ కార్యవర్గం :** పార్లమెంటరీ విధానంలో, ఎన్నికలలో అత్యధిక స్థానాలు పొందిన రాజకీయ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. మంత్రిమండలి సభ్యులందరూ రాజకీయ నాయకులే. వీరి పదవీ కాలం శాసన సభలో వీరుపొందే విశ్వాసం అనుసరించి ఉంటుంది. అనగా నిర్దిష్ట పదవీకాలం లేదని చెప్పవచ్చు.

**21.2. 11. శాశ్వత కార్యవర్గం :** ప్రభుత్వ పాలనా యంత్రాంగంలో పనిచేసే ఉద్యోగి బృందానికి నిశ్చితమైన పదవీ విరమణ వయస్సు ఉంటుంది. అంత వరకు పదవిలో కొనసాగవచ్చు. రాజకీయాలకు, రాజకీయ పక్షాలకు అతీతంగా తన కర్తవ్యాలను నిర్వహిస్తుంది. కొంత వరకు స్వతంత్ర ప్రతిపత్తి ఉంటుంది. దీనికి పరిపాలక కార్యవర్గము లేక శాశ్వత కార్యవర్గమని పేరు. అన్ని రాజ్యాలలో ఈ తరహా కార్యవర్గము ఉంటుంది. రాజకీయ కార్యవర్గానికి అనుబంధంగా పనిచేస్తుంది.

## 21.3. కార్యనిర్వాహక వర్గం - నియామక పద్ధతులు

రాజ్యాధిపతిని నాలుగు విధాలుగా నియమించవచ్చును.

**21.3. 1. వారసత్వపద్ధతి :** రాచరికవంశాలలో మొదటి సంతానం రాజ్యాధికారాన్ని పొందటమే వారసత్వ పద్ధతి. ఈ విధంగా అధికారాన్ని పొందినవారు జీవితకాలం పదవిలో ఉంటారు. ఉదా : బ్రిటన్ రాజు లేక రాణి. ఈ పద్ధతిలో వ్యక్తిగత అర్హతలు పరిగణింపబడవు. నియంతగా మారే అవకాశాలెక్కువ. రాజవంశీకుల ప్రాబల్యం అధికంగా ఉంటుంది.

**21.3. 2. ప్రత్యక్ష ఎన్నిక పద్ధతి :** కొన్ని రాజ్యాలలో రాజ్యాధిపతిని ప్రజలే స్వయంగా ఎన్నుకుంటారు. వారికి నియమిత పదవీ కాలం ఉంటుంది. ప్రజలకు స్వయంగా బాధ్యత వహిస్తారు. ఉదా : బొలీవియా, చిలీ, మెక్సికో, బ్రెజిల్ వంటి లాటిన్ అమెరికా దేశాలు. ఈ ఎన్నికలకు అధికవ్యయం అవుతుంది. ఆడంబర ప్రచారానికి ఓటర్లు లోనయి అనర్హుడిని ఎన్నుకొనే ప్రమాదం ఉంది.

**21.3. 3. పరోక్ష ఎన్నిక పద్ధతి :** ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన నియోజిక గణాలద్వారా నియమిత కాలానికి రాజ్యాధిపతిని ఎన్నుకొనడం జరుగుతుంది. ఉదా : అమెరికా సంయుక్తరాష్ట్రాలు, ఇండియా, ఫ్రాన్స్. ఈ పద్ధతిలో నియోజికగణ నిర్మాణం రాజకీయపార్టీల ప్రాబల్యంతో జరుగుతుంది. అందువలన పరోక్ష ఎన్నిక కూడా రాజకీయాలకు దూరంకాదు. పైగా ఎన్నికైన అభ్యర్థి ప్రత్యక్షంగా ప్రజలకు బాధ్యత వహించడు.

**21.3. 4. శాసన సభల ద్వారా ఎన్నిక :** స్విట్జర్లాండులో కార్యవర్గాన్ని ఫెడరల్ అసెంబ్లీ నియమిత కాలానికి ఎన్నుకొంటుంది. ఈ పద్ధతిలో ఎన్నిక మితవ్యయంతో చాలా సులభంగా జరుగుతుంది. అయినప్పటికి కార్యవర్గం శాసనశాఖ నియంత్రణకు తప్పనిసరిగా లోబడి ఉండాలి. పార్టీవ్యవహారాలకు అతీతంగా కర్తవ్య నిర్వహణ చేయలేదు.

## 21.4. కార్యనిర్వాహక వర్గము - పదవీకాలము

కార్యనిర్వాహక వర్గం యొక్క పదవీకాలం అన్నిరాజ్యాలలో ఒకే విధంగా ఉండదు.

1) రాజరిక వ్యవస్థలో పదవీకాలం జీవితకాలం ఉంటుంది. సాంప్రదాయిక పద్ధతి బ్రిటన్, జపాన్, జోర్డాన్, సౌదీ అరేబియా మొదలైన రాజ్యాలలో అమలులో ఉంది.

2) ఎన్నిక పద్ధతిలో నియమిత పదవీకాలం ఉంటుంది. ఉదా : ఫ్రాన్స్ అధ్యక్షుని పదవీకాలం 7 సంవత్సరాలు. చిలి, అర్జెంటీనా అధ్యక్షుల పదవీకాలం 6 సంవత్సరాలు. భారత రాష్ట్రపతి పదవీకాలం 5 సంవత్సరాలు, అమెరికా సంయుక్త రాష్ట్రాల అధ్యక్షుని పదవీకాలం 4 సంవత్సరాలు, స్విట్జర్లాండ్ అధ్యక్షుని పదవీకాలం కేవలం 1 సంవత్సరము.

తక్కువ పదవీకాలం ఉన్నపుడు దేశాధినేత నియంతగా వ్యవహరించే అవకాశం తక్కువ. అయితే దీర్ఘకాలిక ప్రణాళికలను నిర్వహించే అవకాశం ఉండదు. సుదీర్ఘ పదవీకాలం ఉన్నప్పుడు భవిష్యత్ ప్రయోజనాలకు అనువైన ప్రణాళికలను అమలు చేయవచ్చు. అయితే కొద్దికాలంలోనే నియంతగా మారవచ్చు.

**21.4. 1. సమీక్ష :** పదవీకాలం 4 లేక 5 సంవత్సరాలు ఉన్నప్పుడు రాజ్యాధినేత రెండు సార్లు ఎన్నికయే అవకాశం ఉండటం సమంజసం. 6 లేక 7 సంవత్సరాలకాలపరిమితి ఉన్నపుడు ఒక్కసారి మాత్రమే పదవిని పొందటం సమంజసంగా ఉంటుంది.

## 21.5. కార్యనిర్వాహక శాఖ - అధికార విధులు, బాధ్యతలు

రాజ్యవిధానాన్ని అనుసరించి, ప్రభుత్వ లక్ష్యాలను అనుసరించి విభిన్న రాజ్యాలలో కార్యనిర్వాహక శాఖ అధికారాలు, బాధ్యతలు విభిన్నంగా ఉంటాయి. స్థూలంగా వాటిని ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చు.

**21.5. 1. పాలన - శాంతి భద్రతలు :** ప్రభుత్వ శాఖల సక్రమ నిర్వహణ కొరకు మంత్రిమండలి ఆధ్వర్యంలో పనిచేసే వివిధ శాఖలకు బాధ్యతల పంపిణీజరుగుతుంది. ప్రతిమంత్రి తనకు కేటాయించిన శాఖానిర్వహణకు బాధ్యతను వహిస్తాడు. చట్టాలను అమలు చేయడం, రాజ్యాధినేత ఆదేశాలను పాటించడం జరుగుతుంది. పరిపాలన యావత్తు రాజ్యాధినేత పేరున జరుగుతుంది. శాసనాలు అమలు చేయటం, అత్యవసరాజ్ఞలు (ఆర్డినెన్స్‌లు) జారీచేయటం, జాతీయ విధానాలు రూపొందించటం, మంత్రిమండలిని నియమించటం, అవసరమైన సలహాలను అందజేయటం మొదలైనవి-ఆయన విధులు. పోలీస్ డిపార్ట్‌మెంట్ సహాయంతో దేశంలో శాంతి భద్రతలను కాపాడే బాధ్యత కార్యనిర్వాహక శాఖపై ఉంటుంది.

**21.5. 2. అంతర్ - రాజ్యసంబంధ విధులు :** విదేశాలతో సంబంధాలను ఏర్పరచుకొనటం కార్యనిర్వాహక శాఖ ముఖ్యవిధి. శాంతి సమయంలోను, యుద్ధకాలంలోను విదేశాలతో సంధిసంప్రదింపులు, ఒడంబడికలు చేసుకునే అధికారం రాజ్యాధిపతికి ఉంటుంది. సాంస్కృతిక, వాణిజ్య ఒడంబడికలు చేసుకొనే అధికారం ఉంటుంది. అంతర్జాతీయ విధానం రూపొందించటం, దౌత్యప్రతినిధులను నియమించటం, విదేశీరాయబారులకు గుర్తింపునివ్వటం, అంతర్జాతీయ సమావేశాలలో రాజ్యానికి ప్రాతినిధ్యం వహించటం మొదలైనవి విదేశాంగ సంబంధ విధులు లేదా అంతర్ రాజ్య సంబంధంగా పేర్కొనవచ్చు. ఈ విషయాలలో విదేశాంగ శాఖ ప్రధాన పాత్ర నిర్వహిస్తుంది.

**21.5. 3. సైనిక సంబంధ విధులు :** రాజ్యము యొక్క ప్రాదేశిక సమగ్రతను కాపాడుకోవడం, విదేశీ దండయాత్రలనుండి దేశాన్ని రక్షించుకొనటం కార్యనిర్వాహక శాఖ విధి. రాజ్యాధినేత సర్వ సైన్యాధిపతి. సైనిక, నౌకా, విమాన దళాల సైనికాధికారులను నియమిస్తాడు. అవసరమయినపుడు యుద్ధప్రకటన, లేక శాంతి సంధులను ఆమోదించటం ఇందులో ఒక భాగమే.

**21.5. 4. శాసన విధులు :** పార్లమెంటరీవ్యవస్థలో శాసనాల ముసాయిదాలు తయారుచేయటం వాటిని శాసన సభలలో ప్రతిపాదించటం, శాసన సభను సమావేశపరచటం, వాయిదావేయటం, నిలిపివేయటం, దిగువసభను రద్దుచేయటం, సమావేశంలో ప్రసంగించటం, శాసనసభ సమావేశంలో లేనపుడు అత్యవసరాజ్ఞలను (ఆర్డినెన్స్‌లను) జారీచేయటం మొదలైన అధికారాలుంటాయి. అధ్యక్షవిధానంలో శాసన సభలకు సూచనలను పంపించటం, సందేశాలు పంపటం-దేశాధ్యక్షుని అధికారాలు. శాసన సభ ఆమోదించిన బిల్లులు రాజ్యాధినేత అనుమతితో శాసనాలుగా రూపొందుతాయి. బిల్లులను తగిన సవరణలు లేక సూచనలతో శాసనసభకు తిరిగిపంపడానికి, అనుమతి తిరస్కరించడానికి రాజ్యాధినేతకు (వీటో) అధికారం ఉంటుంది.

**21.5. 5. ఆర్థిక విధులు :** వార్షిక బడ్జెట్ తయారు చేయటం, పన్నులు విధించటం లేదా రద్దుచేయటం, శాసన సభచేత ఆమోదింపచేయటం, వివిధ రంగాలకు నిధులను కేటాయించటం మొదలైనవి ఆర్థికవిధులు. ఆర్థిక మంత్రిత్వశాఖ ఆర్థిక కార్యకలాపాలను నిర్వహిస్తుంది.

**21.5. 6. న్యాయవిధులు :** రాజ్యంలో న్యాయనిర్వహణ పక్షపాత రహితంగా ఉండటానికి న్యాయ శాఖ స్వతంత్రప్రతిపత్తిని కాపాడటం, అపరాధులకు క్షమాభిక్ష ప్రసాదించటం, శిక్షను తగ్గించటం లేక వాయిదా వేయటం, ఒక శిక్షను వేరొక శిక్షగా మార్చటం మొదలైనవి న్యాయాధికారాలు. న్యాయమూర్తుల నియామకం ఈ పరిధిలోనే ఉంటుంది.

**21.5. 7. సంక్షేమవిధులు :** ఆధునిక యుగంలో అభివృద్ధి చెందుతున్న దేశాలలో కార్యనిర్వాహక శాఖ అనేక సంక్షేమకార్యక్రమాలను నిర్వహిస్తుంది. ప్రణాళికా బద్ధంగా సర్వతోముఖాభివృద్ధిని సాధించటం, పేదరికం, నిరుద్యోగం వంటి ఆర్థికరుగ్మతలను నిర్మూలించటం, విభిన్న వర్గాల మధ్య అంతరాలను తొలగించటం, ఆర్థిక సమానత్వాన్ని సాధించటం, జీవనస్థాయి, ప్రమాణాలు పెంచడానికై కృషిచేయడం మొదలయినవి సంక్షేమ విధులు.

## 21.6. కార్యనిర్వాహక శాఖ - నమూనాలు

కార్యనిర్వాహక శాఖ స్వభావ, స్వరూపాలననుసరించి ఈక్రింది నమూనాలుగ వర్ణించవచ్చును.

1. బ్రిటీష్ పార్లమెంటరీ నమూనా
2. ప్రధానమంత్రి ప్రభుత్వం
3. అధ్యక్షతరహాప్రభుత్వం - అమెరికానమూనా
4. బహుసభ్యకార్యవర్గం - స్విట్జర్లాండ్ నమూనా

**21.6. 1. బ్రిటీష్ పార్లమెంటరీ నమూనా :** ఈ నమూనాలో రెండు కార్యనిర్వాహక వర్గాలుంటాయి. (i) రాజ్యాధినేత-ఇతడు కేవలం నామమాత్ర అధికారి. అలంకార ప్రాయుడు. ఏ విధమైన బాధ్యత వహించనవసరంలేదు. (ii) మంత్రి మండలి - యదార్ధ కార్యవర్గము. కార్యవర్గ అధికారాలన్నీ నిర్వహిస్తుంది. తన విధానాలకు, చర్యలకు ప్రత్యక్షంగా శాసనసభకు, పరోక్షంగా ప్రజలకు బాధ్యతవహిస్తుంది. బ్రిటీష్ పార్లమెంటరీ నమూనాకు ఈ క్రింది లక్షణాలు కూడా ఉంటాయి.

ఎ) నామమాత్రపు, కేవలం అలంకారప్రాయ రాజ్యాధినేత.

బి) ప్రధానమంత్రి నాయకత్వం - ఇతడే వాస్తవ ప్రధాన కార్యనిర్వాహకుడు.

i. మెజారిటీ పార్టీ నాయకత్వం : శాసనశాఖలో రెండు సభలుంటాయి. ప్రధానమంత్రి దిగువసభలో అత్యధిక మెజారిటీ గల పార్టీ నాయకుడు. మంత్రిమండలి సభ్యులందరూ మెజారిటీ పార్టీసభ్యులు. ఏ ఒక పార్టీకీ స్పష్టమైన మెజారిటీ లేనపుడు భావైక్యత గల పార్టీలు ఒకే బృందంగా ఏర్పడితే, ఆ బృందానికి నాయకుడు ప్రధానమంత్రిగా నియమింపబడవచ్చు.

ii. సమిష్టి బాధ్యత : మంత్రి మండలి సభ్యులందరూ సమిష్టిగా ప్రభుత్వ విధానాలకు శాసనసభకు బాధ్యత వహిస్తారు. విశ్వాస రాహిత్య తీర్మానం ఆమోదం పొందితే మంత్రులందరూ రాజీనామా చేయాలి.

iii. వ్యక్తిగత బాధ్యత : ప్రతీ మంత్రి తన ఆధీనంలో ఉండే ప్రభుత్వశాఖ విషయమై ఒక వైపు ప్రధానమంత్రికి; రెండవ వైపు పార్లమెంటుకు బాధ్యత వహిస్తాడు.

iv. బాధ్యతాయుతమైన బలమైన ప్రతిపక్షం : బలమైన, బాధ్యతాయుతమైన ప్రతిపక్షం పార్లమెంటులో ఉన్నప్పుడే ప్రభుత్వం నియంత్రింపబడుతుంది.

పార్లమెంటరీ పద్ధతి క్రమేపీ కేబినెట్ పద్ధతిగా ఈ క్రింది కారణాలవలన మార్పుచెందినది :

i. అధికారపక్షానికి అత్యధిక మెజారిటీ పార్లమెంటులో ఉన్నంత కాలం శాసనశాఖ నియంత్రణ నామమాత్రమే.
ii. కేబినెట్ పూర్తి బాధ్యతవహిస్తుంది. దిగువ సభ జోక్యాన్ని సహించదు.
iii. పార్లమెంటులో ప్రవేశపెట్టబడే బిల్లులలో ఎక్కువ బిల్లులన్నీ ప్రభుత్వమే తయారుచేసి, తన సంఖ్యాబలంతో ఆమోదింపచేస్తుంది.
iv. వార్షిక బడ్జెటును రూపొందించి, ఆమోదింపజేసి, అమలు పరుస్తుంది. జాతీయ ఆర్థిక వ్యవస్థకు ఆధిపత్యం వహిస్తుంది.
v. ఉన్నత పదవులకు నియామకాలను చేస్తుంది. ఈ విషయంలో సాధారణంగా పార్లమెంటు జోక్యం ఉండదు.
vi. పార్లమెంటును సమావేశ పరచటం, వాయిదావేయటం, పొడిగించటం అవసరమయితే దిగువసభను రద్దుచేయటం, ఎన్నికలు ప్రకటించటం మొదలైన అన్ని విషయాలలో కేబినెట్ దే అంతిమ నిర్ణయం.

రాజ్యాంగ పరంగా, చట్టపరంగా పార్లమెంటుకు చెందవలసిన అధికారాలన్నీ కేబినెట్ స్వాధీనపరచుకొన్నది. అంతేకాక దత్తశాసనాధికారం కూడా ఆచరణలో కేబినెట్‌కేలోబడటంవలన కేబినెట్ అత్యంత శక్తివంతమైన కార్యనిర్వాహక వర్గంగా మారిపోయింది.

**21.6. 2. ప్రధానమంత్రి ప్రభుత్వం :** శాసనశాఖను, కార్యనిర్వాహక శాఖను సమన్వయ పరచే బాధ్యత ఒకే వ్యక్తి వహించినపుడు దానిని ప్రధానమంత్రి ప్రభుత్వం అని అంటారు. దానికి ఈక్రింది లక్షణాలు ఉంటాయి.

i. ప్రధానమంత్రి వాస్తవకార్యనిర్వాహకుడు.

ii. మంత్రిమండలిపై సర్వాధికారాలు కలిగి ఉంటాడు.

iii. జాతీయ విధానాలకు, అంతర్జాతీయ విధానాలకు రూపకల్పన చేస్తాడు.

iv. శాసన సభలో మెజారిటీ పార్టీకి నాయకత్వం వహిస్తాడు.

v. దేశ ప్రజలకు మహానాయకుడు.

vi. అంతర్జాతీయ రాజకీయాలను ప్రభావితం చేస్తాడు.

పై కారణాల వలన ప్రధానమంత్రి వ్యక్తిత్వం పెరిగి అతడు నిర్వహించే ప్రభుత్వం అతని పేరుతో పిలువబడుతుంది. ఉదా : చర్చిల్ ప్రభుత్వం, నెహ్రూ ప్రభుత్వం.

**12.6. 3. అధ్యక్ష తరహా ప్రభుత్వం - అమెరికా నమూనా :** శాసనసభకు ప్రత్యక్షంగా గాని పరోక్షంగాగాని బాధ్యతవహించనవసరంలేని ప్రభుత్వానికి అధ్యక్షతరహా ప్రభుత్వమని పేరు. అత్యుత్తమ ఉదాహరణ అమెరికా. దానికి ఈక్రింది లక్షణాలుంటాయి.

i) అధ్యక్షుడు ఏకైక వాస్తవకార్యనిర్వాహక వర్గఅధినేత. అతడికి నిర్ణీత పదవీకాలం ఉంటుంది. తనసలహాదారులను లేక సహాయకులను తానే నియమించుకుంటాడు.

ii) మహాభియోగం : అత్యంత తీవ్రమైన నేరాలకు పాల్పడిన అధ్యక్షుని మహాభియోగ తీర్మానాన్ని ఆమోదించి పదవినుండి తొలగించవచ్చును. అయితే ఇది అంతతేలికైన విషయం కాదు.

iii) కార్యనిర్వాహకశాఖకు శాసన సభలో సభ్యత్వం ఉండదు. విశ్వాసరాహిత్యతీర్మానం ద్వారా కార్యవర్గాన్ని తొలగించే అవకాశంలేదు. ఈ రెండు ప్రభుత్వాంగాల మధ్య సంఘర్షణ లేక ప్రతిష్టంబన ఏర్పడవచ్చు.

iv) నిరోధసమతౌల్యాలు : ప్రభుత్వాంగాలు తమకు నిర్దేశించిన అధికారపరిధిలో స్వతంత్రంగా వ్యవహరిస్తూ ఒకదానినొకటి నియంత్రించుకోవటమే నిరోధసమతౌల్యము. ఈ ఏర్పాటు అమెరికా నమూనాలలో స్పష్టంగా ఉంది.

సమర్ధుడైన అధ్యక్షుడు తనవ్యక్తిత్వ ఆకర్షణతో జాతీయ, అంతర్జాతీయ వ్యవహారాలను ప్రభావితం చేస్తాడు. ప్రజాభిమానాన్ని పొందుతాడు.

**12.6. .4. బహుసభ్య కార్యవర్గం - స్విట్జర్లాండ్ నమూనా :** పార్లమెంటరీ విధానలక్షణాలను, అధ్యక్షవిధాన లక్షణాలను మిశ్రమం చేసినది బహుసభ్య కార్యవర్గం. దీనికి ఉదాహరణ స్విట్జర్లాండ్. స్విట్జర్లాండ్ నమూనాకు ఈ క్రింది లక్షణాలుంటాయి :

ఎ) 7 గురు సభ్యులుగల ఫెడరల్ కౌన్సిల్ కార్యనిర్వాహక వర్గంగా పనిచేస్తుంది. వీరు 4 సంవత్సరాల కాలపరిమితికి ఫెడరల్ అసెంబ్లీచే ఎన్నుకోబడతారు.

బి) సీనియారిటీ ప్రాతిపదికగా ఫెడరల్ కౌన్సిల్‌లో ఒక సభ్యుడిని అధ్యక్షునిగాను, ఇంకొకరిని ఉపాధ్యక్షునిగాను ఫెడరల్ అసెంబ్లీ ఎన్నుకొంటుంది. వీరి పదవీకాలం కేవలం ఒక్క సంవత్సరం.

సి) కౌన్సిల్ లో 7 గురు సభ్యులు సమాన బాధ్యతలు, అధికారాలు కలిగి ఉంటారు.

డి) శాసన సభ సమావేశాలలో పాల్గొంటారు. వారు నిర్వహించేశాఖలకు బాధ్యత వహిస్తారు.

ఇ) ఫెడరల్ కౌన్సిల్ సభ్యులను విశ్వాసరాహిత్య తీర్మానంతో తొలగించే అవకాశం లేదు.

ఎఫ్) మొత్తం పాలనా వ్యవహారాలను ఫెడరల్ కౌన్సిల్‌లోని 7 గురు సభ్యులే నిర్వహిస్తారు. పార్టీ రాజకీయాలకు అతీతంగా ఒక సమిష్టిబృందంగా పాలన నిర్వహిస్తారు. అందువలననే ఇది బహు సభ్యకార్యనిర్వాహక వర్గంగా పిలువబడుతుంది.

## 21.7. కార్యనిర్వాహక శాఖ - ప్రాధాన్యత

ఒకప్పుడు రాజ్యాలు ప్రజలలో శాంతి భద్రతలను కాపాడుతూ, విదేశీ దండయాత్రలనుండి జాతీయ సమగ్రతను కాపాడె పరిమితమైన పోలీసు విధులను మాత్రమే నిర్వహించేవి. ప్రజాస్వామ్య రాజ్యాలేర్పడిన తరువాత ప్రజాసంక్షేమవిధులను నిర్వహించవలసిన అవసరం ఏర్పడింది. పారిశ్రామికీకరణ, నగరీకరణ, రెండు ప్రపంచయుద్ధాలు, సోషలిష్టు ఉద్యమాలు, సంక్షేమ రాజ్యభావన, జనాభావిస్తరణ వలన పరిణామాలు మొదలైన విభిన్న కారణాలవలన కార్యనిర్వాహక శాఖ అధికార పరిధి అపారంగా విస్తరించింది. బహుళార్ధ కార్యనిర్వాహక సంస్థగా రూపొందింది. నిరుపమానమైన ప్రాముఖ్యతను పొందగలిగింది.

పాఠం - 22

# న్యాయశాఖ - దాని పాత్ర - విధులు

## 22.0. లక్ష్యం

ఆదర్శ ప్రజారాజ్యానికి స్వాతంత్ర్యమూ, నిష్పక్షమూ, ఉన్నతమూ అయిన న్యాయవ్యవస్థ వెన్నుముక వంటిది. ఈ పాఠంలో న్యాయవ్యవస్థ ప్రాముఖ్యాన్నీ అది నిర్వహించే కర్తవ్యాలను ప్రధానంగా చర్చిస్తాం. న్యాయశాఖ ప్రజాస్వామ్యంలో నిర్వర్తించే పాత్రను విశదపరచి దాని స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను ఎలా పరిరక్షించవచ్చో తెలియజేయటమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

## 22.1 విషయక్రమం

22.2. పరిచయము

22.3. న్యాయమూర్తుల నియామకం

22.4. న్యాయశాఖ - అధికారాలు

22.5. న్యాయ సమీక్ష - అధికారము

22.6. న్యాయశాఖ - ప్రాముఖ్యము - పాత్ర

22.7. నిబద్ధ న్యాయవ్యవస్థ

## 22.2. పరిచయము

ప్రభుత్వాంగాలు మూడు. అవి :

1. శాసన శాఖ : ఇది శాసన సభల ద్వారా చట్టాలను చేస్తుంది. అంటే శాసన నిర్మాణం శాసనశాఖ ప్రధమ కర్తవ్యం.

2. కార్యనిర్వాహక శాఖ : దీనినే పరిపాలక వర్గము అని కూడా అంటారు. ఇది శాసనశాఖ చేసిన చట్టాలను అమలుపరుస్తుంది.

3. న్యాయశాఖ : ఇది న్యాయస్థానాల రూపంలో ఉంటుంది. శాసనశాఖ చేసిన శాసనాలు రాజ్యాంగ బద్ధంగా లేదా న్యాయ సమ్మతంగా ఉన్నవా, లేదా అని వ్యాఖ్యానించటం, న్యాయాన్ని ప్రజాహక్కులను పరిరక్షించటం, శాసనాలను ఉల్లంఘించిన నేరస్థులను శిక్షించటం ప్రధానంగా న్యాయశాఖ నిర్వర్తించే కర్తవ్యాలు.

ఈ మూడు ప్రభుత్వాంగాలలోనూ న్యాయశాఖ ప్రజల పక్షాన నిలబడి వారిని దురుసుగానూ - దౌర్జన్యకరంగానూ ప్రవర్తించే ప్రభుత్వం బారినుండి రక్షిస్తుంది. ప్రభుత్వం న్యాయవిరుద్ధంగా వ్యవహరిస్తే ఆ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తుంది. అవసరమయితే శిక్షిస్తుంది. అందువలనే ప్రభుత్వాంగాలలో న్యాయవ్యవస్థకు ఎనలేని గౌరవాదరాలను కల్పించి సమాజం న్యాయవ్యవస్థకు విధేయత ప్రకటిస్తుంది.

ప్రజాస్వామ్యమంటే ప్రజలచేత నిర్వహించబడే పరిపాలనా వ్యవస్థ అని అర్థం. ప్రజాస్వామ్యంలో ప్రీతికీ, భీతికీ అతీతంగా వ్యవహరించగల న్యాయవ్యవస్థ ఒక్కటే ప్రజల స్వేచ్ఛకు రక్షణ కవచంగా ఉంటుంది. న్యాయబద్ధం, స్వేచ్ఛాయుతం, సమున్నతం, నిష్పాక్షికం అయిన న్యాయశాఖ ఏ రాజ్యంలో అయితే పరిపాలక వర్గ ప్రమేయం లేకుండానూ, ఇతర ప్రలోభాలకు తలవంచకుండానూ, తన విధులను నిర్వర్తిస్తుందో ఆ రాజ్యంలో ప్రజలు నిజమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అనుభవించగలుగుతారు. అందువలననే ఆదినుంచి రాజనీతి తత్వవేత్తలూ, రాజనీతిజ్ఞులూ ఎందరో న్యాయశాఖను శాసన పరిపాలక శాఖలనుండి వేరుచేయాలని గట్టిగా వాదిస్తూ వచ్చారు.

## 22.3. న్యాయమూర్తుల నియామకం, తొలగింపు, పదవీకాలం

న్యాయశాఖ యొక్క నిష్పాక్షికత, సమర్థత, అంకితభావాలను న్యాయవ్యవస్థకు మూలస్థంభాలయిన న్యాయమూర్తుల నియామక పద్ధతి, వారి ఉద్యోగ నిబంధనలు చాలామటుకు నిర్ణయిస్తాయి.

సాధారణంగా న్యాయమూర్తుల నియామకంలో 3 పద్ధతులను పాటిస్తారు అవి :

**22.3.1.** శాసనసభ్యుల చేత ఎన్నిక : స్విట్జర్లాండ్‌లో న్యాయమూర్తులను శాసనసభ ఎన్నుకుంటుంది. ఇటీవల కాలం వరకు అమెరికా రాష్ట్రాలలో కూడా న్యాయమూర్తులను ఎన్నుకొనేవారు. పూర్వపు రష్యాలో న్యాయమూర్తులను కేంద్ర శాసనసభ అయిన సుప్రీం సోవియట్ ఎన్నుకుంటూ ఉండేది. ఈ పద్ధతివలన న్యాయమూర్తులు శాసన సభ్యుల దాక్షిణ్యంపై ఆధారపడి, పరిమిత స్వాతంత్ర్యాన్ని మాత్రమే కల్గి ఉంటారు.

**22.3.2.** ప్రజల చేత ఎన్నిక : న్యాయమూర్తులను ప్రజలే ఎన్నుకొనే పద్ధతి కూడా ఉన్నది. నెపోలియన్‌కు పూర్వము ఫ్రాన్స్‌లో ఈ పద్ధతి అమలులోఉండేది. ఈ విధానం ఇప్పుడు కొన్ని స్విట్జర్లాండ్ రాష్ట్రాలలో ఉంది. అయితే దీనివలన న్యాయశాస్త్ర పరిజ్ఞానం లేనివారు కూడా న్యాయమూర్తులయి న్యాయం, న్యాయవ్యవస్థ భ్రష్టం అయ్యే ప్రమాదం ఉంది.

**22.3.3.** రాజ్యాధి నేత చేత నియామకం : రాజ్యాధినేత న్యాయమూర్తులను నియమించే సంప్రదాయం చాలాచోట్ల మనకు కన్పిస్తుంది. మనదేశంలో న్యాయమూర్తులను దేశాధ్యక్షుడే నియమిస్తాడు. బ్రిటన్‌లో రాజ్యాధిపతి స్వయంగా న్యాయమూర్తులను నియమిస్తాడు. చాలా దేశాలలో న్యాయమూర్తులను దేశాధ్యక్షుడు కాని, కార్యనిర్వాహక వర్గంగాని నియమిస్తుంది. న్యాయమూర్తుల నియామక విషయంలో ఇతర హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులను సంప్రదించి నియమించటం చక్కని సంప్రదాయం.

**22.3.4.** న్యాయమూర్తుల తొలగింపు : న్యాయమూర్తుల తొలగింపు విధానం వీలయినంత కఠినంగానూ, దృఢంగానూ ఉండటం అవసరం. లేకపోతే స్వల్పమైన కారణాలవల్ల వారిని తొలగించే ప్రమాదం ఉంది. దానివలన న్యాయమూర్తులు నిర్భయంగానూ, స్వేచ్ఛగానూ, న్యాయపాలన చేయలేరు. అందువలననే ఎన్నో దేశాలలో న్యాయమూర్తులను తొలగించే పద్ధతి జటిలం చేయబడింది. అమెరికా న్యాయమూర్తులను తొలగించాలంటే దిగువ సభ (ప్రజాప్రతినిధుల సభ) న్యాయమూర్తిపై అభియోగం మోపుతూ ఒక తీర్మానాన్ని ఆమోదించాలి. ఆ తీర్మానాన్ని ఎగువ సభ పరిశీలించి దానిపై విచారణ జరుపుతుంది. తరువాత తగిన మెజారిటీతో వారిని తొలగించవచ్చు. భారతదేశంలో కూడా దాదాపు ఇదే పద్ధతి అమలులో ఉంది. న్యాయమూర్తి అసమర్థుడూ, అవినీతి పరుడూ అని నిరూపణ అయి ఆ మేరకు పార్లమెంటు ఉభయసభలలోనూ నిర్ణీత మెజారిటీతో తీర్మానాలను ఆమోదిస్తే అప్పుడు రాష్ట్రపతి తన అధికారాన్ని వినియోగించి న్యాయమూర్తిని తొలగిస్తాడు.

**22.3.5.** న్యాయమూర్తుల పదవీకాలం: న్యాయమూర్తుల పదవీకాలం సాధారణంగా 65 మొదలు 75 సంవత్సరాల వరకు వివిధ దేశాలలో నిర్ణయించటం జరిగింది. మనదేశంలో న్యాయమూర్తుల పదవీకాలం 65 ఏళ్ళు కాగా అమెరికాలో 75 సంవత్సరాలు. అయితే న్యాయమూర్తులు శాసన సభలచేత ఎన్నుకోబడినట్లయితే వారి పదవీకాలం చాలా తక్కువగా ఉంటుంది. 2 నుండి 6 సంవత్సరములు మాత్రమే పదవీకాలం స్విస్‌లోనూ, రష్యాలోనూ ఉన్నది.

## 22.4. న్యాయశాఖ అధికారాలు

ఆధునిక కాలములో న్యాయశాఖ బహుముఖాలయిన అధికారాలను, విధులను నిర్వర్తిస్తుంది.

**22.4.1.** న్యాయపరిపాలన : న్యాయస్థానాలు పౌరుల మధ్య ఉత్పన్నమయే వివాదాలను పరిష్కరిస్తాయి. అలాగే పౌరులకు, ప్రభుత్వానికీ, లేక ప్రభుత్వ సంస్థలకు మధ్య వచ్చే వివాదాలను అందుబాటులో నున్న పత్రాలను, సాక్ష్యాలను, ఆధారంగా చేసుకొని పరిష్కరించి తీర్పు చెప్తాయి.

**22.4..2.** రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించుట : కేంద్ర రాష్ట్ర శాసన సభలు చేసిన చట్టాలను, రాజ్యాంగ శాసనాన్నీ వ్యాఖ్యానించటమూ, ఆయా కేసులలో రాజ్యాంగ సూత్రాలను అన్వయించటమూ న్యాయశాఖ ప్రధానవిధి. "అమెరికా ప్రజలు రాజ్యాంగాన్ని పాటిస్తారు.

అయితే అత్యున్నత న్యాయస్థానం ఏమి చెబుతుందో అదే రాజ్యాంగం" - అన్న అమెరికా న్యాయమూర్తి హోమ్స్ వ్యాఖ్యానం ఈ సందర్భంగా గుర్తుంచుకోదగినది.

**22.4.3. పౌరహక్కుల రక్షణ :** ప్రజలకు రాజ్యాంగం కొన్ని ప్రాథమిక లేక న్యాయబద్ధమయిన హక్కులను ఇస్తుంది. ఈ హక్కులకు ప్రభుత్వం వలన కానీ, ప్రభుత్వేతర సంస్థలవల్ల గానీ లేక ఇతర వ్యక్తుల వల్లగానీ హాని కలిగినపుడు పౌరుడు న్యాయస్థానాలకు నివేదించి రక్షణ పొందవచ్చు.

**22.4..4. ప్రధాన సలహాదారులు :** న్యాయస్థానాలు కొన్నిదేశాలలో రాజ్యాధినేతకు గానీ, ప్రభుత్వానికిగానీ రాజ్యాంగ సలహాదారులుగా వ్యవహరిస్తాయి. భారతదేశంలో రాష్ట్రపతి కోరినట్లయితే సుప్రీంకోర్టు ఆయా రాజ్యాంగ సంబంధమయిన అంశాలపై రాష్ట్రపతికి సలహాలను ఇస్తుంది. అయితే ఆ సలహాలను రాష్ట్రపతి పాటించాలనే నిర్బంధం ఏమీలేదు.

**22.4.5. రాజ్యాంగ సంరక్షణ కర్త :** రాజ్యాంగ సంరక్షణ న్యాయస్థానాల విధ్యుక్త ధర్మము. న్యాయశాఖ మైనారిటీ తీరని పిల్లల ఆస్తులకు ధర్మకర్తలను నియమించి వారిద్వారా కాపాడుతుంది. అలాగే కొన్ని సంస్థల పరిపాలన వ్యవస్థ విఫలమయిన సమయంలో రిసీవర్‌లను లేక సంరక్షకులను నియమించి ఆయా సంస్థల ఆస్తులను కాపాడుతుంది. అలాగే అత్యాచారాలకు, అఘాయిత్యాలకు గురయిన అమాయకులను, ప్రభుత్వ శాఖ పీడనానికి గురయిన వ్యక్తులను తగువిధంగా విచారించి కాపాడటమేగాక నేరస్థులుగా నిరూపణ అయిన వారిని కఠినంగా శిక్షిస్తుంది.

**22.4.6. దిగువ న్యాయస్థానాలకు మార్గదర్శకం :** ఉన్నత న్యాయస్థానాలు వివిధ కేసులలో ఇచ్చేతీర్పులు ఆయా సమయాలలో న్యాయమూర్తులు ప్రకటించే అభిప్రాయాలు, ఆధీన న్యాయస్థానాలకు, సారూప్యము కల కేసులలో మార్గదర్శకాలుగా ఉండగలవు. ముందు ముందు ఉత్పన్నమయే వివాదాల విచారణలో సైతం గతంలో చెప్పిన తీర్పులు ఆధారంగా గలవు.

**22.4.7. సమాఖ్య సంరక్షణ శక్తి :** సమాఖ్య రాజ్యాలలో న్యాయస్థానాలకు సాధారణంగా విశేష అధికారాలు ఉంటాయి. అంతర్ రాష్ట్ర వివాదాలను, కేంద్ర రాష్ట్రాల మధ్య వచ్చే వివాదాలను న్యాయస్థానాలు పరిష్కరిస్తాయి. అంతేగాక సమాఖ్య వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వాలు గానీ, కేంద్ర ప్రభుత్వంగానీ, రాజ్యాంగం నిర్ణయించిన హద్దులను అతిక్రమించకుండా న్యాయశాఖ తన అధికారాల ద్వారా కాపాడుతుంది.

**22.4.8. ఇతరములు :** నేరస్థులను విచారించటమూ, దేశాధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు మంత్రులు, గవర్నర్ల వంటి ఉన్నత పదవులలో నియమించబడిన వారిచేత పదవీ ప్రమాణ స్వీకారం చేయించటం వంటి ఇతరములయిన విధుల నెన్నింటినో న్యాయశాఖ నిర్వర్తిస్తుంది.

## 22.5. న్యాయసమీక్షాధికారము (Power of Judicial Review)

సమాఖ్య రాజ్యాలలో న్యాయస్థానాలకు ఉండే మహోన్నతాధికారాన్ని న్యాయసమీక్షాధికారము అంటారు. రాజ్యాంగానికి గానీ, రాజ్యాంగ స్ఫూర్తికిగానీ, విరుద్ధంగా ఉన్న శాసనాలనూ, ప్రభుత్వ ఉత్తర్వులనూ, తదితర ఆదేశాలనూ న్యాయస్థానాలు సమీక్షించి కొట్టివేసే అధికారాన్ని లేదా రద్దుపరిచే అధికారాన్ని "న్యాయసమీక్షాధికారము" అంటారు. రాజ్యాంగానికి అనుగుణంగా ఉన్న శాసనాలను, ప్రభుత్వ ఉత్తర్వులను ఆమోదించి, విరుద్ధముగా ఉన్న వాటిని న్యాయస్థానాలు రద్దుపరుస్తాయి.

అమెరికాలో మొట్ట మొదటిసారిగా 1903లో మ్యాడిసన్ మరియు మార్బరి వివాదంలో సుప్రీంకోర్టుకు న్యాయ సమీక్షాధికారము ఉన్నదని న్యాయమూర్తి జాన్‌మార్షల్ ప్రకటించడంతో వాటినుండి న్యాయసమీక్షాధికారం అమెరికా న్యాయవ్యవస్థలో అత్యంత కీలకమయిన అంశంగా తయారయింది. అదే స్ఫూర్తిని భారతరాజ్యాంగ నిర్మాతలు సైతం స్వీకరించారు. విచిత్రమేమంటే ఈనాడు అమెరికా, భారత్ దేశాల అత్యున్నత న్యాయస్థానాలు మహాశక్తి వంతంగా మారి ఈనాడు అవి "తృతీయ శాసన సభ" గా పరిణమించి పాలనా వ్యవస్థలను ఆశ్చర్యకరముగా ప్రభావితం చేస్తున్నవి. ఈ సందర్భంగా ఒక విషయాన్ని గుర్తించవలసి ఉన్నది. రాజ్యాంగాన్ని వివరించి, విశ్లేషించి వ్యాఖ్యానించటంలో న్యాయమూర్తుల వ్యక్తిగత నేపథ్యం కూడా వారి తీర్పులను ప్రభావితం చేస్తూ ఉంటుంది. న్యాయమూర్తుల ఆర్థిక, సాంఘిక, రాజకీయ, మత దృక్పథాలు కూడా వారు ఇచ్చే తీర్పులను ప్రభావితం చేసే అవకాశం ఉంది. వీటికి తోడు రాజ్యాంగ నిబంధనలను ప్రధానంగా అన్వయించి వ్యాఖ్యానించవలసి ఉంటుంది. ఈ ప్రక్రియలో సర్వదా న్యాయ సమీక్షాధికారం ప్రజలకు

ప్రయోజనకరమని చెప్పలేము. సర్వజన శ్రేయోదాయకమైన ఒక ప్రభుత్వ శాసనము ఒక్కో సందర్భములో రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా ఉండలేకపోవచ్చు. అలాంటి పరిస్థితులలో ఆ ప్రభుత్వ శాసనం న్యాయస్థానాల సమీక్షాధికారానికి గురయి రద్దుకావచ్చును. ప్రజాప్రయోజనాలను ఏదైనా ఒక శాసనం లేదా ప్రభుత్వ ఉత్తర్వును పరిరక్షించ లేకపోవచ్చు. కానీ అది రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా ఉండవచ్చును. ఇటువంటి సందర్భాలలో జాతి భవిష్యత్తే ప్రశ్నార్థకం అవుతుంది. నిజానికి సమసమాజ స్థాపనకు ప్రభుత్వము చేపట్టే పెక్కు కార్యక్రమాలు న్యాయ సమీక్షాధికారానికి గురిచేయబడి స్థంభించి పోయిన సందర్భాలు ఎన్నోఉన్నాయి. ప్రసిద్ధమయిన గోలక్‌నాథ్ కేసు ఒక ఉదాహరణ. అయితే అంతమాత్రాన న్యాయస్థానాలకు అంతటి మహోన్నతాధికారము ఉండకూడదని కాదు. అయితే "బహుజన హితాయ బహుజన సుఖాయ" అనే పరమాదర్శాన్ని ఫలవంతం చేసే సమసమాజ స్పృహ లక్ష్యంగా న్యాయస్థానాలు రాజ్యాంగాన్ని అన్వయించటం వాంఛనీయం. శాసన వ్యవస్థ నిరంకుశత్వానికీ, న్యాయవ్యవస్థ స్వేచ్ఛ తత్వానికీ మధ్య సమతౌల్యం పాటించబడాలి. ఈ రెంటి మధ్య ఉత్పన్నమయ్యే స్పర్థవలన ప్రజాహితానికి కీడు కలగకూడదు.

న్యాయసమీక్షాధికారము న్యాయవ్యవస్థకు పటిష్ఠవంతమయిన ఆయుధమే అయినప్పటికీ అది రాజ్యాంగ రక్షణకూ, పౌరుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల పరిరక్షణకూ రక్షణ కవచంగా ఉంటూ ఉన్నందున ఈ అధికారముపై వస్తున్న విమర్శకంటే సమర్థనే ఎక్కువగా కనిపిస్తున్నది.

## 22.6. న్యాయశాఖ - ప్రాముఖ్యము - పాత్ర

ప్రభుత్వాంగములు మూడు అని మనము ముందే తెలుసుకున్నాం. వీటిలో న్యాయశాఖ అత్యున్నతమైనది. లార్డ్ బ్రైస్ (Lord Bryce) మాటలలో "న్యాయవ్యవస్థ సామర్థ్యానికి మించిన పరీక్షకంటే ప్రభుత్వ ఔన్నత్యానికి వేరొక పరీక్షలేదు." ("There is no better test of the excellence of a government than the efficiency of its Judicial System" - Brice) న్యాయ స్థానాలూ, న్యాయవ్యవస్థ నిష్పాక్షికంగానూ, సమర్థవంతంగానూ, స్వతంత్రంగానూ పనిచేసినపుడే పరిపాలనా వ్యవస్థ గూడా సమర్థవంతంగా పని చేయగలుగుతుంది. న్యాయస్థానాలు అసమర్థంగానూ, అవినీతికరంగానూ, పనిచేసిన క్షణాన కంచెయే చేను మేసినట్లవుతుంది.

పౌరులమధ్య, పౌరులకీ ప్రభుత్వానికీ మధ్య, వివాదాలు తలెత్తినపుడు, శాసనాలను సక్రమంగా విశ్లేషించి వ్యాఖ్యానించటం ద్వారా ఆ జాతి యొక్క రాజకీయ, నాగరికత స్థాయి ఏమిటో ఆ దేశ న్యాయవ్యవస్థ నిర్ణయిస్తుంది అని రాజనీతి శాస్త్రవేత్త (Sidgwick) సిడ్జివిక్ పేర్కొన్నారు. కాగా న్యాయవ్యవస్థ పరిపాలనావర్గాన్ని పౌరజీవనాన్ని శాసన యంత్రాంగాన్ని ప్రభావితం చేసి క్రమబద్ధీకరిస్తుందని మరొక రాజనీతి శాస్త్రజ్ఞుడు జె.ఎ.ఆర్. మ్యారేట్ (J.A.R. Marriot) భావించాడు.

ఒక జాతి శ్రేయస్సు, ఒక దేశ ప్రభుత్వ ఔన్నత్యము, ఎప్పుడూ కూడా ప్రీతికీ, భీతికీ అతీతంగా న్యాయాన్ని ప్రజలకు అందించే న్యాయస్థానాలపై ఆధారపడి వుంటుంది. సక్రమంగా న్యాయస్థానాలు న్యాయాన్ని ప్రజలకు అందించిననాడు ప్రజలలో ప్రభుత్వం పట్ల విశ్వాసం పెంపొందుతుంది. ప్రజా విశ్వాసాన్ని చూరగొనిన ప్రభుత్వం మాత్రమే ప్రజలకు సుస్థిర ప్రభుత్వాన్ని అందించి, ప్రగతికి సోపానాలను నిర్మించగలుగుతుంది. ప్రజల హక్కులు, స్వేచ్ఛలు, ప్రజాస్వామ్య విజయం, ప్రభుత్వ సామర్థ్యం, ఎప్పుడు న్యాయ పాలనా సామర్థ్యంపై ఆధారపడి వుంటాయి. అయితే న్యాయస్థానాలు నిర్భీతిగా తమ విధులను నిర్వర్తించగలిగినపుడే ఇవన్నీ సాధ్యమవుతాయి.

ప్రాచీన, మధ్య యుగాలలో శాసన నిర్మాణ, పరిపాలనా న్యాయనిర్వహణ విధులన్నీ ఒకే వ్యక్తి యందు కేంద్రీకృతమై యుండేవి. అది రాచరికాలనాటిమాట. రాజు న్యాయమూర్తులను నియమించేవాడు. న్యాయమూర్తులు రాజ ప్రతినిధులుగా వ్యవహరించేవారు. కనుక న్యాయానికి ప్రతీకగా వ్యవహరించే చక్రవర్తి ఆజ్ఞలమేరకు న్యాయమూర్తులు తీర్పులు చెపుతూ వుండేవారు. నాటి సమాజంలో శాసనకర్త, న్యాయనిర్మాత, న్యాయనిర్ణేత కూడా చక్రవర్తి మాత్రమే ! కానీ ఈనాడు ప్రజలకు బాధ్యత వహించే ప్రభుత్వాలు ఏర్పడినాయి. ప్రజలకు, ప్రభుత్వం జవాబుదారి వహించవలసి ఉన్నది. శాసనశాఖ, పరిపాలక శాఖ, న్యాయశాఖలు, ఒక దానినుండి ఒకటి వేరుచేయబడినవి. అధికార పృథఃక్కరణతో (Separation of powers) పాటు అధికార వికేంద్రీకరణ కూడా (Decentralisation of powers) చేయబడింది. తత్ఫలితంగా న్యాయవ్యవస్థ అత్యున్నతమైన స్థానాన్ని అధిరోహించి న్యాయానికి, ధర్మానికి ఆకృతిగా భావించబడి ఆదరించబడుతున్నది. న్యాయవ్యవస్థపట్ల ప్రజలకున్న గౌరవ విశ్వాసాలను పెంపొందించవలసిన బాధ్యత న్యాయస్థానాలపైనే ఉంది. ప్రజలలో నైతిక విలువలను పెంపొందించి ప్రజలందరూ నీతిబద్ధంగానూ, న్యాయబద్ధంగాను, ప్రవర్తించే విధంగా చూడవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఎంత వుందో న్యాయవ్యవస్థపైనా అంతేవుంది.

న్యాయశాఖ ప్రధానంగా పౌరహక్కుల రక్షణకర్తగా విశిష్టమైన భూమికను నిర్వహిస్తుంది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు చేసే శాసనాలు ఏమేరకు ప్రజాశ్రేయాన్ని పరిరక్షించి పెంపొందిస్తున్నాయో కనిపెట్టవలసిన బాధ్యత న్యాయశాఖపై నైతికంగా వుంటుంది. అలాగే ప్రజాస్వామ్యం అంటే అధిక సంఖ్యాకుల అధికారమే. (వాస్తవంగా పాలనా విధానం గనుక ఈ అధిక సంఖ్యాకులు అక్రమమార్గం ద్వారా అధికారాన్ని చేజిక్కించుకొని అల్పసంఖ్యాకులను పీడించకుండా చూడటం కూడా అవసరమే.) అంతేగాదు, ప్రభుత్వాధికారానికీ పౌరహక్కులకూ మధ్య స్పర్థ (Conflict) ఎపుడూ ఉండనే ఉంటుంది. అలాంటి స్పర్థలు తలయెత్తినపుడు ప్రభుత్వాధికారానికీ పౌర స్వేచ్ఛలకూ మధ్య సమతౌల్యాన్ని, సామరస్యాన్ని నెలకొల్పవలసిన బాధ్యత కూడా న్యాయవ్యవస్థ స్వీకరించవలసి వుంది. నిరంతరము ప్రజలకూ ప్రభుత్వానికీ మధ్య తలయెత్తే వివాదాల వలన అభ్యుదయం కుంటుపడుతుంది. అందువలననే న్యాయస్థానాలు పౌరస్వేచ్ఛ రక్షణ వ్యవస్థలుగాను, నిష్పాక్షిక న్యాయ నిర్ణేతలుగాను రాజ్యాంగ సంవిధాన రక్షణ కవచాలుగాను, రాజ్యాధిపతికి రాజ్యాంగ సలహాదారులుగాను, ఈనాడు మహోత్తరమైన పాత్రను నిర్వహిస్తున్నాయి.

## 22.7. నిబద్ధ న్యాయవ్యవస్థ (Committed Judiciary) :

ప్రజాస్వామిక వ్యవస్థలో అధిక సంఖ్యాకుల భాగస్వామ్యంతోనే ప్రభుత్వం నడుస్తుంది. ఈ అధిక సంఖ్యాకులు విద్యావంతులు, బాధ్యతాయుతంగా ఉండేవారు, నిజాయితీపరులు అయినట్లయితే ప్రజలు సుఖ సంతోషాలను అనుభవిస్తారు. ఒకవేళ ఈ అధిక సంఖ్యాకులే గనుక నిరక్షరాస్యులు, అవినీతిపరులు, బాధ్యతారహితులు అయినట్లయితే ప్రజలు అనూహ్యామయిన కష్టనష్టాలకు గురి అవుతారు. అలాంటి పరిస్థితులలో నిరంకుశమయిన ప్రభుత్వం బారి నుండి ప్రజలను కాపాడవలసిన బాధ్యత న్యాయస్థానాలదే.

అయితే న్యాయస్థానాలు అంకితభావంతో లేదా నిబద్ధతతో (Commitment) పనిచేయాలనేది ఈ మధ్య విన్పిస్తున్న వాదన. కమ్యూనిస్టు, ఫాసిస్టు దేశాలలో న్యాయవ్యవస్థ నిబద్ధమై ఉంటుంది. శ్రేయోరాజ్యంలో సంక్షేమ కార్యక్రమాల అమలుకై న్యాయస్థానాలు అడ్డుగోడలుగా నిలువకుండా ఉండాలని, నిబద్ధ న్యాయవ్యవస్థ అవసరమని కొందరి వాదన. ఆ మాటకొస్తే ఈ అంకిత భావమనేది న్యాయశాస్త్రం పట్ల ఉండాలా ? లేక రాజ్యాంగ స్ఫూర్తికి చెంది ఉండలా ? లేక ఈ రెంటికి కాకుండా ప్రజాశ్రేయస్సే పరమావధిగా భావించి ప్రజాహితాన్ని మాత్రమే దృష్టిలో ఉంచుకొని న్యాయస్థానాలు తీర్పులు చెప్పాలా ? అనే ప్రశ్నలు వెంటనే ఉత్పన్నమవుతాయి.

ఇందులో అంకిత భావమనేది న్యాయశాస్త్రానికి లేక న్యాయసూత్రాలకు అయినట్లయితే అది వ్యక్తిగతమయిన లేదా రాగ ద్వేషాలకు సంబంధించిన తత్వానికి అతీతంగా వ్యవహరించినట్లు అవుతుంది. ఒక విధంగా ఇలాంటి దృక్పథమే మంచిది. ఎందువలనంటే, న్యాయమూర్తులు ప్రలోభాలకో లేక విశ్వాసాలకో లోనయి తీర్పులు చెప్పవలసిన అవసరము ఉండదు. కానీ ప్రజాహితానికి సాంకేతికమయిన న్యాయసూత్రాలు ఒకానొక సందర్భంలో అడ్డంకులుగా మారితే శాస్త్రాన్ని గౌరవించి సమాజాన్ని త్యాగం చేసినట్లవుతుంది. ఇది వాంఛనీయం కాదు.

ఇక న్యాయమూర్తులు రాజ్యాంగస్ఫూర్తిని గ్రహించి మాత్రమే తీర్పును చెప్పాలి అనడంలో కూడా గుణదోషాలున్నాయి. రాజ్యాంగ స్ఫూర్తి ఏమిటి ? దానిని ఎవరు నిర్ణయించాలి ? ఇటు శాసన వ్యవస్థా ? లేక కార్యనిర్వాహక వర్గమా లేక న్యాయస్థానాలా ? ఇవి ఈ సందర్భంగా ఉత్పన్నమయ్యే ప్రశ్నలు.

అమెరికాలో ఆ దేశపు అత్యున్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) రాజ్యాంగ స్ఫూర్తిని నిర్ణయిస్తుంది. అక్కడ న్యాయమూర్తుల తీర్పులే రాజ్యాంగానికి లేక రాజ్యాంగ స్ఫూర్తికి అంతిమ వ్యాఖ్యానాలు. ఇది ఇలా ఉంచితే కోట్లాది ప్రజానీకానికి ప్రాతినిధ్యం వహించే అత్యున్నత శాసనశాఖ (ఉదా : పార్లమెంట్) చేసిన చట్టాలను ఏ కొద్దిమంది వ్యక్తులతో కూడిన న్యాయస్థానం రాజ్యాంగాన్ని ఉల్లంఘించాయన్న కారణంగా కొట్టివేయటం ప్రజాస్వామికమవుతుందా ? నైతికంగా సమర్థనీయమవుతుందా ? అనే ప్రశ్నచాలా కీలకమయినది. అంకిత భావంతో న్యాయస్థానాలు తీర్పు చెప్పాలి అనేవాదం గందరగోళం సృష్టించే అవకాశం ఉంది.

పాఠం - 23

# ఎన్నిక గణము - ప్రాతినిధ్య పద్ధతులు

## 23.0. లక్ష్యం

ప్రజాస్వామ్యంలో సార్వభౌమాధికారం వయోజనులయిన నియోజకులకు, లేదా ఎన్నిక గణానికి చెంది ఉంటుంది. కనుక ప్రజాస్వామ్యంలో ఎన్నికలకు, ఎన్నిక గణానికి గల ప్రాముఖ్యాన్ని వివరించటం, వీటితో సన్నిహిత సంబంధం ఉన్న ప్రాతినిధ్య పద్ధతులను చర్చించటం ఈ పాఠం యొక్క ప్రధాన లక్ష్యాలు.

## 23.1 విషయక్రమం


23.2. పరిచయము.

23.3. ఓటుహక్కు.

23.4. ఓటుహక్కు - అర్హతలు

23.5. నియోజక వర్గాలు - పద్ధతులు (Constituencies - Methods)

23.6. ప్రాతినిధ్య పద్ధతులు (Methods of Representation)

23.7. అల్ప సంఖ్యాక ప్రాతినిధ్యము (Minority Representation)

23.8. నైష్పత్తిక ప్రాతినిధ్యము (Proportional Representation)

23.9. జాబితా పద్ధతి (List System)

23.10. పరిమిత ఓటు పద్ధతి (Limited Vote System)

23.11. సంతులిత ఓటు లేక సంచిత ఓటు పద్ధతి (Cumulative Vote System)


## 23.2. పరిచయము

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే సార్వభౌములు. ఈ సార్వభౌమత్వాన్ని ప్రజలే గనుక ప్రత్యక్షంగా నిర్వహిస్తే ఆ విధానాన్ని "ప్రత్యక్ష ప్రజాస్వామ్యము" అని అంటాము. పెద్ద విస్తీర్ణముతోనూ, జనాభాతోనూ, వైవిధ్యముతోనూ ఉన్న రాజ్యాలకు ప్రత్యక్ష ప్రజాస్వామ్యం కష్టసాధ్యము. అందువలన అతి పరిమితమయిన స్విట్జర్లాండ్ వంటి దేశాలు మినహాయిస్తే ప్రత్యక్ష ప్రజాస్వామ్యము ఈనాడు ఎక్కడా అమలులో లేదు. ఇక ఏకైక ప్రత్యామ్నాయమయిన పరోక్ష ప్రజాస్వామ్యమన్నది సులభమూ, సరళమూ అయినందువలన ఈనాడు దాదాపు అన్ని ప్రజాస్వామిక దేశములలోనూ అమలులో ఉన్నది.

పరోక్ష ప్రజాస్వామ్య వ్యవస్థలో నియోజకులయిన ఓటర్లు తమ ప్రతినిధులను నిర్ణీత కాలానికి ఎన్నుకుంటారు. అలా ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు శాసన సభ్యులవుతారు. శాసన సభలు ప్రజలకోసం శాసనాలను చేస్తాయి. ఆ శాసనాలను ప్రజలకు బాధ్యత వహించే ప్రభుత్వం అమలుచేస్తుంది. అంటే పరోక్ష ప్రజాస్వామ్య విధానాలలో ప్రజలు తమచేత ఎన్నుకోబడిన ప్రతినిధుల ద్వారా ప్రభుత్వ వ్యవహారములను నిర్వహిస్తారు.

తమ ప్రతినిధులను ప్రజలు ఎన్నుకొనే విషయంలో "ఓటు" అనేది అతి ముఖ్యమయిన విషయము. ఈ ఓటింగ్ విధానానికి సంబంధించిన ఎన్నికలు, ఎన్నికల పద్ధతులు మనం చర్చిద్దాం.

## 23.3. ఓటుహక్కు

తమ ఇష్టము వచ్చిన అభ్యర్థులను ఎన్నుకోవడంలో నియోజకులకు రాజ్యాంగం ఇచ్చిన రాజకీయ స్వేచ్ఛే "ఓటు హక్కు". ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటుహక్కు వయోజనులయిన స్త్రీ పురుషులందరికి ఉండాలనేది సార్వజనిక సంప్రదాయము. అందువలననే ఈనాడు అన్ని ప్రజాస్వామిక దేశాలు విశ్వజనీన వయోజన ఓటింగ్ సూత్రాన్ని ఆమోదించి అమలు చేస్తున్నాయి. తొలుత ప్రజాస్వామ్య ఆవిర్భావ దశలో ఆస్తి, విద్య, ఆదాయం, కులమతాలు ప్రాతిపదికలుగా ఈ ఓటుహక్కు ప్రజలకు ఇవ్వబడింది. క్రమంగా ఇది విస్తృతమై నిర్ణీత వయస్సు కలిగిన (కొన్ని దేశాలలో 21 సంవత్సరాలు. పెక్కు దేశాలలో 18 సం. వయస్సు) స్త్రీ పురుషులందరికీ ఓటుహక్కు ఇవ్వబడింది. దీనినే "విశ్వజనీన ఓటింగ్" (Universal Franchise) అంటారు.

## 23.4. ఓటుహక్కు - అర్హతలు

ఓటుహక్కు కొంతమేరకు రాజకీయ చైతన్యం, మౌలికమైన అక్షరాస్యత, వయోపరిమితి ఉన్నవారికే ఇవ్వాలని ఈనాడు అందరూ అంగీకరిస్తున్నారు. 1) అందువలన వయఃపరిమితి ఒక ప్రధానమయిన అర్హతగా అన్ని దేశాలు నిర్దేశించాయి. వయఃపరిమితి ఇంగ్లండ్, అమెరికా, ఇండియా వంటి దేశాలలో 18 యేళ్ళుకాగా, స్విట్జర్లాండ్‌లో 20 సంవత్సరములు. 2) కొన్ని రాజ్యాలు విద్యార్హతను ఓటుహక్కుకు ప్రాతిపదికగా నిర్దేశించాయి. ఓటరుకు కనీసం చదవటము, వ్రాయటము వచ్చి ఉండాలి. సార్వజనికమయిన ఓటుహక్కుకంటే ముందుగా సార్వజనిక విద్యాబోధన జరగాలని జాన్ స్టువర్ట్ మిల్ అంటాడు. భారతదేశములో నిరక్ష్యరాస్యత ఓటుహక్కుకు అనర్హత ఏమీకాదు. మనదేశములో విధాన పరిషత్ ఉన్న రాష్ట్రాలలో పట్టభద్రులకు ఓటింగ్ హక్కు కల్పించబడినది. 3) కొంత కాలం క్రితం వరకు లైంగిక అర్హత కూడా ఓటుహక్కుకు ప్రాతిపదికగా ఉండేది. ఇటీవల కాలంవరకు "ప్రజాస్వామ్య ప్రయోగశాలగా" అభివర్ణించబడిన స్విట్జర్లాండ్‌లో స్త్రీలకు ఓటుహక్కు కల్పించబడలేదు. 1950వ సంవత్సరములో స్విస్ స్త్రీలకు ఓటు హక్కు కల్పించబడింది. 4) కొన్ని దేశములలో నివాసార్హత ఓటుహక్కుకు మూలము. పౌరసత్వముతోపాటు కొంతకాలము ఆ దేశములో నివసించి ఉంటేనే తప్ప ఓటుహక్కు ఇవ్వరు. అలాగే ఒక నియోజక వర్గములో నిర్ణీత కాలపు నివాసము ఆ నియోజక వర్గములో ఓటుహక్కుకు అర్హతగా ఉంటుంది. దీనివలన ఓటరు తన నియోజక వర్గాన్ని గురించిన అవగాహన కలిగి ఉంటాడు.

పైన మనం చర్చించిన అక్షరాస్యత, వయస్సు, లైంగిక అర్హత, నివాస అర్హతలతోపాటు మరికొన్ని ఇతర అంశాలు కూడా ఉన్నాయి. నిర్ణీత వయస్సు దాటని మైనర్‌లకు, మతిస్థిమితం లేనివారికి, విదేశీయులకు, దీర్ఘకాలం జైలు శిక్ష పడినవారికి, దివాలా తీసినవారికి ఓటుహక్కు లభించదు.

## 23.5. నియోజక వర్గాలు - పద్ధతులు

ఒక నిర్ణీతమయిన ప్రదేశము నుండి లేక కొంతమంది అభ్యర్థులను ఆ ప్రదేశములో నివాసం చేస్తున్న ప్రజలు ఎన్నుకోవలసి ఉంటుంది. ఆ నిర్ణీత ప్రదేశం ఇంచుమించుగా ఒకే పరిమాణము, విస్తీర్ణం, జనసాంద్రత కలిగి ఉన్నట్లయితే అలాంటి ప్రదేశాన్ని "నియోజక వర్గము" అంటారు. నియోజక వర్గాలను సాధారణముగా రెండు రకాలుగా వర్గీకరిస్తారు. ఒకటి - ఒక నియోజక వర్గం నుంచి ఒకే అభ్యర్థిని ఎన్నుకోవలసి ఉన్నట్లయితే, దానిని "ఏక సభ్య నియోజక వర్గం" (Single Member Constituency) అంటారు. ఇక రెండవది - ఒకటికన్నా ఎక్కువమంది అభ్యర్థులను ఒక నియోజక వర్గం నుంచి ఎన్నుకోవలసి ఉన్నట్లయితే దానిని "బహు సభ్య నియోజక వర్గము" (Multi Member Constituency) అంటారు. సాధారణముగా ఎన్నుకోవలసిన సభ్యులు ఎందరుంటే అన్ని ఓట్లు ఓటరుకి ఇస్తారు.

మనదేశములో లోక్‌సభ సభ్యులను ఏకసభ్య నియోజక వర్గము ద్వారా ఎన్నుకొంటున్నాము. రాజ్యసభ సభ్యులను మాత్రము రాష్ట్రశాసనసభా నియోజక వర్గము బహుసభ్య నియోజక వర్గము కనుక దానిద్వారా ఎన్నుకోవటం జరుగుతుంది. ఈ రెండు పద్ధతులలోను గుణదోషాలు ఉన్నాయి. అయినప్పటికీ, ఏకసభ్య నియోజక వర్గ విధానమే విశ్వజనీనమైన పద్ధతి.

## 23.6. ప్రాతినిధ్య పద్ధతులు

తమ అభ్యర్థులను ప్రజలు ఎన్నుకోవటంలో అనేక పద్ధతులు ఉన్నాయి. ఇవి ఒక్కోదేశంలో ఒక్కొక్క విధంగా ఆ దేశ ప్రజల ఇష్టాఇష్టములను బట్టి మారుతుంటాయి.

**23.6. 1. ప్రత్యక్ష పరోక్ష పద్ధతులు :** ఓటర్లు స్వయంగా ఎన్నికలలో పాల్గొని తమకు ఇష్టమయిన ప్రతినిధులను ఎన్నుకొనే విధానాన్ని "ప్రత్యక్ష ఎన్నిక పద్ధతి" అంటారు. ఇది చాలా సరళముగానూ, సులభముగానూ, సూటిగానూ ఉంటుంది. కావున ప్రత్యక్ష ఎన్నిక పద్ధతి అన్ని ప్రజాస్వామిక దేశాలలోనూ అమలులో ఉంది. మనదేశంలో లోక్ సభకు, రాష్ట్ర శాసన సభలకూ, ఇతర స్థానిక సంస్థలకు ప్రత్యక్ష ఎన్నిక పద్ధతిని మనం అనుసరిస్తున్నాము.

ఓటర్లు ఎన్నికలలో స్వయంగా పాల్గొనకుండా తమ ప్రతినిధులతో కూడిన ఎన్నిక గణం. (Electoral college) ద్వారా అభ్యర్థులను ఎన్నుకొనే పద్ధతినే "పరోక్ష ఎన్నిక పద్ధతి" అంటారు. అంటే పరోక్ష ఎన్నిక పద్ధతిలో రెండుసార్లు ఎన్నికలు నిర్వహించాలి. మొదటి ఎన్నిక ద్వారా ఓటర్లు తమలో మంచి ఎన్నికగణాన్ని ఎన్నుకొంటారు. రెండవ ఎన్నిక ద్వారా అసలయిన అభ్యర్థిని ఎన్నిక గణం ఎన్నుకుంటుంది. మనదేశములో రాజ్యసభ సభ్యులను, అధ్యక్ష, ఉపాధ్యక్షులను పరోక్ష పద్ధతి ద్వారా మనం ఎన్నుకొంటున్నాము. ఈ విధానములో ఓటర్లకు ఉండే స్వేచ్ఛ పరిమితం చేయబడుతుంది. ఇతర విధాలయిన రాజకీయ అవినీతికి కూడా ఆస్కారం ఏర్పడుతుంది.

**23.6. 2. ప్రాదేశిక పద్ధతి :** ఈ విధానం ప్రకారము దేశం మొత్తాన్ని అనేక జిల్లాలుగా, లేక నియోజక వర్గాలుగా విభజిస్తారు. ఒక్కొక్క నియోజక వర్గం నుంచి ఆ నియోజక వర్గ ప్రజలు తమ ప్రతినిధిగా ఒకరిని ఎన్నుకొంటారు. సాధారణముగా ప్రతి నియోజక వర్గములోనూ ఓటర్లు దాదాపు సమాన సంఖ్యలో ఉండేటట్లుగా దేశ జనాభాను విభజించి నియోజక వర్గాలను ఏర్పాటు చేస్తారు. అయితే భవిష్యత్‌లో జనాభా పెరిగినప్పుడు నియోజక వర్గాల సంఖ్యను కూడా పెంచటం జరుగుతుంది. ఈ విధంగా నియోజక వర్గాలను నిర్మించటంలోగాని, లేదా పునఃనిర్మించటంలోగాని రాజకీయాలకు లేదా పాలకపక్ష ప్రయోజనాలకు అతీతంగా ఉండేట్లు శ్రద్ధ వహించటం అవసరము. అమెరికాలో ఇలాలేదు. అక్కడ పాలకపక్షం యొక్క రాజకీయ ప్రయోజనాలకు అనుకూలముగా ఉండే రీతిలో నియోజకవర్గాలను పునఃనిర్మించే పద్ధతి అమలులో ఉన్నది.

**23.6. 3. వృత్తిగత పద్ధతి :** ఇది ప్రాదేశిక ప్రాతినిధ్య పద్ధతికి పూర్తిగా భిన్నమయినది. ప్రాదేశిక పద్ధతిలో ఎన్నికయిన ప్రతినిధి ఆ ప్రదేశములో నివశించే విభిన్న వర్గాలకు లేక తరగతులకు ప్రాతినిధ్యం వహించలేడు. కాబట్టి వృత్తిపరమయిన ప్రాతినిధ్య విధానాన్ని ప్రవేశపెట్టటం ద్వారా ఆ నియోజక వర్గములోని వివిధ వృత్తులవారికి ప్రాతినిధ్యం కల్పించినట్లు అవుతుంది. ఇలాంటి పద్ధతిని పెక్కుమంది సమర్ధించారు. ఇది ఓటర్ల వృత్తి సంబంధాలమీద దృష్టి కేంద్రీకరింపచేసి కార్మికుల వర్గ ధోరణిలో ఆలోచించేట్లు చేస్తుంది. వృత్తిపరమయిన ప్రాతినిధ్య పద్ధతిలో వివిధవృత్తుల వారు - కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు - తమ నివాస ప్రాంతములతో నిమిత్తం లేకుండా తమ ప్రతినిధులను తామే ఎన్నుకుంటారు. గతంలో ముస్సోలిని కూడా ఇటలీలో ఈ పద్ధతిని ప్రవేశపెట్టాడు. ఈ విధానము మనదేశములో కూడా రాష్ట్రవిధాన పరిషత్ ఎన్నికలకు అన్వయించబడినది. అయితే వృత్తిపరమయిన ప్రాతినిధ్య విధానము అతి విశిష్టమయినదిగా కొందరు భావిస్తే - (G.D.H. Cole, Graham Wallas ప్రభృతులు) మరికొందరు (ఎస్ మైన్, ఫైనర్, లాస్కీ ప్రభృతులు) దీనిని తిరస్కరించారు.

**23.6. 4. Plural Voting :** "మనిషికొక ఓటు" లేక "తలకొక ఓటు" అనే సూత్రము ఆధారంగా ప్రజాస్వామ్యము పనిచేస్తుంది. అయితే కొన్ని దేశాలలో ప్లూరల్ లేక వెయిటేజ్ (Plural or Weightage) ఓటింగ్ పద్ధతి అమలులో ఉన్నది. ఈ పద్ధతిలో అర్హులయిన కొంతమంది ఓటర్లకు ఒకటికి మించిన ఓట్లు ఉంటాయి. ఉదాహరణకు విశ్వవిద్యాలయ పట్టభద్రులకు, గుర్తింపు పొందిన ఉపాధ్యాయులకు. మనదేశంలో విధానపరిషత్‌కు సంబంధించి పట్టభద్రుల మరియు ఉపాధ్యాయుల నియోజక వర్గాలలో ఉన్నవారికి ఎక్కువ ఓట్లు ఉండాలనేది ఒక వాదం. బెల్జియం ఈ పద్ధతిని 1893లో ప్రవేశపెట్టినది. ఈ పద్ధతిని జె.యస్. మిల్ సమర్ధించాడు. ఓట్లు లెక్కించకూడదని, వాటి విలువలను తూచాలని దేశ భవిష్యత్‌ను గురించిన శ్రద్ధ ఉన్నవారికి, ఓటు వేయడానికి విశిష్ట అర్హతలు ఉన్నవారికి ఎక్కువ విలువ ఇవ్వాలనేది ప్లూరల్ ఓటింగ్ పద్ధతిలోని సమర్ధన. ఈనాటి పరిస్థితులలో ఈ వాదన వాస్తవికతను ప్రతిబింబించకపోవచ్చును. ప్రత్యేక అర్హతలకు, రాజకీయ చైతన్యానికి పొంతనలేదన్న వాస్తవాన్ని ఇటీవల ఎన్నికలు నిరూపిస్తున్నాయి.

## 23.7. అల్పసంఖ్యాక ప్రాతినిధ్యము

అల్ప సంఖ్యాకులకు ప్రజాస్వామ్యములో ఆదరణ కరువు అయి అన్యాయాలకు లేదా పీడనకు గురిఅవుతారనే భయం ఆయా వర్గాలవారికి ఉండవచ్చును. ఇది అధిక సంఖ్యాకుల నిరంకుశత్వానికి దారితీయవచ్చు. ఇలాంటి ధోరణులను అరికట్టే అల్పసంఖ్యాక

వర్గాలకు కూడా ప్రజాస్వామ్యములో ఆదరణనీయమయిన స్థానాన్ని కల్పించి వారికి చట్టసభలలో తగిన ప్రాతినిధ్యాన్ని కల్పించటానికి కొన్ని పద్ధతులు సూచించబడినాయి.

అలాగే సాధారణ సంఖ్యాబలంతో ఎన్నికలలో గెలుపొందిన అభ్యర్థి తనకు ఓటు వెయ్యని వ్యక్తులకు చట్ట సభలలో ప్రాతినిధ్యం వహించలేడు. ఓడిపోయిన అభ్యర్థికి ఓటువేసిన ఓటర్లకు ప్రాతినిధ్యం ఉండదు. ఇది నిజానికి ప్రజాస్వామ్య వ్యవస్థనే సవాలు చేసే పరిస్థితి.

కనుక సమాజములో అన్ని వర్గములకు తగిన ప్రాతినిధ్యం ఉండాలి. అల్ప సంఖ్యాక వర్గాలకు తగినంత ప్రాతినిధ్యము లేనప్పుడు శాసనసభ చేసిన చట్టాలు ప్రజలందరి అంగీకారాన్ని పొందినవనటానికి వీలులేదు. ప్రాతినిధ్యము పొందని అల్ప సంఖ్యాక వర్గాలు రాజకీయ విధేయతను ఇష్టపూర్వకముగా ప్రదర్శించలేవు. ఈ పరిస్థితిని నివారించటానికి అల్పసంఖ్యాక ప్రాతినిధ్యం అవసరమవుతుంది.

## 20.8. నైష్పత్తిక ప్రాతినిధ్యము

నైష్పత్తిక ప్రాతినిధ్య విధానము పెక్కువిధాల ఆచరణ యోగ్యమయినదిగా భావించబడుతున్నది. అధిక సంఖ్యాబలం వలన ఎన్నికలలో ఉత్పన్నమయ్యే లోపాలను తొలగించి అల్ప సంఖ్యాక వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించటానికి ఈ విధానం ఎంతో దోహదం చేస్తుంది. శాసనసభలో ఒక పార్టీకి సంబంధించిన స్థానాల శాతం అది సంపాదించిన ఓట్ల నిష్పత్తిలో ఉండేట్లు చూడటం ఈ విధానంలోని ప్రధానాంశం. పైగా దేశంలోని అన్ని వర్గాల అభిప్రాయాలకు లేదా తరగతులకు, లేదా ప్రయోజనాలకు వాటికి లభించిన ఓట్ల బలానికి అనుగుణంగా ఇందులో ప్రాతినిధ్యం ఉంటుంది. పైగా ఏ ఒక్క ఓటు వృధా కాదు.

ఈ విధానములో ప్రధానముగా రెండు పద్ధతులు ఉన్నాయి. 1) హేర్ పద్ధతి (Hare Formula) 2) జాబితా పద్ధతి(List System).

నైష్పత్తిక ప్రాతినిధ్యానికీ, అల్ప సంఖ్యాక ప్రాతినిధ్యానికీ మధ్య కొంచెం తేడా కన్పిస్తుంది. అల్ప సంఖ్యాక ప్రాతినిధ్య పద్ధతిలో అల్ప సంఖ్యాకులకు ఏదోవిధమయిన ప్రాతినిధ్యము కల్పించటమే ధ్యేయము. అంతేగానీ వాళ్ళ ఓట్లకు తగిన నిష్పత్తిలో ప్రాతినిధ్యము కల్పించటము సాధ్యపడదు. అయితే నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతిలో అల్ప సంఖ్యాకుల ఓట్ల బలానికి నిష్పత్తి ప్రకారము ప్రాతినిధ్యము ఇస్తారు. ప్రతిపార్టీకి, లేదా ప్రతి వర్గానికి ప్రత్యేక ప్రాతినిధ్యం ఇవ్వటం జరుగుతుంది.

**20.8. 1. హేర్ పద్ధతి :** థామస్ హేర్ అనే వ్యక్తి ఈ పద్ధతిని 1874లో రూపొందించాడు. ఈ పద్ధతినే Andre (ఆండ్రే) పద్ధతి అని కూడా అంటారు. (ఆండ్రే అనే డానిష్ (డెన్మార్క్) మంత్రి ఈ విధానాన్ని తన దేశములో ప్రవేశపెట్టినందువలన దీనిని ఆండ్రే పద్ధతి అనికూడా అంటున్నారు.)

ఈ విధానములో గెలుపొందిన అభ్యర్థుల మిగులు ఓట్లను ఇతర అభ్యర్థులకు బదిలీ చేస్తారు. కనుక దీనిని "ఓట్ల బదలాయింపు విధానము" (Single transferable Vote System) అని కూడా అంటారు. అంతేగాక ప్రతి ఓటరూ, తనకు నచ్చిన అభ్యర్థులకు ప్రాధాన్యక్రమంలో 1, 2, 3, 4, 5..... తన ఓట్లను ఇస్తాడు కనుక ఈ పద్ధతిని ప్రాధాన్య పద్ధతి (Preferencial System) అని కూడా అంటారు. Hare పద్ధతిలో ప్రధానాంశములు

1) ఇది బహుసభ్య నియోజక వర్గమై ఉండాలి. ఇందులో కనీసం ముగ్గురు అభ్యర్థులను ఎన్నుకునేట్లు ఉండాలి.

2) ఒక నియోజక వర్గమునుంచి ఎంతమంది అభ్యర్థులను ఎన్నుకోవాలో, ప్రతి ఓటరుకూ అన్ని ఓట్లు ఉంటాయి.

3) ఒక అభ్యర్థి ఎన్నిక కావడానికి నిర్ణీత ఓట్ల సంఖ్య (quota, కోటా) నిర్ణయించబడుతుంది. ఉదాహరణకు 5 స్థానాలకు అభ్యర్థులను ఎన్నుకోవలసివస్తే వేయబడిన ఓట్లు 10 వేలు అయితే కోటా ఇలా ఉంటుంది 10,000/5+1=2001

4) ఓటరు మొదట సూచించిన అభ్యర్థి ఎన్నిక కాకపోతే ఆ ఓటు నిరుపయోగం కాకుండా అతని రెండవ ఎంపిక సూచించే అభ్యర్థికి బదిలీ చేస్తారు. అందుకనే ఈ విధానాన్ని "ఓట్ల బదలాయింపు పద్ధతి అంటారు."

5) ఈ విధానంలో ఓట్లు లెక్కించటంలో మొదటి ప్రాధాన్యాలను మాత్రమే (First Preferences) లెక్కిస్తారు. అలా లెక్కించబడినప్పుడు నిర్ణీత కోటాఓట్లు వచ్చిన అభ్యర్థి ఎన్నికయినట్లు ప్రకటిస్తారు. అతనికి కోటాకంటే అదనంగా వచ్చిన ఓట్లను ఇతర అభ్యర్థులకు వరుసక్రమంలో ఓటరు ప్రాధాన్యతలకు అనుగుణంగా బదిలీ చేస్తారు. ఇలాగ ఆ నియోజక వర్గం నుంచి భర్తీ కావలసిన స్థానాలు పూర్తి అయ్యేవరకు ఈ ఓట్ల బదలాయింపు జరుగుతుంది. దీనివలన ఏ ఓటు వృధా కాదు. అంతేగాక అన్ని వర్గాలకు తగిన నిష్పత్తిలో ప్రాతినిధ్యం ఏర్పడే అవకాశం ఉంది.

6) ఇది చాలా క్లిష్టమయిన పద్ధతి అయినప్పటికీ మంచి పద్ధతిగా కన్పిస్తుంది. ఈ పద్ధతిని మనదేశములో రాజ్యసభ సభ్యుల ఎన్నికలోనూ, రాష్ట్రపతి ఎన్నికలోనూ అమలుచేస్తున్నారు.

20.8. 2. జాబితా పద్ధతి : ఓటు వ్యక్తికి కాకుండా, జాబితాకు లభిస్తే దానిని జాబితా పద్ధతి అని అంటారు. దీనిలోని ప్రధానాంశాలు:

1) జాబితా పద్ధతి చాలా సులభమయినది. ఈ పద్ధతి ప్రకారము అభ్యర్థులను వారి వారి పార్టీల గుర్తులనుబట్టి కొన్ని జాబితాలుగా వర్గీకరిస్తారు. ప్రతిపార్టీ జాబితాను ఓటర్లకు సమర్పిస్తుంది. ఓటరు ఏపార్టీ (జాబితా) కి ఓటువేస్తే ఆ పార్టీ సమర్పించిన జాబితాకు మొత్తానికి ఓటువేసినట్లు అవుతుంది. అంటే ఓటరు పార్టీకి లేక జాబితాకు ఓటు వేస్తాడు కానీ ఏ ఒక్క అభ్యర్థికో మాత్రం కాదు. ఒక్కొక్క జాబితాకు లభించిన ఓట్ల సంఖ్య నిష్పత్తి ప్రకారం ఆయా పార్టీలకు ఇవ్వబడతాయి.

2) ఈ విధానములో కూడా కోటా నిర్ణయిస్తారు. పోగయిన మొత్తం ఓట్లను భర్తీ కావలసిన అభ్యర్థుల సంఖ్యచేత భాగించటం ద్వారా కోటా నిర్ణయించబడుతుంది. ప్రతిపార్టీ జాబితాకు వచ్చిన మొత్తం ఓట్ల సంఖ్యను కోటాసంఖ్యతో భాగిస్తే ఒక్కొక్క పార్టీ ఎంతమంది అభ్యర్థులను ఎన్నుకోవచ్చునో తెలుస్తుంది. అన్ని స్థానాలు అలా భర్తీకాకపోతే ఏ పార్టీకి మిగులు ఓట్ల భాగాలు అదనంగా వస్తాయో ఆ పార్టీకి మిగిలిన స్థానం లభిస్తుంది.

3) ఇంకొక పద్ధతి ప్రకారం ఇరుగుపొరుగు నియోజక వర్గాలలో ఒక పార్టీకి లభించిన మిగులు ఓట్ల భాగాలను కోటాలోని లోటును భర్తీ చేయటానికి కలుపుతారు.

ఈ పద్ధతి సులభమే అయినా ఇందులో విపరీతమయిన అక్రమాలకు అవకాశమున్నది. ఓటర్లకు ఉండవలసిన స్వేచ్ఛ కుదించబడుతుంది.

## 20.9. పరిమిత ఓటు పద్ధతి

ఈ విధానంలో మూడు స్థానాలు కల్గిన బహుసభ్య నియోజక వర్గాలుంటాయి. భర్తీ కావలసిన స్థానాలకంటే తక్కువ సంఖ్యలో ఓటరు ఓట్లు వేయవచ్చును. అయితే ఏ ఒక్క అభ్యర్థికి ఒక్క ఓటునుమించి వేయకూడదు. ఉదాహరణకు ప్రతిఓటరుకూ, భర్తీ కావలసిన స్థానాలకంటే ఒక ఓటు తక్కువగా ఇస్తారు. 5 గురిని ఎన్నుకోవలసి ఉంటే ప్రతిఓటరుకూ 4 ఓట్లే ఉంటాయి. అతడు వాటిని పార్టీ దృక్పథముతో కాకుండా అభ్యర్థులను ఎన్నుకోవటంలో సద్వినియోగం చేసుకోవచ్చును. దీనివలన అల్ప సంఖ్యాక పార్టీలు ఒకరిద్దరు అభ్యర్థులను గెలిపించుకొనే అవకాశం ఉంటుంది. ఈ విధానం పెద్దగా అమలులో ఉన్నట్లు కనిపించదు.

## 20.10 సంతులిత ఓటు పద్ధతి

ఈ విధానములో ఎంతమంది అభ్యర్థులను ఎన్నుకోవలసి ఉందో అన్ని ఓట్లు ఓటరుకు ఇస్తారు. ఆ ఓట్లను ఓటరు ఒకే అభ్యర్థికి గాని లేదా ఇద్దరికి గాని మొత్తంగా వేయవచ్చును. దీనివలన ఒక చిన్న అల్పసంఖ్యాక పార్టీకి కూడా అన్ని ఓట్లను తనకే వేయించుకొనే అవకాశము ఉన్నందువలన ఎన్నికల్లో గెలిచే అవకాశం ఉంటుంది.

ఇది పెద్దగా ఆచరణలో కన్పించదు. ఈ పద్ధతిలో ఓట్లు వృధా అయ్యే అవకాశం ఉంది. ఇందులో నైష్పత్తిక ప్రాతినిధ్యానికి అవకాశమే లేదు.

ఈనాడు ప్రజాస్వామ్యాలలో అనేక పద్ధతుల ద్వారా ఎన్నికలు నిర్వహించబడుతున్నప్పటికీ ప్రధానంగా ప్రాచుర్యాన్ని పొందినవి నైష్పత్తిక ప్రాతినిధ్య విధానము, ప్రాదేశిక ఎన్నిక విధానాలు మాత్రమే. ఈ పద్ధతుల్లో ప్రతిదానికీ గుణదోషాలు ఉన్నాయి. ఆయా ప్రజల ఇష్టాయిష్టాలనుబట్టి ఔచిత్యాన్ని బట్టి ఎన్నికల పద్ధతులను అమలుచేయటం జరుగుతుంది.

## అభ్యాసాలు

**I. వ్యాస ప్రశ్నలు :**

1. ఆధునిక కాలంలో అమలులో ఉన్న ప్రధానమైన ప్రాతినిధ్య పద్ధతులను వివరించుము.
2. ఓటు అనగానేమి ? దానిని నిర్ణయించే అంశములు ఏమి ?
3. నైష్పత్తిక ప్రాతినిధ్య విధానమును గురించి ఒక వ్యాసం వ్రాయుము ?

**II. సంక్షిప్త వ్యాస ప్రశ్నలు :**

1. నియోజక వర్గాలను నిర్ణయించు పద్ధతులను తెల్పుము.
2. నియోజక వర్గమనగా ఏమి ? అది ఎన్ని విధములు ?
3. ప్రత్యక్ష, పరోక్ష ఎన్నిక పద్ధతులను వివరించుము ?
4. వృత్తిపర ప్రాతినిధ్యమనగా ఏమి? వివరించుము.
5. నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతిలో హేర్ విధానమును చర్చించుము.

**III. కుశాగ్రబుద్ధి ప్రశ్నలు**

1. తమ ఇష్టం వచ్చిన అభ్యర్థులను ఎన్నుకోవటంలో నియోజకులకు రాజ్యాంగం ఇచ్చిన రాజకీయ స్వేచ్ఛని --------------- అంటారు.
2. ---------------- వ సంవత్సరంలో స్విస్ స్త్రీలకు ఓటు హక్కు కల్పించబడింది.
3. ఒకటికన్నా ఎక్కువమంది అభ్యర్థులను ఒక నియోజక వర్గంనుండి ఎన్నుకోవలసి ఉన్నట్లయితే దానిని ---------------- వర్గము అంటారు.
4. హేర్ పద్ధతిని థామస్ హేర్ ---------------- వ సంవత్సరంలో రూపొందించాడు. దీనినే ---------------- పద్ధతి అని కూడా అంటారు.
5. ఓటర్లు ఎన్నికలో స్వయంగా పాల్గొనకుండా తమ ప్రతినిధులతో కూడిన ఎన్నికగణం ద్వారా అభ్యర్థులను ఎన్నుకొనే పద్ధతినే ---------------- పద్ధతి అంటారు.

## ఉపయుక్త గ్రంథాలు


1. తెలుగు అకాడమి ప్రచురణ - రాజనీతి శాస్త్రము, ప్రాథమిక సూత్రాలు.
2. వి. కృష్ణారావు, సత్యనారాయణ - రాజనీతి సిద్ధాంతము సంస్థలు.



రచయిత

చిలకపాటి విజయ రాఘవాచార్యులు

పాఠం - 24

# రాజకీయ పక్షాలు

## 24. 0 లక్ష్యం

ఈ రాజకీయ పార్టీలంటే ఏమిటో నిర్వచించి, వివరించి, వర్గీకరించడం వాటి ప్రధాన విధులను చర్చించడం వాటి పాత్రను విశదీకరించడం ఈ పాఠం లక్ష్యాలు.

విషయక్రమం :


24. 1. పరిచయము

24. 2. నిర్వచనము - వివరణ

24. 3. రాజకీయ పక్షాల క్రమ వికాసము

24. 4. వర్గీకరణ

24. 4. 1. ఏకపార్టీ వ్యవస్థ

24. 4. 2. ద్విపార్టీ వ్యవస్థ

24. 4. 3. బహుపార్టి వ్యవస్థ

24. 5. రాజకీయ పక్షాలు - విధులు

24. 6. రాజకీయ పార్టీలు - గుణదోషాలు

24. 7. ప్రజాస్వామ్యంలో వాటి పాత్ర

24. 8. సారాంశము


## 24. 1. పరిచయము

రాజకీయ పక్షాల వ్యవస్థ ప్రజాస్వామ్య విధానానికి మూలాధారం. ప్రజాతంత్ర యంత్రాగానికి చోదకశక్తిని రాజకీయ పక్షాలు కల్గిస్తాయి. రాజకీయ పక్షాలులేని ప్రజాస్వామ్యం గందరగోళానికి దారితీస్తుందని నానుడి. కనుక రాజకీయ పక్షాలు ప్రజాప్రయోజనాలకు సంబంధించిన భిన్నమైన అభిప్రాయాలను నిర్మాణాత్మకంగా మలిచి ప్రభుత్వం సజావుగా నడవడానికి దోహదం చేస్తాయి. ప్రజలకు ప్రజాప్రతినిధులకు మధ్య సంధానకర్తలుగా రాజకీయ పక్షాలు కీలకమైన పాత్రను వహిస్తాయి. ప్రజాస్వామ్య దేశాలలో ఈ పార్టీ వ్యవస్థ (Party system) రాజ్యాంగేతరమైన శక్తిగా వృద్ధిచెంది జన రాజకీయ జీవనానికి అనివార్యమై ఆధునిక ప్రభుత్వాల మనుగడకు నిలకడను కలిగిస్తున్నాయి.

## 24. 2. నిర్వచనము - వివరణ

ఎంతో మంది రాజనీతి శాస్త్రవేత్తలు రాజకీయ పక్షాన్ని ఎన్నోవిధాలుగా నిర్వచించారు. వాటిలో ప్రధానమైనవాటిని క్రింద ఇవ్వడం జరిగింది.

1. "ఏదో ఒక నియమాన్నిగానీ లేక విధానాన్నిగాని సమర్థిస్తూ రాజ్యాంగబద్ధమైన పద్ధతుల ద్వారా ప్రభుత్వాన్ని చేపట్టటానికి కృషిచేసే వ్యవస్థీకృత సంస్థయే రాజకీయపక్షం" - మెక్ ఐవర్.

(A Political Party is an association organised in support of same principle or policy which by constitutional means endeavours to make the determinant of government" - Mac Iver)

2. "తామందరూ అంగీకరించిన ఒక నిర్దిష్టనియమాన్ని అనుసరించి జాతిప్రయోజనాలకై సమిష్టిగా కృషిచేయడానికి ఐక్యమైన వ్యక్తుల సముదాయమే రాజకీయ పక్షం" - ఎడ్మండ్ బర్క్.

("A Political Party is a body of man united for promoting their joint endeavours, the national interests upon same particular principles in which they are agreed" - Edmand Burke)

వివరణ : పై నిర్వచనాలను బట్టి ప్రతిరాజకీయ పక్షం ఈ క్రింది లక్షణాలను కలిగిఉండాలని తెలుస్తుంది.

2.1. రాజకీయ పక్షపు సభ్యులమధ్య సిద్ధాంతాలకు సంబంధించి మౌలికమైన అంగీకారం ఉండాలి.

2.2. ఏకాభిప్రాయం కలిగిన సభ్యులు సక్రమమైన పద్ధతిలో సంఘటితమవ్వాలి.

2.3. పై విధంగా సంఘటితమైన వ్యక్తులు నిర్దిష్టమైన కార్యక్రమాన్ని రూపొందించుకోవాలి.

2.4. అలాంటి కార్యక్రమాన్ని రాజ్యాంగ బద్ధమైన పద్ధతులద్వారా మాత్రమే అమలుపరచడానికి ప్రయత్నించాలి.

2.5. కేవలం స్వార్థప్రయోజనాలకోసం కాకుండా జాతిమొత్తానికి మేలుకలిగించేందుకై కృషి చేయాలి. కేవలం ఒక వర్గప్రయోజనానికో లేక స్వప్రయోజనానికో మాత్రమే పనిచేసే రాజకీయ పక్షం ఒక ముఠాస్థాయికి లేక గుంపుస్థాయికి దిగజారిపోతుందే తప్ప జాతీయ స్థాయిలో జాతి ప్రయోజనాలకు దోహదం చేయలేదు.

2.6. జా. రూసెక్ (Rouce k ) అభిప్రాయంలో ఒక రాజకీయపక్షం సుస్థిరంగా ఉండడానికి సిద్ధాంతాలు (Ideology) వ్యవస్థ(Organisation) అవసరం.

## 24. 3. రాజకీయ పక్షాల క్రమవికాసం

రాజకీయ పక్షాలు ఆకస్మికంగా పుట్టుకొచ్చినవి కావు. ఇవి ఆవిర్భవించి ఒక శతాబ్దందాటినా, అంతకుపూర్వం ఇవి ఇతర రూపాలలో అసంఘటితంగా ఉంటూ వచ్చాయి. రాజకీయ పక్షాలు ఈనాడు విశ్వవ్యాపితమైనాయి. ప్రజాస్వామికదేశాలలో ఇవి రోజురోజుకూ వృద్ధిచెందుతున్నాయి. వయోజన ఓటింగ్ హక్కు విస్తరిస్తున్న కొలదీ రాజకీయ పక్షాల ఆవశ్యకత కూడా పెరిగిపోతుంది. ఆర్థిక, సాంఘిక మతవిశ్వాస, రాజకీయ సిద్ధాంతాల ప్రాతిపదికగా అనేక రాజకీయ పక్షాలు ఆవిర్భవించాయి.

పార్టీవ్యవస్థ మొదట ఇంగ్లండ్‌లో ఆవిర్భవించింది. ఇంగ్లండ్‌లో జరిగిన రక్తరహిత విప్లవం (Glorious Revolution) ఈ పార్టీ వ్యవస్థకు నాంది పలికింది. తర్వాత ఈపార్టీవ్యవస్థ అమెరికావంటి ఇతర ప్రజాస్వామిక దేశాలకు విస్తరించింది. ఈనాడు దాదాపు అన్ని దేశాలలోను రాజకీయ పక్షాలు ఉన్నాయి.

## 24. 4. వర్గీకరణం

రాజకీయ పక్షాలను స్థూలంగా 3 విధాలుగా వర్గీకరించవచ్చు. అవి

24. 4.1. ఏకపార్టీ వ్యవస్థ (The Single Party System)

24. 4.2. ద్విపార్టీ వ్యవస్థ (The two Party System or Bi-Party System)

24. 4.3. బహుపార్టీ వ్యవస్థ (The Multiparty System)

24. 4.1. ఏకపార్టీ వ్యవస్థ : ఉదా : పూర్వపు సోవియట్ యూనియన్‌లో కమ్యూనిస్టుపార్టీ, ఇరాక్‌లోని బాత్‌పార్టీ, చైనాలో కమ్యూనిస్టుపార్టీ

లక్షణాలు :

i) ఏకపార్టీవిధానం అమలులో ఉన్నదేశంలో ఒకేపార్టీ ఉంటుంది. సంపూర్ణ అధికార తత్వం, పార్టీపై నాయకుని పూర్తి ఆ, సర్వోన్నతమైన, సర్వశక్తివంతమైన పార్టీ సిద్ధాంతాలు దీని ప్రధాన లక్షణాలు.

ii) పార్టీకి విరుద్ధంగాగానీ లేక సమాంతరంగాగానీ మరొక పార్టీ ఉండడానికి వీలులేదు.

iii) పార్టీకీ, ప్రభుత్వానికీ మధ్య వ్యత్యాసం ఉండదు.

iv) ఏకపార్టీ విధానము అమలులో వున్న దేశాలలో పౌరహక్కులు చాలా పరిమితంగా ఉంటాయి.

v) ప్రజాస్వామ్యంలోవలె ఈ విధానంలో మరోపార్టీ ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవకాశముండదు. ఒకే పార్టీకి చెందిన వ్యక్తులు మాత్రమే ఎన్నికలలో పోటీ చేస్తారు గనుక అదే పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. అందువలన ప్రత్యామ్నాయ ప్రభుత్వానికి ఆస్కారముండదు.

vi) న్యాయశాఖకు స్వతంత్ర ప్రతిపత్తి ఉండదు. ప్రభుత్వశాసనాలను దృష్టిలో వుంచుకొని మాత్రమే న్యాయమూర్తులు తీర్పులు చెప్పవలసి వుంటుంది.

ఏకపార్టీ విధానం - ప్రయోజనాలు : ఏకపార్టీ విధానంలో భావసారూప్యత, పాలనాదక్షత, సత్వరంగా నిర్ణయాలుచేయడానికి వీలు, ప్రభుత్వ నిర్వహణ వ్యయంలో పొదుపు, క్రమశిక్షణ ప్రధానమైన ప్రయోజనాలు. అత్యవసర పరిస్థితులలో ఏకపార్టీ విధానం సమర్ధవంతంగా పనిచేస్తుంది. అసమ్మతివర్గాల బెదిరింపులు, పార్టీ ఫిరాయింపులు, అవినీతి కనిపించవు.

దోషాలు : ప్రజలకు రాజకీయ స్వేచ్ఛ ఉండదు. పార్టీకీ, ప్రభుత్వానికీ మధ్య తేడా ఉండదు. క్రమ శిక్షణ పేరుతో స్వేచ్ఛను అణచివేస్తారు. ప్రభుత్వయంత్రాంగం నిరంకుశంగానూ, ఏకపక్షంగానూ వ్యవహరిస్తుంది.

**24. 4.2.** రెండు పార్టీల వ్యవస్థ : ఒక దేశములో రెండేరెండు ప్రధాన రాజకీయ పక్షాలుంటె, దానిని ద్విపార్టీ పద్ధతి అంటారు. అమెరికా, ఇంగ్లండ్ దేశాలు దీనికి ఉదాహరణలు.

ఈ విధానంలో రెండేరెండు ప్రధానమైన రాజకీయపక్షాలుంటాయి. సార్వత్రిక ఎన్నికలలో అత్యధిక స్థానాలను గెలుచుకొన్న పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పరిస్తే తక్కువ స్థానాలను పొందిన రెండవ పార్టీ ప్రతిపక్షంగా వ్యవహరిస్తుంది. ద్విపార్టీ పద్ధతి 17వ శతాబ్దంలో బ్రిటన్‌లో ప్రారంభమైంది.

ప్రయోజనాలు :

i. ద్విపార్టీ విధానంలో ప్రధానంగా రెండు పార్టీలు మాత్రమే ఉండడంచేత, ప్రతిపక్షం శక్తివంతంగా, సమర్ధవంతంగా పనిచేస్తుంది. ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పరచడానికి ఇబ్బందులుండవు.

ii. అధికారపక్షం కూడా ప్రతిపక్షం విమర్శించి, రచ్చకీడుస్తుందనే భయంచేత, జాగ్రత్తగానూ, బాధ్యతాయుతంగానూ వ్యవహరిస్తుంది.

iii. ఈ విధానంలో మిశ్రమ ప్రభుత్వాల బెడదగానీ, పార్టీఫిరాయింపుల బెదరింపులుగానీ, అస్థిర ప్రభుత్వాలుగాని ఉండవు.

దోషాలు :

i. రెండు పార్టీల విధానంలో ఓటర్లకు పార్టీని ఎన్నుకోవడంలో ఎక్కువ స్వేచ్ఛ ఉండదు. ఉన్నరెండు పార్టీలూ మంచివి కాకపోతే, రెండు చెడ్డవాటిలో ఏదో ఒక చెడ్డదానిని మాత్రమే ఎన్నుకొనక తప్పదు.

ii. అధికారం కొరకై ప్రతిపక్షం ఎంతటి నీచానికైనా దిగజారవచ్చు.

iii. శాసనసభలో మెజారిటీ బలం చూసుకొని పాలకపక్షమూ, మంత్రివర్గమూ నియంతృత్వ వైఖరి అవలంబించవచ్చు. తమ స్వార్థ ప్రయోజనాలకై ప్రజాశ్రేయాన్ని త్యాగం చెయ్యవచ్చు.

24. 4.3. బహుపార్టీ పద్ధతి : ఒకదేశంలో ఎక్కువపార్టీలు వుంటూ, దేశరాజకీయాలలో ప్రముఖపాత్రను నిర్వహిస్తూఉంటే, దానిని బహుపార్టీ విధానమంటారు. ఫ్రాన్స్, ఇండియా, ఇటలీ దేశాలు దీనికి ఉదాహరణలు. బహు పార్టీలపద్ధతి అమలులో వున్నదేశాలలో, మిశ్రమ లేక సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడడానికి పరిస్థితులు దోహదం చేస్తుంటాయి. ఎన్నికలలో ఏ ఒక్కపార్టీకి స్పష్టమైన మెజారిటీరాని పరిస్థితులలో, కొన్ని పార్టీలు ఒక అవగాహనకు రావడంద్వారా మిశ్రమ మంత్రివర్గాలను ఏర్పాటు చేయవచ్చు.

ప్రయోజనాలు :

1. బహుపార్టీవిధానంలో మంత్రిమండలి నియంతృత్వానికి అవకాశం తక్కువ. ప్రభుత్వం పాలకపక్ష భాగస్వామ్యాలమధ్య పరస్పర సంప్రదింపులతోనూ, సమాలోచనలతోనూ పనిచేయడం వలన సామరస్యానికీ, అవకాశం ఉంటుంది.

2. ఎన్నికలలో ఓటర్లకు స్వేచ్ఛ ఎక్కువగా ఉంటుంది. ఎక్కువ పార్టీలు పోటీచేస్తాయి గనుక మంచిపార్టీని ఎన్నుకొనే స్వేచ్ఛ ఓటర్ కలిగివుంటాడు.

3. ప్రజాభిప్రాయానికి తలవొగ్గి ప్రభుత్వం ప్రవర్తిస్తేనే తప్ప అధికారంలో కొనసాగలేదు గనుక ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యత ఇస్తారు.

దోషాలు :

1. మిశ్రమ మంత్రివర్గాలలో మంత్రులు పరస్పరం కలహాలతోనూ, వివాదాలతోనూ, కాలంగడుపుతూ వుంటారు. ఇది చాలా ప్రమాదకరమైన పరిస్థితులకు దారితీయవచ్చు.

2. పార్టీ ఫిరాయింపులకు ఈ విధానంలో అవకాశాలెక్కువ. అసమ్మతి వర్గాలు, ముఠాలు, రాజకీయాలు, ఈ విధానంలో ఎక్కువ.

3. ఎన్నికల నిర్వహణ ఎంతో వ్యయప్రయాసలతో కూడిఉంటుంది. వార్తాపత్రికలంత నిడివిలో బ్యాలెట్ పత్రాలను ముద్రించిన సంఘటనలు మనదేశంలో ఇటీవల ఎన్నో ఉన్నాయి. ఇలాంటి దోషాలు మరెన్నో ఈ బహుపార్టీ విధానంలో కనిపిస్తాయి.

## 24. 5. రాజకీయ పక్షాలు - విధులు

ఆధునిక ప్రజాస్వామిక రాజ్యాలలో రాజకీయ పక్షాలు బహుముఖాలైన విధులను నిర్వర్తిస్తున్నాయి. ఆ మాటకొస్తే రాజకీయపక్షాలు నిర్వర్తించే విధులపైననే నేటిప్రజాస్వామిక వ్యవస్థలు రూపుదిద్దుకుంటున్నాయి. ఇవి నిర్వర్తించే విధులను ఇతమిద్ధంగా నిర్దేశించడం కష్టమైనప్పటికీ ప్రధానమైన వాటిని మాత్రం మనం చర్చించవచ్చు.

24. 5.1. ఎన్నికల సమయంలో పార్టీప్రణాళికను రూపొందించటం : ఎన్నికలప్పుడు ప్రతి రాజకీయపక్షం తనదైన రీతిలో తమప్రణాళికను లేదా భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందించి ప్రజలకు నివేదిస్తుంది. దేశం ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటో వివరించి వాటికి పరిష్కారాలను అందంగానూ, ఆదర్శపాత్రంగానూ ఉండే రీతిలో సూచిస్తుంది. నిజానికి అభ్యర్థులకంటే ఎన్నికలలో ఈ పార్టీ ప్రణాళికలే విజయసోపానాలుగా పనిచేస్తాయి. ఈ ఎన్నికల ప్రణాళికలను బట్టి రాజకీయపక్షాల స్వరూపస్వభావాలు, ఆశయాలు ఏమిటో ప్రజలు గ్రహిస్తారు.

24. 5.2. ప్రజలను సంఘటిత పరచటం : భావసారూప్యంగల వ్యక్తులను సంఘటితపరచి వారికి రాజకీయ ఉత్సాహాన్ని కలిగించి తమవైపు ఆకర్షించుకుంటాయి.

24. 5.3. అభ్యర్థుల ఎంపిక : ఎన్నికల సమయంలో పోటీచేయడానికి అభ్యర్థుల ఎంపికను ప్రతి రాజకీయ పక్షం చేపడుతుంది. రాజకీయచైతన్యం, సేవా భావం, జాతీయ దృక్పధం, ప్రజలతో సన్నిహితత్వం వంటి లక్షణాలను కలిగిన అభ్యర్థులను తమ అభ్యర్థులుగా రాజకీయపార్టీలు ఎన్నికల బరిలోకి దించుతాయి. ఐతే కులం, మతం వంటి ప్రచ్ఛన్న విజయావకాశాలను కూడా పరిగణలోకి తీసుకోవడం మామూలు.

24. 5.4. ప్రభుత్వాన్ని నిర్మించటం : ఏ రాజకీయ పక్షానికైనా అంతిమలక్ష్యం రాజకీయాధికారాన్ని చేపట్టటం. తాను ప్రకటించిన ఆశయాలను నెరవేర్చడానికై ప్రభుత్వాధికారాన్ని కోరుకుంటుంది. ఆ మేరకు ఎన్నికలలో పోటీచేస్తుంది. ప్రజలు ఆ పార్టీని ఎన్నికలలో

లిపిస్తే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. ఒకవేళ ఎన్నికలలో ఏ ఒక్క పార్టీకి నిర్దిష్టమైన సంఖ్యాబలం లేకపోతే, భావసారూప్యత కలిగిన పక్షాలు సంఘటితమై మిశ్రమ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తాయి.

**24. 5.5. శాసన, కార్యనిర్వాహక శాఖలమధ్య సయోధ్య :** పార్లమెంటరీ ప్రజాస్వామ్య విధానంలో కార్యనిర్వాహకశాఖను శాసనశాఖే సృష్టిస్తుంది. ఏ రాజకీయ పార్టీ ఎన్నికలలో గెలుపొందితే, అది మాత్రమే ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడమనేది పార్లమెంటరీ ప్రజాస్వామ్య పద్ధతి. శాసన శాఖలో సభ్యత్వాన్ని పొందిన వ్యక్తులే మంత్రులుగా నియమించబడుతారు. మంత్రివర్గము పరిపాలక లేక కార్యనిర్వాహకశాఖగా రూపొందుతుంది. అంటే మంత్రివర్గంలో గల సభ్యులు శాసన సభ్యులు కూడా కావడంచేత రెండు ప్రభుత్వాంగాల మధ్య పరస్పర సహకారం, సయోధ్య ఏర్పడతాయి. ప్రభుత్వాంగాలైన శాసన, కార్యనిర్వాహక శాఖల మధ్య సయోధ్యను సాధించడంలో రాజకీయ పార్టీ లేక అధికార పార్టీ కీలకపాత్ర వహిస్తుంది. ఇది ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేయడానికి దోహదపడుతుంది. వాస్తవానికి అధికార పార్టీకి చెందిన అగ్రనాయకులంతా ఎన్నికలలో గెలుపొంది, ప్రభుత్వంలో ఉన్నత పదవులను అలంకరిస్తారు.

**24. 5.6. ప్రతిపక్షంగా వ్యవహరించటం :** బాధ్యత గల ప్రతిపక్షంగా వ్యవహరించడం రాజకీయ పార్టీల విధులలో ప్రధానమైంది. సార్వత్రిక ఎన్నికలలో అధిక స్థానాలను గెలుపొందిన పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి అధికారాన్ని చేపడితే తక్కువ స్థానాలను సాధించుకొన్న పార్టీలు ప్రతిపక్షాలుగా వ్యవహరిస్తాయి. అధికార పార్టీ అనుసరించే ప్రజావ్యతిరేక విధానాలను దుయ్యబట్టడం, ప్రభుత్వ విధానాలలోని లోపాలను బహిర్గతం చేయడం, అధికార దుర్వినియోగానికి సంబంధించిన సంఘటనలను, తగిన సాక్ష్యాధారాలతో ప్రజల ముందుంచడం వంటి ఎన్నో కార్యక్రమాలను ప్రతిపక్షం నిర్వహిస్తుంది. ప్రతిపక్షం అధికారాన్ని చేపట్టటానికి నిర్మించిన రాజకీయవ్యూహంలో భాగంగా కూడా ఈ విధులు ప్రతిపక్షానికి రాజకీయలబ్ధిని చేకూర్చుతాయి. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రయోజనాలకు రక్షణ కవచంగా వ్యవహరించవలసిన ప్రతిపక్షం పాలక పక్షానికి తొత్తుగా మారితే నియంతృత్వానికి, నిరంకుశత్వానికి దారితీస్తుంది. కాబట్టి రాజ్యాంగ పరిమితులను అతిక్రమించకుండా బాధ్యతాయుతంగానూ, నిర్మాణాత్మకంగానూ, నీతి బద్ధంగానూ ప్రతిపక్షం వ్యవహరించాల్సి ఉంటుంది.

**24. 5.7. ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటం :** శాసనసభలో అధిక సంఖ్యాబలం ఉన్నంతకాలం పాలకపక్షం అధికారంలో కొనసాగుతుంది. ఐతే శాసనసభ విశ్వాసాన్ని కోల్పోతే పాలకపక్షం రాజీనామా చేయాలి. ఆ పరిస్థితులలో రాజకీయమైన అనర్థాలకు అవకాశం లేకుండా ప్రతిపక్షం ప్రత్యామ్నాయంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉంటుంది. అలాప్రత్యామ్నాయ ప్రభుత్వంగానూ, రాబోయే ప్రభుత్వంగానూ రాజకీయ పార్టీ ప్రజలకు అభిమాన పాత్రంగా ఉండేటట్లు వ్యవహరించాల్సి ఉంటుంది.

**24. 5.8. ప్రజలకు రాజకీయ విద్యా సంస్థలుగా వ్యవహరించటం :** ఈనాడు ప్రతి రాజకీయపార్టీ తన స్వంత పద్ధతులలో రాజకీయ శిక్షణా శిబిరాలను నిర్వహిస్తూ ఉండడం అందరికీ తెలిసిందే. తన సిద్ధాంతాల పట్ల ప్రజలను ఆకర్షింపజేసి వారికి తమ రాజకీయ శిక్షణా శిబిరాలలోనో లేదా తమ సొంత రాజకీయ అధ్యయన కేంద్రాలలోనో చక్కని శిక్షణ నిస్తుంది. అలా సైద్ధాంతిక శిక్షణ పొందిన సభ్యులు రాజకీయ పార్టీలను నడిపిస్తారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి రాజకీయవిద్య సంస్థాగతంగానూ, రాజ్యాంగ వ్యవస్థాపరంగానూ ప్రతిపౌరునికి ఎంతైనా అవసరం.

## 24. 6. రాజకీయపార్టీలు - గుణదోషాలు

రాజకీయపార్టీల వలన ఎన్నో ప్రయోజనాలున్నాయి. వాటిలో ప్రధానమై వాటిని కింద వివరించటం జరిగింది.

**24. 6.1. ప్రధానమైన సుగుణాలు**

**24. 6.1.a. ప్రజాస్వామ్యాన్ని సుస్థిరపరుస్తాయి :** ప్రజాస్వామ్యంలో రాజకీయపార్టీల అనివార్యం అవసరం. ప్రజాభిప్రాయాన్ని రూపొందించడంలోను, ఎన్నికల ప్రక్రియలోను ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో, శాసన సభాకార్యక్రమాలను నడిపించడంలో రాజకీయ పార్టీల పాత్ర విలువైనది. రాజకీయపార్టీలు లేకపోతే ప్రాతినిధ్య ప్రజాస్వామ్య వ్యవస్థ రూపం ఉండదు. ప్రజాస్వామ్య వ్యవస్థ నిర్వహణలో, విజయవంతం కావడంలో, రాజకీయపార్టీలు అత్యంత నిర్ణయాత్మకమైన పాత్ర పోషిస్తాయి.

**24. 6.1.b. ప్రజలలో క్రమశిక్షణను నెలకొల్పుతాయి :** క్రమశిక్షణ లేని ప్రజలు పశువుల మందలుగా వ్యవహరించి నాగరిక సమాజాన్ని ధ్వంసంచేస్తారు. ఐతే రాజకీయపార్టీలు తమ సభ్యులలో క్రమశిక్షణను పెంచి, తమ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా

వ్యవహరించేటట్లు తీర్చి దిద్దుతాయి. పార్టీ పట్ల విధేయత, సిద్ధాంతాల పట్ల విశ్వాసం, జాతి ప్రయోజనాల పట్ల నిబద్ధతవంటి ఉన్నత విలువలను ప్రజలలో పెంచటం ద్వారా రాజకీయ వ్యవస్థను నిర్మాణాత్మకంగానూ, బాధ్యతాయుతంగానూ రూపొందిస్తాయి.

**24. 6.1.c.** సభాకార్యక్రమాలను సజావుగా నడిపిస్తాయి : పార్టీ గుర్తుపైన ఎన్నికలలో గెలుపొందిన ప్రజాప్రతినిధులు చట్టసభలలో ఆయా పార్టీల క్రమశిక్షణకు లోబడి వ్యవహరిస్తారు. చట్టసభలలో జరిగే చర్యలు, వాదప్రతివాదాలు, వివిధ తీర్మానాలు అన్నీ సజావుగా జరగడానికి ఆయా రాజకీయ పార్టీలు తమ సభ్యులపై కొన్ని నిబంధనలు విధిస్తాయి. పార్టీ క్రమశిక్షణ అనేది పార్లమెంటరీ వ్యవస్థకు ముఖ్యమైంది.

**24. 6.1.d.** చర్చావేదికలుగా పని చేస్తాయి : ప్రజాస్వామ్యంలో హింసకు, నిర్బంధానికి నిరంకుశత్వానికి తావులేదు. రాజకీయపార్టీలు ప్రజాసమస్యలపై శాంతియుత పోరాటాలను జరిపి చర్చావేదికలను నిర్వహించి ప్రజాసమస్యలకు పరిష్కారాలను సూచిస్తాయి. పరస్పరమైన భావ మార్పిడికి ఆస్కారం కలుగచేసి ఒక సమిష్టి అవగాహనకు దోహదం చేస్తాయి. తద్వారా సమాజంలో హింసాయుతమైన పద్ధతులకు అవకాశం ఉండదు. సదవగాహన, సామరస్యం, సహజీవనం, సమ్మతి అనే మహోన్నతమైన విలువలను రాజకీయ పార్టీలు పరిపుష్టం చేస్తాయి.

**24. 6.1.e.** నియంతృత్వాన్ని నిరోధిస్తాయి : ప్రజాస్వామ్యంలో పాలకపక్షం ప్రభుత్వాన్ని నడిపిస్తే, ప్రతిపక్షం ప్రభుత్వాన్ని హద్దుల్లో ఉంచుతుంది. ప్రభుత్వం అనుసరించే తప్పుడు విధానాలను తగిన సాక్ష్యాధారాలతో ప్రతిపక్షం రట్టుచేస్తుంది. పాలకపక్షం చేసే అధికార దుర్వినియోగాన్ని ప్రజలకు తెలియపరచి ప్రజలలో రాజకీయ చైతన్యాన్ని కలిగించటంద్వారా ప్రజా ప్రయోజనాలను కాపాడుతుంది. ప్రతిపక్షమే లేకుంటే ప్రజాస్వామ్యం నిరపేక్ష రాజరికానికో, అరాచకానికో లేక నియంతృత్వానికో దారితీసే ప్రమాదం ఉంది. రాజకీయ పార్టీలు అలాంటి అవాంఛనీయ పోకడలను నిరోధిస్తాయి.

**24. 6.1.f.** ఎన్నికల ప్రక్రియను సరళం చేస్తాయి : ప్రజాస్వామ్యానికి సార్వత్రిక ఎన్నికలు జీవనాడులు. రాజకీయ పార్టీలు తమ సిద్ధాంతాలను, కార్యక్రమాలను ప్రజల ముందు ఉంచుతాయి. తమ పార్టీ అభ్యర్థులను ఎన్నికలలో పోటీకి నిలబెడతాయి. వారి విజయానికి ప్రచారం చేస్తాయి. ఎన్నికల నిర్వహణ గురించి చక్కని అవగాహన కలిగిస్తాయి. దీని వలన అభ్యర్థులు స్వతంత్రులుగా పోటీ చేసి ప్రజలను గందరగోళంలో పడనీయకుండా ఉండడానికి చాలావరకు దోహదం చేస్తాయి. అభ్యర్థుల మధ్య కాకుండా పార్టీల మధ్యనే ఎన్నికల పోటీకి రంగం సిద్ధమవుతుంది. దీని వలన ఎన్నికల నిర్వహణలో ప్రభుత్వానికి, అటు రాజకీయ పార్టీలకు, మరో ప్రక్క ఓటర్లకు సౌకర్యం కలుగుతుంది.

**24. 6.1.g.** రాజకీయ విద్యా వికాసాలను పెంపొందిస్తాయి : రాజకీయ పార్టీలు ప్రజాభిప్రాయ ప్రకటన సాధనాలుగా విశేషమైన విద్యావిలువలను కలిగి ఉన్నాయని లార్డ్‌బ్రైస్ అభిప్రాయం. రాజకీయ పార్టీల ప్రచారం, బహిరంగోపన్యాసాలు వివిధ రకాల పద్ధతుల ద్వారా ఓటర్లను ఆకర్షించడంవంటి వ్యూహాత్మకమైన ఎన్నికల తతంగమంతా నిజానికి రాజకీయ విద్యాపరమైనవే. రాజకీయ సమాచారాన్ని చైతన్యాన్ని, భాగస్వామ్యాన్ని సంపుటీకరించే ప్రక్రియ నేటి ప్రజాస్వామ్యానికి పెట్టనికోటవంటిది.

**24. 6.2.** దోషాలు :

సామాజిక జీవనాన్ని కలుషితం చేస్తాయి :

**24. 6.2.a.** రాజకీయ పార్టీలు పరస్పరం విరుద్ధమైన సిద్ధాంతాలను కలిగి ఉన్నట్లయితే ఆ మేరకు సమాజం రాజకీయంగా విభజింపబడుతుంది. దీని వలన ప్రజలు వర్గాలుగాను, ముఠాలుగానూ చీలిపోతారు. భావసారూప్యత కలిగిన పార్టీలుకూడా తమ ఉనికి కోసం భిన్నమైన పేర్లు పెట్టుకొని ప్రజల ముందుకు రావడం ఈనాడు సహజంగా మనకు కనిపిస్తున్న విషయం. ఒక కోణంలో పరిశీలిస్తే పెక్కు పార్టీల మధ్య సైద్ధాంతికంగా విభజన రేఖ కన్పించదు. కాగా పార్టీ సభ్యులమధ్య తీవ్ర స్థాయిలో హింస, ప్రతిఘటన కక్షలు పెచ్చరిల్లిపోవడం మనం చూస్తూనే ఉన్నాం. వీటన్నింటి వలన సామాజికజీవనం కలుషితమై బ్రతుకే దుర్భరము, భద్రతారాహితము అవుతుంది.

**24. 6.2.b.** జాతీయ ప్రయోజనాల నిర్లక్ష్యం చేయబడతాయి : ప్రతి రాజకీయపార్టీ నాయకుడూ ప్రధానంగా అధికారంలోకి రావడానికే తన శక్తి సామర్ధ్యములను వినియోగిస్తాడు. ఈ ప్రయత్నంలో జాతీయ విలువలను, ప్రజా ప్రయోజనాలను సైతం నిర్లక్ష్యం

చేస్తాడు. కుల, మత, ప్రాంతీయ, భాషా విభేదాలను ప్రజలలో రెచ్చగొట్టి ఎన్నికలలో ఎలాగైన గెలవడానికి ప్రయత్నిస్తాడు [illegible]త్వతమైన [illegible]తీయ దృక్పధాన్ని, జాతి ప్రయోజనాలను పట్టించుకోడు. పుట్టగొడుగుల్లాగా పుట్టుకొస్తున్న నేటి రాజకీయ పార్టీలూ, వాటి నాయకుల పోకడలు ఈ విషయాన్ని విశదం చేస్తాయి.

**24. 6.2.c.** దేశ స్వాతంత్ర్య సమగ్రతలకు హాని కలిగిస్తాయి : ప్రతి ప్రాంతీయ పార్టీ ఆ ప్రాంతపు ప్రయోజనాలకే ప్రాధాన్యతనిస్తుంది. ఒక ప్రాంత ప్రజల భాష, వేషధారణ, చరిత్ర, ఆత్మగౌరవం, మతం, సంస్కృతి వంటి అంశాలపై ఈ ప్రాంతీయ పార్టీలు పుడుతాయి. ప్రజలలో ఆ అంశాలను విపరీతంగా ప్రచారం చేసి ప్రజలను తమవైపు తిప్పుకుంటాయి. స్వతంత్ర్య జాతి, దేశ నినాదాలను సృష్టించి దేశ సమగ్రతను సమైక్యతను విచ్ఛిన్నం చేయడానికి పూనుకుంటాయి.

**24. 6.2.d.** పార్టీ క్రమశిక్షణ వ్యక్తిత్వాన్ని హరిస్తుంది : పార్టీ క్రమశిక్షణ వ్యక్తిత్వాలను హరిస్తుంది. ప్రతి రాజకీయపార్టీ పార్టీ క్రమశిక్షణ పేరిట తమ సభ్యులను కట్టివేస్తుంది. పార్టీ సిద్ధాంతం పేరిట వ్యక్తిగతమైన విలువలు, విశ్వాసాలు, ప్రతిభా వికాసాలు హరించబడతాయి. పార్టీ నిర్దేశాల మేరకు చట్టసభలలో సభ్యులు వ్యవహరించవలసి ఉండటం వలన ఎంతటి ఆత్మవంచన, వివేక రాహిత్యం జరుగుతువ్నదో అందరికి తెలిసిందే. ప్రాతినిధ్య ప్రభుత్వాన్ని విశేషంగా సమర్ధించిన జాన్ స్టువర్ట్ మిల్ పార్టీ క్రమశిక్షణను తీవ్రంగా నిరసించాడు.

**24. 6.2.e.** విజేతృభాగ పద్ధతిని సమర్ధిస్తాయి : ఎన్నికలలో గెలిచిన పార్టీ ప్రభుత్వాన్ని నిర్మించి నిర్వహించడం ప్రజాస్వామ్య లక్షణం. పాలక పక్షం తన పార్టీ సభ్యులకు, సానుభూతి పరులకు, ఎన్నికలలో నిధులు సమకూర్చిన వర్గాలకు ప్రభుత్వంలో పదవులను పంపిణీ చేయడం సహజమైన విషయం. ఏ పాలక పక్షమైనా తనపార్టీ సభ్యులకు రాజకీయమైన పదవులను, ప్రభుత్వ ఉద్యోగాలను దానం చేయడాన్ని విజేతృభాగ పద్ధతి (Spoils System) అంటారు. పేరుకు ఈ పద్ధతి అమెరికాలో అమలులో ఉన్నట్లు చెప్పబడుతున్నా ప్రతి పార్టీ ప్రభుత్వంలోను ఇది వ్రేళ్ళూనికొని ఉంది. ఈ పద్ధతి మౌలికమైన ప్రతిభ, యోగ్యత లక్షణాలను విస్మరించడంతోబాటుగా నీతిహీనులు, అసమర్ధులైన పార్టీ సభ్యులను పెద్ద పదవులలో ప్రతిష్టించడం మనకందరకూ తెలిసిందే.

**24. 6.2.f.** స్వార్ధపరులను మహోన్నతులుగా అందలమెక్కిస్తాయి : రాజకీయపార్టీలు వాటి నాయకులచేతిలో పావుల వంటివి. అక్రమ మార్గాల ద్వారా కోటికి పడగలెత్తిన సంపన్నులకు రాజకీయ పార్టీలు ఆశ్రయాన్ని కల్పించి ఆపదలో ఆదుకుంటాయి. అలాంటి దుర్జనులకు చక్కని ప్రచారాన్ని ఇచ్చి ప్రజల ముందు ఆదర్శనీయులుగానూ, త్యాగధనులుగానూ నిలబెడతాయి. తద్వారా వారికి రాజకీయ లబ్ధిని సంపాదించి పెడతాయి. దీని వలన ప్రజా జీవనంలో నీతి నియమాలు నశించి ప్రజలు దోపిడికి, దుర్భర క్లేశాలకు గురికావల్సి వస్తుంది.

**24. 6.2.g.** రాజకీయ అజ్ఞానులకు అధికారం : అక్షర జ్ఞానంలేని సంపన్నులకు, మూర్ఖులైన పొగరుబోతులకు, వాగ్దాన కర్ణులకు, రాజకీయ పార్టీలు రక్షణ కవచాలుగానూ, అధికార సోపానాలు గాను ఉపయోగపడతాయి. వీరు ఊహాతీతమైన తమ యుక్తికుయుక్తులతో ప్రజలను తమవైపుకు తిప్పుకుంటారు. వాస్తవాలను సైతం నమ్మలేనంతగా ప్రజలను ఆకట్టుకుంటారు.

**24. 6.2.h.** ప్రతిపక్షం విచక్షణా రహితంగా విమర్శలు చేస్తుంది : ప్రతిపక్షం పాలకపక్షాన్ని అవినీతి వలయంగాను, ముఠాల నిలయంగానూ చిత్రించి, గద్దెదించాలనే ప్రయత్నంలో ప్రతి విషయాన్ని గుణదోష విచక్షణ లేకుండా విమర్శించడం ఈనాడు ఆనవాయితీగా ఉంది. స్వార్ధపరమైన కుహనారాజకీయాలను ప్రోత్సహించి ప్రజా ప్రయోజనాలను భంగ పరుస్తాయి. తాత్కాలిక రాజకీయ లాభం కోసం శాశ్వత జాతి ప్రయోజనాలను పణంగా పెట్టే ప్రతిపక్షాలు క్రొత్తకాదు.

ఇలాంటి దోషాలు రాజకీయపార్టీలను ఆవరించి ఉండడం వలన ఏపార్టీ నీతిమంతమో, ఏపార్టీ నీతి రహితమో గ్రహించడం కష్టమవుతుంది. అందువలన పార్టీ రహిత ప్రజాస్వామ్యమే (Partyless Democracy) ఉత్తమమైన విధానమని కొందరి అభిప్రాయం. అయితే పార్టీ రహిత ప్రజాస్వామ్య వ్యవస్థ ఈనాటి పరిస్థితులలో అసంభవమైన రాజకీయ ప్రయోగమనిపిస్తుంది.

## 24. 7. రాజకీయ పార్టీలు - ప్రజాస్వామ్యంలో వాటిపాత్ర

విశ్వజనీన వయోజన ఓటింగు విస్తరించడంతో ప్రజాస్వామిక వ్యవస్థకు, అందులోనూ ముఖ్యంగా రాజకీయ పార్టీ వ్యవస్థకు ఎనలేని ప్రాముఖ్యత వచ్చింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం దినదిన ప్రవర్ధమానమవుతున్న ఈ రోజులలో రాజకీయ పార్టీలు మాన్యుడినీ,

సామాన్యుడినీ సమానమైన స్థాయిలో నిలబెట్టడం గమనార్హం. "ఒక వ్యక్తి - ఒక ఓటు" అనే సూత్రం ప్రజాస్వామ్యానికి ప్రాతిపదిక రాజకీయ సమానత్వానికి ఈ సూత్రమే ఊపిరి. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు నిర్వహించే పాత్ర ఎంత విలువైనదో రాజకీయ వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియ స్పష్టం చేస్తాయి.

రాజకీయపార్టీలు ప్రజాస్వామిక సమాజంలో అంతర్వాహినులు. ప్రతి రాజకీయపార్టీ తనదైన రీతిలో కేవలం వయోజనులనే కాకుండా ఇటు విద్యార్థులను, అటు కార్మికులను మరోవైపు ఉద్యోగులను తదితర వర్గాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. దీని ఫలితంగా ఆయా సంస్థలలో రాజకీయపార్టీలకు సంబంధించిన ఉపాంగాలు లేదా అనుబంధ సంస్థలు ఏర్పడుతున్నాయి. నిశితంగా ప్రతివ్యక్తీ ప్రతిసంస్థా ప్రతి వర్గమూ ఏదో ఒక రాజకీయపార్టీ పట్ల ఆకర్షితులు కావడమో లేక అనుబంధితులు కావడమో జరుగుతున్నది.

ప్రచార రంగంలో వచ్చిన విప్లవాత్మకమైన సాంకేతిక పరిజ్ఞానం వలన రాజకీయపార్టీలు జనజీవితాలలో సైతం మహత్తరమైన పాత్ర వహిస్తున్నాయి. కేవలం నామమాత్రమైన చందా చెల్లించి పుస్తకరూపంలో ఉండే పార్టీ సిద్ధాంతాలను ఆకళింపు చేసుకుని ఆయా పార్టీల సభ్యులు నిర్వహించే పాత్ర ఈనాడు పూర్తిగా మారిపోయింది. విద్యుత్ ప్రేరకాలతో అనూహ్యమైన రీతిలో దృశ్య శ్రవణ ప్రచార సాధనాలు ప్రతివ్యక్తినీ రాజకీయ పార్టీలతో మమేకం చేస్తున్నాయి. పార్టీ సిద్ధాంతాలను అవగాహనచేసుకోడానికి, లేదా వాటి కార్యక్రమ సరళిని అనుసరించడానికి అచ్చురూపంలో ఉండే కాగితాలకంటే, దృశ్యశ్రవణ రూపాలలో ప్రజలను హత్తుకునే ప్రచార సాధనాలు ఎంతో కీలకమైనవి. సభ్యుల చందాలతోనే రాజకీయపార్టీలు నిర్వహించబడే రోజులు పోయినాయి. వ్యవస్థిత వ్యాపారరంగం నుండి, కొన్ని సందర్భాలలో భావ సారూప్యత కలిగిన విదేశీ పార్టీలనుండి కూడా రాజకీయ పార్టీలు నిధులను సమకూర్చుకుంటూ తమ కార్యక్రమాలను నడిపిస్తున్నాయి. ఈ కోణంలో పరిశీలిస్తే ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు నిర్వహించే పాత్రకు రాజకీయేతర అంశాలు కూడా ఏ విధంగా దోహదం చేస్తాయో మనకు తెలుస్తుంది.

ప్రజాస్వామ్యానికి రాజకీయపార్టీలు ఎంత అవసరమో, రాజకీయపార్టీల మనుగడకు, నిర్వహణకు ప్రజాస్వామిక ప్రక్రియ అంతకంటే ఎక్కువ అవసరం. ప్రజాస్వామిక ప్రక్రియలను ఉల్లంఘించిన ఏ రాజకీయపార్టీయైనా నియంతృత్వ ధోరణులను సంతరించుకొని ఎక్కువకాలం జీవించలేదు.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి పార్టీ వ్యవస్థ జీవనాడి. పార్టీల పద్ధతిలోని సుగుణమైన ప్రత్యామ్నాయ ప్రభుత్వ అవకాశమే పార్లమెంటరీ వ్యవస్థకు స్థిరత్వాన్ని కలిగిస్తుంది. ప్రజాస్వామ్యంలో రాజకీయపార్టీలు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య సంధానకర్తలుగానూ, ప్రజాభిప్రాయ ప్రకటనా సాధనాలుగానూ, ప్రభుత్వ నియంతృత్వ నిరోధకాలుగానూ, ప్రజాస్వేచ్ఛ పరిరక్షకులుగాను నిరుపమానమైన పాత్రను నిర్వహిస్తున్నాయి.

**24. 8 సారాంశము :** ప్రజాస్వామ్యవ్యవస్థ విజయవంతం కావడానికి నిర్మాణాత్మక, బాధ్యతాయుతమైన పాత్రను నిర్వహించే రాజకీయ పార్టీలు అత్యంత ఆవశ్యాలు. రాజకీయ పార్టీలు లేని మానవసమాజం అనాగరికంగానూ, చైతన్యరహితంగానూ, కన్పిస్తుంది. ఆ మాటకొస్తే పార్టీ పద్ధతి అతి సహజమైన పరిణామమని కొందరంటారు. పార్టీ పద్ధతి లేకపోతే రాజ్యానికి చైతన్యం కానీ స్వయం నిర్ణయంగానీ ఉండవు అని మెకైవర్ పేర్కొన్నాడు. పార్టీ పద్ధతి మానవ స్వభావానికి అనుగుణంగా ఉంటుందనీ, తమలో ఉన్న విభిన్నమైన భావాలను బట్టే ప్రజలు వివిధ పార్టీలుగా విభజించబడతారని కొందరంటారు.

పార్టీ వ్యవస్థ వలన ప్రయోజనాలు ఉన్నాయి. అలాగే దోషాలు ఉన్నాయి. వాటి గుణదోషాలను మనం ముందు పేజీలలో చర్చించడం జరిగింది. అలాగే ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు నిర్వహించే పాత్ర మనం నిశితంగా పరిశీలించాం. ఏది ఏమైనా బాధ్యతాయుత దృక్పథం, నిర్మాణాత్మకమైన కార్యక్రమం, క్రమశిక్షణ అనేవి ఏరాజకీయ పార్టీకైనా ఉండవలసిన లక్షణాలు. ప్రజా ప్రయోజనాలను తాకట్టు పెట్టి ప్రభుత్వాధికారాన్ని చేపట్టాలని మాత్రమే ప్రయత్నించే ఏ రాజకీయ పార్టీయైన ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా మారుతుంది. అలాంటి అవాంఛనీయమైన, దుష్ట స్వార్థపూరిత రాజకీయపార్టీల ఆటలను అరికట్టడం ప్రతి పౌరుని కర్తవ్యం.

పాఠం - 25

# ప్రజానియంత్రణ - నియంత్రణ పద్ధతులు ప్రజాభిప్రాయం - ప్రచార సాధనాల పాత్ర

## (Popular Control - Methods of Control)

## (Public Opinion - Role of Mass Media)

### 25. 0 లక్ష్యం :

ప్రజాస్వామ్యవిధానంలో ప్రజావాక్యమే ప్రభుత్వకర్తవ్యము. ప్రభుత్వ వ్యవస్థను ప్రజలు ఏఏ పద్ధతుల ద్వారా నియంత్రించి, అదుపులో ఉంచుతారో, ప్రజాభిప్రాయ ప్రాముఖ్యమేమిటో, ప్రజాభిప్రాయం ఏ విధంగా రూపొంది, ఏయే సాధనాల ద్వారా వ్యక్తమౌతుందో వివరించడం, ప్రజాస్వామ్యంలో ప్రచారసాధనాల భూమిక ఏమిటో విశ్లేషించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

విషయక్రమం :

25. 1. ప్రజానియంత్రణ

25. 2. నియంత్రణ పద్ధతులు

25. 3. ప్రజాభిప్రాయం

25. 4. ప్రచారసాధనాల పాత్ర

25. 5. పమీక్ష

### 25. 1. ప్రజానియంత్రణ

ప్రజాస్వామ్యం ప్రజాభిప్రాయం పర్యాయపదాలే. ప్రజానియంత్రణావశ్యకత అనేది ప్రజాసార్వభౌమత్వంలో భాగమే. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాధికారం ప్రజలనుండి పుడుతుంది. ప్రజల సమ్మతిపై ఆధారపడి ఉంటుంది. ప్రజానియంత్రణలోనే మనుగడసాగిస్తుంది. దీనికి కారణం ప్రజాతంత్ర విధానంలో ప్రజలే రాజకీయాధికారానికి నిర్మాతలూ, నిర్ణేతలూ, అంతిమ వ్యాఖ్యాతలూ కావడం. అందువల్లనే రాజ్యము చేత నిర్మించబడి, ప్రభుత్వం చేత అమలు పరచబడే చట్టాలు కానీ, ప్రభుత్వ విధానాలు కానీ నిర్బంధంగా ప్రజల ఆమోదాన్ని పొందవలసిఉన్నది. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యాలలో ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులచే రూపొందిన చట్ట సభలు రాజకీయసార్వభౌమాధికారాన్ని చెలాయిస్తూ ప్రజాజీవితాలను శాసిస్తాయి. ప్రజాప్రతినిధులు ప్రజలకు జవాబుదారీగా ఉండడమనేది పరోక్ష ప్రజాస్వామ్య లక్షణం. నిర్ణీతకాలం ప్రకారం జరిగే సార్వత్రిక ఎన్నికలు ప్రజల చేతిలో ప్రభుత్వాన్ని నియంత్రించడానికై ఉంచబడిన రాజకీయ మహాయుధాలు. ప్రజాభిప్రాయాన్ని లేదా ప్రజాశ్రేయాన్ని విస్మరించే ఏ ప్రభుత్వ వ్యవస్థయైనా ఈ మహత్తరమైన రాజకీయ ఆయుధం కారణంగా కుప్పకూలిపోతుంది. అంటే ప్రజలకు బాధ్యత వహించని ప్రభుత్వాన్నీ లేదా ప్రభుత్వాన్ని నడిపించే పాలక పక్షాన్ని రాబోయే సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు ఓడించి, వారికి విశ్వాసమున్న మరో పక్షాన్ని లేదా వర్గాన్ని ఎన్నుకొని ప్రభుత్వాధికారాన్ని అప్పగిస్తారు. ఎన్నికలంటూ లేకపోతే ప్రజాస్వామ్యమే లేదు. అందువల్ల పౌరనియంత్రణ పద్ధతులలో ప్రధానమైన సాధనం ఎన్నికలు మాత్రమే.

ప్రజాస్వామ్యంలో ఏ ప్రభుత్వమైనా నిరవధికంగానూ, నిరపేక్షంగానూ, నియంతృత్వంగానూ వ్యవహరించడానికి వీలులేని రీతిలో ఈ ప్రజానియంత్రణ పద్ధతులు కొన్ని క్రమపరిణామం చెందినాయి. వాటిలో ప్రధానమైనవి ఇవి :

## 25. 2 నియంత్రణ పద్ధతులు :

ప్రత్యక్ష ప్రజాస్వామ్య పద్ధతులు : ప్రజలే దాదాపు ప్రత్యక్షంగా ప్రభుత్వ వ్యవస్థలో భాగస్వాములుగా ఉండి రాజకీయాధికారాన్ని నిర్వహించడం ప్రత్యక్ష ప్రభుత్వ లక్షణం. అయితే జనాభా, విస్తీర్ణం, విస్తృతంగా పెరిగిన ఈ రోజుల్లో ఈ విధానం ఆచరణ సాధ్యంకాదు. అయినా కొన్ని పద్ధతుల ద్వారా, ఈ ప్రత్యక్ష ప్రజాస్వామ్యాన్ని స్విస్ ప్రజలు ఆచరణ సాధ్యం చేస్తున్నారు.

ప్రత్యక్ష ప్రజాస్వామ్యం ఈనాడు స్విట్జర్లాండులో అమలులో వున్నది. ప్రత్యక్ష ప్రజాస్వామ్య పద్ధతులు ప్రధానంగా మూడు. అవి 1) ప్రజాభిప్రాయ సేకరణ (Referandum) 2) ప్రజాభిప్రాయ నివేదన (Initiative) 3) పునరాయనము (Recall). వీటిని క్లుప్తంగా చర్చిద్దాము.

1) ప్రజాభిప్రాయ సేకరణ : ఈ పద్ధతి ద్వారా ప్రజలు ఒక విషయం మీదగాని లేక శాసన ప్రతిపాదన మీదగాని తమ అభిప్రాయాన్ని ప్రభుత్వానికి తెలియజేస్తారు. అలా చేయడంలో ఒక స్పష్టమైన విషయంపై తమ ఆమోదాన్ని ప్రజలు తెలుపవచ్చు, లేదా తిరస్కరించవచ్చు. ఇది రెండు విధాలుగా వుంటుంది. అవి

1) నిర్బంధ ప్రజాభిప్రాయ సేకరణ (Compulsory Referendum)

2) ఐచ్ఛిక ప్రజాభిప్రాయ సేకరణ (Optional Referendum)

రాజ్యాంగ సవరణకు సంబంధించి ప్రజాభిప్రాయాన్ని తెలుసుకునే విషయమై ప్రజాభిప్రాయ సేకరణ చేయడం జరుగుతుంది. ఈ పద్ధతిని 'నిర్బంధ ప్రజాభిప్రాయ సేకరణ' అంటారు. అలాగే శాసనసభ చేసిన చట్టాలపై సాధరణంగా ప్రజలకోరికపై ప్రజానిర్ణయాన్ని సేకరిస్తారు. దీనిని 'ఐచ్ఛిక ప్రజాభిప్రాయ సేకరణ' అంటారు. స్విట్జర్లాండులో 30 వేలమంది పౌరులు లేదా 8 రాష్ట్రాలు ఐచ్ఛికంగా ప్రజాభిప్రాయ సేకరణను కోరడానికి అవకాశం ఉంది. దీని సారాంశమేమంటే సాధారణ విషయంకాని రాజ్యాంగ సవరణగాని ఏదైనా ప్రజామోదానికి లోబడి వుండాలి.

ప్రజాభిప్రాయ నివేదన : ఈ పద్ధతి ద్వారా ప్రజలు ఒక అర్జీని (Petition) తయారుచేసి, కనీసం 50 వేలమంది సంతకాలు చేసి ప్రభుత్వానికి నివేదిస్తారు. ఆ నివేదనను ప్రభుత్వం ప్రజలముందుంచి వారి అభిప్రాయాన్ని సేకరిస్తుంది. ఆ ప్రతిపాదనను అధిక సంఖ్యాకులు గనక ఆమోదించినట్లయితే శాసనశాఖ దానికి గట్టి ప్రతిపత్తిని కల్పిస్తుంది. స్విట్జర్లాండులో రాష్ట్రాలు రాజ్యాంగ సవరణకు సంబంధించిన ప్రతిపాదనలుగాని లేక సాధారణమైన శాసనాలను సవరించడానికి గాని ఈ పద్ధతిని ఉపయోగిస్తారు. దీని ప్రకారం ప్రజలే కొన్ని విషయాలమీద శాసన ప్రతిపాదనలు చేయటానికి అవకాశం వుంటుంది. ఇందులో ప్రజల "చొరవ" ప్రధానంగా కనిపిస్తుంది గనుక కొందరు దీనిని 'చొరవ' అని కూడ అంటారు. అభిప్రాయ నివేదన అనేది ప్రజలు సమర్పించే ఒక వినతిపత్రం లాంటిది. దీనివలన ప్రజలలో చైతన్యం పెరిగి ప్రభుత్వానికి అత్యవసరమైన ప్రజాసమస్యలను గుర్తుచేసి దాని పరిష్కారానికై ప్రభుత్వముపై వత్తిడి తెచ్చే అవకాశం వుంటుంది.

పునరాయనము : పునరాయనము అంటే "వెనుకకు పిలవడము" అని అర్థము. ఈ పద్ధతి ద్వారా బాధ్యతారహితంగా ప్రవర్తించే ప్రజాప్రతినిధులను తమ పదవులనుండి తొలగించి వారి స్థానంలో వేరొకరిని ఎన్నుకోవడానికి ప్రజలకు అవకాశం వుంటుంది. ఈ పద్ధతి స్విట్జర్లాండులోనూ, అమెరికాలోని కొన్ని రాష్ట్రాలలోనూ అమలులో వుంది. పునరాయనం ప్రజాసార్వభౌమత్వానికి సజీవసంకేతంగా చెప్పవచ్చు.

పై మూడు పద్ధతులతోపాటు ప్రజాసార్వభౌమత్వాన్ని సాటిచెప్పే మరొక పద్ధతి కూడా వుంది. అదే "జన వాక్య సేకరణ" ఇది ప్రధానంగా ఒక ప్రత్యేకమైన ప్రాదేశిక సరిహద్దుకు సంబంధించి లేదా ఒక వివాదగ్రస్తమైన ప్రాంతానికి సంబంధించి ఆ ప్రాంతవాసుల యొక్క అభిప్రాయాన్ని సేకరించి తద్వారా ఆ ప్రాంతం ఏ దేశానికి చెందుతుందో నిర్ణయించే విధానము.

I. ప్రయోజన వర్గాలు : ఆధునిక ప్రజాస్వామ్యాలలో తమ తమ ప్రయోజనాలను పెంపొందించుకోవడానికై కుల, వృత్తి, ప్రాతిపదికలపై కొన్ని ప్రయోజన వర్గాలు ఏర్పడుతుంటాయి. వ్యాపార వర్గాలు, శ్రామిక వర్గాలు, రైతుకూలి వర్గాలు, విద్యార్థి సంఘాలు ఇవన్ని తమ

వర్గాలు ప్రభుత్వ విధానాలను అతి జాగ్రత్తగా గమనిస్తుంటాయి. ప్రజా ప్రయోజనాలను కాపాడటానికై ఇవి ఎంతగానో కృషి చేయటమేగా ప్రభుత్వాన్ని కూడ అదుపులో వుంచగలవు.

II. ప్రజాభిప్రాయ సాధనాలు : ప్రజాప్రభుత్వంపై నియంత్రణను చెలాయించే మరొక ప్రబలమైన అంశం ప్రజాభిప్రాయము, దానిని ప్రకటించే సాధనాలు. ప్రజలు తమ సాధక బాధకాలను, పెక్కు మార్గాల ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తుంటారు. ప్రజాభిప్రాయాన్ని విస్మరించడానికి ఏ ప్రభుత్వమూ సాహసించలేదు. ఒక ప్రభుత్వం ఏమేరకు ప్రజా సమ్మతిపై నడుస్తున్నదో ఆ ప్రజల అభిప్రాయాలనుబట్టి, ప్రజాభిప్రాయాలను సమర్ధంగా ప్రకటించే సాధనాలద్వారా మనం అంచనా వేయవచ్చు. సినిమాలు, వార్తాపత్రికలు, బహిరంగ వేదికలు, రాజకీయ పార్టీలు, శాసనసభలు, టెలివిజన్‌లవంటి సాధనాలు ఎన్నో ఈనాడు ప్రభుత్వానికి ప్రజాభిప్రాయాన్ని తెలియజేయడంలో విశిష్టమైన పాత్రను వహిస్తున్నాయి.

పైన పేర్కొన్న ప్రత్యక్ష ప్రజాస్వామిక పద్ధతులు, ప్రయోజన వర్గాలు మాత్రమేకాక ఈనాడు ప్రజాభిప్రాయమే ప్రభుత్వాన్ని దృఢంగా శాసిస్తున్నది, నియంత్రిస్తున్నది. ప్రభుత్వాన్ని అదుపు, ఆజ్ఞలలో వుంచి ప్రజా సార్వభౌమత్వానికి ఆచరణాకృతిని కల్పిస్తున్నది ప్రజాభిప్రాయమే.

ఇక ప్రజాభిప్రాయాన్ని గురించి తెలుసుకుందాము.

25. 3 ప్రజాభిప్రాయం (Public Opinion) : ప్రజాభిప్రాయమంటే ఏమిటో స్పష్టంగా నిర్వచించడం కష్టమే. సమాజంలో ప్రజలు సాధారణ విషయాలకు, సమస్యలకూ సంబంధించి విభిన్నమైన అభిప్రాయాలను కలిగి వుంటారు. విస్తృతమైన ప్రజాసమస్యలపై అరుదుగా ఏకాభిప్రాయం వ్యక్తం అవుతూ వుంటుంది. ఒక ప్రభుత్వ విధానంపై అధిక సంఖ్యాకులు భావసారూప్యాన్ని లేదా ఒకే అభిప్రాయాన్ని వ్యక్తపరచినంతమాత్రాన అదే ప్రజాభిప్రాయం కానవసరంలేదు. అలాగే కొద్దిమంది వ్యక్తులు ఒక ప్రజా సమస్య గురించి ఏకాభిప్రాయాన్ని వ్యక్తంచేసినంత మాత్రాన అదికూడ ప్రజాభిప్రాయం కానక్కరలేదు. కనుక ప్రజాభిప్రాయమంటే జనసంఖ్యతో ముడిపడిన వ్యక్తీకరణకాదు. రోమన్ సామెత "జనవాక్యమే దైవ వాక్యము" (Vox Populyvox die) అనేదికూడ గమనార్హము. ఫ్రెంచి రాజనీతి తత్వవేత్త అయిన రూసో తన జనేచ్ఛ (General will) అనే భావన ద్వారా ప్రజాభిప్రాయ భావనకు నూతనార్ధాన్ని కల్పించాడు.

ప్రజాభిప్రాయ భావన ఈనాడు అత్యంత స్ఫూర్తిమంతమైన పరిశోధనకు ప్రాతిపదికలు నిర్మించింది. కానీ ప్రజాభిప్రాయమనగా "ఇది" అనే విషయంలో ఏకాభిప్రాయం కనిపించదు. విశ్లేషణాత్మకమైన స్పష్టతలేని అనేక రాజనీతి భావనలలో ప్రజాభిప్రాయం కూడా ఒకటిగా కనిపిస్తున్నది. ఏది ఏమైనా ప్రజాభిప్రాయ భావనకు ప్రజాస్వామ్య వ్యవస్థ జవసత్వాలను కలిగించింది. అంటే ప్రజాప్రభుత్వ ఆవిర్భావ ఫలితంగా ప్రజాభిప్రాయ భావన ప్రాచుర్యంలోకి వచ్చింది.

"ఒక ప్రత్యేక సమస్యపట్ల కొందరు వ్యక్తులుగాని, వ్యక్తుల సమూహంగాని వ్యక్తపరచే అభిప్రాయాన్ని ప్రజాభిప్రాయం" అని స్థూలంగా నిర్వచించవచ్చు. అలాగే ప్రజా ప్రయోజనానికి లేదా ప్రజాసమస్యకు సంబంధించి ప్రజలు వ్యక్తంచేసే సామూహిక అభిప్రాయమే ప్రజాభిప్రాయమని లార్డ్‌బ్రైస్ పేర్కొన్నారు. లార్డ్‌బ్రైస్ మరో సందర్భంలో ప్రజాభిప్రాయమనగా ఏ ఒక్క వర్గమునకు మాత్రమే చెందక, యావత్ సమాజశ్రేయానికి చెంది సహేతుకముగా ఒక అంశముపై వ్యక్తపరచబడిన ప్రజల అభిప్రాయమే ప్రజాభిప్రాయము అని పేర్కొన్నాడు. ("Public Opinion is an opinion based on reason which aims at the welfare of the whole community and not any particular section of it") - Lord Bryce.

ఎంతటి నిరంకుశ చక్రవర్తియైనా ప్రజాస్వామ్యాన్ని గౌరవించి తీరవలసినదేనని ఫ్రెంచి తత్వవేత్త మాకియవెల్లి పేర్కొన్నాడు. దీనినిబట్టి ప్రజాభిప్రాయం ప్రజాస్వామ్యంలో ఎంత శక్తివంతమైనదో మనం ఊహించవచ్చు. ప్రభుత్వాన్ని నిర్మించడానికి, నియంత్రించడానికి, తొలగించడానికి కూడ ప్రజాభిప్రాయమే ఆయుధంగానూ, సాధనంగానూ ఉపకరిస్తుంది. ప్రభుత్వాన్ని అదుపులో వుంచడానికి ఎప్పుడూ ప్రజాభిప్రాయం చైతన్యవంతమైన భూమికను నిర్వహిస్తుంది.

ప్రజాభిప్రాయం - అవసరమైన పరిస్థితులు : ప్రజాభిప్రాయం రూపొందడానికి ఈ దిగువ పరిస్థితులు అవసరం.

1) ఒక రాజ్యంలోని ప్రజలు లేక ప్రజావర్గాలు సార్వత్రికమైన విషయాలపై స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయగలిగే పరిస్థితులు వుండాలి.

2) సాధారణ ప్రజలకు వివాదాస్పదమైన సమస్యలను గురించి సరైన అవగాహన, స్పష్టమైన పరిజ్ఞానం వుండడం అవసరం.

3) ఒక నిర్ణీతకాలంలో ప్రజలు వ్యక్తీకరించే అభిప్రాయాలను ప్రచురించడానికి లేదా బాధ్యతగా ప్రకటించడానికి సమర్థులైన నాయకులుకూడ వుండాలి.

4) ప్రజలు ప్రధానమయిన ప్రజా సమస్యల గురించి స్వయంగా ఆలోచించగలగాలి. మరియు సమర్థంగా వాటి బాగోగులను చర్చించగలగాలి.

5) తమ అభిప్రాయాలను సక్రమంగా రూపొందించుకొని, వర్గీకరించుకొని వివరించడానికై ప్రజలు వృత్తిపరంగానో, ఉద్యోగపరంగానో లేక ప్రవృత్తిపరంగానో వర్గాలుగా ఏర్పడడంవలన తమ ప్రయోజనాలకు సంబంధించి ప్రజాభిప్రాయాన్ని విశ్లేషణాత్మకంగా వ్యక్తీకరించగలరు.

6) ప్రభుత్వ స్వరూప, స్వభావ విధానాలకు సంబంధించి జాతీయస్థాయిలో ఏకాభిప్రాయం వుండాలి. మౌలికమైన ఆశయాలు, విధానాలు ప్రభుత్వ లక్ష్యాలు స్పష్టంగా ప్రజలకు తెలియకపోతే ప్రజాభిప్రాయం సహేతుకంగా రూపొందజాలదు.

7) అన్నింటికీ మించి ప్రజాస్వామిక వ్యవస్థ, అందులోనూ ప్రజలకు వాక్‌స్వాతంత్ర్యం, భావప్రకటనా స్వేచ్ఛ వున్నప్పుడే నిర్భయంగాను, స్వేచ్ఛగాను తమ అభిప్రాయాలను వెల్లడి చేయగలుగుతారు.

పైన ఉదహరించిన పరిస్థితులు లోపిస్తే ప్రజాభిప్రాయం గందరగోళానికీ, అశాంతికీ దారితీసే ప్రమాదముంది. అన్ని పరిస్థితులు సానుకూలంగావున్నా చివరకు ఒకానొక అంశముపై వెలువడిన ప్రజాభిప్రాయం వాస్తవమే కావచ్చు లేదా ఆకాంక్షగా రూపొందవచ్చు, లేదా దృఢమైన విశ్వాసమే కావచ్చు. ఒక్కొక్క సారి అసత్యప్రచారం కూడ కావచ్చు.

## 5. ప్రజాభిప్రాయ ప్రకటనా సాధనాలు

సామాన్య ప్రజానీకానికి ప్రజా సమస్యలను గురించిగాని లేక నిర్దిష్టమైన రాజకీయ సమస్యలను గురించిగాని ఆలోచించే అవకాశం వుండదు, ఆసక్తి వుండదు. అంతేగాక దైనందిన జీవన విధానంలో ప్రజలలో సుసంఘటితమైన చైతన్యము కూడా కన్పించదు. అలాంటప్పుడు ప్రజాస్వామ్యంలో ప్రజలను చైతన్యవంతులను చేయడానికి, రాజకీయాలలో చక్కని భాగస్వాములను చేసి ప్రభుత్వ వ్యవహారాలలో ప్రమేయాన్ని కల్పించడానికి కొన్ని సాధనాలు ఏర్పడినవి. ఇవి పరోక్షంగా ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య సంధానకర్తలుగా కూడా పనిచేస్తాయి. వాటిలో ప్రధానమయినవి-వార్తాపత్రికలు, రాజకీయ పార్టీలు, బహిరంగ వేదికలు, విద్యాసంస్థలు, శాసనసభలు, సినిమాలు, రేడియో, టెలివిజన్‌లు మొదలైనవి. వీటిని గురించి సంక్షిప్తంగా చర్చిద్దాం.

**వార్తా పత్రికలు (Press) :** ప్రజాస్వామిక పరిరక్షణకు ప్రధాన సాధనాలు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కలిగిన వార్తాపత్రికలంటారు. వాక్, భావ ప్రకటనా స్వేచ్ఛలను వ్యక్తికి ప్రాథమిక హక్కులుగా పెక్కు రాజ్యాంగాలు గుర్తించినవి. వ్యక్తి వికాసానికి ఇవి మౌలిక సాధనాలని లాస్కీ అన్నారు. వాక్, భావ ప్రకటనా స్వేచ్ఛలు 'పత్రికా స్వాతంత్ర్యం' గా ఆచరణలో రూపొంది, ప్రజలను జాగృతం చేస్తాయి. స్వేచ్ఛాయుతమైన పత్రికలు ప్రభుత్వ లోటుపాట్లను బహిర్గతం చేసి, ప్రజల ముందుంచుతాయి. దీనివలన ప్రజా సమస్యల పట్ల ప్రభుత్వ వైఖరి ఏమిటో ప్రజలకు తెలుస్తుంది. నలుదెసలా నిత్యమూ జరిగే అనేకానేక సంఘటనలు తెల్లవారేసరికి అక్షర రూపంలో వ్యాఖ్యా చిత్రాలతో సహా ప్రజలకు నివేదించడంలో వార్తాపత్రికలు చైతన్యవంతమైన పాత్ర వహిస్తాయి. పైగా చౌక ధరలకే ఇవి ఇంటి ముంగిట అందుబాటులో ఉండడం వలన విశేషమైన ప్రాచుర్యాన్ని పొందుతున్నాయి.

ప్రజాభిప్రాయాన్ని రూపొందించడంలో పత్రికలు నిర్వహిస్తున్న పాత్ర అద్భుతమైనది. పత్రికలలో ప్రచురించబడే సంపాదకీయాలు, వార్తావ్యాఖ్యలు, పాఠకుల ఉత్తరాలు, కార్టూన్లు (వ్యంగ్య చిత్రాలు), వ్యాసాలు, రాజకీయ ప్రకటనలు మొదలైనవన్నీ ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ప్రజాభిప్రాయాన్ని వ్యక్తం చేస్తాయి. పత్రికా ప్రచురణ రంగంలోనూ, ముద్రణా రంగంలోనూ విప్లవాత్మకమైన మార్పులు రావడంవలన, నిరక్షరాస్యులను సైతం విద్యావంతులుగా మలిచి, వార్తలను చదివించే విధంగా పత్రికాధిపతులు తమ తమ పత్రికలను తీర్చిదిద్దుతున్నారు.

**రాజకీయ పార్టీలు (Political Parties) :** రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ చైతన్యాన్ని ప్రోది చేసే పట్టుగొమ్మలు. ప్రజలను రాజకీయంగా ఉత్తేజితులను చేసి, తమ విధానాలవైపు త్రిప్పుకోవడానికి అవి చేపట్టే బహుముఖ కార్యక్రమాలన్నీ ప్రజల పాలిట రాజకీయ విద్యాసాధనాలుగా దోహదం చేస్తాయి. ప్రజలకు జాతీయ, ప్రాంతీయ, స్థానిక సమస్యలపై చక్కని అవగాహనను కలిగిస్తాయి. ప్రజలతో ముఖాముఖీ సంబంధాలను ఏర్పరచుకొని, తమ ఉపన్యాసాల ద్వారా, కరపత్రాలను, పుస్తకాలను ప్రచార ప్రచురణలను

వెలువరించడం ద్వారా ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. రాజకీయాధికారాన్ని చేజిక్కించుకోవాలనే తమ ప్రయత్నంలో రాజకీయ పార్టీలు ఎంతో విలువైన సమాచారాన్ని ప్రజలకు అందించి, వారు దృఢంగా ప్రతిస్పందించేట్లు చేస్తాయి.

ప్రభుత్వం చేసే పొరబాట్లను, అవినీతి చర్యలను, అక్రమాలను వాస్తవ గణాంకాలతోనూ, సాక్ష్యాధారాలతోనూ బహిరంగపరుస్తాయి. ఈ ప్రక్రియలో వార్తాపత్రికలు, కరపత్రాలు, వాల్‌పోస్టర్లు వంటి విభిన్న ప్రచార సాధనాలను ఉపయోగించుకుంటాయి. ప్రజలను సులభంగా ఆకట్టుకోవడానికై విచిత్రమైన ప్రచార సామగ్రిని, ప్రయోగాలను, ప్రక్రియలను చేపడతాయి. తద్వారా ప్రజలమద్దతును పొంది ప్రభుత్వాన్ని నిలదీస్తాయి.

ప్రజాభిప్రాయాన్ని రూపొందించడంలోనూ, ప్రతిధ్వనించడంలోనూ రాజకీయపార్టీలూ, సంస్థలూ మంచి పాత్రను నిర్వర్తిస్తాయి. వీటితోబాటుగా, ప్రభావ వర్గాలు (Pressure Groups) వృత్తి సంఘాలు నేరుగా ఎన్నికలలో పోటీచేసినా, చేయకపోయినా రాజకీయపార్టీలకు చాలావరకు తమ మద్దతునిచ్చి, ఎన్నికల అనంతరం తమ కోర్కెల సాధనకు ఆయా పార్టీల సహాయసహకారాలను స్వీకరిస్తుంటాయి.

అలాగే సాంఘిక, ధార్మిక సంఘాలు కూడా వాటి పరిధులలో వాటి ప్రత్యేక ప్రచార పద్ధతితో ప్రజలను ప్రభావితం చేస్తుంటాయి. తద్వారా ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసి, ప్రతిబింబించేట్లు కృషి చేస్తాయి. సాంఘిక, ధార్మిక, మత ప్రచారంలో తత్సంబంధిత సంఘాల కృషి స్వల్పమేమీ కాదు. వీటితో బాటు పౌరహక్కుల సంఘాలు, వినియోగదారుల సంస్థలూ కూడా ఇటీవలకాలంలో గణనీయంగా కృషిచేస్తూ, ప్రజలను చైతన్యమూర్తులుగా తీర్చిదిద్దుతున్నాయి. విద్యాలయాలలో సైతం లభించని సాంఘిక, రాజకీయ విద్యా చైతన్యాలు ఈ సంస్థలవలన ప్రజానీకానికి లభిస్తున్నాయి. ప్రజలు తమ అభిప్రాయాలను నిర్భయంగా వెల్లడి చేయగలుగుతున్నారంటే, ఈ సంస్థల కృషి ఫలితమే.

**Lowell** : లావెల్ మాటలలో రాజకీయ పార్టీల "ముఖ్య ధర్మము వాటి మనుగడకు వాస్తవమైన హేతువు ప్రజాభిప్రాయాన్ని వెలుగులోకి తీసుకువచ్చి ప్రజల తీర్పుకోసం వివిధ సమస్యలను సరైన రీతిలో ప్రజలకు నివేదించడమే.

బహిరంగ వేదికలు : ఆధునిక ప్రజాస్వామ్యాలు తమ ప్రజలకు వాక్‌సభా స్వాతంత్ర్యాలను ప్రాథమిక హక్కులుగా గుర్తిస్తున్నాయి. రాజకీయ పార్టీలుగానీ లేక యితర సంస్థలుగానీ బహిరంగసభలు ఏర్పాటుచేసి ఆయా సంఘాల నాయకులు ఉపన్యాసాల ద్వారా ప్రజలను ప్రభావితం చేస్తారు. ప్రత్యక్షంగా ఉపన్యాసాలను విన్న ప్రజలు తాము వినిన సమాచారాన్ని మరొకరితో పంచుకోవడం కూడా జరుగుతుంది. అద్భుతమైన వక్తృత్వ నైపుణ్యంతో నాయకులు చేసే ప్రసంగాలు ప్రజల మనసులలో దృఢంగా నాటుకుంటాయి. ఇవి ప్రజలను తమ సమస్యల గురించి ఆలోచింపచేసి తగిన సమయంలో సమర్థంగా ప్రజల ద్వారా ప్రతిధ్వనింపజేస్తాయి. ఇటీవల కాలంలో క్యాసెట్లు, టేప్‌రికార్డర్ల వంటి సాధనాలు ఏర్పడడంతో ప్రజాభిప్రాయ రూపకల్పనలో బహిరంగ ఉపన్యాసాల పాత్ర ఎక్కువయింది.

విద్యా సంస్థలు : "కుటుంబమే ప్రథమ పౌరసత్వ బోధనాలయము" అంటారు అనగా చిన్నప్పటినుండే పౌరసమస్యల అవగాహనకు కుటుంబము శ్రీకారము చుట్టగా, వ్యక్తి పెరిగే కొలది క్రమానుగత శ్రేణిలో వున్న విద్యాసంస్థలు వ్యక్తిని తగురీతిగా చైతన్యపరుస్తాయి. విద్యా సంస్థలలో బోధించే సాధారణ విద్య వ్యక్తికి సమకాలిక, సాంఘిక, ఆర్థిక, రాజకీయ సమస్యలను గురించి చక్కని అవగాహనా సామర్థ్యాన్ని కల్గిస్తుంది. కాగా ఉన్నత విద్యాలయాలలో బోధనా ప్రక్రియ ఉపన్యాస పద్ధతిలో జరుగుతూ వుండటంవలన సందర్భోచితంగా అనేక సాంఘిక రాజకీయ విషయాలు కూడ ప్రస్తావనకు వస్తూ వుంటాయి. తత్ఫలితంగా విద్యార్థులు నిర్దిష్టమైన ప్రజా విషయాలకు సంబంధించి అభిప్రాయాలు ఏర్పరచుకోవడం, వెల్లడిచేయడం అందరికీ తెలిసినదే.

శాసన సభలు : శాసనసభలలో నిత్యమూ జరిగే చర్చలు, వాదోపవాదాలు వార్తాపత్రికలద్వారానూ, రేడియో, టెలివిజన్ ద్వారాను ప్రజలకు తెలుస్తూ వుంటాయి. వివిధ రాజకీయ పార్టీల సభ్యులు శాసనసభలలో చేసే ప్రసంగాలు ప్రజలకు ప్రచారసాధనాలద్వారా చేరుతాయి. ఉత్తేజకరం ఆలోచనాదాయకమూ అయిన శాసనసభ్యుల ప్రసంగాలు ప్రజలను ఆకట్టుకొని వారిపై బలమైన ప్రభావాన్ని చూపుతాయి. దీనివలన ప్రజలు విభిన్న విషయాలపై నిర్దిష్టమైన అభిప్రాయాలను ఏర్పరచుకుంటారు. ఇటీవల కాలంలో శాసనసభా కార్యక్రమాలను దూరదర్శన్‌లో కూడా ప్రసారం చేస్తున్నారు. తత్ఫలితంగా ప్రజాభిప్రాయం నిర్మాణాత్మకంగా రూపొంది వివిధరూపాలలో ప్రకటించబడుతున్నది. శాసనసభలు పెక్కు సందర్భాలలో ప్రజాభిప్రాయాన్ని రూపొందించడంకంటే ప్రతిధ్వనించడంలోనే విశిష్టమైన పాత్ర వహిస్తున్నాయి.

రేడియో, దూరదర్శన్ : రేడియో శ్రవణసాధనంకాగా, దూరదర్శన్ (Television) దృశ్యశ్రవణ సాధనము. అనంతమైన సమాచారాన్నీ, సన్నివేశాలనూ, సంఘటనలనూ ప్రజలముందు సాక్షాత్కరింపజేయడంలో రేడియో మరియు టెలివిజన్‌ల పాత్ర అద్భుతమైనది. చదువుకున్నవారిని, సామాన్యులనూ నిరక్షరాస్యులను కూడ ప్రభావితం చేయగల ఆధునిక ప్రసారసాధనాలు యివి. ఈనాడు ఈ

సాధనాలు కేవలం సమాచార, ప్రచార, వినోదాత్మక సాధనాలు మాత్రమే కాకుండా విద్యావ్యాప్తికి, పౌర విద్యా ప్రబోధానికీ కూడ ఎనలేని సేవలందిస్తున్నాయి. శ్రవణసాధనమైన రేడియోకు, విశ్వసనీయతను కలిగించే అవకాశం తక్కువ. కాగా దూరదర్శన్ జరుగుతున్న, జరిగిన సంఘటనలను సమాచారంగా రూపొందించి ప్రజలకు తమ ప్రసారాల ద్వారా ప్రత్యక్షానుభూతిని కలిగిస్తుంది. వీటిద్వారా ప్రసారమయే ధారావాహికలు (Serials) డాక్యుమెంటరీలు, వివిధ సంఘటనల నివేదికలు ప్రజలను ఆలోచింపజేసి అభిప్రాయ కల్పనకు దోహదం చేస్తాయి. వివిధ విషయాలపై ప్రజలు ఏమనుకుంటున్నారో కూడ రేడియో, దూరదర్శన్‌లు తమ కార్యక్రమాలలో అంతర్భాగంగా ప్రసారం చేస్తుంటాయి. దీని ప్రభావం వలన ప్రజాభిప్రాయ రూపకల్పన, ప్రజాప్రతిస్పందన, ప్రజాభిప్రాయం ప్రకటనలు వేగవంతమవుతున్నాయి. అంతేకాదు ఎన్నికల సమయాలలో దేశం నాలుగు చరగులను ఒకేచోటకు చేర్చి వేలాదిమైళ్ళ దూరంలో వున్న వ్యక్తులను సాంకేతిక పరికరాల సహాయంతో ఒక వేదికపైకి తెచ్చి వారిమధ్య చర్చలను నిర్వహించి అదే క్షణాన ప్రజలకు దర్శింప జేయడంలో దూరదర్శన్ ప్రసార సాధనంగా కొత్త పుంతలను తొక్కుతున్నది. వీటి ప్రభావం వలన ప్రజాభిప్రాయం బాధ్యతాయుతంగానూ విశ్వసనీయంగానూ రూపొందడమేగాకుండా విలక్షణంగా వ్యక్తం కావడానికి దోహదమవుతున్నది.

పైన పేర్కొన్న ప్రజాభిప్రాయ ప్రకటనా సాధనాలు మాత్రమేగాక పుస్తకాలు, కరపత్రాలు (Pamphlets) నాటకాలు, కచేరీలు, నివేదికలు వంటివి ఎన్నో ప్రజాభిప్రాయ రూపకల్పనలోను, ప్రకటనా విధానంలోను సాధనాలుగా ఉపకరిస్తాయి. ఈనాటి ప్రభుత్వ సాధనాలైన రేడియో, దూరదర్శన్‌లు, ప్రచార మాధ్యమాలైన (Mass Media) సినిమాలు, తదితర ప్రకటనలు (Advertisements) అనేక విధాలుగా ఆబాలగోపాలాన్ని ప్రభావితం చేస్తున్నాయి.

ప్రచార సాధనాలు - సమీక్ష : బ్రైస్ మహాశయుడు అన్నట్లు సామాన్య ప్రజానీకానికి రాజకీయాలపట్ల ఏమంత ఆసక్తి ఉండదు. కనుక వారిని ఆకర్షించి, ఉత్తేజపరచడానికి కొన్ని ప్రచారసాధనాలు అవసరమౌతాయి. 'వినోదం ద్వారా విజ్ఞానం' అనే నినాదానికి తగినట్లుగా ఈ ప్రచార సాధనాలు తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తిస్తాయి. వార్తా పత్రికలు, సినిమాలు వంటి సాధనాలు విద్యా, విజ్ఞాన, వినోదదాయకాలుగా ప్రజలను ప్రభావితం చేస్తున్నాయి. ప్రజాభిప్రాయ కల్పనకూ, ప్రజాస్వామ్య రక్షణకూ పత్రికలు సాధనాలు అయితే ప్రభుత్వం రూపొందించిన నియమనిబంధనలమేరకే అవి పనిచేయవలసి వస్తే, వాటివలన చేకూరే ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువ. అందువలన వ్యాపారస్థుల చేతులలోగానీ ప్రభుత్వం యొక్క చెప్పుచేతులలోగానీ వార్తాపత్రికలు నడిచినంతకాలం, వాటి ప్రయోజనం శూన్యమే అవుతుంది.

అలాగే ప్రభుత్వ యాజమాన్యంలో నడిచే రేడియో, దూరదర్శన్‌లు ప్రభుత్వ కార్యక్రమాల ప్రచార సాధనాలుగా పనిచేయగలవే కానీ ప్రజా ప్రయోజనాలకై తమవంతు కృషిని సల్పలేవు. 'స్వావలంబన' ప్రాతిపదికగా ఇవి పనిచేయవలసివస్తే, వాణిజ్య, రాజకీయ ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయానికే అర్రులు చాచవలసి వస్తుంది. దీనివలన ప్రజా ప్రయోజనం సిద్ధించదు.

రాజకీయ పార్టీలను ప్రజాస్వామ్యానికి వెన్నెముకగా భావిస్తాం. రాజకీయాధికారాన్ని ఏ విధంగానైనా చేజిక్కించుకోవాలని తహతహలాడు పార్టీలు నిజానికి ప్రజాభిప్రాయాన్ని వక్రీకరించే రీతిలో పనిచేస్తాయి. నీతి నిజాయితీకి కట్టుబడిన పార్టీలు ఆర్థిక దుర్బలత వలన ఆకర్షణీయంగా ప్రజలను ఆకట్టుకొనలేక 'అరణ్య రోదనం' వలె మనుగడ సాగిస్తుంటాయి. పాలక పక్షానికి అండదండలూ, హంగులు ఉంటాయి. పైగా ప్రభుత్వాధీనంలో వుండే ప్రసార సాధనాల పరోక్ష సహకారం అందుతుంది. ఈనాడు జరుగుతున్నదీ అదే. ఈ పరిస్థితులలో ప్రజాభిప్రాయ రూపకల్పన, ఏమేరకు విశ్వసనీయమో ఊహించుకొనవచ్చు.

ప్రజాభిప్రాయాన్ని సేకరించడంలో ఇటీవలకాలంలో గొప్ప మార్పులు వచ్చాయి. సామాజిక మనస్తత్వ శాస్త్రవేత్తలు, రాజనీతి శాస్త్రవేత్తల సంయుక్త కృషి ఫలితంగా నమూనా అభిప్రాయ సేకరణ (Opinion Sampling), కోటా నమూనా (Quota Samping) ప్రాంతీయ నమూనా (Area Sampling), ఊహాత్మక నమూనా (Porbability Sampling), నమూనా పోలింగ్ (Sample Polling) ఓటింగ్ ప్రవర్తనా సరళి అధ్యయనాలు (Voting Behaviour Studies) వంటి నూతన పరిశోధనాత్మక ప్రయోగాల సహాయంతో ప్రజాభిప్రాయాన్ని వీలైనంత నిర్దిష్టంగా మాపనము (Measurement) చేయడానికి కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రవర్తనా శాస్త్రాల పరిశోధనలో (Behavioural Sciences) ప్రజాభిప్రాయం, ప్రసారసాధనాల రంగాలు కొత్త పుంతలు తొక్కుతున్నవి.

## ఉపయుక్త గ్రంథాలు


1) రాజనీతి శాస్త్రం - భావనలు, సిద్ధాంతాలు : తెలుగు అకాడమీ, హైద్రాబాద్.

2) Political Science - Concepts, Theories : KR Acharya, Ravindra, Vijaya Raghava & Bhogendra Chand & Co., Delhi.

# విషయ సూచిక

5ఎ. రాజ్యం యొక్క విధులు - సైద్ధాంతిక అభిప్రాయాలు 5ఎ.1 - 5ఎ.6

(సిలబస్ ప్రకారం ఈ పాఠము 5ఎ. అయినప్పటికి, పేపరు IV (A) మొదటి భాగంలోని విషయ సూచిక ప్రకారం పాఠం - 8ఎ అవుతుంది.)

7సి. స్వాతంత్ర్యము - వ్యక్తి శ్రేయోవాదము, సామ్యవాదము, ఆదర్శవాదము, అధికార వాదము 7సి.1 - 7సి.10

(సిలబస్ ప్రకారం ఈ పాఠము 7సి. అయినప్పటికి, పేపరు IV (A) మొదటి భాగంలోని విషయ సూచిక ప్రకారం పాఠం - 12ఎ అవుతుంది.)

10ఎఇ. ప్రతిపక్షాలు - పాత్ర 10ఎఇ.1 - 10ఎఇ.6

(సిలబస్ ప్రకారం ఈ పాఠము 10ఎ.ఇ. అయినప్పటికి, పేపరు IV (A) మొదటి భాగంలోని విషయ సూచిక ప్రకారం పాఠం - 20ఎ. అవుతుంది.)

12బి. రాజకీయ పార్టీలు నిర్వహించే పాత్ర 12బి.1 - 12బి.5

(సిలబస్ ప్రకారం ఈ పాఠము 12బి. అయినప్పటికి, పేపరు IV (A) మొదటి భాగంలోని విషయ సూచిక ప్రకారం పాఠం - 24ఎ. అవుతుంది.)

14వ పాఠం మొదటి భాగంలోనే ఇవ్వబడింది. దాని పాఠం నెంబరు 14.

15వ పాఠం మొదటి భాగంలోనే ఇవ్వబడింది. దాని పాఠం నెంబరు 13.

16. రాజ్యాంగము - రాజ్యాంగాలలోని వివిధ రకాలు సవరణ పద్ధతి. 16.1 - 16.7

(సిలబస్ ప్రకారం 16వ పాఠం అయినప్పటికి, పేపరు IV (A) మొదటి భాగములోని విషయ సూచిక ప్రకారం పాఠం 26 అవుతుంది.)

ము - 5ఎ

# రాజ్యము యొక్క విధులు - సైద్ధాంతిక అభిప్రాయాలు

0 లక్ష్యం :

ఈ భాగం చదివిన తరువాత విద్యార్థులు ఈ క్రింది విషయాలు తెలుసుకుంటారు.

- రాజ్యము యొక్క విధులు
- రాజ్యము యొక్క విధులకు సంబంధించిన అనేక రకాల రాజకీయ సిద్ధాంతాలు
- ఉడ్రోవిల్సన్ ప్రతిపాదించిన రాజ్యవిధులు

షయసూచిక


5ఎ.1 రాజ్యము యొక్క అవసరము ఏమిటి ?
5ఎ.2 రాజ్యం - విధులపై రాజకీయ సిద్ధాంతాలు
5ఎ.3 రాజ్యము - విధులు
5ఎ.4 రాజ్యం నిర్వహించకూడని విధులు
5ఎ.5 సారాంశము
5ఎ.6 నమూనా ప్రశ్నలు
5ఎ.7 చదువదగిన గ్రంథాలు


## ఎ.1 రాజ్యము యొక్క అవసరము ఏమిటి (What is the purpose of the State) :

రాజ్యం యొక్క అవసరము ఏమిటి ? అనే విషయంలో రాజనీతి సిద్ధాంతవేత్తల మధ్య ఏకాభిప్రాయం లేదు. ఏకాభిప్రాయం పోవడమే కాకుండా, దీనిపై పరస్పరం వైరుధ్యం ఉన్న భావాలను వారు వెలిబుచ్చారు. ఈ విరుద్ధ భావాలను మౌలికంగా డు ప్రధాన భావాలుగా విభజించవచ్చును. మరో విధంగా చెప్పాలంటే రాజ్యానికి, వ్యక్తికి మధ్య ఉన్న సంబంధం ఏమిటి ? నే విషయంలో రెండు ప్రధాన వాదనలు ప్రతిపాదించబడ్డాయి. అవి

1) రాజ్యం అవసరంలేదు అనే వాదము.
2) రాజ్యం తప్పనిసరిగా ఉండాల్సిందే అనే వాదము.

దీనిలో మొదటి దానిని 'అరాచకవాద సిద్ధాంతము' అని పిలుస్తారు. రెండవదానిని రాజ్యఅవసర సిద్ధాంతము అని పిలుస్తాము.

రాజ్యం తప్పనిసరిగా వుండాల్సిందే అనే సిద్ధాంతాన్ని అమోదించే వారిలో కూడా అనేక సైద్ధాంతిక బేధాలు వున్నాయి.

వి :

1) వ్యక్తియే గమ్యం - రాజ్యం కేవలం మార్గం మాత్రమే అనే వాదము
2) రాజ్యమే గమ్యం - వ్యక్తి కేవలం మార్గం మాత్రమే అనే వాదము.
3) రాజ్యానికి చాలా ఎక్కువ అధికారాలుండాలి అనే వాదము.
4) వ్యక్తికి అత్యంత ఆనందాన్ని ఇవ్వడానికి అవసరమైనంత వరకే రాజ్యానికి అధికారాలుండాలి అనే వాదము.
5) మానవాళి సంక్షేమాన్ని కల్గించడము, మానవ నాగరికతను పెంపొందించుకోవటం కోసమే రాజ్యానికి అధికారాలుండాలనే వాదము.

ఈ వాదాల గురించి క్లుప్తముగా తెలుసుకుందాము.

### 5ఎ 1.1. రాజ్యం అవసరం లేదు (There is no need for the state) :

దీనిని అరాచకవాదము లేదా (Anarchism) అని పిలుస్తారు. అరాచక వాదానికి ఆద్యుడనదగిన పీటర్ క్రోపోట్కిన్ మాటలలో చెప్పాలంటే "రాజ్య ఉనికిని సమర్థించడానికి ప్రాకృతిక లేదా సహజ (Natural) లేదా చారిత్రక కారణాలు అంటూ ఏమీ లేవు. మానవాభ్యుదయానికి రాజ్యంకన్నా పెద్ద అడ్డంకి అంటూ మరేదీ లేదు". రాజ్యం ప్రజలకు శత్రువు. మానవుడు స్వభావసిద్ధంగా సహకార జీవన వాంఛని కల్గివుంటాడు. మానవులు వారి విషయాలను వారే చక్కదిద్దుకోగల్గుతారు. ఈ విషయంలో వారికి రాజ్యం యొక్క సహాయం ఏమీ అవసరం లేదు. రాజ్యమనే యంత్రాంగం మానవ సహజమయిన సహకార భావనను చంపివేసి, వారిని క్రూరులుగా, నేరస్తులుగా తయారు చేస్తుంది. కాబట్టి రాజ్యం అనేది రూపుమాపబడవలసిందే.

### 5ఎ 1.2 రాజ్యం క్షీణించిపోతుంది (State must wither away) :

ఇది కార్ల్‌మార్క్స్, ఫ్రెడరిక్ ఏంజెల్స్‌ల వాదన. రాజ్యం అనేది ఎప్పుడూ దోచుకునే వర్గాల చేతులలో ఒక సాధనం. శ్రమ దోపిడీ యధేచ్ఛగా సాగడానికి ఇది ఉపయోగపడుతూ వుంటుంది. వర్గపోరాటం జరిగి, శ్రామికవర్గం చేతిలోకి అధికారం వచ్చిన తరువాత దోపిడీ అంతరించిపోతుంది. దానితో అప్పటిదాకా దోపిడీకి ఒక సాధనంగా ఉపయోగపడిన అవసరంలేని వ్యవస్థగా మారిపోతుంది. సమాజం సోషలిస్టు సమాజంగా మార్పు చెందుతున్నపుడు రాజ్యం క్రమంగా బలహీనమైపోతుంది. క్రమంగా క్షీణించి, క్షీణించి చివరకు అంతరించిపోతుంది.

### 5ఎ 1.3 రాజ్యం అవసరమయిన సంస్థ (State is a compulsory Institution) :

రాజ్యం అవసరం లేదు అనే భావనను చాలామంది అంగీకరించరు. వీరి అభిప్రాయంలో రాజ్యం తప్పనిసరిగా ఉండవలసిన సంస్థ. వ్యక్తి వికాసానికి, సామాజిక వికాసానికి రాజ్యం అవసరము. అయితే, రాజ్యం అవసరమేనని వీరు అంగీకరించినప్పటికీ, రాజ్యానికి అధికారం ఎంతవరకు ఉండాలి ? రాజ్యం ఏ ఏ విషయాలలో ఎంతమేరకు జోక్యం చేసుకోవచ్చు ? అనే విషయాలలో మాత్రం వీరిలో ఏకాభిప్రాయంలేదు. వీరి వాదనలు క్రింద వివరించబడ్డాయి.

### 5.ఎ.2. రాజ్యం - విధులపై రాజకీయ సిద్ధాంతాలు :

### 5ఎ 2.1 వ్యక్తి లక్ష్యం - రాజ్యం మార్గం (The Individual is an end and the state is means) :

వ్యక్తుల యొక్క ఆనందం, వారి సంక్షేమం అత్యున్నతమైన లక్ష్యమని, ఆ లక్ష్యాన్ని సాధించడానికి రాజ్యం కేవలం మార్గమని వీరు వాదిస్తారు. జాన్ స్టూవర్ట్‌మిల్, హెర్బర్ట్ స్పెన్సర్, ఆడమ్ స్మిత్ వంటివారు ఈ వాదనకు ఆద్యులు. వీరందరూ వ్యక్తికి అత్యున్నత స్థానాన్ని ఇచ్చారు. అంతేకాకుండా రాజ్యం అనే సంస్థ, వ్యక్తి సంక్షేమానికి లోబడి వుండాలని వాదించ (State is subordinate institution to the individuals) వీరి సిద్ధాంతంలో రెండు భావనలు చాలా కీలకమయినవి. అవి :

1. సాధ్యమయినంత తక్కువ విధులకు రాజ్యం పరిమితం కావాలి.
2. వ్యక్తులకు సాధ్యమయినంత ఎక్కువ స్వేచ్ఛ కావాలి.

ఈ విధమైన వాదనను ముందుకు తీసుకువచ్చారు. కనుకనే వీరిని వ్యక్తివాదులని లేదా వ్యక్తి శ్రేయోవాదులని పిలుస్తారు.

వీరి అభిప్రాయం ప్రకారం రాజ్యం ఒక చెడ్డ (Evil) సంస్థ. అయితే అది అవసరమైన చెడ్డసంస్థ (Necessary Evil) ; సమాజంలో ఎదురయ్యే ప్రమాదాల నుండి సమాజంలో కొందరు చెడ్డ వ్యక్తుల నుండి ప్రజలను రక్షించడానికి మాత్రమే అది అవసరం. (దీనిని శాంతిభద్రతల నిర్వహణ అని అంటాము)

విదేశీ దండయాత్రల నుండి సమాజాన్ని, ప్రజలను రక్షించటం కూడా దీని బాధ్యతే. అయితే, రక్షించటం అనే బాధ్యతను ర్వహించటం తప్పనిస్తే, అది ప్రజల వ్యక్తిగత వ్యవహారాలలో జోక్యం కలుగచేసుకోవడానికి కాని, వారి అభివృద్ధికి ఆటంకముగా యారయ్యే విధులను చేపట్టటంకాని చేయకూడదు. జాన్ స్టూవర్ట్ మిల్ మాటలలో చెప్పాలంటే ఏ రాజ్యమయితే వ్యక్తుల వ్యవహారాలలో అతి తక్కువ జోక్యం చేసుకుంటుందో అదే మంచి రాజ్యము.

**ఎ 2.2. రాజ్యము లక్ష్యము - వ్యక్తి ఆ లక్ష్యానికి మార్గము** (The State is an end tne individual is a means to he end) :

పై సిద్ధాంతానికి ఇది పూర్తిగా భిన్నమైన సిద్ధాంతము. దీనిని "ఐడియలిస్ట్ వ్యూ" అని "ఐడియాలిస్ట్ సిద్ధాంతము" అని డా పిలుస్తారు. ఈ సిద్ధాంతం ప్రకారం రాజ్యం అన్ని విధాలకు మూలం. విధి నిర్వహణే దాని బాధ్యత. రాజ్యం దాని విధులు అది సక్రమంగా నిర్వహించటానికి వ్యక్తులు కేవలం మార్గం మాత్రమే. వ్యక్తులకు సంబంధించిన అన్ని విధులను సక్రమంగా ర్వర్తించటమనేది రాజ్యం యొక్క విధి. అది సర్వశక్తివంతము. నిర్నిరోధమైన అధికారం దాని సొంతం. సమాజక్షేమమే దాని కైక ధ్యేయం. దాని ధ్యేయాన్ని సాధించడానికి అది వ్యక్తుల జీవితాలను అన్ని రంగాలలోను నియంత్రిస్తూ ఉంటుంది. అంటే తివ్యక్తి యొక్క రాజకీయ ప్రవర్తన, సాంఘిక ప్రవర్తన, ఆర్థిక ప్రవర్తన, ఆధ్యాత్మిక ప్రవర్తనలు రాజ్యంచేత నియంత్రించబడుతూ ంటాయి. ఈ సిద్ధాంతానికి తొలి ప్రవక్తగా భావించబడే హెగెల్ మాటలలో చెప్పాలంటే "భూమిపై దేవునియొక్క రూపమే జ్యం. సామాజిక చైతన్యానికి అతి ప్రతినిధి. రాజ్యానికి బద్ధులమై వుండటమంటే, తనకు తాము బద్ధులమై వుండటమే" Friedrich Hegel : "The State is the march of God on earth. It represents the social consciousness and to obey he state is to obey your best self") థామస్ హిల్‌గ్రీన్ మాటలలో చెప్పాలంటే "రాజ్యానికి వెలుపల వ్యక్తులకు ఎటువంటి స్థానమూ లేదు. ఒక వ్యక్తి యొక్క వ్యక్తిత్వం పూర్తిగా వికసించాలంటే రాజ్యము తప్పనిసరి". (Thomas Hill Green : "The ndividuals have no place outside the state. The state is indispensable to the fullest growth of personality of an".) ఈ సిద్ధాంతము ప్రకారము వ్యక్తులు రాజ్యం ద్వారా మాత్రమే లాభాలు పూర్తిగా పొందగల్గుతారు. కాబట్టి వారు జ్యానికి పూర్తిగా విధేయులై ఉండాలి. వ్యక్తి, రాజ్యంతో మమైకమైపోవాలి. రాజ్యానికి దూరంగా, రాజ్యానికన్నా భిన్నంగా వ్యక్తికి స్థానం లేదు అన్న భావన పెంపొందించుకోవాలి. రాజ్యము చేసే ప్రతిపని వ్యక్తుల శ్రేయస్సుకొరకేనని వ్యక్తులు గుర్తించాలి. వ్యక్తుల నిజమైన స్వేచ్ఛ రాజ్యము యొక్క రక్షణలోనే సాధ్యమని గుర్తించాలి.

(ఈ సిద్ధాంతాన్ని జర్మనీలో నాజీపార్టీ, ఇటలీలో ఫాసిస్టులు తమ ఆధిపత్యానికి ఉపయోగించుకొన్నారు. రాజ్యం వ్యక్తి కాంక్ష యొక్క బాహ్యరూపం అనే నినాదం సహాయంతో ఆ రెండు పార్టీలు తమ నిరంకుశ పాలనా విధానాలకు సైద్ధాంతిక ధారాన్ని సంపాదించాయి. అందుచేతనే ఈ సిద్ధాంతం క్రమంగా తన పలుకుబడిని పోగొట్టుకొన్నది.)

**ఎ 2.3 రాజ్యం విధులపై సోషలిస్టు సిద్ధాంత దృక్పథం** (Socialist View on functions of state) :

మార్క్సిస్టు సిద్ధాంతంతో విభేదించే సోషలిస్టు సిద్ధాంతాలన్నీ రాజ్యానికి చాలా ఎక్కువ అధికారాలు కావాలని వాదిస్తాయి. వ్యక్తి వికాసానికి ఆర్థిక సంపత్తి, ఆ ఆర్థికసంపత్తిని వ్యక్తి కల్గివుండటం చాలా అవసరం. సమాజంలోని వ్యక్తులందరూ ఆర్థికసంపత్తిని కల్గి వుండాలంటే, ఆ ఆర్థిక సంపత్తిమీద రాజ్యానికి హక్కు అవసరం. ఆర్థికసంపత్తి పై హక్కు, రాజ్యానికి కాకుండా, వ్యక్తులకుంటే అది క్రమేణా ఆర్థిక గుత్తాధిపత్యానికి దారితీస్తుంది. ఆర్థిక గుత్తాధిపత్యం కొందరు వ్యక్తులు అనేక మూఢవ్యక్తుల శక్తిని దోచుకోవటానికి దారితీస్తుంది. ఈ దోపిడీని నివారించాలంటే, ఆర్థిక సంపదను సమాజమంతా అనుభవించాలంటే, రాజ్యానికి ఆర్థిక అధికారాలతో పాటు, మిగిలిన అధికారాలు కూడా అవసరం. వస్తువులలో అధిక భాగాన్ని రాజ్యమే ఉత్పత్తి చేయాలి. రాజ్యమే పంపిణీ చేయాలి. వ్యక్తులచేత లేదా పెట్టుబడిదారులచేత ఉత్పత్తి చేయబడే వస్తువుల మీద కూడా రాజ్యానికి నియంత్రణ ఉండాలి.

## 5ఎ 2.4 రాజ్యవిధుల ఉపయోగితావాద దృక్పథం (Utilitarian view on the Functions of the State) :

జెర్మి బెంథామ్ వంటి ఉపయోగితాలు వ్యక్తికి గరిష్ఠస్థాయిలో ఆనందాన్ని, సంతోషాన్ని ఇవ్వటమే రాజ్యంయొక్క ప్రధాన విధి అని భావించారు. బెంథామ్ మాటలలో చెప్పాలంటే, "చాలా ఎక్కువమందికి, చాలా ఎక్కువ సంతోషం అనేది రాజ్యం యొక్క ప్రధాన లక్ష్యంగా ఉండాలి" (Jeremy Bentham : "Greatest happiness of the greatest number should be the aim of purpose of the state") "రాజ్యం అనే రాక్షసుడి ముక్కుకి తాడుకట్టి వాడిని లొంగదీసుకొని కట్టడి చేయాలంటే ఏకైక మార్గం ఎక్కువమందికి ఎక్కువ సంతోషమనే సూత్రాన్ని రాజ్య లక్ష్యంగా చేయటమే. అప్పుడే రాజ్యం 'ఉపయోగిత' అనే బండికి కట్టివేయబడి, ఆ బండిని లాగుతుంది" అని ఫ్రెడరిక్ పోలాక్ అనే రచయిత అభిప్రాయపడ్డాడు.

(Frederick Pollock : "The formula of greatest happiness of greatest number can be made a hook to put in the nostrils of the monster of the state, that he may be famed and barnessed to the chariot of utility").

వీరి అభిప్రాయంలో ఒక రాజ్యం అవసరమా ? లేదా ? అన్న ప్రశ్నకు ఏకైక గీటురాయి. "ఆ రాజ్యం ప్రజల కెంత వరకు సంతోషాన్ని కలుగజేస్తుంది ? అని ప్రశ్నించుకోవటమే. రాజ్యం చేసే ప్రతి పనిని పై ప్రశ్న సహాయంతోనే పరీక్షించాలి.

## 5ఎ 2.5 రాజ్యవిధులపై సంక్షేమ సిద్ధాంత దృక్పథం (Welfare theory view on functions of the state) :

వ్యక్తి శ్రేయోవాదానికి, సామ్యవాదానికి ఇది మధ్యే మార్గము. రాజ్యం అవసరమైన చెడు అని వ్యక్తి శ్రేయోవాదులు; అన్ని అంశాలపై రాజ్యానికి నియంత్రణ ఉండాలి అన్ని సామ్యవాదులు వాదిస్తారని ఇంతకుముందే మనం తెలుసుకొని ఉన్నాము. సంక్షేమ సిద్ధాంతకారులు మధ్యేమార్గంగా, రాజ్యానికి మూడు ప్రధాన విధులున్నాయని భావిస్తారు. అవి :

1) రాజ్యం ప్రజలకు సంక్షేమాన్ని ఇవ్వగలగాలి
2) వ్యక్తులను, ఒక మానవ సమూహంగా భావించి (Collective) ఆ సమూహాపు సంక్షేమానికి ప్రాధాన్యతనివ్వాలి. ఒక వ్యక్తి సంక్షేమం కొరకే, కొందరు వ్యక్తుల సంక్షేమం కొరకో రాజ్యం పనిచేయకూడదు
3) ప్రజల నాగరికతా ప్రమాణాన్ని పెంపొందించటానికి రాజ్యం ప్రయత్నించాలి.

## 5ఎ 3. రాజ్యము విధులు :

సైద్ధాంతిక భావాల గురించి తెలుసుకున్న తర్వాతే, ఏ రాజ్యమైనా సాధారణంగా నిర్వర్తించవలసిన విధుల గురించి ఇప్పుడు మనం తెలుసుకోబోతున్నాము. రాజ్యం నిర్వర్తించే విధులను రెండు రకాలుగా విభజిస్తారు. అవి :

1) తప్పనిసరిగా నిర్వర్తించవలసిన విధులు,
2) అవకాశమున్నప్పుడు నిర్వర్తించవలసిన విధులు లేదా వైకల్పిక విధులు

మొదటిరకపు విధులను ప్రతిరాజ్యము ఎటువంటి పరిస్థితులలోనైనా నిర్వర్తించి తీరవలసిందే. రెండవ రకపు విధులను, రాజ్యము, తనకు అవకాశము, స్థోమత ఉంటే నిర్వహిస్తుంది లేకపోతే నిర్వర్తించదు. అయితే ప్రతి రాజ్యము కూడా ఈ రెండవ రకానికి చెందిన విధులను నిర్వర్తించటానికి శాయశక్తులా కృషి చేయాలి.

## 5ఎ 3.1 తప్పనిసరిగా నిర్వర్తించవలసిన విషయం (Essential of Compulsory Functions) :

ఒకప్పటి అమెరికా అధ్యక్షుడు, రాజనీతి శాస్త్రవేత్త ప్రభుత్వపాలనాశాస్త్ర పితామహుడు అయిన ఉడ్రోవిల్సన్ అభిప్రాయములో ఈ క్రింది విధులను రాజ్యం తప్పనిసరిగా నిర్వహించాలి.

1. శాంతి భద్రతలను పరిరక్షించటం; హింస నుండి, దోపిడీ నుండి ఆస్తిని ప్రాణాలను రక్షించటం.
2. భార్యాభర్తల మధ్య, తల్లిదండ్రులు, పిల్లలమధ్య న్యాయపరమైన సంబంధాలను నిర్దారించటం;
3. ఆస్తిని కల్గివుండటం, మార్పిడి చేయటం, మారకం చేయటం వంటి విషయాలపై నియంత్రణను నిర్వచించటం. అప్పు పడినపుడో, నేరం చేసినపుడో ఆస్తిపాస్తులను ఏమి చేయాలన్న విషయాలను నిర్ధారించటం.
4. వ్యక్తుల మధ్య ఉండాల్సిన హక్కులను, సంబంధాలను నిర్ధారించటం.
5. నేరాన్ని, శిక్షను నిర్వచించటం.
6. సివిల్ కేసులలో న్యాయాన్ని అమలు చేయటం,
7. రాజకీయ బాధ్యతలను ప్రత్యేక హక్కులను నిర్ధారించటం,
8. ఇతరదేశాలతో సంబంధ, బాంధవ్యాలతో నెరపటం, దేశాన్ని విదేశీదాడి నుండి పరిరక్షించటం.

ఉడ్రోవిల్సన్ ప్రతిపాదించిన ఈ "తప్పనిసరి విధుల జాబితా"ను చాలామంది ఆమోదించరు. ఇది కేవలం అమెరికా వంటి పెట్టుబడిదారి రాజ్యాలకే వర్తించే జాబితా అని వారు విమర్శిస్తారు. వారి అభిప్రాయంలో ఉడ్రోవిల్సన్ పేర్కొన్న విధులతోపాటు ఈ క్రింది పేర్కొన్న విధులు కూడా రాజ్యం తప్పనిసరిగా నిర్వర్తించవలసిన విధులే.

1) ప్రజల మధ్య ఆర్థిక అంతరం పెరగకుండా చూడటం;
2) ప్రజలందరికి కనీస విద్యా, వైద్య సౌకర్యాలను అందజేయటం,
3) జాతి పేరున, మతం పేరున, జన్మ పేరున సాగే వివక్షతలను రూపుమాపటం.

## 5ఎ 3.2 వైకల్పిక విధులు (Non - Essential or Optional Functions) :

ఉడ్రోవిల్సన్ అభిప్రాయములో ఈ క్రింద పేర్కొన్న విధులు వైకల్పిక విధులు

1) వాణిజ్యాన్ని, పరిశ్రమలను, కరెన్సీని, తూకాలు, కొలతలను, నౌకాయాన్ని నియంత్రణ చేయటం,
2) కార్మిక శక్తిని నియంత్రించటం,
3) రహదారులను, వార్తా సౌకర్యాలను నిర్వహించటం
4) పోస్టల్, టెలిగ్రాఫ్ వ్యవస్థలను నిర్వహించటం,
5) విద్య
6) బీదలను, అంగవైకల్యం ఉన్నవారిని సంరక్షించటం మొదలయినవి
7) అడవులను, నదులను రక్షించటం

పై జాబితాలో ఏవయితే వైకల్పిక విధులుగా గుర్తించబడ్డవో వాటిని చాలా ఆధునిక రాజ్యాలు తప్పని పరివిధాలుగా భావించి నిర్వహించటం గమనించవచ్చు. దీనికి కారణాలు రెండు. అవి :

1) ఉడ్రోవిల్సన్ విధుల జాబితా పూర్తిగా పెట్టుబడిదారి సమాజాలకు సంబంధించింది,
2) ఈ జాబితా చాలా పురాతన జాబితా.

పై రెండు కారణాల వలన విద్య, ఆరోగ్యం, పోస్టల్ సర్వీసుల వంటివి వైకల్పిక జాబితాలో చేరినవి. నేటి ప్రపంచంలో సంక్షేమ రాజ్యాలన్నీ ఉడ్రోవిల్సన్ పేర్కొన్న కొన్ని వైకల్పిక విధులను, తప్పనిసరి విధులుగా నిర్వహిస్తూ వున్నాయి.

## 5ఎ.4 రాజ్యం నిర్వహించకూడని విధులు (Functions that are excluded from the preview of the functions of the state) :

ఆర్.ఎమ్. మైకేవర్ అనే రాజనీతి శాస్త్రజ్ఞుని అభిప్రాయములో ఈ క్రింది విధులను రాజ్యం నిర్వర్తించకూడదు.

1) వార్తా సాధనాలను రాజ్యము నియంత్రించకూడదు.
2) ప్రజాభిప్రాయానికి భిన్నంగా ఏవిధమైన చర్యలు చేపట్టకూడదు.
3) రాజకీయ పార్టీలపై ఆంక్షలు విధించే ప్రయత్నంకాని, వాటిని మరోవిధంగా నియంత్రించే ప్రయత్నంకాని చేయకూడదు.
4) అమానుషమయినదయితేనే లేదా దేశానికి ప్రమాదం కొనితెచ్చేది అయితేనోతప్ప ప్రజల సంప్రదాయాలకు, సంస్కృతికి సంబంధించిన విషయాలలో ప్రమేయం కల్పించుకోకూడదు.

## 5ఎ 5. సారాంశము :

రాజ్యము ఏ విధులు నిర్వహించాలి, ఏ విధులు నిర్వహించకూడదు అనేది చాలా వివాదాస్పదమయిన విషయంగానే ఉంటూ వచ్చింది. అరాచకవాదులు రాజ్యాన్ని, దాన్ని ఉనికినే తిరస్కరించారు. రాజ్యం అవసరమే అని వాదించిన వారు కూడా రాజ్యవిధుల విషయంలో ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. వ్యక్తి శ్రేయోవాదులు రాజ్యాన్ని 'అవసరమయిన చెడు'గా భావించి రాజ్యానికి చాలా తక్కువ విధులుండాలని భావిస్తే, సామ్యవాదులు రాజ్యానికి చాలా ఎక్కువ విధులుండాలని, ఆ విధుల సహాయంతో రాజ్యం ఆర్థిక అంతరాలను తగ్గించాలని వాదించారు. ఉపయోగితావాదులు సమాజంలోని వ్యక్తులు గరిష్ఠ స్థాయి ఆనందానికి - రాజ్యవిధులకు సంబంధం ఉండాలని వాదిస్తే, సంక్షేమవాదులు సమాజ సంక్షేమాన్ని సాధించగలిగే విధంగా అవసరమయిన విధులు రాజ్యానికుండాలని భావించారు. ఉడ్రోవిల్సన్ రాజ్యవిధులను తప్పనిసరి. వైకల్పిక విధులు అని రెండు రకాలుగా గుర్తించాడు. ఉడ్రోవిల్సన్ జాబితాను అంగీకరించారు. కొన్ని విధులను చేర్చి మరింత మరింత మెరుగైన విధుల జాబితాను గుర్తించటానికి ప్రయత్నించారు.

## 5ఎ.6 నమూనా ప్రశ్నలు :

1) రాజ్యవిధులపై ఒక సమగ్రమైన వ్యాసాన్ని వ్రాయండి.
2) రాజ్య విధులపై, వివిధ రాజనీతి సిద్ధాంతములు వెలిబుచ్చిన అభిప్రాయాలను సవివరంగా వ్రాయండి.
3) రాజ్యవిధులపై వివిధ సైద్ధాంతిక బేధాలను వివరిస్తూ, రాజ్యం తప్పనిసరిగా నిర్వర్తించవలసిన విధులను చర్చించండి.
4) ఉడ్రోవిల్సన్ తయారు చేసిన విధుల జాబితాపై ఒక విమర్శనాత్మక వ్యాసాన్ని వ్రాయండి.

## 5ఎ.7 చదువదగిన గ్రంథాలు :


1. రాజనీతి శాస్త్రము - ఆచార్య కె. సుభాష్‌చంద్రరెడ్డి
శ్రీ కె. ఆదిశేషయ్య
2. రాజనీతి శాస్త్రము (ప్రాథమిక సూత్రాలు) - శ్రీ కె. రామచంద్రయ్య
శ్రీ ఎన్.హెచ్. సీతారామశర్మ
3. రాజనీతి సిద్ధాంతము, సంస్థలు - డా॥ వి.కృష్ణారావు, శ్రీ వి. సత్యనారాయణ

పాఠము - 7 సి

# స్వాతంత్ర్యము వ్యక్తి శ్రేయోవాదము - సామ్యవాదము, ఆదర్శవాదము, అధికారవాదము

**లక్ష్యం :**

ఈ పాఠ్యభాగాన్ని చదివిన తరువాత విద్యార్థులు ఈ క్రింది విషయాలు తెలుసుకుంటారు.

- వ్యక్తి శ్రేయోవాద సిద్ధాంతము
- వ్యక్తి శ్రేయోవాద సిద్ధాంతాన్ని బలపరిచే సిద్ధాంతాల
- శ్రేయోవాద సిద్ధాంతము - విమర్శ
- సామ్యవాదము (సోషలిజం) - విమర్శ
- సామ్యవాదము - లక్షణాలు
- ఆదర్శవాదము స్వాతంత్ర్యము
- ఆదర్శవాదము - లక్షణాలు
- ఆదర్శవాదము - విమర్శ
- అధికారవాదము (ఫాసిజం)
- అధికార లక్షణాలు మొదలగునవి

**విషయసూచిక :**


**7సి.0** పరిచయం

**7సి1** వ్యక్తి శ్రేయోవాద సిద్ధాంతము

**7సి.2** స్వాతంత్ర్యము దృష్టినుండి శ్రేయోవాద ముఖ్యలక్షణాలు

**7సి.3** వ్యక్తి శ్రేయోవాదాన్ని బలపరిచే సిద్ధాంతాలు

**7సి.4** వ్యక్తి శ్రేయోవాద సిద్ధాంతము - విమర్శ

**7సి.5** సామ్యవాదము - స్వాతంత్ర్యము

**7సి.6** సామ్యవాదపు చరిత్ర

**7సి.7** సామ్యవాదపు ముఖ్యలక్షణాలు

**7సి.8** ఆదర్శవాదము - స్వాతంత్ర్యము

**7సి.9** ఆదర్శరాజ్య లక్షణాలు

**7సి.10** ఆదర్శవాద సిద్ధాంతముపైవిమర్శ

**7సి.11** వ్యక్తి స్వాతంత్ర్యానికి ప్రమాదకంగా మారిన అధికారవాదము - ఫాసిజమ్

**7సి.12** అధికారవాదము లేదా ఫాసిజమ్ లక్షణాలు

**7సి.13** సారాంశము

**7సి.14** నమూనా ప్రశ్నలు

**7సి.15** చదువదగిన గ్రంథాలు

**7సి.0 పరిచయం :**

వ్యక్తిగత స్వాతంత్ర్యము మానవుని అస్థిత్వానికి, మనుగడకు ఆధారము. మానవుడు కేవలం ఏదో ఒక విధంగా బ్రతకడమేకాదు. సక్రమంగా జీవించాలని దీని అర్థం. వ్యక్తి తన శక్తిసామర్థ్యాలను పెంపొందించుకోవడానికి, తన జీవన పరిస్థితులు నిర్ణయించుకోవడానికి అతనికి సంపూర్ణ స్వాతంత్ర్యం అవసరం. ఈ విషయంలో ఇతర వ్యక్తుల ప్రవర్తనగాని, ప్రభుత్వ విధానాలుగాని ప్రతిబంధకాలు కాకూడదు. గిల్‌క్రైస్ట్ అభిప్రాయంలో "తన ప్రతిభా విశేషాలు ప్రదర్శించుకోవడానికి, తన జీవన పరిస్థితులు నిర్ణయించుకోవడానికి తన సంపూర్ణ స్వాతంత్ర్యంలేని మానవజీవితము నిరర్థకము".

రాజ్యావతరణ పైన జరిగిన చర్యల తరువాత, ఏ లక్ష్యాలను సాధించుకోవడానికి మానవుడు రాజకీయ సమాజంలో సభ్యుడుగా కొనసాగుచున్నాడు ? ప్రజలకు ఉత్తమ జీవనాన్ని కల్పించడానికి రాజ్యం ఏర్పడిందా ? రాజ్యకర్తవ్యాలు వేటికి పరిమితం కావాలి ? మొదలైన వాటిగురించి రాజనీతిశాస్త్రంలో చర్చలు ప్రారంభమైనాయి. రాజ్యకర్తవ్యాల గురించి అన్ని కాలాలలోనూ ఒకేవిధమైన అభిప్రాయం వ్యక్తం కాలేదు. కాలానుగుణంగా రాజ్యవిధుల గురించి అనేక సిద్ధాంతాలు ఏర్పడ్డాయి. వీటిలో ముఖ్యమైన వాటి గురించి క్రింద చర్చించబడింది.

రాజ్యకర్తవ్యాలకు, వ్యక్తి స్వాతంత్ర్యానికి మూడు ముఖ్యమైన సిద్ధాంతాలున్నాయి. అవి వ్యక్తిశ్రేయోవాద సిద్ధాంతం. అధికారవాద సిద్ధాంతం, ఆదర్శవాద సిద్ధాంతం.

**7సి.1 వ్యక్తి శ్రేయోవాద సిద్ధాంతం :**

వ్యక్తి శ్రేయోవాదము వ్యక్తికి సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని కల్పించడానికి ప్రభుత్వం పరిమితమైన విధులను మాత్రమే నిర్వహించాలని భావించింది. రాజ్యం వ్యక్తి విషయంలో ఎంత తక్కువగా జోక్యం చేసుకొంటే అంత ఎక్కువగా వ్యక్తికి స్వాతంత్ర్యం లభిస్తుందని వ్యక్తి శ్రేయోవాదులు వాదిస్తారు. ఈ వ్యక్తి శ్రేయోవాదము 'లేజెఫేర్' అనే ఫ్రెంచ్ పదం నుండి ఆవిర్భవించింది. "నన్ను నా దారిన వదలిపెట్టు" అని దీని అర్థం. జాన్‌లాక్, ఆడమ్‌స్మిత్, హెర్బర్ట్ స్పెన్సర్, బెంథామ్, జె.ఎస్.మిల్ ఈ సిద్ధాంతమును సమర్థించుకొన్న వారిలో ముఖ్యులు.

వ్యక్తి తనంతటతాను అభివృద్ధి చెందడానికి, వ్యక్తి విషయంలో రాజ్యం జోక్యం చేసుకోకుండా అతని దారిన అతనిని వదలివేయాలి అనేది వ్యక్తి శ్రేయోవాద ప్రధాన లక్ష్యం. వ్యక్తి అభివృద్ధికి కావలసిన స్వాతంత్ర్యాన్ని వ్యక్తికి సమాజం, ప్రభుత్వం, రాజ్యం కల్పించాలని వ్యక్తి శ్రేయోవాదులు వాదిస్తారు. ముల్లును తీయడానికి ముల్లు అవసరమైనట్లు, రాజ్యం కూడా వ్యక్తి స్వేచ్ఛావాదుల దృష్టిలో ఒక కంటకం వంటిది. మానవుడు పరిపూర్ణ దశకు చేరినంతవరకూ రాజ్యం కొనసాగుతుంది. విదేశీయుల దురాక్రమణ నుంచి రక్షణ, ఒకరికొకరు హాని కలిగించుకోకుండా రక్షణ కల్పించడం, వ్యక్తి నిర్బంధం, దొంగతనం మొదలగు భయాలనుండి రక్షణ కల్పించటం వంటివి రాజ్యం నిర్వహించవలసిన కర్తవ్యాలని వ్యకి శ్రేయోవాదుల ఉద్దేశ్యం.

**7సి.2 స్వాతంత్ర్యం దృష్టి నుండి శ్రేయోవాద ముఖ్య లక్షణాలు :**

పైన చర్చించిన రచయితల భావాలను పరిశీలించినట్లైతే వ్యక్తి శ్రేయోవాదం ఈ క్రింది లక్ష్యములను కలిగి వుంటుంది.

1. ప్రభుత్వ కార్యకలాపాలు చాలా బహుపరిమితంగా వుండాలి.
2. విదేశీదండయాత్రల నుండి రాజ్యాన్ని, ప్రజలను కాపాడాలి.
3. వ్యక్తుల పరస్పరం హాని చేసుకోకుండా చూడాలి.

4. ఆస్తిహక్కులను రక్షించాలి.
5. వ్యక్తి వికాసానికి రాజ్యం ఒక అడ్డంకి కాకూడదు.

## 7సి.3 వ్యక్తి శ్రేయోవాదాన్ని బలపరిచే సిద్ధాంతాలు :

వ్యక్తి శ్రేయోవాదులు తమ వాదాన్ని బలపరచుకోవడానికి ఆ క్రింది వాదాలను పేర్కొంటారు.

### 1. నైతిక వాదము :

వ్యక్తి శ్రేయోవాదాన్ని నైతిక దృక్పథంతో బలపరచిన వారిలో కాంట్. జె.యస్.మిల్ ముఖ్యులు. ప్రతి వ్యక్తికీ తన ఉన్నత ఆశయాలను సాధించుకోవడానికి తగిన స్వాతంత్ర్యం కావాలి. సంపూర్ణ స్వాతంత్ర్యం ఉన్నప్పుడే మానవుడు తన స్వశక్తిని, ఆత్మవికాసాన్ని పెంపొందించుకోగలుగుతాడు. అప్పుడే తన శక్తిసామర్థ్యాలను వినియోగించుకోగలుగుతాడు.

### 2. ఆర్థిక వాదము :

ఆడమ్‌స్మిత్, డేవిడ్ రికార్డో మొదలైన ఆర్థికశాస్త్రవేత్తలు వ్యక్తి శ్రేయోవాదాన్ని బలపరిచారు. రాజ్యనియంత్రణ, అజమాయిషీ లేనపుడు మాత్రమే వ్యక్తులు పూర్తి స్వాతంత్ర్యంతో ఉత్పత్తి ప్రక్రియలో పోటీపడతారు. ఆ పోటీవల్ల ఉత్పత్తి పెరుగుతుంది. ధరలు తగ్గుతాయి. అధిక లాభాపేక్షతో సంపదను వినియోగించడం జరుగుతుంది. జాతీయవాదం యినుమడిస్తుంది.

### 3. శాస్త్రీయ వాదము :

హెర్బర్ట్ స్పెన్సర్ అభిప్రాయంలో సాంఘిక జీవనానికి జీవపరిణామ శాస్త్రాన్ని అన్వయించాలి. బతుకు తెరువుకోసం జరిగే నిరంతర సంఘర్షణలో బలవంతులు గెలుస్తారు. బలహీనులు నశిస్తారు. ఇది ఆటవిక న్యాయం. బలహీనులను వేరుచేయడం పైనే అభివృద్ధి ఆధారపడివుంది. అయోగ్యులను వేరుపరచడమే సామాజికాభివృద్ధి లక్ష్యమై వుండాలి. రాజ్యనియంత్రణకు లోబడకాకుండా, వ్యక్తులు స్వేచ్ఛాజీవులుగా ఒకరితో మరొకరు పోటీపడతారు. ఈ పోటీలో బలహీనులు అయోగ్యులు నశిస్తారు. శక్తివంతులు, అర్హులు మిగులుతారు. బలహీనులను రక్షించడం, అయోగ్యులకు సహాయపడడం ప్రకృతి న్యాయానికి విరుద్ధంగా వ్యవహరించడమే.

## 7సి.4 వ్యక్తి శ్రేయోవాద సిద్ధాంతం - విమర్శ :

17, 18 శతాబ్దాలలో యూరప్‌లో నిరంకుశ రాజరికాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడుతున్న కాలంలో వ్యక్తి శ్రేయోవాదము బాగా ప్రాచుర్యాన్ని పొందింది. కానీ అటు తరువాత కాలంలో పారిశ్రామిక విప్లవం, మధ్యతరగతి ప్రజల జనాభా పెరుగుదల, శ్రామికవర్గాల అవతరణ, పట్టణాల పెరుగుదల వ్యక్తి శ్రేయోవాదం ప్రాముఖ్యాన్ని తగ్గించివేశాయి.

1. రాజ్యం జోక్యం నుంచి ఏర్పడే అనర్థాలను వ్యక్తి శ్రేయోవాదులు అతిశయోక్తులతో వివరించారు. రాజ్యంవల్ల జరిగే మంచిని విస్మరించారు. రాజ్యనియంత్రణ, అజమాయిషీలేని పక్షంలో బలహీనవర్గాలు అభివృద్ధి సాధ్యంకాదు.
2. వ్యక్తి తన ప్రయోజనాలను తను నిర్ణయించుకోగలడు అనే వాదం సరైనదికాదు. ప్రతివ్యక్తికీ తన స్వప్రయోజనాలను తెలుసుకునే తెలివితేటలు, అవసరాలను తీర్చుకునే సామర్థ్యం వుండవు.

3. రాజ్యం జోక్యం చేసుకోకపోతే సమాజం కేవలం స్వప్రయోజనపరుల నిలయంగా మారుతుంది. స్వార్థం, ఈర్ష్య, పోటీ విలయతాండవం చేస్తాయి.

### 7సి.5 సామ్యవాదము (సోషలిజం) - స్వాతంత్ర్యము :

సామ్యవాదము ఆధునిక రూపంలో అవతరించడానికి మూలకారణం పారిశ్రామిక విప్లవం. దీనితోపాటు ఫ్రెంచి విప్లవం కూడా సామ్యవాద ఉద్యమానికి తోడ్పడింది. 1815 నుంచి కొత్త ఆర్థిక వాతావరణమేర్పడి సామ్యవాదముద్భవించడానికి అనుకూల పరిస్థితి వచ్చింది. పారిశ్రామిక విప్లవంవల్ల ఎన్నో ఆర్థిక సాంఘిక అనర్థాలు వచ్చాయి. ధనికులకు, పేదలకు తారతమ్యం హెచ్చింది. కార్మికుల జీవనం దుస్థితికి వచ్చింది. పారిశ్రామిక విప్లవం సంఘంలోని ఆర్థిక వ్యవస్థనే సమూలంగా మార్చివేసింది. ప్రజలు అధికసంఖ్యలో గ్రామాల నుంచి పట్టణాలకు వలస రావడం జరిగింది. వీరు చాలీచాలని వసతులతో అనారోగ్యము, ఆకలిబాధ, అనైతిక ప్రవర్తనలకు లోనైనారు. ఫ్యాక్టరీలలోనూ, పరిశ్రమలలోనూ కార్మికులు అధిక సంఖ్యలో చేరడంవలన ఒకరితోఒకరు కలిసి తమ ఉమ్మడి కష్టాల గురించి ఆలోచించడానికి అవకాశం ఏర్పడింది. దీనితో శ్రామిక సంఘ ఉద్యమాలు బయలుదేరినాయి. యజమానులు, ఉద్యోగుల మధ్య సంబంధాలు చెడినాయి. చాలా దేశాలలో కార్మికులకు విరుద్ధమైన శాసనాలు చేసారు. ఆర్థిక శాస్త్రవేత్త రికార్డో పెట్టుబడిదారీ వ్యవస్థను సమర్థిస్తూ, జాతి ఆర్థిక జీవనంలో దాని ప్రాముఖ్యతను మెచ్చుకున్నాడు. అందుచేత పెట్టుబడిదారీ ఆర్థిక సిద్ధాంతం, ఫ్యాక్టరీ విధానాల వల్ల ఏర్పడిన ఆర్థిక సంక్షోభమే సామ్యవాదము ఉద్భవించడానికి మూలకారణమైంది. సమాజంలోని అధికులుగా ఉన్న శ్రామికులకు ఆర్థిక రాజకీయ స్వాతంత్ర్యము కావాలనేది సామ్యవాదము యొక్క సారాంశము.

### 7సి.6 సామ్యవాదపు చరిత్ర

#### 1. ఇంగ్లండ్ :

ఇంగ్లండ్ దేశంలో రాబర్ట్ఓవన్ అనే ఒక ఫ్యాక్టరీ యజమాని సామ్యవాదం జనించడానికి కారకుడైనాడు. ఓవెన్ ఉద్భవించిన సామ్యవాదము 'యుటోపియన్ సామ్యవాదము' అని ఖ్యాతి చెందినది. రాబర్ట్ ఓవెన్ ఫ్యాక్టరీ విధానంలోని దోషా లను గ్రహించి క్రీ.శ. 1800లో యజమానులకు, ఉద్యోగులకు మధ్య సామరస్యాన్ని ఏర్పరచి సహకార సత్సంబంధాలు పెంపొందించడానికి కృషి చేశాడు. ఓవెన్ అభిప్రాయంలో పారిశ్రామిక విధానం వల్ల వచ్చే ఉత్పత్తిని ప్రజలందరికీ సమానంగా పంచవలెను. స్వయం పోషకాలైన సహకార గ్రామాలు నిర్వహించి గ్రామస్థులందరూ ఉమ్మడి జీవితానికి అలవడవలెను. గ్రామసంపదను గ్రామస్తులందరూ సమంగా పంచుకోవలెను. గ్రామంలో అనారోగ్యము, నిరుద్యోగము, క్షుద్బాధ మొదలైన ఉండకూడదు. కానీ ఓవెన్ ప్రతిపాదించిన సహకార గ్రామం అనే పథకం ఆచరణ సాధ్యంకానిది. అయినప్పటికీ ఇతని సుదుద్దేశ్యం మాత్రం శంకించరానిది.

#### 2. ఫ్రాన్స్‌లో :

రాబర్ట్ఓవెన్ ఇంగ్లండ్ సామ్యవాదాన్ని ప్రవేశపెట్టబడినప్పుడే ఫ్రాన్స్‌లో సైంట్‌సైమన్ దుష్టమైన భూస్వామ్య పద్ధతిని గురించి పారిశ్రామిక వాడలుండవలెనని కోరినాడు. భూస్వామ్య పద్ధతిని గర్హించి పారిశ్రామిక వాడలుండవలెనని కోరినాడు. భూసామ్య, మతాధికార వర్గాల వారిని నిర్మూలించి కార్మిక నాయకులనే ప్రజాప్రతినిధులుగా నియమించాలంటాడు. సైమన్, ధనమదాంధులై విర్రవీగ భూస్వాముల స్థానే శక్తిసామర్థ్యాలు గల శ్రామికులే పాలకులవుతారు. వీరినే పారిశ్రామిక నాయకులంటారు. ఈ పారిశ్రామిక నాయకులు ఇతరుల శ్రమను తమ ప్రయోజనాల కోసం కాకుండా మొత్తం

సమాజశ్రేయస్సుకు వినియోగపడే తీరుగా పరిపాలిస్తారు. సైంట్‌సైమన్ తన గ్రంథం 'న్యూక్రిష్టియానిటీ'లో బీదల సంక్షేమం పట్ల ఎక్కువ ఆసక్తిని చూపించినాడు. "సంఘం మొత్తంకూడా బీదల నైతిక, భౌతిక పరిస్థితుల ఉద్ధరణ కోసం గట్టి ప్రయత్నం చేయవలెను. ఈ ఆశయాన్ని సాధించడానికి వీలుగా సంఘాన్ని మార్చి వ్యవస్థీకరించవలెను.

## 7సి.7 సామ్యవాద ముఖ్యలక్షణాలు :

1. సామ్యవాదము వ్యక్తికన్నా సంఘానికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తుంది. ఉన్నతమైన సంఘ ప్రయోజనాలే వ్యక్తి ప్రయోజనాల కన్నా ఆధిక్యతను పొంది వుంటాయి. సామ్యవాదుల అభిప్రాయంలో మొత్తం ప్రజలందరికీ పనికి వచ్చే వస్తువులను మాత్రమే ఉత్పత్తి చేయవలెనేగానీ కొద్దిమందికి లాభాలు తెచ్చే వస్తువులను కాదు. వస్తువులు ఉత్పత్తిదారుల లాభాల కోసం కాక ప్రజల ఉపయోగం కోసమే ఉత్పత్తి చేయాలి.

2. సామ్యవాదం సమాజంలో ఐక్యతాభావాన్ని పెంపొందిస్తుంది. ఇది వ్యక్తి స్వేచ్ఛను సాధించడంకోసం, సంఘాన్ని వ్యవస్థీకరించవలెనంటుంది. నిర్బంధం, నియమం లేకపోవడం మాత్రమే కాదు. స్వేచ్ఛ అంటే ఒక వ్యక్తి సంపూర్ణమైన స్వతంత్ర జీవనం గడపడానికి కావలసిన అవకాశాలన్నీ ఉండి, తాను మంచిదనుకొన్న పని చేయడానికి తగిన అవకాశాన్ని కూడా పొందాలి.

3. సామ్యవాదము ముఖ్యాశయము పెట్టుబడిదారీ విధానాన్ని నిర్మూలించడం. పెట్టుబడిదారులు శ్రామికవర్గాల వారందరికీ స్వాభావిక శత్రువులు. రాజ్యమే ప్రజలందరికీ రక్షణయిచ్చి అందరి ప్రయోజనాలను కాపాడేది కనుక రాజ్యమే పెట్టుబడిదారీ విధానపు నియంతృత్వం నుంచి ప్రజలను కాపాడవలసి ఉంది. అందుకోసం రాజ్యమే పెట్టుబడిదారీ విధానాన్ని నామరూపాలు లేకుండా నిర్మూలించాలి. వ్యక్తి స్వాతంత్ర్యం అనేది సమాజంలోని ఎక్కువమందికి శత్రువుగా మారకూడదు.

4. పెట్టుబడిదారీ విధానం దేశసంపదను అసమానంగాను, అన్యాయంగాను పంచుతుంది. ఇది లాభాలు సంపాదించవలె అనే సూత్రం మీద ఆధారపడి వుంటుంది. కష్టపడేవారి స్వాతంత్ర్యంకన్నా, దోపిడిచేసే వారి స్వాతంత్ర్యం గొప్పది అనే భావనను సామ్యవాదం తిరస్కరిస్తుంది. ఆర్థిక అసమానతలు గల ఈ సమాజంలో ధనవంతులకు, బీదలకు మధ్యవున్న పోటీ, అన్యాయమేకాక అమానుషంగాకూడా. డాక్టర్ హోడెన్‌గెస్ట్ అన్నట్లు "స్థానిక, జాతీయ, అంతర్జాతీయ వ్యవహారాలలో పోటీకి బదులు సహకారాన్ని ఏర్పరిచేదే సామ్యవాదము".

5. సామ్యవాదము సమానత్వాన్ని ఆశిస్తుంది. పెట్టుబడిదారీ విధానంవల్ల ఏర్పడిన అసమనతలు సామ్యవాదులు నిరశిస్తారు. ఏ సామ్యవాద సిద్ధాంతమైనా సంఘంలో ఎక్కువ సమానత్వాన్ని సమాన స్వాతంత్ర్యాన్ని ప్రవేశపెట్టడానికి ప్రయత్నిస్తుంది.

6. సామ్యవాదం భూమిరూపంలోవున్న ప్రైవేట్ ఆస్థిని నిర్మూలిస్తుంది. భూమి ప్రకృతి యిచ్చిన కానుక. ఏ వ్యక్తి అయినా దీనిని తన సొంత ప్రయోజనానికి గాని లాభానికి గాని వినియోగించకూడదు.

7. సామ్యవాదము ప్రైవేటు యాజమాన్యాన్ని రద్దు చేయడానికి పూనుకొంటుంది. పెట్టుబదిదారీ విధాన నిర్మూలనలతో ప్రైవేటు యాజమాన్యం కూడా అంతరించాలి. ఉత్పత్తి సాధనాలన్నీ రాజ్యాధీనంలోనే ఉంచాలి. ఈ విధంగా చేయటం వలన ఆర్థిక స్వాతంత్ర్యము, ఆర్థిక స్వాతంత్ర్యములో నుండి రాజకీయ స్వాతంత్ర్యము జనిస్తుంది.

క్లుప్తంగా చెప్పావలెనంటే సామ్యవాదం వ్యక్తి ప్రయోజనాలకన్నా సంఘ ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తుంది. న్యాయము, సమానత్వము, స్వాతంత్ర్యము సామ్యవాదానికి ప్రధానాశయాలు. సాంఘిక శ్రేయస్సు సాధించటమే దీని ధ్యేయము.

### 7సి.8 ఆదర్శవాదము - స్వాతంత్ర్యము :

వ్యక్తి స్వాతంత్ర్యాన్ని రాజ్యంతో ముడివేసిన సిద్ధాంతంలో ఆదర్శవాదమొకటి. ఆదర్శవాద సిద్ధాంతం ప్రాచీన గ్రీకు తత్త్వవేత్తలైన ప్లేటో, అరిస్టాటిల్ మహాశయుల ఉపదేశాల ఫలితంగా ప్రచారంలోకి వచ్చింది. గ్రీకు సిద్ధాంతంలో రాజ్యం అత్యున్నతమైనది. రాజ్యం వ్యక్తికి ఉత్తమజీవనం అందించవలెనని గ్రీకుల అభిప్రాయం. అందువలననే దీని నైతిక ప్రాముఖ్యత రాజకీయ, ఆర్థిక, న్యాయ విషయాలకన్నా ఎక్కువగా వుంటుంది.

ఆధునిక కాలంలో ఈ ఆదర్శవాదాన్ని జర్మన్ ఆదర్శవాదులైన కాంట్, హెగెల్, ఇంగ్లాండులోని గ్రీన్, బొసాంకె బాగా ప్రచారంలోకి తెచ్చారు. కాంట్ రాజ్యానికి దైవత్వముందని అది ఎప్పుడూ తప్పు చేయదని భావించాడు. హెగెల్ దృష్టిలో రాజ్యానికి చిదాత్మ వాస్తవరూపము, పరిపూర్ణమైన హేతుతత్వము, నిరపేక్షత ఉంటాయి.

### 7సి.9 ఆదర్శ రాజ్య లక్షణాలు :

#### 1. రాజ్య స్వభావము :

రాజ్యంలో ప్రభుత్వమెంతవరకు తన ప్రజల మీద అధికారం ప్రయోగిస్తుందనేది దాని స్వరూపం మీద ఆధారపడి వుంటుంది. పూర్వకాలంలో ప్రభుత్వాలు ఎంత అధికారమున్నా దానిని పరిమిత రంగాలలోనే ఉపయోగించేవి. ప్లేటో, అరిస్టాటిల్‌ల అభిప్రాయం ప్రకారం మంచిజీవనం గడపటానికి తగిన శక్తి వ్యక్తికి ఉంటుంది. దానిని సార్థకం చేసుకోవాలంటే అతడు రాజ్యంలో సభ్యుడుగా ఉండి తీరవలెనని వీరి అభిప్రాయం. అందుకనే రాజ్యాన్ని ఆదర్శవంతంగా ఊహించినారు. వీరి ఉద్దేశ్యంలో రాజ్యం ఎప్పుడ తప్పు చేయదు. దీని అధికారము మంచిగాని, చెడుగాని, వినయ విధేయతలతో శిరసావహించవలెను. రాజ్యాధికారాన్ని ఎదిరించే హక్కు ప్రజలకు లేదు. రాజ్యానికి ఒక కోరిక, కొన్ని హక్కులు ఉన్నాయి. దానిని నైతిక సంస్థగా భావించాలి. వ్యక్తిగత నీతికన్నా, విలువకన్నా రాజ్యం నీతికి, ధర్మానికి విశిష్టత ఉంది. నాగరికత అలవడడానికి, ప్రగతి సాధించడానికి రాజ్యమే మూలంగాని వ్యక్తికాదు. అతడు రాజ్యపౌరుడుగానే పురోభివృద్ధి సాధించగలుగుతాడు. రాజ్యం కోసం జీవిస్తాడు.

#### 2. రాజ్యము, సంఘము వేరు కాదు :

ప్లేటో అరిస్టాటిల్ రాజ్యాన్ని, సంఘాన్ని వేరువేరుగా గుర్తించలేరు. వీరి ఉద్దేశ్యంలో సంఘ వ్యక్తులందరి సంక్షేమాన్ని కోరినట్లే రాజ్యం కూడా ప్రజాక్షేమాన్ని కోరినట్లే రాజ్యం కూడా ప్రజాక్షేమాన్ని కోరుతూ నైతికవ్యవస్థగా పరిగణకు వస్తుంది. అందుకనే వారి దృష్టిలో రాజ్యమనేది మానవ జీవితానికి ఆలంబనమైన వ్యవస్థ. రాజ్యానికి ప్రత్యేక వ్యక్తిత్వముందని వీరి భావము. అందులో అనేక మంది వున్నప్పటికీ వారి వ్యక్తిత్వాలకు భిన్నమైన ఒకానొక వ్యక్తిత్వము రాజ్యానికుందని ప్లేటో, అరిస్టాటిల్ పేర్కొన్నారు. రాజ్యము దేనికదే లక్ష్యము. ఇతరమైనవి సాధించడానికి ఏర్పడిన సాధనం కాదు.

#### 3. మానవుడు సంఘ జీవి :

"మానవుడు సంఘ జీవి" అని అరిస్టాటిల్ అంటాడు. సంఘంలో యితరులతో కలిసి జీవించడానికి మనిషి ప్రయత్నిస్తాడు. అంటే ఏకాకిగా జీవితం గడపలేడన్నమాట. సంఘంలోనే అతనికొక నిండుదనం వస్తుంది. తనంతటతాను తీర్చుకోలేని అవసరాలను అతడు సంఘంలో సభ్యుడుగా తీర్చుకోగలుగుతాడు. అంతేకాదు, సంఘంలో వుండటంవల్ల, ఇతరుల తలపెట్టే హానికి గురికాకుండా తప్పించుకోగలుగుతాడు. అట్లాగే ఔన్నత్యాన్ని నిలుపుకొంటాడు. మంచితనాన్ని వృద్ధి చేసుకొంటాడు.

**4. రాజ్యం నైతిక సంస్థ :**

రాజ్యం మానవుని నైతికాభివృద్ధికి అన్నివిధాల దోహదకారి అవుతుంది. కాబట్టి అది అనివార్యమైన నైతికసంస్థగా ఏర్పడింది. ప్లేటో, అరిస్టాటిల్ రాజ్యానికొక విశిష్టస్థానం కల్పించారు.

మానవుని సాంఘిక స్వభావాన్ని గుర్తించి రాజ్యలక్ష్యం సాంఘిక నీతే అని గ్రహించి ఆధునిక ఆదర్శవాదులు రాజ్యానికి ప్రత్యేకస్థానం ఇచ్చారు. రాజ్యం దేహం వంటిదన్న సిద్ధాంతాన్ని వారు పటిష్టం చేసి దానిని సాంఘిక నీతితో మేళవించారు.

వ్యక్తికి నిజమైన స్వాతంత్ర్యము రాజ్యంలో సభ్యునిగా వుండటంవల్లనే వస్తుంది. దానిలో ఒక భాగంగా ఉండటం వల్లనే నైతిక విలువలు సాధించగలుగుతాడు. తనకు తానే లక్ష్యంగా ఏర్పడిన సంస్థగా రాజ్యం వ్యక్తి నైతిక లక్ష్యాన్ని సాధించడానికి ఉపయోగకారిగా వుంటుంది. వ్యక్తి హక్కులు రాజ్యం నుంచే లభిస్తాయి. కాబట్టి రాజ్యాన్ని ధిక్కరించే హక్కు వ్యక్తికి వుండదు.

**5. రాజ్యము వ్యక్తుల హక్కులకు మూలము :**

హెగెల్‌ను అనుసరించిన టి.హెచ్.గ్రీన్ రాజ్యానికి మహోన్నత నైతిక విలువను చేకూర్చినాడు. రాజ్యము వ్యక్తులకు మూలమని ఇతడు అభిప్రాయపడ్డాడు. 'జాతి జీవితం వ్యక్తుల జీవితంతో కూడుకొన్నది, దానికి మరొక విధంగా ఉనికేలేదు' అని ఇతడు పేర్కొన్నాడు. ఇతని అనుచరుడైన బొసాంకె, వ్యక్తి శ్రేయోవాద సిద్ధాంతం వైపు మొగ్గుతూనే రాజ్యానికి సర్వశక్తిమత్వము, నిరపేక్ష దైవత్వము ప్రతిపాదించినాడు. ఈ విధంగా ఆదర్శవాదులు రాజ్యానికి దాని అధికారానికి ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు.

**7C.10 ఆదర్శవాద సిద్ధాంతంపై విమర్శ :**

1. ఆదర్శవాదులు రాజ్యాన్ని సంఘాన్ని ఒకటిగానే చూడడం వారి సిద్ధాంతంలో ముఖ్య లోపమని కొందరు విమర్శించినారు. ఈ రెండింటినీ వేరువేరుగా పరిగణించినప్పుడే ఇతర సంఘాలు సాంఘిక, ఆర్థిక, మత సంబంధమైన వాటి ప్రాముఖ్యం గుర్తించడం వీలవుతుంది.
2. రాజ్యము నైతిక సూత్రాలకతీతమని రాజ్యమే నీతిని ఏర్పాటు చేస్తుందని చేసే వాదం కూడా సత్యదూరమని కొందరు విమర్శించారు. ఈ విధమైన వాదన వల్ల రాజ్యనీతి పేరుతో వ్యక్తుల హక్కులు, స్వాతంత్ర్యం, స్వేచ్ఛ హరించబడతాయి. రాజ్యపు ఉనికి, వ్యక్తి ఉనికికఇ ప్రమాదంగా తయారవుతుంది.
3. రాజ్యానికి ప్రత్యేక వ్యక్తిత్వం ఉందని అది మనిషి వ్యక్తిత్వంకన్నా ఇది గొప్పదన్న వాదము కొందరు అంగీకరించలేదు. ఈ విధంగా రాజ్యానికి సంపూర్ణ అధికారమిచ్చి దైవత్వమాపాదించడం మూలంగా మానవుడు తన స్వాతంత్ర్యాన్ని అంతా రాజ్యానికి వశంచేసి బానిసగా మెలగవలసి వచ్చిందని మరొక విమర్శ వుంది.
4. రాజ్యాన్ని విమర్శించడానికి వీలుపడని పరిస్థితి కల్పించడంవల్ల మానవులు తమ స్వాతంత్ర్యాన్ని వ్యక్తపరచడానికి, సద్వినియోగం చేసుకోవడానికి వీలుపడదని ఈ సిద్ధాంతాన్ని కొందరు ఖండించినారు. ముఖ్యంగా ఆదర్శవాద సిద్ధాంతం సహజమైన హక్కులను అంగీకరించకపోవడంవల్ల విమర్శకు గురయింది.

## 7సి.11 వ్యక్తి స్వాతంత్ర్యానికి ప్రమాదకరంగా మారిన అధికారవాదము - ఫాసిజమ్ :

మొదటి ప్రపంచయుద్ధానంతరము, ఇటలీలో ముస్సోలినీ ఈ పాసిజమ్ ప్రచారంలోకి తెచ్చాడు. ఇది సామ్యవాదానికి పూర్తిగా విరుద్ధమైనది. ఇది పూర్తిగా ప్రజాస్వామ్య ఉద్దేశ్యాలను, పద్ధతులను ఖండించింది. ఉదారవాదము, ప్రజాస్వామ్యము ఈ రెండు వ్యక్తులు బాగోగులను చూస్తాయి. సామ్యవాదము వ్యక్తి ఆర్థిక సుస్థితిని చూస్తుంది. కానీ పాసిజంలో సంఘమే ముఖ్యము. వ్యక్తుల సంఘ శ్రేయస్సు కోసం తమ శక్తిసామర్థ్యాలను సంపూర్ణంగా వినియోగించడం జరుగుతుంది. ఫాసిస్టు సిద్ధాంతం ప్రకారము రాజ్యం అన్ని రంగాలలోను జోక్యం చేసుకొని వ్యక్తిని రాజ్యానికి పూర్తిగా బద్ధునిచేసి తన నిరంకుశాధికారాన్ని విస్తరణ చేయాలి.

**అధికారవాదము లేదా ఫాసిజం లక్షణాలు :**

1. ఫాసిస్ట్ సిద్ధాంతం ప్రకారం పౌరజీవితం రాజ్యంతో ప్రారంభమౌతుంది. కాబట్టి పౌరులందరూ రాజ్యానికి లోబడి ఉండవలసినవారే కానీ అన్యదా వ్యవహరించడానికి వీలులేదు. అంటే ప్రజలందరూ ప్రభుత్వాధికారానికి లోబడి వినయవిధేయతలు చూపవలెనేగాని, ఎవరూ ప్రభుత్వాన్ని, దాని అధికారాన్ని ఉల్లంఘించలేరు. అట్లు చేసినవారు శిక్షార్హులౌతారు. పౌరుని బాధ్యతలు హక్కుల కన్నా ప్రధానమైనవి.
2. ఫాసిజం రాజ్యవిస్తరణ కోసం యుద్ధానికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తుంది. శాంతివాదాన్ని నిరాకరిస్తుంది. ఈ సిద్ధాంతం ప్రకారం ప్రపంచాభివృద్ధి అంతా యుద్ధాలవల్లనే సాధించడం జరుగుతుంది. కనుక యుద్ధం ఒక్కటే మానవుడు శక్తిని పుంజుకొనేటట్లు చేసి ధైర్యంతో ఎదుర్కొనటానికి వీలు కలిగిస్తుందంటాడు ముస్సోలినీ.
3. ఫాసిజంకు ఒక రాజకీయ సిద్ధాంతమంటూ లేదు. ఆచరణలో పెట్టగలిగినదైనా సరియైనదే. అందుకనే ముస్సోలినీ అనేక పర్యాయాలునా సేవాకార్యక్రమమంతా ఆచరణలో పెట్టడమేగానీ, మాటలు కావు అని అంటాడు. ఫాసిజం ధ్యేయం ఇటలీని పటిష్టమైన రాజ్యంగా రూపొందించి అంతర్జాతీయంగా ప్రాబల్యాన్ని సంపాదించడమే. ఈ లక్ష్యసాధనకు ప్రభుత్వానికి ఆ పరిమితాధికారాలు వుండవలెను. ప్రభుత్వము ఒక పద్ధతిలోకాక సమయోచితంగా వ్యవహరించవలెనని ముస్సోలినీ అభిప్రాయం.
4. ఫాసిజం ప్రజలలో జాతీయభావాన్ని పెంపొందించింది. ఇటలీలో శ్రామిక సంఘవాదము అనర్థదాయకంగా పరిణమించినపుడు, ముస్సోలినీ సామ్యవాదానికి పూర్తి వ్యతిరేకంగా ఒక నూతన రాజకీయ ఉద్యమాన్ని లేవదీసినాడు. దీనికే ఫాసిజం అని పేరు. ఫాసిజం గుంపు లేదా గుత్తి అనే అర్థం గల పదం నుంచి వచ్చింది. వ్యక్తులను ఒక గుంపుగా సంఘటితపరచి రాజ్యమం ఒక దేహంలోని భాగంగా భావించి నియంతృత్వపాలనతో సంపూర్ణ ఐక్యాన్ని సాధించటం, ఫాసిజం ముఖ్య ఉద్దేశ్యం.
5. రాజ్య శ్రేయస్సు కోసం వ్యక్తుల పట్ల హింసాయుతంగా వ్యవహరించినా తప్పుకాదని ఫాసిజం వాదిస్తుంది. దీనికి వ్యక్తుల కన్నా రాజ్యము ప్రధానమైనది. వ్యక్తి బాగోగులు దీనికి అవసరం.
6. ఫాసిస్టులు, ప్రజాస్వామ్యాన్ని, సామ్యవాదాన్ని ఖండిస్తారు. సృష్టిలోనే సమానత్వంలేదని వ్యక్తుల సామర్థ్యంలో తరతమ భేదాలున్నాయని ఫాసిస్టుల సిద్ధాంతం. మానవులందరూ సమానమన్నది ప్రకృతికే విరుద్ధమనీ సమానత్వం సాధించడం అసాధ్యమనీ వీరి వాదము. వీరికి ప్రజాస్వామ్యం మీద, దాని పద్ధతుల మీద నమ్మకం లేదు. ఎందుకంటే అనేక

విషయాలు ప్రజలకు తెలియవు. అటువంటప్పుడు వారి మీద నమ్మకం పెట్టుకొని ప్రజలందరూ సమానమన్నది సరియైనది కాదు.

7. ఫాసిస్ట్ అభిప్రాయంలో సంఘానికి లేదా జాతికి ఒక ప్రత్యేకత వుంది. వారికి సంఘమే లేదా జాతే రాజ్యము. రాజ్యము సంపూర్ణాధికారముతో నిరంకుశంగా వ్యవహరిస్తుంది.

8. ప్రపంచంలో అన్ని జాతుల కంటే వారి జాతి ఆదర్శమైనదని, ప్రధానమైనదని ఫాసిస్టుల విశ్వాసం. ఈ విధమైన జాత్యాహంకారం ఉండబట్టే అంతర్జాతీయవాదంలో వారికి నమ్మకం లేదు. వారికి దౌర్జన్య పద్ధతులు అవలంభించడమే ముఖ్యకర్తవ్యం. జాతి స్వప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. కాని వ్యక్తుల లేదా వర్గాల ప్రయోజనాలకు తావివ్వరు. ఒక జాతిని సంరక్షించడానికి యుద్ధం చేసినపుడు దాని మూలంగా కొంత నష్టం జరిగినా ఫరవాలేందటారు. అందుకనే ఫాసిస్టులు ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వం తదితర హక్కులు ఇవ్వలేదు. స్వేచ్ఛ అనేది వారి దృష్టిలో హక్కే కాకుండా ఒక బాధ్యత. ప్రతి పౌరుడు రాజ్యంలో కలిసిపోవడం మూలంగా నిజమైన స్వేచ్ఛ పొందగలుగుతాడని వారి వాదం.

9. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం బదులు కర్తవ్యం, క్రమశిక్షణ, త్యాగం గొప్పదన్నారు. ఫాసిజం ఏకపక్ష ప్రభుత్వాన్ని బలపరుస్తుంది. ఇటలీలో నేషనల్ ఫాసిస్టు పార్టీ, రష్యాలోని కమ్యూనిస్ట్ పార్టీ మాదిరిగా రూపొందింది. పార్టీలోకి సభ్యులను చేర్చుకునే ముందు వారికి కొన్ని పరీక్షలుపెట్టి, పార్టీ సిద్ధాంతాల పట్ల వారి విశ్వాసం బుజువైతే తరువాతనే పార్టీలోనికి చేర్చుకోవడం జరుగుతుంది. ఈ విధమైన పార్టీ విధానం ఏర్పాటు చేసుకొని ముస్సోలినీ ఇటలీలో నిరంకుశంగా రాజ్యాధికారాలను హస్తగతం చేసుకొని పాలించాడు.

10. ఫాసిస్టులు హింసాత్మకమైన చర్యల వల్లే రాజకీయావకాశాలు సాధించగలమని బాహాటంగా ఎప్పుడూ ప్రస్తావిస్తూ వచ్చారు. రాజ్యాంగ పద్ధతుల కంటే దౌర్జన్య పద్ధతులకే ముస్సోలినీ ఎక్కువ ప్రాధాన్యతనిచ్చాడు. అంతరంగిక విషయాలలోను, విదేశీ వ్యవహారాలలోనూ దౌర్జన్యమే ముఖ్యమంటారు. అందుకనే ఫాసిస్టులకు శాంతి, సహజీవనము, అంతర్జాతీయతల పట్ల నమ్మకం లేదు.

11. అంతర్జాతీయ శాంతి అనేది పిరికిపందల కల అని సామ్రాజ్యవాదము శాశ్వతమైన, మార్పు చెందని జీవిత ధర్మమని ముస్సోలినీ పేర్కొన్నాడు.

12. ఫాసిస్టులు అన్ని ఆర్థిక సమస్యలూ జాతీయ ప్రయోజనాల దృష్ట్యా పరిశీలిస్తారు. సంపదలోని ఉత్పత్తి, పంపిణీ అనేవి ముఖ్యంగా అవసరాలను కనిపెట్టుకొంటాయేగాని వ్యక్తుల అవసరాలతో వాటికి నిమిత్తం లేదు. దానికిగాను ఫాసిస్టులు దేశ ఆర్థిక రంగంలో ప్రైవేటు ఆస్తులను అంగీకరించి, జాతీయలక్ష్యంగా ఉత్పత్తి పెంచవలెనన్నారు. ప్రైవేటు యాజమాన్యమున్నప్పటికీ ప్రభుత్వం ఏ క్షణంలోనైనా, ఏవిధంగానైనా జాతి శ్రేయస్సు కోసం వాటిని తీసివేసుకొంటుంది.

13. ఇటలీ మొదటి ప్రపంచయుద్ధానంతరము ఆర్థికంగా, రాజకీయంగా క్లిష్టపరిస్థితులకు లోనైంది. ఈ పరిస్థితులలో ముస్సోలినీ దేశాన్ని పతనావస్థ నుంచి కాపాడటానికి ముందంజ వేసినాడు. ఫాసిజం ముస్సోలినీ నాయకత్వంలో బలమైన కేంద్రప్రభుత్వం ఏర్పరచి బలవంతంగా ప్రజల విధేయతను పొందింది. దీని మూలంగా ఇటలీ ప్రపంచంలోని రాజ్యాలలో ఒకటిగా ఖ్యాతి గడించింది.

ముస్సోలినీ ఇటలీలో ఏర్పాటు చేసిన ఫాసిజమ్ ధోరణిలోనే జర్మనీలోని హిట్లర్ జాతీయ సామ్యవాదం స్థాపించినాడు. ఇతడు ముస్సోలినీ అడుగుజాడలలో ఉద్యమాన్ని నడిపి చివరికి ముస్సోలినీ కన్నా రాజకీయ ప్రాధాన్యతను సంపాదించి, రెండో ప్రపంచ యుద్ధానికి కారణభూతుడైనాడు. ఈ రెండు నియంతృత్వాలూ త్వరగానే రూపుమాసినాయి. రెండవ ప్రపంచ యుద్ధానికి కారణభూతాలైన ఈ రెండు రాజ్యతంత్రాలూ ఆ యుద్ధంతోనే అంతరించిపోయినాయి.

## 7సి.13 సారాంశము :

వ్యక్తి శ్రేయోవాదము వ్యక్తి స్వాతంత్ర్యానికి అధిక ప్రాధాన్యతనిస్తే అనేక కారణాలను చూపుతూ, మిగిలినవాదాలు వ్యక్తి స్వాతంత్ర్యానికి తక్కువ ప్రాధాన్యతను ఇచ్చాయి. అధికారవాదం ఇంకా ముందుకుపోయి వ్యక్తి స్వాతంత్ర్యాన్ని పూర్తిగా నిర్మూలించివేసింది.

## 7సి.14 నమూనా ప్రశ్నలు :

1. స్వాతంత్ర్యం మీద వ్యక్తి శ్రేయోవాద అభిప్రాయములు వ్రాయండి.
2. వ్యక్తి స్వాతంత్ర్యము మీద సామ్యవాద, అధికారవాద అభిప్రాయవాదాలు వ్రాయండి.

## 7సి.15 చదువదగిన గ్రంథాలు :


1. రాజనీతి శాస్త్రము - ఆచార్య కె. సుభాష్‌చంద్రరెడ్డి
   శ్రీ కె. ఆదిశేషయ్య
2. రాజనీతి శాస్త్రము (ప్రాథమిక సూత్రాలు) - శ్రీ కె. రామచంద్రయ్య
   శ్రీ ఎన్.హెచ్. సీతారామశర్మ
3. రాజనీతి సిద్ధాంతము, సంస్థలు - డా॥ వి.కృష్ణారావు, శ్రీ వి. సత్యనారాయణ

పాఠము - 10ఎ౯

# ప్రతిపక్షాల పాత్ర

## 10ఎ౯.0 లక్ష్యం :

ఈ భాగం చదివిన తరువాత విద్యార్థులు ఈ క్రింది విషయాలు తెలుసుకుంటారు.

- ప్రతి పక్షం - దాని అర్థం
- ప్రతి పక్షం నిర్వహించే పాత్ర

విషయసూచిక


10ఎ౯.1 లక్ష్యం
10ఎ౯.2 ప్రతిపక్షం - అర్థము
10ఎ౯.3 ప్రతిపక్షాలు నిర్మాణాత్మకమైన పాత్రను పోషించడానికి అవసరమయిన అంశాలు
10ఎ౯.4 ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం
10ఎ౯.5 కార్యనిర్వాహకవర్గం ప్రజాస్వామ్య విలువలకు గౌరవం ఇవ్వటం
10ఎ౯.6 శాసనసభకు తగిన గౌరవం ఇవ్వటం
10ఎ౯.7 సారాంశము
10ఎ౯.8 నమూనా ప్రశ్నలు
10ఎ౯.9 చదువదగిన గ్రంథాలు


## 10ఎ౯. 1 ప్రతి పక్షం - అర్థం :

పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అమలులో ఉన్న రాజ్యాలలో నిర్ధారిత సమయానికి ఎన్నికలు జరుగుతూ ఉంటాయి. (ఉదా : భారతదేశంలో, బ్రిటన్‌లో సాధారణంగా దిగువసభకు అయిదు సంవత్సరాలకొకసారి ఎన్నికలు జరుగుతూ వుంటాయి. అసాధారణ పరిస్థితులలో ప్రభుత్వం రాజీనామా చేసిన లేదా అవిశ్వాస తీర్మానం సహాయంతో కూల్చివేయబడిన తరువాత ఆరుమాసాలలోపు ఎన్నికలు జరుగుతూ వుంటాయి. ఆ ఎన్నికలలో ఏపార్టీ అయితే సగానికి మించిన స్థానాలను గెలుచుకుంటుందో దానిని అధికార పక్షమని; మిగిలిన పార్టీలను ప్రతిపక్షాలు అని పిలుస్తారు. క్లుప్తంగా చెప్పాలంటే "ఎన్నికలలో పోటీచేసి సగంకన్నా తక్కువ సీట్లు గెలుచుకున్న రాజకీయపార్టీలను ప్రతిపక్షాలు అని అంటాము".

## 10ఎ౯. 1.1 ద్విపార్టీ పద్ధతిలో ప్రతిపక్షం :

ఏదేశంలో అయితే రెండే రెండు పార్టీలు అధికారం కోసం పోటీపడుతూ వుంటాయో దానిని ద్విపార్టీ పద్ధతి అని అంటారు. రెండుకన్నా ఎక్కువ పార్టీలు ఉన్నప్పటికిని ప్రధానమయిన పోటీ రెండుపార్టీల మధ్య వుండి, మిగిలిన పార్టీలు నామమాత్రంగా వుంటే, దానిని కూడా ద్విపార్టీ పద్ధతి అని పిలుస్తారు. ఇటువంటి పద్ధతిలో రెండేరెండు పక్షాలుంటాయి. అవి 1) మెజారిటీ సీట్లు గెలిచిన అధికారపక్షం, 2) తక్కువ సీట్లు గెలిచిన ప్రతిపక్షం. ద్విపార్టీ పద్ధతిలో ప్రతిపక్షం చాలా పెద్ద గౌరవాన్ని, హోదాన్ని

కల్గివుంటుంది. ప్రతిపక్ష నాయకుడు ప్రత్యామ్నాయ ప్రధానమంత్రిగా గౌరవించబడుతూ వుంటాడు. ప్రతిపక్షం ఒక ఛాయా మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసుకొని ప్రభుత్వ నిర్ణయాలకు, ప్రత్యామ్నాయంగా తన నిర్ణయాలను ప్రతిపాదిస్తూ వుంటుంది.

### 10ఎఇ 1.2 బహుళపార్టీ పద్ధతిలో ప్రతిపక్షం :

అనేకపార్టీలు వున్న వ్యవస్థను బహుళపార్టీ వ్యవస్థ అని పిలుస్తాము. ఈ బహుళపార్టీ వ్యవస్థలో ప్రతిపక్షాలు అనేకం వుంటాయి. వాటిలో ఏ పార్టీకయితే అత్యధికమైన సీట్లు వస్తాయో, దాని ప్రధాన పక్షమని, మిగిలిన వాటిని ఇతర ప్రతిపక్షాలు అని పిలుస్తారు. పార్లమెంటరీ నియమాల ప్రకారం దక్కవలసిన గౌరవం, ఇతర సదుపాయాలు పెద్ద ప్రతిపక్ష నాయకుడికి మాత్రమే దక్కుతాయి.

### 10ఎఇ. 1.3 సంకీర్ణాలలో అధికార పక్షం - ప్రతిపక్షం :

ఏ ఒక్క పార్టీ తనకు తానుగా పోటీపడి, అధికారాన్ని కైవసం చేసుకోలేనని భావించినపుడు, ఇతర పార్టీలతో కలసి సంకీర్ణాలను ఏర్పాటు చేసుకుంటాయి. (సంకీర్ణాలు ఎన్నికల ముందయినా ఏర్పడవచ్చు, ఎన్నికల తర్వాతనయినా ఏర్పడవచ్చు) ఆ విధంగా సంకీర్ణాలు ఏర్పడినపుడు అధికారపక్షం - ప్రతిపక్షం అనే మాటలు పార్టీకి కాకుండా సంకీర్ణానికి వర్తిస్తాయి. ప్రస్తుత భారతదేశ పరిస్థితినే ఉదాహరణగా తీసుకుంటే కాంగ్రెస్‌పార్టీ నాయకత్వంలో కొన్ని పార్టీల సంకీర్ణం అధికార పక్షంగా ఉండే, భారతీయ జనతాపార్టీ నాయకత్వంలోని కొన్ని పార్టీల సంకీర్ణం ప్రతిపక్షంగా కొనసాగుతున్నది. అయితే, అటు అధికారంలోనూ, ఇటు ప్రతిపక్షంలోనూ ఒక పార్టీవున్నా, లేదా పార్టీల సంకీర్ణం వున్నా అవి నిర్వహించే బాధ్యతలలోనూ, పాత్రలోనూ ఏమీ తేడా వుండదు.

### 10.ఎఇ.2 ప్రతిపక్షం - నిర్వహించే పాత్ర (Role of Opposition) :

ప్రజాస్వామ్యం యొక్క మనుగడ చాలావరకు ప్రతిపక్షాలు పోషించే పాత్రపై ఆధారపడి వుంటుంది. ప్రతిపక్షాలు తమ బాధ్యతలను విస్మరించినా, అధికారపక్షాన్ని కట్టడి చేయటంలో విఫలమయినా, అది ఏకపార్టీ నియంతృత్వానికి దారితీస్తుంది. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం యొక్క పాత్రని సర్ ఐవర్ జెన్నింగ్స్ ఈ క్రింది విధంగా వర్ణించారు. "ప్రతిపక్షాలు చేసే విమర్శ ప్రభుత్వ విధానాలకు, ప్రజాభిప్రాయానికి మధ్య దగ్గరి సంబంధాన్ని ఏర్పరచగలగాలి. ప్రతిపక్షం చేసే పనులలో స్వార్థం ఉన్నప్పటికి అది సత్ ప్రభావాన్ని సాధించే స్వార్థం. తన విధానాలకు మద్దతును సంపాదించుకునే క్రమంలో ప్రభుత్వపక్షం కూడా తన బలాన్ని పెంచుకోవటానికి అవసరమైన చర్యలు చేపట్టేలా ప్రతిపక్షం చేస్తుంది. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టే ప్రయత్నంలో ప్రభుత్వ పక్షాన్ని ప్రజానుకూలంగా వ్యవహరించేలా ప్రతిపక్షం చేయగలుగుతుంది". (The efffect of opposition criticism is therefore to maintain a close relation between government policy and public opinion. The opposition action is one of enlightned self interest. In seeking support for itself, if compels the government to maintain its own support. In appealing to public opinion, it compels, the government to rest its policy on public opinion" - Sir Ivor Jennings).

ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం నిర్వహించే పాత్ర క్రింది సవివరంగా చర్చించబడింది.

### 10ఎఇ 2.1 హేతుబద్ధమైన విమర్శ :

ప్రతిపక్షం యొక్క ప్రధానమైన బాధ్యత అధికారపక్షం తీసుకునే నిర్ణయాలను, రూపకల్పన చేసే విధానాలను విమర్శించటం వాటిలోని లోపాలను ఎత్తి చూపటం, అయితే ఈ విమర్శ కేవలం విమర్శ కోసంగా మాత్రం ఉండకూడదు. దానిలో హేతువుకు

ప్రాధాన్యత వుండాలి. ప్రభుత్వం ఏమి చేసిన తప్పే అనే ధోరణి వలన సమాజానికి, ప్రజలకు లాభం ఏమీ చేకూరదు. ప్రభుత్వం చేస్తున్నవని ఎందుకు తప్పు; దానిలోని లోపాలు ఏమిటి; సమాజానికి ప్రజలకు దేశానికి దానివలన జరుగబోయే స్వల్పకాలిక, దీర్ఘకాలిక నష్టాలు ఏమిటి వంటి విషయాలను ఎత్తిచూపగలగాలి. అప్పుడు మాత్రమే ప్రతిపక్షం తన సామాజిక బాధ్యతను సక్రమంగా నిర్వర్తించగలుగుతుంది. ప్రభుత్వ ప్రతిపక్షం కూడా, ప్రతిపక్షాల విమర్శలోని వాస్తవాలను గమనించి, తన విధానాలను, నిర్ణయాలను సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తుంది. ప్రతిపక్షాల గురించి విమర్శించటమే వీరిపని అని ప్రజలలో ఏర్పడితే, వారు ప్రతిపక్షాల విమర్శలను తీవ్రమయిన వాటిగా పరిగణించరు. దానితో ప్రతిపక్షాలు చేసే సంబంధమైన, హేతుబద్ధమైన విమర్శలు కూడా ప్రజల దృష్టికి వెళ్ళవు.

## 10ఎఇ 2.2. నిర్మాణాత్మక వ్యతిరేకత :

ప్రభుత్వ పక్షంపట్ల, ప్రతిపక్షానికి ఉండే వ్యతిరేకత నిర్మాణాత్మంగా ఉండాలి, విధ్వంసకరంగా ఉండకూడదు ప్రభుత్వాన్ని పడగొట్టటానికి దారులేమిటి ? అని ప్రశ్నించుకొని, ఆ దారుల కోసం వెతికే ప్రతిపక్షం తన బాధ్యతను విస్మరించినట్లే లెక్క. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టటానికి ప్రయత్నించే ప్రతిపక్షం తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించినట్లే. ప్రభుత్వాన్ని పడగొట్టటమే ప్రతిపక్షం యొక్క ఏకైక ధ్యేయంగా మారితే అది అనేక విధాలైన అప్రజాస్వామిక పోకడలకు దారితీస్తుంది. మతాలు కట్టడం, ప్రజాప్రతినిధులను కొనటం, వారికి పదవుల ఎరలు వేయటం వంటి అవలక్షణాలన్నీ మొదలవుతాయి. అధికారపక్షం కూడా తన అధికారాన్ని నిలుపుకోవడానికి అనేక పద్ధతులు అనుసరిస్తుంది. కాబట్టి, మొత్తం ప్రజాస్వామ్య ప్రక్రియే అపహాస్యానికి గురి అవుతుంది.

## 10ఎఇ 2.3 ప్రజాభిప్రాయాన్ని కూడగట్టటం (Mobilisation of Public Opinion) :

మెజారిటీ ప్రజలు తమ సిద్ధాంతాన్ని, ఎన్నికల ప్రణాళికను తిరస్కరించబట్టే తాము ప్రతిపక్షంలో కూర్చొనవలసి వచ్చింది అనే విషయాన్ని ప్రతిపక్షాలు ఎప్పుడూ గుర్తుపెట్టుకోవాలి. అదేవిధంగా తమ సిద్ధాంతం, ప్రణాళిక పట్ల మెజారిటీ ప్రజలు నమ్మకం ఏర్పడినపుడు మాత్రమే అధికారంలోకి వస్తాయనే విషయం కూడా గుర్తించాలి. ఒక్కమాటలో చెప్పాలంటే "ప్రజల అభిప్రాయాన్ని సానుకూలంగా మార్చుకోవటం" అనేది ప్రతిపక్షాల బాధ్యత. దీనికి ప్రతిపక్షాల ముందు రెండు మార్గాలుంటాయి. అవి :

### 10ఎఇ. 2.3.1 తమ ప్రణాళికే మేలు చేస్తుందన్న భావన కల్పించటం :

ఏ ప్రణాళికనైతే ప్రజలు తిరస్కరించారో, ఆ ప్రణాళికే మంచిది అని, వారికి నిజమైన మేలును ఆ ప్రణాళికే చేస్తుందని నచ్చజెప్పే ప్రయత్నం చేయాలి. దానికొరకు అవకాశం కల్పించుకొని ప్రజల వద్దకు ఎక్కువసార్లు వెళ్ళగలగాలి. ప్రజలతో నిత్యసంబంధాలను ఏర్పరచుకొని, వారి మద్దత్తును కూడగట్టుకునే ప్రయత్నం చేయాలి. పెద్దఎత్తున వారిని రాజకీయంగా చైతన్యపరులను చేసి, తమ సిద్ధాంతాలకు, ప్రణాళికకు అనుగుణంగా వారి మనస్సులను మార్చాలి.

### 10ఎఇ 2.3.2 ప్రభుత్వ చర్యలపై విమర్శలు :

ప్రజాభిప్రాయాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవటానికి ఇది రెండవ మార్గం. ప్రభుత్వ పక్షం యొక్క సిద్ధాంతం, ఆచరణలోని లోపాలను ప్రజలకు చెప్పగలగాలి. వాటివల్ల ప్రజలకు కలుగుతున్న,కలుగబోతున్న ఇబ్బందులేమిటో ప్రజలకు విప్పి చెప్పగలగాలి. ప్రభుత్వనిర్ణయాలు ప్రజావ్యతిరేకమని చెప్పి ఒప్పించగలగాలి. ప్రజలు తమకు అధికారం అప్పగిస్తే ఎటువంటి

నిర్ణయాలు తీసుకునేవారమో; ఆ నిర్ణయాలు అధికారపక్షం తీసుకుంటున్న నిర్ణయాలకన్నా ఏవిధంగా ఉన్నతమై వుండేవో విడమరచి చెప్పగలగాలి. ఆవిధంగా అధికారపక్షానికి వ్యతిరేకంగా, తమకు అనుకూలంగా ప్రజాభిప్రాయాన్ని మలచుకొనే ప్రయత్నం చేయాలి.

## 10ఎఇ. 2.4 ప్రజలలో చైతన్యాన్ని పెంచటం (Educating the People) :

ప్రజాస్వామ్య ప్రక్రియ సక్రమంగా సాగాలంటే, ప్రజలలో రాజకీయ, సామాజిక చైతన్యం చాలా అవసరం. వారి రాజకీయ చైతన్యం మీద ఆధారపడి మాత్రమే. "ప్రజల కొరకు, ప్రజల చేత, ప్రజల వలన" అనే విధంగా పాలన సాగుతుంది. ఇంత ముఖ్యమైన రాజకీయ చైతన్యాన్ని ప్రజలలో కల్గించటం అనేది రాజకీయ పక్షాల బాధ్యత. అయితే ప్రతిపక్షాల మీద ఈ బాధ్యత మరికొంత ఎక్కువగా వుంటుంది. కారణమేమిటంటే అధికార పక్షంచేసే నిర్ణయాలు, అమలు జరిపే విధానాలలోని లోపాలను, మంచిచెడ్డలను ప్రజల వద్దకు తీసుకువెళ్ళేది ప్రతిపక్షాలే. వాస్తవానికి ఒకసారి అధికారంలోకి వచ్చిన తరువాత గెలిచిన పార్టీకి - ప్రజలకు మధ్య వుండే సంబంధం తగ్గిపోతుంది. అదే సమయంలో ప్రతిపక్షాలకు - ప్రజలకు మధ్య సంబంధం ఎక్కువ అవుతుంది. ఆందోళనలు, ధర్నాలు, బంద్‌లు, సమ్మెలు బహిరంగ సభల రూపాలలో ప్రతిపక్షాలు చాలా తరుచుగా ప్రజల వద్దకు వెళ్ళటమే కాకుండా, ప్రజల సమస్యలను ముందుగా గ్రహించి వాటి పరిష్కారానికి ముందుకొచ్చేవి కూడా ప్రతిపక్షాలే. కాబట్టి రాజకీయ, సామాజిక చైతన్యాన్ని ప్రజలలో పెంచే బాధ్యత అధికార పక్షంకన్నా, ప్రతిపక్షాల మీదనే ఎక్కువ.

## 10ఎఇ 2.5 ప్రత్యామ్నాయాన్ని సూచించటం :

ప్రజాస్వామ్యం అంటే భిన్న భావాలు, సిద్ధాంతాలు, విధానాల మధ్య సాగే స్వేచ్ఛాయుత పోటీ. ప్రతి రాజకీయపార్టీకి ఒక నిర్దిష్ట సిద్ధాంతము, విధానము, ప్రణాళిక వుంటుంది కాబట్టి రాజకీయపార్టీల మధ్య పోటీ అంటే సిద్ధాంతాల, విధానాల మధ్య పోటీయే. అధికారపార్టీకి చెందిన సిద్ధాంతాలు కాని, విధానాలుకాని మంచివికావని ప్రచారం చేసినందువల్ల ఉపయోగమేమీ వుండదు. అధికారపార్టీ సిద్ధాంతాలకు, విధానాలకు భిన్నంగా, ఏదో ఒక ప్రత్యామ్నాయ విధానాన్ని, సిద్ధాంతాన్ని ప్రతిపక్షం ప్రతిపాదించగలగాలి. అప్పుడు మాత్రమే అది ఒక ప్రతిపక్షంగా తన ధర్మాన్ని నిర్వర్తించగలుగుతుంది. ఒకవిధానము మంచిది కాదు అని చెప్పటం వలన ప్రయోజనం తక్కువ. దానికన్నా మరొక విధానం ఎందుకు మెరుగైందో చెప్పటం వలన ప్రయోజనం ఎక్కువ. ఏ ప్రతిపక్షం అయితే నిర్దిష్టమయిన ప్రత్యామ్నాయాన్ని ప్రతిపాదించగలుగుతుందో, ఆ ప్రతిపక్షం ప్రజలకు ఎక్కువ సహాయం చేయగలుగుతుంది.

## 10ఎఇ 2.6 శాసనసభలో ప్రతిపక్షాల పాత్ర :

శాసనసభలో ప్రజాసమస్యలను ప్రస్తావించటం, ఆ సమస్యలు పరిష్కారం అయ్యేవిధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవటం ప్రతిపక్షాల బాధ్యత. కోట్లమందికి ప్రతినిధ్యం వహించే శాసనసభలో జరిగే చర్చలకు ఎంతో ప్రాధాన్యత వుంటుంది. శాసనసభ నిబంధనలను అర్థం చేసుకొని, అందుబాటులో వుండే సమయాన్ని ప్రజాసమస్యల చర్చకు తీసుకురావాలి. ప్రశ్నలు, ఉపప్రశ్నలు అనేకరకాలైన వాయిదా తీర్మానాల సహాయంతో ప్రతిపక్షం, ప్రభుత్వం యొక్క వైఫల్యాలను ఎండగట్టే ప్రయత్నం చేస్తుంది. అయితే శాసనసభకున్న గౌరవాన్ని, దాని హుందాతనాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వం పక్షం మీద ఎంత వుంటుందో, ప్రతిపక్షం మీద కూడా అంతే వుంటుంది.

## 10ఎఇ. 2.7 పథకాల అమలులో నిర్మాణాత్మకమైన పాత్ర :

ప్రభుత్వం ఏ పార్టీ చేతిలో వుంది అన్న ప్రశ్నతో నిమిత్తం లేకుండా, అనేక ప్రజోపకరమైన పథకాలు అమలు జరుగుతూ వుంటాయి. అవినీతికి ఆస్కారం లేకుండా ఆ పథకాలు అమలు జరగాలంటే, ఎవరో ఒకరు వాటిపై నిరంతర నిఘా పెట్టక తప్పదు. ప్రభుత్వంలో ఉన్నపార్టీ అధికారయంత్రాంగం ద్వారానే పథకాలను అమలుచేస్తూ వుంటుంది కాబట్టి, అది ఇటువంటి నిఘాను పెట్టటం సాధ్యం కాదు. బాధ్యతాయుతమైన ప్రతిపక్షం ఈ పనిని చక్కగా నిర్వర్తించగలదు. దీనివలన దానికి రెండు ప్రయోజనాలు నెరవేరుతాయి. అవి :

1) పథకాలను నిరంతరం పర్యవేక్షించటం వలన, వారి నిఘా ఫలితంగానే, పథకాలు సక్రమంగా అమలు జరుగుతున్నాయన్న భావన ప్రజలలో కల్గించటం ద్వారా, ప్రజాభిప్రాయాన్ని పొందటానికి అవకాశం ఉంటుంది.
2) ప్రభుత్వంలో పెరిగిపోతున్న అవినీతిని ఎప్పటికప్పుడు బహిర్గతం చేయటం ద్వారా, ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడానికి అవకాశం వుంటుంది.

## 10ఎఇ.3 ప్రతిపక్షాలు నిర్మాణాత్మకమైన పాత్రను పోషించటానికి అవసరమయిన అంశాలు :

పైన చెప్పుకొన్నట్లుగా ప్రతిపక్షాలు నిర్మాణాత్మకమయిన పాత్రను పోషించాలంటే ప్రజలను చైతన్యవంతులను చేయాలంటే ప్రజల సమస్యల పరిష్కారానికి దోహదం చేయాలంటే దానికి కొన్ని అనుకూల అంశాలు అవసరం. అవి ప్రజాస్వామ్యంపై విశ్వాసం, కార్యనిర్వాహకవర్గం ప్రజాస్వామ్య పద్ధతులకు గౌరవం ఇవ్వటం, శాసనసభకు తగిన గౌరవం ఇవ్వటం, ప్రతిపక్షాలు కూడా ప్రజాప్రతినిధులే అన్న భావన అధికారపార్టీకి ఉండటం. వీటిని గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

## 10ఎఇ.4 ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం :

ప్రతిపక్షాలు తమ పాత్రను సక్రమంగా సమర్థవంతంగా నిర్వహించాలంటే అధికారపార్టీకి, ప్రతిపక్షాలకు కూడా ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం వుండాలి. ప్రజల ఇచ్ఛాపాలనగా మారడమే, ప్రజలు తమను తాము పరిపాలించుకోవటమే దీని సారాంశం. ఇది నెరవేరాలంటే స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు అవసరం అన్ని స్వేచ్ఛాలలోనూ ప్రధానమయినవి భావప్రకటనా స్వేచ్ఛ లేదా భావప్రకటనా స్వాతంత్ర్యం. ప్రతి పార్టీకి తన భావనలను స్వేచ్ఛగా ప్రకటించే, ప్రచారం చేసుకునే స్వేచ్ఛ కావాలి. కార్యనిర్వాహక వర్గంకాని, పార్టీలుకాని, పార్టీలోని వ్యక్తులుకాని ఈ స్వేచ్ఛకు ఆటంకం కలిగించకూడదు. చర్చల ద్వారా మాత్రమే, అభిప్రాయ మార్పిడి ద్వారా మాత్రమే సమస్యలకు పరిష్కారం వెదకాలన్న నిశ్చయం ప్రతి వ్యక్తిలోనూ, ప్రతి పార్టీలోనూ ఏర్పడాలి. అలా జరగనప్పుడు, మాటలస్థానాన్ని కత్తులు, ప్రజల స్థానాన్ని రౌడీలు, గూండాలు భర్తీ చేస్తారు. ప్రజాస్వామ్య భావన అంతరిస్తుంది. ప్రజాస్వామ్య భావనే అంతరించినపుడు, ఏ రాజకీయపార్టీ పోషించటానికి ఏ పాత్ర మిగలదు.

## 10ఎఇ.5 కార్యనిర్వాహక వర్గం ప్రజాస్వామ్య విలువలకు గౌరవం ఇవ్వటం :

పార్టీలు ప్రజలపట్ల తమకున్న బాధ్యతలు నిర్వహించాలంటే ప్రజాస్వామ్య భావన, ఈ ప్రక్రియపట్ల విశ్వాసం వుండాలని, ? పరిరక్షించబడాలని ఇంతకుముందే తెలుసుకున్నాము. ప్రజాస్వామ్యం పరిరక్షించటానికి ప్రధాన అడ్డంకి కార్యనిర్వాహక వర్గంల ..గిపోయే నియంతృత్వ పోకడలు. అమెరికా, బ్రిటన్ వంటి దేశాలలో శాసనసభ ఆమోదం లేకుండానే యుద్ధాలను ప్రారంభించటం, విదేశాలలో కుట్రలు చేయటానికి రహస్యదళాలను వినియోగించటం, భారతదేశం వంటి దేశాలలో శాసనసభను సంప్రదించకుండానే ప్రధాన నిర్ణయాలు తీసుకోవటం, ఆర్డినెన్స్‌లు జారీచేయుటం వంటివి దీనికుదాహరణలు. శాసనసభలో

తమకు పూర్తి మెజారిటీ ఉన్నదన్న ధీమాతో ప్రతిపక్షాల నోరు నొక్కివేయటం మరో ఉదాహరణ. కార్యనిర్వాహక వర్గానికి ప్రజాస్వామ్య విలువల పట్ల గౌరవంలేనినాడు, ప్రతిపక్షాలు నిర్వహించగలిగిన పాత్ర అంటూ ఏమీ ఉండదు.

## 10ఎఇ.6 శాసనసభకు తగిన గౌరవం ఇవ్వటం :

ప్రతిపక్షాలు తమ బాధ్యతను సక్రమంగా నిర్వహించాలంటే శాసనసభకు తగిన గౌరవం ఉండాలి. దాన్ని ఎక్కువరోజులు నిర్వహించటం, ప్రశ్నలు, ఉపప్రశ్నలకు ఎక్కువ ప్రాధాన్యతనివ్వటం, స్పీకర్ నిష్పక్షపాతంగా వ్యవహరించటం, ప్రతి బిల్లును, ప్రతి బడ్జెట్‌ను కూలంకుషముగా చర్చించటం, మంత్రులు తగినంత సమాచారంతో సభకు వచ్చి, సభ్యులను తృప్తిపరచటం, ప్రతిపక్షాల అభిప్రాయాలకు గౌరవం ఇవ్వటం జరిగిన తప్పులను హుందాగా ఒప్పుకొని, వాటిని సరిదిద్దే ప్రయత్నం చేయటం మొ॥ శాసనసభకిచ్చే గౌరవానికి సూచికలు. ఈ విధంగా జరగకపోతే, శాసనసభా సమావేశాలు నామమాత్రంగా మారిపోతే, ప్రతి ప్రధాన నిర్ణయం ఏ విధమైన చర్చ లేకుండానే తీసుకోబడితే, ప్రతిపక్షాలు సమర్థవంతమైన పాత్రను నిర్వహించలేవు. చర్చల, విమర్శల సారం లక్ష్యం రెండూ కూడా ప్రజాశ్రేయస్సే అన్న స్పృహ తప్పని సరిగా వుండాలి.

## 10ఎఇ.7 సారాంశము :

ఎన్నికలలో మెజారిటీ ప్రజల అభిప్రాయాన్ని పొందిన రాజకీయపార్టీ ప్రభుత్వాన్ని ఏర్పరిస్తే, మిగిలిన పార్టీలు ప్రతిపక్ష పార్టీలుగా అవతరిస్తాయి. ప్రతిపక్ష పార్టీలు నిర్మాణాత్మకమైన పాత్రను పోషించటం ద్వారా ప్రజలు హక్కులను రక్షించగల్గుతాయి అదేవిధంగా ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడిని పెట్టగల్గుతాయి.

## 10ఎఇ.8 నమూనా ప్రశ్నలు :

1. ప్రజాస్వామ్య దేశాలలో ప్రతిపక్షాలు పోషించే పాత్రను విమర్శనాత్మకంగా వ్రాయండి
2. ప్రతిపక్షాలు నిర్మాణాత్మకంగా వ్యవహరించవలసిన అవసరం గురించి వ్రాయండి.

## చదువదగిన గ్రంథాలు :


| | | |
|---|---|---|
| 1. రాజనీతి శాస్త్రము | - | ఆచార్య కె. సుభాష్‌చంద్రరెడ్డి<br>శ్రీ కె. ఆదిశేషయ్య |
| 2. రాజనీతి శాస్త్రము (ప్రాథమిక సూత్రాలు) | - | శ్రీ కె. రామచంద్రయ్య<br>శ్రీ ఎన్.హెచ్. సీతారామశర్మ |
| 3. రాజనీతి సిద్ధాంతము, సంస్థలు | - | డా॥ వి.కృష్ణారావు, శ్రీ వి. సత్యనారాయణ |

పాఠము - 12బి

# రాజకీయ పార్టీలు నిర్వహించే పాత్ర
## (ROLE OF POLITICAL PARTIES)

### 12బి.0 లక్ష్యం :

ఈ పాఠం చదివిన తరువాత విద్యార్థులు ప్రజాస్వామ్య వ్యవస్థలలో రాజకీయపార్టీలు ఎటువంటి పాత్రను పోషిస్తాయో, ఆ పాత్ర యొక్క అవసరం ఏమిటి అనే విషయాలను తెలుసుకుంటారు.

### విషయసూచిక


12బి.1 రాజకీయ పార్టీ

12బి.2 ప్రజాస్వామ్యంలో రాజకీయపార్టీల ప్రాధాన్యత

12బి.3 ప్రజాస్వామ్యంలో పార్టీల పాత్ర

12బి.4 ప్రజలను ఆకర్షించి, నిర్మాణాత్మంగా మలుస్తాయి

12బి.5 ప్రభుత్వానికి - ప్రజలకు మధ్య వారధులు

12బి.6 సారాంశము

12బి.7 నమూనా ప్రశ్నలు

12బి.8 చదువదగిన గ్రంథాలు


### 12బి. 1 రాజకీయ పార్టీ :

రాజకీయ పార్టీలకు ఎంతో మంది ఎన్నిరకాలుగా నిర్వచించినప్పటికినీ ఎడ్వండ్ బర్క్ యొక్క నిర్వచనాన్ని ఈ సందర్భంలో గుర్తుకు తెచ్చుకోవాలి. ఎడ్వండ్ బర్క్ అభిప్రాయంలో "తామందరూ అంగీకరించిన నిర్దిష్ట నియమాలను ప్రాతిపదికగా చేసుకొని, జాతి ప్రయోజనాలకై సమిష్టిగా కృషి చేయటానికి ఐక్యమైన వ్యక్తుల సముదాయమే" రాజకీయపక్షం. (Edward Burke : "A Political Party is a body of men united for promoting their joint endeavours, the national interests upon some particular in which they are agreed".

పై నిర్వచనం సహాయంతో ఈ క్రింది విషయాలను గ్రహించవచ్చు. రాజకీయపార్టీ యొక్క ప్రధాన ఆశయము కేవలము అధికారాన్ని హస్తగతం చేసుకోవటమే కాదు, అంతకన్నా జాతి ప్రయోజనాలను సమిష్టిగా కృషిచేయటం, ఏ రాజకీయ పార్టీ అయితే కేవలం అధికారాన్ని చేజిక్కించుకోవటమే ఆశయంగా పనిచేస్తుందో, అటువంటి రాజకీయ పార్టీవల్ల సమాజానికి, జాతికి లేదా ప్రజలకు ఒనగూడే ప్రయోజనం అంటూ ఏమీ వుండదు. పైగా అధికార సాధనే ఏకైక లక్ష్యంగా పనిచేసే పార్టీల వలన జాతి ప్రయోజనాలకు తీవ్రవిఘాతం కలుగుతుంది. ఎందుకంటే అధికారదాహంతో అలమటించే పార్టీలు, అధికారాన్ని చేజిక్కించుకోవటానికి ఎంతకైనా తెగిస్తాయి. ప్రజాస్వామికమైన, అవినీతికరమైన చర్యలకు పాల్పడతాయి. అధికారం హస్తగతంకాగానే, దానిని స్వార్థప్రయోజనాలకోసం దుర్వినియోగం చేస్తాయి.

కాబట్టి అధికారమే లక్ష్యంగా పనిచేసే పార్టీలు అన్నీ జాతి వ్యతిరేకమే. ప్రజావ్యతిరేకమే. ఏ రాజకీయపార్టీ అయితే రాజ్యాధికారాన్ని జాతి సేవకు లేదా జాతి అభ్యున్నతికి ఉపయోగించటం లక్ష్యంగా పెట్టుకుంటుందో, ఆ రాజకీయపార్టీ నిజమైన రాజకీయపార్టీ. అటువంటి లక్ష్యాలు గల రాజకీయపార్టీలు, సామాజిక జీవితంలో ఎటువంటి పాత్రను పోషిస్తాయో పరిశీలించేముందు, చాలా క్లుప్తంగా ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయపార్టీల యొక్క ప్రాధాన్యతను తెలుసుకుందాం.

## 12బి 2. ప్రజాస్వామ్యంలో రాజకీయపార్టీల ప్రాధాన్యత :

ప్రజలు తమను తామే పాలించుకునే వ్యవస్థ ప్రజాస్వామ్యం. ప్రజలందరూ తమను తాము పరిపాలించుకోవటం అనేది సిద్ధాంతరీత్యా సబబుగానే ఉన్నా ఆచరణలో దానికి రెండు ఆటంకాలున్నాయి. అవి :

1) ప్రతి మనిషి తనకు తానే ప్రతినిధిగా మారి, శాసనరూపకల్పనలో, నియమావళి తయారీలో పాలుపంచుకోవటం ఆచరణరీత్యా సాధ్యంకాదు. చాలా చిన్న రాజ్యాలలో మాత్రమే ఇది సాధ్యమవుతుంది. క్రీస్తు పూర్వం 7,8 శతాబ్దాలలో భారతదేశంలోని గణరాజ్యాలు, ఆదిమ జాతులు వ్యవస్థలు మాత్రమే. ఇంతవరకు మానవాళికి తెలిసిన ఉదాహరణలు. భౌగోళికంగా, జనాభారీత్యా పెద్దరాజ్యాలలోను, చాలా పెద్దరాజ్యాలలోను ప్రతి మనిషి శాసనకర్తగా మారడం ఆచరణలో అసాధ్యం. కాబట్టి ఒకే అభిప్రాయం, ఒకే ఆశయం కలవారు ఒక లక్ష్యంతో సమూహంగా ఏర్పడక తప్పదు. ఈ సమూహాన్నే రాజకీయపార్టీ అని అంటాము.

2) ప్రజల తమకు ఏది అవసరం అనేదాన్ని స్వల్పకాలికంగా మాత్రమే తెలుసుకోగలరు అదికూడా ఒక రంగంలో వారాసిస్తున్న ఫలితం, మిగిలిన రంగాలపై ఎలాంటి ప్రభావం చూపిస్తుంది ? అన్న ప్రశ్న వేసుకోరు. అదీకాకుండా ఒక వర్గానికి లేదా సమూహానికి చెందిన ప్రజలు మిగిలిన వర్గాలను ఆ వర్గాల కోర్కెలను కూడా దృష్టిలో పెట్టుకొని స్వల్పకాలిక కోర్కెలను నిర్ణయించుకోవటం సాధ్యంకాదు. దీర్ఘకాలిక కోర్కెలు లేదా లక్ష్యాల విషయానికొస్తే అది వ్యక్తులు నిర్ణయించలేరు. మొత్తం సామాజిక, ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకున్నప్పుడు మాత్రమే సాధ్యం. దానికి కూడా ఏదో ఒక సైద్ధాంతిక చట్టం అవసరమవుతుంది. ఈ కారణం వలన కూడా రాజకీయపార్టీలు ఆవశ్యకమవుతాయి.

పై రెండు కారణాల వలన ప్రతి ప్రజాస్వామిక వ్యవస్థలోనూ రాజకీయపార్టీలు తప్పనిసరిగా వుంటాయి. ప్రజల మనోభిప్రాయాన్ని ప్రతిబింబిస్తూ, నిర్దిష్ట సిద్ధాంతం కార్యాచరణ సహాయంతో ప్రజల సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తూ వుంటాయి. రాజకీయ పార్టీలతో ప్రమేయంలేని "పార్టీరహిత ప్రజాస్వామ్యాన్ని" ప్రతిపాదించిన సిద్ధాంతవేత్తలు చాలామంది ఉన్నప్పటికి, వారి ప్రతిపాదనలు ఆచరణ సాధ్యంకాని ఊహలుగానే మిగిలిపోయాయి.

## 12బి.3 ప్రజాస్వామ్యంలో పార్టీల పాత్ర :

ప్రజాస్వామ్య దేశాలలో రాజకీయ పార్టీలు చాలా కీలకమయిన పాత్రను పోషిస్తూ వుంటాయి. వివిధ అంశాలలో అవి పోషించే పాత్ర క్రింది క్లుప్తంగా వివరించబడింది.

### 12బి 3.1 ఆసక్తిని సమీకరించటం (Interest Aggregation) :

సమాజంలోని ప్రతి వ్యక్తికి, లేదా సాంప్రదాయ సమూహాలకు అనేక విషయాల మీద ఆసక్తి వుంటుంది. కొన్ని కోర్కెలు వుంటాయి. అయితే ఇవి వ్యక్తుల స్థాయిలో చెదిరిపోయి ఉంటాయి. వాటినన్నింటిని ఒకచోటకు సమీకరించి, వాటికి ఒకరూపాన్ని ఇవ్వటంలో రాజకీయ పార్టీలు తోడ్పడుతూ ఉంటాయి. అందుకొరకు అవి ప్రణాళికలను, కార్యక్రమాన్ని తయారుచేస్తాయి.

వాటి ఆధారంగా ఆసక్తి కలవారిని సమీకరించే ప్రయత్నం చేస్తాయి. ఆసక్తిని సమస్య రూపమిచ్చి, దానిని పరిష్కారానికి ప్రయత్నాన్ని ప్రారంభిస్తాయి. రాజకీయపార్టీలు నిర్వహించే పాత్రలో ఇది అత్యంత కీలకమయినది.

(ఒక ఉదాహరణ : ఒక గ్రామంలో రైతు సాగునీరు సమృద్ధి కావాలని అనుకుంటాడు. ప్రక్కగ్రామంలో రైతుకూడా అదే కోరికను కల్గివుంటాడు. అదేవిధంగా చాలా గ్రామాలలోని, చాలా జిల్లాలలోని రైతులు ఇదే కోర్కెను కల్గివుంటారు. అయితే వ్యక్తిగతంగాని ఒక గ్రామరైతు సమూహంగా కాని వీరు తమ కోర్కెను తీర్చుకోలేరు. కనీసం ఆ కోర్కె సాధన కొరకు ఉద్యమంగా కూడా మార్చలేరు. ఇదేపనిని ఒక రాజకీయపార్టీ చాలా తేలికగా నిర్వహిస్తుంది. సాగునీటికి, దిగుబడికి, ధరకు ఉన్న సంబంధాన్ని మొత్తందేశ ఆర్థికవ్యవస్థతో పెనవేసి ఈ కోరికకు ఒక సైద్ధాంతిక చట్టాన్ని తయారుచేస్తుంది. అనేక జిల్లాలలో తనకున్న కార్యకర్తలచేత ఆ కోర్కెకనుగుణంగా ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తుంది. ఆ తర్వాత దాన్ని ఒక డిమాండ్‌గా మార్చి, ఆ డిమాండ్ పేరుమీద రైతుల్నందరిని సంఘటితపరుస్తుంది. ఆ సంఘటితశక్తి సహాయంతో ఉద్యమానికి ఉపక్రమిస్తుంది. అవసరమయితే అదే డిమాండ్‌ని ఎన్నికల ప్రణాళికలో ప్రధానాంశంగా చేసుకొంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఆసక్తిని సమీకరించటం, దాన్ని సమూహశక్తిగా మార్చటం అనేది వ్యక్తులుగాని, సంఘటితంగాని సమూహాలు కాని చేయగలిగినపని కాదు. అది కేవలం రాజకీయ పార్టీలు మాత్రమే చేయగలిగిన పని. ఈ కారణం వలననే ప్రజాభిప్రాయ నిర్మాతలుగా ప్రజాభిప్రాయ ప్రతినిధులుగా రాజకీయపార్టీలు సమాజానికి ఎనలేని సేవచేస్తూ ఉంటాయి.

## 12బి 3.1.1 ప్రభావ, ఆసక్తి వర్గాలు - రాజకీయపార్టీలు :

ఆసక్తిని సమీకరించే ఇతర సంస్థలలో ప్రధానమయినవి. ప్రభావవర్గాలు, ఆసక్తివర్గాలు ప్రధానమయినవి. అయితే, ఈ రెండు వర్గాలు ప్రత్యక్షంగా రాజకీయాలలో పాల్గొనవు కాబట్టి, వీటి ప్రభావం పరిమితమయిన ప్రభావం. పైగా ఇవి కేవలం ఒక వర్గ ఆసక్తికే అధికప్రాధాన్యతను ఇస్తాయి కాబట్టి, మిగిలిన వర్గాల నుండి వీటికి మద్దతు దొరకదు. అదే రాజకీయ పార్టీ అయితే అన్ని వర్గాలకు చెందిన ప్రజల ఆసక్తిని ప్రాతినిధ్యం వహిస్తుంది కాబట్టి, దాని ప్రభావం, శక్తి చాలా ఎక్కువగా వుంటుంది.

## 12బి 3.2 రాజకీయ సామాజికీరణను పెంపొందిస్తాయి (Creates Political Socialisation) :

సమాజంలోని ప్రజల ఆలోచనలో, ప్రవర్తనలో రాజకీయ స్పృహపెరగటాన్ని రాజకీయ సామాజీకరణ అని అంటారు. మరోమాటలో చెప్పాలంటే సమాజంలోని ప్రతివ్యక్తి రాజకీయాలపట్ల, రాజకీయ ప్రక్రియపట్ల ఆసక్తి పెంపొందించుకోవటాన్ని, రాజకీయ విషయాలపట్ల విజ్ఞానాన్ని పెంపొందించుకోవటాన్ని రాజకీయ సామాజీకకరణ అంటాము. రాజకీయాలపట్ల ప్రజలు ఆసక్తి కలిగి వుండటమనేది ప్రజాస్వామ్య మనుగడకు అత్యవసరం. సాంప్రదాయ సంస్థలైన కాలం, మతంల ప్రభావం నుండి బయటపడగలగాలంటే రాజకీయ సామాజికీకరణ చాలా అవసరం. అంతేకాకుండా రాజకీయేతర విషయాలనుండి, రాజకీయ విషయాలను విడదీసి చూడటానికి కూడా రాజకీయ సామాజికీకరణ ఉపయోగపడుతుంది. రాజకీయ సామాజీకరణ జరగకపోతే, ప్రజలు రాజకీయ సమస్యలను సాంఘిక భావోద్వేగాల (Social enotions and Social Attachment) కోణం నుండి చూడటం, అర్థంచేసుకోవటం మొదలుపెడతారు. రాజకీయేతర అంశాలకు, రాజకీయ అంశాలకు మధ్య అంతరం పూర్తిగా చెరిగిపోతుంది. ఇది ఏ ప్రజాస్వామ్య వ్యవస్థకైనా ఇది ప్రమాదకరమైన పరిణామం.

ఈ పరిణామాన్ని నివారించి, రాజకీయ సామాజీకరణను పెంచటంలో రాజకీయపార్టీలు చాలా కీలకమయిన పాత్రను పోషిస్తాయి. తమ పనిని అవి మూడు పద్ధతుల ద్వారా నెరవేరుస్తాయి. అవి :

1) రాజకీయ సమస్యల మీద పెద్దఎత్తున ప్రచారానికి పూనుకుంటాయి.

2) అనేక అంశాల మీద ప్రజలతో అవగాహనను కల్గించటానికి ప్రయత్నిస్తాయి.

3) తమ తమ సిద్ధాంతాలను, భావాలను, ప్రణాళికలను ప్రచారం చేసుకోవటం కోసం దేశం నలుమూలలా సభలు, సమావేశాలు నిర్వహిస్తాయి. ప్రచార మాధ్యమాలు సహాయంతో ప్రజలలో రాజకీయ భావాలను కల్గిస్తాయి.

అయితే, రాజకీయ పార్టీలే రాజకీయేతర అంశాలకు ప్రాధాన్యతనివ్వటం లేదా రాజకీయేతర అంశాల ప్రాతిపదికగా పార్టీలను స్థాపించటం వలన రాజకీయ సామాజీకీకరణ తీవ్రంగా దెబ్బతింటుంది. కులాల పేరుమీద, మతాల పేరు మీద ప్రాంతీయ తత్త్వం మీద మాత్రమే ఆధారపడి ఏర్పాటయ్యే రాజకీయపార్టీలన్నీ రాజకీయ సామాజికీకరణకు పెద్ద అవరోధం, నిలుస్తాయి.

## 12బి 3.3. భావసమైక్యత సాధించటంతో సహాయపడ్తాయి :

ప్రతిదేశంలోనూ అనేక జాతులు, ఉపజాతులు, మతాలు ఉంటాయి. దేనికదే స్వంత సంస్కృతిని, తనదైన ప్రత్యేక ప్రతిపత్తిని కలిగి ఉంటుంది. అయితే భిన్న ప్రతిపత్తులకు అతీతంగా దేశంలోకి ప్రజలందరూ కొన్ని విషయాలలో ఏకాభిప్రాయాన్ని కలిగి ఉండక తప్పదు. లేకపోతే ఆదేశం ఒక దేశంలాగా చాలాకాలం ఉండలేదు. దేశసమైక్యతకు అవసరమైన ఏకభావాన్ని కల్గించటంలో రాజకీయ పార్టీలు సాటిలేని పాత్రను పోషిస్తాయి.

ఉదాహరణగా భారతదేశాన్ని తీసుకుందాం. మన దేశంలో అనేక మతాలున్నాయి. అనేక కులాలున్నాయి. ప్రాంతీయ అభిమానాలు, భాషాదురభిమానాలు ఉన్నాయి. పైన పేర్కొన్న వాటిలో ప్రతి ఒక్కటి తనకొక ప్రత్యేక ప్రతిపత్తి , చారిత్రక వారసత్వం ఉందని భావిస్తుంది. ఇది సాధారణంగా విభిన్నతకు దారితీయడానికి అనుకూలమయిన స్థితి. అయితే, జాతీయ రాజకీయ పార్టీలన్నీ ఈ భావాలను నియంత్రిస్తూ ఉన్నాయి. ఈ భావాల స్థానంలో దేశసమైక్యతకు, దేశానికి మొత్తానికి వర్తించే సామాజిక, ఆర్థిక, రాజకీయ భావాలకు ప్రాధాన్యతనిస్తున్నాయి. కాంగ్రెస్‌పార్టీ, కమ్యూనిస్టుపార్టీ, జనతాపార్టీ వంటి పార్టీలు మతాలకు, కులాలకు, ప్రాంతాలకు అతీతంగా ప్రజల అభిప్రాయాన్ని మలుస్తున్నాయి. అమెరికా దేశాన్ని ఉదాహరణగా తీసుకుంటే ఆ దేశప్రజలు మతం ప్రాతిపదికగా, రంగు ప్రాతిపదికగా, భౌగోళిక అంశాల ప్రాతిపదికగా అనేక సమూహాలుగా చీలిపోయి వుంటారు. అయితే ఆ దేశంలోని రెండు ప్రధాన పార్టీలైన డెమోక్రటిక్ పార్టీ, రిపబ్లికన్ పార్టీలు ఆ దేశప్రజలకు దేశం మొత్తానికి సంబంధించిన రాజకీయ అంశాలమీద ఏకం చేయగల్గుతున్నాయి.

## 12బి 3.4 ప్రజలశక్తిని ఆకర్షించి, నిర్మాణాత్మకంగా మలుస్తాయి :

ప్రొఫెసర్ సైనర్ అభిప్రాయంలో రాజకీయపార్టీలు, గురుత్వాకర్షణ శక్తిగా పనిచేస్తాయి. అంటే, దేశంలోని ప్రజలను తనవైపు ఆకర్షిస్తాయి. మరోమాటలో చెప్పాలంటే, దేశంలోని ప్రజలందరూ లేదా అత్యధికులు ఏదో ఒక రాజకీయపార్టీలో సభ్యులుగా ఉంటారు. రాజకీయపార్టీ సభ్యులైన తర్వాత వారి ఆలోచనా విధానంలో మార్పు వస్తుంది. సామాజిక సమస్యల మీద, వాటి పరిష్కార మార్గాల మీద అవగాహన ఏర్పడుతుంది. తన భవిష్యత్‌ను గురించి మాత్రమే ఆలోచించే ఒక సాధారణ వ్యక్తికి, రాజకీయ పార్టీ, దేశాన్ని గురించి, సమాజాన్ని గురించి, ఆలోచించే వ్యక్తిగా మారుస్తాయి.

## 12బి 3.5 ప్రభుత్వానికి - ప్రజలకు మధ్య వారధులు :

రాజకీయపక్షాలు పోషించే పాత్రలలో ఇది కూడా ప్రధానమయిన పాత్ర. ప్రభుత్వాన్ని నడుపుతున్న రాజకీయపార్టీ ఈ పాత్రను ఒక రకంగా పోషిస్తే, ప్రతిపక్షాలు ఈ పాత్రను మరోవిధంగా పోషిస్తాయి.

## ...ి 3.5.1 ప్రభుత్వానికి - ప్రజలకు మధ్య వారధిగా అధికార రాజకీయపార్టీ :

ప్రజాభిప్రాయాన్ని ఎక్కువగా పొందగలిగిన రాజకీయపార్టీ మెజారిటీ స్థానాలను గెల్చుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తుంది. ...కారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు ఏఏ వాగ్దానాలయితే చేసిందో ఆ వాగ్దానాలను నెరవేర్చటానికి ప్రయత్నాలు ప్రారంభించింది. ...కొరకు నిర్ణయాలను తీసుకుంటుంది. పథకాలను మార్పు చేయటమో, నూతన పథకాలను ప్రారంభించటమో చేస్తుంది. ...థకాలను ప్రజలు ఏ విధంగా స్పందిస్తున్నారు అన్న విషయాలను, నిర్ణయాలు ప్రజా మెప్పును పొందుతున్నాయా ? లేదా? ... విషయాలను పార్టీశ్రేణులు ఎప్పటికప్పుడు ప్రభుత్వదృష్టికి తెస్తుంటారు. ప్రజలు అదనంగా కోరుకునే విషయాలను కూడా పార్టీ శ్రేణులు ఎప్పటికప్పుడు ప్రభుత్వదృష్టికి. తీసుకువస్తూ వుంటాయి.

## ...ి 3.5.2 ప్రభుత్వానికి - ప్రజలకు మధ్య వారధిగా ప్రతిపక్ష రాజకీయ పార్టీల పాత్ర :

ప్రతిపక్షాలు కూడా ప్రజల కోర్కెలను ప్రభుత్వదృష్టికి తీసుకువస్తూ వుంటాయి. అయితే అవి అవలంభించే పద్ధతులు ...త్రం వేరుగా వుంటాయి. ప్రభుత్వం తానిచ్చిన హామీలను అమలుజరపటంలో విఫలమయినా, ప్రజలు ప్రభుత్వ చర్యలతో తృప్తి చెందకపోయినా, ప్రతిపక్షాలు ప్రజలలో ప్రభుత్వ వ్యతిరేక ప్రచారాన్ని ప్రారంభిస్తాయి. ప్రజల కోర్కెలను ప్రభుత్వందాకా ...కువెళ్ళటంకోసం ఆందోళనా మార్గాన్ని ఎన్నుకుంటారు. ధర్నాలు, పికెటింగ్‌లు, ఊరేగింపుల ద్వారా ప్రజల కోరికలు ...టో ప్రభుత్వానికి చెప్పి, ఆ కోర్కెలు తీర్చబడేరీతిలో ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచుతాయి. ప్రొఫెసర్ మెకైనర్ చెప్పినట్లుగా ...పక్షం అనునిత్యం జాగ్రత్తగా వుంటూ, ప్రభుత్వ బలహీనతలు ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియచెప్తుంది. ప్రజాభిప్రాయమనే ...యస్థానంలో ఎప్పుటికప్పుడు విధానాలను పరీక్షకు గురిచేస్తుంది.

## ...ి 3.6 సారాంశము :

ఎడ్మండ్ బర్క్ చెప్పినట్లు జాతి ప్రయోజనాలను సాధించటానికి ఐక్యమైన వ్యక్తుల సముదాయమే రాజకీయ పార్టీలు. ...మాజాన్ని ఉన్నతస్థానంలోకి తీసుకువెళ్ళటం, ప్రగతి పథంలోకి నడిపించటం రాజకీయపార్టీల బాధ్యత. ప్రజాస్వామ్యం యొక్క ...ుగడ రాజకీయ పార్టీలు నిర్వహించే పాత్రపైనే ఆధారపడి వుంటుంది. ప్రజల ఆసక్తిని సమీకరించటం, రాజకీయ ...మాజికీకరణను పెంపొందించటం, భావసమైక్యతను పెంపొందించటం, ప్రజలను ఆకర్షించి, వారిని ఒక నిర్మాణశక్తిగా ...మారుచేయటం, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా ఉండటం వాటిని రాజకీయ పార్టీలు నిర్వహించేపాత్రలో ముఖ్యమయిన ...శాలు. ప్రజాస్వామిక స్ఫూర్తితో సమాజం అభివృద్ధి చెందాలన్నా, జాతి నిర్మాణం జరగాలన్నా అది రాజకీయపార్టీలు పోషించే ...త్ర పైన ఆధారపడి ఉంటుంది.

## ...2బి 3.7 నమూనా ప్రశ్నలు :

1) రాజకీయపార్టీలు నిర్వహించే పాత్రపై ఒక వ్యాసాన్ని వ్రాయండి.
2) ప్రజాస్వామ్యంలో రాజకీయపార్టీలు నిర్వహించే పాత్ర ఏమిటో వివరించండి.

## ...ుపయోగపడగిన గ్రంథాలు :


- రాజనీతి శాస్త్రము - ఆచార్య కె. సుభాష్‌చంద్రరెడ్డి
  శ్రీ కె. ఆదిశేషయ్య
2. రాజనీతి శాస్త్రము (ప్రాథమిక సూత్రాలు) - శ్రీ కె. రామచంద్రయ్య
  శ్రీ ఎన్.హెచ్. సీతారామశర్మ
3. రాజనీతి సిద్ధాంతము, సంస్థలు - డా॥ వి.కృష్ణారావు, శ్రీ వి. సత్యనారాయణ

పాఠము - 16

# రాజ్యాంగము - వివిధ రకాలైన రాజ్యాంగాలు, సవరణ పద్ధతులు

## (Constitution - Types, Amending Procedures)

**16.0 లక్ష్యం :**

ఈ పాఠం చదివిన తరువాత విద్యార్థులు ఈ క్రింది విషయాలు అవగాహన చేసుకోగల్గుతారు.

- రాజ్యాంగం అంటే ఏమిటి ?
- రాజ్యాంగానికున్న నిర్వచనాలు ఏమిటి ?
- రాజ్యాంగంలో ఎన్ని రకాలు వుంటాయి ?
- రాజ్యాంగం యొక్క సవరణ పద్ధతులు ఏమిటి ?

**విషయసూచిక :**


16.1 పరిచయం
16.2 రాజ్యాంగము - నిర్వచనాలు
16.3 రాజ్యాంగము యొక్క ముఖ్య లక్షణాలు
16.4 రాజ్యాంగము యొక్క స్వభావము
16.5 రాజ్యాంగము వలన ప్రయోజనాలు
16.6 వివిధ రకాల రాజ్యాంగాలు
16.7 సారాంశము
16.8 నమూనా ప్రశ్నలు
16.9 చదువదగిన గ్రంథాలు


**16.1 పరిచయం :**

ప్రతి ఆధునిక రాజ్యము ఒక రాజ్యాంగాన్ని తప్పనిసరిగా కల్గివుంటుంది. రాజ్యనిర్వహణకు బాధ్యత తీసుకు అనేక పదవులు, వాటి అధికారాలు, పరిమితులు; రాజ్యంలోని వివిధ అంగాలు వాటి మధ్య వుండవలసిన సంబంధా మొదలయిన విషయాలన్నీ రాజ్యాంగంలో స్పష్టంగా పొందుపరచబడి వుంటాయి. రాజ్యాంగంలేని పాలన వ్యక్తిగత అరా పాలనగా మారక తప్పదు. రాజ్యాంగ ప్రాముఖ్యాన్ని వివరిస్తూ సి.ఓ.ఫ్రెడరిక్ చెప్పిన మాటలను ఈ సందర్భంలో గుర్తుక తెచ్చుకోవటం అవసరం. "క్రీడారంగంలో ఆటల పోటీలు న్యాయబద్ధంగా జరగటానికి ఎలా ఆటల నియమాలు తోడ్పడతా అదేవిధంగా రాజ్యంలో రాజకీయ ప్రక్రియ సక్రమంగా జరగటానికి రాజ్యాంగం ఉపయోగపడుతుంది". (C.J. Fredreic : "As a political process, the constitution can be described as analogous to the rules of a gam ensuring fair - play:) థియోడార్ Dlight woolsey అభిప్రాయంలో పాలకుల అధికారం, పాలితుల హక్కులు ఈ రెండింటికి సంబంధించిన సూత్రాలు; పాలకులకు, పాలితులకు మధ్య వున్న సంబంధాన్ని రాజ్యాంగం వివరిస్తుంది. (Theodo

dwight Woolsey : Constitution is the collection of those principles, according to which the powers of the Government and the rights of the governed and the relation between the two are adjusted")

## 16.2 రాజ్యాంగము - నిర్వచనాలు :

రాజ్యాంగాన్ని అనేక మంది రచయితలు అనేక రకాలుగా నిర్వచించారు. వాటిలో ముఖ్యమైన వాటిని క్రింద పేర్కొనటం జరిగింది.

అరిస్టాటిల్ "రాజ్యంలో అంతర్భాగమైన పౌరుల అన్యోన్య సంబంధాన్ని నిర్ధారించే పద్ధతియే రాజ్యాంగం".

లార్డ్‌బ్రైస్ : "ప్రభుత్వ స్వరూపాన్ని, అది పనిచేసే విధానాన్ని తెలిపే నిర్దుష్ట నియామాల సముదాయమే రాజ్యాంగం".
హెర్మన్ ఫైనర్ : "మౌలిక రాజకీయ సంస్థల స్వరూపాన్ని తెలిపే విధానమే రాజ్యాంగం".

లెవిన్ "సార్వభౌమాధికారం ప్రజలకు చెందేవిధంగా దాని ఏర్పాటును, దాని పంపిణీ తెల్పే ప్రభుత్వరూపాన్ని వివరించేదే రాజ్యాంగం".

ప్రొఫెసర్ లీకాక్ : 'రాజ్యాంగం అంటే ప్రభుత్వం రూపం".

వేడ్స్ మరియు ఫిలిప్సు : "రాజ్యాంగం చట్టరీత్య ప్రామాణికతను పొందిన ఒక అధికార పత్రం. అది ప్రభుత్వాంగాల స్వరూపాన్ని, విధులను తెలియజేస్తుంది. అంతేగాక, ఆ ప్రభుత్వాంగాలు ఏ నియమాలకు లోబడి పనిచేయాల్సి వుంటుందో కూడా తెలియజేస్తుంది".

ఆర్. బ్రివిస్టర్ : "రాజ్యాంగం రాజ్యమౌలిక చట్టం. ఇదఇ ప్రభుత్వ స్వరూపాన్నే గాక అది ఏమి చేయాల్సిన విధానాన్ని కూడా స్థూలంగా తెలియజేస్తుంది. దాని అధికారాలను, విధులను వివరిస్తుంది. రాజ్యాంగ పరమైన చట్టాల సవరణ పద్ధతులను తెలుపుతుంది. ప్రజాస్వామిక వ్యవస్థల్లో పౌరహక్కులను పదిలంచేసి ప్రభుత్వం అక్రమ చర్యల నుంచి వారికి రక్షణమ కల్పిస్తుంది. అది లిఖిత రూపంలో ఉండినా లేకపోయినా రాజ్యానికి చెందిన సంస్థలకు పనిచేసే పద్ధతులకు ముఖ్యాధారమౌతుంది.

జొసెపెలా పాలొంబరా : "అధికారానికి లేక బలప్రయోగానికి ఉపయోగపడే సాధనాలైన రాజకీయ సంస్థల సమిష్టి ఏర్పాట్ల స్వరూపమే రాజ్యాంగం. అధికార వ్యవస్థలచేత ఆపేక్షలు, ఆధారాలు అనే ఉత్పాదకాలను ప్రభుత్వవిధానాలు అనే పరివర్తనం చెందించే క్రమాన్ని ప్రామాణికంగా తెల్పేదే రాజ్యాంగం.

కోరీ మరియు హాడ్జెట్స్ : "రాజ్యాన్ని మోటారు వాహనంతో పోలిస్తే అది యంత్రం (ఇంజన్) ప్రభుత్వం కాగా చట్రం (ఛాసిస్) రాజ్యాంగం అని చెప్పవచ్చు. ప్రొఫెసర్ గిల్ క్రైస్ట్ / లిఖిత అలిఖిత రూపంలో ప్రభుత్వ వ్యవస్థల స్వరూపాన్ని నిర్ధారిస్తూ, ప్రభుత్వాలకు మధ్య అధికార విభజనను గావించి, ఆ అధికారాలను ఏ పద్ధతిలో వినియోగించాలో స్పష్టం చేసే నియమాలు లేక నిబంధనల సముదాయమే రాజ్యాంగం.

## 16.3 రాజ్యాంగం యొక్క ముఖ్య లక్షణాలు :

ప్రతి రాజ్యాంగానికి కొన్ని ప్రత్యేక లక్షణాలుంటాయి. ఆయా దేశాల ప్రత్యేక పరిస్థితులనుబట్టి ప్రతి రాజ్యాంగం ఒక విశిష్ట లక్షణాన్ని కలిగి వుంటుంది. అయినప్పటికీ కొన్ని లక్షణాలను అన్ని రాజ్యాంగాలకు వర్తించే సాధారణ లక్షణాలుగా గుర్తించవచ్చు. వాటిలో కొన్నింటిని క్రింది క్లుప్తంగా వివరించటమైనది.

### 16.3.1 స్పష్టత మరియు నిర్దిష్టత :

రాజ్యాంగం చాలా స్పష్టంగా వుండాలి. రాజ్యాంగంలోని ఏ అంశము కూడా వ్యతిరేక అన్వయాలకు దారితీసేది ఉండదు. అదే సమయంలో నిర్దిష్టంగా కూడా ఉండాలి. ఏమైతే చెప్పబడిందో అది చాలా నిర్దిష్టంగా ఉండాలి. ఒక అంశ మీద రెండు ఆర్టికల్స్‌కాని, రెండు భాగాలు కాని వ్యతిరేక లేదా పరస్పరం సమన్వయం కాని విషయాలను చెప్పకూడదు స్పష్టత, నిర్దుష్టత లోపించినప్పుడు రాజ్యాంగాలు అనేక వాదాలకు, తగవులకు, వైరుధ్యాలకు ఆలవాలగా మారిపోతాయి.

### 16.3.2 రాజ్యాంగం సంక్షిప్తంగా వుండాలి :

పైన పేర్కొన్న లక్షణం అమలు చేయబడితే ఆ రాజ్యాంగాలు సంక్షిప్తంగా మారిపోతాయి. ప్రపంచంలో భార రాజ్యాంగం వాటి ఒకటి రెండు రాజ్యాంగాలు మినహా, మిగిలిన రాజ్యాంగాలన్నీ సంక్షిప్తంగానే వుంటాయి. మాట పొదుపు; సూటిగా చెప్పటం; వివరణల కన్నా, అంశానికే ప్రాధాన్యతనివ్వటం; ఒకే అంశాన్ని మరలా మరలా చెప్పకుం ఉండటం; ఉపనిబంధనల సంఖ్యను తగ్గించుకోవటం వంటివి రాజ్యాంగాలను సంక్షిప్తంగా మారుస్తాయి. రాజ్యాంగం సంక్షిప్తం.. ఉండటం వలన పునరుక్తి, వైరుధ్యం వివాదాలకు అవకాశమిచ్చే వివరణలు తగ్గిపోయి రాజ్యాంగం ఖచ్చితంగా అమల చేయబడుతుంది.

### 16.3.3. సమగ్రత :

రాజ్యాంగం రాజ్యానికి సంబంధించిన ప్రతి అంశాన్ని స్పష్టం చేయాలి. ప్రభుత్వానికి సంబంధించిన అన్ని విషయ దానిలో చర్చించాలి. అంటే దీని అర్థం రాజ్యాంగంలో ప్రతి చిన్న విషయాన్ని చర్చించి, దాని పరిమాణాన్ని (సైజును పెంచటం కాదు. ప్రధాన విషయాలను సమగ్రంగా చర్చించాలి.

### 16.3.4 స్వతంత్ర న్యాయవ్యవస్థ :

సర్వస్వతంత్రమైన న్యాయవ్యవస్థను సృష్టించాలి. రాజ్యాంగ నియమాలను, రాజ్యాంగ స్ఫూర్తిని రక్షించే బాధ్యత ఆ న్యాయవ్యవస్థనే అప్పగించాలి. స్వతంత్రమైన న్యాయవ్యవస్థను సృష్టించటం రాజ్యాంగము యొక్క ప్రధాన లక్షణాలలో ప్రధానమయింది.

## 16.4 రాజ్యాంగం యొక్క స్వభావం (Nature of the Constitution) :

1. రాజ్యాంగము కొన్ని నియమాలు లేక నిబంధనల సముదాయం. రాజ్యాంగ నిబంధనలు, రాజ్యాంగచట్టం సాధారణ చట్టాలకన్నా ఎక్కువ ప్రాధాన్యతను కల్గి వుంటాయి.
2. రాజ్యాంగం తప్పనిసరిగా లిఖిత రూపంలో ఉండాలి. అప్పుడు మాత్రమే దానికి విలువ ఉంటుంది. లిఖిత రూపంలో లేని నిబంధనలు కేవలం సంప్రదాయంగానే మిగులుతాయి. వాటిని ధిక్కరించినా నేరం అనిపించుకోదు.
3. రాజ్యాంగం నిబంధనలు ప్రభుత్వాల స్వరూపాన్ని నిర్ధారిస్తాయి. వివిధ అధికార వ్యవస్థల మధ్య సార్వభౌమాధికారాన్ని విభజిస్తాయి. పౌరులకు, ప్రభుత్వానికి; ప్రభుత్వ వివిధ అంగాల మధ్య ఉండవలసిన పరస్పర సంబంధాన్ని స్పష్టం చేస్తాయి.

## 16.5 రాజ్యాంగం వలన ప్రయోజనాలు :

1. రాజ్యాంగం మౌలిక శాసనం కావటంవలన అధికారాల నిర్వహణ రాజ్యాంగ శాసనానికి తలఒగ్గి, ఒక క్రమపద్ధతిలో జరుగుతుంది. క్రమపద్ధతిని కాపాడటానికి ప్రతి రాజ్యాంగం 'చెక్ అండ్ బాలన్స్' పద్ధతిని నిర్దేశిస్తుంది. అంటే, శాసనసభ కార్యనిర్వాహకవర్గం, న్యాయవ్యవస్థ, ఒకదానికొకటి అదుపు చేసుకుంటూ ఉంటాయి.
2. పౌరహక్కులు రాజ్యాంగబద్ధం చేయబడతాయి. దీనివలన పౌరహక్కులకు సంబంధించి ప్రభుత్వాధికారాలకు పరిమితులు ఏర్పడతాయి. దీనివలన శాసనసభలో ఎంత నిర్నిరోధబలం ఉన్నప్పటికి, కార్యనిర్వాహక వర్గం నియంతృత్వ పోకడలకు పోలేదు.
3. రాజ్యాంగానికొక్కదానికే శాశ్వతత్వం ఉంటుంది. అంటే, ప్రభుత్వాలు ఎన్ని మారినా, శాసనసభలలో పార్టీల బలాబలాలు ఒడిదుడుకులకు లోనయినా, అస్థిరత్వం ఏర్పడినా, దాని ప్రభావం ప్రజల మీదపడకుండా రాజ్యాంగం శాశ్వత పాలనా ఏర్పాట్లకు ఆధారంగా వుంటుంది. శాసన, కార్య నిర్వాహకవర్గాలు తాత్కాలికత్వం (మార్పులకు లోనయ్యే) అనే లక్షణాన్ని కలిగివుంటే, రాజ్యాంగం శాసనం శాశ్వతత్వం అనే లక్షణాన్ని కలిగివుంటుంది.

## 16.6 వివిధ రకాల రాజ్యాంగాలు (Different Types of Contitutions) :

రాజ్యాంగాలన్నీ ఒకే రకంగా ఉండవు. అనేక అంశాల మీద ఆధారపడి రాజ్యాంగాలను వివిధ రకాలుగా విభజించవచ్చు. వాటిలో ముఖ్యమైయున వాటిని క్రింది వివరించటం జరిగింది.

### 16.6.1 అలిఖిత రాజ్యాంగం (Unwritten Consitution) :

ప్రపంచంలో రాజ్యాంగాలన్నీ లిఖిత రాజ్యాంగాలే అయినప్పటికీ, బ్రిటిష్ రాజ్యాంగమొక్కటే అలిఖిత రాజ్యాంగానికి ఉదాహరణ. బ్రిటన్ దేశం యొక్క రాజ్యాంగ యంత్రం ఏవిధమైన లిఖితరాజ్యాంగం సహాయం లేకుండానే నడుపబడుతూ ఉన్నది. పార్లమెంట్ రూపొందించే చట్టాలు, ఆచారాలు, సాంప్రదాయాల సహాయంతో ఆదేశం పాలించబడుతూ ఉంటుంది.

### అలిఖిత రాజ్యాంగం వలన ప్రయోజనాలు :

మారుతున్న ప్రజాభీష్టానికి అనుకూలంగా ఎప్పటికప్పుడు నూతన చట్టాలు చేసి, వాటి సహాయంతో పాలన నిర్వహించబడుతూ ఉంటుంది. ఆదర్శం కంటే, వాస్తవానికి తగినట్లుగా పాలన జరుగుతూ వుంటుంది.

### అవిజాతి రాజ్యాంగం వలన నష్టాలు :

అవిజిత రాజ్యాంగం వలన లాభాలకన్నా నష్టాలే ఎక్కువ. అలిఖిత రాజ్యాంగాల అస్థిరత్వానికి ఆలవాలం. సాంప్రదాయ చట్టంగా గౌరవించటం, ఆధునిక సమాజాలలో అభిలషణీయం కాదు. పౌరులకు హక్కులకు దీనిలో లిఖితపూర్వక హామీ ఏదీ ఉండదు. వ్యక్తుల ఇష్టానుసారం దేశం పరిపాలించబడుతుంది. ఏ సమయంలోనైనా నియంతృత్వపోకడలు తలెత్తడానికి అనువుగా వుంటుంది.

### 16.6.2 లిఖిత రాజ్యాంగం (Written Constitution) :

ఆధునిక ప్రపంచంలోని ప్రతి ప్రజాస్వామ్య రాజ్యము (బ్రిటన్ మినహా) లిఖిత రాజ్యాంగాన్ని కలిగి వుంది. లిఖిత రాజ్యాంగంలో వున్న ప్రయోజనాలే దీనికి కారణమని జేమ్స్‌బ్రైస్ అభిప్రాయం. రాజ్యాంగ యంత్రానికి సంబంధించిన ప్రతి

ప్రధాన విషయము గ్రంథస్తమై ఉండటాన్ని లిఖిత రాజ్యాంగమని అంటాము. లిఖిత రాజ్యాంగానికి ఈ క్రింది లక్షణాలు వుంటాయి.

1. రాజ్యాంగం సర్వోత్తమ శాసనంగా గౌరవించబడుతుంది.
2. ప్రతి ప్రభుత్వరంగము యొక్క అధికారం, పరిమితి స్పష్టంగా నిర్వచించబడి ఉంటాయి.
3. పౌరుల హక్కులు స్పష్టంగా నిర్వచించబడతాయి, రక్షించబడతాయి.
4. సర్వోత్తమమైన న్యాయవ్యవస్థ ఒకటి ఏర్పడి, సమన్వయపాలనను అమలు జరుపుతూ ఉంటుంది.

**లిఖిత రాజ్యాంగం వలన లాభాలు :**

1. రాజ్యనిర్వహణకు సంబంధించిన అన్ని విషయాలు స్పష్టంగా, నిర్దిష్టంగా వుంటాయి.
2. రాజ్యాంగం సర్వోన్నత అధికారాన్ని కలిగి, రాజ్య ఉపాంగాలను నియంత్రిస్తుంది.
3. రాజ్యాంగ మౌలిక సూత్రాలకులోబడి ప్రజలకు స్వేచ్ఛ, హక్కులు స్వాతంత్ర్యం వుంటుంది.

**లిఖిత రాజ్యాంగం వలన నష్టాలు :**

1) సమాజం నిరంతర మార్పుకు గురవుతూ ఉంటుంది. ప్రజల ఆర్థిక, సామాజిక భావాలు నిరంతరం నూతన అంశాలను కోరుకుంటూ ఉంటాయి. ఈ మార్పులకు లిఖిత రాజ్యాంగం ప్రతిబంధకంగా మారే ప్రమాదం ఉంటుంది.

### 16.6.3 అదృఢ రాజ్యాంగము :

రాజ్యాంగ సవరణ పద్ధతిపై ఆధారపడి రాజ్యాంగాలను దృఢ, అదృఢ రాజ్యాలుగా విభజించవచ్చని జేమ్స్ బ్రైస్ అభిప్రాయపడ్డాడు. ప్రొఫెసర్ సి.ఎఫ్.స్ట్రాంగ్ అభిప్రాయంలో ఏ రాజ్యాంగాన్ని సవరించటానికయితే ప్రత్యేకమైన యంత్రాంగం లేదా ప్రక్రియ అవసరం లేదో ఆ రాజ్యాంగం అదృఢ రాజ్యాంగం. ప్రొఫెసర్ ఆర్.జి.గెటిల్ మాటలలో చెప్పాలంటే శాసనసభ సాధారణ చట్టాలను చేయటానికి ఏ పద్ధతిని అనుసరిస్తుందో, అదే పద్ధతి ప్రకారం రాజ్యాంగాన్ని సవరించగలిగితే అది అదృఢ రాజ్యాంగము.

**అదృఢరాజ్యాంగానికి ఈ క్రింది లక్షణాలుంటాయి :**

1. సాధారణ చట్టాలకూ, రాజ్యాంగ చట్టాలకూ మధ్య తేడా ఉండదు.
2. శాసనసభకు అపరిమిత శాసన నిర్మాణాధికారం ఉంటుంది.
3. న్యాయస్థానాల అధికారాలు చాలా పరిమితమై వుంటాయి. వానికి న్యాయసమీక్షాధికారం ఉండదు.

**అదృఢ రాజ్యాంగం వల్ల ప్రయోజనాలు :**

అదృఢ రాజ్యాంగం వల్ల దిగువ పేర్కొన్న ప్రయోజనాలుంటాయి.

1. మారుతూ ఉండే స్వభావంగల మానవ సమాజాలకు కాలమాన పరిస్థితుల కనుగుణంగా ఈ రాజ్యాంగాన్ని సులభంగా సవరించవచ్చు.

2. దేశం ఎదుర్కొనే ఏ సమస్యలనైనా పరిష్కరించడానికి అదృఢ రాజ్యాంగం శక్తివంతంగా ఉంటుంది. కాబట్టి ఇది చెలామణి అయ్యే రాజ్యంలో విప్లవాలు సంభవించడం కష్టం. విప్లవాలు తలెత్తకుండా ముందు జాగ్రత్త వహించడానికి ఉపకరిస్తుంది.

**ధృఢ రాజ్యాంగము :**

ఏ రాజ్యాంగాన్ని సవరించటానికయితే ప్రత్యేకమయిన, కష్టమయిన ప్రక్రియ అవసరమవుతుందో దానిని ధృఢరాజ్యాంగమని అంటారు. ప్రొఫెసర్ ఎ.వి.డైసి మాటలలో చెప్పాలంటే "రాజ్యాంగ చట్టాలు లేదా మౌలిక నిబంధనలను సాధారణ చట్టాలను మార్చినట్లుగా మార్చటం శక్యంగాని రాజ్యాంగం ధృఢరాజ్యాంగం". (A.V. Dicey : "A Rigid Constitution is one in which certain laws are generally known as constitutional or fundamental laws cannot be changed in the same manner as the Ordinary Laws".)

**ధృఢ రాజ్యాంగ లక్షణాలు :**

1. రాజ్యంలో రెండు రకాల చట్టాలు చలామణి అవుతాయి. ఒకటి, రాజ్యాంగ చట్టం, రెండోది సాధారణ చట్టం. ఈ రెండింటిలో రాజ్యాంగచట్టం సర్వోన్నతమైన మౌలిక శాసనంగా ప్రాముఖ్యాన్ని పొందుతుంది.
2. శాసన నిర్మాణశాఖ అధికారాలు పరిమితంగా వుంటాయి.
3. న్యాయశాఖకు స్వతంత్ర ప్రతిపత్తి ఉంటుంది.
   అది న్యాయసమీక్షాధికారం ద్వారా రాజ్యాంగ పరిధిని అతిక్రమించే ప్రభుత్వ చర్యలనుగాని, శాసనసభ రూపొందించే చట్టాలను గాని చెల్లకుండా చేస్తుంది.
4. ధృఢ రాజ్యాంగాన్ని సవరించడం చాలా కష్టం. రాజ్యాంగ సవరణ చేయాలంటే రాజ్యాంగం నిర్దేశించిన నియమాలకు లోబడి చేయాలి. కొన్ని సందర్భాల్లో సమాఖ్య సభ్య రాష్ట్రాల ఆమోదంతోబాటు ప్రజాభిప్రాయసేకరణ కూడా అవసరం కావచ్చు.

**ధృఢ రాజ్యాంగం వల్ల లాభాలు :**

1. ధృడరాజ్యాంగం స్పష్టంగానూ, నిర్దుష్టంగానూ వుంటుంది. అనుభవజ్ఞులైన మేధావులు, న్యాయవేత్తలు, రాజకీయవేత్తలతో కూడిన రాజ్యాంగ మహాసభ లేక పరిషత్తు రాజ్యాంగానికి రూపకల్పన చేస్తుంది. అది జాతి భవిష్యత్తును నిర్మాణాత్మకంగా తీర్చిదిద్దడానికై ఉద్దేశించి, మొత్తంజాతి ధృఢ సంకల్పానికి సంకేతం అవుతుంది.
2. ధృడ రాజ్యాంగాన్ని సవరించే పద్ధతి క్లేశంతో కూడుకొంది. కనుక దానికి స్థిరరూపం ఉంటుంది.
3. రాజ్యాంగానికి సర్వోన్నత శాసనం అతి పవిత్రమైంది. ఆ కారణంచేత రాజ్యాంగాన్ని అతిక్రమించడానికి సాధారణంగా ఏ ప్రభుత్వాంగమూ సాహసించదు.
4. ధృడ రాజ్యాంగం సమాఖ్య రాజ్యాలకు అనివార్యం. ఎందుకంటె దీనిలో కేంద్రరాష్ట్ర సంబంధాలు, ముఖ్యంగా, కేంద్ర, రాష్ట్ర అధికారాల విభజన, రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి మొదలైన విషయాలు స్పష్టంగా నిర్ధారించడం జరుగుతుంది. ఏ కారణంచేతనైనా కేంద్ర రాష్ట్రాల మధ్య ఘర్షణ ఏర్పడినట్లైతే సర్వోన్నత న్యాయస్థానం దాన్ని పరిష్కరిస్తుంది.

**రాజ్యాంగ సవరణ పద్ధతులు :**

రాజ్యాంగ సవరణ పద్ధతులు మూడు రకాలు. అవి 1) సరళతరమైన పద్ధతి, 2) కఠినమైన పద్ధతి, 3) మిశ్రమ పద్ధతి.

**1. సరళమైన పద్ధతి :**

ఈ పద్ధతిలో రాజ్యాంగంలోని అధికరణాలను (లేదా చట్టాలను) కేంద్రంలోని శాసనసభ కేవలం సాధారణ మెజారిటీతోనే సవరిస్తుంది. సాధారణ చట్టాలకు, రాజ్యాంగ చట్టాలకు ఏమీ తేడా వుండదు.

**2. కఠిన పద్ధతి :**

రాజ్యాంగాన్ని సవరించాలంటే, కేంద్ర శాసనసభలో ప్రత్యేక మెజారిటీ అవసరం. అంతేకాకుండా రాష్ట్రాల శాసనసభలలో కూడా మెజారిటీ సభలు ఆ సవరణను ఆమోదించాలి.

**మిశ్రమ పద్ధతి :**

రాజ్యాంగంలోని కొన్ని అధికరణాలను సరళమైన పద్ధతిలో ఆమోదించవచ్చు. అదే రాజ్యాంగంలోని మరికొన్ని అధికరణాలను ఆమోదించాలంటే కఠినపద్ధతిని అనుసరించాలి.

## 16.7 సారాంశము :

బ్రిటన్‌కు తప్ప ప్రతి ఆధునిక ప్రజాస్వామ్య రాజ్యానికి ఒక లిఖిత రాజ్యాంగం ఉంది. రాజ్యయంత్రాంగం ఎలా నడవాలో రాజ్యాంగాలు నిర్దేశిస్తాయి. రాజ్యాంగాలను దృఢ, అదృఢ రాజ్యాంగాలని, లిఖిత, అలిఖిత రాజ్యాంగాలని విభజించవచ్చు. రాజ్యాంగ సవరణ పద్ధతులు కూడా అనేక విధాలుగా ఉంటాయి. అవి సరళ, కఠిన, మిశ్రమ పద్ధతులు.

## 16.8 నమూనా ప్రశ్నలు :

1. రాజ్యాంగంలోని వివిధ రకాలను గురించి వ్రాయండి.
2. రాజ్యాంగ సవరణ పద్ధతులను వివరించండి.

## 16.9 చదువదగిన గ్రంథాలు :

| | | |
|---|---|---|
| 1. రాజనీతి శాస్త్రము | - | ఆచార్య కె. సుభాష్‌చంద్రరెడ్డి<br>శ్రీ కె. ఆదిశేషయ్య |
| 2. రాజనీతి శాస్త్రము (ప్రాథమిక సూత్రాలు) | - | శ్రీ కె. రామచంద్రయ్య<br>శ్రీ ఎన్.హెచ్. సీతారామశర్మ |
| 3. రాజనీతి సిద్ధాంతము, సంస్థలు | - | డా॥ వి.కృష్ణారావు, శ్రీ వి. సత్యనారాయణ |

(కత్తిరించి పంపవలెను)

## అధ్యాపకుల, విద్యార్థుల సలహాలు, సూచనలు :

అధ్యాపకులు, విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌కు సంబంధించిన సలహాలు, సూచనలు, ముద్రణ దోషాలు తెలియపరచినచో, పునర్ముద్రణలో తగు చర్యలు తీసుకొనగలము. తెలియపరచవలసిన చిరునామా : **డిప్యూటీ డైరెక్టర్, దూరవిద్యా కేంద్రం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ - 522 510.**

| **Course** | **Year** | **Paper No. & Title** |
|---|---|---|
| B.A. | Final Year | |

(కత్తిరించి పంపవలెను)

(కత్తిరించి పంపవలెను)

(కత్తిరించి పంపవలెను)